


## ముందుమాట- నా మాట

ఆకాశానికి హద్దులు లేనట్టే సాగరానికీ హద్దులు లేవు. మనిషి తన సంకుచితత్వంతో సాగరంలో హద్దులు గీయాలని ప్రయత్నించినా సముద్రజలం ఆ సరిహద్దులను గుర్తించదు, మన్నించదు. సాహిత్యం కూడా సాగరం లాంటిదే మానవజీవితాన్ని అక్షరరూపంలో ప్రతిబింబించే సాహిత్యంలో సార్వజనీనత వుంటుంది. దానికి ప్రపంచంలోని ఏమూలనున్న మనిషి హృదయమైనా స్పందిస్తుంది. కానీ, తనకలవాటైన సంకుచితత్వంతో మనిషి సాహిత్యంలోకూడా అడ్డుగోడలు నిర్మించాలని చూస్తాడు. ఇది ఇతర భాషల సాహిత్యంలోకన్నా తెలుగు సాహిత్యంలో అధికంగా కనిపిస్తుంది.

సాహిత్యం అన్నది సున్నిత మనస్కుడి హృదయస్పందనకు అక్షరరూపం. ఒకే రకమైన అనుభవం వ్యక్తులలో విభిన్నమైన స్పందనలు కలిగిస్తుంది. మామూలు వ్యక్తులకు ఆ స్పందన రూపం అవగాహనకు రాదు. వారి దృష్టి స్పందన వల్ల కలిగిన భావ తీవ్రత స్వరూపాన్ని అనుభవించడంపైనే వుంటుంది. కానీ, రచయిత ఆ భావ తీవ్రత స్వరూపాన్ని అర్థంచేసుకోవాలని తపన పడతాడు. ఆ తపన ఫలితాన్ని అక్షరరూపంలో ప్రదర్శిస్తాడు. అంటే, తనలోకి తాను చూసుకున్న రచయిత, తనదయిన రీతిలో ప్రపంచ స్వరూపాన్ని అర్థం చేసుకుని , దాన్ని అక్షరరూపంలో ప్రపంచానికి అందిస్తాడన్నమాట. ఇది చదివిన పాఠకులు తమ సందిగ్ధాలకూ, సందేహాలకూ సమాధానాలను పొందుతారు. ఇది వారికి తమ చుట్టూ వున్న సమాజంపట్ల అవగాహన కలిగించటమే కాదు, మదిలో ఒక అద్భుతమైన భావనను కలిగిస్తుంది. ఆలోచనలను కలిగిస్తుంది. ప్రధానంగా కథపట్ల పాఠకులు ఇందువల్ల ఆకర్షితులౌతారు.

కథ పాఠకుల ఊహలకు రెక్కలనిస్తుంది. ఆలోచనలను పదును పెడుతుంది. తమని తాము అర్థంచేసుకునే వీలు కల్పిస్తుంది. తమ జీవితాలను అర్థం చేసుకునే శక్తిని ఇస్తుంది. జీవితంలో పోరాటాలను ఎదుర్కొనే స్ఫూర్తినిస్తుంది. ప్రధానంగా కథ, అందరి అనుభవాలకు వచ్చే విషయాలనే ఒక నూత్నకోణంలో ప్రదర్శిస్తుంది. అది చదివిన పాఠకుడు "ఈ విషయాన్ని ఇలా కూడా అర్థం చేసుకోవచ్చా?" అని విస్తుపోతాడు. "ఈ అంశాన్ని ఇలాకూడా చూడవచ్చా" అన్న విభ్రమానికి గురౌతాడు. ఇది పాఠకుడిని కథవైపు పదే పదే ఆకర్షిస్తుంది. అందుకే, రచయిత బ్రహ్మవంటి వాడు. సృష్టికారుడి సృష్టిని తన కోణంలోంచి చూసి, అనుభవించి, విశ్లేషించి, ప్రతిసృష్టి చేస్తాడు రచయిత. బ్రహ్మసృష్టిని కల్పనగా భావించలేని మనసు సృష్టిలోని సుఖదుఃఖాలకు స్పందిస్తుంది. కానీ, రచయిత సృష్టి కల్పన అని తెలుసు. అయినా రచయిత సృజించిన కాల్పనిక ప్రపంచంలోని వ్యక్తుల అనుభూతులతో పాఠకుడూ లయిస్తాడు. కాబట్టి, రచయిత బ్రహ్మకన్నా ఒక మెట్టు పైనుంటాడు. ఎందుకంటే, రచయిత సృజనాత్మకత వల్ల అక్షరాలే దృశ్యాలై, భావాలే శబ్దాలై, మనస్సే రంగస్థలమై , కాల్పనిక ప్రపంచం సత్యమై పాఠకుడిని ఉర్రూతలూగిస్తుంది.

అందుకే, ప్రతి రచయితా తన పరిధిలో, విశ్వ సృష్టికారుడి సృష్టిలోని ఒక అంశాన్ని ప్రదర్శిస్తాడు. ఏ రచయితా కూడా తన అనుభవ పరిధిని దాటి రచన చేయలేడు. అలా చేసినా, ఆ రచన పాఠకుడిని స్పందింపచేయలేదు. ఎందుకంటే పాఠకుడు తనకు పరిచయమైన అంశాలకే స్పందిస్తాడు. తన అనుభవానికి రాని, ఊహింపలేని అంశాలకు స్పందించడు. ఇలాంటపుడు రచయిత, అనుభవం లేని విషయాలను , పాఠకులకు అనుభవం వున్న అంశాలతో పోల్చి, తాను ప్రదర్శించదలుచుకున్న అంశాన్ని పాఠకుడి మనస్సుకు చేరువ చేస్తాడు.

అయితే, ఇతర సాహిత్యాలకు భిన్నంగా, తెలుగులో రచయితపై అనేక పరిమితులు విధించారు. సాహిత్యమహాసాగరంలో రకరకాల అడ్డుగోడలు నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. కులం, భాష, ప్రాంతం, ఆదర్శం వంటి అనేక అంశాల ఆధారంగా కథను చట్రంలో బిగించి ఊపిరి అందనీయకుండా చేస్తున్నారు. సూర్యుడి కిరణ దిశని నిర్దేశించి, దాని విస్తృతిని గుప్పెట్లో బంధించాలని ప్రయత్నిస్తున్నారు.

రచయిత ఒక భావావేశ స్థితిలో రచన చేస్తాడు. తన రచనద్వారా పాఠకుడిని తన భావావేశ సముద్రంలో ఓలలాడిస్తాడు. తన స్థాయికి ఎదిగిస్తాడు. అయితే, పాఠకుడికి, రచయిత రచన గురించి సరైన అవగాహన కల్పించి, పాఠకుడికి, రచయితకు నడుమ వారధిలా వ్యవహరిస్తాడు విమర్శకుడు. అంటే, విమర్శకుడు రచయితలా స్వయంగా సృజించలేకపోయినా, రచయితలా భావనా బలం కలవాడయి ఉండాలి. రచయిత భావావేశాన్ని గ్రహించి, పాఠకుడికి వివరించగలిగే భావనాపటిమ కలవాడై ఉండాలి.

మరోరకంగా చెప్పాలంటే రచయిత సూర్యుడివంటి వాడు. స్వయం ప్రకాశకుడు. విమర్శకుడు చంద్రుడివంటి వాడు. రచయితనుండి వెలుతురుని గ్రహించి, దానిలోని వాడి, వేడిని గ్రహించి, చల్లదనాన్ని ప్రపంచానికి పంచేవాడు. రచయిత తీవ్రతను తగ్గించి, చల్లని వెలుగులను అందించేవాడు విమర్శకుడు. కానీ, అనేక కారణాలవల్ల తెలుగు సాహిత్యరంగంలో విమర్శకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించటంలేదు. నిష్పక్షపాతంగా వుండవలసిన విమర్శకులు కళకు రంగుటద్దాలు కట్టుకున్నారు.
ఆ రంగుటద్దాల్లోంచి, సాహిత్యాన్నిచూసి విమర్శిస్తున్నారు.

దాంతో, అనంతమైన కథా సాగరంలో అనేకమైన అడ్డుగోడలు వెలిసే పరిస్థితి తెలుగు సాహిత్యంలో నెలకొంది. కథ వస్తువు, శైలి వంటి విషయాల చట్రంలో కథని బిగిస్తున్నారు. మానవజీవితంలో లేని అపరిమితత్వాన్ని కథలకు ఆపాదిస్తున్నారు. కథకుడి చుట్టూ కంచెలు నిర్మిస్తున్నారు. కోటలుకట్టి సైనికులను కాపలా పెడుతున్నారు. దాంతో, సాహిత్యం తన విస్తృతిని కోల్పోవలసిన పరిస్థితివస్తోంది.

రచయిత, ప్రపంచాన్ని అర్థంచేసుకోవడంలో ఎంత తెలివిని ప్రదర్శించినా, ఇతర విషయాలలో అమాయకుడు. తన స్పందనకు అక్షరరూపం ఇస్తాడు. విమర్శకులు, ఇతరులు, తమ సంకుచిత ప్రామాణికాల కొలబద్దలతో ఆ రచనను చూసి తిరస్కరిస్తారు. ఉదాసీనంగా ఉండిపోతారు. దాంతో, తన రచనలు పదిమందికీ చేరాలన్న ఆత్రంలో, రచయిత తన స్పందన రూపాన్ని విస్మరించి, ఏదైతే "మెప్పు" పొందేవీలుందో, ఏదైతే ప్రచురణ అవుతుందో, అలాంటి రచనలు చేసేందుకు తపనపడతాడు. దాంతో, ఒక పద్ధతి ప్రకారం రచయితలు ఎలాంటి రచనలు చేయాలో, ఎలాంటి రచనలు చేస్తే గుర్తింపు వస్తుందో, ఎలాంటివి మంచి రచనలో, ఓ అభిప్రాయాన్ని తెలుగు సాహిత్యరంగంలో స్థిరపరిచేసారన్నమాట. ఇందువల్ల ఒకేరకమైన కథలు, ఒకే రకమైన ఆలోచనలు, ప్రదర్శించే గుప్పెడుమంది రచయితలే తెలుగు సాహిత్యంలో ప్రామాణిక రచయితలు.గా మిగిలిపోయారు. మరో గుప్పెడు మంది రచయితలు "గొప్ప" రచయితలుగా చలామణీ అవుతున్నారు. ఇందువల్ల రెండు దుష్పరిణామాలు సంభవించాయి.

తమ మనస్సు స్పందనను అనుసరించి రచనలుచేసేవారు నిరాశకు గురయ్యారు. గుర్తింపు, పొగడ్తలు లేక వారి రచనలు విస్మృతిలో పడడంతో, నిస్పృహతో వారు ఆమోదం పొందే రచనలవైపు కసిగా మళ్ళారు. లేకపోతే, రచనలు వదిలేసారు.

మరో పరిణామం ఏమిటంటే, సాహిత్యంనుంచి పాఠకులు విముఖులయ్యారు. పాఠకుల హృదయస్పందనలను అక్షరరూపంలో ప్రదర్శించే సాహిత్యం వారు మెచ్చుతారు, ఆదరిస్తారు, దాచుకుంటారు. కానీ, "ఇలాంటివే మంచికథలు, ఇలాంటి వాటినే మీరు ఆదరించాలి" అని ఒక పద్ధతి ప్రకారం ఒకే భావజాల ప్రాధాన్యం కల రచనలను పాఠకులపై రుద్దడంతో, తమ సందేహాలకు, ఆందోళనలకు పరిష్కారాలు సాహిత్యంలో దొరకక పాఠకులు సాహిత్యంనుండి విముఖులయ్యారు, సాహిత్యానికి దూరమయ్యారు.

రచయితకు తప్పదు కాబట్టి తలవంచుతాడు. కానీ పాఠకులు నిరంకుశులు. వారు తమకు నచ్చని వాటిని నిర్మొహమాటంగా పక్కకు నెట్టేస్తారు. ఇందువల్ల విమర్శకులు, వారికి తగ్గట్టు రాసేవారి అహాలు తృప్తి పొందుతున్నాయి. కానీ, పాఠకులు దూరమైపోతున్నారు. అందుకే, తెలుగు సాహిత్యంలో విమర్శకులు అతిగొప్పగా పొగిడిన కథలు పాఠకులను స్పందించలేకపోతున్నాయి. ఆ రచయితలు వారి కథలతోపాటు అదృశ్యమైపోతున్నారు. విమర్శకులు, వందిమాగధులు వారిని సజీవంగా ఉంచుతున్నా, పాఠకులు వారిని పట్టించుకోవటంలేదు. ఇందువల్ల కాల్పనిక సాహిత్యంతో తాదాత్మ్యం చెందలేని పాఠకుడు, కాల్పనికేతర సాహిత్యంవైపు పరుగులిడుతున్నాడు. తన సంఘర్షణలకు, సందేహాలకు సమాధానాలను కాల్పనికేతర సాహిత్యంలో వెతుక్కుంటున్నాడు. ఇది అర్థం చేసుకోలేని విమర్శకులు పాఠకులలో చదివే అలవాటు తగ్గుతోందని వాపోతున్నారు తప్ప, వారిని రచనలవైపు ఆకర్షించే లక్షణం, రచనలలో పోతోందని గ్రహించటంలేదు. అది గ్రహిస్తే, వారు "ఉత్తమం"గా ప్రచారం చేస్తున్న సాహిత్యం పాఠకులకు పనికిరానిదిగా ఒప్పుకోవాల్సివస్తుంది.

ఇలా తమకు నచ్చినవారినో, పరిచయాలున్న వారినో పొగడటంవల్ల, తమకు లాభాలున్నవారిని ఆకాశాని కెత్తేస్తూండటంవల్ల, తెలుగుసాహిత్యం అల్లకల్లోలమౌతోంది. విమర్శకులు ముఠాలుగా ఏర్పడి, ఒకో ముఠా కొందరు రచయితలకు కొమ్ము కాస్తూ, వారికే పెద్దపీటలు వేస్తున్నారు. వారి కథలనే ఉత్తమ కథలుగా నిర్ణయించి, తమ సంకలనాలలో అలాంటి కథలనే ఎంచుకుంటున్నారు.

ఇలా ఒక పద్ధతి ప్రకారం తమ వారిని, వారు రాసిన కథలను మాత్రమే విమర్శక ముఠాలు సజీవంగా ఉంచుతూండడంతో నిజంగా మంచి కథలు రాసే కథకులు మరుగున పడుతున్నారు. వారి కథలు పత్రికల పేజీలలో అజ్ఞాతంగా వుండిపోతున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో కథని నిష్పాక్షికంగా విమర్శించాల్సిన అవసరం వుంది. రచయిత పేరుతో, రచయిత భావజాలంతో, రచననలో ప్రదర్శించే వస్తువులతో, సంబంధం లేకుండా, రచనను రచనలాచూసి విమర్శించాల్సిన అవసరం ఎంతోఉంది. ఆ అవసరం ఈ "కథాసాగరమథనం" శీర్షిక ద్వారా తీర్చాలని ఈ చిన్ని ప్రయత్నాన్ని ఆరంభిస్తున్నాను

ఈ శీర్షికన నెలనెలా విభిన్న దినపత్రికల ఆదివారం అనుబంధాలు, వారపత్రికలు, మాసపత్రికలలో ప్రచురితమైన కథలను విశ్లేషించడం, జరుగుతుంది. ఈ విశ్లేషణలో ఎలాంటి పక్షపాతం చూపటం వుండదు. కథను కథగా, సరస్వతీదేవికి రచయిత అర్పించే నీరాజనంగానే పరిగణించటం ఉంటుంది. కథలోని సార్వజనీనత, దీర్ఘకాలిక ప్రయోజనాలు, అది సాధించే ఫలితాలపైనే దృష్టి తప్ప మరోవిషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం జరగదు. అంటే, కథను కథగా మాత్రమే చూడడం జరుగుతుందన్నమాట.

సాహిత్యం సరస్వతీ రూపం. సరస్వతీదేవిలో "కన్ను నాది, కాలివేలు నీది" అన్నట్టు పరిమితులు విధించడం, పరిధులు గీయడం మూర్ఖత్వమే కాదు నైచ్యం కూడా. పరిధులను విస్మరించి, విశాల సాగరమథనానికి ఇదే ఆరంభం. ఈ సాగరమథనంలో జనించే హాలాహలాన్ని భరించి, అమృతాన్ని పాఠకులకుపంచి ఇచ్చే ప్రయత్నం జరుగుతుంది ఈ శీర్షికన. ఈ శీర్షికద్వారా, అజ్ఞాతంలో మిగిలిపోతూ, అద్భుత రచనలు చేస్తున్న రచయితలూ , వారి రచనలు పరిచయం చేయటం వుంటుంది. పాఠకులు స్వయంగా రచనలను చదివి వాటి నిగ్గుతేల్చుకునే వీలుంటుంది.

కులం, ప్రాంతం, స్నేహం, స్వార్థాల ఆధారంగా కొద్ది కథకులూ, కథలను మాత్రమే పొగిడి ప్రచారం చేస్తున్నవారి ఆటలను పాఠకులు అర్థం చేసుకుని, నిజాలను గ్రహించే వీలును ఈ శీర్షిక కల్పిస్తోంది.

పాఠకులు నిర్మొహమాటంగా, నిరభ్యంతరంగా తమ అభిప్రాయాలను తెలపాలి. మనందరం కలిసి చేసే ఈ సాగర మథనం ద్వారా అమృతాన్ని భావితరాలకు అందించాలి. సాహిత్య సాగర ప్రవాహ వేగం వల్ల కృత్రిమ నిర్మిత అడ్డుగోడలు కరిగిపోవాలి.
ఆనో భద్రః క్రతవో యంతు విశ్వతః
అన్నివైపులనుండీ, ఉన్నతమైన ఆలోచనలకిదే మా ఆహ్వానం.

గమనిక: ఎవరైనా రచయితలు తమ కథలను నా దృష్టికి తేవాలనుకుంటే, కథలను ఈమెయిలు చేయవచ్చు. కథాసంకలనాలను పంపవచ్చు.




కస్తూరి మురళీకృష్ణ గారు తెలుగు సాహిత్యంలో ఉన్న వీలైనన్ని ప్రక్రియలలో రచనలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. విభిన్నాంశాల ఆధారంగా రచనలు చేస్తున్నారు. 1995 లో ఆంధ్రప్రభ దీపావళి నవలల పోటీలో 'అంతర్యాగం' నవలకు ద్వితీయ బహుమతి, 1990లో ఆంధ్రభూమి సస్పెన్స్ నవలల పోటీలో 'ఆపరేషన్ బద్' నవలకు ప్రత్యేక బహుమతి వచ్చింది. అసిధార, అంతర్మథనం, మర్మయోగం నవలలు పుస్తకరూపంలో వచ్చాయి. జీవితం–జాతకం, 4 X 5, రాజతరంగిణి కథలు వంటి సంకలనాలు కూడా పుస్తకరూపంలో వచ్చాయి. భరతీయ తత్వచింతన, మన ప్రధాన మంత్రులు, మన ముఖ్యమంత్రులు, 1857 – మనం మరవకూడని మహాయుద్ధం – ఇవి పుస్తకరూపంలో వచ్చిన కాల్పనికేతర రచనలు.
ఇంకా దాదాపు అరడజను పైగా పత్రికలలో రెగ్యులర్ కాలమ్స్ నిర్వహిస్తున్నారు.
వీరి బ్లాగులు: www.kasturimuralikrishna.wordpress.com
http://muralischocolatefactory.blogspot.com/




## జనవరి - ఫిబ్రవరి ౨౦౦౯

'కథాసాగర మథనం' శీర్షికన కథ విశ్లేషణ ఆరంభించేకన్నా ముందు కొన్ని విషయాలు స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ శీర్షిక కథలకు మాత్రమే పరిమితం. ఇట్టి పరిస్థితులలో ఈ విమర్శను వ్యక్తిగతంగా భావించకూడదు. రచయిత పేరుతో సంబంధం లేకుండా కేవలం 'కథ' ఆధారంగా చేసే విమర్శ ఇది.

అలాగే, 'ఫలానా పత్రికలో ప్రచురితమైన కథ ఇది' అంటూ విమర్శించటం వల్ల కూడా, ఆయా పత్రికాధిపతులు కానీ, కథలను ఎంపిక చేసేవారు కానీ విమర్శను కథలు ఎంపికప్తై విమర్శగానో, పత్రికపై విమర్శగానో భావించకూడదు కథా సాగర మథనంలో విమర్శ పరిధి, ప్రపంచం కథనే.

కథా రచన సంవిధానం, ఎంచుకున్న అంశం, అంశం పాతదే అయినా విన్నూత్నంగా ప్రదర్శించటం, వంటి అంశాల ఆధారంగా కథను విశ్లేషించటం జరుగుతుంది. సాధారణంగా మన కథలు కొన్ని అంశాల చుట్టే తిరుగుతాయి. అలాంటి అలవాటయిన అంశాల చుట్టూ కాక విభిన్నమైన అంశాల ఆధారంగా సృజించిన కథలను ప్రత్యేకంగా పాఠకుల దృష్టికి ఈ శీర్షిక మాధ్యమంగా పరిచయం చేయటానికి ప్రాధాన్యం ఉంటుంది.

చివరగా, ఈ నెలకథగా ప్రచురించే కథ పూర్తిగా నా వ్యక్తిగత అభిప్రాయం, అంచనాల ఆధారంగా ఎన్నుకోవటం జరుగుతుంది. నా దృష్టిలో ఆ కథ ఎందుకు 'ఈ నెల కథ' అయిందో వివరిస్తాను. పాఠకులు విభేదించవచ్చు. కానీ, ఈ విషయంలో చర్చ వ్యక్తిగతాలకు అతీతంగా కేవలం సాహిత్య పరంగానే జరగాల్సి ఉంటుంది.చివరగా, నేను కూడా రెగ్యులర్‌గా కథలు రాస్తూనే ఉన్నాను. అయితే, నా కథలను ఈ శీర్షికన పరామర్శించను, ప్రస్తావించను. అలాగే అనువాద కథలను కూడా ప్రస్తావించను. మరో విషయం, ఈ శీర్షికన నేను వ్యక్తపరచే అభిప్రాయం కేవలం నా వ్యక్తిగతం. ఒక కథ చదివితే నాకు 'ఎలా అనిపించింది' అన్న అంశం ఆధారంగా జరుపుతున్న విశ్లేషణ ఇది. ఒక రచయితగా, విమర్శకుడిగా, పాఠకుడిగా, నా స్పందన ఇది. ఇప్పుడిక కథాసాగర మథనం ఆరంభిద్దాం....

'మార్చి'నెలలో కథాసాగర మథనానికి జనవరి, ఫిభవరి నెలల్లో ప్రచురితమైన కథనలను పరిగణనలోకి తీసుకోవటం జరిగింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి దిన పత్రికల ఆదివారాల అనుబంధాలలో ప్రచురితమైన కథలు, స్వాతి, మాసపత్రికలలో ప్రచురితమైన కథలు కలిపి మొత్తం 139 కథలను విశ్లేషించి, పాఠకుల పరిచయానికి ఎంచుకున్న కథల సంఖ్య 5..

ఎప్పటిలాగే అనేక కథలు ప్రేమలు, తల్లితండ్రులను పిల్లలు చూసుకోవటం, అత్తకోడళ్ళు అర్థం చేసుకోవటం, ఆరళ్ళు పెట్టటం, శృంగారం ప్రాధాన్యంగా నడిచాయి. వాటిలో కాస్త విభిన్నంగా ఉన్న కథలివి.

*ఇద్దరు డాడీలు వద్దు నాన్నా:*

ఎమ్. హేమలత రచించిన ఈ కథ 18 ఫిబ్రవరి 'నవ్య' వార పత్రికలో ప్రచురితమయింది. ఇలాంటి కథలు మనకు అలవాటే అయినా రచయిత్రి కథను చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. ఎవరినీ దోషిలా చూపకుండా, ఉపన్యాసాలిచ్చి, పాఠాలు చెప్పకుండా సున్నితమైన సమస్యను అంత సున్నితంగా ప్రదర్శిస్తుందీ కథలో. కిన్నెర, వినోద్‌లు ప్రేమ వివాహం చేసుకుంటారు. వాళ్ళకి అమూల్య అనే కూతురు పుడుతుంది. ఉద్యోగరీత్యా కిన్నెర, వినోద్‌లు వేర్వేరు నగరాల్లో ఉండాల్సి వస్తుంది. కొన్నాళ్ళకు కిన్నెర, నివాస్ అనే అతడి వైపు ఆకర్షితురాలవుతుంది. వివాస్‌ని పెళ్ళిచేసుకుంటుంది. అమూల్యని తన దగ్గరే ఉంచుకుంటుంది కానీ, అమూల్య కొత్త డాడీని ఇష్టపడదు. వినోద్‌తోనే ఉండాలని నిశ్చయించుకుంటుంది. ఇదీ కథ. కథలో రచయిత్రి మానవ మనస్తత్వాలను, ముఖ్యంగా వికాస్ వల్ల తల్లితండ్రులు విసిగిపోగా, ఎవరో ఒకరి వద్ద ఉండాల్సి వచ్చిన పాప మనస్తత్వాన్ని చక్కగా ప్రదర్శించారు. 'రెండేళ్ళకి ముందు వికాస్‌ని డాడీ గా కాకపోయినా, ఓ ఫేమిలీ మెంబర్ గా అంగీకరించిన అమూల్య ఇప్పుడెందుకో అలా చేయలేకపోతోంది. చెప్పలేనంత అనీజీగానూ ఇన్ సెక్యూర్డ్ గానూ ఫీలవుతోంది' అంటాడు వినోద్ ఒక సందర్భంలో. మంచి పాయింట్ ఇది. స్నేహితుడిగా ఇంటికి వస్తూ పోతుండడం వేరు, తండ్రిగా ఇంట్లోనే ఉండడం వేరు. ఈ తేడా పిల్లలు గ్రహించినంతగా , వేరే ఎవరూ గ్రహించలేరు.

*కొడుకు పెళ్ళి*

డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం రచించిన ఈ కథ ఫిబ్రవరి 19 నాటి ఆంధ్రభూమి వార పత్రికలో ప్రచురితమయ్యింది. ఈ కథలో చమత్కారం కథ చివరన తెలుస్తుంది. పశుపతి జీవితం వడ్డించిన విస్తరి లాంటిది. మంచి ఆదాయం , భార్య, ముగ్గురు పిల్లలు ..చీకూ చింతా లేకుండా నడుస్తూంటుంది. అలాంటి పశుపతి హఠాత్తుగా మారిపోతాడు. కొడుకు పెళ్ళి చేయటంలో ఆసక్తి చూపడు. అనుకున్న సంబధాన్ని కాదంటాడు. కూతుళ్ళ పెళ్ళి చేస్తాడు. ఏ పని చేసినా అదో రకమైన అనాసక్తతతో చేస్తుంటాడు. అందరితో అంటీ ముట్టనట్టుంటాడు. అలాగని ఎవ్వరికీ ఏ లోటూ రానివ్వడు. చివరికి ఆస్తిని అందరికీ పంచేస్తాడు. భార్యకు కూడా వాటా ఇస్తాడు. ఇంతలో వాళ్ళబ్బాయి ఓ అమ్మాయిని ప్రేమించానని చెప్తాడు. ఎలాంటి భావోద్వేగాలు చూపడు పశుపతి. కొడుకు ఇష్టపడ్డ అమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేస్తాడు. పెళ్ళికి ముందు రోజు అనారోగ్యం పాలయి ఆస్పత్రిలో చేరతాడు. అప్పుడు తన ప్రవర్తనకు కారణం వివరిస్తాడు. పశుపతి చెన్నైవెళ్ళినప్పుడు నాడీ జోస్యం చెప్పించుకుంటాడు. వాళ్ళు పశుపతి కొడుకు పెళ్ళి చూసే యోగం లేదని చెప్తారు.

అందుకని అందరితో అంటీ ముట్టనట్టుంటాడు. కొడుకు పెళ్ళి వాయిదా వేస్తుంటాడు. కొసమెరుపేమిటంటే, కొడుకు ఆరు నెలల క్రితమే రహస్యంగా పెళ్ళి చేసుకుంటాడు. అంటే 'కొడుకు పెళ్ళి చూసే యోగం లేదన్న' జ్యోతిష్కుడి మాటను పశుపతి ఒక రకంగా అర్థం చేసుకుంటే అది ఇంకో రకంగా జరుగుతుందన్నమాట. మనిషి ఎంత కాదనుకున్నా 'మాట' ప్రభావం అతనిపై ఉంటుంది. ఎదుటి వారి మాటను అర్థం చేసుకోడంలో తేడా జీవితాలనే మార్చివేస్తుంది. ముఖ్యంగా జ్యోతిషంలో చెప్పినదాన్ని జరిగే దాన్ని అన్వయించుకోవటంలోని తేడాలు జీవితగతినే మార్చివేస్తాయి. ఈ అంశాన్ని ఆసక్తికరంగా ప్రదర్శించింది ఈ కథ

*ఉజ్జిడి*

బల్లెడ నారాయణమూర్తి రచించిన ఈ కథ ఫిబ్రవరి 22 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది. ఈ కథ గొప్పతనం కథను రచయిత చెప్పిన విధానంలో ఉంటుంది. ఓ గ్రామంలో ప్రజలందరి జీవితాలు, వాళ్ళ సంతానం ఐ.టి.రంగంలో ఉద్యోగాలు సంపాదించడంతో మారిపోతాయి. తమ సంతానానికి వచ్చే పెద్దజీతం ఇందుకు కారణం. అయితే హఠాత్తుగా ఐ.టి.రంగంలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలు పోతుంటాయి. ఊరి వారికి ఇందుకు కారణం తెలియదు. కానీ తమవారికి ఉద్యోగాలు రావాలని దేవుడిని

ప్రార్థిస్తారంతా. ఇదీ కథ. కథ ఇలా చెప్తే మామూలుగా అనిపిస్తుంది. కానీ రచయిత 'యాస'తో కథ చెప్పడం కథకొక వింత సొగసునిస్తుంది. "ఊళ్ళో" రథయాత్రని 'ఉజ్జిడి' అంటారు. 'ఉజ్జిడి' తోలి కోరిన కోరిక నెరవేరుతుంది. రచయిత 'ఉజ్జిడి' ని వర్ణించిన తీరు, ఊళ్ళో వాళ్ళ జీవితాలలో దాని ప్రాముఖ్యాన్ని వివరించిన తీరు, ఈ కథను దేశంలో ఏప్రాంతానికయినా చెందినదానిగా మారుస్తుంది. చివరికి అందరూ తమవాళ్ళ ఉద్యోగాలు రావాలని కోరుకోవడంతో కథ ముగుస్తుంది. చక్కని కథ ఇది. అమాయక పల్లె బ్రతుకులను వారికి తెలియని అర్థంకాని ప్రపంచీకరణ ప్రభావితం చేయడం ఎదను హత్తుకునే రీతిలో చెప్తుందీ కథ.!

*ఎవరికి తెలియని కథలివిలే!*

'అరుణ పప్పు' రచించిన ఈ కథ జనవరి 4. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది. 'పెళ్ళయినా అవకముందే జంటలు విడిపోవడానికి కీలకం వారి శృంగార జీవితం' అన్న సిద్ధాంతం ఆధారంగా సర్వే చేసి స్టోరీ రాయల్సి వస్తుంది ఓ మహిళా జర్నలిస్టుకి. సర్క్యులేషన్ పెంచుకునే ఆత్రంలో ఇటీవలె ఇంగ్లీషు పత్రికలు రెండుమూడు నెలలకోసారి సెక్స్ సర్వేలు జరిపి ఫలితాలు ప్రకటిస్తున్నాయి. మానవ సంవేదనలను అంకెలలో కుదించి ప్రజల అభిరుచులను దిశానిర్దేశనం చేస్తున్నాయి. అనైతిక ప్రవర్తనకు ప్రామాణికతను కల్పిస్తున్నాయి.. 'ఇంత శాతం ఇలా ప్రవర్తిస్తున్నారు. మీరూ ఇలా ప్రవర్తించండి..' అని సున్నితంగా సూచిస్తున్నాయి. ఈ కథలో అదితి అనే జర్నలిస్టుకు ఇలాంటి సర్వే చెయ్యాల్సి వస్తుంది. ఇబ్బందిగా ఫీలవుతుంది. అయినా ఉద్యోగ ధర్మం కొద్దీ కొందరిని ప్రశ్నిస్తుంది. సమాధానాలు రాబడుతుంది. చివరికి ఈ సర్వేలు శరీరానికే గానీ మనసుకి సంబధించినవి కావని గ్రహిస్తుంది. ఇదీ కథ. రచయిత్రి కథను నడిపిన తీరు బాగుంటుంది. మానవ సంబంధాలలో శృంగారం ఒక్కటే అసలు అంశం కాదని సున్నితంగా ప్రదర్శిస్తుంది ఈ కథ. మనం మన సమాజం అభివృద్ధి చెందింది , ఫ్రీ సొసైటీ అంటూ విశేషణాలు తగిలించుకుంటున్నా, ఇంకా కొన్ని ప్రధాన అంశాల విషయంలో సమాజంలో ఉన్న అపోహలను సున్నితంగా ఎత్తి చూపిస్తుందీ కథ. మూస కథలకు భిన్నమైన కథ.

*బంగారు వాకిలి*

వేదాంతం శ్రీపతి శర్మ రచించిన ఈ కథ జనవరి 7, 'నవ్య' లో ప్రచురితమైంది. ఈ కథను ఈ నెల కథగా ఎంచుకోవడానికి ప్రధాన కారణం , కథలోని మార్మికత. కథలో రచయిత సృజన అత్యుత్తమ స్థాయిలో ఉంటుంది. పాఠకుడు కథను కాజువల్‌గా చదివితే అర్థం చేసుకోలేడు. ఆలోచిస్తూ చదవాల్సిన కథ. చదువుతుంటే ఎనలేని ఆలోచనలను కలిగిస్తుందీ కథ. తిరుపతి వెంకటేశ్వరుడి ద్వారపాలకులు జయ, విజయులు. ఎప్పుడూ బయటి వైపే చూస్తుంటారు. వారికి స్వామి దర్శనం చేసుకోవాలనిపిస్తుంది. మనిషి రూపం ధరించి దర్శనం చేసుకుంటారు. భక్తుల సమూహంతో పాటు బయటకు నెట్టివేయబడతారు. వాళ్ళూ మళ్ళీ వెంకటేశ్వరుడి ద్వార పాలకులు విగ్రహాలుగా మారటం కథ. ఈ కథలో రచయిత ప్రదర్శించిన వ్యంగ్యం, మార్మికతలు అద్భుతంగా అనిపిస్తాయి. ఎంతో క్లిష్టమైన వేదాంత విషయాలను ప్రతీకాత్మకంగా, అత్యంత సున్నితంగా, సంఘటనల ద్వారా ప్రదర్శించిన రచయిత సృజనాత్మకత ఆశ్చర్యం కలిగిస్తుంది. మానవ రూపం ధరించిన జయ విజయులను పక్కకు తోయటం, 'లైన్లలో ఒకరి నొకరు కుమ్ముకుంటూ ఆతృతతో వెంకన్నను చూసుకుంటు, చిత్రమైన ముఖకవళికతను ప్రదర్శిస్తూ ఆ కొద్ది సేపట్లోనే ఏవేవో కోరికలు కోరుకుంటూ' సాగిపోయేవారనడం, ఇక్కడ సాష్టాంగపడకూడదని తోసేయడం, ఎక్కడున్నామా అని చూసే లోపల 'నిలబడకండి' అని రక్షకభటులు లాగేయడం..ఇలా మామూలుగా కనబడే సంఘటనలనే, కథ పరిధిలో విస్తృతమైన అర్థానిస్తూ ప్రదర్శిస్తాడు రచయిత. అలాగే ఒకప్పుడు ప్రత్యేక దర్శనాలు చేసుకున్న వ్యక్తి, భక్తుల పాదాల క్రింద చేతులుంచి తన్మయుడై ప్రతి భక్తుడిలో గోవిందుడిని చూడడం, అతడికోసం భగవంతుడు మారు వేషంలోరావడం, మళ్ళీ క్యూలో లోపలకు వెళ్తున్న స్వామి వారిని, ఎవరో వి.ఐ.పి. వస్తున్నాడని గంటలకొద్దీ నిలిపేయడం..'తనకోసం వచ్చే

ప్రతి భక్తుడిలో, తప్పిపోయిన పిల్లవాడు తల్లిదండ్రులని వెతికినట్టు వెతకాలని చెప్పటం..' ఒకటేమిటి ఈ కథలో ప్రతి ఘటన, ప్రతి పదం ఒక అపూర్వార్థంతో, తరచి చూస్తే గొప్ప వేదాంతార్థాలతో అలరారుతుంటాయి. ముఖ్యంగా కథ చివర భక్తుల ఒత్తిడికి భయపడుతున్న పిల్లవాడు, విగ్రహం చూసి 'ఎంత పెద్ద దేవుడు' అనటం అతిగొప్ప చమత్కారం! అత్యద్భుతమైన కథ. అత్యద్భుతమైన కథనం. ఇలాంటి కథలు ఏ సంకలనంలోనూ దొరకవు. ఏ అవార్డులూ పొందవు., ఏ విమర్శకుడి దృష్టికీ రావు.! అందుకే కథాసాగర మథనం శీర్షికన ఈ కథను పాఠకులకు అందిస్తున్నాం. చదవండి..మీరే నిర్ణయించండి. మి అభిప్రాయాల్ని నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా వ్యక్తపరచండి.

(K. Murali Krishna)
kmkp2025@gmail.com
9849617392

ఈనెల కథ

## బంగారు వాకిలి - వేదాంతం శ్రీపతి శర్మ

నవ్య వారపత్రిక జనవరి 7, 2009 సంచిక నుంచి

**జయ విజయలకు విసుగ్గా ఉంది. తోసుకుంటూ, తొక్కిసలాటలో పడిపోతూ, కళ్ళల్లో ఏవేవో భావాలు చూపిస్తూ, దెబ్బలు తింటూ దేవుని దగ్గరకు వచ్చామన్న సంతోషంలో అదోలా నవ్వుకుంటూ గుమ్మడికాయల్లా దొర్లిపోతున్న జనావళిని నిరంతరం నిర్విరామంగా చూస్తూ నిలబడి ఉన్న వారిరువురికీ ఏదో బాధగా ఉంది.**

స్వామికి కాపలాగా ఉన్నవారు వీరు. స్వామి వైపు తిరిగి ఆయన దర్శనం చేసుకోలేరు. స్వామిని చూసేవారిని చూస్తారు. వీళ్ళ కష్టాలు చూడటమే తప్ప స్వామిని ఎప్పుడు చూసేది? ఇద్దరికీ ఒకే ఆలోచన ఒకేసారి వచ్చినందుకు ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు. వాళ్ళకున్న మహిమ చేత మానవ రూపాలు దాల్చి శిలల నుంచి ఇవతలకి వచ్చి స్వామి వైపు తిరిగారు. అంతే! ఇద్దరు మనుషులు వచ్చి గట్టిగా పట్టుకుని తోసుకుంటూ ప్రక్కకి లాగారు.

'ఎక్కడి నుండి వచ్చారా మీరు? పదండి! ఏది మీ లైను?' అంటూ కేకలు వేశారు. లైనులో ఒకళ్ళనొకళ్ళు కుమ్ముకుంటూ ఆతృతతో వెంకన్నను చూసుకుంటూ చిత్రమైన ముఖ కవళికలను ప్రదర్శిస్తూ ఆ కొద్ది సేపట్లోనే ఏవేవో కోరికలను కోరుకుంటూ సాగిపోతున్న జనం ఒక్కసారి ఎందుకనో ఇద్దరి వైపు తిరిగి అరిచారు. ఏమవుతుందో తెలుసుకునే లోపల ఇద్దరూ బంగారు వాకిలికి ఇవతల వచ్చి పడ్డారు. దిక్కు తోచక మరల ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకున్నారు.

✡ ✡ ✡

ఏం జరిగిందో తెలిసే లోపల ఇద్దరు కర్రలతో నేలమీద గట్టిగా కొట్టారు. 'ఇక్కడ సాష్టాంగ పడకూడదు.....', అరిచారు, 'లెండి! ' ఇద్దరూ బాధగా లేచి నిలబడ్డారు. ఏంటో గోల గోలగా ఉంది. జనం అదే పనిగా ఎంతో హడావుడిగా వెళ్ళిపోతునారు. ఇద్దరికీ వింతగా ఉంది. కొద్ది సేపు ఎందుకో గుడిలోంచి ఇవతలకి వచ్చినందుకు సరికొత్త అనుభూతిలోకి వచ్చారు. అనంత కాలంగా

అనంతుడిని ధ్యానిస్తూ నిలబడ్డ ఇద్దరికీ పైన ఒక కొద్దిపాటి ఆకాశం కనిపించగానే చిత్రంగా చూస్తూ అడుగులో అడుగు వేస్తున్నారు. ‘ఉచిత ప్రసాదం‘ అని వ్రాసి ఉన్న చోట అటూ ఇటూ చూస్తుండగా ఎవరో ‘లైను‘ అని అరిచారు. చూసే లోపలే ఎవరో తోశారు. లైన్లోకి వెళ్ళి చెరో చిన్న లడ్డూ సంపాదించుకుని ఇవతలకి వచ్చారు. అవి తిని ప్రధాన ద్వారం దగ్గరకి ఒక్కసారి ఎక్కడున్నామా అనుకుంటూ వెనక్కి తిరిగారు. ‘రావాలి, నిలబడకండి‘ అంటూ రక్షక భటులు అరిచారు. బాబోయ్ అనుకుంటూ కొద్దిగా జనం లేని చోటు మీదుగా ఒకరినొకరు కనిపెట్టుకుంటూ మెట్టు ఎక్కి ఆంజనేయస్వామి వారి గుడి దగ్గర నిలబడి స్వామిని దర్శించుకున్నారు. ఒక కుర్రాడు ఫోటోలు అమ్ముతున్నాడు.

‘సార్, పటాలు, పదిరూపాయలు‘

‘ఏమిటవి?‘

‘ఫోటోలు, కాలెండర్లు‘

‘స్వామి ప్రతిరూపాలలా ఉన్నాయే!”

‘కాదు సార్, ఫోటోలు‘

ఇద్దరూ ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకున్నారు.

‘ఇవి మన దగ్గర పెట్టుకుంటే బావుంటుందేమో?‘

‘నిజమే. స్వామి వారిని రోజూ తలుచుకుని ధ్యానించుకోవచ్చును‘ ఫోటోలు తీసుకున్నారు.

‘డబ్బులు ఇవ్వండి సార్, ఇరవై రూపాయలు‘

‘అంటే?‘

‘ట్వెంటీ రుపీస్. తెలుగు రాదా? తెలుగులోనే మాట్లాడుతున్నారు కదా?‘

అర్థం కాక వాటిని తిరిగి ఇచ్చేశారు. అక్కడ జరుగుతునన్నదేదీ బోధపడలేదు. ‘స్వామి మనకు ఏరోజూ కనిపించే ఆస్కారం లేదు. మనం ఇటు తిరిగే నిలబడతాం‘

‘నిజమే ఆయన ప్రతిరూపం కుడా మనకి దక్కటం లేదు. ఈ అన్యాయం గురించి ఆయనకు చెప్పాలి‘

‘ఎలా? మనల్ని లోపలికి రానిచ్చేటట్లు లేరు.‘

‘చిత్రమైన సమస్య.. ఏం చేద్దాం?‘

మైకులో ఎవరో తప్పిపోయిన వారి గురించి చెబుతున్నారు.

‘మనం అక్కడ చెప్పాలేమో?‘

‘అవును‘

✡ ✡ ✡

ఆ చుట్టు ప్రక్కల ఏ ఆఫీసులోనైనా ఎవరైనా మూడో వ్యక్తి గురించి మాట్లాడేందుకు వీలుగా ఇద్దరిద్దరు కూర్చుని ఉంటారు. ఒకడు దిష్టి బొమ్మలా చూస్తూ ఉంటాడు. ఈ ఆఫీసులోనూ అంతే. కాకపోతే ఒకడు దయ్యం పట్టిన వాడిలా ఉన్నాడు, ఇంకొక్కడు దయ్యాన్ని పట్టేవాడిలా ఉన్నాడు! జయవిజయలిద్దరూ కౌంటర్ దగ్గర నిలబడ్డారు.

‘మేము తప్పిపోయాం‘ అన్నారు.

అతను ఇద్దరినీ చూసి నాలుక కరచుకోలేదు కానీ నాలుక మీద వేలితో తాకి ఒక కాగితాన్ని చేతికిచ్చాడు.

'దీని మీద వివరాలు వ్రాయండి'

'మాకు రాదు'

'ఓహో, ఇంత దండిగ ఉన్నారు? ఏలిముద్రా? సర్లె. నోటితో పేర్లు చెప్పండి'

'జయ'

'విజయ'

ఒకడికి పట్టిన దయ్యం వదిలి పోయింది.

'ఏందబ్బా, ఆడోళ్ళ పేరున్నట్లుండ్లే?'

(....)

'సరె! ఎవుర్ని పిలిపించాలి? తిన్నగ చెప్పండి!'

'స్వామిని!'

'ఏడుంటాడు?'

'వైకుంఠం!'

'ఓహో, క్యూకాంప్లెక్సులోకెళ్ళినాడా? సర్లె. పూర్తి పేరు చెప్పు. ఏ ఊరు?'

'వేంకటేశ్వర స్వామి. ఈ ఊరే!'

'తమాషా గుందిలే! ఉండు. చెపుతాను!'

అతను మైకు తీసుకుని ప్రకటన చేశాడు.

'భక్తులకు విజ్ఞప్తి. తిరుపతికి చెందిన వేంకటేశ్వర స్వామి తాలూకు ఇద్దరు వ్యక్తులు - జయ, విజయ అను పేర్లు గల వారు ఎంక్వయిరీ దగ్గర నిలబడి ఉన్నారు. ఈ స్వామి అనే ఆయన ప్రస్తుతం వైకుంఠం కాంప్లెక్స్‌లో ఉన్నట్లు తెలుపుతున్నారు. వారి దర్శనం అయిన తరువాత ఇక్కడికి వచ్చి కలుసుకొనగలరు'

ఇద్దరూ అక్కడే కూర్చున్నారు. కొన్ని గంటలు గడిచాయి. అతను మరో తప్పిపోయిన వ్యక్తి గురించి విచారిస్తున్నాడు.

వీళ్ళని జాలిగా చూశాడు.

'చూడండి, వైకుంఠం లోంచి రావాలంటే చాలా టైం పడుతుందిలే. మీరు పోయి ఏమైనా తిని రాకుడాదా? ఈడకే రండి, ఏమి?'

ఇద్దరూ లేచారు గుడిలో గంటలు మ్రోగుతున్నాయి. మరల షాపింగ్ కాంప్లెక్స్ లోంచి నడుచుకుంటూ ఆలయం వైపుకు వచ్చారు. గుడి లోపల తప్ప ఇవతల జనం 'గోవిందా' అనటం చూడలేదు. ఇంతలో ఎవరో 'గోవిందా' అనటం విని వెనక్కి చూశారు. అక్కడ మెట్ల దగ్గర ఒక వృద్ధుడు గోడకి ఆనుకుని 'గోవిందా, గోవిందా' అంటున్నాడు. గ్రుడ్డి వాడిలా ఉన్నాడు. ఆ శబ్దం ఎంతో ప్రేమతో ఆప్తులను పిలుస్తున్నట్లుంది. జనం పరుగులు తీస్తూనే ఉన్నారు. అతను నేల మీద పెట్టిన చేతిని ఒకళ్ళిద్దరు తొక్కుకుంటూ వెళ్ళిపోయారు. అతను వెంటనే 'గోవిందా' అన్నాడు.

'ఎందుకింత తొందర వీరికి?'

'కాదు. జాగ్రత్తగా చూడు. అతన్ని జనం తొక్కటం లేదు. అతనే కావాలని చెయ్యిని అక్కడ పెట్టి వాళ్ళు తొక్కేలా చేస్తున్నాడు'

వింతగా తోచి అక్కడికి దగ్గరగా నడిచారు నిజమే. ఎందుకో గుడిలోంచి ఇవతలకి వచ్చిన వాళ్ళ పాదాల క్రింద తన చేయిని పెడుతున్నాడు. నిజానికి అతను అడుక్కోవటమూ లేదు. ఏవో కొన్ని నాణాలు ప్రక్కన పడేసి ఉన్నాయి. 'గోవిందా, గోవిందా' అంటూనే ఉన్నాడు.

ఇంతలో ఇద్దరికీ మహదానందం కలిగింది. మైకులో చేసిన ప్రకటన వలన కాబోలు, స్వామి వారు మారువేషంలో అక్కడికి వస్తున్నట్లు గ్రహించారు. ఆయన భక్తుని వేషంలో తిరునామాలు ధరించి నేరుగా ఆ గ్రుడ్డి వ్యక్తి దగ్గరకు వచ్చి అతని చేయి మీద మెల్లగా కాళ్ళు మోపారు. అతను ఆనందంతో పులకించి పోయాడు. ఓపికంతా కూడదీసుకుని 'గోవిందా' అన్నాడు. గుడిలోంచి గంటలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి.

'గోవిందా నామము....' ఏదో క్యాసెట్ లోంచి అన్నమయ్య పాడుతున్నట్లుంది. స్వామి అతని ప్రక్కన కూర్చున్నారు.

'ఇలా ఎందుకు ఇందరి చేత తొక్కించుకుంటావు?'

అతను తల అటూ ఇటూ ఊపాడు. మాటలు రావడం లేదు.

ఆయన పాదాల మీద తల వాల్చి కన్నీరు కారుస్తున్నాడు. ఈ లోకంలో లేడు. మెల్లగా తల ఎత్తాడు.

'చెప్పవా?'

అతను ఓపిక చేసుకున్నాడు.

'స్వామీ, మీరు గుడిలోంచే వస్తున్నారా?'

'అవును'

'నా స్వామి బావున్నాడా?'

'బావున్నాడు'

'నిండుగా, మెండుగా, నవ్వుతూ, చెయ్యి క్రిందకి చూపిస్తూ అలా నిలబడే ఉన్నాడా?'

'అవును. అలానే ఉన్నాడు'

'చూశారా? నేను చూడలేను. కానీ గుడిలోంచి వచ్చి నా చెయ్యి మీదుగా అలా ఎవరైనా నడవగానే స్వామిని నా కళ్ళల్లో కాదు, నా శరీరం మనస్సూ, సర్వం కనులు చేసుకుని చూస్తాను!'

జయ విజయులకు ఆశ్చర్యం వేసింది. అతనికి ఇరుప్రక్కలా కూర్చున్నారు.

'ఇక్కడ ఎన్ని రోజులుగా ఉంటున్నావు?' అడిగారు.

'గత రెండు సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాను. నేను ఒక జీవితకాలం కొండకు వస్తూనే గడిపేశాను. రకరకాల హోదాలలో దర్శనం చేసుకున్నాను. వి.ఐ.పి కోటాలో పలుమార్లు, మరేదో కోటాలో ఇంకొన్ని మార్లు మొత్తానికి అన్ని రకాలూ చూశాను. ఒకసారి లైన్లో వేలాది మంది పిల్లా పాపలతో వేచి ఉండగా వాళ్ళ కేకలు, ఏడుపులు వింటూనే ఒక ప్రముఖుని వెనక వెళ్ళి ఒక గంట సేపు దర్శనం చేసుకుని వచ్చాను. దారిలో ఎక్కడో అనుకున్నాను - వీరందరూ మమ్మల్ని తిట్టుకోరా? అని. రిటైరయిన తరువాత ఈ గుడికి వచ్చేవారి సేవలో ఆస్తిని వెచ్చించి కాలం గడిపేశాను. నాకెవరూ లేరు. అందరూ ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు!' అతను మాట్లాడుతూనే అక్కడ మరల చేతులు నేల మీద పెడుతున్నాడు. ఎవరో పొరపాటుగా తొక్కి వెనక్కి తిరిగి బాధ పడుతున్నారు. ఇతను 'గోవిందా' అనుకుని పులకరించి పోతున్నాడు. రెండు చేతులూ కళ్ళకద్దుకుంటున్నాడు. తెగ మురిసిపోతున్నాడు. కళ్ళని కప్పిన చేతులను శరీరమంతా అద్దుకుంటున్నాడు. 'ఈ చేతులే ప్రతి ఉదయం నాకోసం బంగారు వాకిలిని తెరుస్తాయి. మూసి ఉంచుకుని స్వామిని ధ్యానిస్తున్న ఈ రెండు కనులూ ఆ జయవిజయులు... అదుగో ఆ స్వామి... ఎందుకో అలా నవ్వుతూనే ఉంటాడు!'

✡✡✡

స్వామి వెంట ఇద్దరూ మౌనంగా నడిచారు.

'స్వామి...'

'చెప్పండి'

'మనం లోపలికి వెళ్ళటం ఎలా?'

'బావుంది. మీరెలాగూ గుడిలోంచి ఇవతలకి వచ్చారు కదా, నన్ను ఎలాగో అలాగ మరల లోపలికి తీసుకెళతారని ఆశించి నా భక్తుని కోసం నేను వచ్చాను'

'అయ్యో, మీరలా అనేస్తే ఎలా?'

'మీరు మహా వీరులు కదా?'

'మా వల్ల కాదు. స్వామి మిమ్మల్ని ఆపద మ్రొక్కులవాడు అంటారు. ఇందర్ని ఇన్ని అవస్థలు పెట్టి దర్శనాలు ఏమిటి స్వామీ? ఈ కోటాలెందుకు?'

'లక్షల మంది నా దగ్గరకి వచ్చి ఏవేవో కోరుకుంటారు. తన ముందు, వెనుక ఉన్న వారి బాధ గురించి ఒక్కరూ అడగరు. అందుకు ఈ తోపుళ్ళు!'

'ఎలా అడగాలి స్వామీ? అంత సమయం ఏది?'

'రండి. పుష్కరిణిలో స్నానం. ఇది మొదటి పని. రెండు ఆది వరాహ స్వామిని దర్శించుకుని కోరిక - ఈ కోరికే కోరండి. మూడు నాదగ్గరకొచ్చి నా పాదాలవైపు నమస్కరించి నేను క్రిందకి చూపిస్తున్న వరదాభయహస్తాన్ని దర్శించి వరాహస్వామి సాక్షిగా కోరుతున్నట్లు మరల కోరండి. అదీ పద్ధతి. ఆయన తీర్చవలసిన కోరికలను నేను తీరుస్తాను!'

నియమాలు పాటించి 'వైకుంఠం' దగ్గరకి వచ్చారు. భక్తుల మధ్య గోవిందగానం చేసుకుంటూ 'సర్వదర్శనం'లోకి వెళ్ళారు. జయ విజయులు స్వామి వెంట ఆనంద నిలయం వైపుకి నడిచారు. ఆ కుదుపులకీ, దెబ్బలకీ, సన్నని లైనులోని ఇబ్బందులకీ మరింత గట్టిగా గోవింద నామం చేశారు. స్వామి వారు ఆయన బిడ్డలెందరో పలుకుతున్న గోవింద నామానికి తన్మయత్వం చెందుతూ కదిలారు....

ప్రధాన ద్వారం దగ్గర ప్రముఖులెవరో నేరుగా లోనికి వెళుతున్నారు. అందరినీ ఆపేశారు. స్వామి ముందర ఒక ఇనుప చువ్వ అడ్డంగా పెట్టారు.జయ విజయులను మాట్లాడవద్దని సైగ చేశారు.

'ప్రక్క వారి బాధ తెలియని వారు మనుషులు కారు...'. వెనుక ఎవరో అంటున్నారు... 'వీళ్ళకి దేవుడెందుకు?'

స్వామి వారి ప్రక్కన నిలబడి ఉన్న వాహనాలన్నీ ఆయన్ని చూసి తరించాయి. ఆయన అందుకే ఆగారా అనుకున్నాయి. కొద్ది సేపట్లో లైను జరిగింది. బంగారు వాకిలి దగ్గరయింది. వకుళమాతను లైనులోంచే చూసుకున్నారు స్వామి.

జయ విజయులని ఆశీర్వదించారు. 'నా వైపు తిరిగి నన్ను చూడలేక పోతున్నారని బాధ పడకండి...' చెప్పారు. '..మీరు ఎంతో ధన్యులు. నా కోసం తరలి వచ్చే వారందరిలో నన్ను చూసి తరిస్తారు. నన్ను తప్పి పోయిన పిల్లవాడు తల్లితండ్రులను వెతికినట్లు వెతకాలి. నన్ను సంపూర్ణంగా దర్శించుకునేందుకు పూర్తిగా తెరుచుకునే బంగారు వాకిలి అదే..' అంటూ ఆయన లోపలికి వెళ్ళిపోయారు. జయవిజయులు వారి పూర్వపు స్వరూపాలలోకి ప్రవేశించారు.

జనం ఆగుతున్నారు, సాగుతున్నారు. రక్షక భటులు తోస్తున్నారు. లాగుతున్నారు. పిల్లలు కేకలు పెడుతున్నారు. అయినా అందరి కళ్ళల్లో ఏదో మెరుపు.

'నాన్నా...', ఎవరో పిల్లవాడు అడుగుతున్నాడు.

'కనిపించటం లేదా?'

'నన్ను నలిపేస్తున్నారు. ఇంతమంది ఎందుకు తోస్తారు?' అతన్ని తండ్రి పైకి ఎత్తుకున్నాడు.

'చూడు నాన్నా, అందరికీ నాన్న మరి. ఎంత మందిని ఎత్తుకుంటాడు? అవునా?'

'కనిపించాడు నాన్నా. ఎంత పెద్ద దేవుడో! '






## మార్చి ౨౦౦౯

**కథా సాగర మథనంలో** విశ్లేషణకు మార్చి నెలలో విడుదలయిన దినపత్రికలు ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన కథలు, మాసపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచనలలోని కథలను కలిపి మొత్తం 97 కథలను ఎంచుకోగా, కౌముది పాఠకుల పరిచయం కోసం ఎంపిక చేసిన కథలు 5.

ఈ నెల కథలలో అధిక శాతం కథలు తల్లి తండ్రులని సరిగా చూడని కథలే. ఇందుకు ప్రతిగా తండ్రి ఇల్లొదిలి వృద్ధాశ్రమంలో చేరతాడో కథలో. మరో కథలో కొడుకుకు బుద్ధి నేర్పుతాడు. ఇలాంటి కథల నడుమ, ప్రేమ కథలు, హాస్య కథలు కూడా వచ్చాయి. వస్తువులో కాకపోయినా, కథనంలో కొత్తదనం ఏ మాత్రమయినా చూపించిన కథలు కూడా తక్కువే. కథ కాస్త చదవగానే ముగింపు అర్థమైపోతుంది. కథకుడి హృదయం తేట తెల్లమై పోతుంది. అందువల్ల ఈ నెల పాఠకుల పరిచయానికి తగ్గ అర్హత ఉన్న కథలను ఎంపిక చేసుకోవటం కాస్త కష్టమయింది. ఉన్న వాటిలో కాస్తయినా వైవిధ్యం ప్రదర్శిస్తూ, ఆకర్షణీయంగా ఉండి, చదివింప చేసిన కథలివి.

***<u>అమ్మ - దొంగ</u>***

పెన్మెత్స శ్రీకాంత్ రాజు రచించిన ఈ కథ మార్చి 29, ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది. కథ కాస్త చెప్పగానే ముగింపు ఊహించగలిగినా, కథను నడిపిన విధానం బాగుండి చివరవరకు చదివిస్తుంది. ముప్పై ఏళ్ళ వ్యక్తి, అమ్మ దాచిన బంగారాన్ని దొంగిలించాలనుకుంటాడు. ఎందుకంటే, అతని సోదరులంతా మంచి పొజీషన్‌లో ఉంటారు. అతనొక్కడే పేదరికంలో ఉంటాడు. కానీ ఆస్తిని అందరికీ సమానంగా పంచుతానంటోంది తల్లి. "వాడు పేదరికంలో ఉన్నాడు కాబట్టి బంగారం తమ్ముడికి ఇచ్చేయి" అని సోదరులనరు. దాంతో ఓ రోజు దొంగతనంగా వచ్చి బంగారం దోచేద్దామనుకుంటాడు. కానీ ఇంట్లో ఎంత వెతికినా బంగారం దొరకదు. దాంతో తల్లి మీద ద్వేషం పెంచుకుంటాడు. తల్లి మరణించిన తరువాత తెలుస్తుంది, బంగారం వేరే వారింట్లో భద్రంగా దాచిందని, అంతా అతని పేరే రాసిందని. మామూలుగా అలవాటయిన కథే అయినా రచయిత కథనం నడిపించిన తీరు చకచకా చదివిస్తుంది. 'బాగుంది' అనిపిస్తుంది కానీ 'గొప్ప'గా అనిపించదు. మనసుని తాకదు.

***<u>క్షతగాత్ర</u>***

కె.వరలక్ష్మి ఈ కథ మార్చి 29 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. కొత్తగా పెళ్ళయిన సుజనను భర్త అభిరాం ప్రవర్తన కొత్తలో ఆశ్చర్యం కలిగిస్తుంది. కొన్నాళ్ళకు అసహ్యం కలిగిస్తుంది. కనపడ్డ అమ్మాయి తన వెంట పడుతోందని, తనతో లైంగిక సంబంధానికి ఉవ్విళ్ళూరుతోందని భ్రమపడి, అదే నిగమమనుకుంటాడు ఆమె భర్త. చివరికి భర్తను వదిలి తన కాళ్ళ మీద తాను నిలబడాలని నిశ్చయించుకుంటుంది సుజన. ఇది కూడా మామూలు కథే. ఎన్నో కలలతో వైవాహిక జీవితంలో అడుగు పెట్టిన యువతికి తాను మామూలుగా ఎలాంటి మనుషులనైతే అసహ్యించుకుంటుందో, అలాంటి పురుషుడితోనే జీవితాంతం గడపాల్సి రావటాన్ని మించిన

శిక్ష వేరొకటి లేదు. అది దుర్భరమైన పరిస్థితి అది. అయితే, ఇలాంటి అనేక ఇతర కథలలాగే రచయిత్రి, పురుషుడిని విలన్‌గా చూపించింది. సుజన పాత్ర మానసిక స్థితిని సానుభూతితో గాఢంగా వర్ణించి, ఆమె భర్త మనస్తత్వాన్ని విశ్లేషించి ఉంటే కథ మరింత చిక్కగా తయారయ్యేది. కానీ, సంఘటనలను, ఓ వార్తలా ప్రదర్శించటానికే ప్రాధాన్యం ఇవ్వటంతో 'వేగం'గా చదివించే కథగా మిగిలిపోయిందిది.

<u>ఆత్మాన్వేషణ</u>

జ్వలిత రచించిన ఈ కథ 22 మార్చి, సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఈ నెల వచ్చిన కథలలో సమకాలీన సమస్యను స్పృశించేందుకు ప్రయత్నించిన అరుదైన కథలలో ఇదొకటి. ఆధునిక సమాజంలో ఉద్యోగాలలో స్త్రీ, పురుషులు తరుచు, సన్నిహితంగా కలిసే వీలుంటోంది. దీనికి తోడుగా, జీవితంలో వేగం పెరిగింది. 'డబ్బు' సంపాదన తప్ప మానవ సంబంధాల గురించి, వ్యక్తిగత అనుబంధాల గురించి ఆగి, ఆలోచించే తీరికే లేకుండా పోయింది. ఇది చాలదన్నట్టు ప్రతి ఒక్కరికీ, జీవితంలో అనుభవించగలిగే ఆనందాలు, సౌఖ్యాల గురించి తెలుస్తోంది. తమ జీవితాలలోని 'లోటు'ను గ్రహింపచేసి, తీవ్రమైన అసంతృప్తికి వ్యక్తిని గురిచేసే పరిస్థితులివి. ఇలాంటి పరిస్థితులలో ప్రతి వ్యక్తి 'ఒంటరి'తనానికి గురై, తాత్కాలికంగానయినా, కృత్రిమ తోడు కోసం తపిస్తూ, లేనిపోని బంధాల వలలో చిక్కుకుని తన స్వీయ వ్యక్తిత్వాన్ని కోల్పోతాడు, ఏ మాత్రం తనపై తనకు నియంత్రణ లేకున్నా, అలాంటి పరిస్థితుల్లో చిక్కి తమ అసలు వ్యక్తిత్వానికి భిన్నంగా ప్రవర్తించే ఇద్దరు వ్యక్తుల కథ ఇది. 55 సంవత్సరాల శాంత, ఆనందరావు అనే వ్యక్తితో 'స్నేహా'న్ని 'వ్యామోహం' అంచులకు తీసుకువెళ్ళి బాధపడటం, రాంప్రసాద్ అనే నడివయసు వ్యక్తి, మరో అమ్మాయి 'మోహం'లో పడి ఆత్మహత్య వరకూ వెళ్ళటం అనే రెండు విభిన్న కథలను ఒక కథలో పొందుపరచి సామాజిక మనస్తత్వంలో పెరుగుతున్న 'ఒంటరితనాన్ని', 'స్నేహం' పేరిట వ్యక్తులు జరుపుకుంటున్న ఆత్మవంచననూ ప్రదర్శిస్తూ, పరిష్కారం సూచించాలని రచయిత్రి ప్రయత్నించారీ కథలో. అయితే, ఒక స్థాయివరకూ కథ బాగానే నడిచినా, ఆ తరువాత రచయిత్రికి కథపై పట్టు పోయింది. కథ 'సినిమాటిక్' గా అనిపిస్తుంది. గంభీరమైన సమస్యకి తేలికయిన పరిష్కారం ఇచ్చినట్టనిపిస్తుంది. చివరిలో శాంత సామాజిక సేవ వైపు దృష్టి మళ్ళిస్తుంది. గతంలో వ్యక్తులు తమ దృష్టిని ఆధ్యాత్మకత వైపు మళ్ళించి అసంతృప్తులను చల్లార్చుకునే వారు. కానీ, అనేకుల దృష్టిలో ఆధ్యాత్మికత అంటరానిదయి, 'సామాజిక సేవ' అభ్యుదయమయింది. దాన్ని ఈ కథ ప్రతిబింబిస్తుంది. కథ అసంతృప్తిని మిగిల్చినా మూస కథలకు భిన్నంగా సమకాలీన మానసిక సమస్యను స్పృశించిన రచయిత్రి అభినందనీయురాలు.

<u>పబ్బులూ - హక్కులూ</u>

'ఓల్గా' రచించిన ఈ కథ మార్చి 8, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. రచయితకు తాను, చెప్పదలచుకున్న అంశంపై స్పష్టమైన అవగాహన లేకున్నా, తన వ్యక్తిగత అభిప్రాయాలకు సార్వజనీనతను ఆపాదించి, సామాజిక ఆమోదం పొందేందుకు 'కథ'ను వాడుకున్నా, కథ ఎలా అయోమయంగా, అపరిపక్వంగా తయారవుతుందో ఈ కథ తెలుపుతుంది. 'పబ్బులూ - హక్కులూ' అనగానే, మనకు ఇటీవలె మంగుళూరులో 'రామసేన' పబ్బులపై జరిపిన దాడి గుర్తుకు వస్తుంది. రచయిత్రి దాన్ని ఖండించేందుకే కథ రాశారేమో అన్న ఆలోచన వస్తుంది. ఆ వెంటనే, రచయిత్రి స్త్రీ పురుషులు పబ్బుల్లో స్వేచ్ఛగా తిరగటాన్ని తాగటాన్ని సమర్థిస్తున్నారేమోనన్న ఆలోచన కలుగుతుంది. కానీ, కథ ఆరంభించిన కొద్ది సేపటికి రచయిత్రి పబ్బుల సంస్కృతినీ మెచ్చటం లేదని, యువతలో 'సామాజిక స్పృహ', హక్కుల కొసం పోరాడాలన్న ఆలోచన ఏమాత్రం లేక పోవటాన్ని నిరసిస్తున్నారని అర్థమౌతుంది. ఇక్కడే కథలో అయోమయం మొదలవుతుంది. 'సంజయ్' అనే యువకుడు కొన్నాళ్ళకోసం తన బంధువుల ఇంటికి రావటంతో కథ మొదలవుతుంది. ఆ యువకుడికి అమ్మాయిలను వెంటేసుకుని తిరగటం, వీకెండ్లలో అర్ధరాత్రి వరకూ పబ్బుల్లో ఎగరటం తప్ప మరో విషయం పై ధ్యాస ఉండదు. అది మన రచయిత్రికి బాధ కలిగిస్తుంది. హక్కుల కోసం పోరాడాలని, తెలియని వాళ్ళకు తెలియచెప్పాలని

వాదిస్తుంది. ఆ కుర్రాడు పట్టించుకోడు. ఇంతలో కొన్ని సంఘాలు పబ్బులకెళ్ళకూడదని అంటారు. పబ్బుకెళ్ళే హక్కుకోసం రచయిత్రి భర్తతో ఆ రాత్రి పబ్బుకెళుతుంది. ఆ యువకుడితో ఏ అమ్మాయీ రానంటుంది. మరుసటి రోజు నుంచి ఆ యువకుడు హక్కుల గురించి తెలుసుకోవాలనుకుంటాడు. ఇదీ కథ. కథ చదువుతుంటే రచయిత్రి ఏ 'హక్కు'ను సమర్థిస్తోందో అర్థంకాదు. 'పబ్బుకెళ్ళి తాగటం' సమర్థనీయమైతే, యువతీ యువకులు చేస్తున్నది సమర్థనీయమే. అందుకని వారిని తప్పు పట్టటం అర్థరహితం అనిపిస్తుంది. ఇక్కడ గమనిస్తే స్త్రీ పాత్ర పబ్బుకి వెళ్ళే హక్కు నింపుకోవటం కోసం పబ్బుకి భర్తతోటే వెళ్తోంది. వైవాహిక బంధం స్త్రీకి ఇచ్చే 'భద్రతా భావం' అది. ఓ వైపు నుంచి అబ్బాయిలు, అమ్మాయిలు స్వేచ్ఛగా తిరగటాన్ని నిరసిస్తూనే (కథనంలోని ధ్వని ఈ నిరసనను సూచిస్తుంది), మరో వైపు ఆ హక్కు కోసం పోరాడటం, కాస్త అయోమయం కలిగిస్తుంది. 'నాకు మంచేదో ఎవరూ చెప్పనక్కర్లేదు' అన్న ధోరణి ఇది అయితే, యువతీయువకులకు ఏం కావాలో చెప్పటం, వారు అలా లేరని బాధపడటం కూడా యువకుల స్వేచ్ఛను హరించటం అనిపిస్తుంది. అలాగే, ప్రతి తరం వారు, తమ తరువాత తరువాత తరం తమలా లేరని బాధ పడటం, వారు తమలా ఉండాలని వాంఛించటం, నిర్బంధించటం వల్లనే తరాల నడుమ ఘర్షణలు జనిస్తాయి. ఈ కథలో రచయిత్రి ఇప్పటి తరం తమలా 'పోరాటాలు చేయటం లేదు, అవసరమైతే అరెస్టవటం లేదు' అని బాధపడుతున్నట్టు తోస్తుంది. చివరికి యువకుడిలో మార్పురావటం, అది మంచి అన్నట్టు చూపుతుంది. కానీ ప్రతి తరానికి ఆ తరానికి ప్రత్యేకమైన 'వ్యాకరణం' ఉంటుంది. ఇది అర్థం చేసుకుని, ఆ అవగాహన కల్పిస్తే తరాలనడుమ అంతరాలు అంతరిస్తాయి. కానీ ఈ కథలో అలాంటి అవగాహన, ఆలోచనలు కనబడవు. పైగా 'మేము చేసింది గొప్ప' అన్న 'అహం' కనిపిస్తుంది. చిత్రీకరణ, సన్నివేశ స్పష్టీకరణ అపరిపక్వంగా, బలహీనంగా ఉండటంతో, 'తమ తరం' గొప్ప చెప్పుకుంటూ, ఇప్పటి తరం పనికి రానిదని చూపిస్తూ, పనిలో పనిగా తమ లౌకిక తత్వం నిరూపించుకునే ప్రయత్నంగా రాసిన కథ తప్పు కథగా ఎదగని కథ ఇది అనిపిస్తుంది.

***<u>వలయం</u>***

పెద్దింటి అశోక్ కుమార్ రచించిన ఈ కథ 'రచన' మాసపత్రికలో ప్రచురితమయింది. ఇది ఈ నెల కథ. రచయితకు తామెంచుకున్న అంశంపై లోతైన అవగాహన, మానవ మనస్తత్వం పట్ల గాఢమైన పరిశీలన, సామాజిక పరిస్థితులపై లోతైన ఆలోచన ఉన్న రచయితకు చక్కని కథాకథన ప్రతిభ తోడయితే ఇలాంటి మనసుని కదిపి, మెదడుకు పదును పెట్టే కథలు తయారువుతాయి. ఈ కథలో రచయిత ఒక అపరిచిత ప్రపంచాన్ని మన కళ్ళముందు అక్షరాల ద్వారా సృజిస్తాడు. ఒక చట్రంలో బందీలయిన మంచి మనుషుల నిస్సహాయత్వాన్ని నివురుగప్పిన నిప్పులా ప్రదర్శిస్తాడు. ఈ కథలో రచయిత గుప్పెట విప్పి చూపిన అంశాల కన్నా, చెప్పీ చెప్పకుండా వదిలిన విషయాలే తీవ్రమైన ఆలోచనను కలిగిస్తాయి. రచయిత ఈ కథను మాండలీకంలో రాయటంతో బంగారానికి తావి అబ్బినట్టయింది. ఈ కథలో రచయిత పాఠకుడు గమనించాల్సిందేమిటంటే, రచయిత కథను చెప్పిన విధానం. తాను చెప్పదలచుకున్న అంశం వైపు తప్ప, పాఠకుడి దృష్టి మరో అంశం వైపు మళ్ళకుండా, రచయిత పాఠకుడి మెదడును తాడేసి లాక్కువెళ్ళడం చూడండి. పాత్రల మనోభావాలను ప్రదర్శిస్తూ, వారి ఆలోచనలను మన ఆలోచనలు చేస్తూ, మనం ఎలా ఆలోచించాలో, ఏం చూడాలో, ఓ నియంతలా రచయిత నియంత్రించటం చూడవచ్చు. ఎలాగయితే, సినిమాలో కెమేరా, పాత్రల దృక్కోణంలోంచి, వారు చూసేది మాత్రమే చూపుతూ, మన దృష్టిని పరిమితం చేస్తూ హఠాత్తుగా దృక్కోణాన్ని విశాలం చేసి సమగ్ర చిత్రాన్ని చూసి ఆశ్చర్య చకితుల్ని చేస్తుందో, ఈ కథలో రచయిత అదే చేస్తాడు. ఓ పోలీసాఫీసరు తండాల్లో తయారయ్యే సారాను పట్టేయాలనుకుంటాడు. మారు వేషంలో తండాలోకి వెళతాడు. సారా తయారీ చూస్తాడు. వారిని పట్టేయాలనుకుంటాడు. కానీ, వారి 'మానవత్వం' అతడిని కట్టిపడేస్తుంది ఈ కథలో విలన్లు లేరు. ఉద్యమాలు లేవు. సిద్ధాంతాలు లేవు. ఇందులో ఉన్నది మన కళ్ళెదురుగా కదలాడే మాములు మనుషులు. ఇందులో ఉన్నది జీవితం. ఇదీ అసలు సిసలైన కథ. ఎవరిపైనా ద్వేషం కనబడదీ కథలో. అందరూ పరిస్థితులకు బందీలవటం కనిపిస్తుంది. ఉన్న తమ

తమ పరిమిత పరిధులలో మనిషిలా బ్రతకాలని పోరాటం జరపటం తెలుస్తుంది. మానవత్వాన్ని సజీవంగా నిలుపుకోవటం కనిపిస్తుంది. కథలో ఎంతగా లీనమైపోతామంటే, ఒక దశలో 'సారా' వాసనను మనం కూడా అనుభవిస్తాం కూడా. అందుకే, కథను కథగా రచించిన 'పెద్దింటి అశోక్ కుమార్'ను అభినందిస్తూ ఈ నెల కథగా ఈ కథను ఎంచుకున్నాను. చదివి మీ అభిప్రాయం చెప్పండి.




*ఈనెల కథ*

**వలయం** - **పెద్దింటి అశోక్ కుమార్**

రచన మాసపత్రిక మార్చి, 2009 సంచిక నుంచి

**ఇది ఇప్పటి ముచ్చట కాదు.**

ఐ.ఎం.ఎల్ అప్‌టెక్ టార్గెట్ డబ్బు నింపలేదని ఎక్సైజ్ సి.ఐ. రాజును ట్రాన్స్‌ఫర్ చేసినప్పటి ముచ్చట.

కొత్తగా వచ్చింది నవీన్. జన్నారం తండాల్లో సారా వాసనే లేకుంట చేసి, అడ్డమచ్చిన ఎమ్మెల్యేనే కోర్టుకు గుంజిన మనిషి.

ఎక్సైజు సూపరిండెంటు ఏరికోరి నవీన్‌ను ఈ టేషన్‌కు పంపినప్పటి ముచ్చట. ఆర్డర్ కాయితం అందుకున్నప్పుడే 'నెల రోజుల్లోనే టార్గెట్ నింపుత' అని మాట ఇచ్చిండు నవీన్.

టేషన్‌లకు వచ్చి ఫైళ్ళు తిరగేస్తే కేసుల టార్గెట్ కూడా లేదు. చేతికింద ఇద్దరు ఎస్సైలు, పదిమంది స్టాఫు. పిలిచి అడిగితే 'కేసులే లెవ్వు సార్' అన్నరు.

ఇరాక్‌లో బాయి తవ్వితే మంచినీళ్ళు పడ్డయన్నా నమ్ముతడు గనీ తండాల్లో సారలేదంటే నమ్మడు నవీన్. వైన్ షాపు ఓనర్లతో మీటింగు పెట్టిండు.

"సార్... పది రూపాయలకు శేరు గుడుంబ దొరుకుతుంటే మాకు గిరాకి ఎట్లయితది... మేము మాలు తేస్తేనే గదా చాలన్ కట్టేది. ముందు గుడుంబ బందు పెట్టుండ్రి సార్...." అన్నరు.

నవీన్‌కు అనుమానం వచ్చింది. 'జీరో మాల్ అమ్ముతలేరుగదా' అనుకున్నడు. షాపులన్నీ చెక్ చేసిండు. అంతా సర్కార్ మాలే!

తండాల మీద దాడి చేసి నలుగురైదుగురిని దొరుకవట్టి హల్ చల్ చేస్తే తప్ప పరిస్థితి అదుపులకు రాదనుకున్నడు నవీన్. స్టాపును కూడా నమ్మబుద్ధికాలేదు. ఒంటరిగా తనే దాడి చెయ్యాలనుకున్నడు. అందుకు ప్లానును తయారుచేసుకున్నడు.

✷✷✷

ఇప్పలపెల్లి తండాలో పొద్దుగూకుతుంది. సొమ్లా నాయక్ పొద్దుకు చేతును అడ్డంబెట్టి చుట్టూ చూసిండు. చెట్ల ఆకులు రాలినట్టు చుట్టూ గుట్టలన్నీ బోడబోడగున్నాయి. ఎక్కడా పచ్చటి చెట్టులేదు.

జేబులో ఉన్న సెల్లు మోగితే తీసి ఎత్తిండు సొమ్లా.

"ఏమ్రా... సెల్లు కొనిచ్చింది ఇంట్ల కొయ్యకు తలిగెయ్యమనా...? ఎత్తుతలవేందిరా..." బయట నుండి గద్దింపు.

"కాలువకు పోయిన బాపూ... అప్పుడు మోగిందేమో... ఇనరాలేదు...." అన్నడు.

"రేపు పొద్దు పొడిచేవరకు మాలు నా దగ్గరుండాలె... అందరికి జెప్పు" అన్నడు బయట నుంచి.

"ఆ... అందరు తయారు మీదనే ఉన్నరు బాపూ... ఇయ్యల్ల రాత్రికే అందరి బట్టీలు దిగుతయి. తెల్లారకముందే మాలు ఇంట్లుంటది" సొమ్లా అన్నడు భయంగనే.

బయటి కంఠంల ఎచ్చరిక.

"అరేయ్.. కొత్త పోలీసచ్చిండు. జాగర్త. దొరికినా నా పేరు జెప్పద్దు. మీరు లోపల వడితే నేను ఇడిపిత్త. నేనే లోపల వడితే ఎవలు దిక్కులేరు" అన్నడు.

"ఆ.......... బాపూ... ఎంత ముచ్చట..." నవ్వుతూ.... "మీరు గది చెప్పాలెనా.... మాకు తెలువదా... ఎన్నడన్న నోట్లెమాట బయట పడ్డదా...?" అన్నడు సొమ్లా.

ఫోన్ కట్ అయింది.

తండాలో ఇరువై ఇండ్లున్నయి. మాలు ముచ్చట అందరి చెవుల ఏసిండు సోమ్లా. అందరూ కట్టెలు జమ చేసుకుంటున్నరు. కొందరు కుండలతో నీళ్ళు మోత్తున్నరు. ఆడోళ్ళ ఎసరుకు తయారుజేత్తున్నరు. ఎప్పుడు మనుకు వడుతుందా అని ఎదురు సూత్తున్నరు. చీకటి పూట సారా బెట్టున దిగుతది.

గట్టు కాలువ నుంచి కుండతో నీళ్ళను తెస్తున్న సొమ్లా పిల్ల తొవ్వపొంట వస్తున్న మనిషిని చూసి కాలు ఆపిండు. మసక వెలుగులో మనిషి కనిపించలేదు. మరింత దగ్గరగా వచ్చేదాక చూసిండు.

మనిషి దుమ్ముగొట్టుకపోయిండు. చేతుల పాత లూనా ఉంది. పాడైనట్టుంది. నూక్కుంట వత్తుండు. దమ్ము ఎగపోత్తండు. సొమ్లాను చూసి ఆగిండు.

"ర్మామాం బియా... మానాల తండాకిత్లా సుపూర్' అడిగిండు. గొంతులో తడారిపోయినట్టుంది. మాట పెకుల లేదు.

సొమ్లా విచిత్రంగా చూసి, "బొగుత్ సుపూర్.... ఉదర్ క్యం..." అడిగిండు.

"మేర్ బయి ఉదురిచ్.... ఈ బండి కరబయింది. నూక్కుంట వస్తన్న." అన్నడు.

సొమ్లా ఇంకొంత ముందుకు నడిచి "ఇంత చీకటి పూట పోలెవ్వు, నడుచుకుంట పోతే నీకు తెల్లారుతది" అన్నడు.

అతడు కొంత దిగులుగా చూసి విరక్తిగా "ఏం జెద్దాం... నా కర్మగిట్లుంది. మెల్లగ మెల్లగ నడుత్త. తొవ్వంపాట తాగుడుకు నీళ్ళన్న దొరుకుతయా..." అడిగిండు.

అతనిని పరీక్షవట్టి చూసిండు సొమ్లా... అనుమానమైతే రాలేదు గనీ భయమయింది.

సొమ్లా బయాన్ని గుర్తుపట్టిండతడు.

"నాయక్... మాది ప్యాట... అక్కడ దుకాణముంది. మానాల తండల సేటు లేడా?... మా బావనే... రంగయసేటు కొడుకు. మొన్న లగ్గమయింది సూడు..." అన్నడు.

సొమ్లాకు కొద్దిగా భయం తగ్గింది. అయినా అనుమానం తీరలేదు.

"సేటూ... ఇట్ల చీకటి వడ్డది మరి...?" అడిగాడు.

"నాయక్... మాకు నలుగురు అక్కలు. మేమిద్దరం అన్నదమ్ములం. పండుగ పండక్కూ వాళ్ళకు వైనం పంపాలెగదా...? అందుకని చెరో ఇద్దరిని పంచుకున్నం. వచ్చేది బతుకమ్మ పండుగు కదా! వైనం తీసుకుపోతున్న. చేతుల బండి ఉంది కదా అని లేటుగ ఎల్లిన"

అన్నడు.

సొమ్లా మనసు కుదుటపడ్డది.

ఆడవిల్లకు వైనం పయిలంగ అందియ్యాలె సేటు.... అమాస చీకటి ఎటుపోతవు. తొవ్వల ఇప్పచెట్లు ఇరుగ గాసినయి. గుడ్డేలుగులు కావలి గాత్తయి" అన్నడు.

చీకట్లో కూడా అతడు భయంతో వణికిపోవడం కనిపించింది సొమ్లాకి. కోమటి పిరికి అనుకున్నడు నవ్వుకుంట.

"నాయక్.. పెద్ద గుట్ట ఎక్కేటప్పుడే ఇది పేలయింది. ఎవలనో అడిగితే గుట్ట కిందనే అన్నడు. అందుకే ధైర్నంగ వచ్చిన ఇప్పుడెట్ల...?" అన్నడు భయంగా.

భుజం మీదున్న ఖాళీ కుండను చేతుల పట్టుకుంటూ "ఏంటిదెట్లా... ఎనుక కన్నపో... ముందుకన్నా పో... మొఖం తెలువని నీకు ఎవలు ఉండనియ్యరు" అన్నడు సొమ్లా.

సేటు ఊసురుమన్నడు.

"ఎట్లగతి... ఎనకకు ఎట్లవోతు రేపు వైనం ముట్టాలె. ఏమన్నగాని... సచ్చిపోతనా.."

ముందుకు కదిలిండు.

తండ్రిని పిలుస్తూ భూలీ కేక వినిపించింది. పిలుపుకు తేరుకుని ముందుకు కదిలిండు సొమ్లు. సేటు నడక మొదలు వెట్టిండు. లూనా క్రిరుక్రిరుమంది. ఆపి రెండు కిక్కులు కొట్టిండు. గుర్రుమని ఎగదన్నింది. బూతు మాటతో నూకుడు మొదలు వెట్టిండు సేటు.

అప్పటికి చీకటి దట్టంగా కమ్ముకుంది. అడివిల జంతువుల కదలిక మొదలయింది. సొమ్లాకి మనసు కరిగింది. ఎనక్కి తిరిగి "ఓ సేటు.. ఏ మురుకుతవు... ఆగు..... రాత్రికి నాతో ఉండు. పొద్దున్న పోదువు తియ్యి" అన్నడూ.

నీళ్ళ కుండతో సొమ్లా, లూనాతో సేటు - ఇద్దరూ తండా తొవ్వ ఎక్కిండ్రు. కొత్త మనిషిని చూసి మొరగబోతున్న కుక్కలు సొమ్లాను చూసి ఆగిపోయినయి.

ఒకరిద్దరు సేటును వట్టి వట్టి చూసిండ్రు. మిగిలిన వాళ్ళు పట్టించుకోలేదు. యుద్ధానికి తయారవుతున్నట్టు ఎవల పనుల్లో వాళ్ళున్నరు. ఇండ్లల్లో కరంటు బుగ్గలు ఎలుగుతున్నయి.

సొమ్లా గుడిసె ముందు ఆగిండు. సేటు బండి స్టాండు ఏసి బట్టలు దులుపుకున్నడు. నానిన బెల్లం వాసన ఇప్పపూల వాసన గుప్పుమంది. దూరంగా అటొకటి ఇటొకటి పొయ్యిలు మండుతున్నయి. ఆడోళ్ళు ఇంట్లకు బయటకు కందిరీగల లెక్క తిరుగుతున్నరు.

"ఆ మంటలెందుకు నాయక్..." - తెలిసినా అడిగిండు సేటు.

నీళ్ళ కుండను కింద దించుతూ, "సారా బట్టీలు సేటు... మా సావైనా బతుకైనా అదే కదా!" అన్నడు.

సేటుకు నిలువెల్లా జలజలమంది. రోమాలు నిక్కబొడుసుకున్నయి. ఒరేయ్ నవీన్... నీ రొట్టె ఇరిగి నెయ్యిల వడ్డదిరా' అనుకున్నడు. సెల్ తీసి చూసుకున్నడు సిగ్నల్ ఉంది. ఎస్సైలిద్దరిని సివిల్ స్టాఫ్‌ను రమ్మందామా అనిపించింది. కానీ మానుకున్నడు. ఊరు నిండా కుక్కలున్నయి. వాళ్ళు గుట్ట ఎక్కక ముందే అవి మొరుగుతయి. ఇక్కడికి వచ్చేసరికే వీళ్ళు కుండా పొయ్యి మాయం జేత్తరు. సారా దిగివంక రెడ్ హాండ్‌గా పట్టుకోవాలనుకున్నడు.

"సేటూ... లోపలికి రా.... బీరిపోతివి...."

సొమ్లా మాటలకు ఉలిక్కిపడ్డడు.

ఇంట్లోంచి వచ్చిన భూలీ సేటును విచిత్రంగా చూసింది.

చెప్పులు ఇడిసి సేటు ఇంట్లకు నడచిండు.

"మీకు సారనే పడది గదా! ఈ వాసన ఇంకా పడది. గంట రెండు గంటలైతే అలవాటైతది" అన్నడు సొమ్లా.

"సొమ్లా బియా.... కౌనరే.." - పక్క గుడిసెలోంచి కేక.

"మెరా... దోస్తో..." కేకలేసి చెప్పి చాపపరిచిండు సొమ్లా.

భూలీ ఏదో గుసగుసలాడింది. సొమ్లా నవ్వుతూ ఏదో చెప్పిండు. అదీ నవ్వింది. నులక మంచంలోంచి ఆడి మనిషి మూలుగు వినిపిస్తంది. సేటు పైంటును ఎగబెక్కుకుని చాపల కూసున్నడు.

సొమ్లా బయటకు వచ్చి అందరికి ఏదేదో చెబుతుండు.

సేటుకు అనుమానమొచ్చింది. తనను గానీ గుర్తుపట్టి వాళ్ళకు చెప్పడం లేదు కదా అనుకున్నడు. అదే జరిగితే తన శ్రమంతా నీళ్ళల్ల పోసినట్టే! అందుకే బయటకు వచ్చి విన్నడు.

భాష కొంత కొంతనైనా అర్థమైతంది. తన అనుమానం నిజంగాదని తెలిసినంక మనసు తేలిక పడ్డది. వచ్చి కూసున్నడు సేటు.

సొమ్లా ఇంట్లోకి వస్తూ, "కాళ్ళు కడుక్కోండి సేటు. రొట్టె తిందాం... మా ఇంట్ల ఇయ్యాల్ల మీ భోజనమే" అన్నడు.

సేటుకు తినాలని లేదు. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అన్నట్టే ఉంది "వద్దు" అన్నడు.

సొమ్లా ఒప్పుకోలేదు.

"మీ లెక్కనే మాకూ కొన్ని పద్ధతులుంటాయి సేటూ.. పగవారైనా సరే! మా ఇంటికొచ్చి ఉపాసముండుడుకు వీలులేదు. వాళ్ళు తినేదాకా మేము పచ్చి మంచినీళ్ళు ముట్టం" అన్నడు.

తప్పదన్నట్లు లేచి కాళ్ళు కడుక్కుని కూసున్నడు సేటు. పక్కన సొమ్లా కూసున్నడు. ఎసరు మరుగుతున్నట్టుంది. సారా వాసన కొత్తగా వస్తుంది. "అందరి ఎసరు మరుగుతుంది. నువ్వు ఇంకెప్పుడు ఎక్కత్తవు" - మంచంలోంచి బలహీనమైన గొంతు.

సొమ్లా సమాధానం చెప్పలేదు. రొట్టెలు తెచ్చిన భూలీని చూపిస్తూ "నా బిడ్డనే సేటు. చిన్నది" అన్నడు.

రొట్టెను అందుకుంటూ చూసిండు సేటు. పాలు పసుపు కలిపిన రంగుతో నిండుగా అమాయకంగా ఉంది భూలీ. నుదురు మీద గదువ మీద పచ్చబొట్టు లైటు వెలుగులో మెరుస్తుంది.

అంచుకు పప్పు పచ్చిమిరపకాయల కారం. కొత్త రుచిగా ఉంది సేటుకు. తోడు ఆకలి. వద్దంటూనే మూడు రొట్టెలు నమిలిండు. తింటుంటే ఎన్నో ఆలోచనలు వచ్చినయి. వాళ్ళ బట్టీలను సారా దాచేచోటును, ఇప్పపువ్వు బెల్లం నిలువలను చూడాలనుకున్నడు.

"నాయక్. నువ్వు ఏమనుకోనంటే సారెట్ల చేత్తరో నేనూ సూత్త" అన్నడు సేటు లేస్తూ.

"దానిదేముంది సేటు. పోదాంపా. ఎవలన్నా ఎక్సైజ్ వాళ్ళొస్తే మేము ఉరుకుతం. నువ్వు జాగ్రత్తగా తప్పించుకోవాలె మరి" చెయ్యి కడుక్కుంటూ అన్నడు సొమ్లా.

సేటుకు నవ్వొచ్చింది. ' నా సంగతి రేపు జెప్పత' అనుకున్నడు. పైకి మాత్రం 'సరే... దానిదేముంది మీతోని నేను. అయినా ఈ జంగల్ల ఇంత రాత్రి ఎవలత్తరు..." అన్నడు.

సొమ్లా నవ్విండు. ఆ నవ్వుల గూడా బాధ ఉంది. అదే గొంతుతో -

"ఎందుకురారు బాబూ... ఏ ఆఫీసరు గారి అమ్మగారో మునిమాపు నిద్రల ఏ నగనో గిగనో కలగన్నదనుకో .... అద్దగంటల ఇక్కడుంటరు. తెల్లరేవరకు ఆ కల నిజం చెయ్యాలె గదా!" అన్నడు.

ఇద్దరూ బట్టీ దిక్కు నడిచిండ్రు. ఎంటకుండెత్తుకుని భూలీ నడిచింది. సేటు భూలీని చూస్తున్నడు. మోకాళ్ళ పైకి లంగ, పైట లేని అద్దాల రైక, చీకట్లో కూడా వంపు సొంపులు అనపడుతున్నయి. అరగంట నడిత్తేగాని బట్టీ తావు రాలేదు.

గుట్ట చాటను ఉంది తావు. మంట గూడా కనిపించదు. అక్కడ కాగుల నిండా నీళ్ళున్నయి. ఏదో నానబెట్టిన మురుగు వాసన. భూలీ చకచక మూడు పొయిలు వెలిగించింది. మూడు పెద్ద పెద్ద కడువలను పొయ్యి మీద పెట్టింది. మంటను ఎగేసింది. కుండల్లో ఎసరు పోసింది.

ఆ కుండలను చూస్తే సేటుకు కండులు తిరిగినయి. వాటి సైజును బట్టే ఎంత సారదిగుతదో అంచనా వేసుకుంటేనే భయమయింది. మంట వెలుతురులో అందమైన భూలీ భూతంలా కనిపించింది. సొమ్లా నక్క జిత్తుల మనిషిగా కనిపించిండు. ఇంత పెద్ద మొత్తమ్లు తయారు జేత్తండంటే ఏదో పెద్ద రాకెటే ఉందనుకున్నడు. ఆ రాకెట్ మొత్తం పట్టుకోవాలన్న తెగింపు వచ్చింది. మంచి మాటలతో సొమ్లా దగ్గర సమాచారం రాబట్టాలనుకుని మాటలకు దింపిండు.

"ఇంకా ఇది చిన్న బట్టీ సేటు... పెద్ద బట్టి ఇంకో చోటుంది. వారానికొక్కసారి బట్టీ దింపుత. ఇంకా వాళ్ళ కుండలను సూత్తే చిత్రపడుదువు. అందరం ఒక్క జాగల వెట్టం. గుట్ట కొగలు చెట్టు కొగలు పెడుతం. అదీ తండాకు దూరంల పెడతం. ఎవలన్న దాడీ చేసింద్రనుకో ఇంటికి పరుగుదీత్తం. రావాయుండది సాబూతండది..." సొమ్లా చెప్పిండు.

సేటు నవ్వుకున్నడు. 'ఈ కతలన్నీ తెలుసురా బాపూ.. సాక్ష్యముండక యాడి కేసు అయితనే గదరా..నేను ఆగుతున్నది. లేకుంటే ఇప్పటికిప్పుడు లోపలేసి తన్నక పోదుంటినీ?' అనుకున్నడు.

ఏమీ పట్టనట్టు భూలీ తన పని తాను చేసుకుంటుంది. ఎసరు మసిలే యాల్లన కుండల మీద తొట్టి వెట్టింద్రు. తొట్లకు చెక్క సలుప పెట్టింద్రు. గిన్నెల నీళ్ళు నింపింద్రు. సలుప మొనకు పైపును తొడిగింద్రు. మూతుల చుట్టూ ఆవిరి బయటకు రాకుండా బట్ట చుట్టింద్రు. బట్టను బంకమన్నుతో మెత్తింద్రు. మాట ముచ్చట లేకుండ తండ్రీ బిడ్డలిద్దరు ఎవల పని వాళ్ళు చేసుకుపోతండ్రు. మూతిని మెత్తినంక కొంత తీరిక దొరికినట్టయింది సొమ్లాకి.

"నాయక్... ఇంత సార ఎక్కడ అమ్ముతవు. వారానికోసారంటే నెలకు ఎంత సంపాయిస్తవు...?" అడిగిండు సేటు.

పొదల నుంచి కుందేలు ఒకటి పొయ్యి ముందుకు పరుగెత్తుకు వచ్చి ఆగింది. ఏదో చెప్పబోతూ సొమ్లా మాటలను ఆపేసిండు. 'అయ్యో... మన పని ఐనట్టే' అన్నడు. భూలీ కట్టెను అందుకని కుందేలును కొట్టబోయింది. సొమ్లా బిడ్డను ఆపి కుందేలును అదిలిస్తూ "ఏదో అపశకునమైంది సేటు. కుందేలు కనవడితే మంచిది కాదు" అన్నడు.

సేటుకు నవ్వొచ్చింది. 'నీకు మూడింది. నేనే నీ అపశకునం. కనీసం యాడాదన్నా లోపలికి తోలుత' అనుకుని తన ప్రశ్నను మళ్ళీ అడిగిండు.

కుందేలు కనపడ్డందుకో ఏమో భూలీ గొణుక్కుంటుంది.

మంటను ఎగేన్తూ "సంపాదన యాడుంది సేటు... సంసారం ఎల్లితే సాలనుకుంటం. ఇంట్ల ఆడిమనిషి ఉన్నది చూసినవ్... సార వండీ వండీ ఈ వాసనకే బీమారచ్చి పన్నది. ఇయ్యల్లనో రేపో అన్నట్టుంది. ఇక నా సంగతి.... ఆకలైనా దూపైనా సారనేగదా... కార్యం కరిగిపోయింది సేటూ.... మేమి ఎమన్నగానీ గనీ... జానెడు పొల్ల ఉంది గదా! దాన్ని ఒక అయ్య చేతుల పెట్టాలని చూత్తన్న" అన్నడు.

సేటుకు ఏవగింపు అనిపించింది. కోపాన్ని అనుచుకుంటూ. "సరే... ఇన్ని కష్టాలు పడి ఇదెందుకయ్యా తయారు జేసుడు. ఇది ఎందరి కొంపలు ముంచుతుందో తెలుసుగదా! ఏదన్నా పనిజేసుకుని బతకచ్చుగదా!" అన్నడు మాట వరుసకు.

సొమ్లా సేటును బాధగా చూసిండు. చూసి "అదో కత సేటు... అంత ఒందరగ నెత్తికెక్కింది. ఎక్కినా జీర్ణం కాదు. ఎవలకు మాత్రం మంచిగ బతుకద్దని ఉండది చెప్పు. మా తాత అడివిని నమ్ముకుని బతికిండు. మా నాయన ఇక్కడి వాగును నమ్ముకుని బతికిండు. నాకిప్పుడు ఆ రెండూ లెవ్వు.." అన్నడు.

ఎసరు సలపెల మసులుతుంది. సొమ్లా మంట పెడుతుండు. భూలీ యాష్ట పడుతు మంటను మోతాదులో ఉంచుంతుంది. నిమిష నిమిషానికి పై గిన్నెలో నీళ్ళు మారుస్తుంది. మెరుపులా కదులుతుంది. ఆమె నైపుణ్యాన్ని చూస్తే సేటుకు ముచ్చటేస్తుంది. సైగలు గుసగుసలతో తప్ప గొంతెత్తుత లేదు.

'ఎంత రహస్యంగా చేస్తుందది. దొంగ సారలో రాటు దేలింది' అనుకున్నడు.

మాటలు బట్టీల దిక్కు మరిలనయి..

"ఆ నడుమల బట్టీ ఉంది సూడూ అది పండ్ల సారా.... నీ అసొంటి ఆసామి ద్రాక్ష పండ్ల సారా ఇంట్లకు కావాలన్న అండ్ల పటికె వెయ్యం. చెక్కెరి నీళ్ళే. తియ్యగుంటది. ఈ చివర ఉంది సూడు... ఇప్పపూలది. అడ్డికి పావుశేరు ఎప్పపువ్వు కొనక్కచ్చిన. ఇంకోటేమో బెల్లం సారా... వారం నానవెట్టి పటికె ఏసిన. సుక్క గొంతుల వడ్డదనుకో... సుక్కలు కనవడుతయి" చెప్పిండు సోమ్లా.

"సరే... ఎంత సంపాయిస్తవు..." అడిగిండు సేటు.

"ఎంతేమిటి సేటు... అంతా మేనతే! ద్రాక్షసార కేసులు కాకుంట చూసే పటేలుకే! పైసలడిగితే బతుకం. ఇప్పపూలది జీరోమాలే! ఇచ్చినంత తీసుకోవాలె. బెల్లంది నాకు. కొంత ఊర్లె అమ్ముత. అది గూడా ఇచ్చిన్నాడు ఇచ్చినంత తీసుకోవాలె. ఎప్పుడన్నా ఇంతేనా అంతేనా అన్నమనుకో. తెల్లారో మరునాడో పోలీసులు దిగి పట్టుకపోతరు. ఇడిపిచ్చుడుకు వాళ్ళ కాల్లే మొక్కాలె" సోమ్లా గొంతు మారిపోయింది. నిండా బాధ.

అయినా సోమ్లా ఆగలేదు.

"మొదట్లో నేనూ అనుకున్నాను సేటూ... జానెడు పొట్టకు ఈ పని జేసుడా అని - కాని తప్పలేదు. ఇండ్ల నుంచి బయట పడుదామనుకుంటనే అలవాటు పడిపోయిన. నేను చెయ్య అన్ననసుకో. రేపే నా మీద కేసయితది. చేస్తనే ఇడిపిత్తమని వీళ్ళంటరు.." - గొంతులో బాధను మింగుకోలేక ఆగిపోయిండు.

సేటు నవ్వుకున్నడు!

'వీడు ఉత్తోడు గాడు. మహా తెలివైనోడు. తప్పు చేసి గూడా తనది తప్పుగాదని ఎట్ల చెప్పుతుండో... బండలను కరుగదీత్తరు గాడిది కొడుకులు' అనుకున్నడు.

బట్టీ మీద గొట్టాల నుంచి సన్నటి దార మొదల్యింది. మంట వెలుతురుకు దార మెరుస్తుంది. ఎంటనే భూలీ ఏదో గుస గుసగా అంటూ గొట్టాల ముందు సీసాలను ఉంచింది. రెండూ పొయిలను తను చూసుకుంటూ ఒకటి తండ్రికిచ్చింది. మూడు పొయిల మంటను తగ్గించింది. గిన్నెలల్ల నీళ్ళను మార్చింది.

పొయ్యి ముందు చిన్నవోయి కూసున్నడు సొమ్లా. చేతులు మాత్రం యంత్రాల లెక్కన కదులుతున్నయి. సార దార సాగుడుతోనే వాసన మరింత ఎక్కువయింది. పొద్దు ఎంతయిందో తెలువలేదు సేటుకు. తయారైన బట్టీలను పలుగొట్టుడే తప్ప తయారులో ఇంత కష్టం ఇన్ని మెలుకువలుంటయని తెలువది.

సొమ్లాని మాటలు దింపి తీగెను లాగుతాననుకున్నడు. సొమ్లా కప్పి కప్పి మాట్లాడిండు. ఒక మాటకు మాత్రం గట్టిగా "సారతోనే కొంపలు కూలుతలెవ్వు సేటు... కొంపలు కూలెటి పనులు పెద్దోల్లు చేసేటివి ఎన్నో ఉన్నాయి దీన్ని తయారు చేసి మాత్రం మేము కొంపలు నిలువెట్టుకుంటున్నామా..." బందంటే మొత్తం బందె జెయ్యాలె... సుక్క కనపడితే బొక్కల తొయ్యాలె. అప్పుడు నా కొడుకులు మాతో ఆడుకోరు. తయారు జెయ్యమని మా దగ్గరికి రారు" - ఈసారి ఆవేశంతో గొంతు ఆగిపోయింది.

భూలీకి ఇష్టం లేనట్టుంది. ఏదీ చెప్పద్దన్నట్టు కళ్ళతో సైగలతో చెబుతుంది. సొమ్లా గ్రహించి కూడా మాట్లాడుతుండు. ఏదో గుండె బరువు దిగినట్టు అనిపిస్తుంది. బాధను ఆక్రోశాన్ని ఎల్లగక్కుతుండు. భూలీ కోపంగా కట్టెలను ఎగదోస్తుంది.

మాటల్లో పడి మంటను చూసుకోలేదు సొమ్లా. సార ధార ఎట్లెట్ల పెరిగితే మంటను అట్లట్ల తగ్గించాలె. పైన నీళ్ళను గూడా మార్చాలె. మంట పెరిగింది. ముసులుడు పెరిగింది. ఆవిరికి పైన నీళ్ళు కూడా వేడెక్కినయి. సెకన్లంటే సెకన్ల మీదనే నిర్లక్ష్యం. కన్ను మూసి తెరిసినంతసేపే!

అంతే! ఎసరు బుస్సుమని పొంగింది. పొంగిన ఎసరు గొట్టం నుంచి సీసల కచ్చికలిసింది. సేసి రంగే మారింది.

భూలీ మొత్తుకుంటూ పరుగెత్తుకు వచ్చింది. అప్పటికే సీస రంగు మారిపోయింది. సొమ్లా గుండె జల్లుమంది. మంట మీద నీళ్ళు సల్లిండు. పైపును గుంజిండు. లాభం లేదు. సేస నిండే ముందు సీసెడు సార పనికి రాకుండా పోయింది.

సొమ్లాకు సల్ల చెమటలు పుట్టినయి. భూలో పక్కన పలిగి ఏడ్చింది. ఏడుస్తూనే రెండు బట్టీల మోతాదు చూస్తుంది. నీళ్ళను, మంటను, సీసలను మారుస్తుంది.

సేటుకు ఏదో బాధ గుండెను వడితిప్పింది. అరే అనుకున్నడు.

సొమ్లా బాధగా "సేటూ సూసినవా.... వారం రోజుల కట్టం అగ్గిల గలిపె. ఇది ఎందుకు పనికి రాదు. ఇది దిగలేదని వానికి చెప్పినా నమ్మడు. మాకెందుకు దెత్తవురా అని మీసాలు తీడుతడు. ముచ్చట్ల వడిమురిసిపోతి" అన్నడు పొయ్యిల నీళ్ళు పోసి సల్లార్చిండు.

సేటుకు ఆ మాటలు నెత్తికెక్కుతలెవ్వు. టైం చూసుకున్నడు. ఒక్కటి దాటింది. రేపు దాడి చెయ్యడానికి ఆ పరిసరాలను గుర్తుపెట్టుకుంటున్నడు. ఎక్కడెక్కడ మంటలున్నయి చూస్తుండు.

భూలీ ఎక్కెక్కిపడి ఏడుత్తంది. సొమ్లా సముదాయిస్తుండు. అది రాగం దీత్తంది. అయినా పొయ్యిని మరువడం లేదు. దాని ఏడ్పును చూస్తుంటే బాధనిపించింది సేటుకు. తండ్రిది తప్పుగనీ ఆ పిల్లదేం తప్పు. గాడిద కొడుకు దానితోని సారా చేయిస్తాడు. తండాలల్ల ఎక్కడ సుక్క సార కాగకపోవాలె... తెల్లారని' అనుకుని "భూలీ" అని పిలిచిండు.

చూడలేదు. మరోసారి పిలిచిండు. చూసిందిగనీ మాట్లాడలేదు. ఇంకోసారి పిలిచిండు. గుడ్లల్ల నీళ్ళు గుక్కుకుంది. మూతి ముడుసుకుని మొఖం తిప్పుకుంది.

సొమ్లానే గొంతు పెకిలించుకుని 'ఏంటి సేటు... ఏం గావాలె' అన్నడు.

'దీనికి ఇంత పొగరా...?' అనుకున్న సేటు మాట మార్చి "మంచినీళ్ళు" అన్నడు.

సొమ్లా  చెంబు నిండ మంచినీళ్ళు తెచ్చిండు.

సేటుకి నిద్ర వస్తుంది. దూరంగా వెళ్లి కూర్చున్నడు. పండుకుంటే ఎక్కడ మాయం చేస్తరో, ఏం చేస్తరో అని భయం. దూరంగా నడిచి చుట్టూ చూసిండు. కాగుతున్న బట్టీల మంట తగ్గి అక్కడక్కడ గుడ్డిగా కనిపిస్తున్నాయి.

"కొడుకులు ఎంత భయం లేకుంట ఎట్ల చేస్తుండ్రు సూడు... తెల్లారని' - ఇంకోసారి పండ్లు కొరికి సెల్ తీసిండు. ఎస్సైలకు ఫోన్ చేసి అలర్ట్ చేసిండు. ఎక్కడ మాటుగాయాలో చెప్పిండు. తను ఏ రూటులో వచ్చేది చెప్పిండు. చెట్టు కిందికి వచ్చి కూసున్నడు. తెలువకుంటనే కునుకు పట్టింది.

సొమ్లా ఇంటికచ్చి పాత స్కూటర్ బయటకు తీసిండు. తీస్తూ "దీన్ని అప్కారోళ్ళు నాలుగుసార్లు వేలం పెట్టిండ్రు. దర పెచి నేనే కొన్న" అన్నడు. అంటూ "ఎట్లాగూ మీ బండి నడువది. అంత దూరం నడిచి పోలేరు. నాతో చౌరస్తకు రా... అక్కడ మెకానికుంటడు. వచ్చి మంచిగ చేస్తడు" అన్నడు.

సేటు 'నా పని మరింత తేలిక చేస్తున్నవురా... చౌరస్తలనే నీ కోసం కావలుండుమన్న...' అనుకుని బండి ఎక్కిండు.

భూలీ రెండూ సంచులను కాళ్ళదగ్గర ఏసింది. ఆమె కనుకొలుకుల్లో ఇంకా తడి ఉంది. మొఖం నిండా భయం, బుగులు, నిద్రలేక కండ్లు ఉబ్బినయి.

స్కూటర్ బయలుదేరింది. కొంత దూరం పోయినంక 'బాపూ' అని పిలిచిండు సొమ్లా. ఆ పిలుపు కొత్తగా ఉంది.

"పుండున్న దగ్గరనే ముందు పెట్టలె. గండి వడ్డ దగ్గరనే కట్టమొత్తాలె. ఈ తాగుడు మొత్తానికే బందు చేస్తే మొదాలు కుషీ చేసుకునేది మేము బాబు... రాత్రి మా భూలీ మీద కోపమొచ్చింది గదూ... అది మాట్లాడలేదు బాబూ..." అన్నడు.




స్కూటరు ఆగిపోయింది.

సొమ్లా చెప్పుతనే ఉన్నడు....

"ఒకసారి కేసుల ఇరుక్కున్నప్పుడు నన్ను ఇడిపిస్తనని ఒండు దాన్ని బలిమి చేసిండు బాబూ... అప్పుడే దాని గొంతు పడిపోయింది..." - సొమ్లా కండ్ల నీళ్ళు.

"అదంతా నాకెందుకు చెబుతున్నవు. నన్ను చౌరస్తల దించు పోవాలె" ఆదుర్దాగా అన్నడు సేటు.

కండ్లు తుడుచుకుంటూ "ఎక్సైజు స్టేషన్ ఇటు నుంచి వెళితే దగ్గరగా ఉంటుంది. బాబూ" అన్నడు పక్క దారిని చూపిస్తూ సొమ్లా.

నవీన్ తలగ్గిరున తిరిగింది.

"నీకు తెలుసా?" అన్నడు నోరు తెరిచి.

"మీరు సేటు కాదని అబద్దమాడుతున్నరని తెలుసు బాబూ.... ఈ అనుభవమల ఎందరిని చూడలేదు" అన్నడు వైరాగ్యంతో సొమ్లా.

నవీన్ తికమక పడ్డడు. ఏదో అడుగబోతుంటే "తెలుసు బాబు. అన్నీ తెలిసే ఎంట తిప్పుకున్న. నేను కాదన్ననుకో... మీరు మాత్రం పోదురా... ఏ రాత్రో తండాలకు వత్తురు. మా కుక్కలు మిమ్మల్ని పట్టిత్తుండె మా మనసులు తెల్లారెవరకు బొక్కల మిగలకుంట మాయం జేత్తరు. కనీసం నా గుడిసెలోనన్నా పడుకోమందుంటిని. మీరు పడకుందురా... ఎవని తావురం ఎక్కడుందా అని సాటు సాటుకు వెదుకుదురు. అప్పుడన్నా పట్టుకుని సంపుదురు. నాకు తెలిసిన మనిషి అని మాతో కలివిడిగా తిరుగట్ల సరిపోయింది గనీ మీరెవరో నాకు తెలువదన్న సంగతి చీమ కాలంత బయటకు పొక్కినా..." చెప్పడం ఆపి నవీన్‌ను చూసిండు సొమ్లా... చూస్తూ "...రాకూడదని ట్రైమ్ల వచ్చిండు బాబూ" అన్నడు.

నవీన్ కాళ్ళ కింది భూమి కదులుతుంది.

బండి స్టాండు వేస్తూ "ఇప్పుడు మిమ్మల్ని ఎవ్వలూ ఏం చెయ్యలేరు బాబూ... నన్ను పట్టుకోవచ్చు.." అన్నడు సొమ్లా.

✷✷✷




## ఏప్రిల్ ౨౦౦౯

ఏప్రిల్ నెలలో విడుదలయిన వారపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్య మాసపత్రికలు, ఆంధ్రభూమి, స్వాతి, విపుల, రచన, దినపత్రికలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 93 కథలలోంచి, ఈ నెల కథాసాగర మథనంలో కౌముది పాఠకుల పరిచయానికి ఈ క్రింది కథలను ఎంచుకున్నాను.

ఈనెల మంచి కథలు కొన్ని ఉన్నాయి. కానీ చదవగానే మనసును కదిలించి, మెదడులో ఆలోచనల తుఫాను రేకెత్తించగల కథలు లేవు. అందుకే ఉన్నవాటిలోంచి కాస్త భిన్నంగా, చదివించేరీతిలో, జీవితంలోని మామూలు అంశాలనే సరికొత్త కోణంలో ప్రదర్శించాలని ప్రయత్నించిన కథలను పరిచయానికి ఎంచుకున్నాను.

***<u>జీవితం</u>***

ఆకునూరి మురళీ కృష్ణ రచించిన ఈ కథ ఏప్రిల్ 17 స్వాతి వార పత్రికలో ప్రచురితమయింది. ఈ కథలో రచయిత మానవ మనస్తత్వంలోని ఒక సున్నితమైన బలహీనతను చక్కగా ప్రదర్శించారు. ముగింపు దగ్గరకు వచ్చేసరికి రొటీన్ అయిపోయినా రచయిత కథను నడిపినతీరు, పాత్ర వ్యక్తిత్వం ఎక్కడా పలచబడకుండా చూపిన తీరు ప్రశంసనీయం. చంద్రశేఖర్ అనే వ్యక్తికి జాతకాల మీద నమ్మకం ఉండదు. కానీ ఓ జ్యోతిష్కుడు మరణగండం ఉందనీ, దైవ ప్రార్థన తప్ప మరేమీ అతనిని ఆ గండం నుంచి కాపాడలేదనీ చెపుతాడు. అతడి మాటలను నమ్మడు. కానీ ఆ మాటల ప్రభావం అతనిపై ఉంటుంది. పూజలు చేయడు కానీ, ఒకసారి మెడికల్ చెకప్ చేయించుకుంటాడు. "నేను మరణిస్తానేమోనని భయపడుతూ కూర్చోవడం కన్నా మరణించినా ఫరవాలేదన్న ధైర్యాన్ని సంపాదించుకోవడం ద్వారా ఆ భయాన్ని మననుండి దూరంగా పోగొట్టుకుని ప్రశాంతగా జీవించవచ్చు అని గ్రహిస్తాడు. తన వ్యవహారాలు పద్ధతిలో పెడతాడు. ఇంట్లో వారితో హాయిగా గడుపుతాడు. పిల్లలతో పిక్నిక్ కు వెళతాడు. "జీవితం సప్త వర్ణ శోభితం. అది గ్రహించకుండా కేవలం తమని ఆకర్షించే రెండు మూడు రంగులే, రుచులే జీవితం అనుకుంటూ వెర్రిగా వాటివెంట, పరుగెడుతూ మిగిలిన వాటిలోని అందాన్ని, ఆనందాన్ని కోల్పోతున్నార`ని అర్థం చేసుకుంటాడు. అప్పుడు తెలుస్తుంది, అతడి మిత్రుడు, అతడి పేరున గ్రహశాంతులవీ చేయిస్తాడు. ఇదీ కథ. మంచి పాజిటివ్ ఆలోచనను, ఆరోగ్యమైన దృక్పథాన్ని అందిస్తుందీ కథ.

***<u>రైలుపట్టాలు.</u>***

`సన్నిహిత్` రచించిన ఈ కథ ఆంధ్రభూమి వారపత్రిక ఏప్రిల్ 23 నాటి సంచికలో ప్రచురితమయింది. ఈ కథ ఊహించిన రీతిలో సాగుతూ అనూహ్యమైన రీతిలో పూర్తవుతుంది. కథ చకచకా సాగుతుంది. కానీ కథ పూర్తిగా చదివిన తరువాత కథలో ఎక్కడో

లోపం ఉందనిపిస్తుంది పూర్తిగా చదివాక. కథకుడి భార్య అతడిని వదిలి వెళ్ళిపోతుంది. కెరీర్ పైనే దృష్టి పెట్టిన భర్తని విమర్శించి, కొడుకును అలాగే దగ్గర వదిలి వెళ్ళిపోతుంది. కొడుకు రాహుల్ తండ్రి దగ్గర పెరుగుతుంటాడు. అతడికి కొలీగ్ సుప్రియ దగ్గరవుతుంది. రాహుల్ కూడా సుప్రియతో చనువుగా ఉంటాడు.అతడికి సుప్రియ పట్ల అభిమానం ఏర్పడుతుంది. కానీ ఆమె తనని పెళ్ళిచేసుకోమన్నప్పుడు అతడు తిరస్కరిస్తాడు. ఇదీ కథ. కథలో రచయిత పాత్రల మనస్తత్వాలను, చక్కగా చూపాడు. కానీ 'పెళ్ళి' అనేది ఓ ఊపిరాడని బంధం' అని పెళ్ళిచేసుకోవటం కన్నా ఒంటరిగా ఉండటమే మంచిదన్న నెగిటివ్' ఆలోచననిస్తుందీ కథ చివరికి. అయితే, చివరికి వారిద్దరూ పెళ్ళి చేసుకుంటే ఇది మామూలు కథ అయిఉండేది. దీని కథాసాగర మథనంలో పరిచయం కూడా చేసి ఉండేవాడిని కాదు.

*ఎవడేమిటి నీకు అమ్మింది?*

కాశీభట్ల శశికాంత రచించిన ఈ కథ ఏప్రిల్ 26, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఈ కథ చాలా చక్కగా, హాయిగా, అత్యంత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని, సున్నితమైన ఆలోచనలనూ ప్రదర్శిస్తూ నడుస్తుంది. కానీ కథను ఎలా ముగించాలో అర్థంకాక కాబోలు, రచయిత కథ చివరలో ఓ పెద్ద ఉపన్యాసాన్ని జోడించటంతో కథ దెబ్బతిన్నది. సాధారణంగా కథ ముగింపు ముందు ఊహించి కథను ఆరంభించాలంటారు. ఇందుకు భిన్నంగా కథను ఆరంభించి దాన్నే ముగింపు వరకూ వెళ్ళి పొమ్మంటే కథ ఎలా తయారవుతుందో ఈ కథ చూపిస్తుంది. ఇందులో ఓ వ్యక్తి, ఒంటరివాడు, ఓ ఇంట్లో అద్దెకు వస్తాడు. అలాగే ప్రవర్తన విచిత్రంగా ఉంటుంది. జంతువులకు నీళ్ళు అందిస్తుంటాడు. చీమలకు, పిట్టలకు గింజలు వేస్తుంటాడు. అతడి ప్రవర్తన చూసేవారికి విచిత్రంగా ఉన్నా, దాని వెనుక జీవకారుణ్యం అన్న మంచి ఉద్దేశం ఉంటుంది. ఇక్కడి వరకూ కథ బాగుంటుంది. ఆ తరువాత కథలో చర్చ పెట్టి, చర్చలో సిద్ధాంతాలు జొప్పించటంతో కథ, కథ కాకుండా పోయింది. ఇందుకు భిన్నంగా మంచి సంఘటనలు సృజించి, చక్కని ముగింపు పైన దృష్టి పెట్టి ఉంటే అద్భుతమైన కథ అయి ఉండేది.

*కొత్త బంగారులోకం*

జి. అరుణ రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురితమయింది. ఈ కథ ఒక రకంగా చూస్తే మామూలు కథ. కానీ సాంప్రదాయక పద్ధతులలోని ఔన్నత్యాన్ని, వాటిని పాటిస్తూ బలహీనతలను అధిగమించటాన్ని చక్కటి పాజిటివ్ ధృక్పథంతో ప్రదర్శిస్తుందీ కథ. కథ 'సినిమాటిక్' గా ఉన్నా, రచయిత్రి కథలో ప్రదర్శించిన ధృక్పథం కథ విలువ పెంచుతుంది. 'సుధ'కు నత్తి ఉంటుంది. అందరూ ఏడిపిస్తుంటారు. అవమానిస్తుంటారు. పాప మానసిక వ్యధను గ్రహించిన తాతయ్య సుధను 'పినాకపాణి' దగ్గరకు తీసుకువెళతాడు. 'బాధల్ని రుచి చూపించే భగవంతుడు మధురమైన ఫలాలను కూడా మనకోసం సిద్ధంగా ఉంచుతాడు. ప్రతి సమస్యకూ పరిష్కారం తప్పకుండా ఉంటుంది. ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థాయికి ఎదగాలన్న పట్టుదల, శ్రమపడే ఓపిక, నిరంతరం సాధన ఉంటే నువ్వు త్వరలోనే ఈ బాధ నుండి బయట పడగలవు' అని ఆత్మ విశ్వాసాన్నిచ్చి 'మూక పంచశతి' లోని శ్లోకాలను వల్లెవేయిస్తాడు. ఆశ్చర్యకరము, పాదారవింద శతకము, స్తుతి శతకము, కటాక్ష శతకము, మందస్మిత శతకాలను బోధిస్తాడు. క్రమంగా సుధ తన వైకల్యాన్ని కోల్పోతుంది. గొప్ప వక్త అవుతుంది.

అనౌన్సర్‌గా మంచి పేరు సంపాదిస్తుంది. ఇదీ కథ. చక్కటి ఆలోచనను అతి చక్కగా ప్రదర్శిస్తుందీ కథ.

*అర్ధరాత్రి ఆడది....*

ఈ 'నెల కథ'ను ఎంచుకోవటానికి ఈ నెల చాలా కష్టపడాల్సివచ్చింది. ఎందుకంటే, కథలలో ఆలోచన బావున్నా, ముగింపులోని అసంతృప్తి కథల విలువను తగ్గిస్తోంది. అందుకని ఉన్న కథలలోంచే మిగతా వాటికన్నా 'మెరుగు' అనిపించిన కథ, బాలాదేవి రచించిన 'అర్ధరాత్రి ఆడది'ని ఈ మాసం కథగా ఎంచుకున్నాను. నిజానికి ఈ ఎంపిక కూడా అసంతృప్తికరమే అయినా, ఒక ఆలోచనను ప్రతిభావంతంగా ప్రదర్శించిన రచయిత్రికి ప్రోత్సాహమివ్వటంలో పొరపాటు లేదన్న ఉద్దేశ్యంతో, ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురితమైన ఈ కథను ఈ నెల కథగా ఎంచుకున్నాను. ఈ కథలో రచయిత్రి చేదు నిజాన్ని ఉన్నదున్నట్టు ప్రదర్శించారు. మనం ఎంతో నాగరికులమయ్యామనుకుంటూ, అభివృద్ధి సాధించేశాం సామాజికంగా అనుకుంటూ భావించుకుంటున్నాం కానీ మౌలికంగా అప్పటికీ ఇప్పటికీ ఏమీ తేడాలేదన్న చేదు నిజాన్ని కొట్టొచ్చినట్టు ప్రదర్శిస్తుంది రచయిత్రి. అయితే సమస్యను చూపించి, ప్రశ్నతో కథ వదిలేయటం ఈ కథలో లోపం. ప్రతివారు ప్రశ్నిస్తారు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానాలివ్వటం, సమస్యలను పరిష్కారాలివ్వటం సృజనాత్మక రచయితల బాధ్యత. అయితే ఈ కథ చదివిన తరువాత ఈ ప్రశ్నకు బదులుందా? ఈ సమస్యకు పరిష్కారం ఉందా? అన్న ఆలోచన కలుగుతుంది. ఆ ఆలోచన కలగచేయటంలో రచయిత్రి కృతకృత్యులయ్యారు. వయసులో సంబంధం లేకుండా మహిళ లైంగిక వేధింపులకు గురవటం మనం అందరం చూస్తున్నదే అనుభవిస్తున్నదే

1960 లో ఒంటరిగా రైల్లో ప్రయాణిస్తున్న భవాని వెంట ఓ మగాడు పడతాడు. 1980 లో పిల్లలతో వెళుతున్న భవానికి చేదు అనుభవం ఎదురవుతుంది. 2000లో 50 ఏళ్ళ వయసులో ఓ యువకుడు రైల్లో ఆమెతో అనుచితంగా ప్రవర్తిస్తాడు. 'ఏదిమారినా ఈ గాంధీ పుట్టిన దేశంలో ఏ అర్ధరాత్రి అయినా, పగలైనా, కదిలే కార్లలో గానీ, ట్రైన్లలో గానీ, రోడ్ల మీద గానీ మరెక్కడా వయస్సుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న ముద్రకి మాత్రం మార్పురాదు. చీర చెంగు తగిలితే చాలనుకునే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. ఆ చీరల్లో ఎవరో తెలియకపోయినా సరే 'ఆడది' కూడా ఒక ప్రాణమున్న మనిషే, మరబొమ్మ కాదని గ్రహించే రోజు ఎపుడొస్తుందో మరి? వస్తుందా అసలు? రచయిత్రి ఆవేదనను మనం అర్థం చేసుకోగలుగుతాం. ఎందుకంటే ఇది మన అందరి ఆవేదన. మన అందరి ఆక్రోశం. మన అందరి ఆలోచన.

*ఈనెల కథ*

## అర్ధరాత్రి ఆడది - బాలాదేవి

ఆంధ్రభూమి మాసపత్రిక మార్చి, 2009 సంచిక నుంచి

*అది 1960 వ సంవత్సరం. చూడ్డానికి పెద్ద పెద్ద కాటుక కళ్ళతో, నల్లని బారెడు జడతో, జడలో మల్లెపూల సువాసనలతో తెల్లగా మెరుస్తూ పరికిణీ, ఓణీ జాకెట్‌లో ఉన్న అచ్చ తెలుగు అమ్మాయి ఆ పిల్ల. ఆమె పేరు భవాని. ఇద్దరు తమ్ముళ్ళు, రమణ, రవిలతో స్టేషన్‌లో ప్లాట్‌ఫారం మీద కూర్చుందామె రైలు కోసం ఎదురు చూస్తూ. రైలు రావడానికి ఇంకా సమయం ఉంది. కానీ ఎప్పుడు వస్తుందో? జనం అంతగా లేరు. చిన్న స్టేషనది. పశ్చిమ ఒరిస్సాలో ఉన్నవాటిలో శంబర్‌పర్ పెద్ద ఊరే. ట్రంకు పెట్టెమీద భవాని, ఆమెకి రెండు పక్కలా కామిక్ పుస్తకాలేవో పట్టుకుని రమణ, రవి చదువుకుంటున్నారు.*

భవాని తండ్రి నారాయణమూర్తి అంతకుముందే కొన్ని క్షణాలముందు పిల్లలని స్టేషన్‌లో అన్ని జాగ్రత్తలూ చెప్పి మరీ దింపి వెళ్ళాడు. తను బిడివోగా పని చేస్తున్న ఊరికి మరో గంటయినా పడుతుంది వెనక్కి వెళ్ళడానికి. అందుకని రైలు రాకముందే జీపులో

వెళ్ళిపోయాడతను. ఆ రోజు ఆఫీసు పని ముగించి డాక్ బంగళా నుంచి పిల్లల్ని భోజనాలు పెట్టించి తీసుకు వచ్చాడు స్టేషన్‌కి. ఆడపిల్లలయినా, మగపిల్లలయినా చదువుకుని తమంత తాము స్వతంత్రంగా జీవించగలగాలని, ఎక్కడికయినా ఒక్కళ్ళూ వెళ్ళగలగాలని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, తమ నిర్ణయాలు తామే తీసుకోవాలని ఆశించి పిల్లలని అలాగే పెంచాలనుకునే ఆదర్శ వ్యక్తి అతను. అత్తగారు, మామగారు, తన తల్లి పిల్లల్ని వదిలి ఉండలేక భార్య రుక్మిణి, తన స్నేహితులు ఎందరో బంధువులు, అంత దూరంలో పెట్టి చదివించడం ఏమిటని అన్నా వినకుండా తమున పల్లెటూరులో చదువులు సరిగ్గా సాగవని, అందులోనూ తనకి ప్రతి రెండేళ్ళకి బదిలీలు అయిపోతూ ఉండడంతో పిల్లల్ని తన అన్నగారి దగ్గర సామర్లకోటలో పెట్టాడు చదువులకని. వేసవి సెలవులు అయిపోయి స్కూళ్ళు తెరుస్తున్నారు. కలెక్టర్ ఇన్‌స్పెక్షన్ల వల్ల సెలవు దొరక్క పిల్లల్ని ఒక్కళ్ళనీ పంపక తప్పలేదు అతనికి.

వాళ్ళకి ఎదురుగా కొంతమంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. అందులో ఒకతను నల్లగా, లావుగా, పొట్టిగా, కొంచెం బట్టతలతో తమనే ఉండి ఉండి చూడడం భవాని గమనించకపోలేదు. ఆమె మనసులో కొంచెం బెదురు, భయం కలిగింది. హఠాత్తుగా కొద్దిసేపట్లో అతను క్రిందనున్న ఎయిర్ బ్యాగ్ భుజాన వేసుకుని నడవడం మొదలుపెట్టాడు. ఎక్కడికో వెళ్ళిపోతాడనుకున్న భవానికి ఊహకి విరుద్ధంగా అతను వాళ్ళవేపు రావడం మొదలు పెట్టాడు. భవాని మరో వైపు తిరిగి దూరంగా మరెవరో కుటుంబం వైపు చూస్తూ కూర్చుంది ఏమీ ఎరగనట్లుగా.

అతను దగ్గరగా వచ్చినట్లు అనిపించి ప్రక్కకు తిరిగింది భవాని. దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"నా పేరు విశ్వనాథం. మీరు తెలుగువాళ్ళా?"

విశ్వనాథం తెలుగు మాట్లాడగానే భవానికి భయం తగ్గింది. కానీ ఆమె జవాబు చెప్పకముందే మరి కొంచెం దగ్గరగా వచ్చి బేగు కింద పెట్టి అన్నాడు మళ్ళీ "మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది. ఇటు పక్క పరికిణీ ఓణీల అమ్మాయిలు కనిపించరుకదా. ఈ అబ్బాయిలు మీ తమ్ముళ్ళా?"

"అవును" అంది ముక్తసరిగా. మగపిల్లలిద్దరూ అతన్నోసారి చూసి మళ్ళీ తమ పుస్తకాలలో మునిగిపోయారు. భవాని ఆ వ్యక్తితో మాట్లాడడానికి అంత ఉత్సుకత చూపించలేదు.

అయినా అతను సంభాషణకి ఉపక్రమించాడు. "ఏ ఊరు మీది? ఎక్కడికి వెళుతున్నారు?" ఆమె నుంచి జవాబు రాకముందే అటుపక్కగా వెళుతున్న చాయ్ కుర్రవాడికి నాలుగు టీలు చెప్పాడు.

భవానీ కంగారుగా అంది "మేమెవరం టీలు తాగము. ఇంకా స్కూలులో చదువుకుంటున్నాము" కొంచెం అమాయకత్వం, బెదురు ఉన్నాయి ఆమె కంఠంలో. విశ్వనాథం తన మటుకే టీ తీసుకుని అన్నాడు "మీరొక్కరే వెళుతున్నారా?" దానికి భవాని జవాబు చెప్పకపోవడంతో అతనే అన్నాడు మళ్ళీ "అదేమిటి మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని భయపడుతున్నారా! ఫర్వాలేదు. నేను రాజమండ్రి వెళుతున్నాను. వ్యాపారం పనిమీద వచ్చానిక్కడికి. మీకేదైనా సాయం కావాలంటే చెప్పండి."

అంతలో రైలు వస్తున్న సందడి రావడంతో మరి జవాబు చెప్పనక్కర్లేదని భవాని మనసులోనే దేవుడికి దండం పెట్టుకుంది. రైలు ఫ్లాట్‌ఫారం మీదకి చేరగానే జనం కంగారుగా పరుగులెత్తడం మొదలుపెట్టారు. ఈ రోజుల్లోలాగా ఆ రోజుల్లో రిజర్వేషన్ కంపార్ట్‌మెంటులు ఎక్కువ లేవు. నాన్న చెప్పిన జాగ్రత్తలు గుర్తుంచుకుని కంగారు పడకుండా తన ట్రంకు పెట్టె ఒక చేత్తో పట్టుకుని, రమణా, రవి తన వెనకాల పరుగుపెడుతుంటే ఎదురుగుండా కనిపించిన జనరల్ కంపార్ట్‌మెంట్‌లో జనాల మధ్య తోసుకుంటూ తొయ్యబడుతూ అతి కష్టమ్మీద ఎక్కింది భవాని. లోపలకు వెళ్ళడానికి దారి దొరక్క, కొంచెం పక్కకు తప్పుకుని బాత్రూం దగ్గర ట్రంకు పెట్టె కష్టం మీద ఇరికించి దాని మీద తను కూర్చుని తమ్ముళ్ళిద్దరినీ చెరో పక్క కూర్చోబెట్టుకుని నెమ్మది మీద ఎలాగో ఒకలాగ రైలెక్కామన్న ధీమాతో స్థిమితపడింది ఆమె.

ఆ కంపార్ట్‌మెంట్‌లోనే ఎక్కిన విశ్వనాథం నాలుగుపక్కలా చూసి గుమ్మం దగ్గర్నుంచే వాళ్ళని చూడగానే ఆ పక్కనే చేరిపోయాడు. వస్తువుల్ని, మనుష్యుల్ని, తప్పించుకుంటూ. భవానికి అతన్ని చూడగానే పై ప్రాణాలు పైనే పోతున్నాయనిపించింది. అతను చాలా చాకచక్యంగా మనుష్యుల్ని తోసి ఆమెకి ఎదురుగానే తన బ్యాగు పెట్టి దానిమీద కూలబడ్డాడు. ఆమెకి అతని ఊపిరి తగులుతున్నట్లుగా ఉంది. చాలా ఉక్కగా ఉంది. గాలాడటం లేదు నిండిపోయిన ఆ మనుషులవల్ల. తనకి ఊపిరి ఆడుతున్నట్లు అనిపించడటం లేదు. భవాని మనసులో కంగారుగా ఉంది ఈ మనిషెక్కడ దాపురించాడ్రా బాబూ అని. రైలు బయలుదేరింది. నిద్రకి, ఆకలికి ఆగలేక పిల్లలిద్దరూ కళ్ళు మూస్తూ తెరుస్తూ, ఆవులిస్తూ భవానీ మీదకు వాలిపోయి అవస్థలు పడుతున్నారు. అదే అదను చూసుకుని విశ్వనాథం మళ్ళీ మాట్లాడటం మొదలు పెట్టాడు.

"మీరేమిటి మూగ మల్లెమొగ్గలా కూర్చున్నారు. మీ గురించి మీకు తెలియదులా ఉంది. ఎర్రగులాబీని చూసారా ఎప్పుడయినా? మంచి వయసులో, పదహారేళ్ళ అమ్మాయిల్లాగా ఉంటుంది కదూ."

భవానీ మాట్లాడలేదు. భ్రకుటి ముడిచి తీక్షణంగా చూడడానికి ప్రయత్నించింది మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని.

విశ్వనాథం దగ్గర్నుంచి విపరీతమైన వాసన వస్తోంది. వాసనకంటే కంపు అంటే మంచిదేమో. అది చవకబారు తాగుడు వాసన అని తట్టింది భవానికి. రిక్షావాళ్ళు, ట్రక్కు డ్రైవర్ల దగ్గర అదే కంపు వస్తుంది. ముక్కు బద్దలవుతున్నట్లుగా ఉంది. పిల్లల్నిద్దర్నీ పొదవి పట్టుకుని కూర్చుందామె. అతను ఆమెకి చాలా దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఎర్రగులాబీని చూస్తే ఏం చేయాలనిపిస్తోందో మీకు తెలుసా? మీరు నవలేదో చదువుతున్నారు. మీకు తెలిసే ఉండాలి" అన్నాడు విశ్వనాథం.

భవానికి మౌనమే శరణ్యం అనిపించింది. రైలు కుదుపులకి, ముందుకు పడినట్లుగా తూలి ఆమె మీదకు వచ్చిపడ్డాడు విశ్వనాథ. అతని ఒళ్ళు తగలగానే కంపరం, చీదర, ఎక్కడలేని అహ్యం. భవానికి అతనిమీద ఎక్కడలేని కోపం తెప్పించాయి. పిల్లలిద్దరూ కూడా ఉలిక్కిపడి లేచారు.

భవానీ మరింకేమీ ఆలోచించకుండా హఠాత్తుగా లేచి "ఒరేయ్ రవణా, రవి! పదండ్రా లోపల జాగా ఉందేమో చూద్దాం" అని వాళ్ళిద్దర్నీ బరబరా ఈడ్చుకుంటూ మనుష్యుల్ని తోసుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్టు వెళ్ళిపోయింది లోపల్లోపలకు పెట్టె అక్కడే వదిలేసి. రెండు మూడు క్యాబిన్లు దాటాక ఒక చోట ఒక పెద్దావిడ పక్కనే కొంచెం జాగా కనిపించగానే పిలలిద్దర్నీ అక్కడే కూర్చోబెట్టి తనూ అక్కడే ఇరుక్కుని కూర్చుంది. ఆ పెద్దావిడ కొంచెం జరిగి వాళ్ళకి మరికొంచెం జాగా ఇచ్చింది. అప్పటికి స్థిమితంగా అనిపించింది భవానికి. పెట్టె పోతేపోతుంది గానీ తను తప్పించుకోగలిగింది అనుకుంటూ డబ్బు, రైలు టిక్కెట్టు ఉన్న తన పర్సు పదిలంగా పట్టుంది.

జనం ఎక్కుతూ దిగుతూనే ఉన్నారు ప్రతిచోటా రైలు ఆగగానే. అది పాసింజర్లా వెళుతోంది. మద్రాసు వరకు వెళ్ళే రైలు ఆ రోజుల్లో అదొక్కటే. పిల్లలు మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు. ఎప్పుడు తెల్లవారిందో తెలియలేదు. మళ్ళీ విశ్వనాథం కనిపించలేదు. భవానికి ధైర్యమొచ్చింది. భయంలేదనుకుని బాత్రూం వద్దకు వెళ్ళి చూస్తే అదృష్టవశాత్తు పెట్టె అక్కడే ఉంది. దాన్ని తీసుకొచ్చి తన దగ్గర పెట్టుకుంది. రాత్రిలోగా హాయిగా ఇంటికి చేరగలమన్న నమ్మకం కలిగింది ఆమెకు. పిల్లలకి పాలు, బిస్కెట్లు కొనిపెట్టి తను కాఫీ తాగింది. ఆ ప్రయాణంలోని ఆ అనుభవం ఒక భయంకరమైన నిజాన్ని తెలిపింది. ఎంత చదువుకుని, ముందుకు వెళ్ళాలన్నా, మగవాళ్ళతో సమానమనుకున్నా ఒక్కర్తీ ఆడది దొరికితే చాలు ఇలాంటి మేకవన్నెపులులు, తోడేళ్ళు వెంటపడుతూ వేటాడుతూనే ఉన్నాయి.

అది మొదటి అనుభవం కావడంతో ఆమె తర్వాతర్వాత జాగ్రత్తగానే మనుష్యుల్ని తెలుసుకోవడం మొదలుపెట్టింది. చదువు పూర్తయి లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఒంటరి ప్రయాణాలు చాలానే చేసింది. కట్నం ఇవ్వనని, ఉద్యోగం వదలనన్న పంతమో ఆలస్యంగానైనా తనకి తగినవాడు, తనలాగే విశాలభావాలున్నవాడు అయిన కెప్టెన్ శివప్రసాద్‌ను పెళ్ళిచేసుకుంది. ఉద్యోగం చేస్తూ

తనంతట తాను బ్రతకగలిగి భర్తకి ఫీల్డు పోస్టింగ్ వచ్చినప్పుడు సర్దుకుపోగల మనస్తత్వం, నేర్పు, సమర్థత ఉన్న భవాని తనకి తగిన అమ్మాయే అనుకున్నాడు శివప్రసాద్. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇద్దరివీ వేరే వేరే ఉద్యోగాలు, ప్రదేశాలు కావడంవల్ల భవానికి ఆ ఒంటరి ప్రయాణాలు తప్పలేదు.

*1980 వ సంవత్సరం.*

అప్పటికి భవానికి ముప్పై ఆరు ఏళ్ళు. కానీ ఆమె అలా కనిపించదు, 25-30 ఏళ్ళ అమ్మాయిలా ఉంటుంది. మూడేళ్ళ కూతురు రజని, రెండేళ్ళ కొడుకు రామ్‌ను తీసుకుని ఎక్కడో కాశ్మీర్‌లో కొండల మధ్య ఫీల్డు పోస్టింగ్‌లో ఉన్న మేజర్ శివప్రసాద్ దగ్గరకు బయలుదేరింది ఎండాకాలం సెలవులకి. తనున్న ఊరి దగ్గరే ఒక పల్లెటూరిలో సంవత్సరపు సెలవు తన కుటుంబంతో గడిపి వెనక్కి వెళుతున్న ఓ ఆర్మీ జవానుని భవానికి సాయంగా పంపించాడు శివప్రసాదు చంటిపిల్లలతో అన్ని రోజులు ప్రయాణం చేసి ఒక్కర్తీ సాయం లేకుండా రావడం కష్టమని, ఆ జవాను నిరంజన్‌కి ఇరవై ఏళ్ళుంటాయేమో. నెమ్మదిగా, సౌమ్యంగా 'మేమ్ సాబ్' అంటూ వినయంగా చెప్పినవన్నీ చేస్తున్నాడు.

ముందొక బస్సులో ప్రయాణం చేసి కొండల్ని దాటి విజయనగరం స్టేషన్‌లో కలకత్తా రైలుని పట్టుకోవాలి భవాని. ఒక కాశ్మీర్ బాస్కెట్‌లో పిల్లలకి పాలడబ్బాలు, సీసాలు, ఫ్లాస్కులు తిండి సామాన్లు ఒక సూట్ కేస్, ఎయిర్ బ్యాగ్‌తో బయలుదేరిందామె. సామాన్లు బస్సులో, రైలులో ఎత్తిపెట్టడంలో సాయంచేసాడు నిరంజన్. కానీ పిల్లలని మాత్రం అతని అప్పచెప్పలేదు, ఎత్తుకోనీయలేదు, ఆర్మీలో కొందరు జవాన్లు పిల్లలని మచ్చిక చేసుకుని వాడుకుంటున్నారని వింది ఆమె. ఆ కథలన్నీ విన్నాక ఆమెకి పిల్లల్ని అస్సలు వదలాలనిపించలేదు. కొందరు ఆర్మీ ఆఫీసర్ల భార్యలు తమ పిల్లల్ని జవాన్లమీద వదిలి పార్టీలకు వెళ్ళినా తను మాత్రం వెళ్ళేదిలేదు ఎంతో అవసరమైతే తప్ప. అసలు ఎవరూ సాయం వద్దందిగానీ భర్త మాటల కాదనలేక ఒప్పుకుందామె. తమని ఫస్ట్ క్లాసులో ఎక్కించి తను థర్డ్‌క్లాసు నుంచి మధ్య మధ్య వచ్చి మంచినీళ్ళు తెచ్చిపెట్టడం, పాలు, టీలు తేవడం వగైరా సాయాలు చేశాడు నిరంజన్.

కలకత్తాలో శివప్రసాద్ స్నేహితుడు మేజర్ భట్టాచార్య స్టేషన్‌కి వచ్చి భవానిని, పిల్లల్ని తన క్వార్టర్స్‌లోకి తీసుకుని వెళ్ళాడు నిరంజన్‌ని ఆర్మీ యూనిట్‌కి పంపించి.

మర్నాడే ప్రయాణం. భట్టాచార్య భార్య అరుంధతి, భవానీ పిల్లల్ని చాలా బాగా చూసుకుంది. వాళ్ళబ్బాయి అభిజిత్‌తో పిల్లలు ఆడుకున్నారు. మర్నాడు రిజర్వేషన్ ఉంది కనుక బాధలేదు అనుకున్న భవానికి అనుకోని ఎదురుదెబ్బలా హఠాత్తుగా ఆ రోజు కలకత్తా బంద్ అని రైళ్ళన్నీ ఆపేసారు. కలకత్తాలో గొడవలు.... రిజర్వేషన్లు అంత త్వరగా దొరకవు. ఒకరోజు పోయినా తన భర్తతో గడిపే సమయం తగ్గిపోతుందని భవాని భయం. ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ దొరక్క మేజర్ భట్టాచార్య మర్నాడు అదే ట్రైన్‌లో కష్టం మీద కిటికీలోంచి సామాన్లు, పిల్లలనీ అందించి జమ్ముకి వెళ్ళడానికి భవానిని ఎక్కించాల్సి వచ్చింది.

మనుషులు నిలబడేందుకు కూడా సందులేదు. అది మళ్ళీ జనరల్ కంపార్ట్‌మెంట్ కూడాను. నిరంజన్ కూడా అందులోనే ఎక్కాడు. పిల్లలకీ తనకీ సరిపడా జాగా దొరికింది. మర్నాటికిగానీ వాళ్ళు చేరరు. ఉక్కలో వేడిలో ఆ రష్‌లో అలాగే రోజంతా గడపాల్సి వచ్చింది. అర్థరాత్రి అయింది పిల్లలతోపాటు భవానికి కళ్ళు మూతలు పడుతున్నాయి. రామ్ ఒళ్ళో, రజని ప్రక్కన తనకి ఆనుకుని నిద్రపోతున్నారు. హఠాత్తుగా తన ప్రక్కనే ఎవరో నుంచున్నట్లు అనిపించింది తనకి తగలడానికి ప్రయత్నిస్తూ. తన తొడ మీద పక్కనుంచి రామ్ తలక్రిందుగా చేయి పడగానే భవానికి మెలుకువ వచ్చింది. ఏదో షాక్ తగిలినట్లుగా అనిపించి ప్రకకి తిరిగి చూడగానే నిరంజన్ కనిపించాడు.

తన ప్రక్కనెవరో ఆవిడ ఏదో స్టేషన్‌లో దిగిపోయినట్లుంది. మెరుపులా నిల్చుందామె రామ్‌ని ఎత్తుకుం మరో చేత్తో రజనీని పట్టుకుని "యూ బ్లడీ గెటౌట్" అని అరిచింది గట్టిగా, కోపంగా. నిరంజన్ బిత్తరపోయి పిల్లిలా ముడుచుకునిపోయి లేచి నిల్చుని ఆమె

కళ్ళల్లో రక్తపు జీరలు చూసి చల్లగా జారుకున్నాడు బయటకి. జనంలో సంచలనం వచ్చి చూసేసరికి భవని తన జాగాలో పిల్లల్తో కూర్చుండిపోయింది.

✷✷✷

మర్నాడు జమ్ము చేరి దిగిన వేళకి నిరంజన్ కనబడలేదు. శివప్రసాద్‌ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది భవానికి. కన్నీళ్ళు రాబోతుంటే ఆపుకుని చేయి ఊపిందామె.

"నిరంజన్ ఏడి?" అంటూ వచ్చాడు శివప్రసాద్.

"వాడక్కర్లేదు. సామాన్లు కూలి వాడి చేత దింపించండి" అంది భవాని.

అతనొక నిముషం ఆమె కళ్ళల్లోకి చూసి ఏదో అర్థమయినట్లుగా లోపలకు వెళ్ళి సామాన్లు ఒక్కడే అన్నీ బయటకు తెచ్చేసాడు.

పక్క కంపార్ట్‌మెంట్ నుంచి నిరంజన్ పరుగెత్తుకుంటూ వచ్చి శివప్రసాద్‌కి శాల్యూట్ చేసాడు.

"ఆప్‌కా జరూరత్ నహీ..." అన్నాడూ మేజర్ శివప్రసాద్ కొంచెం కరుకుగా.

వాళ్ళు కార్లో ఆర్మీ ట్రాన్సిట్ కేంప్‌కి వచ్చాక జరిగింది చెప్పి అంది భవాని సజల నయనాలతో "మరెవర్నీ ఎప్పుడూ ఇంక పంపవద్దు. పిల్లలతో ప్రయాణాలు చేసి రావడం నాకలవాటే. వాళ్ళింక పెద్దవాళ్ళయిపోతున్నారు నేను ఒక్కర్తినీ రాగలను"

"డోంట్ వర్రీ.... నిరంజన్‌ని నేను చూస్తానులే" అన్నాడతను. కానీ అతనికి తెలుసు ఆ జవాన్లు కొండల్లో, మంచులో, ఎడార్లలో, ఇసుకలో, వేడిలో నెలల తరబడి పెళ్ళాం పిల్లల్ని వదిలి ఎలా బ్రతకుతారో? అతను నిరంజన్ ప్రవర్తనకి కారణాలు చెప్పదలచుకోలేదు. భవానికి అవేమీ అక్కర్లేదు. జవాను మగబుద్ధిమీదే కోపం ఉందామెకి.

ఆ రెండో అనుభవం తరువాత కూడా ఆమె ఎన్నో సార్లు పిల్లలతో ఒక్కతే ప్రయాణాలు చేసింది. కానీ మనసులో ఆమెకి ఉండిపోయింది భావన. అలాగే ఈ తోడేళ్ళ బారినుంచి ఆడదానికి విముక్తిలేదు ఎప్పటికీ అని.

<u>2000 మిల్లినియం సంవత్సరం</u>

భవానికి ఇప్పుడు ఏభై ఆరేళ్ళు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా మరో రెండేళ్ళలో రిటైరవుతుంది. బ్రిగేడియర్ శివప్రసాద్ భవానితోపాటే భువనేశ్వర్‌లో బ్యాంక్‌లో ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఉన్నాడు. రజనికి పురిటి నొప్పులు దగ్గర పడ్డాయని ఆ రోజు ఢిల్లీకి బయలుదేరింది. తనకి సెలవు దొరకలేదని, తరువాత వస్తానని ఆమెని రైలెక్కించి వెళ్ళిపోయాడు శివప్రసాద్.

ట్రైన్ ఎక్కగానే తను చిన్నప్పుడు ఎక్కిన రైళ్ళకి ఇప్పటికి ఎంతో తేడా అని మనసులో పాత జ్ఞాపకాలన్నీ గుర్తుకువచ్చాయి. వాటితో పాటు ఈ నాగరికత.. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా? ఇప్పటి ఈ మొబైల్ ఫోన్లు, లాప్ టాప్‌లు, ఎల్ సిడి టీవీలు, డిజిటల్ కెమేరాలు, హోమ్ థియేటర్లు, కార్లు, ట్రైన్లు, విమానాలు.... ఓహ్ ఒకటే ప్రపంచం. గ్లోబలైజేషన్. మనిషి మారాడా మరి? అమ్మా నాన్నా లేరు. తనకి శివప్రసాద్‌కి దగ్గరైన తన్న తమ్ముళ్ళు, కుటుంబాలు, అక్క చెల్లెళ్ళు. ఎక్కడెక్కడో ఉన్నారీ ప్రపంచంలో తన జీవితంలో ఇంత మార్పు వస్తుందని నలభై ఏళ్ళ క్రిందట తను అనుకుందా? కానీ ఆమెకి తెలిసిందల్లా అప్పటికీ ఇప్పటికీ మార్పులేని ఆ తోడేళ్ళ గురించే ఆమెకి మనసులో అనిపించింది ఇప్పుడూ అటువంటి అనుభవం - తనలో తనే నవ్వుకుందామె. తనకిప్పుడు వయస్సు లేదు. యాభై ఆరేళ్ళ వృద్ధ వనిత తను కానీ ఆమెకి తట్టనిదల్లా తను అంత వయసున్నదానిలా కనబడదని! ఆమె అందం తరగలేదు. నల్లరంగు కొట్టిన బాబ్డ్ హెయిర్, నల్లని చీరతో తెల్లగా మెరుస్తున్న శరీరం, ఆ బంగారు వన్నెకి మెరుపు తెచ్చేట్లుగా మెడలో ముత్యాల హారం, చేతులకి ముత్యాల గాజులు, ఖరీదైన వాచీ. ఆమెని చూస్తే ఇంకా నలభై ఏళ్ళు కూడా రాలేదనుకుంటారు ఎవరైనా. చూడముచ్చటగా ఉందామె. ఫస్ట్‌క్లాస్ ఏసి కంపార్ట్‌మెంట్‌లో క్రిందసీటులో హాయిగా వెనక్కి జారబడి ఇంగ్లీషు నవలేదో చదవడం మొదలుపెట్టింది. ఎదుటి సీట్లో

వయస్సులో ఉన్న కొత్త దంపతులు తన ప్రక్కన చిన్న కుర్రవాడొకడు ఇరవై అయిదేళ్ళదాకా ఉంటాయేమో. ఎవర్తోనో అటు ప్రక్కవాళ్ళతో మాట్లాడుతూ తన గురించి చెప్పుకుంటే వింది. అతనొక ఐఎఎస్ ఆఫీసర్ అని. తన అల్లుడు వయసన్నమాట.

నీళ్ళ బాటిల్, లంచ్ టీ, డిన్నర్ అన్నీ సమయానికి అందిపోయాయి. ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకుని పడుకోవడం మొదలు పెట్టారు. చాలా సేపు చదువుకుని ఏ రాత్రి పన్నెండు దాటాకో లైటార్పి పడుకుంది భవాని.

హఠాత్తుగా కాళ్ళ దగ్గర ఎవరో కూర్చున్నట్లుగా అనిపించింది. తన పాదాలు తడిమిన ఆ చేతులు మరికొంచెం కాళ్ళపైకి రాబోతుంటే గబుక్కున లేచి తన సీటు పక్క లైటు వేసిందామె. ఆమె పక్కనే దగ్గరగా కూర్చున్నాడు.

అతన్ని కోపంగా చూసి అందామె ఇంగ్లీషులో "నిద్ర రావడంలేదా? బైదిబై నేను చెప్పడం మరిచిపోయాను. నువ్వు ఐఎఎస్ కదూ. మాఅల్లుడు నిశ్చల్ కూడా ఢిల్లీ సెంట్రల్ గవర్నమెంట్‌లో ఐ ఎ ఎస్ ఆఫీసర్, కూతురు మార్కెటింగ్ మేనేజర్, మా అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నేను కాలేజీ ప్రిన్సిపాల్‌గా వచ్చే సంవత్సరం రిటైరవుతాను. మా అమ్మాయి డెలవరీకి ఢిల్లీ వెలుతున్నాను. బహుశా మీ అమ్మ నా అంతే ఉంటుందేమో కదూ, పోయి నిద్రపో" ఒక్కసారిగా దెబ్బతిన్నట్లు ఆ కుర్రవాడు మరి మాట్లాడలేక "సారీ" అని పై బెర్తు మీదకి వెళ్ళిపోయాడు. ఆమె గొడవ చేయకుండా తనని మందలించి వదిలేసినందుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

డెబ్బై ఏళ్ళ వృద్ధ స్త్రీ నుంచి ఉయ్యాలలోని పసికందు వరకు ఆడవాళ్ళని వదలని ఈ మనుష్యులు మనుష్యులేనా? తోడేళ్ళా? ఆమెకి ఎన్నో ఏళ్ళ క్రితం జరిగిన ఇంకో సంఘటన కూడా గుర్తుకు వచ్చింది. ఒక లేడీ ఐ ఎ ఎస్ ఆఫీసర్ పోలీస్ డిజి గురించి. ఏదో తమాషాకి చెయ్యి తగిలించానని తప్పించుకోబోయాడా ప్రబుద్ధుడు. ఇటువంటి విషయాలు వదిలేస్తే చిన్న చీమలు పుట్టలు పాముల గుట్టలైనట్లు పెరిగిపోతాయని ఆ లేడీ ఆఫీసరు చివరిదాకా వదలలేదు ఆ పోలీసు వ్యక్తిని. చదువుకున్న వాళ్ళ అవస్థ ఇలా ఉంటే నిరక్షరాస్యుల సంగతేమీటి?

అప్పుడు భవానికి మళ్ళీ మరోసారి అర్థమయిందల్లా ఏది మారినా ఈ గాంధీ పుట్టిన దేశంలో ఏ అర్థరాత్రి అయినా, పగలైనా, కదిలే కార్లలో గానీ, ట్రైన్లలో గానీ, రోడ్డుమీదగానీ మరెక్కడైనా వయస్సుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న ముద్రకి మాత్రం మార్పురాదు. చీర చెంగు తగిలితే చాలనుకునే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. ఆ చీరలో ఎవరో తెలియకపోయినా సరే 'ఆడది' కూడా ఒక ప్రాణమున్న మనిషే, మరబొమ్మ కాదని గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో మరి? వస్తుందా అసలు?

✷✷✷




## మే ౨౦౦౯

కథా సాగర మథనంలో విశ్లేషణను 'మే'నెల మాస పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచనలు; వార పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్య; దినపత్రికలు ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 95 కథలను పరిశీలించడం జరిగింది.

'కథాసాగర మథనం'లో పాఠకుల పరిచయానికి కథలను ఎంచుకోవటంలో సాధారణంగా రచయితలు స్పృశించని కథాంశాలను ప్రదర్శించే కథలకు పెద్ద పీట వేయటం జరుగుతుంది. ఎందుకంటే, మన పత్రికలలో కథలు అనేకం 'మూస' కథాంశాలనే ప్రదర్శిస్తాయి. ఇలాంటి కథలలో రచయితలు అత్యద్భుతమైన కథా కథన విన్యాసాల్ని ప్రదర్శిస్తే కానీ, అలాంటి కథలు మెప్పించలేం. అపోహలు తొలగి భార్య భర్తలొకటి కావటం, తమ తప్పును తెలుసుకుని ముసలివాళ్ళను చేరదీయటం, మగవాడి దౌష్ట్యం, అణచివేతలు ప్రదర్శించే కథలు మన పత్రికలలో అధికంగా కనిపిస్తాయి. ఒక సినిమా హిట్ అయితే, అలాంటి పది సినిమాలు తయారయ్యేట్టే, ఒక కథ ప్రచురితమైతే అలాంటివే మరో పది కథలు తయారవుతాయి. ఎందుకంటే, ఇలాంటి కథలకే ఆమోద ముద్ర లభిస్తుందన్న అభిప్రాయం ఏర్పడుతుంది. అలాంటివే కథలు వస్తూండడంతో, ఉన్నవాటిల్లోంచే బాగున్నవి ఎంచుకుని వేయాల్సి వస్తుంది పత్రికలకు. దాంతో, కథలలో ప్రదర్శించే ఆలోచనల్లో, జీవితాల్లో ఒక రకమైన 'రొటీన్' ఏర్పడిపోతుంది. సినిమాల్లాగే, కథలూ 'నవ్యత' లేక 'మూస' అయిపోతాయి. అందుకే సినిమాలలో 'అవార్డు' సినిమాలలాగే, కథలలో ఇలాగే రాస్తే అవార్డులొస్తాయని 'అవార్డు' కథలూ, 'అవార్డుకథకులూ' ఏర్పడ్డారు.

ఈనెల కూడా మామూలు కథలు, రొటీన్ కథలు, అలవాటయిన కథల నడుమ కాస్తయినా భిన్నంగా ఉన్న కథలు, వైవిధ్యం ప్రదర్శించిన కథలను ఎంచుకోవటం కోసం కొంచెం కష్టపడాల్సి వచ్చింది. అలా ఎంచుకున్న కథలివి.

***కడలి కెరటం***

'ఎస్వీ కృష్ణ' రచించిన ఈ కథ 'స్వాతి' మాసపత్రికలో ప్రచురితమయింది. ఈ కథను పాఠకులకు పరిచయం చేయటం ఎందుకంటే, నిజానికి కాస్త కల్పన జోడించి కథగా రాసినా, అది లాజిక్‌కి నిలవకపోతే, కథనంలో బలం లేకపోతే, రచయిత చెప్పాలనుకున్న నిజం బలహీనమైపోతుంది. దాంతో రచయిత అనుకున్నది నెరవేరటం అటుంచి అందుకు వ్యతిరేకమైన ఫలితం లభిస్తుంది. ఈ మధ్య ఈ రచయిత రాస్తున్న సీరియల్ తనదేనని, ఓ రచయిత్రి కోర్టులో కేసువేసి తన 'కాపీరైటు' నిలుపుకుని, రచయిత 'కాపీరైటు'ను తోసిపుచ్చింది. ఈ కథలో 'అమర్' అనే రచయిత జైలుకెళతాడు. అతడు ఓ ప్రఖ్యాత రచయిత్రికి ఘోస్ట్ రైటరు. అతను రాసిన వాటిని, తన పేరుతో ఆమె అచ్చువేసుకుని పేరు కొట్టేస్తుంటుంది. రాసినందుకు ఇతడికి డబ్బులిస్తుంటుంది. తన పేరు అచ్చులో చూసుకోవాలన్న తపనలో 'అమర్' ఓ నవలరాసి ఓ పత్రికకు పంపుతాడు. బహుమతి వస్తుంది. సీరియల్ ఆరంభమయ్యే సమయానికి, ఆ రచయిత్రి ఆ నవల తనదేనని కోర్టులో కేసు వేస్తుంది... 'అదే సమయంలో నేను సిటీలో లేని సందర్భంలో 'ఆమె'

తను ప్రచురించుకున్న ఒక పుస్తకాన్ని సభ ఏర్పాటు చేసి అందులో ఆవిష్కరణ సభ కూడా జరిపానని చెపుతూ... ఆ పుస్తకాన్నీ, ఆ సభకి అతిథులుగా వచ్చి ఆ నవల గురించి వేదికపై మాట్లాడిన పేరున్న, సీనియర్ రచయితల ఫోటోలను సాక్ష్యాలుగా చూపిస్తూ... తన నవలను నేను కాపీ చేసి ఆ పత్రికలో పోటీకి పంపించానని, వాళ్ళు నాకు బహుమతినిచ్చి, నా పేరుతో సీరియల్‌గా వేస్తున్నారనీ, వెంటనే ఆ సీరియల్‌ని ఆపి, తనకు న్యాయం చేయాలనీ సివిల్ కోర్టులో కేసు వేసిందామె' అంటాడు 'అమర్'. ఆమె కేసు గెలుస్తుంది. అమర్ జైలుకి వెళతాడు. అతడికి బెయిలు వస్తుంది. కానీ ఉద్యోగం పోతుంది. ఇదీ కథ. కథ చివర్లో తన కథకూడా తన కూతురేనని అంటాడు రచయిత. ఆ రచయిత్రి 'కేసు' గురించి, కథలో మరొకరు తన నవల కాపీ కొట్టారని 'సభ' చేసి బుజువులు చూపినంత మాత్రాన ఏ కోర్టూ ఒప్పుకోదు. రెండు రచనలూ ఒకే రకంగా ఉండటాన్ని మించి కాపీకి మరో నిదర్శనం అనవసరం.

ఇక్కడ కథలో రచయిత 'రెండూ' ఒకే రకంగా ఉన్నాయన్న విషయం ప్రస్తావించలేదు. కోర్టు 'అమర్'ను జైలుకు పంపింది కాబట్టి రెండూ ఒకే రకంగా ఉన్నాయనుకోవాల్సి వస్తుంది. ఒకేరకంగా ఎలా ఉన్నాయన్న ప్రశ్న వెంటనే వస్తుంది. ఎందుకంటే, 'అమర్' నవలను తనే రాసి పోటీకి పంపడు. ఇంకా సీరియల్ ఆరంభం కాకముందే, ఆ రచయిత్రి కోర్టులో కేసు వేసింది. సీరియల్ అచ్చుకాకముందే, ఆమె దగ్గరకు మొత్తం నవల ప్రతి ఎలా వచ్చింది? ఆమె స్వయంగా రాయలేదని 'అమర్' ముందే చెప్పాడు. 'అమర్' నవలను ఆమె ఎలా ఊహించి, అంత త్వరగా రాయించి అచ్చువేసుకోగలిగింది, అదీ సీరియల్ ఇంకా ఆరంభం కాకముందే? ఈ ప్రశ్నకు కథలో సమాధానం లేదు. ఇది కథను బలహీనం చేస్తుంది. కనీసం, పత్రికలో ఎవరికో డబ్బులిచ్చి, ఆ రచయిత్రి నవల ప్రతిని సంపాదించి, అచ్చువేసుకున్నట్టు చూపిస్తే 'లాజిక్' నిలిచేది. అలాకాకపోతే, ఈ నవల అంతకు ముందు 'అమర్' రచయిత్రికి ఇస్తే, ఆమెకు నచ్చలేదని, దాంతో, ఆ నవలను తాను తన పేరుతో పత్రికకు పంపాననీ, దానికి బహుమతి రావటంతో, తనదగ్గర ఉన్న ప్రతిని అచ్చువేసి, అది తనదేననే వీలు రచయిత్రికి చిక్కినట్టు చూపినా, కథ నిలిచేది. అమర్ పట్ల సానుభూతి కలిగేది. కానీ అవేవీ చూపకుండా, అలాంటి నవలని, సీరియల్ రాకముందే రచయిత్రి ఎలా అచ్చువేసి, కోర్టును నమ్మించిందో చెప్పకపోవటం వల్ల కథ బలహీనమమైపోయింది. ఎన్ని పుస్తకావిష్కరణ ఫోటోలు చూపినా, ఎంతమంది సీనియర్ రచయితలు పొగడినా రెండు నవలలు ఒకే రకంగా ఉంటేనే 'కాపీ' అని ఎవరైనా నమ్ముతారు. దాంతో ఈ కథ రచయిత తనను తాను సమర్థించుకోవటం, రచయిత్రిని చులకన చేయటం కోసం రచించాడనిపిస్తుంది.

గమనిస్తే, అనేక సందర్భాలలో ఒకే రకమైన 'కథాంశం' కల కథలు, కథకుల జీవితానుభవాల ఆధారంగా సృజించినవి కావటమే. అయితే, కథాంశాలలో 'సామ్యం' ఉన్నా, రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు, రచనా సంవిధానం ఆయా రచనలను ప్రత్యేకంగా నిలుపుతాయి. 'కాపీ' అనే అవకాశాన్నివ్వవు. మదామ్ బోవరీ, అన్నా కరెనీనా, డాక్టర్ జివాగో, లేడీ చాటర్లీస్ లవర్, పెయింటెడ్ వెయిల్ వంటి 'క్లాసిక్' నవలల్లో ప్రధాన అంశం వైవాహికేతర సంబంధమే. కానీ ఈ అంశాన్ని ఆయా రచయితలు తమతమ స్వీయానుభవాల సృజనాత్మక సంద్రంలో స్నానింపచేసి సృజించిన తీరు ఆయా రచనలకు ప్రత్యేకతనాపాదిస్తుంది. 'కాపీ' అభియోగాలు తరచుగా వస్తున్న నేపథ్యంలో, రచయితలు, తమ కథల ద్వారా తమ దృక్పథాన్ని వివరించాలని ప్రయత్నించటం సహజం. తమ అనుభవాల ఆధారంగా రచించే కథలలో రచయితలు హీరోలు కావటమూ సహజమే. కానీ, తమ సమర్థనలో లాజిక్ లేకపోతే మాత్రం వ్యతిరేక ఫలితం ఉంటుందనేందుకే ఈ కథను ఇంత విపులంగా విశ్లేషించాల్సి వచ్చింది. ఈ విశ్లేషణ కథనూ, లాజిక్‌లకే పరిమితం. దీన్లో ఎలాటి వ్యక్తిగతాలూ లేవని గమనించాలి.

<u>ఫన్నీ డేస్</u>

భీమరాజు వెంకట రమణ రచించిన ఈ కథ, 31 మే ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. కథాంశం అలవాటయిందే మిత్రులు కూర్చుని తమ ప్రేమపురాణాలు చెప్పుకుంటుంటారు. భార్గవ్ అనే వ్యక్తి తన ప్రేమకథ చెపుతాడు. కాలేజీలో ఓ అమ్మాయిని

ప్రేమిస్తాడు. ఆమె, తనని ప్రేమిస్తున్నానని వెంటబడ్డ వారందరికీ ఓ పరీక్ష పెడుతుంటుంది. ఆ పరీక్షవల్ల ఆ వ్యక్తి బాగుపడుతుంటాడు. భార్గవ్‌ను కూడా ఆమె 'కాలేజీ ఫస్ట్' తెచ్చుకోమంటుంది. అతడు కాలేజీ ఫస్ట్ వచ్చి, వెళ్ళేసరికి ఆమె ఊరు వదిలి వెళ్ళిపోతుంది. కొసమెరుపేమిటంటే, ఆమెనే అతడి భార్య. కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఆమె ఊరువెళ్ళిందని తెలిసేవరకూ బాగుంది. 'ఆమెనే తన భార్య' అని చెప్పటం కొసమెరుపుగా బాగున్నా, ఊరు వదిలి వెళ్ళిన వాళ్ళు ఎలా కలిశారు? ఆమె వచ్చి తన మాట నిలుపుకుందా? ఈయన వెతుక్కుంటూ వెళ్ళి తన ప్రేమను నిరూపించుకున్నాడా? రచయిత చెప్పలేదు. దాంతో కథ బాగుందనిపించి అసంతృప్తిని మిగులుస్తుంది.

*మోహ తిమిరం, పరిష్కారం*

'మోహ తిమిరం' కథ మే 15, వార్తలో ప్రచురితమయింది. రచించింది డాక్టర్ ధేనువకొండ శ్రీరామ మూర్తి. 'పరిష్కారం' కథ మే 31 ఈనాడులో ప్రచురితమయింది. రచించింది కర్లపాలెం హనుమంతరావు. ఈ రెండు కథలలో అపోహలతో సరిగ్గా దాంపత్యం చేయని భార్యాభర్తలు అపోహలు తొలిగి ఒకటవుతారు. 'మోహ తిమిరం' కథలో, మేనరికం చేసున్నందుకు, పిల్లలు అవలక్షణాలతో పుడతారన్న భయంతో, భార్యా భర్తలు దూరంగా ఉంటారు. 'పరిష్కారం' కథలో, తనకు 'ఎయిడ్స్' ఉందన్న అనుమానంతో భర్త భార్యను తాకడు. అపోహలు తొలగటంతో ఒకటవుతారు. పైకి ఈ రెండు కథలలో కేంద్ర బిందువు తేలికగా అనిపించవచ్చు. కానీ ఎదుటివారికి 'సిల్లీ'గా అనిపించే, అనేక అంశాలు వ్యక్తులకు ప్రాణాంతకంగా అనిపిస్తాయి. ఈ రెండు కథలలో 'సిల్లీ' కారణాలను 'బలం'గా నిరూపించే ప్రయత్నాలు చేసేకన్నా, దాంపత్య బంధం లేకపోవటం వల్ల కలిగే 'అసంతృప్తి'కే ప్రాధాన్యం ఇచ్చారు రచయితలు. 'మోహ తిమిరం' కథలో రచయిత అక్కడక్కడా ప్రదర్శించిన భావాలు ఆనందం కలిగిస్తాయి.

'ఆనందకరమైన అవకాశాలు ఏర్పరచుకోవడానికి జీవితంలో అనేక సందర్భాలు మనముందు ఉంటాయి, నిర్నిబంధమైన స్వేచ్ఛ ఈ అవకాశాలు తన మనస్సును ప్రవృత్తికి అనుకూలంగా మలచుకోవడం మనిషి ప్రవృత్తిపై ఆధారపడి ఉంటుంది' అంటాడు రచయిత వైవాహికేతర సంబంధాల గురించి రచయిత భావవ్యక్తీకరణ ఆనందం కలిగించినా, వైవాహికేతర సంబంధాలు 'ఆనందకరమైన అంశాలు' అవటంతో రచయిత, ఇలాంటి లైంగిక సంబంధాలను సమర్థిస్తున్నాడేమోనన్న సంశయం కలుగుతుంది. ఎందుకంటే, ఈ కథలో భర్త తిరునాళ్ళలో సుఖం వెతుక్కుంటే, భార్య ఓ యువకుడి సమాగం కోసం ఉవ్విళ్ళూరుతుంటుంది. కానీ ఈ కథలో భార్య 'మేనరికం పిల్లలకు' భయపడి భర్తను దూరం ఉంచుతుంది. కథ చివరలో భర్తకి హెచ్.ఐ.వి పాజిటివ్‌గా రిపోర్టు వస్తుంది. 'హె.చ్.ఐవి'తో సహా, 'అపోహ'లలో సామ్యం ఉన్నా, రచయితలు రచించిన రెండు కథలూ వేర్వేరు కథలుగా నిలుస్తాయి. అంతగా సంతృప్తినీయకున్నా ఈ అంశం చూపేందుకే ఈ కథలను పరిచయం చేయాల్సివచ్చింది.

*ఈస్థటిక్ స్పేస్*

దగ్గుమాటి పద్మాకర్ రచించిన ఈ కథ, మే 10 ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఈ రచయిత కథ చివర్లోనే తన పాత్రల మీద మాట పడనివ్వడని పరోక్షంగా ప్రకటించాడు. ఇందులో, భర్తపోయిన లలిత, భార్యపోయిన రవిబాబుకు నడుమ సాన్నిహిత్యం ఏర్పడుతుంది. రవిబాబు, లలితకు తన కోరిక వినిపిస్తాడు. 'నాలో యేం కోరుకుంటున్నావు నువ్వు? ఈ శరీరాన్నే కదా!' అని ఈసడిస్తుంది లలిత. 'రేపటి లోగా మళ్ళీ నా శరీరం గురించిన స్పృహ నీ కొచ్చిందంటే రానవసరం లేద'ని తరిమేస్తుంది. మరుసటి రోజు వాళ్ళిద్దరూ మళ్ళీ వాదించుకుంటారు. 'ఇంత సతీ సావిత్రి లెవెల్లో ఉంటావని నేను అనుకోలేదు మరి' అంటాడు రవిబాబు.

'కలయిక గురించి పట్టింపు ఉండకూడదని వాదించే వాళ్ళంతా ఎవరు పిలిస్తే వాళ్ళకి దాసోహం కావాలా?' అని ప్రశ్నిస్తుంది లలిత.

'నాలుగైదు సంవత్సరాల ఆత్మీయ పరిచయస్తుడు సెక్స్ దగ్గరకు వచ్చేసరికి పరాయివాడైపోతాడా?' అంటాడు రవిబాబు.

'మన శరీరాలు, గతం కూడా వేర్వేరు వ్యక్తులతో ముడిపడి ఉన్నాయంటుంది' లలిత.

'నువ్వు నీ భర్త స్మృతులతో, నేను భార్య జ్ఞాపకాలతో గడపాలంటావా?' అంటాడు రవిబాబు.

'నువ్వు నన్ను మనసులో కోరుకోవడమనేది గతంలో, అంటే, మీ భార్య ఉండగా కూడా ఉందా?' అని ప్రశ్నించి, కాస్సేపటికి, అతడిని ముద్దుపెట్టుకుంటుంది. ఇద్దరూ శారీరకంగా కలుస్తారు. ఆ తరువాత లలిత 'మనుషులకు సాంస్కృతిక విలువలు పిల్లల స్థాయి నుంచీ నేర్పాలి రవీ' అంటూ 'కండోమ్' ప్రచారాన్ని విమర్శిస్తుంది. తమలో ఉన్న 'ఈస్తటిక్ స్పేస్'ని గుర్తించక పోవటం వల్ల, మగవాళ్ళు, పశువులై అత్యాచారాలు చేస్తున్నారని తీర్మానిస్తుంది చివరలో. అంతకుముందు రవిపాత్ర, తన ఇష్టాఇష్టాలను దాచుకుని సందర్భోచితంగా మొత్తాన్ని ఖర్చు చేసినట్టు, 'పరాయి స్త్రీల మీద ఏర్పడే ఇష్టాలు, కోరికల్ని 'ఈస్తటిక్ స్పేస్'లో స్టోరయి, తన భార్యతో జరిగే సంగమంలో లీనమయ్యేవంటాడు. ఇదీ కథ.

ఈ కథను సంభాషణలతో సహా ఉదహరించటం ఎందుకంటే, అసలు కథను చదవకున్నా, పాఠకులు, ఈ కథలో రచయిత ప్రదర్శించిన సందిగ్ధం స్పష్టమవాలనే. 'పాత్రల మీద మాట పడకూడద'న్నాడు కాబట్టి, పాత్రల ఆలోచనల్ను పరామర్శిస్తే, పాత్రలు వాటిద్వారా రచయిత ఆలోచనల్లోని సందిగ్ధాలు గమనించవచ్చు.

శారీరక సంబంధం గురించి రచయిత వ్యక్తపరచిన భావాలు ఒకోసారి అభ్యుదయం వైపు మొగ్గి, మరోసారి 'అయోమయం' వైపు మొగ్గుతాయి. 'సావిత్రి లెవెల్' అని వాడడం వల్ల సాంప్రదాయక ఆలోచనలను, నియమనిబంధనలనూ కాదన్నట్టవుతుంది. ఆ వెంటనే, 'శారీరక పట్టింపు లేనివారు ఎవరు పిలిస్తే వాళ్ళకు దాసోహం కావాలా?' అని ప్రశ్నించటం 'భర్త స్మృతులతో నేనేదో తంటాలు పడుతున్నాన'నటం, రచయిత దేన్ని సమర్థించాలో, దేన్ని సమర్థిస్తే ఏమౌవుతుందోనని, అన్ని ఆలోచనల నడుమ 'బాలెన్స్' చేయాలని ప్రయత్నించాడని అనిపిస్తుంది. 'లైంగిక సంబంధం' కేవలం'కండరాల రాపిడి' అని నమ్మి, ప్రచారం చేసేవారినీ, అది వ్యక్తిత్వానికి, శీలానికీ సంబంధించినది అని నమ్మేవారినీ సంతృప్తి పరుస్తూ, ఆధునిక భావాలను ప్రదర్శించాలని తపన పడటం కనిపిస్తుంది. ఎందుకంటే 'నా శరీరాన్ని గురించిన స్పృహ ఉండకూడదన్న' లలిత మళ్ళీ శారీరక స్మృతుల ప్రసక్తి తెచ్చి, 'వశం' తప్పి లైంగిక చర్యలో పాల్గొంటుంది. 'నువ్వు చూపిన ఆపేక్షకు నాలో ఏమీ మిగుల్చుకోకూడదనిపించిందా క్షణం' అని సమర్థించుకోచూస్తుంది. తరువాత కండోమ్ ప్రచారాలపై, రెచ్చగొట్టే ప్రకటనలపై విరుచుకుపడి, 'సాంస్కృతిక విలువలు నేర్పాలి' అని తీర్మానించి, 'ఈస్తటిక్ స్పేస్' అనే 'మానసిక వ్యభిచారా'న్ని సమర్థిస్తుంది. కానీ లలిత, రవిబాబుకు లొంగటం వల్ల రచయిత స్త్రీ వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని, తన శరీరం నచ్చిన వాడికే అర్పించుకునే హక్కునూ సమర్థించే బదులు 'a female is at the mercy of her sex' తో పాత సూత్రాన్ని నిరూపించినట్టయింది. 'ఆడవాళ్ళ బలహీనత వారి శారీరక కోరిక' అనే మగవాడి వాదనను బలపరచినట్టయింది. పైగా 'సాంస్కృతిక' విలువలంటూ సాంప్రదాయక నైతిక విలువలను ప్రతీక అయిన 'సావిత్రి'ని ఎద్దేవ చేయటం, చులకన చూపటం, , ప్రస్తుతం రచయితల సందిగ్ధాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది.

రచయితలు తమ రచనలలో నైతిక విలువలను ప్రదర్శించి, మానసిక నియంత్రణకు పెద్దపీట వేస్తే వారిని బూజుపట్టిన సాంప్రదాయవాదులుగా పరిగణించి పక్కకు నెట్టేస్తారు. అలాగని నైతిక విలువలను వదలమని చెప్పలేదు కానీ లైంగకి సంబంధాలను ప్రోత్సహించకపోతే రచయిత ఆధునిక, అభ్యుదయవాద ఆమోద ముద్రను పొందలేడు. దాంతో రెచ్చగొట్టే ప్రచారాన్ని, కండోమ్ ప్రకటనలను విమర్శించి, 'వేరు శరీరం కాద'ని స్త్రీతో అనిపించి, ఆ శారీరక కోరికకు ఆమె లొంగేట్టు చేసి, 'అయినా తప్పేంలేదు' అని వాదించేట్టు చేస్తున్నారు రచయితలు. స్పష్టమైన ఆలోచన, ప్రదర్శించదలచుకున్న అంశంపై నిర్దుష్టమైన అవగాహన, సామాజిక పరిస్థితి, వ్యక్తుల మానసిక స్థితిగతుల పట్ల ఆలోచన, మంచి అయినా, చెడు అయినా, తాను నమ్మిన దాన్ని రాజీపడకుండా

ప్రదర్శించటం రచయిత విలువనూ, అతని రచన విలువనూ పెంచుతాయి. లేని పక్షంలో ' తన పాత్రల మీద మాట పడనివ్వనని రచయిత ఎంతగా అన్నా, మాటలు పడక తప్పదు.

## స్వేచ్ఛ

క్రరి శివాజీ రచించిన ఈ కథ మే 22, స్వాతి వారపత్రికలో ప్రచురితమయింది. ఈ కథే ఈ నెల కథ. మన కథకులు విస్మరిస్తున్న అత్యంత ఆవశ్యకమైన 'దేశభక్తి'ని ఈ కథ ప్రదర్శిస్తుంది. పౌరుడికి దేశం పట్ల ఉన్న బాధ్యతను నొక్కి చెపుతుందీ కథ. అందుకే, కథనం విషయంలో సన్నివేశ స్పష్టీకరణ విషయంలో ఎంత అసంతృప్తి ఉన్నా, 'కథాంశం' ఈ కథను ఈనెల కథగా నిలుపుతుంది.

కాశ్మీరులో పూంచ్ సెక్టర్‌లో, లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర ఉన్న డిఫెన్స్ పోస్ట్‌లో పనిచేస్తుంటాడు వెంకటేశ్వర్లు. విపరీతమైన మానసిక ఒత్తిడి, దుర్భరమైన వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక పోతాడు. ముఖ్యంగా, సెలవులకని ఇంటికి వెళ్ళివచ్చిన తరువాత, ఇతరులలా 'స్వేచ్ఛ'ను అనుభవించలేకపోవటం భార్యా, పిల్లలతో గడవలేక పోవటం అతడిలో తీవ్రమైన అసంతృప్తిని కలిగిస్తుంది.

'మంచుకొండల్లో తుపాకీలు తుడుచుకుంటూ గడపడం తనవల్ల కాదని' లీవుతీసుకుని వచ్చి, తిరిగి వెళ్ళడు. మిలటరీలో సంపాదించిన అనుభవంతో తండ్రి గేరేజీని బాగా నడిపి డబ్బులు సంపాదిస్తుంటాడు. అతడు సెలవుకని వెళ్ళి, డ్యూటీకి తిరిగి రాకపోవటంతో, మిలటరీవారు అతనిపై 'వారెంటు' జారీ చేస్తారు. కానీ, దాన్ని అతడికి అందివ్వకుండా, ఉండేందుకు పోలీసులు 'లంచం' అడుగుతారు. లంచం ఇస్తాడు వెంకటేశ్వర్లు. అయితే, దేశసేవ చేయాలనుకునే భర్తను కోరుకున్న అతడి భార్య, వెంకటేశ్వర్లుని వదిలి గర్భవతినని చెప్పకుండా, పుట్టింటికి వెళ్ళిపోతుంది. అతడి తల్లి నిరసనను చూసి, వెంకటేశ్వర్లు భార్యకోసం వెళతాడు. 'పుట్టబోయే బిడ్డ చెవిలో గర్వంగా చెప్పాలనుకునేదానిని నువ్వొక సైనికుడి బిడ్డవని' అంటుంది. 'బాధ్యతకి వెన్ను చూపటం పిరికితనమే' అంటుంది. దేశం బాధ్యతను, మరచిపోయి స్వేచ్ఛ కావాలనటాన్ని విమర్శిస్తుంది. 'స్వేచ్ఛ' అనేది మన కర్వవ్యాన్ని నిర్వర్తించినప్పుడే లభిస్తుందంటుంది. మంచులో పనిచేసే సైనికుల సీడీ చూపి 'ఇది మీ బాధ్యత' అని గుర్తు చేస్తుంది. ఆమె మాటలకు కనువిప్పు కలిగి వెంకటేశ్వర్లు మళ్ళీ సైన్యంలోకి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంటాడు. ఈ నిర్ణయం తీసుకోవటంలో పోలీసుల లంచం వేధింపు తన వంతు పాత్ర వహిస్తుంది. నిర్ణయం తీసుకోవటంతో 'జీవితంలో మొట్టమొదటి సారిగా అతడికి ఈ ప్రపంచంలో నుండి సంపూర్ణ స్వేచ్ఛ లభించిన భావన' కలుగుతుంది. ఇదీ కథ.

నిజానికి ఇది కొత్త కథ కాదు. 'ఖడ్గతిక్కన' కథ మనకు తెలిసిందే పైగా వెంకటేశ్వర్లు తిరిగి వెళ్ళేందుకు బలమైన కారణం కథలో లేదు. కానీ, సైనిక జీవితం పట్ల సమాజంలో చిన్న చూపు ఏర్పడుతూ, యువతీ యువకులు 'ఇతర' ఉద్యోగాల వైపే మొగ్గు చూపుతున్న సమయంలో సమాజానికి బాధ్యత, కర్తవ్యాలను గుర్తుచేసే ఇలాంటి కథల అవసరం ఎంతయినా ఉంది. అందుకే, ఈ కథ ఎంత మామూలుగా ఉన్నా 'ఈనెల కథ'గా ఎంపికయింది.

మన సమాజంలో మన కథకులు విస్మరిస్తున్న అంశాలు, అత్యంత ప్రాధాన్యమైనవి అనేకం ఉన్నాయి. కానీ, మన కథలు మాత్రం స్త్రీ, పురుష సంబంధాలు, ప్రేమలు, పెళ్ళిళ్ళ చుట్టే తిరుగుతున్నాయి. అలాంటి కథల నడుమ ఇలాంటి కథ కనబడటమే ఆనందం కలిగిస్తుంది. మనం మన సైనికుల త్యాగాలను పట్టించు కోవటం లేదు. మనం ఇళ్ళల్లో హాయిగా కూర్చుని టీవీలు చూస్తూ, ప్రతి విషయం మనకే తెలిసినట్టు వ్యాఖ్యలు చేస్తూ, విమర్శలు చేస్తున్న సమయంలో సైనికులు చలిలో, మంచులో, చీకటిలో, తుఫానుల్లో ప్రాణాలు పణంగా పెట్టి ఎప్పుడొస్తుందో తెలియని శతృదాడి నుంచి మనల్ని రక్షించేందుకు అనుక్షణం అప్రమత్తంగా కాపలా కాస్తుంటారు. మనం సుఖంగా, భద్రంగా బ్రతుకుతూ హక్కుల గురించీ, స్వేచ్ఛ గురించీ మాట్లాడగలగటానికి, తమ స్వేచ్ఛనూ, వ్యక్తిత్వాన్నీ, ప్రాణాన్నీ,

కర్తవ్యనిర్వహణ, బాధ్యతల ముందు దిగదుడుపుగా భావించిన సైనికుల బలిదానాల వల్లనే. కానీ, మన కథలలో తీవ్రవాదుల మనస్తత్వాలూ, అమాయకులు తీవ్రవాదులుగా మారటానికి సమర్ధనలు, సైనికులపై విమర్శలు ఉంటాయి తప్ప, సైనికుల పట్ల సానుభూతి, అవగాహన కృతజ్ఞతలు కనిపించవు. అలాంటి 'కథ' ఒక్కటి కనిపిస్తే రచన ఎంత మామూలుగా ఉన్నా ఆదరించి, ప్రోత్సహించాల్సి ఉంటుంది. అప్పుడు ఇతర కథకులు కూడా తమ దృష్టిని ఈవైపు సారిస్తారు. అందుకే ఈ కథను రచించిన కర్రి శివాజీకి కృతజ్ఞతలతో కూడిన అభినందనలు.

*ఈనెల కథ*

**స్వేచ్ఛ** - కర్రి శివాజీ

స్వాతి వారపత్రిక, మే 22, 2009 సంచిక నుంచి

వెంకటేశ్వర్లు లైట్ మిషన్ గన్‌ని బంకర్ కన్నంలోంచి బయటకి గురిపెట్టి చాలాసేపటి నుండీ నిశితంగా చూస్తున్నాడు. కాశ్మీరులో ఊంచ్ సెక్టర్, లైన్ ఆఫ్ కంట్రోల్ దగ్గర మట్టితో కట్టబడిన ఓ డిఫెన్స్ పోస్టు అది. ఎవరో నలుగురు ఆ సరిహద్దు రేఖ దగ్గర తచ్చాడుతున్నారు, కానీ ఫైరింగ్ రేంజ్‌లో రావడం లేదు. అదీకాకుండా సరిహద్దు దాటకుండా ఫైరింగ్ చెయ్యకూడదని ఆదేశాలున్నాయి.

అలా చాలా సేపటి నుండీ దాగుడుమూతలాడుతూ, అతడి సహనాన్ని మరింతగా పరీక్షిస్తున్నారు.

వెంకటేశ్వర్లు అప్పటికే చాలా అలసిపోయాడు. ఇంటికెళ్ళొచ్చి నెలరోజులే అయినా, ఆ ఆలోచనలే వెంట తరుముతున్నాయి. రెండు నెలల సెలవూ, కొత్త ఇల్లు కట్టడానికే వాడేసాడు. స్లాబ్ మాత్రమే పూర్తయ్యింది.

లీవు అయిపోవడంతో వచ్చి డ్యూటీలో జాయినైపోయాడు. తల్లీ, తండ్రి, భార్య రుక్మిణి గుర్తొస్తున్నారు. ఉన్న క్యాజువల్ లీవు ఇప్పుడే వాడేస్తే, ఇంకా ఆర్నెల్లు పడుతుంది సంవత్సరం పూర్తవడానికి. ఇంటికెళ్ళినప్పుడు స్నేహితులనీ, బంధువలనీ చూసి అసూయ కలిగింది.

అయినా వాళ్ళకి సెలవు కూడా అక్కర్లేదు. భార్యా బిడ్డలు, బంధువులూ అందరూ చుట్టూనే ఉంటారు. పండగలకి, ఫంక్షన్లకి కలుస్తుంటారు. తనేమో బోర్డర్‌లో కనిపించని శత్రువుని కనిపెట్టుకుంటూ పడున్నాడు.

డ్యూటీ రిలీవ్ కావడానికి ఇంకో గంట ఉంది. ట్రిగర్ గార్డ్‌లో వేలు దూరదని గ్లవ్స్ తీసెయ్యడంతో చలికి వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. అతడిని అసహనం ముంచెత్తింది. పక్కనే స్లీపింగ్ బ్యాగ్‌లో గుర్రుపెట్టి పడుకునున్న రంగరాజుని ఏదో అత్యవసర పనున్నట్టు నిద్రలేపాడు.

"రాజా! నేను డ్యూటీ చెయ్యలేకపోతున్నానురా, కాస్త రెస్టు తీసుకుంటాను" అని చెప్పి అతడు ఖాళీ చేసిన స్లీపింగ్ బ్యాగ్‌లోకి దూరి కళ్ళుమూసుకున్నాడు. ఎంత ప్రయత్నించినా ఏమాత్రం నిద్రపట్టలేదు.

ఏ సైనికుడి అంతరంగం తెరిచి చూసినా దాదాపు ఇదే కథ, కాస్త అటూ ఇటూగా. అందరూ అనుకుంటుంటారు - వీళ్ళు తినే తిండి నుంచీ, కట్టుకునే బట్టవరకూ అన్నీ రూపాయి ఖర్చులేకుండా ఫ్రీగా దొరుకుతాయి.

గత నలభై ఏళ్ళలో కార్గిల్ తప్పించి పెద్దగా యుద్ధ ఛాయలు కూడాలేవు అసలేం పనుంటుందని. విపరీతమైన మానసిక ఒత్తిడి, దుర్భరమైన వాతావరణ పరిస్థితులు, అపరిష్కృతంగా మిగిలిపోయిన ఇంటి గొడవలు, లీవు తర్వాత వెళ్ళిపోతున్నప్పుడు కాళ్ళకి అడ్డం పడి గొడవ చేసే పిల్లలూ, తడి కళ్ళతో దీవించే తల్లితండ్రులూ, "మళ్ళీ ఎప్పుడొస్తావ్?" అని మౌనంగా ప్రశ్నించే భార్య... అనుభవిస్తే గానీ తెలీదు మనసుకు ఆ ఆర్ధ్రత.

వెంకటేశ్వర్లు తండ్రికి ఓ చిన్న మోటార్ గ్యారేజ్ ఉంది. వృద్ధాప్యంలో ఒక్కడూ అది చూసుకోలేక సతమతమవుతున్నాడు. సెలవులో ఇంటికెళ్ళినప్పుడు, వెంకటేశ్వర్లు తండ్రికి సహాయపడుతుంటాడు. చిన్నప్పటినుండీ నట్లూ, బోల్టులూ, రెంచీలతో ఆడుకునేవాడు కనుకే, మిలట్రీలో చేరిన తర్వాత వెహికల్ మెకానిక్ ట్రేడ్ ఎన్నుకుని, పదేళ్ళలో అరుదైన ప్రావీణ్యం సంపాదించాడు.

పెళ్ళైన అయిదేళ్ళలో పిల్లలు కలగలేదన్న చింత తప్పిస్తే, పెద్దగా చెప్పుకోదగ్గ అలజడులు లేని జీవితం. కానీ ఈమధ్య ఇంటికెళ్ళొచ్చిన తర్వాత అతడి దృక్పథం మారిపోయింది. తనింతకాలం కోల్పోయిన స్వేచ్ఛామయ జీవితం పట్ల ఆరాటం పెరిగిపోయింది.

మర్నాడు రైఫిల్ క్లీనింగ్ పెరేడ్‌లో, వేడినీళ్ళు పోసిన రైఫిల్ బారెల్ లోంచి పుల్‌త్రూ లాగుతూ, పక్కనే ఉన్న రంగరాజుతో ఇలా చెప్పాడు వెంకటేశ్వర్లు.

"రాజూ రేపు లీవులో వెళుతున్నానురా"

"అదేంట్రా, మొన్ననే వచ్చావుగదా!?"

"ఈసారి పర్మినెంట్‌గా వెళ్ళిపోతున్నానురా" అన్నాడు.

రంగరాజుకి ఆ మాటలు విని, వాటిని పూర్తిగా జీర్ణం చేసుకోవడానికి చాలా సమయమే పట్టింది.

"నిన్నా మొన్న జాయిన్ అయిన కుర్రవాడయితే ఈ మాటంటే అర్థముంది. కష్టమైన ట్రైనింగ్ పూర్తిచేసి, పదేళ్ళ సర్వీసు, రెండు పోస్టింగులూ పూర్తయిన తర్వాత ఇప్పుడేమిటి ఈ ఆలోచన?" అని అన్నాడు.

"ఇంకా ఎనిమిదేళ్ళు పూర్తిచేస్తేగానీ పెన్షన్ రాదు. అంతవరకూ ఆర్మీ వదలడానికి వీల్లేదు. సంవత్సరానికి రెండు నెలలు సెలవలు ఇస్తే ఇంకో నెల క్యాజువల్ లీవు.... బయటకెళ్ళేసరికి నలభైయేళ్ళొచ్చేస్తాయి. అప్పటివరకూ ఇలా మంచుకొండల్లో ఈ తుపాకులు తుడుచుకుంటూ ఈ జీవితం గడిపెయ్యడం నావల్ల కాదు" అన్నాడు.

"వెర్రి ఆలోచనలు మానుకో, అయినా ఈ ఉద్యోగానికి ఏంట్రా మంచి జీతం, వేళకి బలమైన ఆహారం, ఫ్రీ రైల్వే వారెంట్లు, ఆఖరికి మనం వేసుకునే మేజోళ్ళు, చెడ్డీలు కూడా గవర్నమెంటే భరిస్తుంది.

బయట చూడు ఎంత నిరుద్యోగమో, మనలా చిన్న తరగతులు చదిఇన వాళ్ళకి ప్యూన్ పోస్ట్ కూడా రాదు. అయినా నీకిప్పుడు ఏంట్రా తక్కువ?" అన్నాడు.

ఒక్కసారిగా "స్వేచ్ఛ!" అని, నిర్వికారంగా స్నేహితుడి వైపు చూసి జవాబిచ్చాడు వెంకటేశ్వర్లు.

***

"అదేమిటి, నిన్నటితో మీ లీవు అయిపోయింది కదా... పొడిగించారా?" ఆలస్యంగా లేచిన భర్తకి వేడి వేడి కాఫీ అందిస్తూ అడిగింది రుక్మిణి.

"లేదు ఇక వెళ్ళదలచుకోలేదు" ఆమె వైపు చూడకుండా చెప్పాడు. రుక్మిణి నిశ్చేష్టురాలుగా అయ్యింది.

"నా సర్వీసంతా వెహికల్ మెకానిక్ ట్రేడ్‌లో గడిచింది. బోల్డంత అనుభవముంది. నాన్న గ్యారేజ్‌ని ఇంప్రూవ్ చేసానంటే, మిలట్రీలో కంటే ఎక్కువే సంపాదించొచ్చు... నువ్వేం బెంగపడకు" భార్యకి ధైర్యం చెప్పాడు.

"నేను ఆలోచిస్తోంది మనకెలా గడుస్తుందని కాదు... ఇలా హఠాత్తుగా మానెయ్యడమేమిటా అని"

"నేను ఇంటిపట్టున ఉండడం ఇష్టం లేదా చెప్పు ... వెళ్ళిపోతాను" భర్త వితండవాదనికి జవాను చెప్పలేక వంటగదిలో ఏదో పనిఉన్నట్టుగ వెళ్ళిపోయిందామె.

"నా ఫ్రెండ్స్ అంతా చూడు ఎంత హాయిగా ఉన్నారో. పొద్దున్న పన్లోకి వెళతారు. సాయంత్రం దర్జాగా భార్యలతో స్కూటర్ల మీద షికార్లు, లేకపోతే పిల్లలతో కలిసి హాయిగా టీవీ చూస్తూ. ఎన్ని చిన్న చిన్న సరదాలకి దూరమైపోతున్నామో ఆలోచించు. ఆర్మీలో రిటైర్ అయిన తర్వాత ఈ వయస్సు మళ్ళీ వస్తుందా?... అందుకే వెళ్ళదలుచుకోలేదు. ఇక ఈ విషయం ఇంతటితో వదిలేస్తే మంచిది" స్థిరంగా భార్య రుక్మిణికి చెప్పాడు వెంకటేశ్వర్లు.

రుక్మిణి మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చింది. బి.ఎస్సీ, బి.ఇడి అయిన తర్వాత స్కూల్లో సైన్స్ టీచర్‌గా చేరింది.చదువుకి అందం తోడవడంతో చాలా మంచి సంబంధాలు వచ్చాయి. ఆ సంబంధాలు పెళ్ళిచూపుల వరకూ కూడా రానిచ్చేది కాదు.

చిన్నప్పటినుండీ 'కలాం' గురించి చదివీ ఇన్స్‌పైర్ అవడంతో, కాబోయే భర్త సైంటిస్ట్ కాకపోయినా, దేశం కోసం పాటుపడే వ్యక్తికావాలని కోరుకునేది.

వెంకటేశ్వర్లు సంబంధం వచ్చినప్పుడు 'నువ్వింత చదువుకున్నదానివి. అతడేమో కేవలం ఓ సిపాయి మాత్రమే' అని తండ్రి ఎంత మొత్తుకున్నా అతడ్నే చేసుకుంటాననే మొండి పట్టుదలతో తన పంతం నెగ్గించుకుంది.

వెంకటేశ్వర్లు ఫీల్డ్ పోస్టింగ్స్‌తో సంవత్సరంలో చాలా కాలం దూరంగా ఉన్నా, ఎప్పుడూ మొక్కవోని ధైర్యంతో, సగర్వంగా తలెత్తుకుని తిరిగేది. తోటి టీచర్లు భర్తలు ఎంత పెద్ద ఆఫీసర్లయినా, తన భర్త దేశానికి ప్రత్యక్షంగా సరిహద్దుల్లో సేవ చేస్తున్నాడని, ఆ భాగ్యం అందరికీ కలగదని బల్లగుద్ది వాదించి ఆత్మగౌరవంతో ఉండేది. వెంకటేశ్వర్లు జీతం తక్కువైనా అతడ్ని ఆరాధించేది.

వెంకటేశ్వర్లు నిర్ణయం ఆమెకి పెద్ద షాక్‌లా తగిలింది. విలువల పునాది మీద విశ్వాసం అనే ఇటుకలు పేర్చుకుంటూ నిర్మించుకున్న మేడ హఠాత్తుగా పేకముక్కల ఇల్లులా కూలిపోయింది. కొద్దో గొప్పో ఎక్కడో మిగిలి ఉన్న ఆత్మస్థైర్యం, రెండువారాల తర్వాత సుందర్రావు రాకతో పూర్తిగా హరించుకుపోయింది.

సుందర్రావు పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నాడు. వెంకటేశ్వర్లుకి వేలు విడిచిన మేనత్త కొడుకు.

"ఏంటి బావా ఇలాంటి పని చేసేముందు వెనకా ముందూ ఆలోచించొద్దూ. మీ మిలట్రీవాళ్ళు నీ మీద అప్రిహెన్షన్ రోల్ జారీ చేశారు. మా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఇలాంటి వాటిలో పండిపోయాడు. నేను నీకు బంధువని తెలుసు కాబట్టి నన్ను పంపాడు. ముసుగులో గుద్దులాట ఎందుకు... ఫస్ట్ పేమెంట్ పదివేలు ...ప్రతినెలా అయిదువేలు... నువ్వులేవని జవాబు పంపిస్తుండాలి కదా" అన్నాడు.

రుక్మిణి ఊపిరి బిగబట్టి చూసింది. ఇంత దారుణమైన బ్లాక్ మెయిల్‌ని భర్త చాలా ఆవేశంగా తిప్పికొడతాడని.

వెంకటేశ్వర్లు లోపలికి వెళ్ళి డబ్బు తీసుకొచ్చి సుందర్రావు చేతిలో పెడుతున్నప్పుడు, ఎక్కడో అంతరాళంలో గాలికి కొట్టుకుంటూ మినుకు మినుకుమంటున్న ఓ చిన్న దీపం ఈ సంఘటనతో టప్పున ఆరిపోయింది.

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత ఒంట్లో నలతగా ఉందని పుట్టింటికి బయల్దేరింది రుక్మిణి. ఆమె ఆత్మ సంఘర్షణ కొద్దికొద్దిగా అర్థమవుతూనే ఉంది వెంకటేశ్వర్లుకి. కొన్నాళ్ళు పోతే తనే అర్థంచేసుకుని తిరిగొస్తుందిలే అనే ధీమాతో 'మళ్ళీ ఎప్పుడొస్తావ్' అని కూడా అడకుండా మౌనంగా ఉండిపోయాడు.

తండ్రి గ్యారేజ్‌లో వెంకటేశ్వర్లు చేరిన నెలరోజులకే ఎంతో పేరొచ్చింది. ఆర్మీ వెహికల్స్ పదేళ్ళు రిపేరు చేసి పండిపోయున్నాడు. అదీకాక మిలట్రీ నేర్పించిన నిజాయితీ కష్టపడే తత్వం జోడవడంతో, కష్టమర్లకి అతడంతే విపరీతమైన గురి, నమ్మకం ఏర్పడ్డాయి.

ఖర్చులన్నీపోనూ, మొదటినెలలో ముప్ఫైవేలు, రెండో నెలలో అంతకు రెట్టింపు వచ్చిపడ్డాయి. ఇవన్నీ కాకుండా కొత్తగా వచ్చిపడిన స్వాతంత్ర్యం అతడికి అమితంగా నచ్చింది. మనకి మనమే రాజూ, మంత్రీ. ఎవరికీ జవాబు దారు కాదు అనే భావన మరీ నచ్చింది.

రుక్మిణి దగ్గరకి ఒకసారి వెళ్ళాడు గానీ, ఆమె ముభావంగా పలకరించడంతో అహం అడ్డొచ్చి, మళ్ళీ వెళ్ళలేదు. సంవత్సరం తిరిగేసరికి, కొత్త ఇల్లు కట్టి, దానికి 'రుక్మిణీ నిలయం' అని పేరు పెట్టి, భార్యని సర్ ప్రైజ్ చేస్తే ఈ కోపమంతా మంచులా కరిగిపోయి, భర్త ప్రయోజకత్వానికి ఆమె మురిసిపోతుందని అనుకున్నాడు.

రుక్మిణి అలా అలిగి వెళ్ళిపోవడానికి కారణం తను బంగారంలాంటి ఉద్యోగం మానేసి వచ్చేసాడని, ఆర్థిక ఇబ్బందులు ఎలా తట్టుకోగలమా అని ఆలోచించలేదని, అలిగి వెళ్ళిపోయిందనే భావించాడు.

అతడికి ఇతర కారణాలు వెతికే అవసరం కనిపించలేదు. సుందర్రావు ప్రతినెలా వస్తూనే వున్నాడు. కొద్దికాలం తర్వాత అందరూ మర్చిపోతారులే. ఈ సర్కిల్ ఇన్స్పెక్టర్ ట్రాన్స్ఫర్ అయిపోతే ఈ జాడ్యం కూడా సమసిపోతుందిలే అనుకున్నాడు. అతడి ఆలోచన తప్పని చాలా కొద్దిరోజుల్లోనే తెలుసుకున్నాడు వెంకటేశ్వర్లు.

ఆర్నెల్లకే వెంకటేశ్వర్లు గ్యారేజ్ ఎంతో అభివృద్ధి చెందింది. పక్కనే ఉన్న స్థలం అద్దెకి తీసుకుని షెడ్లు వేసి ఇంకో పదిమందిని నియమించుకున్నాడు. అందరూ ఎక్స్ సర్వీస్మెన్లే. కానీ అతడిని ఏదో తప్పుచేసానన్న భావన అప్పుడప్పుడు చిన్నగా కదిలిస్తూనే ఉంది. మధ్యలో రంగరాజు రెండు ఉత్తరాలు రాసాడు. వాళ్ళ యూనిట్ కాశ్మీర్ నుండి అరుణాచల్ వెళ్ళిపోతుందని తెల్సింది.

ఆరోజు అతడు ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. స్నానం చేసి వచ్చేసరికి తల్లి భోజనం సిద్ధం చేసింది. "రుక్మిణి దగ్గరకెళ్ళావా ఈ మధ్య...?" పొడిగా అడిగిందావిడ వెంకటేశ్వర్లు ముఖాన్ని చూస్తూ.

"ఏంటమ్మా అంత పొగరు. ఓసారి వెళితే సరిగ్గా పలకరించనూ లేదు నువ్వూ, నాన్న వెళ్ళి తీసుకురండి.... వస్తానంటే" అని తల్లికి విసురుగా సమాధానమిచ్చాడు.

"లేదురా నువ్వే వెళ్ళాలి. నీ భార్య మనింటి నుండి వెళ్ళే సమయానికే నెల తప్పింది. నీకా శుభవార్త ఆ అమ్మాయి చెప్పకుండా వెళ్ళిపోయిందంటే ఎంత బాధ పడుంటుందో నువ్వే ఆలోచించు" అంది.

వెంకటేశ్వర్లు నిర్ఘాంతపోయాడు.

"నువ్వెందుకమ్మా ఇంతకాలమూ చెప్పలేదు?" తల్లిని నిలదీశాడు వెంకటేశ్వర్లు. ఆవిడ కొడుకువైపు పరిశీలనగా చూసి, నెమ్మదిగా బదులిచ్చింది.

"ఎందుకంటే నేను కూడా రుక్మిణిలానే ఆలోచిస్తాను కాబట్టి" ఆ ఒక్క మాటలో వేనవేల అర్థాలు గోచరించాయతడికి. మర్నాడే అత్తగారింటికెళ్ళాడు.

పూర్ణగర్భంతో రుక్మిణి ఎదురొచ్చింది. ఆ సమయంలో ప్రతి స్త్రీలో గోచరించే మెరుపు కూడా ఆమె కళ్ళకింద దాచలేకపోయింది.

"ఇంత అద్భుతమైన వార్త నాతో పంచుకోకుండా దాచిపెట్టి నిన్ను నువ్వు ఎందుకు టార్చర్ చేసుకున్నావ్?" భార్య చేతిని, తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు.

ఉద్వేగం అతడి కళ్ళని తడిచేసి వదిలింది.

"ఇలాంటి వార్తని ఏ స్త్రీ దాచుకోలేదు.... అందులోనూ పెళ్ళయిన అయిదేళ్ళకి మొదటి ప్రెగ్నెన్సీ... కానీ చెప్పాలనిపించలేదంటే ఎంత దారుణంగా దెబ్బతిన్నానో ఊహించండి. పుట్టబోయే బిడ్డ చెవిలో గర్వంగా చెప్పాలనుకునే దానిని 'నువ్వొక సైనికుడి బిడ్డవని'.

కానీ మీరిలా ఆర్మీ వదిలేసి ఓ పిరికివాడిలా పారిపోయారంటే..... భరించలేకపోయాను. ఇక్కడ పిరికితనం అంటే శత్రువులని చూసి పరుగెత్తడం కాదు. మన బాధ్యతకి వెన్ను చూపించడం కూడా పిరికితనమే.

దేశం మీమీదొక బాధ్యత పెట్టింది. అది మరిచిపోయి 'స్వేచ్ఛ' కావాలని మీరు దాని నుంచి దూరంగా పరిగెత్తారు, నా కడుపులో ఉన్న మన బిడ్డ స్వేచ్ఛ కావాలని, నా కడుపు చీల్చుకుని బయటకి వచ్చేద్దామని ప్రయత్నించదు. ఉపమానానికి నన్ను క్షమించండి. 'స్వేచ్ఛ' అనేది మన కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడే లభిస్తుంది.

ఏ ఉద్యోగం లేకుండా సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడకుండా, తాతలు సంపాదించిన ఆస్తితో, సిన్మాలు చూసుకుంటూ, పెళ్ళాం పిల్లలతో ఖాళీగా గడిపే వ్యక్తిని చూసి 'అబ్బా ఎంత ఆనందంగా ఉన్నాడు' అనుకుంటే అది మూర్ఖత్వమే.

మీరు గ్యారేజ్‌లో, ఆర్మీకంటే ఎక్కువే సంపాదిస్తున్నారు. కానీ మీకా స్కిల్ ఎక్కడినుంచి వచ్చిందో తెలుసా, ఆర్మీలో పనిచెయ్యడంవలన. రెండురోజుల క్రితం ఓ ఇంగ్లీష్ ఛానల్‌లో వచ్చిన ప్రోగ్రాం మీకోసం రికార్డ్ చేశాను.. చూడండి" అని సీడీ ప్లేయర్ ఆన్ చేసింది రుక్మిణి.

అరుణాచల్ ప్రదేశ్ తవాంగ్ ప్రాంతంలో షూట్ చెయ్యబడిందది. చైనా ఆ ప్రాంతమ్మీద తన హక్కుని ప్రకటించిన తరువాత అక్కడికి తరలి వెళుతున్న భారత సైనిక వాహనాల కాన్వాయిలవి.

మంచులో పూర్తిగా కూరుకుపోయిన వెహికల్స్‌ని, దారిలో పాడైపోయిన ట్రక్కుల్నీ, రికవరీ వ్యాన్‌తో పక్కకి తప్పిస్తున్న దృశ్యాలు... వెనుకనే ఆర్మీ ఎంత కఠినమైన అప్రిస్థితుల్లో పనిచేస్తూ ఉందో వివరిస్తున్న ఇంగ్లీష్ కామెంటరీ.

కంబాట్ యూనిఫామ్స్‌లో చలిని లెక్కచెయ్యకుండా రిపేర్లు చేస్తున్న సైనికుల మీద కెమేరా జూమ్ చేశారు.... వాళ్ళల్లో రంగరాజుని స్పష్టంగా గుర్తుపట్టాడు వెంకటేశ్వర్లు. సీడీ ప్లేయర్ ఆగిన తర్వాత రుక్మిణి మళ్ళీ కొనసాగించింది. "ఈ దృశ్యాలన్నీ మీకు చూపించటానికి, ఇది..... మీ బాధ్యత అని గుర్తుచెయ్యడానికి సిగ్గుపడటం లేదు.

ఇదే విషయం మీరు తిరిగివెళ్ళనని నిర్ణయించుకున్న రోజే ఎదిరించి చెబితే, మీరిచ్చే సంజాయిషీకి బహుశ మీ వాదనే కరెక్టేనేమో అని సమాధానపడిపోయుండేదాన్నేమో. అందుకే ఇన్నాళ్ళూ ఆగాను.

అందరూ సంసారాలు చేస్తారు, పిల్లల్ని కంటారు. ముసలివారై చనిపోతారు. కానీ ఓ సైనికుడుకి మరణం లేదంటారు. వీళ్ళందరూ చాలా గొప్పవాళ్ళు....

మీరూ వాళ్ళల్లో ఒకరని ఇన్నాళ్ళూ గర్వపడ్డాను..." చెప్పడం ఆపి, అతడి వైపు అభావంగా చూసింది.

"మీరు ఇంటికెళ్ళండి. డెలివరీ తర్వాత నేనూ వచ్చేస్తాను. మళ్ళీ మీ భార్యలా ఇంతకు ముందులా ఉండలేనేమో. కానీ మన బిడ్డకి ఓ తండ్రికావాలి కదా... మనమూ అందరిలానే బతికేద్దాం మీరనుకునే ఆనందంతో".

రుక్మిణి స్థిరంగా చెప్పిందీసారి.

వెంకటేశ్వర్లు ఇంటికొచ్చేసరికే సుందర్రావు వెంకటేశ్వర్లు కూర్చుని ఉన్నాడు. "రా బావా నీకోసమే ఎదురుచూస్తున్నాను. నీ గ్యారేజ్ బాగా పెరిగిందటగా. మొత్తానికి ఆర్మీ వదిలేసి మంచి పనిచేశావ్. ఇంత సంపాదన అక్కడొస్తుందా చెప్పు. మా పోలీస్ జీపులన్నీ రిపేర్‌కి నీ గ్యారేజ్‌కే పంపమని మా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మాతో చెప్పాడు.

నువ్వు వాటికి ఛార్జ్ చెయ్యవని తెలుసనుకో. ఇంకో చిన్న విషయం.... ఈనెల నుండీ నువ్విచ్చేది కొంచెం పెంచమని చెప్పాడు. నీ ఇష్టం ఎంతైనా సరే, బంధువుల దగ్గర ఎక్కువెలా తీసుకుంటాను చెప్పు..."

వెంకటేశ్వర్లు నెమ్మదిగా లేచి సుందర్రావుని సమీపించాడు. అతడికి ఏం జరుగుతోందో తెలిసే లోపలే సాచి పెట్టి సుందర్రావు దవడ మీద కొట్టాడు.

ఆ అదటుకి, అతడు సోఫాలోంచి తూలి పోయి కింద పడిపోయాడు. అతడ్ని కాలర్ పట్టి మీదకి లాగి, మొహంలోకి తీక్షణంగా చూస్తూ చెప్పాడు.

"ఎంతకాలం బ్లాక్‌మెయిల్ చేద్దామనుకుంటున్నారా మీ పోలీసులు? నేను తప్పు చేశాను నిజమే. కానీ మీరెందుకురా ఇంతలా గడ్డి తింటున్నారు. వెళ్ళి మీ సర్కిల్‌కి చెప్పు. ఇంకో అరగంటలో నేను వెళ్ళిపోతున్నానని.

మళ్ళీ నేను యూనిట్‌కి రిపోర్ట్ చేస్తే, నన్ను తప్పకుండా ఆర్మీ కోర్టు శిక్షిస్తుంది. కానీ మా వాళ్ళు నన్ను నా మనసును తప్పకుండా అర్థం చేసుకుంటారు. సెలవులో ఇంటికొచ్చిన సైనికుడికి ఎన్నో సమస్యలుంటాయి.

అందుకనే ఓవర్ స్టేయల్ ఆఫ్ లీవ్‌ని తీవ్రమైన నేరంగా పరిగణించరు వలంటీర్‌గా మళ్ళీ రీజాయిన్ అయితే.... మీ చేతుల్లో రోజూ చచ్చేకంటే ఆ శిక్ష అనుభవించి మళ్ళీ నా సైనిక జీవితాన్ని ఆరంభించడమే బెటరు.... మళ్ళీ నువ్వీ ఇంటి ఛాయలకి వచ్చావంటే ఉతికి ఆరేస్తాను" చాలా తీవ్రంగా హెచ్చరించాడు వెంకటేశ్వర్లు.

సుందర్రావు వెళ్ళిపోయిన తర్వాత, బయటకొచ్చి గట్టిగా శ్వాస తీసుకుని వదిలాడు వెంకటేశ్వర్లు. జీవితంలో మొట్టమొదటిసారిగా అతడికి ఈ ప్రపంచంలో నుండి 'సంపూర్ణ స్వేచ్ఛ' లభించిన భావన కలిగింది.

✷✷✷






## జూన్ ౨౦౦౯

**కథా సాగర మథనంలో** జూన్ నెల మాసపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, రచన - వార పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్య - దినపత్రికలు ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 82 కథలను విశ్లేషించటం జరిగింది.

క్రితం నెలలలాగే, ఈ నెల కూడా కథలన్నీ దాదాపుగా అధికశాతం మూస కథలే. ప్రపంచంలో బోలెడన్ని సమస్యలున్నాయి. కొత్త కొత్త సమస్యలు అనేకం పుట్టుకొస్తున్నాయి. కానీ, మన తెలుగు కథల వస్తువులలో మాత్రం అవి కనబడటం లేదు. రచనా సంవిధానంలో మార్పులేదు. దాంతో ఉన్నవాటిలోంచే కాస్త భిన్నంగా అనిపించిన కథలను ఏరుకోవాల్సి వస్తోంది.

*__పులిని చంపిన లేడి నెత్తురు.__*

గన్నవరపు నరసింహమూర్తి రచించిన ఈ కథ జూన్ పది, నవ్య సంచికలో ప్రచురితమయింది. 'కథాసాగర మథనం'లో పాఠకుల పరిచయానికి ఈ కథను ఎన్నుకోవటంలో ప్రధాన పాత్ర పోషించింది ఈ కథ ప్రదర్శించిన అంశం. కథ ఓ పోలీసు దృక్కోణంలో చెపుతాడు రచయిత. కానీ, పొలిటికల్లీ కరెక్ట్ కథ. అంటే పోలీసులది తప్పు అని నిరూపించే కథ అన్నమాట. కానీ, ఈ కథలో పోలీసులకూ మనసు ఉందని చూపించడం అభినందనీయం. పోలీసులను క్రూరులుగా, రాక్షసులుగా చూపించి ఉంటే 'పొలిటికల్లీ ఆబ్సల్యూట్లీ కరెక్ట్' కథ అయిఉండేది. చింతపల్లి, నక్సల్స్ ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతం. ఆ ప్రాంతంలో గిరిజనులు అధికంగా ఉండే, రావిగూడ ప్రాంతంలో పోలీసుల జీపును నక్సల్స్ పేల్చేస్తారు. పరిశోధనకు వెళ్ళిన సర్కిల్ ఇన్స్పెక్టర్‌కి, నక్సల్స్ ఓ స్కూల్లో ఆ రాత్రి తలదాచుకున్నారని తెలుస్తుంది. స్కూలు టీచర్ని పట్టుకుని హింసిస్తారు. అతడు చనిపోతాడు. చనిపోతూ ఓ ఉత్తరం రాస్తాడు. పోలీసులు గిరిజనులపై అత్యాచారాలు చేశారని, గిరిజనులు నక్సల్స్‌ని మందు పెట్టమంటే, వారిలా ప్రతీకారం తీర్చుకున్నారనీ రాస్తాడు. అలాగే, తను మరణించినట్టు తన తమ్ముడికి తెలియకూడదనీ, తమ్ముడి చదువు సాగేట్టు డబ్బు పంపమనీ రాస్తాడు. అది చదివి చలించిపోయిన ఇన్స్పెక్టర్ ఉద్యోగానికి రాజీనామా ఇస్తాడు. ఇదీ కథ.

పోలీసులు అమాయకులను హింసించటం అన్నది నిజం. కానీ నక్సల్స్ అంతా పేద ప్రజల కోసం పోరాడుతున్నారన్న దానిలో అంత నిజం లేదు. పోలీసులు ఓ వైపు నుంచి, నక్సల్స్ మరో వైపు నుంచి అమాయకులను నలిపేస్తున్నారన్నది చేదు నిజం. ఇటీవలె బెంగాల్ లోని లాల్ ఘడ్‌లో జరిగిన విషయాలు గమనిస్తే, అమాయకులను అడ్డుగా పెట్టుకుని నక్సల్స్ పోలీసులతో పోరు జరపటం తెలుస్తుంది. నక్సల్స్‌లో ఆదర్శం పోయి, ఇప్పుడనేకులు దారిదోపిడీ బంధాల్లో మిగిలారన్నది నిజం. అదీగాక, హింస ఏరకంగా ఉన్న ఖండనీయమే. ముఖ్యంగా న్యాయానికో వ్యవస్థ ఉన్న సమాజంలో ఆయుధాలు ధరించాల్సిన అవసరం లేదు. కానీ ఈ విషయాలను మన రచయితలు ప్రదర్శించరు. ఇలాంటి కథలు రాసినా పత్రికలు ప్రోత్సహించవు. హింస వద్దని హితవు చెప్పే కథలు, నక్సల్స్‌లోని క్రౌర్యం,

రాక్షసత్వం కథలలో కనబడవు. అమాయకుల జీవితాలతో వారు ఆటలాడటం కనబడదు. అందుకే మన కథలు 'పొలిటికల్లీ కరెక్టు' కథల చట్రాన్ని దాటలేకపోతున్నాయి.

*మంచుముద్ద*

కొమ్మూరి రవికిరణ్ రచించిన ఈ కథ జూన్ 3 న నవ్య సంచికలో ప్రచురితమయింది. ఇటీవలె ఆర్థిక మాంద్యం వల్ల ఉద్యోగాలు పోవటం మన కథలలోనూ ప్రవేశించింది. అయితే, ఈ అంశం ఆధారంగా రచించిన కథలు ఒక దశలో మామూలు కథల దారి పట్టటం కనిపిస్తుంది. ఓ అమ్మాయికి, అమెరికాలో ఉన్న అబ్బాయితో పెళ్ళి నిశ్చయమౌతుంది. ఇంతలో అతని ఉద్యోగం పోతుంది. తల్లిదండ్రులు పెళ్ళివద్దంటే, అమ్మాయి వారిని ఎదిరించి ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకుంటుంది. దాదాపుగా అన్నీ ఇలాంటి కథలే. ఇందుకు భిన్నంగా 'మంచు ముద్ద' కథ. అనిల్ అనే వ్యక్తి అందరికీ పింక్ స్లిప్పులు ఇస్తూ 'తన ఉద్యోగం ఎప్పుడు పోతుందో' అని నిరాశకు గురవ్వటంతో ఆరంభమౌతుంది. దాంతో నడివయసులో ఉద్యోగం పోయిన వ్యక్తి మానసిక సంఘర్షణను చిత్రించడంతో మంచి కథ చదువుతున్నామన్న ఆశకలుగుతుంది. కాస్త కథ చదివాక ఆశ, నిరాశగానే మిగులుతుంది, ఎందుకంటే, ఉద్యోగం పోతుందేమోనన్న చికాకులో ఉన్న అనిల్, కవిత అనే ప్రేయసి దగ్గరకు వెళతాడు. అతడి భార్య పూజలు చేయదు, అతడిని గౌరవించదు అని గోడు వెళ్ళబోసుకుంటాడు. ఇద్దరూ కలిసి వేరే స్థలానికి వెళ్ళి ఎంజాయ్ చేద్దామనుకుంటారు. ఇంతలో, అతడి భార్య మారిపోయి పూజలు చేయటం మొదలు పెడుతుంది. అనిల్, కవితను మరచి భార్యతో ఉండిపోతాడు. ఇటు తిరిగినా మళ్ళి అటే వచ్చేట్టు, మన కథలు ఆర్థిక మాంద్యంతో ఆరంభమయినా, అక్రమ సంబంధాలనుంచి సక్రమంలోనే వస్తాయి. పైగా, అంతవరకూ ఉన్న 'అసహ్యం', పూజలు చేస్తుందని తెలియగానే మారిపోవటం మానసిక వ్యవహారాలపై 'చులకన' అభిప్రాయాన్ని చూపిస్తుంది. అంతవరకూ నాయిక వెంట పడ్డ విలన్, హీరోతో తన్నులు తినగానే 'బుద్ధొచ్చింద'ని మారిపోవటం ఎంత హాస్యాస్పదమో, ఈ కథ ముగింపు కూడా అంత హాస్యాస్పదంగా ఉంటుంది. కానీ రచయిత కథను చెప్పిన విధానం బాగుంది. కథని ఆసాంతం చదివిస్తుంది.

*ఆశ*

టి.శ్రీవల్లీ రాధిక రచించిన ఈ కథ జూన్ 28, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఈ కథలో ఆలోచన ఉంది. విశ్లేషణ ఉంది. దానికి 'పరిణితి' తోడయి ఉంటే కథ మంచి కథగా ఎదిగి ఉండేది. 'మొగుడు పెళ్ళాన్ని అర్థం చేసుకోడు. క్షమించడు. సమస్త ప్రపంచాన్నీ అర్థం చేసుకుంటాడు. కానీ పెళ్ళాన్ని అర్థం చేసుకోడు. నా పాండిత్యమూ ఇదే చెపుతోంది. అనుభవమూ ఇదే చెపుతోంది' ఇదీ ఈ కథ కేంద్ర బిందువు. ఓ యువతికి ఇది సమస్య. ఇలా ఓ నవల విశ్లేషణతో ఆసక్తికరంగా ఆరంభమవుతుంది కథ. ఇంతలో ఆ యువతి, తమ ఆఫీసులో అందరికీ కౌన్సిలింగ్ చేసే అమ్మాయి, బాధలో ఉన్న మరో అమ్మాయిని ఓదార్చటం వింటుంది. ఆ అమ్మాయి భర్త అమ్మాయిని మాట్లాడనివ్వడు. కొడతాడు. ఇది విన్న ఆ యువతి. 'ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నంతకాలం' మనుషులు ఎవరి దృష్టితో వారు ప్రపంచాన్ని చూస్తారనీ, ఒకరినొకరు అర్థం చేసుకోలేరని అర్థం చేసుకుంటుంది. ఇదీ కథ. ఆ యువతికి జరిగిన 'జ్ఞానోదయం' సరైనదే అయినా, భార్యా భర్తల నడుమ సత్సంబంధం నెలకొనాలంటే, ఒకరు కోరికలను పూర్తిగా చంపేసుకోవాల్సిన అవసరం లేదు. స్త్రీ పురుషుల మనస్తత్వాలలో ఉన్న వైచిత్ర, వైరుధ్యాలు సంఘర్షణలకు కారణమవుతున్నా, ఒకరినొకరు అర్థం చేసుకునే సామరస్యం ప్రదర్శిస్తే, సంసారాన్ని సుఖమయం చేసుకోవచ్చు. అంతేకానీ, ఒకరు కోరికలను పూర్తిగా చంపేసుకుంటే, అది మరిన్ని అపోహలకు, అనర్థాలకు, దారి తీస్తుంది. 'స్థితప్రజ్ఞత అలవడ్డాకే నిజమైన జ్ఞానం చేతికందుతుంది' ఈ వాక్యాలు నిజాన్ని చెపుతున్నా, రచయిత్రి కథలో ప్రదర్శించిన పరిధికి ఇవి చాలా పెద్ద పదాలు అనిపిస్తాయి. పైగా, కథలో 'ఆశ' కన్నా 'నిరాశ', నిర్లిప్తతలు ఎక్కువగా కనిపించి, రచయిత్రి 'నిరాశ'లో వైరాగ్య భావన ప్రదర్శిస్తోంది తప్ప విజ్ఞానంతో కాదు అనిపిస్తుంది.

*సుడిగాలి - ఆకుపచ్చని మాయ:*

'సుడిగాలి' కథ జూన్ 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. 'ఆకుపచ్చ మాయ' కథ జూన్ నెల స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. ఈ రెండు కథల రచయిత సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి. రచయిత తన అనుభవాల ఆధారంగానే కథను సృజిస్తాడు. దాంతో అలాటి రచనలలో అతడికి తెలిసిన ప్రపంచమే కనిపిస్తుంది. కానీ భౌతిక అనుభవాలు రచయితపై విధించిన పరిమితులను, అతని మేధ, సృజనాత్మకత ద్వారా అధిగమిస్తుంది. అప్పుడు రచయిత పరిమిత పరిధి విస్తృతమై, అనంతమౌతుంది. పరిమితమైన అనుభవాలే అనంతమై విభిన్నమైన కథల స్రవంతిలా ప్రకటితమతాయి. కానీ, ఎప్పుడయితే రచయిత అనంతమైన సృజనాత్మక పరిధిని కుచింపచేసుకుని 'ఇమేజ్' బద్ధుడవుతాడో, అపుడు అతని రచనల్లో నవ్యత లోపిస్తుంది. ఒక రచన, మరో రచనలా అనిపిస్తుంది. ఈ రెండూ కథలు చదువుతుంటే, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, ఇమేజి చట్రంలో బిగించుకుపోతున్నాడేమో అనిపిస్తుంది.

'సుడిగాలి' కథ అందంగా ఆరంభమౌతుంది. ఆరంభంలో వర్ణనలు చదువుతుంటే, పల్లెల్లో పంట పొలాల దృశ్యం కళ్ళముందు నిలబడుతుంది. 'వంకను అవతల చవిటి బీళ్ళ నుండి సుడిగాలి పైకి లేచింది. ఎండుటాకులూ, ఊపబొందూ, చెత్తా చెదారం అన్నిటినీ తనతో బాటు పైకి లేపి ఒక వికృతాకారాన్ని పొందుతూ సురసురమని సుడి దిరుగుతూ వంకలోకి ఆగింది. అక్కడ జంబుగములు మీద పడి కంకుల్ని పగులగొట్టి దూదిని పైకి లేపుతూ గట్టునే ఉన్న వడ్ల కళ్ళాలలోకి జారబడింది.' ఇక తరువాత కథ రొటీన్‌గా సాగుతుంది. కోతకొచ్చిన వారి ఆశ, దున్నుకునేవాడి శ్రమ నిరాశగా మారటం.. జీవన పోరాటాలతో మామూలు పల్లెవాళ్ళ 'ఎక్స్‌ప్లాయిటేషన్' కథలా మిగిలిపోతుందీ కథ.

'ఆకుపచ్చని మాయ' కూడా ఇలాంటిదే పల్లెల 'ఎక్స్‌ప్లాయిటేషన్'తో పాటు ఓ తాగుబోతు మొగుడిని దారికి తేవటం కూడా జోడవుతుంది. తాగుడు మానిపించేట్లయితే రచయిత చూపిన పరిష్కారం హాస్యాస్పదంగా ఉంటుంది. 'తాగి వచ్చిన వాడిని ఇంట్లోనికి రానీయకుండా, కొట్లాడాలి' అన్నది రచయిత చూపిన పరిష్కారం. ఈ రెండు కథలు వేరవేరయినా, గతంలో అనేక మార్లు ఇలాంటి కథలు మనం చదివినవే. దాంతో, ఒక మంచి రచయిత రాసిన మామూలు కథలుగా అనిపిస్తాయీ కథలు. రచయిత ఓ ఇమేజ్ చట్రంలో బందీ అవుతున్నాడేమోనన్న ఆలోచన కలుగుతుందీ కథలు చదువుతుంటే.

*మూడోమనిషి*

కాకాని చక్రపాణి రచించిన ఈ కథ 14 జూన్ ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఇదీ ఈ నెల కథ. నిజానికి ఈ కథ మనకు అలవాటయిన కథనే. ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఓ అపరిచితుడు అతడికి జీవితం పట్ల ఆశకలిగిస్తాడు. కష్టాలు తేలిపోతాయి. కథలో మెలిక ఏమిటంటే, ప్రతివ్యక్తికీ కష్టకాలంలో మూడో వ్యక్తి అవసరమంటాడు అపరిచితుడు. మూడో వ్యక్తి ఎవరంటే దేవుడంటాడు. కథ చివరలో ఆ అపరిచితుడు 'దేవుడ'న్న ఆలోచననిస్తాడు రచయిత. కథ మామూలే అయినా, కథలో అనౌచిత్యాలు ఉన్నా రచయిత ఆసక్తిగా కథను రచించిన తీరు ప్రదర్శించిన తీరు ఆశాభావం కథను ఈ మాసం కథను చేస్తాయి.

## *ఈనెల కథ*

మూడో మనిషి - కాకాని చక్రపాణి

14 జూన్ ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం, 2009 సంచిక నుంచి

ఓసారి నేను మహా విషాదంలో పడిపోయాను. ఆత్మహత్య తప్ప మరి గత్యంతరం లేదనిపించింది. మంగళగిరిలో బస్సెక్కి ప్రకాశం బేరేజీ దగ్గర దిగి కృష్ణలోకి దూకితే మరి స్వర్గమే. బస్సెక్కుదామని బస్ స్టాండులో నిలుచున్నాను. నా పక్కన నిలుచున్న మనిషి - అతని వయస్సు ఇదమిత్థంగా చెప్పలేము - యాభై, అరవై ఉంటాయేమో - "ఎక్కడికెళుతున్నావ్?" అని అడిగాడు.

నేనేం జవాబు చెప్పలేదు. అయితే సమాధానం రాకపోతే ఊరుకునే శాల్తీకాదు అది. "ఏందీ బదులు చెప్పవ్! ఇనబడ్లేదా ఏంది?" అన్నాడు.

"నీ కెందుకయ్యా నేనెక్కడకెళితే? నీ పని నువ్వు చూసుకో" అన్నాను, కసురుతున్నట్టే.

"అదేం మాట! నువ్వు మనుషుల్లో ఒకడివి కాదా ఏంది? తిక్క మనిషివి లాగుండావే!"

"అవును, తిక్క మనిషినే. నాతో మాట్లాడక!"

అతనేమనుకున్నాడో రెండుక్షణాలు మాట్లాడలేదు. ఆ తర్వాత, "ఈ బస్సు ఎక్కడొస్తాదో?" అని "పాపం! ఏందో దిగుల్లో ఉన్నట్టుండావు పద, ఓ టీ తాగి, బీడీ ముట్టిద్దాం" అన్నాడతను, నా చేయి పట్టి లాగుతూ.

"ఏయ్! నా చేయి వదులు. నీ టీ వద్దు, నీ బీడీ వద్దు. నన్నిలా వదిలెయ్!" అన్నాను చీదరించుకుంటూ.

"మొగమాటం మనిషివిలా ఉండావు. ఉండు, నేనే ఓ కప్పు తెచ్చిస్తాను. ఈలోగా ఈ బీడీ ముట్టించు" అంటూ నా చేతిలో ఓ బీడీ కట్టా, అగ్గిపెట్టి పెట్టి, దగ్గరలో ఉన్న కాఫీ కొట్టుకెళ్ళాడు.

'శనిలా దాపురించాడు. నా చావు నన్ను చావనిచ్చేట్టు లేదు. వీణ్ణించి ముందు తప్పించుకోవాలి' అనుకుంటూ నేను రోడ్డు పట్టాను. ఎక్కువ దూరం పోలేదు. రైల్వే క్రాసింగు దాటానేమో. నా వెనుకగా ఓ షేరింగ్ ఆటో దిగింది. అందులోంచి దిగాడు. నా శనిగాడు.

"ఏంది పారిపోయి వచ్చావు? ఓటల్లో టీ తీసుకుని చూసినా, నువ్వు అయిపు లేవు. బస్సు రాలేదు. సరేనని ఈ ఆటోలో పడి వచ్చినా, సరేనబ్బా, అట్ల చెప్పకుండ వస్తే ఎట్ల? బెజవాడ దాకా నడుద్దామన్న ఆలోచనే? పద, నేనూ నీతోపాటే వస్తా. నాకూ నడవటమంటే సరదా" అన్నాడతను, నేను కనబడినందుకు మహదానందపడిపోతూ, అతన్ని చూడగానే నా వంటికి కారం రాచుకున్నట్లయింది.

"ఎవరు నువ్వు? నా వెంటెందుకు పడ్డావు?" అనడిగాను గదమాయిస్తున్నట్టు.

"నా పేరు అనంతయ్య అక్కడ నీ గొడుగు వదిలేసి వచ్చావు కదా! నీకది ఇద్దామనే ఇక్కడ దిగినా" అన్నాడు గొడుగు నా వైపు చాచుతూ.

"నేనే గొడుగూ వదిలేసి రాలేదు, పో, పో.."

"పోన్లే ఎండలో ఏ మంచాడో మనకోసం వదిలెళ్ళినట్లున్నాడు. దీని కిందకురా, చల్లగా ఉంటుంది."

కృష్ణలోకి దూకితే ఇంక అంతా చల్లనే! ఈ బతికే గంట, గంటన్నరలో ఎండకు దడవాల్సిన పనేముంది! అతన్ని పట్టించుకోకుండా నా మానాన నేను నడవసాగాను. ప్రారబ్ధకర్మ పట్టిపీడిస్తూనే ఉంటుంది, అతనేదో చెపుతూనే ఉన్నాడు.

"ఏందట్లా మూగనోము పట్టావు! కబుర్లు చెప్పుకుంటూ నడిస్తే, ఇట్టే కాలం గడిచిపోతుంది. నేనో పొడుపు కత పొడుస్తా, చేతనయితే ఇప్పు - 'బూమాతకు ముద్దుబిడ్డ, ఆకాశపు జున్ను గడ్డ, రాత్తిరేళ రాచరికం, పగలయితే పేదరికం' -ఏందదీ?"

సమాధానం చెపితే అతను పేటేగి పోవచ్చు. అందుకే నేనేం మాట్లాడలేదు.

"ఓర్నీ. ఇది తెలీదా? చందమామయ్యా! పోన్లే. ఇది చెప్పు - 'తెల్లటి పొలములో నల్లటి విత్తులు, చేతితో చల్లటం, నోటితో ఏరుకోవటం'.

నా మౌనం అతన్ని నిరుత్సాహపరచలేదు. మహా ఉత్సాహ స్రోతస్సు ఉన్న మనిషిలా ఉన్నాడు.

"ఇది కూడా తెలీదా? 'పుస్తకం.' సరే, చదువుకున్న మనిషిలా ఉన్నావు, ఏం చదివావేం?

"ఏదో వానా కాలం చదువు చదివాలే!"

"ఆ మాటనకు! ఆ మొగం చూస్తుంటే తెలవటంలా? పెద్ద చదువే చదివుంటావు! సర్లే నువ్వు చెప్పవు గానీ, ఇందాకిచ్చిన ఆ బీడీ కట్టా, అగ్గిపెట్టె బయటికి తీ. ఓ దమ్ములాగుదాం."

"నా దగ్గర్లేవు. ఎప్పుడో పారేశా. నేను పొగ తాగను."

"ఏం మనిషివయ్యా! బతుకులో సగం సుకం నాశనం చేసుకున్నావే? పోన్లే, కిళ్ళీ బడ్డీ వస్తే కొనుక్కుందాం."

తోవలో ఏదో కంపెనీ వచ్చింది అన్నట్లే, అక్కడున్న కిళ్ళీబడ్డీలో బీడీ కట్టా, అగ్గిపెట్టె కొన్నాడతను. తనో బీడీ ముట్టించి, నాకోటిచ్చాడు. నేను వద్దన్నా వినలేదు. ఓ బీడీ నా నోట్లో పెట్టి, ముట్టించాడు. ఎలా సాగసుగా గాలి లోపలకు పీల్చాలో బోధించాడు. తప్పుడు పన్లన్నీ చెయ్యాలన్నంత మొండితనం ఏర్పడింది నాకు. ఓసారి దగ్గు వచ్చింది. "బయపడకు. అలవాటయిపోతుంది" అని అతను భరోసా ఇచ్చాడు.

"బతుకు మనమనుకున్నట్టు సాగదు. ఓ పాలేమైందంటే, మా ఇంటికి నా పెండ్లాం బావనంటూ ఓ మనిషొచ్చాడు. అప్పటికి మా పెళ్ళయి మూడేళ్ళు కూడా నిండ లేదు. మాకు ఏణ్ణర్థం వయసున్న కూతురు. 'నీ పెండ్లికి నేను రాలేకపోయినానే' అంటూ, డబ్బు బాగా కర్సుపెట్టి, భారీ సారె తీసుకొచ్చాడు. నాకూ, నా పెండ్లానికీ ఆడంటే మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆ పిదప వచ్చినప్పుడల్లా ఏవో కానుకలు పట్టుకు వచ్చేవాడు. మొదట్లో నెలకోతూరి వచ్చేవాడు, ఆ తర్వాత వారం వారం రావటం సాగించాడు. నా పెండ్లాం ఆడంటే పెద్ద భ్రమలో పడిపోయింది. నేను పెద్ద చవటలా కనపడ్డానుదానికి. ఉన్నట్లుండి ఓనాడు అది ఆడితో లేచిపోయింది."

"మరేం చేశావు?"

అడిగాడు, కుతూహలం పట్టలేక.

"మొదట్లో ఆళ్ళని ఎతికి పట్టుకుని నరికి పరేద్దామనిపించింది. రెండు, మూడు నెల్లు తిండీ తిప్పల్లేకుండా ఎతికినా కూడా. ఆనక ఆవేశం చల్లారినాక, నాకనిపించింది - తప్పు నా దగ్గర పెట్టుకుని ఆళ్ళననటమెందుకని."

"నువ్వేం తప్పు చేశావు?"

"ఆడు తెచ్చే కానుకల్ని నేను మొదట్లో కాదంటే, ఇంత ఆపత్తు వచ్చుండేది కాదు. ఇంట్లోకి వస్తువులు డబ్బు వస్తోంది కదా అని సంబరపడ్డా కానీ, కొంపముంచుతున్నాడన్న ఆలోచన నాకు రాకుండె నా పెండ్లాం అమాయకప్పక్షి! ఆడు కంత్రీవోడు. ఇప్పుడు ఆడ్నీ, దాన్నీ చంపి పెయోజనమేముంది? ఈడ నా పిల్ల అనాద అయిపోతాది..."

అంతలో తాడేపల్లి వచ్చింది. చెయ్యి పట్టుకుని నన్ను ఓ కాకా హోటల్లోకి తీసుకెళ్ళాడు. వద్దన్నకొద్దీ ఓ ప్లేటు పకోడీ కూడా తినిపించాడు. "తినబ్బా! మొగమాటపడతావెంది? నీ అయ్యే అనుకో నా వయసు ఎంతనుకుంటున్నావేంది? డెబ్బై రెండు."

ఇంక నేను మొహమాటం వదిలేశాను. హోటలు బయట అరుగుమీద కూర్చుని అతనిచ్చిన బీడీ ముట్టించాను. ఆ సమయంలో నా కొలీగ్స్, సబార్డినేట్స్‌లో ఎవరన్నా చూస్తే వాళ్ళ మతిపోయి ఉండేది.

బయలుదేరాం. బతుకు పయనంలో ఎక్కడా ఆగటానికి వీలు లేదు. బస్సు ఎక్కి వెళ్ళాలన్న ఆలోచన ఇద్దరిలో ఎవరికీ కలుగలేదు.

అనంతయ్య ఏదో చెపుతున్నాడు. అతను చెప్పే మాటలు నా చెవిన బడలేదు. అచ్చంగా నేనూ ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నానప్పుడు.

విజయవాడలోని ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖకు అధిపతిని నేను. అంతా సిటీవో అంటారు. నిక్కచ్చి మనిషినని నాకు పేరు. లంచం ఇచ్చి పని జరిపించుకోవాలని చూసే మనుషుల పట్ల నేను కఠినంగా ప్రవర్తించేవాడిని. నా క్రింది అధికారి - ఏసిటివో చలపతి నన్ను, నా నిజాయితీని మెచ్చుకుంటుండేవాడు. ఎవరైనా మెచ్చుకుంటే సంతోషపడి పోవటం నా బలహీనత. ఓసారి నా కొడుకు పుట్టినరోజున అతన్ని ఆహ్వానిస్తే కానుక అంటూ చాలా ఖరీదయిన ఉంగరం తీసుకువచ్చాడు. ఏ వందో, రెండువందలో పెట్టి తీసుకువస్తే అభ్యంతరపడాల్సిన అవసరం ఉండదు. కానీ ఇది రెండు, మూడు వేలయినా అవుతుంది. బతుకు హాయిగా గడపగలిగే జీతం వస్తుంది నాకు. ఇలాంటి కానుకుల ప్రలోభం నా కుండకూడదు. పిల్లవాడి పుట్టిన రోజు కానుక అని నేను మనసుకు నచ్చచెప్పుకున్నాను, వద్దని చెప్పి అతని మనసు బాధపెట్టలేక.

మరోసారి, "చాలా చీప్‌గా వస్తోంది, గురూగారూ డీలర్ మనకు తెలిసినవాడే" అంటూ, నేనడక్కుండానే, ఓ పెద్ద కలర్ టీ.వీ. తెచ్చిపెట్టాడు ఇంట్లో. అది చూసి మా ఆవిడ ఎంతో ముచ్చటపడిపోయింది. ఆమె సంతోషం చూసి నేనేమనలేకపోయాను.

"ఇప్పుడు ఎంత కట్టాలయ్యా?" అని అడిగాను.

"దానికిప్పుడు వర్రీ కాకండి, గురూగారూ! నేను చూసుకుంటాగా" అన్నాడు.

అతనే చూసుకున్నాడు. నేను పైన ఇచ్చింది లేదు. ఆ రోజుల్లోనే ఇరవై వేలు చేసే టి.వి. అప్పనంగా వచ్చి ఇంట్లో పడింది. అలా అలా వస్తువులు వచ్చి ఇంట్లో పడుతున్నాయి. ఏ కొత్త గాడ్జెట్ మార్కెట్‌లోకి వచ్చినా, ఫోను చేసి, "హలో చలపతిగారూ! కొత్తగా మార్కెట్ లోకి మిక్సీ వచ్చిందంట! ఆయన డబ్బులిస్తారు తెప్పించి పెట్టండి" అని చెప్పేది మా ఆవిడ. ఆ రోజు సాయంత్రానికల్లా ఆ వస్తువు అచ్చి మా ఇంట్లో వాలేదు. మొదట్లో "ఎంతయిందయ్యా?" అని మాటవరుసకడిగేవాడిని. ఆ తర్వాత అదికూడా మానుకున్నాను.

మా మధ్య చనువు బాగా పెరిగింది. మొహమాటపెట్టి ఫైళ్ళపై సంతకాలు చేయించే స్థాయికి ఎదిగింది. అందుకు ఫలితమేమిటో నాకు తెలియకపోలేదు. తెలిసినవాళ్ళకు, మొహమాటస్తులకు సాయం చేస్తున్నాడనుకున్నా కానీ, ఈ చనువును దుర్వినియోగం చేస్తున్నాడనీ, డబ్బు చేసుకుంటున్నాడనీ భావించలేదు. సాన్నిహిత్యం కళ్ళపై పొరలు కమ్మేట్టు చేస్తుంది.

నాలుగురోజుల క్రితం మా అక్కకు ఒంట్లో బాగాలేదని తెలిస్తే, చూసి రావాలని మద్రాసు (ఇప్పటి చెన్నై) వెళ్ళాను. వెళ్ళిన మర్నాడు, నా స్టెనో రామారావు నాకు ఫోను చేసి చెప్పాడు - "చలపతిగారు లక్షరూపాయలు లంచం పుచ్చుకుంటూండగా ఏంటీ కరప్షన్ వాళ్ళు రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారు. వాళ్ళ ప్రశ్నలకు జవాబు చెపుతూ మీరు పెద్ద కరప్ట్ ఆఫీసరనీ, మీ బలవంతంవల్లనే తనకు లంచం పట్టక తప్పటంలేదనీ, అందులో సింహభాగం మీకే సమర్పించుకోవాలనీ చెప్పాడు. ఒకటి, రెండు రోజుల్లో మీ ఇంటిపైనా రైడ్ చెయ్యొచ్చని అంటున్నారు" అని.

రామారావు నమ్మకస్తుడు. అతని మాట విశ్వసించక తప్పదు. మా ఊరివాడతను. నాకతనంటే ఎంతో అభిమానం. అతనూ అలానే ఉండేవాడు. ఇంటికొస్తూ పోతూ ఇంటిమనిషిలా మెదలుకునేవాడు.

మా అక్క పరిస్థితి అంత బాగాలేకపోయినా నేను మద్రాసులో ఉండలేకపోయాను. విజయవాడకు బయలుదేరాను. ట్రయిను తెనాలి చేరేసరికి మధ్యాహ్నం మూడయింది. విజయవాడ వెళ్ళబుద్ధిపుట్టలేదు. నా కళ్ళ ఎదుటే నా ఇంటిని వాళ్ళు సోదా చేస్తూ ఉంటే నేను భరించలేను. మంగళగిరిలో నా సన్నిహిత మిత్రుడింటికి వెళదామనుకున్నాను. తెనాలిలో దిగి బస్సులో మంగళగిరి వచ్చాను. బస్సు దిగాక వాడింటికీ వెళ్ళబుద్ధి కాలేదు. అక్కడనుండి పారిపోవాలనిపించింది. పరువు పోకుండా కాపాడుకోవాలంటే ఈ లోకాన్నుండే పారిపోవాలి. ఇప్పుడింత ఆదరించే మిత్రులు, బంధువులు రేపు నేను లంచగొండినని నిర్ధారణ అయ్యాక, ముఖం చాటేయరన్న నమ్మకం

లేదు. నా పెళ్ళాం, పిల్లలు నోటితో ఏమనకపోయినా, చూపుల్తో నన్ను దోషిగా నిలబెట్టవచ్చు. అందుకే ఈ అంతిమ ప్రయాణం. బస్సు దొరికితే అరగంటలో విజయవాడలో ఉండవచ్చు. అలా ఓ గంటసేపు వీధుల్లో తిరిగితే చీకటి పడుతుంది. బారేజీ కొచ్చి కృష్ణలో దూకేస్తే, ఇంక పరువు ప్రతిష్ఠల ప్రసక్తి ఉండదు...

"ఏందయ్యోవ్? ఎక్కడున్నా? నా మాటలు చెవినబడ్డాయా?" అని అనంతయ్య అరిచేటప్పటికి నేను ఈ లోకంలో పడ్డాను. "చద్దామనుకున్నాను నేను కష్టంలో ఉన్నప్పుడు, దేవుడు నాకాడకొచ్చాడు" అన్నాడు.

"ఎవరూ, దేవుడా?"

"మా నాయన! మరి దేవుడెట్లా వస్తాడనుకున్నా? మనిషి రూపంలోనే వస్తాడు. మానాయనకు, నాకు ఎప్పటినుండో పడేది కాదు. ఎకరం పొలం అమ్మి చెల్లి పెళ్ళికని డబ్బు ఇంట్లో పెడితే, నేనది ఎత్తుకెళ్ళి సర్దాలకి ఆరతి కర్పూరం జేసినా, డబ్బు అయిపొయ్యాక ఇంటికెళితే, తిట్టి ఎళ్ళగొట్టాడు. నేనాయన్ని తిరిగి కొట్టబోయినా. పక్కనున్నోళ్ళు పట్టుకుని నన్ను బయటకి తోశారు. పదిహేనేండ్లు ఆయన నా ముగం చూసింది లేదు. ఎట్లా తెలిసిందో - వచ్చాడు మా నాయన, ఏలోకానున్నాడో, పాపం! 'చచ్చి ఏం సాధిస్తావురా ఎదవకాన! బతకటం మొగతనం రా అని నాకు ఇతవు బోధించాడు. ఇంత నగుబాటయ్యాక బతికేం లాభం. ఈదిలో తలెత్తుకోలేని బతుకయినాది' అన్నాను. 'ఎన్ని అవమానాలు భరించయినా బతకాలిరా, కొడకా! చచ్చేవోడు పిరికోడు. కొయ్య గుఱ్ఱం ఎగరావచ్చు. ఇప్పటి నగుబాటు బతుకు, రేపు కాగడాలా ఎలుగు నింపే బతుకూ కావచ్చు. ఈ బొందిపోయాక, తరువాత ఉండేదేందో ఎవరికీ తెలవదు. కనుక బతకాల' అని చెప్పాడు మా నాయన. నన్ను చావనివ్వలేదు. నేను బతుకుతానన్న ధీమా కలిగిందాకా నన్నిడిచి పెట్టి ఎళ్ళలేదు. ఆపైన పిల్ల గుదిబండలా ఉండె తల్లిలా నేను దాన్ని వదిలెయ్యలేకపోయాను. అవమానాలు పడ్డాను..."

ఓ బీడీ ముట్టించి, నాకొకటి ఇచ్చాడు. "ఏ పనయినా బాగా ఆలోచించి చెయ్యాలి! ఆవేశంలో ఆళ్ళని మట్టుపెట్టి ఉండేవాడిని. అట్లాంటప్పుడే మూడోమనిషి అవసరం ఉంటుంది..."

"మూడో మనిషి ఎవరు?" అడిగాను.

"బుద్దున్నోడు. ఇద్దరు కొట్టుకు ఛస్తున్నారు. ఆవేశంలో బుఱ్ఱ పనిచెయ్యదు. ఒకడు చస్తాడు. ఇంకోడు జైల్లో పడతాడు. పెళ్ళాం, మొగుడు కీచులాడుకుంటున్నారు. ఇడిపోతారు. ఇట్టాంటి సందర్భాల్లోనే మూడోమనిషి అవసరం. ఆడే దేవుడి ప్రతినిధి. ఆడే మనకు తెలీకుండా మన ఎంటే ఉంటాడు. కష్టాల్లో మనకు సలహా ఇస్తుంటాడు. కానీ మనమే ఇనిపించుకోం."

నడుస్తూ మేం ప్రకాశం బేరేజీ దాకా వచ్చాం. "నేనో మాట చెపుతాను, ఇను. ఇయ్యాల రేత్రికి సీతానగరంలో ఉందాం. రేపు బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాక నీతోవ నీది, నాతోవ నాది." నేను సరేనన్నాను.

అతను సీతానగరంలో ఓ ఇంటికి తీసుకెళ్ళాడు. తలుపు తాళం తీస్తూ. "ఆకలేస్తా ఉందా? అన్నం పడేస్తా" అన్నాడు.

"ఇప్పుడేం తొందరలేదు. ఓ బీడీ ఇవ్వు, తాగుదాం" అన్నాను. అతన్నేమడగటానికీ సంకోచం కలగలేదు.

నాకు బీడీ కట్ట, అగ్గిపెట్టె ఇచ్చి, అలమారులో ఉన్న తేగలకట్ట తీసుకుని, "పద, కృష్ణ ఒడ్డున కూర్చుందాం" అన్నాడు. కొంత దూరం పోయాక, "అదుగో, ఆ ఇసుక తెన్నెమీద కూర్చో. నేనిప్పుడే వస్తా. ఈ తేగలు నీతో పట్టుకెళ్ళు" అంటూ పక్క వీధిలోకి తిరిగి మాయమయ్యాడు.

నేను బీడీ ముట్టించి నడవసాగాను. పైన గుళ్ళో కొబ్బరి చిప్పలు తినటానికి అలవాటు పడిన కోతొకటి తేగలకోసం నా వెంట పడింది. అది తేగలకెలా అలవాటు పడిందో? నేను దాన్నుండి తప్పించుకోటానికి పారిపోసాగాను. అది నా వెంట పడసాగింది. నేను వేగం పెంచిన కొద్దీ అదీ వేగం పెంచింది. క్షణంలో అది నా మీదకు లంఘించి నా చేతిలోని తేగలనందుకునేదే అంతలో అనంతయ్య

ఎక్కడనుండో ఊడిపడ్డాడు. రాయి తీసి విసరే సరికి అది తోకముడిచి పారిపోయింది. "తేగలు చూస్తే వదిలి పెట్టదది. నేనే అలవాటు జేసినా" అన్నాడు అనంతయ్య నవ్వుతూ.

నదికి సమీపాన ఇసుక తిన్నెమీద తిష్టవేశాం. మాఘమాసం చివరి రోజులు. ఎండలు మాడ్చటం మొదలెట్టాయి. బేరేజీనుండి నీళ్ళు వదలటం లేదు. సంచీలో నుండి రెండు సారా సీసాలు తీశాడు అనంతయ్య. వాటిని చూస్తూనే, "నా కలవాటు లేదు. నువ్వు తాగు" అన్నాను.

"తాక్కుండా అలవాటెట్టవుద్దీ? ముందో గుటకేసుకు చెప్పు. ఆ తర్వాత మాట్లాడుకుందాం."

ఇంక నేనతనితో వాదించదల్చుకోలేదు. రేపు చచ్చేవాడికి నీతి నియమాలేమిటి? అన్నీ తినాల్సిందే, తాగాల్సిందే తేగల నంజుడు, సారా పానీయం. మహరంజుగా ఉంది. బాటిల్లో ముప్పావుభాగం పూర్తయింది. ఇంక కబుర్లు మొదలయ్యాయి. నేనేం చెప్పానో నాకే తెలీదు.

"సమస్యలేందయ్యా, కోతంటివవి. నువ్వు పారిపోతుండేకొద్దీ నీ ఎంటబడతాయి. రాయి తీసుకు ఎదురుతిరుగు. పారిపోతయ్యి. ఇందాక కోతి కాలికి బుద్ధి చెప్పలా? నిజానికవి సమస్యలా అని కూడా ఆలోచించం మనం!"

నేనేం సమాధానం చెప్పానో నాకు గుర్తులేదు. అతనేదో చెపుతూనే ఉన్నాడు. సీసాలమీద సీసాలు తాగాం. మగత కమ్మేదాకా తాగం. ఆ తేగలే ఆనాటి మా ఆహారం. ఒళ్ళు తెలియకుండా తిన్నాం, తాగాం. మత్తెక్కి ఆ ఇసుక తిన్నెలమీదే పడి నిద్రపోయాం.

మర్నాడు నిద్రలేచేసరికి బారెడు పొద్దెక్కింది. నేను లేచి కూర్చున్నాను. అనంతయ్య నదిలో స్నానం చేస్తున్నాడు. "లేచావా! చూడు. పక్కన పందంపుల్ల ఉంది. మొగం కడుక్కో తువ్వాలు తీసుకు స్నానం చెయ్యి. ప్రాణం లేచొస్తాది. లే, లే" అన్నాడతను.

బతుకులో అంతా తీరికే, పందుం పుల్లతో పళ్ళు తోముకుని, టవలు కట్టుకుని నదిలోకి దిగాను. స్నానంలోని సుఖాన్ని అంతలా నేనెప్పుడూ అనుభవించలేదు. విప్పిన బట్టల్ని ఉతికి ఆరేసుకున్నాను గట్టుమీదనుండి అనంతయ్య అరిచాడు" ఏమయ్యోవ్! అక్కడే ఉండిపోతావా? తిండీ తిప్పలక్కర్లేదా?"అని. వాచీ చూసుకున్నాను. పన్నెండు గంటలయింది. ఇద్దరం కలిసి అతనింటికెళ్ళాం. క్రితం రాత్రి ఆ ఇంటిని నేను గమనించలేదు. నిప్పచ్చరం అలుముకు ఉంది. కానీ, ఇల్లు పరిశుభ్రంగా, పవిత్రంగా కనిపించింది. అక్కడ నీచత్వానికి, అల్పత్వానికి తావులేదు. చిత్రంగా అతని భాషలోనూ మార్పుకొట్టొచ్చినట్లు కనపడింది. అతనిదిప్పుడు గ్రామ్య భాష కాదు.

"పంచె కట్టుకో, భోంచేద్దాం..." అరిటాకులో అన్నం వడ్డించాడు. అరటికాయ కూర, పప్పుచారు, మజ్జిగ వ్యంజనాలు. స్పార్టన్ సింప్లిసిటీ!

"అది లేచిపోయాక నేను మళ్ళా పెళ్ళిచేసుకోలేదు. తప్పుడు కొడుకు! నాలుగేళ్ళు వాడుకుని వదిలేశాడు. పుట్టింటికెళ్ళింది. నాయన తన్ని తగలేశాడు. తప్పక నా దగ్గరకు వచ్చింది. నేనెళ్ళమంటే దానికి క్రిష్ణమ్మే గతి. అవమానం పాలై బతుకు అంతం చేసుకునే దౌర్భాగ్యం ఎవరికీ పట్టకూడదు. నేను దాన్ని ఆ ఆపత్తునుండి కాపాడదామనుకున్నాను. నాతో ఉండమన్నాను. శరీరంతో ఉంది. నాకు అది చేసిన ద్రోహం దాన్ని లోలోపలనుండి హరించేసింది. ఏడాది గడవకముందే చచ్చింది..."

భోజనం చేస్తున్నాం. అక్కడ మొహమాటపడటానికీ, సిగ్గుపడటానికీ ఆస్కారం లేదు. అతనికి తన సొమ్మేదో పెడుతున్న భావన లేదు. ఉన్నది తింటానికీ, వాడుకోటానికీ అందరికీ హక్కుంటుందన్నట్టు ప్రవర్తిస్తాడతను. అది నీదా! నాదా అన్న భావన లేదు.

"నిజానికి మనిసికి మరణమంటే భయం లేదు. దుఃఖమన్నా, బాధ అన్నా భయం అతనికి. ఉన్నది పోతుందేమోనన్న భయం.. ఈ భయానికి మూలం మనమే. నీ గురించి నువ్వు ఆలోచిస్తున్నప్పుడే అన్ని భయాలు, ఆందోళనలూ, నీకేమవుతుంది అన్న చింత నిన్ను నిరంతరం దహించివేస్తుంది.. చాలాకాలం ఆ వహ్నిలో దగ్ధమయాక, నాకు తెల్సింది. నా చుట్టూ పెద్ద ప్రపంచం ఉందనీ, ప్రతి మనిషీ తనే ఓ ప్రపంచమని భావిస్తాడనీ, భ్రమలో భ్రమిస్తాడనీ తెలుసుకున్నాను...."

ఏదేదో చెపుతూనే ఉన్నాడు అతను. సాయంత్రం కృష్ణలో గంటలతరబడి ఈదాం. నేను జీవితంలో ఎప్పుడూ అనుభవించని హాయిని అనుభవించాను. మర్నాడు పొద్దున లేచి, బస్సెక్కి కనకదుర్గమ్మ గుడిమెట్ల దగ్గర దిగాం. అమ్మను దర్శించుకున్నాం. అమ్మ ప్రశాంతంగా ఉంది. ఆ మాటే అన్నాను అనంతయ్యతో, అతను నవ్వాడు. "అమ్మ ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది. నీ మనసే ప్రశాంతంగా ఉంది" అని చెప్పాడు.

ఇంక తిరిగి రాబోతుంటే నా స్టెనో రామారావు కనిపించాడు. అతను నన్ను చూసి చాలా సంతోషపడిపోయాడు.

"మీకు మద్రాసుకు ఫోను చేశాను. మీరు వెళ్ళిపోయారని చెప్పారు. అరెస్టయి, అవమానం పాలయిన చలపతిరావుగారు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రాణం పోయేముందు, తన్నుకాపాడుకునేందుకు మిమ్మల్ని ఇరికించ ప్రయత్నించాననీ మేజిస్ట్రేటు ఎదుట మరణ వాంగ్మూలమిచ్చాడు. అవినీతి నిరోధక శాఖ వాళ్ళు మీ ఇంటిపై రైడ్ చెయ్యాలన్న ఆలోచనను విరమించుకున్నారు. మీరెక్కడికి పోయారా అని మీ ఇంట్లో వాళ్ళు గాబరా పడిపోతున్నారు. మొన్న పొద్దుననగా మద్రాసులో బయలుదేరినవాళ్ళు ఓరోజల్లా ఏమయ్యారా అని దిగులు పడ్డారు మీ భార్య.." అని చెప్పసాగాడతను.

అతని మాటలు నాకెంతో రిలీఫ్‌నిచ్చాయి. రైడ్ గురించి నేనేం పెద్ద గాబరా పడలేదన్నట్లు ధ్వనింపచేస్తూ, "మా బాబాయిగారింటికెళ్ళాలే. నువ్వేమిటీ, ఇలా వచ్చావు? కనకదుర్గమ్మను దర్శించుకోటానికి వచ్చావా?"

"మీకెలా ఉందో కానీ, ఈ కేసు తేలిపోవటంతో నా మనసు తేలికయిపోయింది. మీలాంటి మంచి మనిషి ఇలాంటి తప్పుడు కేసులో ఇరుక్కోటం నాకెంతో బాధకలిగించింది. మీరు బయటపడాలని అమ్మకు మొక్కుకున్నాను. మొక్కు తీర్చుకోటానికే వచ్చాను" అన్నాడతను.

"సరే, నువ్వు వెళ్ళిరా, మా బాబాయిగారు కూడా నాతో వచ్చారు. మేమిద్దరమూ ఇక్కడ నీకోసం వెయిట్ చేస్తాం" అన్నాను అతనికి నా పట్ల ఉన్న ప్రేమకు చలించిపోతూ.

"ఎక్కడా మీ బాబాయిగారు?" అడిగాడతను.

"ఇక్కడే!" అంటూ పక్కకు తిరిగాను.

అక్కడెక్కడా అనంతయ్య లేడు. ఆ ప్రాంతమంతా వెతికి చూశాం. అతను కనిపించలేదు. ఆరోజే కాదు, మరెప్పటికీ కనిపించలేదు. రెండు రోజుల తర్వాత సీతానగరం వెళ్ళాను గానీ ఆ ఇల్లూ కనిపించలేదు, ఆ మనిషీ దొరకలేదు.

బతుకులో ఇంత మానసిక క్షోభ మళ్ళా కలగలేదు. కానీ, గుండె నిండా ఆక్రోశంతో అర్థించినపుడు, మరో అనంతయ్య కనబడేవాడు. అతడే ఆ మూడో మనిషి!

మీకెప్పుడయినా ఆ మూడో మనిషి పరిచయమయిందా?

✷✷✷




## జూలై ౨౦౦౭

**కథాసాగర మథనంలో** జులై నెల స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వారపత్రికలు, స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచన, చిత్ర మాసపత్రికలు, దినపత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి వార్త సాక్షి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 92 కథలను విశ్లేషించి ఈ క్రింది కథలను కౌముది మాసపత్రిక పాఠకుల పరిచయానికి ఎంచుకున్నాను.

క్రితం కొన్ని నెలలకు భిన్నంగా ఈనెల కథలు వస్తువైవిధ్యంలోనూ, రచనా సంవిధానంలోనూ ఎంతో ముందడుగు వేశాయి. అందుకే పరిచయం చేసే కథల సంఖ్య కూడా పెరిగింది. మామూలుగా ముసలివాళ్ళను చూడని పిల్లల కథలు, రొటీన్ ప్రేమ కథలు, నీతి కథలు వచ్చినా భిన్నమైన అంశాలను ఎంచుకున్న కథలు, జీవితంలోని పలు విభిన్న పార్శ్వాలు స్పృశించిన కథలు అనేకం ఉన్నాయి.

***<u>నిప్పుల కుంపటి:</u>*** మన కథా ప్రపంచంలో కొన్ని రకమైన కథలకే ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని సమస్యలను అదే కోణంలో చూపించే కథలను విమర్శకులు, అంటే ఆ భావజాలాన్ని సమర్థించేవారు, పొగుడుతారు. దాంతో అలాంటి ఆలోచనలు ప్రామాణికంగా నిలుస్తాయి. కథకులు అదే సమస్యను, అదే కోణంలో ప్రదర్శిస్తారు. అలాంటి కథ నిప్పులకుంపటి. 'సెజ్' ల వల్ల భూములు కోల్పోతూ అన్యాయమైపోతున్న పేదపల్లె ప్రజల దుస్థితిని ప్రదర్శించే కథ ఇది. శ్రీదేవి, రాజయ్యలు ప్రధాన పాత్రలు. వీళ్ళది ఆ ఊళ్ళో గుడి పూజారి పని. కానీ, 'సెజ్'ల కోసమని భూములను ప్రైవేటు పరం చేసి, నష్టపరిహారంగా పేదల చేతుల్లో డబ్బులు పెడతారు. ప్రజలంతా బాధపడుతుంటారు. 'ఆ ఫాక్టరీలేవో పోరంబోకు భూముల్లో పెట్టుకోకూడదు?' అని వాపోతారు. చివరికి రాజయ్య చనిపోతాడు. 'ఇదంతా ఎందుకు జరుగుతూ ఉంది? ఎవరికోసం జరుగుతూ ఉంది?' అని ఎదురు తిరగాలనుకుంటుంది ఆమె.

'ఊరంతా నిప్పుల కుంపటిలా ఉంది' అంటూ కథను ముగిస్తాడు రచయిత సుంకోజు దేవేంద్రాచారి. ఈ కథ పదిహేను జులై 'నవ్య'లో ప్రచురితమయింది. 'సెజ్'లపై ప్రచురితంలో ఉన్న అభిప్రాయాన్ని ఈ కథ వ్యక్తపరుస్తుంది. ఈ అంశంపై ఇలాంటి కథలు బోలెడన్ని వచ్చాయి. ఇంకా బోలెడన్ని వస్తాయి. అయితే ఇక్కడ రచయితలు ఆలోచించవలసిందేమిటంటే, రచయిత ఏదో ఓ దృక్కోణానికి పరిమితమవటం వల్ల వారి దృష్టి సంకుచితమైపోతోంది. 'సెజ్'లనేది ఒక పరిణామ క్రమం. ఒకప్పుడు సినిమాలు వస్తూంటే బుర్ర కథలు, యక్షగానాలు, వీధిభాగోతాలు, నాటకాలు... ఇలా అనేక వినోదాత్మక కళలు ప్రమాదంలో పడ్డాయి. అలాగని సినిమాను వ్యతిరేకిస్తామా? అలాగే, రైళ్ళు బస్సులు, టాక్సీలు రావటం వల్ల రిక్షాలు, ఎడ్లబళ్ళు, ఇతర ప్రయాణ సాధనాల వారు దెబ్బతిన్నారు. అలాగని రైళ్ళను ఇతర ఆధునిక సాంకేతిక ప్రగతి ప్రతీకలను అనవసరమంటామా? వీధులు ఊడ్చే మెషీన్లు వచ్చి అనేకులు పొట్టకొట్టాయి. అంతెందుకు, 'ఐటి' వచ్చి ఎంతెంతమంది జీవితాలను అతలాకుతలం చేసింది? కాబట్టి, రచయితలు తమ దృష్టిని కేవలం వర్తమానానికే పరిమితం చేయకూడదు. వారు దూరదృష్టిని ప్రదర్శించాలి. ఆవేశం ప్రదర్శించి సంతృప్తి పడకూడదు. ఆలోచనను జత చేయాలి. అనివార్యమైన మార్పు పట్ల ఆవేదన, ఆవేశం సామాన్యులు ప్రదర్శిస్తారు. రచయిత అన్నవాడు ద్రష్టలాంటివాడు.

మార్పులను వివరించి, ఆ మార్పులను తట్టుకుని, అర్థం చేసుకునే శక్తి ప్రజలకిస్తూ, వారిని భవిష్యత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం చేయాలి. రచయితలు ఆశావాదాన్ని ప్రదర్శించాలి. కృష్ణానదికి ఆనకట్ట కట్టడం వల్ల ఊళ్ళు మునిగిపోతాయని ఆగిపోయివుంటే, ఈనాడు శ్రీశైలం ప్రాజెక్టు ఉండేదా? ఇన్ని గ్రామాలలో విద్యుద్దీపాలు వెలిగేవా? ప్రతీదానికీ బొమ్మ, బొరుసు ఉంటాయి. నాణేనికి ఓ వైపును మాత్రమే చూసేవారు సామాన్యులు. రెండు వైపుల చూసి, ప్రజలకు నిజనిజాలు వివరించేవాడు, భవిష్యత్తును దర్శింపచేసేవాడు సృజనాత్మక రచయిత. ఈ సందర్భంలో అప్రస్తుతమైనా 'నయాదౌర్' అన్న పాత హిందీ సినిమాలెన్నో ఎవరికీ గుర్తులేవు. కానీ 'సమన్వయా'న్ని ప్రదర్శించిన ఆ సినిమా ఈ నాటికీ సజీవంగా ఉంది. ఆధునికతను, ఉన్నదాన్ని ఉన్నట్టుంచాలనే ఆలోచనకు నడుమ ఘర్షణ తలెత్తినప్పుడల్లా 'నేనున్నా'నంటూ మార్గదర్శనం చేస్తుంది. రచయితలు అలాంటి ఆలోచనకు పెద్ద పీట వేస్తే తెలుగు కథలు కూడా చిరంజీవులవుతాయి. లేకపోతే, ఆ భావజాలానికి పెద్ద పీటవేసేవారికి గొంతున్నంతకాలం ఉంటాయి. ఆ తరువాత ఎవరూ పట్టించుకోరు.

*లాస్ట్ మెయిల్:* జూలై 22 'నవ్య'లో ప్రచురితమయిన ఈ కథను రచించింది సీతారత్నం. 'పింక్ స్లిప్'ల ఆధారంగా ఇంతవరకూ వచ్చిన కథలన్నిటిలోకీ నిజానికి దగ్గరగా ఉంటూ, ఆశావాదాన్ని ప్రదర్శిస్తూ, మధ్యలో దారితప్పకుండా, చివరి వరకూ కథపై దృష్టిని, పట్టును సడలనివ్వని కథ ఇది. 'మిత్ర' అనే యువకుడికి 'ఐటి' దెబ్బ తగులుతుంది. ఉద్యోగం పోతుంది. అయినా అధైర్యపడడు. 'ఐటి' రిక్రూటర్‌ను సంప్రతిస్తాడు. తక్కువ జీతమైనా మరో ఉద్యోగంలో చేరిపోతాడు. జీతం తక్కువని బాధపడడు. తక్కువ జీతమైనా ఉద్యోగంలోని లాభాలవైపే దృష్టిపెడతాడు. కొసమెరుపేమిటంటే, మిత్రకు ఉద్యోగం ఇప్పించిన ఐటి రిక్రూటర్ మదన్ ఉద్యోగం పోతుంది.

*సంకెళ్ళు:* జులై 3, స్వాతి వారపత్రికలో ప్రచురితమయిందీ కథ. ఇది విలక్షణమయిన కథ. నేరస్తుడిలోని మంచితనాన్ని చూపిస్తుందీ కథ. క్షణిక ఆవేశంలోనో తప్పనిసరి పరిస్థితులలోనో శౌర్యం ప్రదర్శించినా, వ్యక్తిపై నేరస్తుడిగా ముద్రపడుతుందేమో కానీ, అలాగే మౌలిక స్వభావం మారదని ప్రదర్శిస్తుందీ కథ. రాఘవరావు, చౌదరి అనే అతడిని హత్య చేస్తాడు. అతడిని కోర్టును తీసుకెళ్ళటం ఓ పోలీసు బాధ్యత. కథ పోలీసు దృక్కోణంలో చెప్పినట్టుంటుంది. అది కథకు వన్నె తెచ్చింది. సాధారణంగా నేరస్తుడంటే ఉండే అనుమానాలు, భయాలు, జాగ్రత్తలను పాఠకులకు తెలిపి, కథలో ఆసక్తి కలిగించే వీలు చిక్కింది. కోర్టు విచారణ వాయిదా పడిన తరువాత కూతురి కోసం ఎదురు చూస్తాడు రాఘవరావు. కూతురి కోసం సంకెళ్ళు తీసేయమంటాడు. అనుమానించినా అతడిమాట వింటాడు పోలీసు. కూతురిపై అతడు ప్రేమ చూపటం చూసిన పోలీసును 'బ్రతికినంతకాలం బంధించి ఉంచే సంసార సాగరం కంటే పెద్ద జైలు ఎక్కడుంది? ' అన్న ఆలోచన వస్తుంది. ఇదీ కథ. అయితే, కూతురు వస్తోంది సంకెళ్ళు తీయమనటం 'రాక్' అనే హాలీవుడ్ సినిమాలో చూసిన గుర్తు. అయినా కథకీ దానికీ ఏ మాత్రం సంబంధం లేదు.

*మంచిరోజు:* ఆంధ్రభూమి వారపత్రిక, జూలై పదహారు సంచికలో ప్రచురితమయిందీ కథ. కథను రచించింది గన్నవరపు నరసింహమూర్తి. ఈ కథ మామూలు కథనే కానీ రచయిత కథలో ప్రదర్శించిన ఆరోగ్యకర దృక్కోణం అభినందనీయం. దివాకర్, జానకిలకు కొత్తగా పెళ్ళవుతుంది. రైల్వే కాలనీలో ఉండాలన్న జానకి కల నెరవేరుతుంది. కానీ పెళ్ళిరోజు పుట్టింటికి వెళ్ళాలన్న ఆమె కోరిక దివాకరుకు ఉద్యోగంలో అర్జంటు పని రావడం వల్ల భగ్నమవుతుంది. రైలును ఏక్సిడెంటునుంచి తప్పిస్తాడు దివాకర్. రెండో పెళ్ళిరోజు కూడా ఇలానే అవాంతరం వస్తుంది. దివాకర్ ఆమెకి 'సారీ' చెపుతాడు. కానీ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఇతరుల ప్రాణాలు కాపాడుతున్న భర్తను అర్థం చేసుకుంటుందామె. ప్రతి చిన్న పనికీ అసంతృప్తి పెంచుకుని, భర్తని వదిలేయటమే అభ్యుదయం, అద్భుతం అని బోధిస్తున్న 'పొలిటికల్లీ కరెక్ట్' కథల మధ్య 'మంచి' చెపుతూ, భర్తని అర్థం చేసుకోమని చెప్పే, మామూలు కథ కూడా గొప్పగా కనిపిస్తుంది.

*నిస్వార్థంగా జీవించాలి ఇట్లు డబ్బు:* పెందుర్తి మాష్టర్జీ రచించిన ఈ కథ జూలై పన్నెండు 'సాక్షి' ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. నిజానికి దీన్ని కథ అనేకన్నా డైలాగులతో కూడిన వ్యాసం అనవచ్చు. ద్వైన్యాస్థానంలో అవివాహితగా గర్భవతి అయిన అంజలి పై న్యాయవిచారణ జరుగుతుంటుంది. దోషి ఎవరంటే? ప్రేమ, కామంలను దాటి 'డబ్బు' దగ్గర ఆగుతుంది. డబ్బు ఓ ఉపన్యాసం ఇస్తుంది. అదీ కథ. కథ మామూలే అయినా రచయిత కథను చిన్న పిల్లల జానపదగాథలా చెప్పాలని ప్రయత్నించటం బాగుంది.

*దృశ్యకీచకం:* కొండేపూడి నిర్మల రచించిన ఈ కథ జూలై పన్నెండు, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఈ కథలో రచయిత్రి 'చాటింగ్' ప్రాజెక్టుల 'ఇంటర్వ్యూ'లలోని లైంగిక వేధింపులను ప్రదర్శించాలని ప్రయత్నించారు. ప్రస్సు అనే అమ్మాయి ఓ కార్పోరేటు సెక్టరులో ఉద్యోగం చేస్తుంటుంది.

ప్రాజెక్ట్ కోసం ఒకడితో చాటింగ్ మొదలుపెడుతుంది. వాడు ఆమెతో వెకిలిగా ప్రవర్తిస్తుంటాడు. వాడిని తిట్టుకుంటూ, అసహ్యించుకుంటూ కూడా ఆమెకు వాడితో కాంటాక్టు మెయిన్‌టైన్ చేయక తప్పదు. ఇదీకథ. కథలో ప్రస్సు పాత్రకానీ ఆమె బాధని కానీ పాఠకుల సానుభూతి పొందే రీతిలో రూపొందలేదు. పైగా ప్రస్సు ఎదుర్కొంటున్న సమస్య కొత్తది కాదు. అసాధారణమైనది కాదు. ఇటీవలె బ్లాగర్లందరూ ఓ చోట సమావేశమైతే, ఆ ఫోటోలు నెట్‌లో పెట్టొద్దని, పెట్టినా పేర్లు రాయొద్దనీ బోలెడంత టెన్షన్ పోయారు మహిళా బ్లాగర్లు. అలాంటి పరిస్థితిలో తన బొమ్మ పెట్టి, చాటింగ్ చేస్తూ, వాడు తన ఫోటోని ముద్దుపెట్టుకుంటున్నా, వ్యతిరేకించక, ప్రతిఘటించక, మనసులో మాట నిర్మొహమాటంగా చెప్పక, వాడికి మేధావి కళ ఉందని పొగుడుతూ, తనకి పెళ్ళయిందని, భర్తతో ఫోటోల్ని చూపుతూ, అయినా అర్థం చేసుకోవటం లేదని వాపోవటంతో కథ అర్థం లేనిదిగా, పాత్ర వ్యక్తిత్వం లేనిదిగా తయారయింది. ఏదో మగవాడి లైంగిక బుద్ధిని తిట్టటం తప్ప మరో ఉద్దేశ్యం లేదు రచయిత్రికి అనిపిస్తుందీ కథ. పైగా, కథ చదువుతూ, దాన్లో ప్రస్సు పాత్ర ప్రవర్తన చూస్తుంటే, కాళిదాసు రచించిన శృంగార తిలకంలోని ఓ శ్లోకార్థం గుర్తుకు వస్తుంది. ఆశ్రయమివ్వమని ఇంటికి వచ్చిన ఓ యువకుడితో, యువతి 'నా భర్త వ్యాపార నిమిత్తం విదేశాలు వెళ్ళాడు. అత్తగారు ఇంట్లోలేరు. నేను యవ్వనంలో ఉన్నాను. ఒంటరిని. ఒంటరి దాన్ని నీకు ఆశ్రయం ఎలా ఇస్తాను? కానీ ఆ లేఖని పంపేయటం ఎలా?' అంటుందా యువతి. ఇది ఆహ్వానిస్తున్నట్టా? పొమ్మంటున్నట్టా? అలా ఉందీ కథ.

*దొంగతనం:* మధురాంతకం నరేంద్ర రచించిన ఈ కథ జూలై 5, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఇది మనకు పరిచయంలేని సామాజికాంశాన్ని ప్రతిభావంతంగా స్పృశిస్తుంది. సాధారణంగా, ఇళ్ళు కట్టే పనిచేసే మేస్త్రీలు పనిపిల్లలను కొనితెచ్చుకుంటారు. వాళ్ళు ఇళ్ళ వాళ్ళకు డబ్బులిచ్చి ఓ సంవత్సరంపాటు వీరితో పనులు చేయించుకుంటారు. ఓ రకమైన వెట్టిచాకిరీ, దోపిడి ఇది. మన కథకులు ఎంతో అరుదుగా స్పృశిస్తారీ అంశాన్ని. ఈ ఇంట్లో ఇలా పెయింటింగ్ పనులు చేసే అబ్బాయి పారిపోతాడు. వాడు ఇంట్లో వస్తువులు దొంగతనం చేశాడని ఇంట్లోవాళ్ళు ఆరోపిస్తారు. వాళ్ళలాంటివాళ్ళు కాదని మేస్త్రి అంటాడు. ఇదీకథ. చివరికి ఆ పిల్లవాడు దొరుకుతాడు. వాడో బక్కెట్టు తీసుకుపోతాడు. ఈ మధ్యలో సంభాషణల ద్వారా, వాదోపవాదాల ద్వారా ఇలాంటి పనివారి పరిస్థితులు పాఠకుడికి తెలుస్తాయి. అయితే, ఇక్కడా పాఠకుడికి ఏ పాత్రపై సానుభూతి కలగదు. కథలో పాఠకుడు తాదాత్మ్యం చెందడు. ఒక మంచి అంశాన్ని స్పృశించిన మామూలు కథలా మిగిలిపోతుందీ కథ.

*పర్దా:* జూలై పంతొమ్మిది ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన ఈ కథను రచించింది వేంపల్లె షరీఫ్. ఈ కథకూడా మనకు అంతగా పరిచయం లేని జీవనాన్ని స్పృశిస్తుంది. కానీ కథ చదువుతున్న కొద్దీ పాఠకుడికి తాను ముస్లిమ్ల ఇళ్ళల్లోకి కాదు, తనలోకి తాను తొంగి చూసుకుంటునాడన్న భావన కలుగుతుంది. కథను పిల్లవాడి దృక్కోణంలో చెపుతాడు రచయిత. పిల్లవాడి నానమ్మ 'జేజి' వీళ్ళ దగ్గర ఉండటానికి వస్తుంది. ఆమెది స్వేచ్ఛ ప్రవృత్తి. కానీ ఆమె కొడుకు బయట తిరగవద్దంటాడు. పరదా

కదల్చబ్దంటాడు. కానీ జేజి కదలకుండా ఉండలేదు. గతంలో పిల్లవాడిని ఎలా పెంచిందో గుర్తుచేస్తుకుంటుంది. ఆమెకు ఆరోగ్యం బాగాలేక పోతే డాక్టర్ దగ్గరకు వెళితే కొడుక్కు కోపమొస్తుంది. 'ఇంట్లో' పడి ఉండమంటాడు. 'వీడి సిన్నప్పుడు ఇల్లిల్లూ తిరిగి అడుక్కున్నా... అప్పుడు గోషా, పరదా అనుకుంటే ఈనాకొడుకు ఇంతోడు అయేటోడా' అంటూ వెళ్ళిపోతుంది. కథ చదువుతుంటే, మనకు తెలియకుండానే భుజాలు తడుముకుంటాం. మనలోపలికి తొంగి చూసుకుంటాం. ఆమె బయటకెళ్ళి పని చేయందే గడవని కుటుంబంలో పెరిగి కూడా పెద్దయిన తరువాత 'పర్దా' పాటించాలని నిర్బంధించే పురుషమనస్తత్వానికి మతంతో సంబంధం లేదు. ఈ కథలో ప్రదర్శించిన అంశాలు ప్రతి కుటుంబంలో ఏదో ఓ రూపంలో కనిపిస్తాయి. మంచి కథ ఇది. అత్త, కోడలు, కొడుకుల నడుమ ఘర్షణలు, ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నాలు చేయక అహానికే ప్రాధాన్యం ఇవ్వటం వంటి విషయాలను రచయిత చక్కగా ప్రదర్శించాడు.

***కోల్పోయాక:*** డా.ఎ.రవీంద్రబాబు రచించిన ఈ కథ జూలై పంతొమ్మిది సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. 'ఇలా ఎందుకు జరుగుతుంది? మా సంస్కృతి ఏమైంది? నా మూలాలు ఏమయ్యాయి? ఇదంతా ఎక్కడిది? ఎందుకు నేను నేనుకాదు?' అంటూ ఆరంభమవుతుందీ కథ. ఇదంతా గంగ ఆలోచన. గంగ తండ్రి తప్పెటలో ప్రసిద్ధుడు. ఆమెకు బాల్యంలో ఓ సందేహం వస్తుంది. తాము మొక్కేది అంకమ్మను. మరి ఈ విష్ణువు ఎవరు!? అని. ఆమె తండ్రి 'అవన్నీ పెద్దోళ్ళు రాసినవి' అంటాడు. తరువాత గంగ పెద్ద చదువులు చదివి 'వాస్తవ జీవితానికి తనే దూరమౌతుంది. పెళ్ళి చేసుకుంటుంది. నాన్నని పట్నం రప్పించుకుంటుంది. పిల్లలు టీవీలో 'షో చూస్తుంటారు' తాత తప్పెట ప్రోగ్రాం పెట్టాలంటే, 'ఛానల్ రేటింగ్స్' పడిపోతాయని ఎవరూ ఇవ్వరని బాధపడుతుంది. చివరికి 'ఒకప్పుడు తన సంస్కృతిపై అగ్రకులాల సంస్కృతి.. ఇప్పుడు అన్ని వర్గాల సంస్కృతిపై అగ్రరాజ్యాల సంస్కృతి దాడి' అంటు వాపోతుంది. ఇదీ కథ. కథలో 'గంగ' పాత్ర ఆవేదన అర్థమయినా, ఆ ఆవేదన స్వరూపాన్ని అవగతం చేసుకోవటంలో రచయిత మన సమాజంలో నెలకొని ఉన్న అపోహలను దాటి చూడలేకపోయాడు. ప్రచారంలో ఉన్న పాపులర్ భావాలనే ప్రదర్శించాడు. ఏ సమాజమైనా నిశ్చలంగా ఉంటే అది నశిస్తుంది. సమాజంలో నిరంతరం మార్పులు వస్తుంటాయి. ఈ మార్పులకు తట్టుకోగలవి నిలబడతాయి. లేనివి అదృశ్యమౌతాయి. అంకమ్మ, విష్ణువు వేర్వేరన్న భావన ఎదిగీ ఎదగని వయసులో వచ్చే భావన. కానీ ఏదో, ఒక్కసారి మనజీవన విధానాన్ని గమనిస్తే, మన దేవీ దేవతలంతా ఒకటేనని స్పష్టమౌతుంది. మన సమాజంలో సంఘర్షణలు ఇటీవలివేనని, ప్రాచీన కాలంలో అందరూ 'సహజీవనం' సాగించేవారనీ అర్థమౌతుంది. 'తన సంస్కృతిపై అగ్రకులాల సంస్కృతి దాడి' అన్న వాక్యం అర్థరహితమే కాక అవగాహనారాహిత్యానికి దర్పణం పడుతుంది. 'తమది' అదృశ్యం అవుతుందన్న ఆవేదన సమంజసమే అయినా, దానికి ఎవరినో దోషిని చేసి, ద్వేషం వెదజల్లటం భావ్యం కాదు. కథలో తప్పెట వాయిద్యాన్ని ఏ టీవీ ఛానల్ ప్రసారం చేయదని గంగవాపోతుంది. కానీ, తన తప్పెట వాయిద్యాన్ని సజీవంగా ఉంచేందుకు గంగకానీ గంగలాంటి విద్యావంతులు కానీ ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా, ఎవరో దాడిచేస్తున్నారు, అన్యాయం చేస్తున్నారు అని వాపోవటం మన సమాజంలో నెలకొని ఉన్న 'పొలిటికల్లీ కరెక్టు' ఆలోచనలను అనుసరిస్తుంది. అయితే, రచయిత ఓ విషయం గమనించినట్టు లేదు. దూరదర్శన్ ఇప్పటికే అనేక మరుగున పడుతున్న జానపద కళలకు ప్రాధాన్యం ఇస్తుంది. టి.ఆర్.పితో సంబంధం లేకుండా వాటిని ప్రసారం చేస్తుంది. అలాగే, 'మా' టీవీలో 'రేలా రే రేలా' అన్న కార్యక్రమం పూర్తిగా జానపద పాటలదే. అత్యంత ప్రాచుర్యం పొందిన కార్యక్రమం ఇది. పూర్తిగా జానపద పాటలదే. అత్యంత ప్రాచుర్యం పొందిన కార్యక్రమం ఇది. జానపద పాటల వ్యాపారాల విలువను నిరూపించిన కార్యక్రమం ఇది.

***వెంటాడే జ్ఞాపకం :*** జీవన్ రచించిన ఈ కథ జూలై 26 , 'ఆంధ్రభూమి' సంచికలో ప్రచురితమయింది. మనం సాధారణంగా చూసే దృశ్యాలను, గమనించే విషయాలనే మనసుతో చూసి ప్రదర్శించిన కథ ఇది. కథ ఓ ముసలాయన దృక్కోణంలో చెపుతాడు రచయిత. అతడు తన మనమరాలుని చూసి వెనక్కు వెళుతుంటాడు. రైల్లో ఎదురుగా పేద అమ్మాయి, పిల్లడితో ప్రయాణిస్తుంటుంది.

పిల్లాడు ప్రతి తను బండారాన్ని ఆశగా చుస్తుంటాడు. అది చూసిన ముసలాయన ఆ పిల్లవాడికి బిస్కెట్ కొనివ్వబోతే ఆమె వద్దంటుంది. 'ఎన్ని కష్టాలొచ్చిన గాని ఒకళ్ళ దగ్గర చెయ్యిసాచొద్దం'టుంది. ఆమె భర్త చనిపోతే, పనివెతుక్కునేందుకు అన్న దగ్గరకు వెళుతుంటుంది. ఇదీ కథ. ఈ కథలో ఒకరికి తిండి ఎక్కువ అవటం, మరొకరికి తిండిలేకపోవటం, తినాలని ఉన్నా తినలేని పేదపిల్లలు, అన్ని ఉన్నా తినలేని ధనవంతులు, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి విషయాలను రచయిత చక్కగా ప్రదర్శించారు. అయితే కథ ఆరంభం సుదీర్ఘంగా ఉండి, కాస్త విసుగు కలిగిస్తుంది. దాదపుగా ఈ కథను ఈ నెల కథగా ఎంచుకోవాలనుకుని నిశ్చయించుకుంటుంటే ఈ క్రింది కథ కళ్ళబడ్డది.

*<u>మనకోసం ఆకాశం:</u>* ఎన్ శివనాగేశవరరావు రచించిన ఈ కథ జూలై 2, ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయింది. ఈనెల కథ ఇది. ఈనెల కథగా ఎంచుకోవటంలో ప్రధాన పాత్ర వహించింది, కథలో రచయిత ప్రదర్శించినది పాజిటివ్ దృక్పథం. శంకరం తండ్రి కృష్ణమూర్తి రిటైరవుతాడు. ఆయన వైద్యుడు. రిటైరయినా, అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా వచ్చినవారికి మందులిస్తుంటాడు. ప్రొద్దున్నే అందరికీ యోగా నేర్పిస్తుంటాడు. ఇది శంకరానికి నచ్చదు. విసుక్కుంటుంటాడు. విసుక్కుంటూ, తన బ్రతుకేదో తాను బ్రతకాలనుకునే శంకరానికి 'మొక్కను తెచ్చి గదిలో పెడితే వాడిపోతుంది. బయట పెడితే చిగురిస్తుంది. దానికి జీవంపోసేది సూర్యకిరణం. ఇదే సూత్రం మనిషికీ వర్తిస్తుంది. ఒంటరిగా గదిలో కూర్చుంటే మనసు చచ్చిపోతుంది' అని పదిమందితో కలిసి మెలసి ఉండాలని, ప్రేమ చూపాలని బోధిస్తాడు. ఓ రోజు హఠాత్తుగా కృష్ణమూర్తి మరణిస్తాడు. అప్పుడు అర్ధమౌతుంది శంకరానికి, తన తండ్రి ఇంతమంది జీవితాలపై ఎలాంటి ప్రభావం చూపించాడో. 'మనకోసం అవకాశం బయట వేచి చూస్తున్నది. ఇంటి తలుపు ముందు, మనసు తలుపులు కూడా తీసుకుని బయటకు రావాలి' అన్న తండ్రిమాటల మర్మం బోధపడుతుంది. చక్కని కథ ఇది. సంకుచితంతో, తాను, తనదీ అన్నదానికి పరిమితమవటంలోని అనర్థాన్ని చక్కగా ఎత్తి చూపిస్తుంది. మంచి ఆదర్శాన్నిస్తుంది. పది వ్యక్తిత్వ వికాస వ్యాసాలు చూపలేని ప్రభావాన్ని ఒక మంచి కథ సాధిస్తుందనటానికి ఈ కథ నిదర్శనం. ఎలాంటి ద్వేషాలు, ఆవేదనలు, ఆవేశాలు, సంఘర్షణలు, ఉద్యమాలతో ప్రమేయం లేకుండా మానవ జీవితానికి ఆవశ్యకమైన ఒక మంచి ఆలోచనను ప్రదర్శించిన ఈ కథ ఈ నెల కథ.

ఈ కథ చదివిన తరువాత ఆగస్ట్ (2009) నెల రీడర్స్ డైజెస్ట్‌లో మాళవిక శ్రీవాస్తవ రాసిన ఆమె తండ్రి స్మృతులు 'My Fathers Secrets' కూడా చదవండి. నిజజీవితంలోంచి వచ్చే కథల గొప్పతనం స్పష్టమౌతుంది. ఉద్యమాలు, సమస్యలు ప్రదర్శించే కథలకన్నా మానవ జీవితంలోని మంచిని ప్రదర్శించే కథల ఔన్నత్యం, ఆవశ్యకతలు స్పష్టమౌతాయి.

*ఈనెల కథ*

## మనకోసం ఆకాశం - ఎన్.శివనాగేశ్వరరావ్.

2 జూలై, ఆంధ్రభూమి , వారపత్రిక 2009 సంచిక నుంచి

అప్పుడే నిద్రపడుతున్న శంకరానికి నిద్రాభంగం అయింది.

తలతిప్పి గడియారం వంక చూశాడు. సమయం పదకొండు అయింది. "ఈ సమయంలో వచ్చింది ఎవరా? అని ఆలోచించలేదతను. వచ్చింది నాన్నకోసమే!" అని మాత్రం అనుకున్నాడు.

అంతలో పక్క గది తలుపు తెరుచుకుంది. "నువ్వా రమణయ్యా! ఈ సమయంలో వచ్చావు. మందేమైనా కావాలా?" అని తండ్రి అడగడం శంకరానికి వినిపిస్తూనే ఉంది.

"ఉన్నట్లుండి ఆయాసం వచ్చిపడింది. ఊపిరి సలపడంలేదు. అందుకే ఈ సమయంలో వచ్చాను. ఏమీ అనుకోకు క్రిష్ణమూర్తీ!" అన్నాడు రమణయ్య.

"మరేం ఫర్వాలేదు. అలా కూర్చో! మందు ఇస్తాను" అన్నాడు క్రిష్ణమూర్తి.

అతనిచ్చిన మందు వేసుకుని అయిదు నిముషాల తరువాత వెళ్ళిపోయాడు రమణయ్య. క్రిష్ణమూర్తి బయట గేటు వేసి వచ్చి మంచం మీద నడుము వాల్చాడు.

నిద్రాభంగం అయిన శంకరానికి మరిక నిద్రపట్టలేదు. అందుకు కారకుడైన తండ్రి మీద పీకలదాకా కోపం వచ్చింది. అది వెంటనే వెళ్ళగక్కపోతే మరిక నిద్రపట్టదని నిశ్చయం అయ్యాక మంచం మీద నుంచి లేచి తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"ఏం శంకరం! నిద్రపట్టలేదా?" పలకరించాడు క్రిష్ణమూర్తి.

"పట్టిన నిద్ర నీవలన పాడైంది. అయినా మందులు ఇవ్వడానికి వేళాపాళా లేదా? ఎప్పుడు పడితే అప్పుడు రావద్దని వాళ్ళకు చెప్పు" అన్నాడు విసుగ్గా.

"వచ్చే రోగం వేళాపాళా చూసుకుని వస్తుందా? ఏదో చేతనైన సహాయం చేస్తున్నాను. కోపగించకు" అన్నాడు క్రిష్ణమూర్తి.

"నీ మటుకు నీ ఉండక ఎందుకొచ్చిన సహాయాలు? ఇంటిని సత్రం చేస్తున్నావు. ఎప్పుడూ ఎవడో ఒకడు వస్తూనే ఉంటాడు" చికాకు పడుతూ తనగదిలోకి వెళ్ళిపోయాడు శంకరం.

కొడుకు మాటలకు క్రిష్ణమూర్తి మనసు చివుక్కుమంది. అది అతనికి కొత్తకాదు. అయినా ప్రతిసారీ బాధనిపిస్తూనే ఉంటుంది. 'ప్రక్కవాడికి సహాయం చేయకపోతే మరెవరు చేస్తారు? ఎవరి మటుకు వాళ్ళుంటే ప్రపంచం ఎలా నడుస్తుంది? ' అనుకున్నాడు మనసులో.

మనిషి పదిమందితోనూ కలవాలి. తనకు తానుగా ఉంటే కుంచించుకుపోతాడు. పదిమందికి సహాయం చేస్తే పరిమళిస్తాడు అన్నది అతని భావన. అతను అలాగే ఉంటాడు. అందరూ అలా ఉండాలనుకుంటాడు.

శంకరానికి నిద్రపట్టలేదు. తండ్రితో అంత కటువుగా మాట్లాడకుండా ఉండవలసింది అనుకున్నాడు.

శంకరానికి పదేళ్ళ వయసు వచ్చేసరికి అతని తల్లి కాలం చేసింది. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా క్రిష్ణమూర్తి మరలా రెండో పెళ్ళి చేసుకోలేదు. శంకరాన్ని ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేశాడు. ఆ అభిమానం శంకరానికి లేకపోలేదు. వద్దనుకుంటూనే తండ్రిమీద కోపగించుకుంటూ ఉంటాడు. తలతిప్పి చూసిన శంకరానికి భార్య ఇందిర, అయిదేళ్ళ కొడుకు అనిల్ నిద్రపోతూ కనిపించారు. గంటకు గాని శంకరానికి కంటిమీద కునుకు రాలేదు.

తెలతెలవారుతుండగా బయట గేటు తీసిన చప్పుడయింది. శంకరానికి వెంటనే మెలుకువ వచ్చింది. 'ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అప్పుడే తగలడ్డారు' అని మనసులో తిట్టుకున్నాడు.

క్రిష్ణమూర్తికి యోగాలో మంచి ప్రవేశముంది. రిటైరయ్యాక నలుగురిని పిలిచి ఆసనాలు వేయించడం, ధ్యానం చేయించడం వంటివి నేర్పించడం మొదలుపెట్టాడు. ఎప్పుడూ పదిమందికి తక్కువ కాకుండా జనం అతని దగ్గరకు వస్తూనే ఉంటారు.

అది శంకరానికి నచ్చదు. ఎవరింటి దగ్గర వాళ్ళు యోగా చేసుకోవచ్చుకదా! మా ఇంటి మీదకు వచ్చిపడతారెందుకు? అనుకుంటాడు. అదే విషయం తండ్రితో వాదించాడు కూడా.

"ఎవరింటి దగ్గర వాళ్ళుంటే బద్ధకిస్తారు. అందరూ ఒక చోట కలిస్తే శ్రద్ధ పెరుగుతుంది. మనిషి పదిమందితో కలిస్తే చాలా ప్రయోజనాలుంటాయి. నీవు కూడా వచ్చి వాళ్ళతోపాటు యోగా చెయ్యి. ఆరోగ్యానికి ఆరోగ్యం. మానవ సంబంధాలు మెరుగుపడతాయి" అని చెప్పేవాడు. క్రిష్ణమూర్తి. ఆ మాటలు శంకరానికి రుచించేవి కావు.

సమయం అయిదు గంటలు అయింది. శంకరం మరలా నిద్రపోవడానికి ప్రయత్నించాడు గానీ నిద్రపట్టలేదు. అతనికి త్వరగా నిద్రపట్టదు. పట్టినా చిన్న చప్పుడుకే మెలుకువ వచ్చేస్తుంది.

అది తెలుసుకున్న క్రిష్ణమూర్తి ఒకసారి 'శంకరం! నీవు ఇష్టపడే ఒంటరితనం నీలో అభద్రతా భావం పెంచింది. నీ సంతోషం హరిస్తున్నది. అది నీవు గ్రహించడంలేదు. నీ మటుకు నీవుంటే నీ సంతోషం నీది. నీ దుఃఖం నీది. బయటకి వచ్చి పదిమందితో పంచుకుంటే నీ సంతోషం మరింత పెరుగుతుంది. దుఃఖం తగ్గుతుంది" అని సలహా ఇచ్చాడు. తండ్రి మాటలు ఛాదస్తంగా కొట్టిపారేశాడు శంకరం.

ఏడుగంటలకు యోగా క్లాస్ పూర్తయింది. వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు. క్రిష్ణమూర్తి డాబా మీద నుంచి కిందకు దిగాడు. అప్పటికి శంకరం కాఫీ తాగి పేపర్ చదువుకుంటున్నాడు.

"కొంచెం సేపు ధ్యానం చేయకూడదూ? ఏకాగ్రత పెరుగుతుంది" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం పేపర్‌లోంచి తలెత్తకుండానే "అవన్నీ పనీపాటా లేనివారికి. నాకెందుకు"అన్నాడు

క్రిష్ణమూర్తి మౌనంగా లోనికి నడిచి అప్పుడే నిద్రలేచిన మనవడ్ని పలకరించి వాడితో సూర్యనమస్కారాలు ప్రాక్టీస్ చేయించసాగాడు. అది చూసిన శంకరం "ఈయనగారు ఎవరినీ వదలడు" అనుకున్నాడు.

శంకరం స్నానం చేసి, టిఫిన్ తిని ఆఫీస్‌కి బయలుదేరపోతుండగా క్రిష్ణమూర్తి అతని దగ్గరకు వచ్చాడు.

"ఏమిటి?" అడిగాడు శంకరం.

అతను, శంకరానికి అయిదువందలు అందించి "ఈ చిరునామాకి మని ఆర్డర్ పంపించు" అని చెప్పాడు.

"ఎందుకట?" వివరం అడిగాడు శంకరం.

"ఆ అబ్బాయికి చిన్నవయసులోనే గుండెజబ్బు. ఆపరేషన్‌కి ఆర్థిక సహాయం కోరుతూ పేపర్ ప్రకటన ఇచ్చారు. నేను చేయగల సహాయం చేస్తున్నాను" చెప్పాడు క్రిష్ణమూర్తి.

"అవన్నీ దొంగప్రకటనలు" చెప్పాడు శంకరం.

"మనిషి మీద అంత అపనమ్మకం పెంచుకోకు శంకరం! మనిషిని నమ్మకపోతే అది మానవ మనుగడనే దెబ్బతీస్తుంది" కొడుకును హెచ్చరించాడు క్రిష్ణమూర్తి.

అంతలో అటు వచ్చిన ఇందిర, భర్తతో 'మామయ్య పెన్షన్ డబ్బులు ఆయన ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టుకోమని మీరే కదా చెప్పారు! ఇప్పుడు వాదన ఎందుకు? మామయ్యగారు చెప్పినట్లు చేయండి' అన్నది. క్రిష్ణమూర్తి కోడలి వంక ప్రేమపూర్వకంగా చూశాడు.

శంకరం స్కూటర్ స్టార్ట్ చేస్తూ "అనిల్‌ని ఒకసారి బయటకు పిలువు" అని భార్యతో చెప్పాడు.

"అనిల్! డాడీ పిలుస్తున్నారు!" కేక వేసింది ఇందిర.

వీడియో గేమ్ ఆడుకుంటున్న అనిల్ బయటకు రాకుండానే "బైడాడీ!" అని బిగ్గరగా అరిచాడు. కొడుకు బయటకు రాకపోవడం శంకరానికి అసంతృప్తిని కలిగించింది. ఆఫీస్‌కి బయలుదేరిపోయాడు.

మనవడు బయటకు రాకుండానే 'బై' చెప్పడం గమనించిన క్రిష్ణమూర్తి "మనిషి మనసుతో చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. కానీ ఇప్పుడు అవన్నీ యాంత్రికం అయిపోతున్నాయి. కొంతకాలానికి మనిషి, మనసులేని మరబొమ్మ అయిపోతాడు" అనుకున్నాడు.

అతను మనవడి దగ్గరకు వెళ్ళి "అనిల్! నాన్న పిలిచినప్పుడు బయటకు వెళ్ళి ప్రేమగా టాటా చెప్పాలి. అప్పుడతని మనసుకు సంతోషం కలుగుతుంది. వీడియో గేం ఎప్పుడూ ఉంటుంది. డాడీ మళ్ళీ సాయింత్రానికి గాని రాడు" అని చెప్పాడు.

"అలాగే తాతయ్యా! రేపటినుంచి బయటకు వెళ్ళి డాడీకి బై చెపుతాను" అన్నాడు అనిల్.

"కొడుకు కంటే మనవడే నయం. విషయం గ్రహించాడు" అనుకున్నాడు క్రిష్ణమూర్తి.

ఆయనకు భోజనం వడ్డించే సమయంలో "మామయ్యా! ఎల్లుండి అనిల్ పుట్టినరోజు. యోగా వాళ్ళను పిలుద్దాం" అన్నది ఇందిర. అతను కోడలు వంక అపురూపంగా చూశాడు. అతనికి శంకరం ఒక్కడే కొడుకు. కూతుళ్ళు లేరు. అందుకని అతను కోడలులోనే కూతురిని చూసుకుంటాడు. ఆ అమ్మాయీ మామగారిని పన్నెత్తి మాట అనదు. గౌరవం చూపిస్తుంది. ప్రేమ కురిపిస్తుంది.

"వాళ్ళను పిలవడం శంకరానికి ఇష్టం ఉండదేమో!" అన్నాడు క్రిష్ణమూర్తి.

"ఆయన ఎవరినీ పిలవొద్దనే అన్నారు. అయినా రోజూ మన ఇంటికి వచ్చేవాళ్ళకు చెప్పకపోతే ఏం బాగుంటుంది? మీరు ఆహ్వానించండి. మీ అబ్బాయికి నేను నచ్చచెపుతానులెండి" అన్నది ఇందిర.

"అలాగేనమ్మా!" అన్నాడు క్రిష్ణమూర్తి.

ఆ సాయంత్రం శంకరం ఇంటికి వచ్చాక "మని ఆర్డరు పంపావా?" అని అడిగాడు క్రిష్ణమూర్తి.

"పంపాను. అది చూసి కొలీగ్ నవ్వాడు?" చెప్పాడు శంకరం.

"ఎందుకు నవ్వాడు?" అడిగాడు మూర్తి.

"తనకి ఉన్నదేదో మనవలకివ్వాలిగానీ, ఎవరికో దానం చేయటం ఏమిటి?" అని కామెంట్ చేశాడని చెప్పాడు శంకరం.

"నువ్వేమన్నావు?" ఆరా తీశాడు క్రిష్ణమూర్తి.

"అది నిజమే కదా అందుకే మౌనం వహించాను" చెప్పాడు శంకరం.

"మనవాళ్ళకే ఉపయోగపడాలనుకోవడం స్వార్థం అవుతుంది. అందరూ మనవాళ్ళే అనుకోవడం ప్రేమ అనిపించుకుంటుంది. మనిషి ప్రేమించడం నేర్చుకోవాలని నీ కొలీగ్‌కి చెప్పు" అన్నాడు క్రిష్ణమూర్తి. శంకరం తండ్రి వంక విసుగ్గా చూసి ఊరుకున్నాడు.

శంకరం కాఫీ తాగుతుండగా "అనిల్ బర్త్‌డేకి యోగా వాళ్ళను పిలవమని మామయ్యకు చెప్పాను" అంది ఇందిర.

"నేననుకోవడం ఈ ఆలోచన నీది కాదు. మా నాన్నది" అన్నాడు శంకరం. ఇందిర కాదని చెప్పినా శంకరం వినిపించుకోలేదు.

కాఫీ తాగడం పూర్తయ్యాక తండ్రి దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయంలో క్రిష్ణమూర్తి మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు.

"బాబు బర్త్‌డేకి యోగావాళ్ళను పిలుస్తానన్నావట. వాళ్ళు రావడం నాకిష్టం లేదు" చెప్పాడు శంకరం.

"అయితే మీ ఆఫీస్ స్టాఫ్‌ని పిలువు. పుట్టిన రోజునాడూ పదిమంది వచ్చిబాబు మీద అక్షింతలు వేసి దీవిస్తే మంచిది" చెప్పాడు క్రిష్ణమూర్తి.

"మా వాళ్ళు బిజీ. రాలేరు" చెప్పాడు శంకరం.

"ఇంటో టీవీ చూస్తూ కూర్చోవడం, ప్రక్కింటివాళ్ళతో కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడడం - ఇదేగా మీ దృష్టిలో బిజీగా ఉండడం" ప్రశ్నించాడు క్రిష్ణమూర్తి.

"అదేం కాదు. పిల్లల్ని కష్టపడి చదివించడం, టాలెంట్ పరీక్షలు రాయించడం వంటి పనుల్లో వాళ్ళు బిజీ" చెప్పాడు శంకరం.

"పిల్లల మనసుల్ని చదువుల పేరుతో మీరు ఎదగనివ్వడం లేదు. మొగ్గలుగా ఉండగానే తుంచేస్తున్నారు. మానవ సంబంధాలు దెబ్బతినడానికి ఇదీ ఒక కారణం" అన్నాడు క్రిష్ణమూర్తి.

అంతలో అక్కడకు వచ్చిన ఇందిర, భర్తతో "రోజూ మనింటికి వస్తున్నా ఏనాడూ మనం యోగా వాళ్ళకు కాఫీ కూడా ఇవ్వలేదు. ఒకసారి పిలిచి పలకరిస్తే మర్యాదగా ఉంటుంది" అని సలహా ఇచ్చింది. శంకరం భార్య వంక గుర్రుగా చూశాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి చాలాసేపు నిద్రపట్టలేదు. అతను తరిగిపోతున్న మానవ సంబంధాల గురించి ఆలోచించాడు. 'యంత్రాల మధ్య పడి మనిషి కూడా ఒక యంత్రంగా మారిపోతున్నాడు. మనిషికి మనసే తరగని ఆస్తి అన్న సత్యం మరచి పతనాన్ని కొనితెచ్చుకుంటున్నాడు" అని ఆలోచించాడు.

అనిల్ పుట్టినరోజు వచ్చింది. ఆ రోజు సాయంత్రం క్రిష్ణమూర్తి పిలుపు అందుకున్న యోగా బృందం వాళ్ళింటికి వచ్చింది. బాబుకి నీతి కథల పుస్తకాలు, ఆటబొమ్మలు తెచ్చిచ్చారు. తాము తెచ్చిన స్వీట్స్ బాబు చేత తినిపించారు. అక్షింతలు వేసి దీవించారు. పాటలు పాడి అనిల్‌ని ఆనందపరిచారు. వాడిచేత ఆడించారు, పాడించారు. శంకరంతో కూడా కలుపుగోలుగా మాట్లాడారు.

ఎందుకో తెలియదుగానీ శంకరానికి ఆ సాయంత్రం ఆనందంగా గడిచిందనిపించింది. వాళ్ళు వచ్చి ఉండకపోతే ఆ వేడుకకు అంత నిండుదనం వచ్చి ఉండేది కాదనుకున్నాడు.

వాళ్ళందరూ వెళ్ళాక క్రిష్ణమూర్తి, కొడుకుతో "మా వాళ్ళు రావడం నీకేమైనా ఇబ్బందిగా అనిపించిందా?" అని అడిగాడు.

"అటువంటిదేం లేదు. సంతోషంగానే అనిపించింది" మనస్ఫూర్తిగా చెప్పాడు శంకరం.

"శంకరం! ఒక సత్యం చెబుతాను. నాది చాదస్తంగా భావించకుండా మనసు పెట్టి ఆలోచించు. మొక్కను తెచ్చి గదిలో పెడితే వాడిపోతుంది. బయట పెడితే చిగురిస్తుంది. దానికి జీవం పోసేది సూర్యకిరణం. ఇదే సూత్రం మనిషికీ వర్తిస్తుంది. ఒంటరిగా గదిలో కూర్చుంటే మనసు చచ్చిపోతుంది. బయటకు వెళ్ళి పదిమందితో గడిపితే అది సేద తీరుతుంది. మనసుకు ప్రాణం పోసేది ప్రేమ అని మరువకు" అని చెప్పాడు క్రిష్ణమూర్తి. ఎప్పటిలా ఈసారి తండ్రి మాటలు శంకరం ఖండించలేదు. మౌనం వహించాడు.

ఆ రాత్రి క్రిష్ణమూర్తికి గుండెలో నొప్పిగా అనిపించింది. కొడుకును నిద్రలేపి విషయం చెప్పాడు. ఎప్పుడూ ఏ నొప్పీ అనని తండ్రి ఒకేసారి గుండె నొప్పి అనగానే శంకరం కంగారు పడ్డాడు.

"హాస్పిటల్‌కి వెళదాం" అన్నాడు.

"ఉదయం వెళదాం" అంటూ క్రిష్ణమూర్తి హోమియో మందులువేసుకుని కళ్ళు మూసుకుపడుకున్నాడు. శంకరం తండ్రి మంచం పక్కనే పడక కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

అర్ధరాత్రి చూస్తే తండ్రి ఊపిరి పీలుస్తున్నట్లు అనిపించలేదు. నాడి చూసిన శంకరం తండ్రి ప్రాణం పోయినట్లు గ్రహించి కంట తడిపెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇందిర, అనిల్ పెద్దగా ఏడవసాగారు.

బంధువులకు, స్నేహితులకు కబుర్లు అందాయి. మరునాటికి అందరూ వచ్చారు. అంత దుఃఖంలోనూ ఒకే విషయం శంకరాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. అతను కబురు చేసినవారికంటే వచ్చినవారు పదిరెట్లున్నారు.

ఇంటి ముందున్న రోడ్డంతా జనంతో నిండిపోయింది. అందరూ విషాద వదనాలతో కనిపించారు.

క్రిష్ణమూర్తి మంచితనం గురించి కథలు కథలుగా చెప్పుకోసాగారు.

"శంకరం! పూలదండలోని దారం బయటకు కనిపించదు. కానీ అది పూలనన్నింటినీ దగ్గరకు చేరుస్తుంది. ప్రేమ కూడా అంతే! అది బయటకు కనిపించదు. కానీ మనుషులందరినీ దగ్గరకు చేరుస్తుంది." అన్న తండ్రి మాటలు గుర్తుకొచ్చాయి శంకరానికి.

మధ్యాహ్నానికి శవయాత్ర మొదలైంది. పాడె మోయడానికి చాలామంది ముందుకొచ్చారు. భుజం మార్చుకుంటూ తమ అభిమానం చాటుకున్నారు. సాయంత్రానికి అంత్యక్రియలు కార్యక్రమం ముగిసింది.

ఆ తరువాత ప్రతీరోజు ఎవరో ఒకరు వచ్చి శంకరాన్ని కలిసి అతని తండ్రి మంచితనాన్ని పొగిడి, అతనికి ఓదార్పు మాటలు చెప్పేవారు. పెద్దకర్మ కూడా జరిగిపోయింది. ఇక అంతటితో అంతా ముగిసిపోయిందని ఇక ఎవరూ తమ ఇంటికి రారని ఊపిరిపీల్చుకున్నాడు శంకరం.

ఆ రాత్రి గాఢంగా నిద్రపోయాడు. తెలతెలవారుతుండగా మెలుకువ వచ్చింది. తండ్రి చనిపోయేవరకూ ప్రతి రోజూ ఆ సమయానికి బయట గేటు తెరుచుకునేది. డాబా మీద తండ్రి, వచ్చినవారితో కలసి ఆసనాలు వేసేవాడు. వాళ్ళమాటలు, చిన్న చిన్న శబ్దాలు లీలగా వినిపించేవి. అప్పట్లో వాళ్ళ వలన నిద్రపాడైందని తిట్టుకునేవాడు శంకరం. ఇప్పుడా నిశ్శబ్దం అతని మనసుకు బాధను కలిగించింది భోజనం చేసి ఆఫీసుకి బయలుదేరినప్పుడు పిలవకుండానే అనిల్ బయటకు వచ్చి టాటా చెప్పాడు.

"పిలిచినా రానివాడివి. ఈ రోజు పిలవకుండానే వచ్చి టాటా చెబుతున్నావు. ఏమిటి విశేషం?" అడిగాడు శంకరం.

"తాతయ్య చెప్పాడు, నేను బయటకు వచ్చి నీకు 'బై' చెబితే నీ మనసుకు సంతోషం కలుగుతుందట" చెప్పాడు అనిల్. శంకరం కళ్ళముందు తండ్రి రూపం కదలాడింది. మనసును ఎవరో మెల్లగా స్పృశించినట్లనిపించింది. కన్నుల్లో చెమ్మ చేరింది. కొడుక్కి 'బై' చెప్పి బయలుదేరిపోయాడు.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు కూరగాయల దుకాణానికి వెళ్ళాడు. అతను ఆప్యాయంగా పలకరించి "నాన్నగారు పోయారని తెలిసింది. ఊళ్ళో లేక రాలేక పోయాను. మహానుభావుడు. ఈ దుకాణం పెట్టుకోవడానికి బ్యాంకులోను ఇప్పించి సాయం చేశాడు. అతన్ని ఎప్పటికీ మరచిపోలేను" అని చెప్పాడు.

"నాన్న కనిపించకుండా ఎంతచేశాడు? " అనుకున్నాడు శంకరం.

నెలరోజుల తరువాత శంకరానికి ఒక విషయం అర్థమయింది. తను భావించినట్లు చనిపోవడంతో తండ్రి అధ్యాయం ముగిసిపోలేదు. ప్రతిరోజూ ఎవరో ఒకరు క్రిష్ణమూర్తి సహాయాన్ని, మంచితనాన్ని, ప్రేమను శంకరం దగ్గర గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.

ఒకరోజు శంకరం టవల్స్ కొనడానికి బట్టల కొట్టుకు వెళ్ళాడు. అది పేరు మోసిన బట్టల దుకాణం. ఆ దుకాణం యజమాని శంకరాన్ని చూడగానే పలకరింపుగా నవ్వి "మీరు క్రిష్ణమూర్తిగారి అబ్బాయి కదూ!" అని కూర్చోబెట్టి మర్యాద చేశాడు.

"అప్పుడప్పుడూ మీ నాన్నగారు వచ్చి ఇక్కడ కూర్చునేవారు. ఒకసారి నిద్రపట్టక ఇబ్బంది పడుతున్నానని చెప్పాను. మానసిక అశాంతి వలన అయి ఉంటుంది. ధ్యానం చేయమని సలహా ఇచ్చారు. ధ్యానం ఎలా చేయాలో కూడా వివరించారు. అప్పటినుంచి ధ్యానం చేస్తున్నాను. మనసు చాలా ప్రశాంతంగా ఉంటున్నది. ఆయన చనిపోవడం దురదృష్టకరం" అని బాధపడ్డాడు దుకాణదారు.

తండ్రి ఎందరి మనసుల్లోనో నిలిచిపోయాడన్న సత్యం గ్రహించేసరికి శంకరానికి దిగులుగా అనిపించింది. అటువంటి తండ్రిని తను ఖాతరు చేసేవాడు కాదు. ప్రేమ చూపించేవాడు కాదు. ప్రతి చిన్న విషయానికీ తప్పుపట్టేవాడు. శంకరం మనసులో తీవ్రంగా బాధపడ్డాడు.

అతను ఇల్లు చేరగానే ఇందిర ఒక ఉత్తరం అందించింది. చనిపోయిన తండ్రి పేరున ఉన్నదా ఉత్తరం. శంకరం కవరు చింపి చదివాడు.

"శ్రీయుతులు క్రిష్ణమూర్తిగారికి నమస్సులు. మీ వంటి మంచి మనసున్నవారు పంపిన విరాళాలతో నాకు గుండె ఆపరేషన్ జరిగింది. ఇప్పుడు నేను కులాసాగా ఉన్నాను. మీరు పంపిన విరాళం చిన్న మొత్తమే కావచ్చు. కానీ అది కష్టకాలంలో నాకెంతో

ధైర్యాన్నిచ్చింది. నేను ఒంటరిని కాదు. నాకు తోడుగా చాలామంది ఉన్నారన్న ఆత్మసంతృప్తిని కలిగించింది. మీకు ధన్యవాదాలు.. ఇట్లు, గోపీచంద్" అని ఉందా ఉత్తరంలో.

శంకరం గోడకు తగిలించిన తండ్రి ఫోటో వంక చూశాడు. "శంకరం! మనిషి - నేను, నా కుటుంబం అన్న సంకుచితత్వం నుంచి బయటపడి మనం, మన వసుధైక కుటుంబం అన్న విశాల దృక్పథం అలవరచుకోవాలి" అని చెబుతున్నట్లు అనిపించింది.

ఆ రాత్రి శంకరానికి నిద్రకరువయింది. తనకు, తండ్రికి తేడా ఏమిటో అతను స్పష్టంగా గ్రహించగలిగాడు. తన తండ్రి మనసున్న మనిషి. తను మనసులేని మరబొమ్మ. తనకు జీవన సౌందర్యం తెలియదు. అదెలా ఉంటుందో తండ్రి తెలియబరిచాడు.

ఒక ఆదివారం అతను తన తండ్రి బ్రతికి ఉండగా యోగాసనాలు వేయడానికి తమ ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరి ఇంటికి వెదుక్కుంటూ వెళ్ళాడు. "మా నాన్నగారు చనిపోయారని మీరు మా ఇంటికి రావడం మానుకోకండి. నేనూ మీతో కలుస్తాను. యోగాతో నాన్నగారికి అంజలి ఘటిద్దాం" అని ఆహ్వానించాడూ. అందుకు వారందరూ సంతోషంగా తమ సమ్మతి తెలిపారు.

మరునాడు తెలతెలవారుతుండగ శంకరం ఇంటి బయటి గేటు తెరిచాడు. వస్తున్నవారందరికీ హృదయపూర్వకంగా ఆహ్వానం పలికాడు. డాబా పైకి వెళ్ళి వాళ్ళతో పాటు ఆసనాలు వేశాడు. ఆ తరువాత ధ్యానంలో కూర్చున్నాడు.

మనసులో తండ్రి రూపం కనిపించింది. "శంకరం! మనిషి తలుపులు మూసుకుని ఒంటరిగా గదిలో ఉండిపోతున్నాడు. అది తప్పు. మనకోసం ఆకాశం బయట వేచి చూస్తున్నదని తెలుసుకోవాలి. ఇంటి తలుపులే కాదు, మనసు తలుపులు కూడా తీసుకుని బయటకు రావాలి. అప్పుడు ప్రపంచమే అతనిదవుతుంది" తండ్రి చెప్పిన మాటలు మనసులో ప్రతిధ్వనించాయి.

శంకరం కళ్ళు తెరిచాడు. గదిలో ఉంటే కనిపించని ఆకాశం ఇప్పుడతనికి ఎంతో అందంగా, విశాలంగా కనిపించింది. శంకరానికి మనసు కొత్త చిగురు తొడిగినట్లు అనిపించింది. తొలిసారి అతని మనసుకు ఎంతో సంతోషం, ప్రశాంతత కలిగాయి.

✷✷✷




# ఆగస్టు 2009

ఆగస్ట్ నెల మాస పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, రచన, ఆంధ్రప్రదేశ్, చిత్ర, వారపత్రికలు ఆంధ్రభూమి, స్వాతి, నవ్య, దినపత్రికల ఆదివారం అనుబంధాలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభలలో ప్రచురితమయిన కథలు మొత్తం 92. ఆ కథలలోంచి కొన్ని కథలను కథాసాగర మథనంలో పరిచయానికి ఎన్నుకోవటం జరిగింది.

ఈనెల కథలు మళ్ళీ మామూలుగానే ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, విభిన్నమైన కథలను ఎన్నుకోవటం కోసం కాస్త కష్టపడాల్సి వచ్చింది. కొంత రాజీ పడాల్సి వచ్చింది. అలాగని కథలు బాగాలేవని కాదు. కథలు చక చకా చదివింపచేసినా, కథ ఆరంభమవుతూనే ముగింపుతో సహా కథలోని మలుపులను ఊహించేయగలుగుతాం. దాంతో కథలు మామూలుగా అనిపిస్తాయి.

మన తెలుగు కథ సాహిత్య ప్రపంచంలో ఓ విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది. అదేమిటంటే, కథ అవగానే అది ఏదో ఓ రూపంలో ఏదో ఓ సామాజిక సమస్యను ప్రతిబింబించాలన్నది. ఏదో అన్యాయాన్నో, అణిచివేతనో ప్రదర్శించేదే ఉత్తమ కథ అన్న అభిప్రాయం ప్రకారం కథలను విశ్లేషిస్తున్నారు. కానీ ఇలాంటి ఆలోచనల వల్ల కథ తన మౌలిక లక్ష్యానికి దూరమైపోతోంది.

ప్రధానంగా కథ అన్నది వినోదాత్మకం. సమయాన్ని ఆనందంగా, హాయిగా, వీలయితే కాస్త థ్రిల్, ఉద్విగ్నతలతో గడిపేయటానికి ఉపయోగపడే సాధనం. ఇందులో జీవిత సత్యాలు, పాఠాలు, సందేశాలు, సమస్యలు, పరిష్కారాలవంటివి ఉండటం అన్నది బోనస్ లాంటిదే తప్ప, అదే కథ కాదు.

తెలుగులో అనేక మంచి రచయితలలో సామాజిక సమస్యను ఎత్తి చూపించేదే సీరియస్ సాహిత్యం అన్న అభిప్రాయం బలంగా నాటుకుని ఉంది. ఇందువల్ల, అలాంటి కథలను తప్ప ఇతర కథలను కథలుగా పరిగణించక పోవటం, చులకనగా చూడటం అలవాటయింది. దాంతో తెలుగు కథా ప్రపంచంలో అనేక ప్రక్రియలు మరుగున పడ్డాయి. హారర్ స్టోరీస్, డిటెక్టివ్ కథలు, స్పై స్టోరీస్, సైన్స్‌ఫిక్షన్ వంటి అనేక విభిన్నమైన కథా ప్రక్రియలు మన సాహిత్యంలో అరుదుగా కనిపిస్తాయి. కనిపించినా నాణ్యత అంతగా ఉండదు. అలాంటి రచనలను 'పల్ప్'గా పరిగణించి పక్కనపెట్టి, తమ సమస్యలు, అణచివేతలే కథ అన్నట్టు ప్రవర్తించటం వల్ల పత్రికలు, పాఠకులను కోల్పోతోంది. సాహిత్యంలో విభిన్నత్వం, నవ్యత్వం కొరవడుతోంది. ఇది నెలనెల పత్రికలలో ప్రచురితమవుతున్న కథలు స్పష్టంగా చూపిస్తున్నాయి.

***<u>తెలుగు సినిమా పాట లోగుట్టు:</u>***

తరిగొప్పుల వి ఎల్లెన్ మూర్తి రచించిన ఈ కథ స్వాతి వారపత్రిక, ఆగస్ట్ 21 వ తేదీ సంచికలో ప్రచురితమయింది. ఈ కథలో తెలుగు సినిమా పాటల గురించి, పనితీరు గురించి కాస్త అతిశయోక్తిగానయినా, హాస్యంగా చెప్పాలని ప్రయత్నిస్తాడు రచయిత. చెంగల్రావ్ అనే తెలుగు పండితుడు సినిమా పాటలు రాయటానికి మిత్రుడి ఆహ్వానం అందుకని హైదరాబాదు వస్తాడు. అయితే పాటలో

కవితను, మాటకన్నా బూతులు,తిట్లకే ప్రాధాన్యం అని గ్రహిస్తాడు. రోడ్లంబడి తిరిగి తిట్లన్నిటినీ సేకరిస్తాడు. ఆ తిట్ల దండకమే 'హిట్' పాట అవుతుంది ఇదీ కథ. ప్రస్తుత సినీరంగంలో సాహిత్య పరిస్థితిని వ్యంగ్యంగా, అతిశయోక్తులతో చూపిస్తుందీ కథ. కానీ, ఇలాంటి కథలు గతంలో బోలెడన్ని వచ్చాయి.

***జాగరణ:*** బి. అజయ్ ప్రసాద్ రచించిన ఈ కథ, ఆగస్ట్ 2వతేదీ ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదో weird కథ. ఓ బైరాగి ఉంటాడు. అతడి దగ్గరకు గురిగాడు, మాణిక్యంలు వస్తుంటారు. మాణిక్యం ఓ అమ్మాయిని తెచ్చుకుంటాడోరోజు. మాణిక్యం గురించి ఆ అమ్మాయికి నిజం చెప్పి భయపెట్టాలని ఆ బైరాగి ఆమెపై అత్యాచారం చేయబోతాడు. ఆమె పారిపోతుంది. ఇది తెలిసి గురిగాడు, 'ఆయమ్మి ఎవర్ని నమ్మకుండా చేసినావుగదా.. ఎంతపనిజేస్తివి సావీ' అంటాడు. ఇదీ కథ. కథ ఆసక్తికరంగా చదివినా పూర్తయ్యేసరికి అర్థంలేని కథ అనిపిస్తుంది. మాణిక్యం నిజరూపం ఆ అమ్మాయికి మాటలతో వివరించవచ్చు. బైరాగి కాబట్టి అతడి మాటలకు విలువ ఎక్కువుంటుంది. కానీ బైరాగి ద్వారా అత్యాచారం చేయించటంతో కథ మీద ఆసక్తిపోతుంది. వ్యర్థమైన కథలా అనిపిస్తుంది.

***100% ఇండిపెండెంట్:*** నండూరి శ్రీనివాస్ రచించిన ఈ కథ ఆగస్ట్ నెల స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. ఇది ఈనెల కథ. నిజానికి ఈ కథలో రచయిత చెప్పదలచుకున్నది ఉదాత్తమైన అంశం. ప్రదర్శించిన తీరు అత్యంత ఆసక్తికరం. కానీ కథ పూర్తయిన తరువాత అసంతృప్తి మిగులుతుంది. రచయిత కంక్లూజన్‌తో ఏకీభవించటం కష్టం అనిపిస్తుంది. కానీ ఎంచుకున్న అంశం బాగుండటంతో, కథను నడిపించిన తీరు గొప్పగా ఉండటంతో, ఈ కథను ఈనెల కథగా ఎంచుకోవటం జరిగింది.

కథ ప్రథమ పురుషలో సాగుతుంది. పల్లెటూరిలో ఒకరి గురించి అందరూ పట్టించుకుంటారు. ప్రతివిషయం అందరికీ కావాలి. ఇలాంటి వాతావరణంలో పెరిగిన అతడికి పట్నంలో అపార్ట్‌మెంట్ జీవితం నచ్చుతుంది. 'ఆ అపార్ట్‌మెంట్‌లో నాకు అన్నిటికన్నా నచ్చేది అదే. స్వేచ్ఛ. ఒకళ్ళ గురించి ఒకళ్ళు అస్సలేమాత్రం పట్టించుకోని ఇండిపెండెన్స్...' అంటాడతడు.

ఈ కథ మనకు చెపుతున్న అతడు మరణిస్తాడు. అప్పుడు, అతడి భార్య సహాయానికి ఎవరూ రాకపోవటం చూస్తాడు. శవాన్ని తీసేందుకు ఊరినుంచి నాన్నగారు, నలుగురు రావటం చూస్తాడు. అప్పుడతడికి 100% ఇండిపెండెంట్ ఇంద్రభవనంలా కనిపించదు. 'ఆప్యాయతంటే తెలీని నాలాంటి వెధవెవడో ఓ రాతి విత్తునాటితే, దాన్నుంచి మొలిచిన కాంక్రీటు చెట్టులా అనిపించింది' అంటూ కథ ముగిస్తాడు రచయిత.

రచయిత చెప్పదలచుకున్న అంశం, భావ వ్యక్తీకరణలు ఉత్తమ స్థాయిలో ఉన్నాయి. అయితే, తాను చెప్పదలచుకున్న అంశాన్ని ప్రదర్శించేందుకు ఎంచుకున్న అంశాలు మాత్రం కృతకంగా, సత్యదూరంగా ఉన్నాయి. దాంతో కథను చకచకా చదివినా, రచయిత చివరి వాక్యాలు గొప్పగా అనిపించినా, ఆ వాక్యాల భావాన్ని సమర్థించేందుకు ఎంచుకున్న కృతకమైన సంఘటనలు కథను బలహీనం చేస్తాయి.

నిజానికి పట్నంలో అపార్ట్‌మెంట్‌లలో జీవితం ఓ రకంగా 'కమ్యూనల్ లివింగ్'లాంటిది. ఒకరిని ఒకరు పట్టించుకోరు అనటం సత్యదూరం. అపార్ట్ మెంటుల్లో ప్రతి విషయం పదిమంది కలిసి చేయాల్సి ఉంటుంది. మెయిన్‌టెనెన్స్ చార్జెస్ దగ్గరనుంచి మంచినీళ్ళు తెప్పించుకోవటం వరకూ ఏ విషయంలోనూ ఎవరికీ స్వాతంత్ర్యం ఉండదు. పేరుకి స్వంత ఇల్లే అయినా, అపార్ట్‌మెంట్ జీవితంలో పక్కవాడి పోరు, పైవాడిపోరు, అపార్ట్‌మెంట్ కార్యవర్గం పోరు తప్పదు. పైగా అపార్ట్‌మెంటుల్లో వాచ్‌మెన్లుంటారు. వీరు ప్రతి ఒక్కరి ఇంటిని వచ్చేవారిని, పోయేవారిని గమనిస్తూంటారు. అవసరమైతే అపార్ట్‌మెంటులోని వాళ్ళంతా కలిసి ఒకరిని ఏడిపిస్తారు. పక్కవాడు వండే వంటల వాసనను ఆస్వాదించాల్సిరావటంతో పాటు, పైవాడి టాయ్‌లెట్లు నిండితే ఆ కంపూ భరించాల్సి వస్తుంది. అందుకే ఎవరికి వారు స్వయంగా కట్టుకునే ఇంటిని ఇండిపెండెంట్ ఇల్లు అంటారు. అక్కడ ఉన్న స్వేచ్ఛ స్వాతంత్రులు అపార్ట్‌మెంట్లలో ఉండవు. అంటే రచయిత కథకు ఆధారమే అనౌచిత్యమూ, సత్యదూరమూ అన్నమాట, ఇండిపెండెంట్ ఇళ్ళలోనే పక్కవాడిని పట్టించుకోరు.

అపార్ట్‌మెంటుల్లో ప్రతివిషయం, ప్రతి ఒక్కరికీ కావాలి. అయినా సరే, ఈ నెల ప్రచురితమైన ఇతర కథలతో పోలిస్తే, ఈ కథ రచన సంవిధానం, భావవ్యక్తీకరణలు ఉత్తమ స్థాయిలో ఉండటం వల్ల ఈ కథను ఈనెల కథగా ఎంచుకున్నాను.

*ఈనెల కథ*

**100% ఇండిపెండెంట్** **-నండూరి శ్రీనివాస్**

ఆగస్ట్ స్వాతి మాసపత్రిక 2009 సంచిక నుంచి

**గోడగడియారం** పన్నెండు కొట్టింది. ఉలిక్కిపడి నిద్రలేచాను. చాలా ప్రశాంతంగా ఉంది, రెండురోజుల్నుంచీ బాధపెడుతున్న ఛాతీనొప్పి తగ్గిపోవడం వల్లనేమో! ఛాతీ దగ్గర నొక్కిచూసుకున్నా! నిజమే, నొప్పీ గిప్పీ లేదు... హాయిగా ఉంది.

నా నలభై ఎనిమిదేళ్ళ వయస్సులో ఏనాడూ అనుభవించనంత హాయి...

దుప్పటి పక్కకి తొలగించి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ పక్కమీద నుంచి లేచాను. పక్కనే నా భార్య జానకి పడుకునుంది. గాఢ నిద్రలో ఉంది. అక్వేరియంలో చేపలు నిశ్శబ్దంగా అటూ ఇటూ కదుల్తున్నాయి. ఇల్లంతా ఉక్కగా అనిపించింది. చప్పుడు చేయకుండా, అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా వెళ్ళి, వీధి తలుపులు తెరచుకుని బయటికొచ్చాను. నెమ్మదిగా మెట్లు దిగి, క్రింద లాన్‌లో కొచ్చాను.

చల్లటి గాలికెరటం అపార్ట్‌మెంటు, వెన్నెల్లో స్నానం చేస్తున్నట్టుగా ఉంది. లాన్ మధ్యలో ఉన్న ఫౌంటైన్‌లోంచి జివ్వున ఎగిసిపడుతున్న నీటిధార తుంపర్లు మీద పడుతూ ఒళ్ళు పులకింపచేస్తోంది. ప్రాణం గాల్లో తేలిపోతున్నట్టుగా ఉంది.

నిశ్శబ్దంగా వెళ్ళి లాన్ మధ్యలో ఉన్న పాలరాతి బెంచీ మీద కూర్చుని అపార్ట్‌మెంటుని తనివితీరా చూసుకున్నాను. సరిగ్గా అదే సమయంలో రోడ్డుమీదనుంచి ఓ నల్లటి బెంజ్ కారు సర్రున దూసుకుంటూ కాంపౌండ్‌లో కొచ్చింది. ఏ మాత్రం చప్పుడు చేయకుండా స్మూత్‌గా వెళ్ళి పార్కింగ్ స్లాట్‌లో ఆగింది. అందులోంచి ఓ అందమైన కుర్రజంట దిగారు. ఇద్దరూ బాగా తాగేరేమోగానీ, పాముల్లా నడుస్తున్నారు.

ఆ అమ్మాయి కాలు జారి ముందుకి పడబోతుంటే, ఆ యువకుడూ చప్పున ముందుకి వంగి ఒడుపుగా ఆమె నడుముని పట్టుకున్నాడు. ఆమె సన్నగా మూలుగుతూ అతడికి మరింత దగ్గరగా జరిగింది. లాన్‌లో కూర్చునున్న నన్ను పట్టించుకోకుండా, ఆ యువకుడు ఆమె పెదాలమీద గాఢంగా ఓ ముద్దిచ్చాడు. ఇద్దరూ అలాగే నడుచుకుంటూ లిఫ్ట్‌లోకెళ్ళారు.

నా మనస్సు ఉప్పొంగిపోయింది.

ఆ అపార్ట్‌మెంటులో నాకు అన్నిటికన్నా నచ్చేది అదే.. స్వేచ్ఛ! ఒకళ్ళ గురించి ఒకళ్ళు అస్సలే మాత్రం పట్టించుకోని ఇండిపెండెన్స్...

చిన్నప్పటినుంచీ నాకు ఒంటరితనమంటే చాలా ఇష్టం. మా నాన్న ఆచారి, పల్లెలో ఆయుర్వేద వైద్యుడు. ఆయన చేసే ఉచిత వైద్యం వల్ల రోజూ వందలాదిమంది జనాలు మా ఇంటికి వస్తూ పోతూ ఉండేవారు. ఇల్లంతా ఎప్పుడూ జాతరలా ఉండేది.

నాకు ఆ వాతావరణంలో అస్సలు ఊపిరి సలిపేది కాదు. అస్తమానూ నాన్నతో దెబ్బలాడేవాణ్ణి. మా ఇద్దరికీ ఏ విషయంలోనూ పడేది కాదు.

నాన్నతో వాదిస్తున్నప్పుడల్లా, చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళందరూ ఏమీ పట్లేనట్టు కిటికీల చుట్టూ మూగి, సినిమా చూసినట్టు చూసేవారు. అది నాకు మహా చిరాకుపుట్టించేది. ఇలాంటి వాదనలూ, గొడవలూ భరించలేక, చదువవ్వగానే నాన్న వద్దంటున్నా వినకుండా అమెరికా వెళ్ళిపోయి అక్కడ ఇరవైఏళ్ళు ఉండిపోయా!

అక్కణ్ణుంచి తిరిగొచ్చిన తర్వాత మళ్ళీ పల్లెటూరికి వెళ్ళడం ఇష్టంలేక పట్నంలోనే మంచి ఫ్లాటు కోసం చెప్పులరిగేలా చాన్నాళ్ళు వెతికా. అదిగో, సరిగ్గా అప్పుడు ఈ అపార్ట్‌మెంటు దొరికింది. ఫ్లాటు విలువ పదిలక్షలు. అయినా సరే నాకు ఈ ఇల్లు తెగనచ్చేసింది. దానిక్కారణం 100% ఇండిపెండెన్సీ!

ఈ అపార్టుమెంట్లో అన్నీ ఇండిపెండెంటే...

A నుంచీ, D దాకా నాలుగే అంతస్తులు. ఒక్కో అంతస్తులో రెండే రెండు ఫ్లాట్లు.. ఒక వరుస ఫ్లాట్లన్నీ తూర్పుకి తిరిగుంటే, ఇంకొక వరస పడమరకి. తూర్పు వరసలో ఉన్న నాలుగు ఫ్లాట్లకీ ఒక లిఫ్టయితే, పడమర వాటికి ఇంకో లిఫ్టు. ప్రతి ఫ్లాటుకీ ముందు ఓ ప్రైవేట్ స్విమ్మింగ్ ఫూల్.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకళ్ళకొకళ్ళు ఎదురుపడే అవసరం, ఒకడితో ఒకడు మాట్లాడుకునే ఆగత్యం లేని పూర్తి ప్రైవసీ. మొగుడు పీకలదాకా తాగొచ్చి గొడవచేస్తూ, ఇంట్లో పెళ్ళాన్ని చితకబాదినా కూడా ఎవ్వరూ పట్టించుకోనంత ఇండిపెండెన్సీ...

అందుకే యాభై లక్షలు పెట్టి ఈ ఫ్లాటు కొన్నా. ఇక్కడే సెటిలైపోయా! ఎప్పుడో ఏడాదికో, రెండేళ్ళకో ఒకసారి నాన్నని చూట్టానికి వెళ్ళేవాణ్ణి. అది కూడా ఒకపూటో, అరపూటో. అంతే! వెంటనే తిరిగొచ్చేసేవాణ్ణి. ఈ అపార్ట్‌మెంటులో ఉన్న హాయి, నాకు మా ఊళ్ళో అస్సలు దొరికేది కాదు. ఇది స్వర్గం...

నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ లిఫ్టు తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయి. C2 ఫ్లాటులో ఉండే భార్యాభర్తలు నెమ్మదిగా లిఫ్టులోంచి బయటకొచ్చారు. లాన్ దగ్గరకి నడుచుకుంటూ వెళ్ళి, తలా ఒక సిగరెట్టు ముట్టించారు. గుప్పు గుప్పుమని పొగ వదులుతూ హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. నేను కన్నార్పకుండా వాళ్ళవైపే చూస్తున్నా.

అంతలో గట్టిగా అరుపులు వినిపించాయి.. ఉలిక్కిపడ్డాను. ఎవరో కేకలు పెడుతున్నారు. గబగబా అపార్టుమెంటు వైపు పరుగెత్తాను. ఆ అరుపులు నా ఫ్లాటులోంచే వస్తున్నాయి.... నా భార్య జానకి గొంతు.. మనస్సు కీడుని శంకించింది. కంగారుగా ఇంట్లోకెళ్ళాను. అక్కడి దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాను...

ఎవడో ఒక మగాడు, మా బెడ్రూములో నా మంచం మీద పడుకున్నాడు. జానకి వాడిమీద పడి ఏడుస్తోంది. గుండెలు పగిలేలా ఏడుస్తోంది. పరాయి మగవాడితో నా భార్యని అంత క్లోజ్‌గా చూసేసరికి నాకు ఒళ్ళు మండిపోయింది. కోపంగా వెళ్ళి, జానకి జుట్టు పట్టుకుని ఇవతలకి లాగబోయాను. జుట్టు చేతుల్లోకి రాలేదు, పట్టు దొరకలేదు...

అప్పుడు గమనించాను, ఆ మంచం మీద పడున్న మనిషి అచ్చం నాలాగే ఉన్నాడు. పరిశీలనగా చూశా... నిజమే అచ్చుగుద్దినట్టు నాలాగే ఉన్నాడు. మరైతే నేనెవరు? అప్పుడర్ధమైంది నాకు, నేను చనిపోయానని...

జానకి గుండెలు బాదుకుంటూ లబోదిబోమని ఏడుస్తూనే ఉంది. మూర్తీభవించిన శోకదేవతలా ఉంది. బతికినంత కాలం, జానకితో అస్తమానూ దెబ్బలాడేవాణ్ణి. ఇంటికి ఎవరైనా వస్తే నాకు చిరాకు. అందుకే ఇంటికి ఎవ్వర్నీ రానిచ్చేవాణ్ణికాదు. తనని ఎవ్వరి ఫ్లాటుకీ వెళ్ళనిచ్చేవాణ్ణికాదు. ఈ విషయంలో మా ఇద్దరికీ అస్తమానూ దెబ్బలాటలే... చివరికి ఇద్దరి మధ్యా ఓ పెద్ద కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది.

ఏళ్ళ తరబడి కట్టిన రాతి గోడల్ని కూలగొట్టడానికి, బుల్డోజర్లో, ఫిరంగులో ఉన్నాయి గానీ, భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్‌ని కూలగొట్టడానికి ఇప్పటి వరకూ ఏ శాస్త్రజ్ఞుడూ ఎటువంటి యంత్రాన్నీ కనిపెట్టలేకపోయాడు.

జానకి నా కోసం, అంతగా ఏడుస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. తను పడే బాధ చూసి నా గుండె తరుక్కుపోయింది. పక్కనే కూర్చుని కన్నీళ్ళుతుడుద్దామని ప్రయత్నించా. దగ్గరకి తీసుకుందామనుకున్నా. కానీ వీలుకావట్లేదు. ఏ వస్తువూ చేతికి దొరకట్లేదు. కర్తవ్యం గుర్తుకొచ్చింది.

గబగబా పైకిలేచా! అర్జంటుగా ఎవరో ఒకళ్ళని తీసుకురావాలి, నా భార్యని దగ్గరకి తీసుకుని ఓదార్చే మనిషి కావాలి.. ఇందాక లాన్‌లో సిగరెట్లు కాలుస్తున్న వాళ్ళు గుర్తొచ్చారు. వెంటనే అక్కడికి పరుగెత్తా. కానీ వాళ్ళని అడగడం ఎలా..? వాళ్ళు నన్ను చూడగలరా, నా మాటలు వినగలరా...?

ఆలోచిస్తూ వాళ్ళ చుట్టూ ఆశాంతిగా అదేపనిగా తిరుగుతూ ఉండగా, వాళ్ళే మెల్లగా మట్లాడుకోవడం మొదలుపెట్టారు. "డార్లింగ్.. ఎవరో ఏడుస్తున్నట్టున్నారే.." ఆవిడ అంది. అతడు ఓ నిముషం చెవులు రిక్కించి విని, "నిజమే A1 ఫ్లాట్‌లో నుంచనుకుంటా" అని ఒక్క నిముషం ఆలోచించి, "ఏమయ్యిందో వెళ్ళి చూసొద్దామా.?" అన్నాడు.

"నో డాళింగ్ రేప్పొద్దున్నే క్లబ్బులో ఫంక్షన్ ఉందిగా, ఇప్పుడు పడుకోకోతే పొద్దున్నే లేవలేం, పద" అంటూ ఆమె సిగరెట్టు కింద పడేసి కాలితో నలిపి, అతడి చెయ్యిపుచ్చుకుని లిఫ్టులోకి లాక్కుపోయింది.

నాకు ఏం చెయ్యాలో తోచలేదు. మళ్ళీ చకచకా ఇంట్లోకి పరుగెత్తా. అప్పటికే జానకి ఇంటర్‌కాం దగ్గర కూర్చుని వెక్కుతూ ఏవో ఫోన్ నెంబర్లు ప్రయత్నిస్తోంది. నాకు చప్పున B2 ఫ్లాటులో ఉండే అతను గుర్తొచ్చాడు. అతడి పేరేంటో సరిగ్గా తెలీదు కానీ, రోజూ పొద్దున్నే జాగింగ్‌కి వెళుతుంటే ఎదురుపడేవాడు.

చాలా ఏళ్ళనుంచీ రోజూ చూసిన మొహం. వాళ్ళ ఫ్లాటుకి ఫోన్ చేస్తే నయమేమో... కానీ ఆ విషయం భార్యకెలా చెప్పడం? నేనలా ఆలోచిస్తూ ఉండగా, నా మనస్సులో ఆలోచన తెలిసినట్టుగానే, నా భార్య B2 ఫ్లాట్ నెంబర్‌కి డయల్ చేసింది.

అది గమనించి నా మనస్సు శాంతించింది.

దాదాపు ఇరవైరింగులయ్యాయి. ఎవ్వరూ ఎత్తలేదు. నేను చప్పున B2 కి పరుగెత్తాను. రోజూ మెట్లెక్కుతుంటే, మోకాలి దగ్గర కలుక్కుమనేది. కానీ ఈ రోజు గాలికన్నా వేగంగా పరుగెత్తగలగడం ఆశ్చర్యమనిపించింది. B2 తలుపు ముందు నిలబడి కాలింగ్ బెల్ నొక్కబోయాను... బెల్ వత్తుకోలేదు. కానీ విచిత్రంగా తలుపుల్ని దాటుకుని లోపలికి వెళ్ళగలిగాను.

సరిగ్గా లోపలికి అడుగుపెట్టేసరికే ఆ ఫ్లాటులో ఫోన్ ఆగకుండా మ్రోగుతోంది...

అది నా భార్య ఫోనని తెలుసు... ఎంతకీ ఫోన్ ఎత్తట్లేదేమిటబ్బా అని వాళ్ళ బెడ్ రూంలోకి వెళ్ళబోతూ ఉండగా సరిగ్గా B2 అతనే ఆవలించుకుంటూ ఎదురొచ్చాడు. వెనకాలే అత భార్య కూడా...

చిరాగ్గా ఫోన్ ఎత్తాడు. "హల్లో నవీన్ హియర్" అవతల్నించి జానకి గొంతు. వెక్కుతూ మాట్లాడుతోంది. అతడు ఓ అయిదు నిముషాలు విన్నాడు. అతడి మొహంలో రంగులు మారాయి. అంతా విని ఒక్క నిముషం ఆలోచించి "అయ్యో అలాగా, సారీ మేడం.. నేను ఇప్పుడే బయలుదేరి వస్తాగానీ, D1లో ఉన్న జావెద్‌కి ఫోన్ చేసి చెప్పండి. ఎంతైనా అతను అసోసియేషన్ ప్రెసిడెంటు కదా.." అన్చెప్పి ఫోన్ పెట్టేశాడు.

అతడి భార్య కంగారుగా సమీపించి, "ఏమయిందండీ?" అనడిగింది.

అతడు "ష్. అరవకు" అంటూ వేలు చూపించి, జావెద్‌కి ఫోన్ చేశాడు.

నేను అక్కడే నిలబడి ఆతృతగా చూస్తున్నాను. ఓ పది రింగులయ్యాకా జావెద్ ఫోన్ ఎత్తాడు. "హల్లో.." చిరాగ్గా అన్నాడు. "జావెద్ నేనా నవీన్ని.."

"ఇంత రాత్రి వేళ ఏంట్రా... మందు కొట్టడానికి కంపెనీ కావాలా?" అన్నాడు.

"సాలే, అదేం కాదురా.. ఆ A1 లో ఉన్న అంకుల్ పోయాట్ట.." అని చెప్పాడు నవీన్.

"ఎవడ్రా...?"

"అదేరా, రోజూ నిక్కరేసుకుని లాన్‌లో జాగింగ్ చేసేవాడే.వాడు` అన్నాడు.

"ఓహ్... వాడా, గొడవొదిలింది"

"వదలడం కాదురా, ఇప్పుడే మొదలయ్యింది... వాడి పెళ్ళాం ఇంకో రెండు నిముషాల్లో నీకు ఫోన్ చేస్తుంది, చూసుకో..." అన్నాడు.

జావెద్ ఒక్క నిముషం ఆలోచించాడు.

"సాలాగాడురా ఆ అంకుల్. నేను ఇక్కడికి వచ్చిన కొత్తల్లో ఓసారి మా ఇంటికి చుట్టాలొచ్చి కొంచెం హడావుడైతే, వాడి ప్రశాంతత డిస్టర్బ్ అయిపోతోందని కంప్లైంట్ కూడా చేశాడు"

"తెల్సులేరా... అందుకే చెపుతున్నాను, జాగ్రత్తగా చూసుకో.." అన్నాడు నవీన్.

"ఒరేయ్ ఇదిగో ఇప్పుడే ఫోను బీప్ అంటోంది... కాల్ వెయిటింగ్.. నేను కనెక్షన్ పీకేసి పడుకుంటాగానీ, ఏదైనా అవసరమైతే నా మొబైల్‌కి చెయ్యి" ఫోన్ క్లిక్‌మన్న చప్పుడుతో ఆగిపోయింది.

నవీన్ భార్య కంగారుగా అతణ్ణి సమీపించింది. "ఏమయ్యిందండీ, ఎవరు చనిపోయారు?"

"ఆ A1 లో ఉండే అంకుల్‌గాడు.."

"ఆయన పేరు...?"

"ఏమో ఎవడికి తెలుసు?"

"పోనీ, ఓసారి వెళ్ళి చూసొస్తే.."

"చాల్లే, తెల్లారిగట్టే ఆఫీసుకి బయలుదేరాలి, క్యాబ్ వస్తుంది. ఇప్పుడు ఇవన్నీ పట్టించుకుంటే నిద్రుండదు, అయినా ఇలాంటి గొడవలన్నీ లేకుండా ఉంటాయనేగా ఇండిపెండెంట్ ఫ్లాటు తీసుకున్నది"

"పోనీ, వాచ్‌మేన్‌కి ఫోన్ చేసి అక్కడ కాస్త చూడమంటేనో..?" అన్నదామె.

నవీన్ భార్యవైపు సాలోచనగా చూస్తూ, "వాడు నిన్నటినుంచీ సెలవులో ఉన్నాడుగా, అయినా ఇది బుర్రలు బద్దలగొట్టుకుని ఆలోచించవలసినంత గొప్ప విషయమేమీ కాదులేగానీ, పదపడుకుందాం" అంటూ బెడ్రూములోకి దారితీశాడు.

నాకు గుండెపిండేసినట్టయ్యింది. నవీన్ పీక పిసికేయాలనిపించింది. గబగబా ఇంట్లోకి పరుగెత్తాను. అప్పటికే జానకి జావెద్‌కి ఫోన్ చేస్తోంది.

ఉపయోగం లేదులే అని చెప్పాలనుకున్నాగానీ, నేను చెప్పక్కర్లేకుండానే ఓ నాలుగు సార్లు ప్రయత్నించి తనే ఫోన్ పెట్టేసింది. అపార్టుమెంటులో ఇంకెవరున్నారో ఆ సమయంలో నాకు గుర్తురాలేదు - ఎప్పుడైనా ఎవరితోనైనా కలిస్తేగా గుర్తురావడానికి?

గబగబా బేస్‌మెంటులో ఉన్న పోస్టు బాక్సుల దగ్గరకి పరుగెత్తి, వాటి మీద రాసున్న పేర్లలో నాకు తెలుసున్న వాళ్ళు ఎవరైనా దొరుకుతారేమోనని చూశాను.

"ప్రశాంత్...C1" అతడి పేరు చూడగానే నాకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. అతడు సమాజసేవకుడనీ, ఏదో వెబ్‌సైట్ పెట్టి అంతో ఇంతో సేవ చేస్తున్నాడనీ, అప్పుడప్పుడు నోటీస్ బోర్డులో అతడి గురించి పేపర్ కటింగులు చూశాను.

అతడైతే కరెక్ట్ అనుకుని ఇంట్లోకి పరుగెత్తాను.

అప్పటికే నా భార్య, C1నెంబర్‌కి ఫోన్ చేస్తోంది.

నేను గబగబా ప్రశాంత్ వాళ్ళింట్లోకి పరుగెత్తాను. నేనెళ్ళేటప్పటికే అతడు నా భార్యతో ఫోన్లో మాట్లాడుతున్నాడు. "అయ్యో అలాగా ఆంటీ... ఇప్పుడే వస్తా ఉండండి.." అని ఫోన్ పెట్టేయబోతూ, ఏదో ఆలోచిస్తూ ఎలక్ట్రిక్ క్రిమేటరీ నెంబర్ ఇచ్చాడు. ఎలక్ట్రిక్ క్రిమేషన్ పేరు వినగానే, ఎందుకో నాకు చెప్పలేని భయమేసింది.

"బాబూ.. నీకు వీలైతే కారు తీసుకురాగలవా?" నా భార్య అటువైపు నుంచి అభ్యర్థనగా అడిగింది.

"అఖ్ఖర్లేదాంటీ, మీరు ఈ నెంబరుకి ఫోన్ చేస్తే వాళ్ళే వ్యాను పంపిస్తారు..." అంటూ అతను మరోమాట లేకుండా ఫోన్ పెట్టేశాడు.

ఈలోపు అతడి భార్య ఆవలిస్తూ వచ్చింది. "ఎవరండీ అర్థరాత్రి పూటా..?"

" A1లో ఉన్నాయన పోయాట్ట, వాళ్ళావిడ మన కారు తెమ్మంటోంది.." అన్నాడు.

"అయితే గమ్మున తీసుకెళ్ళండి.."

"ఏడిశావులే, శవాన్ని కూర్చోబెట్టిన కారులో మళ్ళీ మనం కూర్చుని ప్రయాణం చేయగలమా?"

అతని భార్య ఒక్క నిముషం దిగ్భ్రాంతితో అతడి వైపు చూసింది. ఆమె చూపుల్లోని అంతర్యాన్ని అతడు గ్రహించి, "నువ్వు మరీ సెంటీ అయిపోకే... రేపొద్దున్నే వెళ్ళి ఒక్కసారి పలకరించి వచ్చేస్తే చాలు.

మనం ఇప్పుడెళ్ళి వాళ్ళకెంత సహాయం చేసినా, పబ్లిక్‌కి తెలుస్తుందా ఏడుస్తుందా? ఇందులో ఒక్కపావువంతు హెల్ప్ మన వెబ్‌సైట్ ద్వారా చేస్తే వేలమందికి మన పేరు తెలుస్తుంది" అన్నాడు.

అతడి భార్య కూడా ఒక్క క్షణం ఆలోచించి, "మీరు చెప్పేంది నిజమే... అందుకే కదా ఊళ్ళో ఎన్ని స్వచ్ఛంద సంస్థలున్నాసరే దేనిలోనూ చేరకుండా, మీసొంత వెబ్‌సైట్ మొదలుపెట్టారు... పదండి బెడ్రూములో కిటికీ దగ్గర కూర్చుని ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ అతడిచేయి పట్టుకుని లాగింది.

"ఈడియట్స్.. నన్ను కాదురా, మీ అందర్నీ ఎలక్ట్రిక్ క్రిమేషన్ చేసేయాలి" అని మనస్సులో కసిగా తిట్టుకున్నా. ఎలక్ట్రిక్ క్రిమేషన్ గుర్తుకురాగానే ఎందుకో ఒళ్ళు జలదరించింది. చాలా భయమేసింది.

గబగబా మా ఇంటికి పరుగెత్తాను. అప్పటికే నా భార్య ఎవరికో ఫోన్ చేసి మాట్లాడుతోంది, "గమ్మున వచ్చేయండి.. ప్లీజ్.. అస్సలు ఆలస్యం చేయొద్దు" ఏడుస్తూ చెప్పి ఫోన్ పెట్టేసింది.

"నో"‌.. నేను గొంతు పగిలేలా అరిచాను. "ఆ ఎలక్ట్రిక్ క్రిమేషన్ నాకొద్దు.." పిచ్చి కేకలు పెట్టాను. అవేమీ నా భార్యకి వినిపించట్లేదు. నా శవం పక్కనే కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేను కూడా నిస్సహాయంగా వెళ్ళి గోడ పక్కనే కూర్చున్నాను.

"ఒక్క స్విచ్ నొక్కగానే హైఓల్టేజీ కరెంటు ఒక్కసారిగా పాసయ్యి, క్షణాల్లో నా శరీరం మొత్తం గుప్పెడు బూడిదైపోయే ఆ ప్రక్రియ నాకొద్దు.

ఆ శవాలబ్బాయి, ఒక శవం తరువాత ఒక శవాన్ని ట్రేల్లో కెక్కించి చేతులు దులుపుకుని, ఎప్పుడు తగలబడుతుందా అని బీడీ కాలుస్తూ చిరాగ్గా ఎదురుచూసే ఆ యాంత్రికపు ప్రక్రియ నాకొద్దు"

నా ఆలోచన, నాకే చిత్రంగా అనిపించింది. ఓసారి, దేముడి ముందు పెట్టే దీపం విషయంలో నాకూ మా నాన్నకి దెబ్బలాటయ్యింది. "రోజూ నూనె పోసి దేముడికి దీపం పెట్టడమెందుకు దండగ, చక్కగా మినుకు మినుకుమనే ఓ బల్బు కొనితెచ్చి తగిలించేస్తే ఒదిలిపోతుందిగా" అని నా వాదన.

"నీ యాంత్రికపు ఆలోచనలు తగలయ్యా, మెటీరియలిస్టులా తయారవుతున్నావురా.." అని నాన్నకోప్పడ్డాడు. చాలాసేపు వాదించుకున్నాం.

ఆ నాటి నా ఆలోచన, నాకు ఇప్పుడు నిజంగానే యాంత్రికంగా అనిపిస్తోంది.

"నా అంతిమయాత్ర మాత్రం యాంత్రికం కాకూడదు. నా తుది వీడ్కోలు ఆప్యాయతల నడుమ జరగాలి. నాకోసం ఏడుస్తూ వేద మంత్రాల మధ్య నన్ను సాగనంపాలి. చక్కగా నలుగురు మోసుకుపోతూ.."

అసలు నాకు 'నా..' అనే వాళ్ళు నలుగురైనా ఉన్నారా? ఒక్కసారి ఆలోచించాను.

నాన్ననీ, పుట్టిన ఊరినీ ఒదిలేసిపోయాను - ఆత్మీయులు ఒక్కళ్ళూ లేరు! ఇరవై ఏళ్ళు అమెరికాలో ఉన్నాను - నాతో కల్సి మందుకొట్టిన వాళ్ళకి, నా పేరుకూడా గుర్తుండి ఉండేదేమో! స్వేచ్ఛ కోసం వెంపర్లాడి 100% ఇండిపెండెంట్ అపార్ట్‌మెంటు కొన్నాను - పలకరించే మనిషి ఒక్కడూ లేడు! 'అయ్యో నాకు పిల్లలు లేరే' అని జీవితంలో మొట్టమొదటిసారిగా బాధపడ్డాను.

పెళ్ళైన మొదటి ఆరేళ్ళూ స్వేచ్ఛకీ, ఎంజాయ్‌మెంటుకీ అడ్డులే అనుకుని పిల్లల్ని కనలేదు.

ఆ తరువాత ఎంత ప్రయత్నించినా, ఎంత మంది డాక్టర్ల చుట్టూ తిరిగినా, పిల్లలు పుట్టలేదు. పిల్లలకోసం నేను ఏనాడూ పెద్దగా బాధపడలేదు. కానీ ఈనాడు తెలుస్తోంది ఆ బాధేమిటో..

నా ఆలోచనల్ని చెదరగొడుతూ కాలింగ్‌బెల్ మ్రోగింది... అప్పటికే తెల్లవారుతోంది. శవాలబ్బాయి వచ్చుంటాడేమోనని భయపడి, పరుగెత్తుకుంటూ వెళ్ళి మంచం వెనకాల దాక్కున్నాను. జానకి ఏడుస్తూ వెళ్ళి తలుపు తీసింది. మరింత బిగ్గరగా ఏడ్చింది. నేను కంగారుగా తలెత్తి చూశాను.

మా నాన్న, ఇంకో పదిమంది ఊరివాళ్ళూ లోపలి కొస్తున్నారు. వస్తూనే, మా నాన్న నా శవం మీదపడి చిన్నపిల్లాడిలా ఏడ్చాడు....

"ఊరుకోండి ఆచారిగారూ.... మా అందరికీ పెద్ద దిక్కు, మీరే ఇలా అయిపోతే ఎలాగా...?" అంటూ వాళ్ళు నాన్నని ఓదార్చారు.

నేనంటే నేనని పోటీలు పడుతూ, వాళ్ళల్లో ఓ నలుగురు నా శవాన్ని ఎత్తుకున్నారు. కంట తడిపెడుతూ తీసుకెళ్ళి, వీధిలో ఆగున్న 'ట్రాక్టర్' లో పడుకోబెట్టారు. అప్పటికే అందులో ఉన్న జనమందరూ క్రిందకి దిగి నాన్ననీ, నా భార్యనీ ఓదారుస్తున్నారు.

నేను కూడా నా శవం పక్కనే కూర్చున్నాను....

క్షణాల్లో ట్రాక్టర్ బయలుదేరింది... వెళుతూ వెళుతూ ఓసారి మా అపార్ట్‌మెంటు వైపు చూశాను. ఇప్పుడది 100% ఇండిపెండెంట్ ఇంద్రభవనంలా కనిపించట్లేదు...

ఆ జన్మ పరిచయాలున్నా సరే, ఏ ఇద్దరి మధ్యా మౌనమే తప్ప మాటలంటూలేని శ్మశానంలాగా అనిపించింది... ఆప్యాయతంటే తెలీని నాలాంటి వెధవెవడో ఓ రాతి విత్తు నాటితే, దాన్నుంచి మొలిచిన కాంక్రీటు చెట్టులా అనిపించింది.

✷✷✷




## సెప్టెంబర్ ౨౦౦౯

**ఈ నెల కథాసాగర** మథనంలో సెప్టెంబర్ నెల మాస పత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, రచన, విపుల, దినపత్రికలు ఈనాడు, వార్త, సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలు, వారపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్యలలో ప్రచురితమైన 76 కథలను విశ్లేషించి, కౌముది పాఠకులకు పరిచయం కోసం భిన్నమైన కథలను ఎంపిక చేశాను.

ఈ నెల కథలలో కూడా అధికభాగం అలవాటయిన కథాంశాలలో ఉన్నవే. ఒకోసారి మామూలు కథలు చదువుతూ, మంచి కథలను కూడా మామూలుగా భావించే పొరపాట్లు జరిగే వీలుంటోంది. అందుకే ఒకో కథను, ఒకటికి రెండు సార్లు చదవాల్సి వస్తోంది.

కానీ, మన కథలు చదువుతుంటే ఒక లోపం స్పష్టంగా తెలుస్తోంది. అది, మన కథలలో వస్తు వైచిత్రి కనబడకపోవటం. ఎంతసేపూ మన కథలు కొన్ని కథాంశాల చుట్టే తిరుగుతుంటాయి. ఆ కొన్ని కథాంశాలను కూడా అందరు కథకులు ఒకే రకంగా ప్రదర్శిస్తుంటారు. ఒకే రకమైన పరిష్కారాలు పరిచితమైన కోవలోనే వస్తాయి. అలా పరిమితమైన కథాంశాలనే కాస్త భిన్నమైన రీతిలో ప్రదర్శిస్తాయీ కథలు.

***ఇగ వీడు తొవ్వకురాడు***

సెప్టెంబర్ 27, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైందీ కథ. కథను రచించింది పెద్దింటి అశోక్ కుమార్. కొందరు రచయితల కథలు మాండలీకంలోనే ఉంటాయి. అలాంటి కథకుడు పెద్దింటి అశోక్ కుమార్. అయితే, మాండలీకంలోనే పట్టుబట్టి రచించడం హర్షణీయమే అయినా, సాధారణంగా, రచయితలు రచనలు చేసేది పదిమంది చదవాలని. చదివి అర్ధం చేసుకోవాలని అర్ధమయ్యేట్టు రచనలు చేయాలన్న ఆలోచన గ్రాంధిక భాషను వ్యవహారితం చేసింది. కానీ, ఇప్పుడు కొన్ని మాండలీక రచనలు చదువుతుంటే, ఇవి అందరికీ అర్ధమవ్వాలన్న ఆలోచన కన్నా కొందరి మెప్పు మాత్రం పొందితే చాలన్న ఆలోచనతో రచించినవేమో అనిపిస్తుంది. అలాంటి భావనను కలిగిస్తుందీ కథ.

'ఉరికిన శాలోడు అదే అంగడి. ఉరకని శాలోడు గదే అంగడి' అంటూ ఆరంభమవుతుంది కథ. ఇక్కడ 'శాలోడు' అన్న పదం దగ్గర కొందరు పాఠకుల అవగాహన ఆగిపోతుంది.

'బాలకిషన్ ' అనే వ్యక్తి కరెంటు కోతను వ్యతిరేకంగా ఉద్యమం చేయటంతో కథ ఆరంభమౌతుంది. ఈ బాలకిషన్ తండ్రి పొలాన్నే నమ్ముకున్నవాడు. చివరికి ఆత్మహత్య చేసుకుంటాడు. అందరి హితోక్తులు పెడచెవిన పెట్టి బాలకిషన్ కూడా వ్యవసాయాన్ని చేపడతాడు. 'భూమేం చేసింది సారూ.. పాడి బ్రరె. మా తాతలు ఎట్ల బతికిండ్రు. ముత్తాతలు ఎట్ల బతికిండ్రు. మా నాయనే ఎందుకు సచ్చిండు. భూమి మీద విరక్తి ఎందుకు సారూ. భూమిని ఈ స్థాయికి తెచ్చినోళ్ళ మీద తిక్క పుడుతుంది' అంటాడు.

చివరికి, బాలకిషన్ ఉద్యమంలో ఎందుకు పాల్గొంటాడంటే, 'ఏ వ్యవస్థను మెడలు దించి మా నాయన సచ్చిండో ఆ వ్యవస్థ మెడలు వంచి నేను బతుకుత. మీకు చెప్పాలనిపిస్తే ఆ తొవ్వల నాలుగు మాటలు చెప్పండ్రి'. అందుకు చివరికి బాలకిషన్ రైతుల విత్తనాల కోసం గోడౌన్ మీద దాడి చేస్తాడు. 'వీడు తొవ్వకి రాడు' అని కథ చెపుతున్నాయన అనుకోవటంతో కథ ముగుస్తుంది.

ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఏమిటంటే, వ్యవస్థ మెడలు వంచి బతకటమంటే, గోడౌన్ మీద దాడి చేయటమేనా? గోడౌన్ మీద దాడి చేయటం అరాచకాన్ని ప్రోత్సహిస్తుంది. ఆటవిక న్యాయానికి నాంది పలుకుతుంది. ఆరాచకాన్ని అదుపులో పెట్టాలంటే పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వస్తుంది. మళ్ళీ అణిచివేత, తిరుగుబాటు. హింస.. వగైరా వగైరాలు మొదలవుతాయి. ఒక సమస్య ఉన్నప్పుడు, సమస్యను అన్ని కోణాలలోంచి పరిశీలించి, పరిష్కారాలను సూచించాలి. తాత్కాలిక పొగడ్తలు లభించవచ్చేమో కానీ అందువల్ల లాభాలేవీ ఉండవు. ఆవేశాన్ని రెచ్చగొట్టటం అభ్యుదయానికి దారి తీయదు. ఆవేశాన్ని సృజనాత్మకంగా, నిర్మాణం కోసం వాడటం, అందుకు సరైన దిశను సూచించటం శ్రేయస్కరం. ఇది సృజనాత్మక రచయితల కర్తవ్యం.

కానీ, మాండలీకంలో రాయటం అంటే, అట్టడుగున ఉన్న వారి అణిచివేతను చూపటం, ఆవేశాన్ని ప్రదర్శించటం, మాత్రమే అనుకుంటూ, అలాంటి కథలు రాయటమే 'సామాజిక స్పృహ' అని పొరపడుతున్నారు రచయితలు. అలాంటివే గొప్ప కథలంటున్నారు విమర్శకులు. అందుకే అలాంటి కథలే వస్తున్నాయి. కానీ మాండలీకంలో ఆవేశం, అణచివేతల ప్రసక్తి లేకుండా ఆయా ప్రాంతాల ప్రజల జీవన విధానాన్ని, సాంప్రదాయాలను హృద్యంగా ప్రదర్శించి, పాఠకులకు చెరగని అనుభవాన్ని మిగిల్చ వచ్చని నాయని సుబ్రహ్మణ్యానాయుడు, గోపిని కరుణాకర్, సం.వెం.రమేష్ వంటి కథకులు నిరూపించారు. మాండలీక సాహిత్యానికి వైశిష్ట్యాన్ని ఆపాదించారు. ఆ కథలలో మానవ జీవితం ఉంటుంది తప్ప ద్వేషం, అణచివేతలు, హింసలు, విప్లవాలు, వ్యవస్థ వ్యతిరేకతలు ఉండవు. మాండలీకంలో రాసే రచయితలు ఇది గమనించాలి.

అదీగాక, కథ రచయిత కథను రాస్తూ తాను వాడిన పదాల అర్థాలను వివరించాల్సి వస్తోందంటే, రచయితకూ తెలుసన్న మాట తన రచన అందరికీ అర్థంకాదని. ప్రతిపదార్థ తాత్పర్యం తెలుసుకుంటూ మాండలీక కథలు చదవటం గొప్ప అయినప్పుడు, ప్రతిపదార్థ ప్రాచీన సాహిత్యం చదవటంలో తప్పేముంది? పైగా ప్రాచీన సాహిత్యంలోని ఉన్నతమైన ఆలోచనలు, భావనలు, అలంకారాలు, పదప్రయోగాలు వ్యక్తి మేధను పరిపుష్టం చేసి, అతడికి ఓ ఉన్నత సంస్కారాన్నిస్తాయి కూడా.

***పిడికెడు మెతుకులు:***

సెప్టెంబరు 20, వార్త ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన ఈ కథను రచించింది సంకోజీ దేవేంద్రచారి. ఈ రచయిత కూడా మాండలీక రచయిత. పేదోళ్ళు, అణిచివేతలు, విప్లవాల కథలు మాత్రమే రాసే రచయిత. ఈ కథలో విప్లవం లేకున్నా, ధనికుడూ, ప్రపంచీకరణ, ఆధునిక అభివృద్ధుల కారణంగా పేదవాడై పిడికెడు మెతుకులకు నోచుకోకపోవటం కనిపిస్తుంది. మాండలీకం అర్థమయ్యే స్థాయిలోనే ఉన్న కథ, కథంతా ఒక వ్యాసంలా తోస్తుంది. పల్లె ప్రజలు ఆధునిక అభివృద్ధి కారణంగా పతనమవటాన్ని ప్రదర్శించినందుకు విమర్శకుల గుంపులీ కథను పొగడవచ్చు. బహుమతులీయవచ్చు. కానీ మామూలు స్థాయి కథ ఇది. ఎలాంటి కొత్తదనమూ లేదు. ఎద స్పదించే కథనమూ లేదు. కానీ పెద్దింటి అశోక్ కుమార్ కథ విశ్లేషణ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలన్నీ ఈ కథకూ వర్తిస్తాయి. మన సాహిత్యంలోని అపోహలను ఎత్తి చూపిస్తాయి.

***స్వర్గారోహణం***

చింతపట్ల సుదర్శన్ రచించిన ఈ కథ సెప్టెంబర్ 27, సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. మహాత్మాగాంధీని మహాత్ముడంటే కాదని విమర్శించి, దూషించి, మహాత్ముడు మామూలు మనిషని ఈసడిస్తూ రచనలు చేసేవారు మన సమాజంలో కోకొల్లలుగా ఉన్నారు. కానీ మన కళ్ళముందే ఓ రాజకీయనాయకుడిని మహాత్ముడేంటి, దైవపుత్రుడినే చేస్తూ, కథలు వస్తుంటే ఎవ్వరూ

కిక్కురుమనటంలేదు. 'స్వర్గారోహణం' కథ, మన పురుష ప్రతీకలను వాడకుండా వై.యస్.రాజశేఖర రెడ్డిని దైవసమానుడిని చేసే, వ్యర్థప్రయత్నాలలో ఎందుకూ పనికిరాని వ్యర్థకథ. ఈ కథను కౌముది పాఠకులకు పరిచయం చేయటం ఎందుకంటే, ప్రతి పండుగను, ప్రతినమ్మకాన్ని విమర్శిస్తూ, ఎద్దేవా చేసే హేతువాదులు, వైయస్సార్‌ను దేవుడ్ని చేసే ఈ ప్రయత్నాల విషయంలో నోరుమెదపనందుకు. హెలికాప్టర్ దుర్ఘటనలో మరణించిన అయిదుగురూ స్వర్గానికి పోతుంటారు. వారిలో ఒకాయన కోసం ప్రజలు ఏడుస్తుంటారు. స్వర్గద్వారం చేరిన ఆయన మిగతా నలుగురునీ లోపలకు అనుమతిస్తేనే స్వర్గంలోకి అడుగు పెడతానంటాడు. ఇదీ కథ. ఇలాంటి కథే మరొకటి ఈ పత్రికలోనే వచ్చింది. దాన్లో స్వర్గంలో ఇంద్రుడి దగ్గర ఉండే ఓ దేవదూత, రాయలసీమ ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు భూమి మీద జన్మిస్తాడు. తాను వచ్చిన పని పని పూర్తికాగానే మళ్ళీ దేవలోకం వెళ్ళిపోతాడు. మన సమాజంలో కథలకు, సాహిత్యానికి పట్టిన గతిని అటు మాండలీక కథలు, ఇటు ఇలాంటి రాజకీయ ప్రచార కుహనా పురాణ ప్రేరేపిత కథలూ స్పష్టం చేస్తాయి. ఇలాంటి కథల నడుమ అసలు సిసలైన కథలకోసం పాఠకులు లోపించటం సులభంగా అర్థమౌతుంది. ఇలాటి కథలకు విసిగిన పాఠకులు తెలుగు సాహిత్యానికే దూరం కావటం అర్థమవుతుంది.

***ఆశయాలు***

రావి. ఎన్. అవధాని రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమైంది. మాండలీకంలో రాసినా కాస్త ఆశాభావాన్ని ప్రదర్శిస్తుందీ కథ. కోయిల గూడానికి చెందిన సింగన్న పట్నం వచ్చి చదువుకుని తన గూడెం ప్రజలందరికీ విద్యాబుద్ధులు చెప్పించటం ఈ కథ. కథ ఆసాంతం చదివిస్తుంది. సినిమాటిక్‌గా ఉన్నా.. ద్వేషాలు, అణచివేతలు వ్యవస్థ వ్యతిరేకతలు లేకుండా, ఉన్న వ్యవస్థ పరిధిలోనే తమ పరిస్థితిని మెరుగుపరచుకునే ప్రయత్నాన్ని ప్రదర్శించి హాయిని గొలుపుతుంది.

***రోమ్‌లో రోమన్‌లా***

సి.హెచ్.శివరామ ప్రసాద్ రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమయింది. కథ మామూలు కథే కానీ కొసమెరుపు బాగుంటుంది. తల్లిదండ్రులను వదిలి విదేశాలకు చేరిన హరి, విదేశీ వ్యసనాలన్నీ ఒంటబట్టించుకుంటాడు. 'ఇదేమిటని'? అడిగితే 'రోమ్‌లో రోమన్‌లా ఉండాలం'టాడు. కొన్నాళ్ళకి విదేశాలలో అతని పరిస్థితి దెబ్బతింటుంది. ఊరొచ్చి, పొలం అమ్ముతానంటాడు. తండ్రి ఒప్పుకోడు. 'యూరోపియన్ యువత తల్లితండ్రుల సంపాదన మీద ఆస్తుల మీద ఆధారపడరు. ఆశపడరు. స్వంత కాళ్ళమీద స్వతంత్రంగా జీవించడానికి చూస్తారు. నువ్వు రోమన్‌లాగే ఉండు. మమ్మల్ని వదిలెయ్' అని చురకవేస్తారు. ఇదీ కథ. పాశ్చాత్యులలో మంచిని కాక, ఇతరాలు ఆదర్శంగా తీసుకునే వారికి చెంప పెట్టులాంటిదీ కథ,

ఈ మాసం ఏకథ కూడా ఉత్తమ కథగా నిర్ణయించే స్థాయిలో లేదు. కాబట్టి ఈ మాసం కథ విశ్లేషణతోనే సంతృప్తిపడదాం.

***




## అక్టోబర్ ౨౦౦౯

**కథా సాగర** మథనంలో విశ్లేషణకు అక్టోబర్ స్వాతి, ఆంధ్రభూమి, విపుల, రచన, చిత్ర మాసపత్రికలు ఈనాడు, సాక్షి, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వార పత్రికలలో ప్రచురితమైన 109 కథలను విశ్లేషించటం జరిగింది. వీటిలోంచి మిగతా వాటికి కాస్తయినా భిన్నంగా ఉన్న కథలనూ, చక్కగా ఉన్న కథలను ఎంచుకోవటం జరిగింది.

***<u>ఎడారి ఓడ - వాడొక్కడు</u>***

ఈనెల కథారచయిత వేంపల్లి గంగాధర్ కథలు రెండు ప్రచురితమయ్యాయి. అక్టోబర్ 4 సాక్షి సంచికలో 'వాడొక్కడు', అక్టోబర్ 11 ఆంధ్రజ్యోతిలో 'ఎడారి ఓడ'. ఈ రెండు కథలు నిజమైన అంశాలను ప్రతిబింబించినా, ఒకరకంగా రెండు కథలూ సామాజికంగా తక్కువ స్థాయిలో ఉన్న వారి జీవితాలను ప్రతిబింబించేవే. 'ఎడారి ఓడ' కథలో జీవితాంతం తిండి దొరికే సాధనంగా భావించి ఒకరు ఒంటెను దొంగతనం చేస్తే, అతడి నుంచి మరొకడు, అదే కారణం చేత ఒంటెను దొంగలిస్తాడు. కథ మామూలుగా, ఎలాంటి ప్రత్యేకత లేకుండా ఉంటుంది - 'వాడొక్కడు' కథ 'గాలోడు' అనే అతడి జీవిత కథ. ఈ గాలోడి ప్రత్యేకత ఏమిటంటే, ఎవరయినా మరణిస్తే అతడు ప్రత్యేకంగా తయారు చేసుకున్న వెదురు వాయిద్యాన్ని అత్యంత విషాదకరంగా, రచయిత వర్ణనలో చెప్పాలంటే 'మనిషి తనాన్ని మానవత్వంతో నిద్ర లేపే మూలుగులా వాయిస్తాడు.' చివరికి అతడు మరణిస్తే ఎవరూ పట్టించుకోరు. పూడ్చి వెళ్ళిపోతారు. 'విద్య తెలిసిన వాడొక్కడూ వెళ్ళిపోయేవాడు. వాడితోపాటు ఒక అరుదైన కళారూపం కూడా!' అంటూ కథను ముగిస్తాడు రచయిత. కథలో ఎలాంటి 'కథ'లేకున్నా చదివించేట్టు రాయటంలో రచయిత కృతకృతుడయ్యాడు. అయితే, మేక పేగుతో వాయిద్యాని తయారు చేసి వాయించే కళాకారుడి మరణంతో అతడి కళ అదృశ్యమయిపోతుందని రాసే కథలు మన తెలుగు సాహిత్యంలో పొందినంత ఆమోదం, అరుదైన సాంప్రదాయక కళలు అంతరిస్తున్నాయని రాస్తే ఉండదు. దాన్ని తిరోగమనవాదం అంటారు. ఇంకా రకరకాల రంగులు పూస్తారు. అట్టడుగున ఉన్నవారి కళ 'ప్రజలకళ', పరిష్కృతమైన కళ 'అగ్రవర్ణాల వారి కళ' అన్న అపోహ సాహితీరంగంలో బలంగా పాతుకుని ఉండటం ఇందుకు కారణం. 'కళ' ఎవరిదైనా కళనే. ఒక కళ అంతరిస్తోందంటే, సమాజం తన గతంలోని ఒక ప్రధానమైన అంశాన్ని కోల్పోతున్నదని అర్థం. అది జానపద కళ అయినా, సాంప్రదాయక కళ అయినా మన అందరిదీ. సాహిత్య రంగంలోని అపోహలు ఒక రకమైన కథలకు ఆమోదం, మరో రకమైన కథలపై నిషేధాన్ని విధిస్తున్నాయి. సాహితీపరులు ఈ అపోహలు, సంకుచితాలు దాటి రచనలు చేయగలగాలి.

<u>*అతను*</u>

సాయి బ్రహ్మానందం గొర్తి రచించిన ఈ కథ అక్టోబర్ 4, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. మన సాహిత్యరంగంలో స్త్రీ పురుష సంబంధాలు, దాంపత్య అనుబంధాల విషయంలో ఆమోదం పొందిన అపోహలలో ఓ అపోహను ప్రతిబింబిస్తుందీ కథ. ఉత్పల అనే అమ్మాయి తన కూతురిని వదిలేసి, ఎవరికీ చెప్పకుండా, తన విద్యను సార్థకం చేసుకోవటం కోసం భారత్ వచ్చేస్తుంటుంది. వర్మ అనే వ్యక్తి, పిల్లలను చూసుకోవటానికి అత్తగారిని అమెరికా తేవటం కోసం ఇండియా వస్తుంటాడు. ఇద్దరూ విమానంలో మాట్లాడుకుంటారు. పిల్లలకోసం ఉద్యోగం మానేస్తానన్న భార్యను ఉద్యోగం మానవద్దని పిల్లలను చూసేందుకు అత్తగారిని తెస్తుంటాడు వర్మ. పిల్లలకోసం ఉద్యోగం చేయకుండా ఉంటే, తను చదివిన చదువు వృథా అయిపోతోందని పిల్లను వదిలి వస్తుంటుంది ఉత్పల. ఆమె మొగుడిని వదిలి వచ్చేయటానికి అతడి ఆత్మనూన్యత, ప్రేమ సెంటిమెంట్లు వంటి మామూలు ఫెమినిస్ట్ పడికట్టు పదాలు వాడుతుంది ఉత్పల. తన ఉద్దేశ్యానికి ఉదాత్తతనిస్తూ 'ఆయనకి నా అవసరంకంటే, మనుష్యులకి నా అవసరం ఎక్కువనిపించింది. డాక్టర్లందుబాటులో లేక ఎంతో మంది చనిపోతున్నారు. వాళ్ళకినా అవసరం ఉందనిపించింది' అంటుంది. చివరికి, 'అతను మంచివాడని' వర్మ అంటే' అతను నిజంగా మంచివాడే. కానీ మగాడు... మీ అందరిలాంటి వాడు' అంటుంది ఇదీ కథ. మామూలు కథ. నిజానికి కథలో కొత్తదనం ఏమీ లేదు. అలవాటయిన వాదన. అలవాటయిన ముగింపు కూడా. ఇక్కడ ఆలోచించవలసిందేమిటంటే, 'ఆయనకి ఆమె అవసరం లేదు. కానీ మూడేళ్ళ పసివాడికి?' ఈ ప్రశ్నకు సమాధానం ఈ కథలో దొరకదు. 'స్త్రీకి కెరీరు ముఖ్యం' అంటూ, కెరీరు కోసం కుటుంబాలను విచ్చిన్నం చేసుకోవటమే అభివృద్ధి, స్త్రీకి విముక్తి అని ప్రచారం చేసే అనేకానేక కథల జాబితాలో ఈ కథ కూడా చేరుతుంది. కానీ, సృజనాత్మక రచయితలు అందరూ వెళుతున్న దారిలో వెళ్ళే కన్ను, దూరదృష్టిని ప్రదర్శించి, వ్యక్తిగతాలకన్నా, సమిష్టిలాభానికి పెద్ద పీట వేయాలి. అమలులో ఉన్న అపోహల పొరలను చీల్చి అసలు నిజాన్ని చూడాలి. విడిపోవటం నేర్పటం కన్నా కలిసి ఉండటం, సమన్వయం సాధించటం వైపు సమాజం దృష్టి మళ్ళించాలి. ఒక తరంలో వారంతా కెరీర్ల పై దృష్టి సంసారాలను త్యజిస్తే, ఆ దుష్ఫలితాలను తరువాత తరాలవారు అనుభవిస్తారు. అమెరికా సమాజ మానసిక సమస్యలను అర్థంచేసుకుంటే, ఇలాంటి అపోహలు స్థిరపడటం వల్ల మన సమాజం అనుభవించే మానసిక సమస్యలను ఊహించే వీలు కలుగుతుంది. అందుకే రచయితలు రచయితలుగా కాక ద్రష్టలుగా ఎదిగే ప్రయత్నం చేయాలి.

<u>*దిద్దుబాటు*</u>

సోమ వఝల నాగేంద్రప్రసాదు రచించిన ఈ కథ అక్టోబర్ 14 నవ్య సంచికలో ప్రచురితమయింది. ఈ కథ కూడా అలవాటయిన సమస్య, అలవాటయిన రీతిలో పరిష్కారం సూచిస్తుంది. ఫణీంద్ర అనే అతడి అబ్బాయి ఆర్ట్స్ చదవాలనుకుంటాడు. తండ్రి ఇంజినీరింగ్ చేయమంటాడు. ఇది తెలిసి ఫణీంద్ర కొడుకు ఇష్టానికి ఒప్పుకుంటాడు. సంతానం ఆలోచనలను, ఇష్టాఇష్టాలను గౌరవించమని చెప్పటం అభిలషణీయమై అయినా, ఆత్మహత్య చేసుకుంటాడనో, ఇంకేదో అఘాయిత్యం చేసుకుంటాడనో అన్న భయం వల్ల ఒప్పుకోవటం అంత వాంఛనీయం కాదు. అవగాహన, సహానుభూతిలేని నిర్ణయాల వల్ల లాభం లేదు. ఇలాంటి పరిష్కారం వల్ల లాభాలకన్నా నష్టాలే ఎక్కువుగా ఉంటాయి.

<u>*గోడకింద పిల్లోడు*</u>

మల్లాది రవిశంకర్ రచించిన ఈ కథ అక్టోబర్ 15 ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయింది. ఇది గొప్ప కథగా పరిగణకు రాకపోయినా ఒక పాజిటివ్ దృశ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఓ ధనవంతుడి కూతురూ, మేనల్లుడూ కోచింగ్ పొంది మరీ ఐ ఐ టి ఎంట్రన్స్ పరీక్షలు రాస్తారు. ఫెయిలవుతారు. కానీ వారు క్రింద స్థాయివాడిగా పరిగణించే గోడకింద పిల్లోడు పదవ రాంకు సాధిస్తాడు. ఎందుకంటే

తాను కష్టపడి పైకి వచ్చి తండ్రి, తన పిల్లలు కష్టపడకూడదని వారికన్నీ అమరుస్తాడు. పిల్లలకు పట్టుదల, కమిట్‌మెంట్ తెలియవు. అదే, అతడి వల్ల సహాయం పొందిన పేదపిల్లవాడికి వ్యక్తుల విలువ తెలుసు. కష్టపడటం విలువ తెలుసు. ఇదీ కథ. చక్కని కథ.

*తెలియని నిజాలు*

డి.కామేశ్వరి రచించిన ఈ కథ అక్టోబర్ స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. దీన్ని కథ అనేకన్నా సియాచెన్ ప్రాంతంలో సైన్యానికి సంబంధించిన సమాచారాన్ని అందించే సంభాషణా వ్యాసం అనవచ్చు. కథాసాగర మథనంలో ఈ కథను పరిచయం చేయటం కూడా ఎవరూ స్పృశించని విషయాన్ని అందరికీ తెలియచెప్పాలన్న తపన ఈ కథలో ఉండటం వల్లనే.

*తీరం చెమ్మగిల్లింది*

'పురోహితుని కళ్ళు చెమ్మగిల్లాయి. పడవ నడిపే వాడి కళ్ళు చెమ్మగిల్లాయి. తెడ్డు చెమ్మగిల్లింది. పడవ చెమ్మగిల్లింది. చెమ్మగిల్లిన పడవ మెల్లమెల్లగా తీరం చేరింది. తీరం చెమ్మగిల్లింది' అంటూ ముగిసే ఈ కథ చదవటం పూర్తయ్యేసరికి పాఠకుల కళ్ళముందు మనస్సు కూడా చెమ్మగిల్లుతుంది. విదేశాలలో చనిపోయిన అతడి చివరి కోరిక తీర్చేందుకు ఎవరికీ తీరిక ఉండదు. దాంతో అతడి అస్థికలను గోదావరిలో కలిపేందుకు సూర్యం బయలుదేరతాడు. చనిపోయిన భర్త కోరిక తీర్చేందుకు వెంగమాంబ ఓపికలేకున్నా, వార్ధక్యం మీద పడినా, గోదావరి తీరం చేరుతుంది. కానీ పడవలో వెళ్ళేందుకు డబ్బులుండవు. స్నేహం కోసం ఒకరు, ప్రేమ వల్ల ఒకరు గోదావరిలో అస్థికలు కలుపుతారు. ఇదీ కథ. ఈ కథలో రచయిత కలశపూడి శ్రీనివాసరావు గారు భావవ్యక్తీకరణ అత్యుత్తమ స్థాయిలో ఉంది. చివరలో వెంగమాంబను తాకిన సూర్యం అనుభూతిని రచయిత వర్ణించిన తీరు పాఠకుల మనస్సులలో ప్రకంపనలు కలిగిస్తుంది. ఎంతో కాలానికి ఒక ఆర్ద్రత, ఒక అనుభూతి, ఒక సున్నితత్వం సమపాళ్ళలో కలబోసి మానవత్వానికి, మనిషిలోని ఆత్మబంధానికి పెద్ద పీట వేసిన గొప్ప కథ చదివిన అనుభూతి కలుగుతుంది. నిస్సంకోచంగా ఈ కథను ఈ నెల కథగా నిర్ణయించటానికి తోడ్పడింది. హృదయాన్ని ఈ కథ చెమ్మగిల్ల చేయగలటమే అయితే, ఎందుకో ఇలాంటి కథనో, సినిమానో ఎక్కడో చూసినట్టు జ్ఞాపకం అందీ అందకుండా ఊరిస్తుంది. అయినా ఈ కథ గొప్పతనం ఈకథదే ఇది స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది.

## *ఈనెల కథ*

**తీరం చెమ్మగిల్లింది - కలశపూడి శ్రీనివాస రావు**

**అక్టోబర్ స్వాతి మాసపత్రిక 2009 సంచిక నుంచి**

న్యూయార్క్:

"సూర్యంగారు! మన కుమార్ గారి విషయం తెలుసుకదా!" అడిగారు రామయ్యగారు.

"అవునండి. నేను వెళ్ళి వాళ్ళ కుటుంబ సభ్యులను పలకరించాను. ఇంత అకస్మాత్తుగా ఆయన పోతారనుకోలేదు" అన్నాడు సూర్యం విచారంగా.

"మీకు ఆయనతో ఎంత పరిచయమో నాకు తెలీదు కాని, ఆయన వ్యక్తిగతంగా చాలా మంచివాడండి. అందరిని కూడకట్టి మన తెలుగు వాళ్ళకి సంవత్సరం పొడుగునా భారీగా డిన్నర్లు ఇస్తుండేవారు"

"తెలుసండి రామయ్యగారు, నేను కూడా కొన్నిసార్లు వాళ్ళింట విందు భోజనం చేసినవాడినే"

"మీరూ చాలా ఏళ్ళుగా అమెరికాలో ఉంటున్నారు కదా అని ఫోను చేశాను" అన్నారు రామయ్యగారు.

"ఏమిటో చెప్పండి?" అన్నాడు సూర్యం.

"ఆయన చితాభస్మం ఇండియా పంపించాలండి. ఎలా పంపాలో మీకు ఏమైనా తెలుసా? పోస్టులోనా, కొరియర్‌లోనా..." అడిగారు రామయ్యగారు.

"చితాభస్మం.. అవును. ఫ్యునరల్ హోమ్ వాళ్ళు సీల్ చేసి ఇస్తారు. పోస్టాఫీసులో డెత్ సర్టిఫికెట్ చూపించి రిజిష్టర్ పోస్టులో పంపవచ్చు. ఏ పోస్టాఫీసులోనైనా అడిగితే వివరాలు ఇస్తారు. చాలా ఏళ్ళ క్రిందట నేనొకసారి పంపాను. సవ్యంగానే అందింది"

"కుమార్ గారి తాలూకు బంధువులు హైదరాబాదులో ఉన్నారు. వాళ్ళకి పంపితే చాలుట. ఎన్ని రోజులు పడుతుందో చేరడానికి?" అన్నారు రామయ్యగారు.

"నేను విశాఖపట్నం పంపినప్పుడు ఇరవైరోజులు పట్టింది. మరి ఇపుడు ఇంకా తక్కువ సమయం పట్టవచ్చు. హైదరాబాద్ అయితే వారం లేదా పదిరోజులు పట్టవచ్చు. ఇంకా వేగంగా చేరాలంటే ఫెడెక్స్ లేదా యు.పి.ఎస్ వాళ్ళని అడగమనండి"

"అవును అలాగే చెబుతాను"

"మంచిదండీ" అన్నాడు సూర్యం.

మరో అరగంటలో - "సూర్యంగారూ! వాళ్ళకి అంత తొందరేమీ లేదటండి"

"అయితే పోస్టాఫీసు ద్వారా పంపమనండి"

"అది సరేకానీ, మీరేమైనా ఇండియా వెళుతున్నారా వచ్చే రెండు మూడువారాల్లో?"

"అవునండి. వచ్చేవారం వెళతానేమో. ఇంకా నిశ్చయం కాలేదు" అన్నాడు సూర్యం.

"మరింకేం. మీకు ఆ చితాభస్మం ఇస్తే మీరు వెళ్ళినపుడు వాళ్ళ చుట్టాలకి ఇవ్వగలరా?"

"... సరే అలాగే" అన్నాడు సూర్యం.

"చాలా థాంక్సండీ! ఉదయాన్నే వాళ్ళింటికి వెళ్ళా ఈ విషయాలు మాట్లాడాలని. చితాభస్మం తీసుకుని మరో గంటలో వస్తాను. ఇంట్లో ఉంటారా?" అన్నాడు రామయ్యగారు.

"అలాగే" అన్నాడు సూర్యం.

మరో గంట గడిచిన తరువాత

"సూర్యంగారూ మీరు చాలా సులభంగా ఈ సమస్యని సాల్వ్ చేశారండి. చితాభస్మం ఈ డబ్బాలో చక్కగా సీల్ చేసి ఇచ్చారు ఫ్యునరల్ హోమ్ వాళ్ళు. దీన్ని మీరు ఇలాగే తీసుకెళ్ళవచ్చు"

"సరే. చితాభస్మం తీసుకెళ్ళడానికి ఏ కాగితాలు కావాలో చెపుతాను, వాటిపై వాళ్ళ అబ్బాయితో కాని, ఆయన భార్యతో డెత్ సర్టిఫికెట్ కాపీ ఇమ్మనండి"

"సూర్యంగారూ అయితే మీకు కావలసిన పర్మిషన్ లెటర్ మీరే డ్రాఫ్ట్ చేసి మెయిల్ చెయ్యండి. వాళ్ళతో దానిపై సంతకం పెట్టించి మీకు పంపమని చెపుతాను. ఇక వెళతాను. చితాభస్మం మీరు తీసుకెళ్ళడం పెద్ద సహాయమండి" అన్నారు రామయ్యగారు.

మరో గంట తర్వాత - "సూర్యంగారూ! మీరు హైదరాబాదు వెళ్ళడం నిశ్చయం అయిందన్న మెసేజ్ అందింది. మీ ఫ్లైట్ వివరాలు, కాంటాక్ట్ ఫోను నెంబర్ విన్నాను. మీ ఇండియా ఫోను నెంబరు, ఫ్లైట్ నెంబరు వివరాలు అన్నీ వాళ్ళ చుట్టాలకి ఇచ్చి, వాళ్ళ చుట్టాల కాంటాక్ట్ ఇన్‌ఫర్మేషన్ మీకు ఇవ్వమంటాను. వాళ్ళ చుట్టాలు ఎయిర్ పోర్ట్‌కు వచ్చి మిమ్మల్ని కలుస్తారు. చితాభస్మం తీసుకొంటారు"

మరో పావుగంట తర్వాత - ''వాళ్ళ చుట్టాలు ఎయిర్ పోర్ట్‌కు రాలేరట. మీరు హైదరాబాద్‌లో ఎక్కడుంటారో చెపితే మర్నాడు వచ్చి తీసుకుంటారంట''

''దాందేముంది మా డ్రైవర్‌కి ఇచ్చి వాళ్ళింటికే పంపుతానులెండి'' అన్నాడు సూర్యం.

''అదికాదండి వాళ్ళు ఈ చితాభస్మాన్ని బయట లాకర్లోనో, స్టోరేజ్ లోనో పెట్టాలనుకుంటున్నారట. మీరు హైదరాబాదు చేరిన తరువాత మీదగ్గరే ఉంచుకుంటే స్టోరేజ్ విషయం నిశ్చయం అవగానే మిమ్మల్ని కలిసి తీసుకొంటామంటున్నారు. వాళ్ళకి చితాభస్మం ఇంట్లో ఉంచుకోవడం ఇష్టం లేదట. మంచిది కాదని వారి నమ్మకమట''

''నేను మా తమ్ముడింట్లో ఉంటానండి. మరి వాళ్ళేమంటారో?'' అనుమానంగా అన్నాడు సూర్యం.

''మరి ప్రోబ్లమేనే?'' అన్నారు రామయ్యగారు.

''ప్రోబ్లం ఏముందండి? ఇంట్లో ఉంచుకోవాలని లేకపోతే అదే రోజు తీసుకెళ్ళి నిమజ్జనం చేస్తే సరిపోతుంది కదా?'' అన్నాడు సూర్యం.

''...మీకు మళ్ళీ ఫోను చేస్తానండి''

మరో పదినిముషాలలో. ''అలా కుదరదటండి. వాళ్ళకి రిజర్వేషన్లు అంత తొందరగా దొరకవట. రిజర్వేషన్లు దొరికినా సెలవు దొరకదట కాబట్టి మిమ్మల్నే, మీకు తెలిసిన వాళ్ళ దగ్గరో లేదా ఓ స్టోరేజ్‌లోనో ఉంచి వాళ్ళకి ఇన్ఫర్మేషన్ ఇస్తే వాళ్ళు వీలున్నప్పుడు, నిమజ్జనానికి వెళ్ళేముందు దాన్ని తీసుకువెళతారట''

''అలాగా... కాని నేను మా తమ్ముడింటిలో ఎలా ఉంచగలను? వాళ్ళు ఉంచుకోమంటే ఏం చేసేది? సరికదా టెర్రరిస్టులు సమస్య ఉన్న ఈ రోజులలో అమెరికా నుంచి వచ్చి స్టోరేజ్‌లో ఓ సీలు చేసిన డబ్బా నేను పెట్టడం, ఇంకెవరో వచ్చి తీసుకోవడం రిస్క్''

''అవును. అదీ నిజమే'' అన్నారు రామయ్యగారు.

''మరి మీరే ఏదో ఒక సలహా ఇవ్వండి''

''పోనీ ఇవన్నీ ఏర్పాటు చేశానే అనుకోండి. వాళ్ళ చుట్టాలు పితృకర్మలు నిర్వహించి, నిమజ్జం చేస్తారని మీకు నమ్మకం ఉందా?'' అన్నారాయన.

''...ఇన్నిసార్లు వెనక్కి ముందుకు వెళుతున్న సంభాషణ ద్వారా వాళ్ళకి చితాభస్మం నిమజ్జనం చేయడం పై అంత ఇంట్రస్టు ఉందనుకోను''

''ఇంతెందుకు కుమార్ గారి కొడుకుల్లో ఎవరో ఒకరు వెళ్ళి నిమజ్జనం చెయ్యవచ్చుగా''

''వెల్. ఆ పాజిబిలిటీ లేదండి. అందుకే మిమ్మల్ని సహాయం అడుగుతున్నాం''

''నన్నా?'' అన్నాడు సూర్యం.

''మీకు వీలయితేనే. మీకు ఇలాంటి పట్టింపులు లేవని మా అందరికి తెలుసు. మీకు అభ్యంతరం లేకపోతేనే...'' అన్నారు రామయ్యగారు,

''నాకు పట్టింపులు లేవు కాని, అంత ఆస్తి ఉండి, ఉద్యోగాలు చేస్తూ, సంపాదిస్తున్న పిల్లలుండి...''

''వెల్... మరి వాళ్ళకి ఆ సెంటిమెంట్ లేనట్లే కనిపిస్తున్నది'' అన్నారు రామయ్యగారు.

''ఇండియాలో చితాభస్మం నిమజ్జనం చెయ్యలన్నది ఎవరి ఉద్దేశ్యం?'' అడిగాడు సూర్యం.

''ఉద్దేశం కాదు. కుమార్ గారి కోరిక. తాను దేశం కాని దేశంలో తనువు చాలిస్తే భారతదేశంలో అదీ గోదావరిలో తన అస్థికలు కలవాలని కోరేవాడు''

కొన్ని క్షణాల పాటు నిశ్శబ్దం.

''రామయ్యగారూ! కుమార్ గారి చితాభస్మం నేనే నిమజ్జనం చేస్తాను'' అన్నాడు సూర్యం.

''మీరు చేసినట్లయితే ఆ కుటుంబానికి పెద్ద సహాయం చేసినవాళ్ళవుతారు. కుమార్‌గారి ఆత్మకి శాంతి కలుగుతుంది. ఎంత ఖర్చు అయితే అంతా ఇస్తామనంటున్నారు వాళ్ళు. నాకూ ఒక బ్లాంక్ చెక్ కూడా సంతకం పెట్టి ఇచ్చారు మీకిమ్మని''

''నాకు ఖర్చు ఇవ్వఖ్ఖర్లేదు. కుమార్ గారు నాకూ స్నేహితులే'' అన్నాడు సూర్యం.

''అలాకాదు. మీరు దానికయ్యే ఖర్చు తీసుకోవాలి. చితాభస్మం నిమజ్జనం చేసిన ఫలితం, పుణ్యం ఏమైనా ఉంటే అది వాళ్ళ కుటుంబానికి, కొడుకులకి దక్కాలి కదా, అందుకని'' అన్నారు రామయ్యగారు.

''.........''

''హమ్మయ్య నెలరోజులనుండి గుండెలమీద ఉన్న భారం తీరింది. కుమార్ గారి చితాభస్మం స్వయంగా మీ చేతులమీద గోదావరిలో నిమజ్జనం అయితే ఆయన ఆత్మ శాంతిస్తుంది'' నిట్టూర్చారు రామయ్యగారు.

✷✷✷

నర్సీపట్నం:

వెంగమాంబ ఎనభైఏళ్ళ వృద్ధురాలు. ఆమె భర్త చనిపోయి పదిహేను రోజులైంది. తన మరణం తరువాత చితా భస్మం, అస్థికలను తనవాళ్ళు కాశీలోనో, గోదావరిలోనో కలుపుతారని అప్పుడే తనకు శాంతి చేకూరుతుందని వెంకటశాస్త్రిగారు అనుకునేవారు. కాని తమ ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుంటే ఆ కోరికను భార్య వెంగమాంబతో బాహాటంగా అనలేకపోయేవాడు.

కాని అంత్యక్రియలప్పుడు పురోహితుడు అస్థికల్ని గోదావరిలో కలపాలని చెప్పినప్పటి నుండి శాస్త్రిగారి కోర్కె వెంగమాంబగారిని చుట్టుముట్టింది.

గుమస్తాగా పనిచేసిన భర్త గాంధేయవాది. వారికి పెద్దగా ఆస్తిలేదు. జీవితం అంతా గాంధీ మార్గంలోనే నడచినవాడు. సత్యాగ్రహ కాలంలో జైళ్ళలో ఉన్నాడు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని చదువు పాడుచేసుకున్నాడు. స్వాతంత్ర్యం వచ్చాక సొంత ఊరు నర్సీపట్నంలోనే గుమస్తా ఉద్యోగంలో చేరాడు.

లంచాలకి దూరంగా, నిజాయితీకి దగ్గరగా బ్రతికాడు. చాలీచాలని జీతంతో సంసారం చేసేవారు. వెంగమాంబ సాయంతో పిల్లలిద్దరికీ చదువు చెప్పించగలిగాడు. అప్పట్లో డొనేషన్లు లేవు కాబట్టి ఒకడు ఇంజనీరింగులో, మరొకరిని మెడిసిన్‌లో చేర్పించాడు.

వారిద్దరు తెలివైన పిల్లలు. బాగా చదువుకునేవారు. ఇంజనీరింగ్‌లో చేరినవాడు మొదట కమ్యూనిస్టుల వెంట, ఆ తరువాత మావోయిస్టుల వెంట తిరిగి నక్సలైటై, చివరికి ఏమయ్యాడో తెలియదు.

మెడిసిన్‌లో చేరిన కొడుకు చక్కగా చదివి, ప్రాక్టీస్ పెట్టి, బాగా అర్జించాడు. కాని ఓ బాబాగారి భక్తిలో పడి ప్రాక్టీసు పాడుచేసుకుని, ఉన్న ఆస్తి అంతా పూజలు, పునస్కారాల కోసం, ఆ బాబాగారి భక్తులకు కైంకర్యం చేసి వాళ్ళలో కలిసి ఎక్కడికోపోయాడు.

సమాజాన్ని తూటాతో మార్చి స్వర్గం చేద్దాం అని ఒకడు, బాబాల భక్తితో స్వర్గం పొందాలని మరొకడు స్వార్థపరుల మాయల్లోపడి తల్లితండ్రుల్ని ఒంటరివాళ్ళని చేసిపోయారు. భార్యాభర్తలిద్దరూ వాళ్ళకొచ్చే ఫించన్‌తో జీవితం వెళ్ళబుచ్చుతున్నారు.

వెంగమాంబకి భర్తతో పదో ఏట పెళ్ళైంది. డెబ్భై ఏళ్ళ సహచర్యం. భర్త ఆరోగ్యం క్షీణిస్తూ, చనిపోతాడని తెలిసినా ఆమె నిబ్బరంగానే ఉండేది. ఎందుకంటే అతను చనిపోతే తాను బ్రతకలేదు. తాను కూడా సహజంగా అతనితోపాటే చనిపోతానన్న ధీమా ఆమెలో ఉండేది. కానీ అతను చనిపోయి పదిహేను రోజులైంది ఇంకా బ్రతికే ఉంది. వీధిలో వాళ్ళే చెయ్యవలసిన కర్మ అంతా చేశారు. పన్నెండో రోజుతో ఇక తమ పని అయిపోయిందని ఎవ్వరూ కనిపించలేదు.

తాను భర్తతో ఎందుకు పోలేదు? ఆలోచించింది. మనసుకేమీ తట్టడం లేదు. తన ఒడిలోన ఉన్న చితా భస్మం పాత్రని మరోసారి తడుముకుంది.

పెంకులు రాలిపోతే డబ్బులు లేక పూరికప్పు వేయించుకున్న ఇంటిమధ్యలో చితాభస్మం, అస్థికలు భద్రపరచబడి ఉన్న పాత్రని ఒడిలో పెట్టుకుని ఆమె నిస్తేజంగా కూర్చుని ఉంది. ఆ పాత్రని ముట్టుకుంటే వేడిగా ఉంది. *అది వేసవి ఎండలవల్లో - లేక ఆత్మ చల్లబడని భర్త చితాభస్మంవల్లో తెలియలేదు.*

ఇంకెంతో కాలం అసహనాన్ని భరించలేకుండా ఉంది. డెబ్భై ఏళ్ళుగా కలిసి బ్రతికిన వ్యక్తి, ఎన్నో అనుభవాలను పంచుకున్న వ్యక్తి, ఒక్క స్పర్శకి ఒళ్ళంతా ఝల్లుమనిపించిన దేహం. ఒక్క చూపుతో మనసులో పువ్వుల వానని కురిపించిన ప్రియుడు.

ఒక్క పిలుపుతో జీవితకాలాన్ని కనురెప్పపాటుగా నడిపించిన సహచరుడు. ఒక స్పర్శతో, ఒక నవ్వుతో ఒక కవ్వింపుతో భౌతిక సుఖాల పరాకాష్టకు చేర్చే రసాత్మక లోకంలో విహరింపచేసిన భర్త.

ఏడడుగుల బంధాన్ని డెబ్భై వసంతాల కావ్యంగా మలచిన వ్యక్తి. ఆగని అనుభూతుల కెరటాల సముద్రం ఆ భౌతిక ప్రేమని, అతి సాధారణంగా, అందంగా ఆవిష్కరించిన ఆత్మ. ఆ సర్వస్వం ఈ పాత్రలో ఉంది అని తలుచుకోగానే వెంగమాంబ ఆ పాత్రని మరింత గట్టిగా కౌగిలించుకుని కన్నీరు కార్చింది.

ఇలా పదే పదే పదే ప్రతీరోజు జరుగుతుండడం చూసి, ఆత్మ శాంతించాలంటే చితాభస్మాన్ని అస్థికలని గోదావరిలో కలపడమే మార్గమన్నాడు పురోహితుడు.

అలా చెయ్యడానికే తాను చనిపోలేదేమో అని అనిపించింది వెంగమాంబకు. పోనీ మనసు గట్టిచేసుకుని చితాభస్మాన్ని గోదావరిలో నిమజ్జనం చెయాలన్నా వెళ్ళడానికి కావలసిన బస్సు ఛార్జీలు లేవు. అక్కడ కర్మకాండలకి కావలసిన డబ్బులూ లేవు.

ఆరోగ్యం చూస్తే ఏమాత్రం బాగోలేదు. పైగా తనని తీసుకుని వెళ్ళేవారెవరూ లేరు. ఎవరిని అడగాలో తెలీదు. తనతోపాటు వస్తారని నమ్మకం కూడా లేదు. ఇరుగు పొరుగు చెయ్యగలిగినంత సహాయం చేశారు. ఇంకా వాళ్ళని అడగడం బాగుండదు. ఇదే స్థితిలో రోజూ సతమతమవుతూ ఉంది వెంగమాంబ.

చుట్టు ప్రక్కల వాళ్ళ పిల్లలు వచ్చి కొద్దిసేపు కూర్చుని ఆమె చేత ఇంత తినిపించి వెళుతున్నారు. ఆమెకూడా వాళ్ళని అర్థం చేసుకుంది. తినడానికే వాళ్ళపై ఆధారపడడం వల్ల ఏమీ అడగలేకపోతోంది. కాని అంత్యేష్టి దృశ్యం ఆమె కళ్ళల్లో మసకగా కదలాడుతోంది.

వాళ్ళకి ఆమె కష్టం తెలుసు. పిల్లలే కొంత డబ్బు పోగుచేసి తెచ్చి ఇచ్చారు. వెంగమాంబని రాజమండ్రి వెళ్ళి చెయ్యవలసినది చెయ్యమన్నారు.

✷✷✷

రాజమండ్రి - కోటిలింగాల రేవు:

'అస్మత్ మిత్రస్య, సుఖేన, పుణ్యలోకా ప్రాప్త్యర్థం, కోటిలింగ మహాక్షేత్రే, అఖండ గోదావరీ తీరే గంగాంభసీ అస్తి నిమజ్జనం కరిష్యే!'

నా మిత్రుడి సుఖం కోసం, పుణ్యలోకాలు కలగాలని కోటిలింగ మహాక్షేత్రంలో గంగనుండి వచ్చిన అఖండ గోదావరి తీరంలో అస్థికలు నిమజ్జనం చేస్తున్నాను. అని మొదలు పెట్టిన సూర్యం, ఓ రెండు గంటలసేపు కుమార్ గారి చితాభస్మాన్ని ఆయనకి చెయ్యవలసిన ఆఖరిదైన శోడష(పదహారవ)కర్మ జరిపాడు.

'పరవస్తి మనుష్యాణాం గంగాతో యేషువ తిష్టతి తవాత్ వర్ష సహస్రాణి స్వర్గలోకే మహీయతీ' దాని అర్థం ఏమంటే - ఏ మనుష్యుని యొక్క అస్థికలు గంగలో ఎంతకాలం ఉంటాయో అంతకాలం ఆ వ్యక్తి స్వర్గంలో ఉంటారు అని శాస్త్రం చెపుతున్నది పురోహితుడు ముగించాడు. తనకు పట్టిన చెమటలు తుడుచుకుంటూ సంభావనల పేరుతో పోగేసిన ధాన్యం, డబ్బు సంచిలో వేసుకున్నాడు.

"అయ్యా మీరు ఇక ఈ చితాభస్మాన్ని తీసుకుని పడవలో వెళ్ళి గోదావరి మధ్యలో కలపాలి" అన్నాడు పురోహితుడు, నీళ్ళలో ఉన్న పడవను చూపిస్తూ.

"అలాగే చేద్దాం" అన్నాడు సూర్యం.

"అయ్యా నాదో చిన్న మనవి..." సంశయిస్తూ అంత్యేష్టి నిర్వహించిన పురోహితుడు అన్నాడు.

"చెప్పండి" అన్నాడు సూర్యం.

"అటు చూడండి" అని మెట్ల మీద కూర్చుని ఉన్న ముసలామెని చూపాడు. "ఆమె ఎనభై ఏళ్ళ పైబడ్డ వృద్ధురాలు. పైగా డస్సిపోయింది. భర్త అస్థికలను గోదావరిలో నిమజ్జనం చెయ్యాలని నర్సీపట్నం నుండి ఒంటరిగా వచ్చింది. వచ్చినప్పటినుండి పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టలేదు. ఆమెకి పిల్లలు లేరు. డబ్బులు లేవు. ఇక్కడదాకా ఎలాగో వచ్చింది. ఇంతదూరం ఒంటరిగా ఎలా రాగలిగిందో ఆశ్చర్యమే.

నేను అతి తక్కువలో కర్మ ముగించాను. కాని నదిలో అస్థికలు కలపడానికి పడవ ఎక్కాలి. సాధారణంగా ఇందుకోసం పడవవాడు వంద రూపాయలు తీసుకుంటాడు. నేను ఎంత చెప్పినా వాడు నా మాట వినడు. మీరు ఒప్పుకుంటే ఆమెను మనతో పాటుగా అదే పడవలో తీసుకెళ్ళి ఆమె భర్త అస్థికలను కూడా.." అంటూ ఆమె కథను టూకీగా వివరించాడు.

"అయ్యో! తప్పకుండా రమ్మనండి...."

అప్పుడే గోదావరిలో స్నానం చేసిన తడిబట్టలతో, నీరుకారుతున్న జుత్తుతో, జీవమంతా కళ్ళలో మాత్రమే మిగిలి ఉన్న ఆ ముదుసలి ఆకులు రాలిన వృక్షంలా అనిపించింది. వణికే చేతుల్తో పట్టుకుని ఉన్న ఆ ఇత్తడి పాత్ర ఆమె తన సర్వస్వంగా పట్టుకున్నది.

పురోహితుని కేక విని లేచి నిలబడే ప్రయత్నం చేసింది. ఆమెను పడవ వైపు రమ్మని చేత్తో సూచించాడు. అందరూ పడవ వైపు నడిచారు. పురోహితుని సాయంతో వృద్ధురాలు, సూర్యం పడవ ఎక్కారు.

పడవ తీరం నుండి దూరంగా సాగుతున్నది. పురోహితుని మంత్రాలమధ్య పడవవాడు వేసే తెడ్డుతో పడవ గోదావరి మధ్యకు చేరింది. ఆ వృద్ధురాలి చూపు పాత్రలో ఉన్న ఆమె భర్త అస్థికలు, చితాభస్మంపై ఉంది. ఆమె ఆ పాత్రను పట్టుకున్న తీరు చూస్తే గుండెలకు హత్తుకున్నట్లనిపిస్తుంది. ఆ పాత్రను తన శరీరం అంతటితో స్పర్శించాలన్న భావన చెప్పకనే చెపుతున్నది.

కుమార్ గారి చితాభస్మాన్ని సూర్యం మొదట గోదావరిలో కలిపాడు. ఆ తరుపరి పురోహితుడు వృద్ధురాలిని ముందుకు తీసుకువెళ్ళి ఆమె తెచ్చిన పాత్రలోని చితాభస్మాన్ని, అస్థికలను మంత్రాల మధ్య గోదావరి జలాలలో నిమజ్జనం చేయించాడు.

"ఇంతటితో ఈ నిమజ్జన కర్మ ముగిసింది" అని పురోహితుడు ఈ ఇద్దరిని చూసి అన్నాడు. పడవ వాడివైపు తిరిగి "ఒడ్డు చేర్చవోయ్" అన్నాడు.

తిరిగి వస్తున్న పడవలో నిశ్శబ్దం. గోదావరి మీద గాలివీస్తున్నది. పడవ నడిపేవాడూ తెడ్డువేస్తున్నాడు. తెడ్డు గోదావరి నీటిని తాకే సమయంలో మాత్రమే శబ్దం స్పష్టంగా వినపడుతున్నది. ఆమె ఎలాంటి కదలిక లేకుండా నిశ్శబ్దంగా ఉంది. ఆమెలో ముఖంలో ఒక సంతృప్తి భావన కనిపిస్తోంది.

"పిల్లలు లేరని మీరు విచారించకండి. అమెరికాలో పిల్లలు, భార్య, డబ్బు ఉన్న, ఒకాయన చితాభస్మాన్ని నిమజ్జనం చెయ్యడానికి అక్కడినుండి ఈ సూర్యంగారు వచ్చారు" అని పురోహితుడు సూర్యం గురిచి చెపుతూ ఆమెని ఊరడించే ప్రయత్నం చేస్తున్నాడు.

మనిషి చనిపోయిన తరువాత – ఆ కుటుంబ వ్యక్తులు ఆ మనిషి చితాభస్మానికి ఎంత గౌరవం ఇస్తారు? ఆ మనిషి ఆత్మకి, అస్థికలకి చెయ్యవల్సిన అపరకర్మకి ఎంత ప్రాధాన్యం ఇస్తారు?

పుణ్యం, స్వర్గ నరకాల మీద నమ్మకం ఉన్నా లేక పోయినా అప్పటిదాకా కలిసి మెలిసి తిరిగిన వ్యక్తి ఒక్కసారి మాయమయిపోయి చితాభస్మంగా మిగిలితే ఆ చితాభస్మం విలువేంటి? ఇలాంటి ప్రశ్నలతో సూర్యం మనసంతా గందరగోళంగా ఉంది. ***మరణించినవారి చివరికోర్కె తీర్చడం బతికి ఉన్న వాళ్ళ మొదటి విధికావడం ఒక్క మానవీయ అనుబంధం అవుతోంది.***

"అమ్మా! మీ ఆయన షోడశకర్మని చక్కగా చేయించారు" అని సూర్యాన్ని చూపిస్తూ "ఈయన దయవల్ల గోదావరీ నిమజ్జనం కూడా నిర్విఘ్నంగా అయ్యింది. మీ భర్త ఆత్మ శాంతిస్తుంది, స్వర్గం పొందుతారు. ఇక మీరు ప్రశాంతంగా ఉండండి" అన్నాడు.

పడవ తీరం వైపు నెమ్మదిగా సాగుతున్నది. పురోహితుడు మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇన్నేళ్ళ నా అనుభవంలో ఎంతోమందిని చూశాను. మనిషి పుట్టుక నుండి పోయేదాకా జరగవలసిన పదిహేను కర్మలు, ఆ తరువాతది ఆఖరిది అయిన ఈ షోడశకర్మతో సహ ఎన్నో కార్యక్రమాలు చేయించాను. కానీ మీవంటివారిని ఇప్పటిదాకా చూడలేదు. మిమ్మల్ని కలవడం నా భాగ్యం. మనిషి చనిపోయినా ఆత్మ ఉంటుందని అది వినాశనం పొందదని, దానిని ప్రేమించగలరని, దానితో స్నేహం చెయ్యగలమని నమ్మిన మీ ఇద్దరూ ధర్మశాస్త్రాలను ఆచరించి అనుసరణీయులైనారు" అని నమస్కారం చేశాడు ఇద్దరికి.

ఆమె తల ఎత్తి సూర్యం కళ్ళల్లోకి చూసింది. సూర్యం ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమన్నది.

ఆమె వంగి అతనికి నమస్కరించబోయింది. అతను ఆమెను తన రెండు చేతలతో పట్టుకుని వారించాడు ఆమె శరీర ప్రకంపనలు అతని చేతులద్వారా అతని శరీరంలో ప్రవహించాయి.

ఎన్నడూ కలగని ఒక వింత ప్రవాహం ఒళ్ళంతా ప్రాకింది. అది హృదయాన్ని తాకింది. ఒక ఆత్మీయ బంధాన్ని నాటింది. రెండు కన్నీటి చుక్కలు అతని చేతులమీద పడ్డాయి. అతను చలించిపోయాడు. ఆమెను మరింత దగ్గరగా తీసుకొన్నాడు.

సూర్యం పడవ మధ్యలో ఉన్న బల్లపై కూర్చుంటూ ఆమెని అతి జాగ్రత్తగా పట్టుకుని తన పక్క కూర్చొనేలా చెయ్యడానికి ఎంతగానో ప్రయత్నించాడు కానీ ఆమె అతడి ఒళ్ళో వాలిపోయింది.

పడవ తీరంవైపు నడుస్తున్నది. పురోహితుడు, అతడినీ, ఆమెనీ చూస్తూ అవాక్కయ్యాడు.

ఆ నలుగురూ పరిసరాలని మరిచిపోయారు. ఆ నలుగురు నాలుగు పాయలుగా విడిపోయి మళ్ళీ కలిసి ప్రవహిస్తున్న ఓ నదిలా, గోదావరిపై సాగుతున్నారు.

పురోహితుని కళ్ళు చెమ్మగిల్లాయి. పడవ నడిపేవాడి కళ్ళు చెమ్మగిల్లాయి. తెడ్డు చెమ్మగిలింది. పడవ చెమ్మగిల్లింది. చెమ్మగిల్లిన పడవ మెల్లమెల్లగా తీరం చేరింది. తీరం చెమ్మగిల్లింది. ✷✷✷




**నవంబర్ ౨౦౦౯**

**కథాసాగర** మథనంలో విశ్లేషకుణ నవంబరు నెల, స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వారపత్రికలు, స్వాతి, ఆంధ్రభూమి, రచన, ఆంధ్రప్రదేశ్, విపుల, చిత్ర మాసపత్రికలు, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలతో ప్రచురితమైన మొత్తం 92 కథలను విశ్లేషించటం జరిగింది. వీటిలోంచి పాఠకుల పరిచయం కోసం ఎంచుకున్న కథలివి.

ఎప్పటిలాగే ఈ నెల కొన్ని 'మూస' కథలు, కొన్ని మామూలు కథలు వచ్చాయి. కానీ ఈ నెల పరిచయానికి ఎన్నుకున్న కథల సంఖ్య మామూలు కన్నా ఎక్కువే. ఎందుకంటే, ఈ నెల కథలలో అధికశాతం మానవత్వానికి పెద్ద పీట వేశాయి. అలవాటయిన కథలు కూడా మానవత్వానికి పెద్ద పీట వేయటంతో, మామూలుకన్నా ప్రత్యేకంగా అలరారాయి.

***క్షమించి చూడు:***

కె.కె భాగ్యశ్రీ రచించిన ఈ కథ విపులలో ప్రచురితమయింది. కథ మనకు అలవాటయిన అంశంలాగే ఉన్న ముగింపు బాగుంటుంది. ఇలాంటి కథనే కొద్ది నెలల క్రితం రచనలో చదివిన గుర్తు. దాన్లో ఓ అమ్మాయి తన కొడుకుని స్నేహితురాలికి ఇచ్చి వెళ్ళిపోతుంది. కొన్నేళ్ళ తరువాత తిరిగి వచ్చి కొడుకు కావాలంటుంది. కొడుకు సాంప్రదాయ బుద్ధుడిగా పెరుగుతాడు. ఈ కథలో కొడుకు గర్భంలో ఉండగా భర్త చనిపోవడంతో, కొడుకుని తలిదండ్రుల దగ్గర వదిలి విదేశాలకు వెళ్ళిపోతుంది వైశాలి. రెండవ భర్తతో పుట్టిన కొడుకు మరణిస్తాడు. దాంతో మొదటి కొడుకు కావాలంటుంది ఇపుడు. కానీ ఆ అబ్బాయి 'నేను కావాలంటే ఇక్కడికే రమ్మనమంటాడు'. అయితే, ఆమెని ఇక్కడికి రమ్మనటం బాగుంది కానీ, ఆమె భర్త బ్రతికుండగా ఆయన అభిప్రాయమేమిటో అన్న ప్రసక్తి రాదు. దాంతో వాదన బాగున్నా, 'ఆయన ఎదురుచూస్తున్నారు' అన్న సంభాషణతో ఆమె భర్త ప్రసక్తి వచ్చినా ఆయన అభిప్రాయాన్ని పరిగణకు తీసుకోకపోవటం కథను బలహీనపరుస్తుంది.

***సర్దుబాటు***

సాయి బ్రహ్మానందం గొర్తి రచించిన ఈ కథ విపులలో ప్రచురితమయింది. ఈ కథ విడాకులకు సంబంధించినదే అయినా అలవాటయిన రీతిలో పురుషుడు కాక స్త్రీ స్వాతంత్ర్యము, పిల్లల పెంపకం, కుటుంబ విలువలు అంటూ కథలు రాసే మహిళను విడాకులను దోషిగా చూపటం ఈ కథ ప్రత్యేకత.

***ఇట్లు...మీ...నేను***

రచన మాసపత్రికలో ప్రచురితమయిన ఈ కథను రచించింది 'అనాసపురపు కళ్యాణి' - ఈ కథ దాంపత్య సంబంధాలలోని అసంతృప్తిని మహిళ దృక్కోణంలో ప్రదర్శిస్తుంది. అయితే ఈ కథలో ద్వేషం కనబడదు. తన జీవితానికో అర్ధం కల్పించుకోవాలన్న

తపనతో నిర్లిప్తతను, నిరాశను జయించి, సరైన రీతిలో జీవితానికి అర్థం కలిపించుకున్న మహిళ కథ ఇది. కథ ఆరంభంలో 'మూస' కథ, 'ద్వేష' కథేమో అనిపిస్తుంది. కానీ రాను రాను నాయక పాత్ర ఉద్యోగం చేస్తూ, తన ఖర్చులకు తాను సరిపడా సంపాదిస్తూ, ఆత్మగౌరవాన్ని నిలుపుకుంటుంది. చక్కని కథ ఇది. తాళి తెంపిపారెయ్, భర్త నొదిలెయ్ అని చెప్పే కథల నడుమ తనకున్న పరిధి దాటకుండానే వ్యక్తిత్వాన్ని నిలుపుకోవచ్చని నిరూపిస్తుందీ మంచికథ.

*కంచి గరుడ సేవకులు*

రచనలు చేస్తున్నవారు, ముఖ్యంగా అన్నీ తిరిగొచ్చి రచనలు చేస్తున్నవారి మనస్తత్వాన్ని, ఆలోచనారీతిని చక్కగా ప్రదర్శిస్తుందీ కథ. రచన మాసపత్రికలో ప్రచురితమయిన ఈ కథను రాసింది వసుంధర. ఇందులో ప్రధాన పాత్రకు రచయిత అవ్వాలని ఉంటుంది. తన రచనని విశ్లేషించుకోకుండా, అది ప్రచురితం కాకపోవటానికి రకరకాల కారణాలు వెతుకుతాడు. ప్రచురితమవుతున్న రచయితల గురించి అనేక అపోహలు పెంచుకుంటాడు. తన రచన ప్రచురితమవటం కోసం అడ్డదారులు తొక్కేందుకు సిద్ధమవుతాడు. పాతవాళ్ళు పాతుకుపోయి కొత్తవాళ్ళని పైకి రానివ్వటం లేదని బాధపడతాడు. కానీ రచయితకు ఉండాల్సింది ప్రతిభ, రచనకు ఉండాల్సింది నాణ్యత. ఇవి తప్ప మరేమీ అవసరంలేదని చివరలో అర్థం చేసుకుంటాడు. 'ఇంతకాలం గురువు తప్పుకుంటేనే నా ప్రతిభ రాణిస్తుందనుకున్నాను. ప్రతిభ రాణిస్తే గురువే తప్పుకోక తప్పద'ని గ్రహించటంతో కథ పూర్తవుతుంది. మంచి ఆలోచనను చక్కగా ప్రదర్శిస్తుందీ కథ.

*మైండ్ సెట్*

డా.కొఠారి వాణి చలపతిరావు రచించిన ఈ కథ నవంబర్ 26, ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురిత మయింది. ఇది ఇద్దరు స్నేహితురాళ్ళ కథ. కథలో ప్రధాన పాత్ర భవానికి, కావేరి అనే మంచి ఫ్రెండ్ ఉంటుంది. భవాని దృష్టిలో కావేరి గొప్పమనిషి. అటువంటిది కొన్నేళ్ళ తరువాత కలసిన కావేరిలో స్వార్థం ప్రవేశించటం చూసి జీర్ణించుకోలేకపోతుంది భవాని. పిల్లలకు తల్లి తండ్రులను చూసుకోవాలని పదే పదే చెపుతుంటే, ఉండలేక, 'పిల్లల నుంచి ప్రతిఫలం ఆశించటం అంగీకరించలే'ను అంటుంది. దానికి సమాధానంగా కావేరి, 'మానవ సంబంధాలు తగ్గిపోతున్న ప్రపంచంలో గిరిగీసుకుని నేను నాది అని మాత్రమే ఆలోచించకుండా, అత్తగారిని పెద్దలను చూసుకునేందుకు ఇప్పటి నుంచే వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నాన'ంటుంది. ఈ కథ కూడా మామూలు కథలకు భిన్నంగా, రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోతారన్న ఆలోచన కాకుండా, పిల్లలకు బాధ్యత, సంబంధాలు నిలుపుకోవటం వంటి విషయాలు బోధించాలని చెపుతుంది.

*బొమ్మలాట*

సరసి రచించిన ఈ కథ నవంబర్ 4 'నవ్య'లో ప్రచురితమయింది. ఈ కథ మొదట కొంత చదవగానే ముగింపు ఊహకు అందుతుంది. కానీ అనుకున్న రీతిలోనే కథ ముగిసినా అదోరకమైన ఆనందం కలుగుతుంది. మానవత్వమన్నది మృగ్యమైపోతున్న తరుణంలో మానవత్వాన్ని ప్రదర్శించే ఏ కథ అయినా మనసుకు ఆనందం కలిగిస్తుంది. కళ్యాణ మహోత్సవాల సందర్భంగా తోలుబొమ్మలాట వారొస్తారు. వారిలో ఓ పిల్ల తల్లి ఉంటుంది. పిల్ల పాల కోసం ఏడుస్తుంటుంది. తల్లి దగ్గర పాలుండవు. అప్పుడే ప్రసవించిన వసుధ పిల్లకు పాలిస్తుంది. అలా పెద్దింటి వసుధకు తోలుబొమ్మలాట పిల్ల దగ్గరవుతుంది. చివరికి ఒకరోజు రాత్రి పిల్లను వసుధ దగ్గర వదిలి వెళ్ళిపోతుందామె. దాంతో ఆరంభంలో కోపం వచ్చినా చివరికి ఆమెలో మానవత్వమే గెలుస్తుంది. 'ప్రతి తల్లికీ ఏకకాలంలో ఇద్దరు బిడ్డలకి పాలిచ్చే రీతిలిచ్చాడు దేవుడు. (ఈ వాక్యం సరిగ్గాలేదు) ఒకటి తన బిడ్డకి, రెండోది తల్లి పాలకి నోచుకోని పరాయి బిడ్డకి ఆ వరాన్ని ఎందుకు కాదనుకోవాలి?' ఇదీ కథ. మంచి కథ.

వెన్నెల

ఓ.శాంతిశ్రీ రచించినఈ కథ విపులలో ప్రచురితమయింది. ఇది కూడా పై కథలాగే ముగింపు ఊహకు ముందే అందినా కథలో ప్రధాన పాత్ర ప్రదర్శించే మానవత్వం కథవిలువ పెంచుతుంది. ఈ కథలో ప్రధాన పాత్రకు పక్కింట్లోని ఆరేళ్ళ పాప వెన్నెల పరిచయమవుతుంది. వెన్నెల తల్లిదండ్రులు ప్రమాదంలో మరణిస్తారు. ఆమె అమ్మమ్మ దగ్గర పెరుగుతుంటుంది. తన తరువాత పిల్ల అనాధ శరణాలయానికి వెళ్ళాల్సివస్తుందని అమ్మమ్మ బాధపడుతుంది. మరణిస్తుంది. దాంతో వెన్నెల బాధ్యతను ప్రధాన పాత్ర స్వీకరిస్తుంది. మంచి కథ ఇది. నిజానికి సమాజానికి ఇలాంటి కథల అవసరం ఎంతో ఉంది. ఉద్యమాలు, ఆవేశాలు, విద్వేషాలు హింసల మురికి తుఫానులో సమాజం ద్వేషమయమైపోతోంది. అలాంటి విద్వేషాల్ని మరింత పెంచే కథలు రాసేకన్నా కథకులు కాస్తయినా మానవత్వాన్ని బోధించే మంచి కథలు రాయలి. ఇదొక ఉద్యమంలా కొనసాగాలి. అపుడు కానీ మళ్ళీ మన కథలు మళ్ళీ పాఠకులు మెప్పు పొందవు.

మనీషి

పాలగుమ్మి రామకృష్ణారావు రచించిన ఈ కథ ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో ప్రచురితమయింది విదేశాల్లో స్థిరపడ్డ రామరాజు, స్వదేశంలో ఉన పొలాలమ్మి, తల్లిని, తండ్రిని తీసుకుని వెళ్ళిపోవాలనుకుంటాడు. కానీ తండ్రి పొలం అమ్మటానికి ఇష్టపడడు. అందరూ అందలం ఎక్కితే మోసేవాడేవడన్నట్టు, అందరూ కంప్యూటర్ ఇంజనీర్లయితే, వారికి తిండిగింజలు పండించేదెవరు? అని ప్రశ్నిస్తాడు. అంతేకాదు 'మనం ఈ పొలం అమ్మిన రోజున దీని రూపం మారిపోతుంది. ఇప్పటికీ, నా కళ్ళముందే బంగారు పంటలు పండే భూమి ఎన్నో ఎకరాలు మేడలు, షాపులు, ఫాక్టరీలు, వర్క్‌షాపులుగా మారిపోయాయి. అలా మార్చిన వాళ్ళు కోట్లు సంపాదించి ఉండవచ్చుగానీ గుప్పెడు తిండి గింజలు కొనలేని పేదరికంతో ఆకలితో అలమటించే అన్నార్తులు రూపం మారిన ప్రతి గజం నేలకు ఒక్కరు చొప్పున పెరిగారు' అంటాడు. చక్కని వాదన. మంచి ఆలోచన. తమ పొలం అమ్ముకుని, ఆ తరువాత దానికి నేరం ప్రభుత్వంపై, ఇతరులపై నెట్టి ఆవేశాలకు లోనయి, హింస ప్రదర్శనను సమర్ధించే పొలిటికల్లీ కరెక్ట్ కథల మధ్య శీతల పవనంలా చల్లగా, హాయిగా అనిపిస్తుందీ కథ. తమ భూములు అమ్ముకుని, వాటిని కొనుక్కుని ఇళ్ళు కట్టుకున్నవారిని తమను దోచుకున 'సెట్లర్స్' అని దూషించి విద్వేషాలను పెంచుతామంటున్న తరుణంలో సమస్యను లోతుకు వెళ్ళి ఇంత సరళంగా స్పష్టంగా ప్రదర్శించిన రచయితకి అభినందనలు.

యత్ర నార్యస్తు పూజ్యంతే

పసుపులేటి తాతారావు రచించిన ఈ కథ స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. ఈ నెల కథ ఇది. కథ మామూలుదే కానీ ఈ కథలో తండ్రి పాత్ర ప్రదర్శించిన ఉత్తమ వ్యక్తిత్వం, ఉన్నతమైన ఆలోచనలు ఈ కథ విలువను పెంచుతాయి. చెప్పుడు మాటలు విని, మామగారు ఓల్డేజ్ హోమ్‌కు వెళ్ళేట్టు చేస్తుంది శ్రీలత. ఆమె భర్త ఆమెని ఏమీ అనడు. ప్రేమగానే చూసుకుంటుంటాడు. సంతానం వద్దన్న భర్తను ఒప్పించేందుకు మళ్ళీ మామగారిని ఆశ్రయిస్తుంది శ్రీలత. ఆయన వచ్చి కొడుక్కి నచ్చ చెప్పి మళ్ళీ వెళ్ళిపోతాడు. ఇంట్లో ఉండిపొమ్మని బ్రతిమిలాడితే మనవడు పుట్టాక వస్తానంటాడు. అప్పుడు, శ్రీలతకి, ఏదిఏమైనా తన భర్త తనని ప్రేమగా చూసుకోవటం వెనుక ఉన్న కారణం తెలుస్తుంది. అన్నిటికనా ఘోరమైన ప్రసవవేదన బాధనుంచి స్త్రీ తప్పిస్తుంది. అందుచేత ఆమెని దేవతలు ఏ కష్టమూ కలగకుండా అపురూపంగా చూడాలని నాన్న బోధించారంటాడు ఆమె భర్త. స్త్రీలు పూజింపబడే చోట దేవతలు చరిస్తారన్న మనుశాస్త్ర ధర్మం వెనుక ఉన్న సూక్ష్మాన్ని సున్నితంగా బోధిస్తుందీ కథ. ప్రతి పురుషుడు తప్పని సరిగా అర్ధం చేసుకుని, ఆచరించి, తనలో సగభాగమైన స్త్రీకి సముచిత గౌరవం ఇవ్వటం ఆమె హక్కు అని తెలుసుకుంటే ప్రపంచం సుఖమయమవుతుంది.ఇది కాని పని అని తెలిసినా, అసంభవాన్ని సంభవంగా ఊహిస్తుండటం ద్వారా ఏదో ఒకరోజు అది నిజమవుతుంది. అలా అసంభవం సంభవమయేందుకు బీజాన్ని నాటటం సృజనాత్మక రచయిత పని. అందుకే ఈ కథను ఈ నెల కథలో ఉతమ కథగా నిర్ణయించాను. గమనిస్తే, ఈ కథలో

అన్ని పాత్రలూ మంచివే. కథకులు చెడును కాదు, మంచిని ప్రచారం చేయాలనే ఉత్తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ మంచి ఆలోచనను ప్రకటించిన రచయితకు అభినందనలు. కథ చదవండి.

*ఈనెల కథ*

యత్ర నార్యస్తు పూజ్యంతే - పసుపులేటి తాతారావు

నవంబర్ స్వాతి మాసపత్రిక ౨౦౦౨ సంచిక నుంచి

"దేవుడు ఈ భూమ్మీద మనుషుల్నే సృష్టించాడు. మానవత్వాన్ని కాదు, మానవత్వాన్ని కనిపెట్టింది మనిషే, మనసున్న మనిషి దేవుడికన్నా గొప్పవాడు" ఆ మాటే మరెవరైనా చెప్పి ఉంటే ఎంత గొప్ప సూక్తో కదా అనుకునేది శ్రీలత!

కానీ అది మామగారి నోటివెంట వెలువడింది. అందుకే ఆమె చెవుల దగ్గరే ఆగిపోయిందది. ఏవో మాటల సందర్భంలో తన భర్తతో అంటుండగా వంటింట్లోంచి విన్నది. అప్రయత్నంగా ఆమె మూతి మూడు వంకర్లు తిరిగింది. పనీపాటాలేని వాడికి కబుర్లకి కొదవేముంటుందిలే? అని విరుపులకి అర్థం.

భర్త వివేక్ తన మాట జవదాటడని తెలుసు శ్రీలతకి. తాను ఎంత చెపితే అంత. తన మాటే వేదం అతనికి. ఎప్పుడైనా 'కాస్త తలనొప్పిగా ఉందండీ' అని అంటే చాలు, సెలవురోజు అని కానీ, షాపులు తెరిచి ఉండవనికానీ ఆలోచించకుండా ఊరంతా తిరిగి అమృతాంజనమో, విక్సో, ఏదో ఒకటి సంపాదించి తెస్తాడు.

'ఎందుకండీ ఊరంతా తిరగడం? దగ్గర్లో లేకపోతే వెనక్కి వచ్చేయలేకపోయారా?' అంటే అందుకతను ససేమిరా ఒప్పుకోడు. 'అమ్మమ్మ. ఎంత మాట. నా ముద్దుల రాణి తలనొప్పితో బాధపడుతుంటే చూసి ఊరుకోడమా? ఊళ్ళో ఎక్కడా దొరక్కపోతే సప్తసముద్రాలకవతల ద్వీపాంతరాల్లో గాలించైనా నీక్కావలసింది తేవడం నా బాధ్యత' అంటాడు. ఆ ద్వీపాల్లో చెట్ల బెరళ్ళకి అమృతాంజనం స్రవిస్తున్నట్టు.

అతిశయోక్తి మాట ఎలా ఉన్నా ఎంతో మురిసిపోతుంది ఆ మాటలకి. వెంటనే బెడ్ రూములోకి వెళ్ళి నిలువుటద్దం ముందు నిలబడి తన రూపాన్ని చూసుకుంటుంది. అప్పుడనిపిస్తుందామెకి. నిజమే. తనది అపూర్వమైన అందమే, నిజంగానే తను రాణి. తన కోసం అతను సప్తసముద్రాలేం ఖర్మ, పాతాళ కుహరంలోకి దిగి అయినా కోరింది తెస్తాడు. తేవాలి.

తనకింతటి సౌందర్యాన్నిచ్చిన దేవుడికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది. దేవుడు స్త్రీపక్షపాతి. సౌందర్యాన్నీ, సౌకుమార్యాన్నీ స్త్రీకి స్వంతం చేశాడు. స్త్రీ తన సౌందర్యాన్ని ఆయుధంగా చేసి యుద్ధం చేస్తే ఓడిపోని యోధుడంటూ ఈ భూమ్మీద ఉండడు. చరిత్ర నిరూపించిన సత్యమిది.

'ఎందుకండీ నేనంటే మీకంత ప్రేమ?' అని అడుగుతుంది అప్పుడప్పుడూ. తన సౌందర్యాతిశయాన్ని అతని నోటినుంచే వినాలని ఆమె ఆశ.

అయితే అతను నవ్వేసి 'మా నాన్న నాకు చిన్నప్పటి నుంచీ ఒక మాట చెపుతుండేవాడు. ఆ మాట ప్రభావమే నిన్నంతగా ప్రేమించేలా చేస్తోందేమో' అంటుంటాడు. దాంతో ఆమె చాలా నిరాశ పడిపోతుంది. అతను తనవైపు ఆరాధనగా చూస్తూ నీలాంటి అతిలోక సుందరి భార్యగా దొరికితే ప్రేమించని మూర్ఖుడెవడుంటాడు? అంటాడేమోనని ఆశ. అదెప్పుడూ నెరవేరలేదు.

అయితే మీ నాన్నగారు చెప్పిన ఆ మంచి మాట ఏమిటని కూడా ఆమె ఎప్పుడూ అడగలేదు. మానవత్వం, మట్టిగడ్డలంటూ ఎప్పుడూ ఏదో ఒక సూక్తి చెప్పడం ఆయనగారికి అలవాటేగా. అలాంటిదే ఏదో చెప్పి ఉంటారులే అని ఊరుకుంటుంది.

భర్త అనురాగానికి నోచుకున్న ఆమె సంసార జీవితంలో ఏ కొరతా లేదని కాదు. మధురంగా ఉండే ఏ ఫలంలో అయినా చేదుని కలిగించే విత్తనాలున్నట్టే ఆమె సంసార జీవితంలో ఓ బాధ లేకపోలేదు.

అది ఆమె మామగారే. మామగారి పొడ అస్సలు గిట్టదామెకి. నున్నని పాలబుగ్గ మీద అవాంఛితరోమంలా, తెల్లని పాలరాతి గోడమీద నల్లబల్లిలా... మధురాతి మధురమైన తన సంసార జీవితంలోకి ఆహ్వానం లేని అతిథిలా వచ్చిపడ్డారాయన. స్కూల్ మాస్టారుగా పనిచేసి పోయినేడాదే రిటైర్ అయ్యారు. ఆమె అత్తగారు బతికి ఉన్నంత వరకూ ఆయన తన సొంత ఇంట్లోనే ఉన్నారు. నాలుగు నెలల క్రితం ఆమె కాలం చేయడంతో ఇంటిని అద్దెకిచ్చేసి తమ మధ్యకి వచ్చిపడ్డారు.

వచ్చినాయన కుదురుగా ఉన్నారా అంటే అదీ లేదు. ఎంతో శుభ్రంగా తుడుచుకున్న వసారాలో పీట వేసుకుని, దానిమీద చిన్న అద్దం ఉంచి బాసీపటం వేసుకుని తీరిగ్గా గెడ్డం చేసుకుంటారు. అందువల్ల అక్కడ పడిన వెంట్రుకల్ని మళ్ళీ ఇంకోసారి తుడిచి శుభ్రం చేయాల్సి వస్తోంది, స్నానం చేశాకా మిగిలిన నీళ్ళు బకెట్‌లో అలాగే వదిలేస్తారు. తాను వెళ్ళివాటిని ఒంపి రావాల్సి వస్తుంది. బాత్ రూముగోడల మీద తూలిన సబ్బునురగల్ని అలాగే వదిలేసి రావడం చిరాకు శ్రీలతకి.

దానికి తోడు పొద్దస్తమానూ శాస్త్రీయ సంగీతంలో కూనిరాగం ఒకటి. అలా తనకి ఇష్టం లేనివెన్నో చికాకులు ఆమెకి ఎదురు పడుతుంటాయి. వాటన్నిటినీ భరించాలంటే చాలా కష్టంగా ఉంటోందామెకి.

అప్పటివరకూ ఎంతో సంతోషంగా సాగిన తమ సంసార ప్రణయసుఖయాత్రకి అనుకోని అవాంతరం తగిలినట్టుగా ఆమె భావించింది.

'అమ్మలేని ఆ ఇంట్లో నువ్వు ఒక్కడివే ఏం చేస్తావు నాన్నా, మాతోనే ఉందువుగాని వచ్చేయ్' అంటూ తనతో కనీసం ఒక్కమాటైనా సంప్రతించకుండా భర్త ఆయన్ని తమ ఇంటికి ఆహ్వానించడం ఆమెకి మింగుడు పడని విషయమైంది. అదే ఆమె భర్తవల్ల కలిగిన మొదటి కష్టం. మొదటి కష్టమేమిటి? ఆ మాటకొస్తే ఒకే ఒక్క కష్టం పెళ్ళయిన ఇన్నాళ్ళలో.

అది గుర్తొచ్చినప్పుడల్లా ఆమె మనసు కలుక్కుమంటుంది. ఒకవేళ పక్కింటి పంకజాక్షి చెప్పినట్టు తన భర్తది కేవలం నటనేనా? ప్రేమ కాదా? అన్న అనుమానం కూడా అప్పుడప్పుడూ ఆమె బుర్రలో ప్రవేశించి కుమ్మరి పురుగులా దొలుస్తూ ఉంటుంది.

ఒకరోజు చింతపండు కోసం వచ్చిన పంకజాక్షి అన్నది. 'నువ్వనుకున్నట్టు మీ ఆయనదంతా ప్రేమ అని నమ్ముతున్నావా? ఈ మగాళ్ళు పైకి ప్రేమ చూపిస్తారేకానీ మనసులో నిజంగా ప్రేముండదు. ముఖ్యంగా భార్యల మీద అస్సలుండదు. తమ పబ్బం గడుపుకోడానికి తీయతీయని మాటలు కలకండలో ముంచి తీసినట్టుగా వల్లెవేస్తారంతే. లేకపోతే నీ అంతటి సౌందర్యవతికి అతనిచ్చే గౌరవం అదేనా? కనీసం ఒక్క మాటయినా చెప్పకుండా తండ్రిని తెచ్చి ఇంట్లో పెడతాడా? ఏం ఒక్కమాట నీతో చెపితే నువ్వేమయినా కాదంటావా ఏమన్నానా?' అన్నది అగ్గి రాజేస్తూ.

అవును. నిజమే. తననడిగితే కాదని ఎందుకంటుంది? అయితే, అతని దృష్టిలో తనకసలు విలువేలేదా? భర్త చెప్పే తీయని మాటలన్నీ ఒట్టొట్టి మాటలేనా? తనని ఉబ్బేయడానికి పలికే పంచదార పలుకులేనా? శ్రీలత మనసు కలత చెందింది.

ఆ కలత ఎంతకాలం అలా కొనసాగేదో తెలీదుకానీ ఆ రాత్రి ఆమె అలగడంతో అదికాస్తా మాయమయ్యింది. అలిగి ముభావంగా పడుకుంటే భర్త విపరీతంగా కంగారుపడిపోయాడు. పదే పదే కారణాలు అడిగాడు. అతని బాధ పడలేక కాళ్ళు నొప్పులుగా ఉన్నాయి అందుకే పడుకున్నానంది.

ఆ ఒక్క మాటకే అతను ఆ రాత్రంతా నిద్రమానుకున్నాడు. తెల్లవార్లూ తన కాళ్ళు, వేళ్ళూ ఒత్తుతూ మర్దనా చేస్తూ కూర్చున్నాడు.

నిద్రపోయినట్టు నటించినా అతనాపని మానలేదు. శ్రీలతకి భర్త అవస్థ చూసి జాలివేసింది. పెళ్ళాం ఎంత కుందనపు బొమ్మయితే మాత్రం ఆమెకి ఇంతలా దాసోహమనాలా? అనుకుంది.

'తగ్గిపోయింది. ఇకపడుకోండి' అని ఎంత చెప్పినా అతను వినలేదు. తెలతెలవారుతుండగా ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు. మళ్ళీ ఉదయానే లేచి ఆఫీసుకి బయలుదేరాడు. బొత్తిగా రెండుగంటల కోడి కునుకు ఏం సరిపోతుంది? నిద్రలేమి వల్ల కలిగిన అలసట ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నా దాన్నతను ఖాతరు చేయనేలేదు. తనమీద ప్రేమలేకపోతే ఇదంతా ఎందుకు చేస్తాడు? అని ఆలోచించింది.

అదే ఆలోచనని మరునాడు ఉల్లిపాయలకోసం వచ్చిన పంకజాక్షితో పంచుకుంది. అది విని పంకజాక్షి వంకరగా నవ్వింది. 'దేవుడు నీకు అందమిచ్చాడు కానీ తెలివితేటలివ్వడం మరిచిపోయాడే పిల్లా. అందుకే అతను నీతో ఆటలాడుకుంటున్నాడు.

ఊరంతా తిరిగి అమృతాంజనం సీసా కొనివ్వడం, రాత్రంతా మేల్కొని కాళ్ళు పట్టుకోవడం ఇవేనటమ్మా ప్రేమకి కొలబద్దలు? బంగారం నిఖార్సయిందీ కానిదీ తెలుసుకోవాలంటే దానికి గీటు పెట్టాలి.

మీ మామగారిని వృద్ధాశ్రమంలో చేర్చమని చెప్పు. అప్పుడు తెలిసిపోతుంది బండారం. నీ మాట వింటే అతనికి నీ మీద ప్రేమ ఉన్నట్టు, లేకపోతే లేనట్టు.

అదే నిజమైన పరీక్ష. చిన్నా చితకా మురిపాలతో మాయచేస్తారే ఈ మగాళ్ళు పిచ్చి మొహమా. నేను చెప్పింది అడిగి పరీక్షించుకో మరి, నీ మొగుడి ప్రేమ ఏపాటిదో' అంటూ అగ్గిపుల్ల గీసి వెలిగించి వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు అప్పుగా తీసుకున్న ఉల్లిపాయలు కొంగున కట్టుకుని తీసుకెళ్ళడం మరచిపోలేదు.

ఆ రోజు రాత్రి భార్యాభర్తలిద్దరి మధ్య గొడవ రాజుకుంది. చివరికది కాళరాత్రిలా పరిణమించింది. ఆమె కోరిక వినగానే హతాశుడై చూశాడు వివేక్.

భార్య నుంచి అలాంటి కోరిక వస్తుందని అతను కలలో కూడా ఊహించలేదెప్పుడూ. అందుకే అతని చెక్కిళ్ళు కందగడ్డలా అయిపోయాయి.

"వీల్లేదు. ఆ మాట ఎప్పటికీ నేనాయనతో చెప్పలేను. అది అన్యాయం. నేనొప్పుకోను" అరిచినట్టే అన్నాడు. భర్త ముఖంలో ఎప్పుడూ అంతటి క్రోధాన్ని చూసి ఎరుగని శ్రీలత మొహం వెలవెలపోయింది.

తేలిపోయింది! భర్తకి తన మీద ప్రేమలేదు. చూపించేదంతా పైపైనటనే. సందేహమే లేదు. ఆ ఆలోచన రాగానే ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఇప్పటి వరకూ బంగారానికి గీటు పెట్టడానికే అలా అడగాలనుకుంది. కానీ ఇప్పుడు అదే ఆమె సంకల్పమైంది.

"ఎందుకు వీల్లేదు? అన్యాయం ఎలా అవుతుంది? నాకు మాత్రం సరదాలు, చప్పుళ్ళూ ఉండకూడదా? కొత్తగా పెళ్ళయినదాన్ని కదా? ఆయనయినా అర్థంచేసుకోవద్దా? ఇలా మనమధ్యకి పానకంలో పుడకలా వచ్చేయడమేనా? మీరయినా తీసుకొచ్చేముందు నాతో ఒక్కమాట అన్నారా? ఇది అన్యాయం కాదా?" అని అడిగింది కంఠస్వరానికి గాద్గదికతని జోడిస్తూ.

"ఆయన జన్మనిచ్చిన తండ్రి. నేను తప్ప మరెవ్వరూ లేరాయనికి. నా దగ్గరకు రావడం అన్యాయమెలా అవుతుంది? నా కన్నతండ్రిని మనింటికి తెచ్చుకోడానికి నాకు అడ్డా?" అని వివేక్ వాదన.

ఎప్పుడు గొడవ చల్లారిందో. ఎవరు రాజీపడ్డారో, ఎప్పుడు నిద్రపోయారో కానీ ఉదయం లేచేసరికి కూడా శ్రీలత శోకదేవతలా అరచేతిని గెడ్డానికి ఆనించుకుని కూర్చుంది. వివేక్ ముఖం కూడా ఎప్పటిలా కాకుండా కళతప్పి ఉంది. మౌనంగానే ఆఫీసుకెళ్ళాడు.

మధ్యాహ్నం భోజనం వడ్డించి మామగారిని పిలిచింది. ఆయన వచ్చి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఎప్పటిలాగే కూనిరాగాలు తీస్తూ కోడలి వంటకాల్ని రుచి చూస్తూ మెచ్చుకుంటూ భోంచేశారు. ముఖంలో ప్రసన్నత చెక్కుచెదరలేదు. ఆయన వాలకం చూస్తుంటే రాత్రి జరిగిన గొడవ గురించి ఇంకా తెలిసినట్టులేదు. శ్రీలత ముభావంగానే వడ్డించింది.

కాస్సేపు పడుకుని లేచాకా "నేను బయటికెళుతున్నాను తలుపేసుకోమ్మా" అని చెప్పి వెళ్ళిపోయారు. అదాయనకి సాయంత్రపు కాలినడక సమయం కాబట్టి అందుకే వెళుతున్నాడనుకుంది, అయితే ఆ వెళ్ళింది వెళ్ళడమే కానీ మళ్ళీ తిరిగి రాలేదాయన.

చీకటి పడేకొద్దీ ఆమెలో కంగారు అధికం కాసాగింది, భర్త ఆఫీసుకి ఫోన్ చేసి చెప్పింది.

"ఏమండీ, మామయ్యగారు వాకింగ్ కి వెళ్ళి ఇంకా రాలేదు. చాలా సేపయ్యింది"

అవతలివైపు నుంచి నిరసనగా కాస్సేపు నిశ్శబ్దం. తర్వాత "ఎందుకంత గాభరా పడతావు? ఆయనని ఇంట్లోంచి వెళ్ళగొట్టడం నీ పురెకి పుట్టిన బుద్దేకదా? అందుకే ఆఫీసులో ఒక పూట సెలవు పెట్టి వెళ్ళి నేనే ఆయన్ని వృద్ధాశ్రమంలో చేర్చాను. ఇప్పుడు సంతోషంగా ఉందా?" అని అడిగాడు వ్యంగ్యంగా.

ఆ మాటలు విని శ్రీలత స్వల్పంగా ఉలికిపాటుకి గురైంది. ఎందుకో కానీ ఆ వార్త ఆమెకి సంతోషాన్నివ్వలేదు. చేదు మింగిన అనుభూతికి లోనైంది. తప్పుచేశానా అని ప్రశ్నించుకుంది. అది ఆత్మ విమర్శో లేక భర్త ఇదివరకటిలా తన మీద అట్టే ప్రేమ చూపించడేమోనన్న భయమో ఆ పై వాడికే తెలియాలి.

అయితే ఆమె భయపడినట్టు అదేం జరగలేదు. ఎప్పటిలాగే భర్త తన మీద ప్రేమ కురిపించసాగాడు. కాలు కదిపితే ఎక్కడ కందిపోతుందో అన్నంత అపురూపంగా చూసుకోవడం ప్రారంభించాడు.

తండ్రిని ఇంట్లోంచి వెళ్ళగొట్టిన కోపం అనతి కాలంలోనే ఆవిరయిపోయింది. తన పట్ల ద్వేషం ఎంతమాత్రం కనిపించడం లేదతని ముఖంలో. అదంతా తన సౌందర్య శోభ ప్రభావమే అని గర్వపడింది.

"ఏమండీ. నా మీద మీకు కోపంగా ఉంది కదూ?" సందేహ నివృత్తికోసం అడిగిందొకసారి.

"కోపమా? నీ మీదా? అదెప్పుడైనా చూశావా నాలో? అలా ఎప్పటికీ జరగదు" అన్నాడు.

"ఎందుకండీ నేనంటే మీకంత ప్రేమ?" మళ్ళీ అడిగింది మురిపెంగా.

"చెప్పానుగా, మా నాన్న నాకు చిన్నప్పటినుంచీ ఒక మాట చెబుతుండేవాడని. ఆ మాట ప్రభావమే నేను నిన్నింతగా ప్రేమించేలా చేస్తోందనుకుంటాను"

తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. ఇంత సునాయాసంగా సమస్య పరిష్కారం అవుతుందని ఆమె ఊహించలేదు. పక్కింటి పంకజాక్షికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకుంది. ఇప్పుడు కూడా ఆ మాటేమిటని ఆమె అడగలేదు. అతను చెప్పలేదు.

మరునాడు పంకజాక్షి వచ్చింది "రెండరటికాయలుంటే ఇవ్వమ్మా" అంటూ. విషయం తెలుసుకుని శ్రీలత చేతిని పట్టుకుని కుదిపేసింది.

"నేను చెప్పలా? ఎంతటి మగధీరుడైనా నీ అందానికి దాసోహం అనాల్సిందేనని" అన్నది.

శ్రీలత కళ్ళు గర్వంతో మెరిశాయి. తానొక మహారాణినన్న భావం తొంగిచూసిందామె ముఖంలో.

"అన్నట్టు ఓ రెండొందలుంటే ఇవ్వమ్మా, వారంలో సర్దేస్తాను" అన్నది" పంకజాక్షి.

అది వినగానే శ్రీలత అప్రసన్నంగా మారింది.

"సారీ పిన్నిగారూ. నా దగ్గర డబ్బులుండవు. ఏం కొనాలన్నా ఆయన్ని అడిగి తీసుకోవాల్సిందే" అంటూ అబద్ధాన్ని చెప్పేసింది. పంకజాక్షి ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయింది. చేసిన సహాయానికి కృతజ్ఞత అయినా లేదని గొణుక్కుంటున్నట్టుంది మాడిపోయిన ఆమె ముఖం. ఆమె దృష్టిలో అది సాయమే మరి!

శ్రీలత, వివేక్‌ల అనురాగపూరిత సంసార రథయాత్ర కొంతకాలం పాటు ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా సాగింది. వారానికొక్కసారి వివేక్ వృద్ధాశ్రమానికి వెళ్ళి తండ్రిని చూసివస్తున్నాడు.

వివేక్‌కి మనసులో బాధగానే ఉంది. చెట్టంత కొడుకు ఉండి కూడా వృద్ధాశ్రమంలో గడపాల్సి వస్తోందే అన్న బాధ కొంచెమైనా తండ్రి ముఖంలో కనిపించకపోవడం ఎంతో ఆశ్చర్యంగా అనిపించిందతనికి. పైగా మరింత ఉత్సాహంగా ఉన్నట్టు కనిపిస్తున్నారు. తనమీద కానీ, తన భార్యమీద కానీ ఏరోజూ కించిత్తు ద్వేషం ఆయన ముఖంలో కనిపించలేదు. ఆయన వ్యక్తిత్వానికి మనసులోనే జోహార్లు తెలుపుకున్నాడు.

ఒకరోజు రాత్రి వివేక్ శ్రీలతని అల్లుకుపోతూ అలవాటు ప్రకారం తన చేతిని తలగడకిందకి పోనిచ్చి వెతుకుతుంటే శ్రీలత అతని చేతిని పట్టుకుని వారించింది. వివేక్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఇకమీద ఇది వద్దండీ" అన్నది.

వివేక్ ఆమెని వదిలి పెట్టి చివుకున లేచి కూర్చుని "ఏమిటి నువ్వనేది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నాకు బాబు కావాలి" అన్నది సిగ్గుతో.

"వద్దు. నాకిష్టం లేదు" అన్నాడు వివేక్ కంగారుగా.

శ్రీలత విస్తుపోయి చూస్తూ "అదేమిటండీ? ఎందుకు వద్దు? ఎందుకు ఇష్టం లేదు?" అని అడిగింది.

"ఇష్టంలేదని కాదు. కానీ.." అంటు నసిగాడు.

"ఊ. కానీ..? ఏమిటండీ?"

"నువ్వు ప్రసవ వేదన పడుతుంటే నేను భరించలేను. అసలా ఊహే నన్ను భయభ్రాంతుణ్ణి చేస్తోంది. నీకు కాలిలో చిన్న ముల్లు గుచ్చుకుంటేనే భరించలేను. అలాంటిది దారుణమైన పురిటి నొప్పులతో నువ్వు విలవిలలాడుతుంటే.. అమ్మో నేనొప్పుకోను. సారీ! ఇంకెప్పుడూ ఈ ప్రస్తావన నా దగ్గర తేవద్దు" అన్నాడు.

శ్రీలత మొహం వెలవెలబోయింది. చెప్పలేనంత అయోమయంలో పడిపోయింది. భర్త ఉద్దేశ్యమేమిటో అర్థంకాలేదామెకి. ప్రసవ వేదన అనేది ఎప్పటికయినా ఏ ఆడదానికయినా తప్పించుకోలేనిదే కదా. దానికి భయపడి ఎంతకాలం పిల్లలు లేకుండా ఉండగలం?

భర్తకి తనమీదున్న అమితమైన ప్రేమకి సంతోషించాలో, ఆ ప్రేమ కారణంగానే తమకి పిల్లలు వద్దంటున్నందుకు బాధపడాలో అర్థంకాలేదు.

భర్త ఎప్పటికీ ఒప్పుకోకపోయేసరికి ఏం చేయాలో పాలుపోలేదు శ్రీలతకి. పోనీ సిగ్గు విడిచి తల్లిదండ్రులతో చెప్పిద్దామా అంటే వివేక్ ఎవరిమాట వినడని ఆమెకి తెలుసు. అతనికి తన తండ్రి అంటేనే గురి. ఆయన మాట తప్ప మరెవ్వరి మాటనీ ఖాతరు చేయడు. కానీ ఆయనెలా పరిష్కరించగలరీ సమస్యని వృద్ధాశ్రమంలో ఉంటూ? తానే పట్టుబట్టి తరిమేసింది అక్కడికీ, ఇంక ఏం మొహం పెట్టుకుని ఆయన్ను అడగగలదు? చాలా చిత్రమైన సమస్యలో చిక్కుకుపోయింది. ఇంటికి పెద్దదిక్కు లేనిలోటు అప్పుడు తెలిసొచ్చిందామెకి.

ఐనా భార్యమీద ఎంత ప్రేమైతే మాత్రం? ఏకంగా పిల్లల్నే వద్దనుకుంటారా ఎవరైనా? అలా ప్రతీ భర్తా తన భార్యని అపురూపంగా చూసుకోవడం మొదలుపెడితే ఇంకలోకంలో పిల్లలెలా పుడతారు? ఈ ప్రపంచం ఏమై పోతుంది? ఒకవేళ తండ్రిని వృద్ధాశ్రమంలో చేర్పించమని కోరినందుకు భర్త తనకి విధిస్తున్న శిక్షకాదుకదా ఇది? అన్న సంశయం కూడా కలిగిందామెకి.

అదేం చిత్రమో కానీ ఏదైతే ససేమిరా వీల్లేదని నిరాకరించబడుతుందో దాని మీదకే మనసు పదే పదే పరుగులు తీయడం మానవ సహజం. రానురాను శ్రీలతకి పిల్లలమీద మక్కువ ఎక్కువ కాసాగింది. కానీ ఆ మక్కువ తీరే దిక్కు కానరాకపోవడంతో మనసు దుఃఖభాజనమవుతోంది. చివరికి గొడ్రాలుగా మిగిలిపోవలసి రాదుకదా అన్న భయం ఉచ్చులా మెడచుట్టూ బిగుసుకుంటున్న భావన కలుగుతోంది. ఈ విషయమై పోరాడ్డానికి తన అమోఘమైన సౌందర్యం ఏ విధంగానూ ఉపయోగపడటం లేదామెకి.

రోజులు గడుస్తున్నాయి. బయటికెళితే ఇరుగు పొరుగు వాళ్ళంతా తనని చూసి అపహాస్యం చేస్తున్నట్టుగా అనిపిస్తోంది. గుమ్మంలో నిలుచుంటే అందరూ తనని చూసే హేళనగా నవ్వుకుంటున్నట్టు తోస్తోంది. ఎక్కడినుంచో పంకజాక్షి మాటలు వినిపిస్తున్నాయి.

"పెద్దాయన ఉంటే నచ్చచెప్పేవారేమో. కానీ పంపించేసిందిగా? పిదపకాలమమ్మా, మొగుడిని కొంగున కట్టుకుని ఏకాంతంగా కులకడానికి అడ్డమైపోయాడని పెద్దాయన్ని అవతలకి తరిమేసింది. ఇప్పుడు తెలిసొస్తోందనుకుంటాను" ఆ వెనుకే కిలకిలమని నవ్వులు.

అదిగమనించిన శ్రీలత మనసు చివుక్కుమంది. పంకజాక్షి ముఖం చూస్తుంటే ఒళ్ళు మండిపోసాగిందామెకి. ఆమెకి చాలా బాధనిపించింది. ఎగదోసి ఆడించిన వాళ్ళే అపహాస్యం చేయడం ఎంతదారుణం? బహుశా అది లోకరీతమో. బుద్ధి కలిగి ఉండకపోవడం తనతప్పు. వాళ్ళననుకుని ఏం లాభం?

ఎంతబతిమాలినా భర్త వినకపోవడంతో శ్రీలతకి తన మామగారి దగ్గరికి వెళ్ళి అర్థించక తప్పలేదు. మాతృత్వపు మధురిమకోసం కాళ్ళబేరానికి రాక తప్పలేదు. ఎక్కడా కనీవినని విడ్డూరం అక్కడ చోటు చేసుకుంది. సంతానభాగ్యం కలిగించమని భర్తకి సిఫార్స్ చేయాల్సిందిగా మామగారికి విన్నవించుకోవడం!

"మామయ్యగారూ. మీరే నాకు దిక్కు. ఆయనకెలాగైనా మీరే నచ్చచెప్పాలి" అంటూ విషయమంతా చెప్పలేక చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

కోడలివైపు జాలిగా చూశారాయన. "ఏమిటీ? అలా అన్నాడా? ఏడిశాడు. వాడికేం తెలీదు. నేనువస్తానులేమ్మా. నిశ్చింతగా ఉండు తల్లీ. ఏడవకు" అంటూ భరోసా ఇచ్చారాయన. ఆయన భరోసా ఇవ్వగానే కొండంత ధైర్యం వచ్చేసినట్టయింది శ్రీలతకి.

అన్నట్టుగానే ఆ సాయంత్రం వచ్చారాయన. తండ్రిని చాలాకాలం తర్వాత ఇంట్లో చూడగానే వివేక్ గుండె ఉప్పొంగింది. హాల్లో ఎదురెదురుగా కుర్చీలు వేసుకుని కూర్చున్నారు తండ్రీకొడుకులిద్దరూ. వేడివేడిగా పకోడీలు చేసి పెట్టింది శ్రీలత. అవి తింటూ కబుర్లలో పడ్డారు. మధ్యలో విషయం గుర్తుచేయడానికన్నట్టు అప్పుడప్పుడూ చిన్నగా దగ్గుతోంది.

"ఏమోయ్. నాకు మనవడిని ఎప్పుడిద్దామనుకుంటున్నావు?" అంటూ విషయంలోకి వచ్చేశారాయన.

తండ్రి హఠాత్తుగా ఇంటికెందుకొచ్చాడో అప్పుడర్థమై వివేక్ అనుమానంగా భార్యవైపు చూశాడు. ఆమె తలదించుకుంది. "నాన్నా అదీ.. పిల్లలు పుట్టడమంటే... ప్రసవ వేదన.." నసిగాడు.

"నాకు అంతా తెలుసులేరా. నీదంతా పిచ్చి భయం. ఒక రకం ఫోబియా. ప్రసవ వేదన నరకప్రాయమే. కాదనను. కానీ అది తప్పనిది. ఏ జీవికైనా నివారించలేనిది. ఏం, మీ అమ్మ నిన్ను కనడానికి ప్రసవవేదన అనుభవించలేదనుకున్నావా? నేను కూడా నీలాగే భయపడి ఉంటే నువ్వెక్కడినుంచి ఊడిపడేవాడివి?"

వివేక్ మాట్లాడలేదు. మళ్ళీ ఆయనే అన్నారు. "నీకో విషయం తెలుసా? కష్టమూ, సుఖమూ, సంతోషమూ, దుఃఖమూ ఇలాంటివన్నీ వేర్వేరుగా ఉండవు. నాణేనికిరువైపులా ఉండే బొమ్మా బొరుసుల్లాంటివి. బొరుసు అక్కర్లేదనుకుంటే బొమ్మా ఉండదు. మనకి ఒకానొక ఆనందం కావాలనుకుంటే దానితోపాటే అనుబంధంగా ఉండే కష్టనష్టాలని భరించాలి. ఒక మంచి స్నేహితుడు కావాలనుకుంటే వాడు వదిలే సిగరెట్ పొగకంపుని భరిస్తామా లేదా? నూటికి నూరుపాళ్ళూ మంచీ, నూటికి నూరుపాళ్ళు చెడూ ఎక్కడా విడిగా ఉండవు. ఒకచోటే కలిసి సహజీవనం సాగిస్తుంటాయి. ఇది నిత్య సత్యం. కాబట్టి మాట విను" అన్నారు.

తండ్రి మాటకి ఎదురుచెప్పడం అలవాటులేని వివేక్ సరేనని తలాడించాడు. తప్పని సరిగా ఒప్పుకోవాల్సి వచ్చినందుకు డీలా పడినట్టుందతని ముఖం. శ్రీలత ముఖం మాత్రం వెలిగిపోయింది.

ససేమిరా అన్న భర్తని ఒప్పించినందుకు మామగారికి మనసులోనే ధన్యవాదాలు సమర్పించుకుంది. ఇంట్లోంచి వెళ్ళగొట్టిన తనమాట ఎందుకు వినాలని ఆయన అనుకుంటే తనకీ ఆనందం దక్కేదికాదుగా?

"మరి నేను వెళ్ళొస్తానమ్మా, వస్తానురా" అంటూ కదలబోయారాయన.

"అయ్యో మామయ్యగారూ, రాత్రికి భోంచేసి..." శ్రీలత మాట పూర్తికాకముందే చెప్పారాయన.

"అబ్బబ్బే. ఈ రోజు అస్సలు కుదరదమ్మా. మా వాళ్ళల్లో ఒకడి అరవైరెండో బర్త్‌డే ఇవేళే. సాయంత్రం అతని పార్టీ ఉంది. పార్టీ అంటే బిర్యానీలు, కూల్ డ్రింకులూ ఏమీ ఉండవులేమ్మా. వదిలించుకోబడ్డ వృద్ధులంకదా? మాకలాంటివేం ఉండవు. రోజూ తినేదే ఎటొచ్చీ నాలుగు మంచి జోకులు చెప్పుకుంటామంతే. వాటిని నేను మిస్ కాకూడదు" అంటూ వెళ్ళారు.

శ్రీలత కళ్ళు చెమర్చాయి. ఎంత మామూలుగా వచ్చారో అంత మామూలుగా వెళ్ళిపోయారు. 'బయటికి వెళ్ళగొట్టినా మళ్ళీ నేనే గతి అయ్యాను చూశావా?' అన్న భావం ఆయన ముఖంలో కనబడకపోవడం ఒక వంతైతే, 'నేను గనుక మిమ్మల్ని క్షమించాను' అన్న భావం కూడా ఏ మాత్రం కనిపించకపోవడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. అసలేమీ జరగనట్టే ఉన్నారు. ఎంత హుందాతనం? ఎంత సాత్వికత?!

మరి తనకి లేదేం ఆ హుందాతనం? ఆ రోజంతా ఆమె మనసు పరిపరివిధాలా ఆలోచించింది. మామగారి మాటలే పదే పదే గుర్తొస్తున్నాయామెకి.

కష్టానికి సిద్ధపడకపోతే సుఖం లేదు. ఒక మంచి స్నేహితుడు కావాలనుకుంటే వాడి సిగరెట్ పొగ కంపుని భరించాలి. ఎవరో పట్టుకుని ఆపినట్లు ఆమె ఆలోచనలు అక్కడే ఆగిపోయాయి. సిగరెట్ కంపు కాదు ఆమె ఆలోచిస్తున్నది. గెడ్డం గీసుకుంటున్నప్పుడు పడిన వెంట్రుకల్ని తుడవాల్సిరావడం, బాత్‌రూం గోడ మీద వదిలేసి వచ్చిన సబ్బు నురగల్ని పోగొట్టడం... అసలవి కష్టాలేనా? ఏమో మనసుకి నచ్చనప్పుడు కష్టాలే అనిపిస్తాయేమో, అయిన భరించక తప్పదుగా?

మాతృత్వపు మధురిమ కావాలనుకున్న స్త్రీకి ప్రసవ వేదన భరించక తప్పదు. మనుషులు, మమతలు, పెద్దల అండదండా కావాలనుకున్న వాళ్ళకి వారివల్ల ఎదురయ్యే చిన్నా చితక చికాకుల్ని భరించక తప్పదు. ఇదికూడా నిత్యకృత్యమే.

తండ్రికిచ్చిన మాట మేరకి ఆ రాత్రి వివేక్ తలగడకింద చెయ్యిపెట్టలేదు, ఆ సమయంలోనే శ్రీలత అతనితో "ఏమండీ, నేనేదో మతిమాలి మీ నాన్నగారిని వృద్ధాశ్రమంలో వదిలి రమ్మంటే నాకు నాలుగు తగిలించి బుద్ధిచెప్పక వదిలేసి రావడమేనా?" అంది.

"నేను వదిలి రాలేదు లతా, ఆ రోజు రాత్రి మనమధ్య జరిగిన గొడవ విని ఆయనే స్వయంగా వెళ్ళిపోయారు. తన ఉనికి మనకి సంతోషంగా ఉంటుందనుకుని వచ్చారట. లేకపోతే అసలు ఇక్కడికి వచ్చేవారే కాదట. ఇప్పుడు నీకు ఇబ్బందిగా ఉందని గ్రహించి నిశ్శబ్దంగా పక్కకి తప్పుకున్నారు. అక్కడినుంచే ఫోన్ చేసి నేనే తనని వృద్ధాశ్రమంలో జాయిన్ చేసినట్టు నీతో చెప్పుకోమన్నారు. అదికూడా నీ సంతోషంకోసమేనట. భర్త తన మాటకి విలువ ఇస్తున్నాడంటే ఏ భార్యకైనా సంతోషమే కదా. అందుకే అలా చెప్పమన్నారు" అన్నాడు.

శ్రీలత నిర్విణ్ణురాలైపోయింది. ఆయన ఇంట్లో ఉండడాన్ని తాను భరించలేకపోయింది. అయినా తాను సంతోషంగా ఉండాలని ఆయన అనుకున్నారు. "ఏమండీ. రేపే వృద్ధాశ్రమానికి వెళ్ళి మీ నాన్నగారిని తీసుకొచ్చేయండి. ఇక మీదట ఆయన ఈ ఇంట్లోనే ఉండాలి" అన్నది. వివేక్ కళ్ళు ఆనందంతో మెరిశాయి. భార్యని అమాంతం కౌగిట్లో బిగించి "సరే. అలాగే. కానీ, మళ్ళీ మనసు మార్చుకోవుగా?" అని అడిగాడు. ఆమె తల అడ్డంగా ఊపింది.

మరునాడు ఉదయాన్నే అతను వృద్ధాశ్రమానికి వెళ్ళి వచ్చాడు. వచ్చేటప్పుడు మొహం వేలాడేసుకుని దిగాలుగా వచ్చాడు. శ్రీలత ఆతృతగా అడిగింది "ఏమన్నారండీ మామయ్యగారు?" అని.

"తనకి అక్కడే బాగుందట. రానన్నారు. మనింట్లో అయితే మనమిద్దరమే కంపెనీ అట. అక్కడైతే యాభై మంది ఉన్నారట. కాలక్షేపానికి ఎటువంటి లోటులేదని అన్నారు" అన్నాడు వివేక్.

శ్రీలత మొహం చిన్నబోయింది. 'అవునులే. ఒకసారి పొమ్మన్నాక అభిమానం గల ఏ మనిషి మాత్రం తిరిగి వస్తారు? అయితే తాను చేసింది సరిదిద్దుకోలేని పొరపాటన్నమాట.' అనుకున్నది లోలోపల కుమిలిపోతూ.

"బతిమాలగా బతిమాలగా ఒక కండిషన్ మీదయితే వస్తానన్నారు" అన్నాడు వివేక్.

శ్రీలత కళ్ళు మెరిశాయి."ఏమిటా కండిషన్. దేనికైనా సరే నేను ఒప్పుకుంటాను. నాకిప్పుడు మనుషుల విలువ తెలిసింది. ఎంత కష్టమైనా సరే ఆయన చెప్పిన కండిషన్‌కి ఒప్పుకుంటాను" అంది.

"మనకి కష్టం కలిగించే కండిషన్ పెడితే ఆయన మా నాన్న ఎందుకవుతారు? నీకు సంతోషాన్ని కలిగించే కండిషనే పెట్టారు" అన్నాడు.

"ఏమిటండీ అది?" అంది శ్రీలత.

"మనకి బాబో పాపో పుడితే తప్ప రానన్నారు"

ఆ మాట విని శ్రీలత చెంపలు కెంపులయ్యాయి. సంతోషంతో గొంతు పూడుకుపోయింది.

"ఏమండీ, మనం బాబుని త్వరగా కందామండీ"

"ఏం తల్లినవుదామని అంత తొందరగా ఉందా?"

"కాదు. మామయ్యగారిని మనింట్లోకి తొందరగా తెచ్చేసుకోడానికి" అన్నది ఆమె.

"మరయితే ఇంకెందుకాలస్యం? ఈ వేళ ఆఫీసుకి డుమ్మాయే" అంటూ మంచం మీద కూర్చున్నదాన్ని వెనక్కితోసి అమాంతం ఆమె పైకి దూకాడు.

"ఏమండీ. నా మీద మీకున్న ప్రేమ నిజంగా నిజమైందే కదూ?" అన్నది.

"ఎందుకా సందేహం?" తమకంగా అడిగాడు.

"ఒకవేళ వయసు పెరిగాకా నాలోని ఈ అందమంతా తరిగిపోతే ఈ ప్రేమ అప్పటికీ మిగిలి ఉంటుందో లేదోనని నా భయమండీ" అన్నది.

వివేక్ నవ్వుతూ "పిచ్చిదానా, నేను చూపించే ప్రేమంతా నీ అందం చూసి అనుకుంటున్నావా?" అన్నాడు.

"కాదా?" అని అడిగింది అమాయకంగా.

"చిన్నప్పుడు మా నాన్న ఒక మాట చెప్పేవాడు..." అంటూ అలవాటుగా చెప్పబోయి టక్కున ఆగిపోయాడు. ఈ మాట చాలాసార్లు ఆమె దగ్గర చెప్పినట్టు గుర్తొచ్చింది. మరీ ఎక్కువసార్లు ఒకేమాట చెప్తితే వినడానికి బాగుండదని సగంలోనే ఆపేశాడు.

"అన్నట్టు ఎప్పుడూ అడగాలనిపించలేదు. ఏమిటండీ ఆ మాట?" అన్నది లత.

"చెప్పమంటావా?" అన్నాడు వివేక్.

"చెప్పండి. మిమ్మల్నింతగా ప్రభావితం చేసిన ఆ మాట ఏమిటో తెలుసుకోవాలని ఉంది" అన్నది.

దేవుడు మీ ఆడవాళ్ళకి అన్యాయం చేశాడు లతా" శ్రీలత చిత్రంగా చూసింది. సౌందర్యాన్ని తమకే సొంతం చేసిన దేవుడు స్త్రీ పక్షపాతి అని ఇన్నాళ్ళూ తన అభిప్రాయం. అందుకే అతనా మాట అనగానే కుతూహలంగా వినసాగింది.

"లోకంలో ఘోరమైన పాపాలు, అఘాయిత్యాలు, నీచాతినీచమైన అకృత్యాలు చేసిన వాళ్ళంతా నరకానికి పోతారంటారు. నరకంలోని బాధలు అంతా ఇంతా కాదంటారు. అలాంటి నరకానికి పదిరెట్లు దుర్భరమైన ప్రసవ వేదన దేవుడు స్త్రీకి మాత్రమే విధించాడు. పురుషుడిని ఆ బాధ నుంచి తప్పించి పక్షపాతం చూపించాడు. ఆ వేదనని స్త్రీ సంతోషంగా అంగీకరించకపోతే ఈ సృష్టే ఆగిపోతుంది.

అందుకే పురుషుడు ఆమెని దేవతలా, ఏ కష్టమూ కలగకుండా అపురూపంగా చూసుకోవాలట. యత్రనార్యస్తు పూజ్యంతే తత్ర రమంతు దేవతాః ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు చరిస్తూ ఉంటారని మనుధర్మశాస్త్రం చెపుతోంది. ఈ మాట చిన్నప్పుడెప్పుడో చెప్పారు మా నాన్న. అదే నా మైండ్‌లో ముద్రపడిపోయిందేమో" అన్నాడు.

సృష్టికి శ్రీకారం చుట్టాలని తపస్సులో నిమగ్నమై ఉన్న వివేక్ గమనించలేదు కానీ, శ్రీలత కళ్ళు ధారాపాతంగా కురుస్తున్నాయి. ఆమె గుండెనెవరో పిండినట్టు తెలీని ఉద్విగ్నతకి గురవుతోంది.

*'దేవుడి సృష్టిలోని అన్యాయాన్ని సైతం సరిదిద్దాలని ఆలోచించేవాడు నిజంగా దేవుడికన్నా గొప్పవాడు'.* మొదట్లో మామగారి నోటినుంచి వచ్చిన ఆ మాట చెవుల దగ్గరే ఆగిపోయేది. ఇప్పుడు అదే మాట హృదయాంతరాళాల్లోకి చొచ్చుకునిపోయి ఏ కరుడు గట్టిన భావాల్నో క్రమంగా కరిగించి వేస్తున్నట్టనిపిస్తోంది.

***




## డిసెంబర్ 2009

**ఈ నెల కథాసాగర** మథనంలో విశ్లేషణకు ఆంధ్రభూమి, స్వాతి, నవ్య వారపత్రికలు, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, రచన, స్వాతి, ఆంధ్రభూమి, చిత్ర, ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలలో ప్రచురితమైన మొత్తం 95 కథలను చదివి ఈ క్రింద కథలను కౌముది పాఠకుల పరిచయానికి ఎంచుకున్నాను.

ఏదైనా రచన ఉత్తమ రచన అన్నీ ఎన్నుకోవటం ఎంత కాదన్నా ఎంపిక చేసే వారి వ్యక్తిగత అభిప్రాయం. అతడి వ్యక్తిగత అభిప్రాయాన్ని పలువురు ఆమోదిస్తే, ఆ ఎంపిక ఆ సర్వజనామోదం పొందుతుంది. అలాకాని పక్షంలో వాద ప్రతివాదాలు చెలరేగుతాయి. అందుకే సర్వసాధారణంగా ఉత్తమ రచనల ఎంపికలో ఒకరు కాక పలువురు న్యాయనిర్ణేతలుంటారు. దాంతో విభిన్న దృక్పథాలకు, దృక్కోణాలకు అభిప్రాయాలకు నడుమ సమన్వయం సాధించే వీలుంటుంది. అయినా సరే బహుమతుల నిర్ణయాలు వివాదాస్పదమవటం మన పద్ధతిలోనే ఎక్కడో లోపం ఉన్నదన్న ఆలోచనను కలిగిస్తుంది.

సాధారణంగా, పత్రికలలో పోటీకథల నిర్ణయంలో, బహుమతి వచ్చిన కథలేకాక, సాధారణ ఎంపికకు గురయిన కథలూ చదివే వీలు పాఠకులకు కలుగుతుంది. దాంతో అన్ని కథలూ చదివిన పాఠకుడికి, న్యాయనిర్ణేతల దృష్టి తెలుస్తుంది. బహుమతి గెలుచుకున్న కథలను ఇతర కథలతో పోల్చి విశ్లేషించే వీలుంటుంది. కానీ జాతీయ స్థాయిలో అవార్డులివ్వటంలో, ఇలా, బహుమతి గెలుచుకున్న రచన ఇతర ఏ రచనలతో పోటీ పడాల్సి వచ్చిందో తెలుసుకునే వీలుండదు. అసలు, ఏయే రచనలున్నాయో, అవార్డు ప్రక్రియలో పారదర్శకత ఉండి, అందరికీ తెలుస్తుంటే వివాదలు గణనీయంగా తగ్గే వీలుంటుంది. బహుమతి నిర్ణయ ప్రక్రియలో ప్రజలూ పాలుపంచుకుని అభిప్రాయాలు వ్యక్తపరిచే వీలుంటుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో బహుమతి నిర్ణయం జరుగుతుంది. ఇలాంటి పారదర్శకతలేని వ్యవస్థలో వివాదాలు, అనవసర వాదోపవాదాలకు తావుంటుంది. కాబట్టి, బహుమతుల గౌరవం నిలపటం కోసమన్నా భవిష్యత్తులో బహుమతుల ఎంపికలో పారదర్శకత ఉండే వీలు కల్పించాలి.

ఈ నెల సంపూర్ణంగా సంతృప్తి కలిగించే కథ దొరకలేదు. మాండలీకంలో కథలువచ్చాయి. అలవాటయిన అంశాలతో మూసకథలు వచ్చాయి. మూస అంశాలను వైవిధ్యంగా ప్రదర్శించిన కథలూ వచ్చాయి. అలాంటి కథలలో ఆసక్తికరంగా, భిన్నంగా ఉన్న కథలు ఇవి.

ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమైన ఎన్. శివనాగేశ్వరరావు రచించిన 'నేను నాటిన మొక్కలు,' డా.కొఠారి వాణి చలపతిరావు రచించిన 'అవగాహన' కథలు మంచి చెప్పే కథలు. ఈ కథల గురించి విపులంగా వివరించకపోవటానికి ప్రధాన కారణం. 'అవగాహన' కథలా కాక ఉపన్యాసంలా ఉండటం, 'నేను నాటిన మొక్కలు' కథలో ఆదర్శం బాగున్నా 'లాజిక్'ను ఆచరణ సాధ్యాన్ని

విస్మరించడం. 'అవగాహన'లో అత్త, కోడళ్ళు, డబిడ్డల నడుమ ఉండవలసిన దర్మ సంబంధం గురించి చర్చ ఉంటుంది. 'నేను నాటిన మొక్కలు' కథలో ఓ వ్యక్తి ఇంట్లోవాళ్ళ స్వార్థానికి విసిగి, ఓ అనాధ శరాణాలయం ఆరంభిస్తాడు. అరవై దాటేసరికి 'నా తరువాత ఈ ఆశ్రమం నడిపేదెవరు?' అన్న ప్రశ్న వస్తుంది. 12 ఏళ్ళ పిల్లవాడు ముందుకి వస్తాడు. ఆచరణ కాని మంచిమంచి విషయాన్ని చూపిస్తుందీ కథ.

డిసంబర్ 9 వతారీకు నవ్య సంచికలో ప్రచురితమైన సలీం కథ 'పరుగు' సమకాలీన సమాజంలోని సమస్యను ఎత్తి చూపించినా, కథ మూసలో, మామూలుగా ఉండి, ప్రచారంలో ఉన్న అపోహలను ప్రదర్శిస్తుంది. ఓ అమ్మాయి పరుగు పోటీల్లో గెలవటం కోసం రాజీపడుతుంది. జీవితంలో అనేక ఇతర అంశాలలో రాజీపడుతుంది. ఈ విషయం బహిర్గతమవగానే ఆత్మహత్య చేసుకుంటుంది. ఆటగాళ్ళు, ముఖ్యంగా, మహిళ క్రీడాకారిణుల పట్ల బోలెడన్ని ఆపోహలు ప్రచారంలో ఉన్నాయి. అవన్నీ నిజం అన్నట్టు ఉంటుందీ కథ.

<u>*ముడుపు*</u>

డిసెంబర్ 13, ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురితమయిన ఈ కథను రచించింది సింహ ప్రసాద్. కథ మనకు అలవాటయినదే ఒక దశలో మామూలు కథ అని నిర్ణయించేసుకుంటాం. కానీ రచయిత చివరలో ఇచ్చిన ట్విస్ట్ కథ స్వరూపాన్ని మార్చేస్తుంది. హేమంత్ అనే యముడు తన తండ్రికీ, బామ్మకూ నడుమ తెగిపోయిన సంబంధాన్ని పునరుద్దరించుకోవాలని బామ్మ దగ్గరకు వెళతాడు. ఆస్తిపంపకాల విషయంలో సోదరికి ఎక్కువ వచ్చిందన్న కోపంతో హేమంత తండ్రి బామ్మతో తెగతెంపులు చేసుకుంటాడు. కానీ తన తండ్రి ఆమె అసలు కొడుకు కాడని, అయినా స్వంత కూతురితో సమానంగా తండ్రిని చూసుకుంటోందని హేమంత్‌కు తెలుస్తుంది. మానవ సంబంధాలలోని గొప్పతనాన్ని, అల్పత్వాన్ని, ఒకే చోట అత్యద్భుతంగా చూపిన కథ ఇది.

<u>*ఏంచేటు*</u>

27 డిసెంబర్ ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన ఈ కథను రచించింది డా.జె.వి.రమణరావు. రాముడి విగ్రహాన్ని ఊరిగించే ఓ వ్యక్తి అంతరంగ చితం ఇది. మోకాలెత్తుండే పంచలోహ విగ్రహాలవి. కథా రచయిత ఆ వ్యక్తి అంతరంగంలో అందరినీ తిట్టుకోవటం, విసుక్కోవటం, తన అన్యాయాన్ని వెళ్ళబోసుకోవటంతో నింపేశారు. కథలో రచయిత ప్రస్తావించిన విషయాలు నిజం కావచ్చు. కానీ, ఇప్పటికీ, దేవుడంటే, చదువుకున్న వాళ్ళతో ఎంత చిన్న చూపు ఉన్నప్పటికీ, ఇలాంటి చిన్న చిన్న పనులు చేసేవాళ్ళలో పూజారులకన్నా ఎక్కువ చిత్తశుద్ధి, నమ్మకం, విశ్వాసాలున్నాయి. తనను కాదని ఆ పనికి మరొకరిని నియమిస్తే 'నా రాముడు నేను లేకుండా ఎలా కదులుతాడు?' అని తొడగొట్టి ప్రాణాలు తీసి, ప్రాణాలు ఇచ్చేటంత విశ్వాసం అది. అయితే దైవం, సాంప్రదాయం అనగానే దాన్లోని నెగిటివ్ ధోరణిని చూపించటమే సర్వ జనసమ్మతం. అమోదయోగ్యం.

<u>*చెదిరిన కల*</u>

డాక్టర్ ప్రసాద్ కల్లూరి రచించిన ఈ కథ సమకాలీన సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యను ప్రస్తావిస్తుంది. అయితే, కథ మామూలు రొటీన్ కథలా, అలవాటయిన మలుపులతో సాగుతుంది. కథాసాగర మథనంలో ఈ కథను ప్రస్తావించటం, ఎంచుకున్న అంశం గురించే తప్ప కథనం కోసం కాదు. 'రియాలిటీ'షో ల పేరిట, యువతులతోనే కాదు పసిపిల్లలతో కూడా విచ్చలవిడి నృత్యాలు చేయించటం, అదే గొప్ప కళారాధన అన్నట్టు చూపటం సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఇంతవరకూ మన కథకులు అధికంగా స్పృశించని అంశం. ఆ అంశాన్ని స్పృశిస్తుందీ కథ అయితే అమ్మాయి సామూహిక మానభంగానికి గురవటం తదితరమైన వన్నీ ఈ కథను రొటీన్ కథగా మిగిలిస్తాయి.

<u>ఇష్టం - ప్రేమ</u>

అపర్ణా దీక్షిత్ రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమయింది. మామూలు ప్రేమ కథలకు భిన్నంగా, ప్రేమకు ఇష్టానికి నడుమ వున్న తేడాను సున్నితంగా చూపాలని ప్రయత్నించిన కథ ఇది - ఓ అబ్బాయి, అమ్మాయిని చూసి ప్రేమిస్తాడు. పెళ్ళి ప్రపోజ్ చేస్తాడు. పెళ్ళి నిర్ణయమైపోతుంది. పత్రికలు ప్రింటయిపోతాయి. కానీ అమ్మాయి ఇంట్లో అందరూ అల్పాయుష్కులని తెలియటంతో భయపడి అబ్బాయి పెళ్ళి రద్దు చేసుకుంటాడు. మరో పెళ్ళి చేసుకుంటాడు. సుఖంగా ఉంటాడు. ఓ రోజు అతడికి ఆ అమ్మాయి కలుస్తుంది. ఆమె కూడా సుఖంగా ఉంటుంది. పెళ్ళవుతుంది. అప్పుడు ఆ అబ్బాయి ఆలోచిస్తాడు. 'సీతను నేను ఇష్టపడ్డాను. ప్రాణాపాయం అనేసరికి తప్పుకున్నాను. ఇష్టాన్ని చంపుకోవచ్చు. కానీ ప్రేమను ఎవరూ చంపుకోలేరు. దీనిని బట్టి నేను సీతను కేవలం ఇష్టపడ్డానుకానీ ప్రేమించలేదని అర్థమయింది' అనుకుంటాడు. తాత్కాలికావేశంలో ఏదో నిర్ణయం తీసుకుని, ఒక్క క్షణం ఆగి విచక్షణ ప్రదర్శిస్తే మంచిదన్న భావాల్ని పరోక్షంగా కలిగిస్తుందీ కథ. మంచి కథ.

<u>తిండిగింజలు</u>

ప్రతాప రవిశంకర్ రచించిన ఈ కథ డిసెంబర్ స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. నిజానికి ఈ కథ ఈనెల కథ కావాల్సింది. ఎంతో ఆలోచించి, అనేక విషయాలను విశ్లేషించిన తరువాత నిర్ణయం మార్చుకున్నాను. చక్కని కథ ఇది. ఓ పల్లెటూరిలో రైతులు పంటలు పండించటం మానేస్తారు. తనకు రావాల్సిన కౌలు డబ్బు రాకపోవటంతో విషయం తెలుసుకోవాలని సూర్యనారాయణ ఊరుకువస్తాడు. విషయం తెలుసుకుంటాడు. రైతులు పంటలు పండించటం ఎందుకు మానేశారంటే అందరూ వేరే పనులే చేస్తుంటే, పంట ఎవరు పండిస్తారు? తిండి ఎలా వస్తుంది? రకరకాల ఫ్యాక్టరీలు పెట్టి నిరుద్యోగ సమస్యను తీరుస్తున్నట్టుగా చెబుతుంది కానీ, వ్యవసాయం ఉద్యోగాల దెబ్బకు అణగారి పోతోందని, వ్యవసాయం ఆగిపోతే ఆహారధాన్యాల కోత వల్ల దేశంలో ప్రజలు కరువు కాటకాలతో తిండిగింజలు లేక మాడిపోతారనే విషయాన్ని గ్రహించలేకపోతోంది. దీన్నొక సమస్యగా భావించడం లేదు' అంటాడు రచయిత ఓ సందర్భంలో. సెజ్‌ల గురించి, రైతుల కష్టాలు, కడగళ్ళు, ఆత్మహత్యల గురించి బోలెడన్ని కథలు వచ్చాయి. ఆవేశం, ద్వేషం చిందించాయి. కానీ అవేవీ సాధించలేని ఈ కథ ఎలాంటి ఆవేశం, ద్వేషం, రక్తపాతం, ఆత్మహత్యలు లేకుండా సాధిస్తుంది. పాఠకుడిలో ఆలోచన కలిగిస్తుంది. అసలు సమస్య వైపు దృష్టిసారిస్తుంది. రాబోయే భయంకర సమస్య స్వరూపాన్ని ఎత్తి చూపిస్తుంది. పల్లె వదలి పట్నం వెళ్ళిన వాళ్ళు మళ్ళీ వ్యవసాయం వైపు మళ్ళాలని పరిష్కారం సూచిస్తుంది.

అతి చక్కని, అర్థవంతమైన కథ ఇది. ఉపన్యాసాలు, సిద్ధాంతాల రాద్ధాంతాలు లేకుండా కథ పరిధిలోనే సత్యాన్ని గొప్పగా చూపిస్తుందీ కథ.

<u>గ్లాసియర్</u>

పెద్దంటి అశోక్ కుమార్ రచించిన ఈ కథ డిసెంబర్ 30, నవ్యలో ప్రచురితమయింది. గ్లాసియర్ (glaciar) అంటే, హిమానీ నాదం. పైకి కఠినంగా, తొణకకుండా ఉంటూ లోన వెన్నలా కరిగే వారిని గ్లేషియర్‌తో పోలుస్తారు. శశాంక్ అనే వ్యక్తి 'వసంత' టీచర్ మానసిక వ్యాధికి కారణం తెలుసుకోవటం, చికిత్స చేయటం ఈ కథ. వసంతా టీచర్ శశాంక్‌కు యవ్వనంలో పరిచయం అవుతుంది. అతడిని ప్రభావితం చేస్తుంది. ఆమె వల్ల అతడు బాగా చదువుతాడు. ఆమె కూడా చనువుగా ఉంటుంది. ఓ రోజు ఓ బహుమతి ఇస్తానంటుంది. కానీ తరువాత రోజునుంచి తనతో మాట్లాడవద్దంటుంది. శశాంక్‌కు అర్థంకాదు. ఇప్పుడు ఆమె కలిసేసరికి పిచ్చిపట్టి ఉంటుంది. ఎవరితోనూ మాట్లాడదు. శశాంక్ ఆమె మానసిక సమస్యను తెలుసుకుని నయం చేయటం కథ. ఇదీ ఈ నెల కథ.

ఈ నెల కథ కోసం తిండి గింజలు, గ్లాషియర్ కథల నడుమ మంచి పోటీ వచ్చింది. ఏది ఎంచుకోవాలో చాలా ఆలోచించి నిర్ణయించుకోవాల్సి వచ్చింది. గమనిస్తే, 'గ్లేషియర్' కథలో లోపాలు కనిపిస్తాయి. పాత్ర చిత్రణలో అసంబద్ధాలు కనిపిస్తాయి. మానసిక

రోగానికి సంబంధించిన అంశాలలో 'లోతు' కనబడదు. ముఖ్యంగా వాసంతి పాత్ర చిత్రణలో కన్సిస్టెన్సీ కనబడదు. ఆమె రోగ నిర్ధారణ కూడా హాస్యాస్పదంగా ఉంటుంది. ఏమీ పరిశీలించకుండా డాక్టర్లు ఎలక్ట్రిక్ షాకులు కూడా ఇచ్చేయటం కూడా ఇచ్చివేయటం ఔచిత్యం అనిపించదు. పైగా, ఆమె రోగాన్ని నయం చేయటం కోసం నాయకుడు నిర్ణయించినది హాస్యాస్పదంగా ఉంటుంది. అదేదో సినిమాలో హీరో తలమీద బలంగా దెబ్బపడగానే మాటపోతుంది. మళ్ళీ చివర్లో తలపై బలంగా దెబ్బపడగానే మాటవచ్చేస్తుంది. 'వీడేనన్ను కొట్టింది' అంటూ విలన్ వెంట పడతాడు హీరో. అలా ఉంటుంది డాక్టర్ నిర్ణయం.

కానీ ఈ కథలో గొప్పతనం కథను రచయిత ఆసాంతం ఆసక్తి ఏ మాత్రం తగ్గి మూడు, అడుగడుగునా ఆసక్తి పెంచటంలో కనిపిస్తుంది. ఇది పూర్తిగా రచయిత రచన ప్రతీకకు అద్దం పట్టే కథ. మామూలు కథకుడిని, ప్రతిభావంతుడయిన రచయిత నుంచి వేరు చేసేదీ అంశమే. మాములు రచయిత కథల్లో గొప్ప అంశం గొప్పగా, మామూలు అంశం మామూలుగా అనిపిస్తుంది. ప్రతిభావంతుడయిన రచయిత రచనలో మామూలు అంశాలు కూడా అత్యద్భుతమైన ఆసక్తి కలిగించే కథలుగా మారతాయి.

ఈ కథలో రచయిత పలు అంశాలను సున్నితంగా స్పృశించాడు. ఉల్లిని చీలుస్తుంటే పొరలు పొరలుగా విడువడేట్టు ఈ కథలోనూ రకరకాల పొరలు ఉన్నాయి. నాయక వ్యక్తిత్వం కల మహిళ. దాంపత్యాన్ని ధర్మంపై నమ్మకం ఉన్న వ్యక్తి. భర్తమాటకు విలువనిస్తుంది. కానీ ఆమెను మనిషిగా, వ్యక్తిగత అభిప్రాయాలున్న తెలివైన వ్యక్తిగా చూడలేని భర్తవల్ల మానసిక గాయాలు అవటం ఓ కథ. ఆమె యవ్వనం నుండీ ఆరాధిస్తూ, ఎదిగి ఓ స్థాయికి వచ్చినా ఆమె పట్ల గౌరవం, ఆసక్తి తగ్గని శశాంక్ కథ మరొకటి. ఆకర్షణ సామాజిక స్థాయి, దృష్టిని బట్టి మారుతుందని మరోవైపు సూచిస్తుంటుంది కథ. యవ్వనంలోని ఆకర్షణ ఎదుగుతున్న కొద్దీ జ్ఞాపకంగా మిగిలిపోతుందన్న నిజం ఇంకోవైపు ఇలాంటి అనేకానేక అంశాలను ఆసక్తి కలిగించే మాలలా గుచ్చుతూ, విసుగు కలగనీయకుండా శశాంక్‌కు ఆమె ఇస్తానన్న 'గిఫ్ట్'. ఇలా కథను మొదటి నుంచి చివరివరకూ చదివింపచేసేట్టు రచించిన రచయిత అభినందనీయుడు. ఎలాంటి సిద్ధాంత ప్రకటనలు లేకుండా మహిళ అణిచివేతను ఓ జీవితం ద్వారా చక్కగా ప్రదర్శిస్తాడు రచయిత. మరోవైపు మొగ్గలోనే ఆగిన ప్రేమకథ. ఇలా రచయిత ఈ కథను చెప్పిన విధానం ఈ కథను ఈ నెల కథగా ఎంచుకోవటంలో ప్రధాన పాత్ర వహించింది. 'తిండిగింజలు' కథ చక్కనిది. ఆలోచింపచేస్తుంది. కానీ అలాంటి కథ చెప్పటం సులభం. పాఠకులను ఆకర్షించటం సులభమే. కథాంశంలోనే ఆ గొప్పతనం ఉంది. 'గ్లాసియర్' కథ అలా కాదు. ఏ మాత్రం పట్టు తప్పినా కథ అభాసుపాలవుతుంది. కథనంలో మెళుకువలు తెలుసుకోవాలనుకునేవారు జాగ్రత్తగా విశ్లేషిస్తూ చదవవలసిన కథ ఇది చదవండి మీ అభిప్రాయాని నిర్మొహమాటంగా తెలపండి.

*ఈనెల కథ*

## గ్లాసియర్ - పెద్దింటి అశోక్ కుమార్

డిసెంబర్ ౩౦, నవ్య వార పత్రిక ౨౦౦౯ సంచిక నుంచి

**హఠాత్తుగా ఎదురుపడ్డ** ఆమెను చూసి ఉలిక్కిపడ్డాడు శశాంక్. బ్రేకును బలంగా నొక్కాడు. అడుగుదూరంలో కారు కీచుమని ఆగిపోయింది. ఆ శబ్దానికి అందరూ అటువైపు చూసారు.

శశాంక్ మాత్రం ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నాయి.

'వసంత టీచర్' అతడి పెదాలు అస్పష్టంగా పలికాయి.

ఆమె కారుకు అడుగుదూరంలోనే ఉంది. రోడ్డును క్రాస్ చేసి పక్క సందులోకి పోబోతుంది. ఒక్క క్షణం ఆలస్యం జరిగినా కారు ఆమెను ఢీ కొట్టేదే. ఆ కుదుపునకు వెనకసీట్లో కునికిపాట్లు పడుతున్న జయమ్మ తూలి పడబోయి నిలదొక్కుకుంది ఏం జరిగిందని భయంగా ముందుకు చూసింది. చుట్టుపక్కల వాళ్ళు ఆసక్తిగా చూసారు. వెళ్ళిపోతున్న ఆమె వైపు అవునా కాదా అన్నట్టు చూశాడు శశాంక్. టక్కున కిందకి శశాంక్. పిలుద్దామనుకున్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు. మురికిగా బట్టలు, జడలు గట్టుకుపోయిన జుట్టు. తెలిసున్న మొహం కాబట్టి సరిపోయింది. లేకుంటే శశాంక్ కూడా పిచ్చిది అనుకునే రూపం. ఆ రూపమే శశాంక్ గొంతును నొక్కింది.

సందు మలుపు తిరిగి మెయిన్ రోడ్ ఎక్కిన వసంత జనంలో కలిసి పోయింది. ఆమె కనుమరుగయ్యేవరకు అతడి చూపు స్టీరింగ్ వైపు తిరగలేదు. కారు అద్దాలు దించి అటూ ఇటూ చూసిన జయమ్మ 'శశీ.. ఏమయిందిరా..?' అని అడిగింది.

గేరు మారుస్తున్న శశాంక్ క్షణం ఆగి తల్లివైపు చూసాడు. తల్లి అతడి మొహంలో అమితమైన ఉద్వేగాన్ని చూసింది. వసంత కనిపించలేదు.

కారు ముందుకు పోతుంది శశాంక్ కళ్ళల్లో వసంత రూపమే కదులుతోంది.

***

ఇరవై ఏళ్ళ కిందమాట. అప్పుడు శశాంక్ పదవ తరగతి. సోషల్‌కు కొత్త టీచర్ వచ్చిందంటే ఆసక్తి. ఎలా ఆటపట్టించవచ్చనే ఆలోచన. అప్పటికి శశాంక్ ఆకతాయితనం మీద ప్రిన్సిపల్‌కు ఎన్నో ఫిర్యాదులు. తల్లిదండ్రులను పిలిపించాడు కూడా. శశాంక్‌కు చదువురాదని వారు ఎప్పుడో నిర్ధారించుకున్నారు. టెంత్ పూర్తయితే ఏ మెకానిక్ పనో నేర్పి ఓ షెడ్డును పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రిన్సిపల్‌కు ఏదో ఒకటి నచ్చచెపుతున్నారు.

సన్నజాజి పరిమళంలా వచ్చింది వసంత టీచర్. వయసు ఇరువైకి అటు ఇటూ ఉంటుంది. పిల్లల్లో కలిసి పోయింది. శశాంక్ మంత్ర ముగ్ధుడైపోయాడు. ఆమెను మరి మరీ చూడాలనిపించేది. ఆమెతో మాట్లాడాలనిపించేది. ఆమె పొగిడితే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేది. తిడితే ఎక్కడలేని నీరసం వచ్చేది. చదువుకోడానికి ఇంటికి రమ్మనేది ఆమె ఎదురు పడినప్పుడల్లా ఏదో తెలియని ఉద్వేగం. పాఠం చెబుతుంటే ఆమెను చూడాలనిపించేది. అందం, అందాన్నిమించిన ఆకర్షణ. ప్రిన్సిపల్ ఎప్పుడూ ఆమె వెంటే తిరిగేవాడు. అతడిని చూస్తే కోపంగా ఉండేది.

నెలరోజుల్లో శశాంక్‌లో చెప్పలేని మార్పు. ఆటలు బంద్. అల్లరి బంద్. తిరుగుడు బంద్. స్కూలు వసంత టీచర్ ఇల్లు. అంతే! చదివినా చదవక పోయినా ఎప్పుడూ సోషల్ బుక్ చేతుల్లో ఉండేది. సోషల్ నోట్స్ నీట్‌గా రాసేవాడు.

***

'ఎక్కడరా వసంతా.. ఏదీ' జయమ్మ రెట్టించి అడిగింది.

'ఇప్పుడేనమ్మా.. కనిపించినట్టే కనిపించి మాయమయింది. అసలు ఆవిడనో కాదో..' అనుమానాన్ని వ్యక్తం చేసాడు.

'ఇక్కడే ఉంటున్నారు. ఇద్దరు బిడ్డల పెళ్ళిళ్ళయ్యాయి. అందరు ఒక స్థాయిలో ఉన్నారు. పాపం శంకర్ ఎంత కష్టపడ్డాడని. ఇప్పుడైనా సుఖంగా ఉందామనుకుంటే దీనికి పిచ్చి' జయమ్మ అన్నది. మరోసారి ఉలిక్కిపడ్డాడు శశాంక్. గేరు మార్చి కారును స్లో చేసి వెనక్కి తిరిగి చూస్తూ 'వసంత టీచర్‌కు పిచ్చా..?' అడిగాడు ఆశ్చర్యంగా.

జయమ్మ మామూలుగా ఉంది. టీచర్ అన్నపదమే ఆమెను విస్మయానికి గురిచేసింది.

'అది టీచరేంట్రా.. వసంత.. మస్కట్ శంకర్ భార్య..' అన్నది.

ఆమె మాటలు పట్టించుకోకుండానే 'అమ్మా.. శంకర్ ఎక్కడున్నాడు..?' అడిగాడు.

'శంకర్ ఊళ్ళోనే ఉన్నాడురా.. దీన్ని పట్టుకుని ఎదురైన హాస్పిటల్ తిరిగాడు. దీనికి పిచ్చి తగ్గలేదు కాని వాని చేతులున్న డబ్బు మాత్రం కరిగిపోయింది. ఇప్పుడు తండ్రి వద్దనే ఉంటుంది. పాపం.. శంకర్‌ను చూస్తే బాధేస్తుంది' అన్నది.

కారు కొత్త లేబర్ అడ్డా సందులోంచి మెయిన్ రోడ్ ఎక్కింది. వాహనాలు ప్రవాహంలా సాగుతున్నాయి. శశాంక్ మనసు ఆందోళనగానే ఉంది. నిజాన్నింకా జీర్ణించుకోలేకపోతున్నాడు.

***

ఇంటర్‌లో చేరాక కూడా వసంత ఇంటికి వెళ్ళడం మానలేదు శశాంక్. హాస్టల్ నుండి ఎప్పుడు ఇంటికి వచ్చినా అరగంటలో వసంత ఇంట్లో ఉండాల్సిందే ఇంట్లో వసంత, అత్త, మామ ముగ్గురే ఉండేవారు. అప్పుడప్పుడు ఆడబిడ్డలు వస్తూ పోతుండేవారు. భర్త శంకర్ మస్కట్‌లో ఉండేవాడు.

ముగ్గురాడ బిడ్డల పెళ్ళిళ్ళు తనే చేసిందని ఇంటిని నిలబెట్టిందని ఊరువాడ చెప్పుకునేవారు. వసంత ఎప్పుడూ చిరునవ్వుతో నిండుగా ఉండేది. తన కాలేజి సంగతులను చెప్పి నవ్వించాలని చూసేవాడు. ఒక్కోసారి విరగబడి నవ్వేది. అతడి చేతుల్ని గట్టిగా పట్టుకునేది. శశాంక్ కంపించిపోయేవాడు. ఆ స్పర్శ. నవ్వు అతడిలో ఆందోళనను రేపేది. అతడికి దగ్గరగా వచ్చేది. చెంపలు పిండేది.

శశాంక్‌కు బాగా గుర్తు. ఫస్టియర్ వేసవి సెలవులు. హాస్టల్ నుంచి ఇంటికి రాగానే బ్యాగ్‌ను ఇంట్లో వేసి వసంత ఇంటికి చేరాడు. వసంతలో ఏదో మార్పు. గంభీరంగా ఉంది. మొహం మరింత కాంతివంతంగా ఉంది. చనువుగా దగ్గరికి వచ్చింది. శశాంక్ మరింత దగ్గరగా జరిగాడు. గుండె లయ తప్పింది. శరీరంలో వణుకు.

చెవిలో గుసగుసగా 'శశీ.. రేపు నీకో గుడ్ న్యూస్ చెబుతానురా.. ఓ మంచి గిఫ్ట్ ఇస్తాను' అన్నది.

'ఏంటి టీచర్?' శశిధర్ అడిగాడు ఆమె చెవిలో.

'రేపు చెపుతానన్నానా.. అంతే! మళ్ళీ అడక్కూడదు' అన్నది దూరంగా జరిగి.

శశిధర్ తెల్లారేవరకు టెన్షన్‌గా ఎదురు చూసాడు.

అప్పటికి స్కూల్లో చదువుతున్నప్పటి భయంలేదు. చనువు పెరిగింది. మరునాడు లేస్తూనే ఇంటికి పరుగెత్తాడు.

చొరవగా 'ఇప్పుడు చెప్పు. ఏమిటా గుడ్ న్యూస్' అడిగాడు.

అతడిని అదోలా చూసింది వసంత. ఆమె చూపులో మొహంలో ఏదో మార్పు. అంతకు మించి భయం. చనువుగా ఆమెను దాటి వెళ్ళాలని శశాంక్ ప్రయత్నం చేసాడు. అయస్కాంత సజాతి ధ్రువంలా ఆమె నాలుగు అడుగులు వెనక్కు వేసింది.

'రేపటి నుంచి మా ఇంటికి రాకు..' అతడికి అడ్డంగా నిలబడింది. శశాంక్ విస్మయంగా చూసాడు. ఆ కొన్ని క్షణాల్లోనే ఇద్దరి మధ్య ఎంతో దూరం. కొత్తగా అప్పుడే కలుసుకున్నట్టు 'ఏదో గుడ్ న్యూస్ అన్నారుగా ఇదేనా..?' అన్నాడు.

'కాదు.. కానే కాదు..' అంటూ తలుపేసుకుంది.

ఏదో ఉద్వేగాన్ని మనసులో అదిమి పెట్టుకోగలిగింది కాని కళ్ళలోని భావాలను మాత్రం దాచుకోలేకపోయింది. తలుపు వేస్తుంటే ఆమె కళ్ళలోకి చూసాడు శశాంక్. ఆకు చిట్టచివరి అంచును ఆనుకుని సాగిన మంచు బిందువులా ఒక నీటి చుక్క. ఆమె ఇంటికి పోనే పోవద్దనుకున్నాడు. ఆమెను కలవనే కూడదనుకున్నాడు. కానీ మనసు ఆగలేదు.

అప్పటికింకా స్కూళ్ళకు సెలవలు మొదలు కాలేదు. ఒంటిపూట బడి. వసంతను చూడాలని స్కూలుకు వెళ్ళాడు శశాంక్ స్కూలు మానేసి వారం రోజులయిందని తెలిసింది. మరోవారంలో శంకర్ వచ్చాడని తెలిసింది.

***

శశాంక్ ఆలోచనల్లో ఉన్నాడు కారు రాం నగర్ పెట్రోల్ బంక్ ముందు సందులోకి తిరిగి ముద్దసాని రాంరెడ్డి విగ్రహం దాటి టెలిఫోన్ క్వార్టర్స్ వైపు వెళుతుంది.

'అమ్మా.. వసంత టీచర్ ఎందుకిలా అయింది? ఆర్థికంగా ఇబ్బందులేం లేవుకదా..' స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో చేసుకుంటూ అడిగాడు శశాంక్.

'పుష్కలమైన డబ్బు. ఈ కరీంనగర్‌లోనే రెండు బిల్డింగులన్నాయట. అప్పట్లో ఊర్లో పదెకరాల భూమి కొన్నారు. కొన్ని రోజులు వ్యవసాయం చేయించింది వసంత. పుష్కలమైన పంట తీసింది. అల్లం, పసుపు తీరొక్క కూరగాయలు. ఏడాది కింద శంకర్ వచ్చినప్పుడు దాన్ని ప్లాట్లు చేసి అమ్మాడు.. యాభై లక్షలు వచ్చినయట..'' జయమ్మకు చెప్పుకు పోతుంది.

వింటుంటే విచిత్రంగా అనిపిస్తుంది శశాంక్‌కు

ఆనాటి వసంత రూపమే కళ్ళముందు కదులుతుంది. వసంతను తను ఎన్నిరూపాల్లో చూసాడో గుర్తుకు తెచ్చుకుంటున్నాడు.

***

సెలవుల తర్వాత కాలేజీలు మొదలయ్యాయి. దసరా సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు వసంత టీచర్ ఇంటికి వెళ్ళాడు. కాళ్ళు ముందటిలా ముందుకు సాగలేదు.

వసంత లేదు. మరునాడు మాత్రం మార్కెట్‌లో కూరగాయలమ్ముతూ కనిపించింది. అదే అందం. అదే ఆకర్షణ. కాని ఆ పనిలో చూసాక ముందటి ఆరాధన కలగలేదు. యధాలాపంగా శశాంక్‌ను చూసి నవ్వింది. ఆ నవ్వు ముందటిలా అతడిని కదిలించలేదు. శశాంక్‌ను పిలిచి మాట్లాడింది. ముందటిలా 'ఒరే' అనలేదు. పేరు పెట్టి పిలిచింది. చదువు గురించి కాలేజీ గురించి అడిగింది. 'హాస్టల్ ఫుడ్ బాగానే పడ్డట్టుంది. మంచి ఒళ్ళు చేసావు. అప్పుడే పెద్దవాడివైపోయావు' అని నవ్వింది.

మాట.. నవ్వు.. చనువు.. ఆమె ముందులానే ఉంది. ఏదో బేరం వస్తే ఒప్పించి, మెప్పించి అమ్మి శశాంక్‌తో మళ్ళీ మాటల్లోకి దిగిపోయింది.

శశాంక్‌లో మాత్రం ముందటి స్పందన లేదు. ఆమె తక్కువగా కనిపిస్తుంది. తను ఆరాధించిన వ్యక్తిలా కనిపించడంలేదు.

'నువ్వు చెబుతానన్న గుడ్ న్యూస్ ఏమిట'ని అడగాలనుకున్నాడు. ఎప్పుడు మాట్లాడినా టీచర్ అనో, మీరు అనో సంబోదించేవాడు. ఇప్పుడు అలా పిలవాలనిపించడం లేదు.

***

'ఎక్కడికిరా.. ఎక్కడికి వెళుతున్నాం..' జయమ్మ మాటలతో ఉలిక్కిపడ్డాడు శశాంక్.

అప్పటికి కారు ప్రగతినగర్ సందులోకి తిరగకుండా డ్యాం కట్టవైపు సాగిపోతుంది. వెంటనే స్లో చేసుకుని టర్న్ తీసుకున్నాడు. కిరాణా దుకాణం ముందుకి వచ్చి లారెల్ స్కూల్ సందులోకి తిరిగి ఇంటిముందుకు వచ్చాడు.

లోపల్నుంచి పరుగెత్తుకు వచ్చింది సుప్రజ. 'అత్తయ్య.. రండి.. బావున్నారా?' అంటూ చేతిలోని బ్యాగ్‌ను అందుకుంది సుప్రజ. ఇంట్లోకి నడుస్తూ భర్త వైపు తిరిగి 'ఇంత ఆలస్యమైందేంటి... బస్సులేటా..?' అంటూ భర్త మొహంలోకి చూసి ఆగిపోయింది.

శశాంక్ లో ఏదో ఆందోళన. సుప్రజకు వసంత గురించి చెప్పబోతూ ఆగిపోయాడు.

'వాడు ఇల్లేమరిచిపోయాడమ్మా. ... నేను గుర్తుచేసాను కాబట్టి సరిపోయింది' నవ్వుతూ అన్నది జయమ్మ.

'ఇల్లేం ఖర్మ... ఇంట్లో మనుషులను కూడా మరిచిపోతాడు. ఇండ్లను నిలబెడుతున్న మెంటల్ డాక్టర్ కదా..' సుప్రజ నవ్వింది.

జయమ్మ నవ్వుతూ 'మొన్న మన సర్పంచ్ తో మా చిన్నవాడు కరీంనగర్‌లో కౌన్సిలర్ అన్నాను. ఏ వార్డుకమ్మా అన్నాడు' అన్నది.

అత్తాకోడళ్ళుఇద్దరూ నవ్వుకుంటున్నారు.

శశాంక్ మనసు మనసులో లేదు. ముళ్ళమీద నడుస్తున్నట్టుగా ఉన్నాడు. వసంత టీచర్‌ను తను ఎప్పుడు మరిచిపోయాడో గుర్తుచేసుకున్నాడు. ఆలోచనలన్నీ మార్కెట్ వద్దకు వచ్చి ఆగిపోయాయి.

***

మార్కెట్‌లో ఆమెను చాలాసార్లు చూసాడు. కలిసిన ప్రతిసారి ఆమె మాట్లాడేది. మాట్లాడ్డం జీవితంలో ఒక భాగం అన్నట్టు అతి సహజంగా మాట్లాడేది. కొన్ని రోజుల తర్వాత ఇంట్లో కిరాణా దుకాణం పెట్టింది.

'పట్టుబట్టి ఆర్ట్స్ తీసుకున్నావు. ఎవడురా నీకు సలహా ఇచ్చింది?' అన్నలు ఎప్పుడూ నవ్వుతూ అనేవారు. అన్నప్పుడల్లా వసంత టీచర్ గుర్తుకొచ్చేది. ఆమె ఇస్తానన్న స్వీట్ గిఫ్ట్ గుర్తుకొచ్చేది. రోజులు గడుస్తుంటే ఆమె జ్ఞాపకాలు మసకబారిపోయినా గిఫ్ట్ గురించిన ఆసక్తి మాత్రం ఎక్కువవుతూ వచ్చింది.

రకరకాల వయసులో రకరకాల ఆలోచనలు. ఎమ్మే సైకాలజీచేస్తుండగా ఆ గిఫ్ట్ ఒక ముద్దు అనుకున్నాడు. హిప్నటిజంలో డాక్టరేట్ చేస్తుండగా ఆ గిఫ్ట్ ఏమిటో తెలుసుకోవాలన్న ఆలోచన వచ్చింది. అది ఆసక్తిగా మారింది.

కౌన్సిలింగ్ సెంటర్ పెట్టాక ఇంటికి వెళ్ళినప్పుడు వసంతను కలుసుకున్నాడు. ఇంట్లో పిండిగిర్నీ గ్రైండింగ్ మిషన్ పెట్టినట్టున్నారు. ఎవరో మొక్కజొన్నలు తెస్తే పిండి ఆడిస్తుంది. కూర్చోమని మొహం కడుక్కొని వచ్చింది. అదే అందం అదే ఆకర్షణ. కొద్దిగా ఒళ్ళు చేసింది. పాపిట్లో ఒకటి రెండు వెండితీగలు.

శశాంక్‌కు ఎలాంటి ఉద్విగ్నత లేదు. ఆందోళన లేదు. ఆమె ఎదురుగా వచ్చి నిలబడ్డా, నవ్వినా ఆతృతగా లేదు. ఇంట్లో వదినలతో మాట్లాడుతున్నట్టుగానే ఉంది. కాని విచిత్రంగా వసంతనే వణికిపోతుంది. బిడియపడుతుంది. వసంత 'మీరు' అంటూ బహువచనంతో మాట్లాడుతుంది. అలా అనకూడదన్న చనువును తీసుకోలేకపోతున్నాడు శశాంక్.

ఆమె తడబడుతుంది. టీ తెచ్చి ఇచ్చింది.

'నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి కారణం మీరే' అని మాత్రం అన్నాడు. అది ఒప్పుకునేంత స్థాయిలో కూడా ఆమె లేదు. ఒప్పుకుంటే ఆ వైపు నుంచి నాలుగు మాటలు మాట్లాడాలనుకున్నాడు. సంభాషణ పొడిగించవచ్చనుకున్నాడు. అతడికి చదువు చెప్పినట్టు స్పృహ కూడా ఆమెకు లేదు.

'ఆ.. నేను చెప్పిందేం లేదు. అంతా మీ పట్టుదల' అంది.

అప్పుడే హోటల్ రాజు మూడు స్టీల్ క్యాన్‌లు పట్టుకుని గ్రైండింగ్ కోసం వచ్చాడు.

'రేపటి నుంచి గ్రైండింగ్ కోసం రాకు' రాజుతో చెప్పింది వసంత.

'వామ్మో... మూడునెల్లు ఎలా సచ్చేది..' అంటూ రాజు తల బాదుకున్నాడు.

'ఎలా చస్తావో.. యాడ చస్తావో నీ ఇష్టం. అర్ధరాత్రి అపరాత్రి తెలీకుండా ఎప్పుడొస్తే అప్పుడు గ్రైండింగ్ చేసి ఎప్పుడిస్తే అప్పుడు తీసుకున్నాను. మూడు నెలలకే ఖాతా మార్చకు' అంటు అతడి వెంట కదిలింది. అడగాలనుకున్నది అడగలేకపోయాడు శశాంక్. ఇంటికి తిరిగి వచ్చాడు.

***

'టీ చల్లారిపోతుంది.. ఏమిటా పరధ్యానం..' మందలించింది సుప్రజ.

ఉలిక్కిపాటుగా టీని అందుకుని రెండుగుక్కల్లో కప్పును ఖాళీచేసాడు శశాంక్. తల్లి ఏదో చెప్పబోతుంటే అడ్డుపడి 'అమ్మా.. వసంత టీచర్‌కు పిచ్చి ఎప్పుడు మొదలయింది..?'అడిగాడు.

మరోసారి విస్మయంగా చూసిన జయమ్మ 'ఏడాది దాటిందిరా.. అంత డబ్బును ఒక్కసారిగా చూస్తే మతి చలించిందని కొందరు.. ఎవరో ఓర్వలేక చేతబడి చేసారని కొందరు... రకరకాల మాటలు ఏదిఏమైనా వసంత జీవితంలో చాలా కష్టపడ్డదిరా..' చెబుతూనే ఉంది.

సుప్రజకు ఆశ్చర్యంగా ఉంది. పెళ్ళయ్యాక నెల అటూ ఇటూ తప్ప ఊర్లో ఎప్పుడూ ఉన్నది లేదు. 'ఎవరీ వసంత?' అని ఆలోచిస్తోంది..

శశాంక్ బయటకు వచ్చి కారెక్కాడు. పది నిమిషాల్లో కారు సెయింట్ జాన్ స్కూల్ దాటి ఆల్ఫోన్స్ పక్క సందు ముందు ఆగింది. ఇంతకు ముందు అతడు వసంతను చూసింది అక్కడే!

అలా ఆగాడో లేదో... ఇలా కనిపించింది వసంత. దగ్గరగా వచ్చింది.

ఆమెను పిలవాలనుకున్నాడు శశాంక్. ఏమని పిలవాలని సందేహం... సంశయం. పిలవడానికి గొంతు పెగలలేదు. ఆ వసంతకు ఈ వసంతకు పోలికే లేదు. ఈ వసంత ముసలిదైపోయింది. చూపులో, నిర్లిప్తత. బొక్కలు తప్ప మాంసం లేదు. దాటి పోతుంది. పిలవాలి ఎలా..? మళ్ళీ కనిపించదేమో... ఒక క్షణం బాగుండు... వసంతా... వసంతా.. శశాంక్ గొంతునుంచి పిలుపు తన్నుకు రాలేదు. పిలిచి మాత్రం ఏం చేయగలను అని ప్రశ్నించుకున్నాడు. ఆమె కోసం అంత దూరమైతే వచ్చాడు. ఇప్పుడు కలవడం అవసరమా అనుకుంటున్నాడు.

వసంత వెళ్ళిపోయింది. నిమిషంలో మాయమైపోయింది. శశాంక్ వెళ్ళిపోదామనుకున్నాడు. వెళ్ళాలనిపించడంలేదు. డబ్బు ఉండి, చక్కటి కుటుంబం ఉండి అన్నింటికి మించి గుండె నిబ్బరం ఉన్న వసంత ఇలా ఎందుకయిందన్న ప్రశ్న జుగుప్సను, జాలిని మించి అతడిని వేధిస్తుంది. సజిషన్ థెరపిస్ట్‌గా, హిప్నోటిస్ట్‌గా అతడిని నిలదీస్తుంది.

'వసంత నాకెప్పుడూ ఒక ప్రశ్ననే' అనుకున్నాడు. పోవాలా ఉండాలా వెతకాలా అని ఆలోచించుకుని నిర్ణయించుకునేలోపే వసంత మళ్ళీ వచ్చింది. ముందు నుంచే వెళ్ళిపోయింది.

ఆమెను అంచనా వేసుకుని ఆ లక్షణాలేమిటో ఊహించుకునే లోపే మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చింది. తల తిప్పడం లేదు. ఎటూ చూడడం లేదు. ఎక్కడా ఆగడం లేదు. రోడ్డు వెంట కొద్దిదూరం వెళుతుంది. వెనక్కి తిరుగుతుంది. సందులోకి వెళుతుంది. మళ్ళీ వెనక్కి వస్తుంది.

రోడ్డు మీద ఎక్కడ మలుపు తిరుగుతుందో చూసాడు శశాంక్. చివరగా ఉన్న ఒక ఇంట్లోకి వెళుతోంది.. రెండుమూడు నిమిషాల్లో బయటకు వస్తోంది..

చూస్తుంటే ఆసక్తి పెరుగుతోంది శశాంక్‌కు. ముందుగా అదో ఎక్జయిట్ అనుకున్నాడు. అది దాటిన లక్షణాలు కనిపిస్తుంటే హిస్టీరియా అనుకున్నాడు. ఆమె నడకను చూస్తుంటే ఎక్కడా రోడ్డు ఎక్కడం లేదు. సేఫ్‌గా ఉన్నచోటనే క్రాస్ చేస్తోంది. హిస్టీరియాలో కన్వర్షనా అని తర్కించుకుంటుంటే 'నీకు అవసరమా...?' అని మనసు అడ్డం తిరిగింది.

అన్ని పరిధులను దాటి ఆ ఇంట్లోకి అడుగుపెట్టాడు శశాంక్. ఇల్లు చిన్నదైనా బాగుంది. హాల్లో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. చూడగానే అతడు వసంత తండ్రిగా గుర్తించాడు శశాంక్. వైరాగ్యం తర్వాత, ప్రపంచంలోని అన్ని భ్రమలను ఒదిలించుకున్న తర్వాత, ఇదంతా మిధ్య అని తెలుసుకున్న తర్వాత మనిషి ఎంత ప్రశాంతంగా ఎంత నిండుగా ఉంటాడో అంత నిండుగా ఉన్నాడు అతడు. శశాంక్ కు ఆశ్చర్యమనిపించింది.

శశాంక్ ను చూసి 'ఎవరు బాబు?' అన్నాడు.

శశాంక్ తనను తాను పరిచయం చేసుకుని వసంత గురించి చెప్పి కూర్చున్నాడు. అతడు పని మనిషిని పిలిచి కాఫీ తెప్పించాడు. వసంత గురించి తనే కదిలించాడు శశాంక్. వయసు డెబ్బయి పైనే ఉంటుంది. ఇంట్లో తండ్రీ కూతుళ్ళిద్దరూ, పనిమనిషి మాత్రమే ఉన్నట్టున్నారు. అతడు లేవలేని స్థితిలో ఉన్నట్టున్నాడు. గొంతు వణుకుతోంది. చెవులు వినపడటం లేదు. చూపు కూడా ఆనడం లేనట్టుంది.

వసంత గురించిన స్పృహ లేనట్టుగానే మాట్లాడాడు అతడు. అరగంటలో వచ్చే రైలు కోసం రైల్వే స్టేషన్లో కూర్చున్న వ్యక్తిని స్టేషన్ సమాచారం అడిగినట్టుగా అనిపించింది. చివరగా చూస్తే మాత్రం ఆయన కళ్ళల్లో తడి కనిపించింది.

'డాక్టరుకు చూపించారా...?' అడిగాడు శశాంక్.

సమాధానంగా అతడు పనిమనిషికి సైగ చేసాడు. ఆ సైగను ఎన్నోసార్లు చూసినట్లు, అది అలవాటయినట్టు ఒక ఫైళ్ళ కట్టను తెచ్చి ముందుంచింది పనిమనిషి.

రిపోర్ట్స్ అన్నీ వసంత పిచ్చిదనే చెపుతున్నాయి. చాలామంది డాక్టర్లు చాలా హాస్పిటల్స్ బ్రెయిన్ స్కాన్. శరీర అవయవాలన్నీ స్కాన్. కరెంట్ షాక్స్. మత్తు మందులు.. ఇంకా శశాంక్‌కు తెలియనివి ఏవేవో ఉన్నాయి. రిపోర్ట్స్ చూస్తుంటే వసంత వచ్చింది. ఆమెనే పరిశీలనగా చూసాడు శశాంక్. అడుగుదూరంలో ఉన్న వస్తువులు మాత్రమే కనిపిస్తున్నట్టు అడుగులో అడుగువేసుకుంటూ వచ్చింది. బాత్ రూం ముందుకు వెళ్ళింది. కాళ్ళు కడుక్కుంది.

'వసంతా.. నేను శశాంక్ ను.. మీ స్టూడెంట్‌ను' పిలిచాడు శశాంక్. వసంత తిరిగి చూడలేదు. ఆమెలో స్పందన లేదు. హాల్లోకి వచ్చింది. గోడకు వేళ్ళాడుతున్న ఫోటోలను చూసుకుంది. పిలిచినా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది. కీ ఇస్తే తిరిగే మరబొమ్మలా అనిపించింది.

శశాంక్‌కు విచిత్రంగా అనిపించింది. ఆమె తండ్రిగాని పనిమనిషిగాని ఇది మామూలే అన్నట్టుగా ఉన్నారు. ఏదో అనుమానం వచ్చి గోడలకు తగలేసిన ఫోటోలను చూసాడు శశాంక్.

ఆ గోడకు ఫోటోలు పదివరకున్నాయి. అన్ని వసంత ఫోటోలే. చదువు చెబుతున్నప్పుడు, కిరాణం అమ్ముతున్నప్పుడు, గిర్నీ నడుపుతున్నప్పుడు, వ్యవసాయం చేస్తున్నప్పుడు రకరకాల పనుల్లో ఉన్నప్పుడు దిగినవి. వాటిని ఎందుకు చూసింది అన్న అనుమానం మొదలయింది శశాంక్‌కు. ఆ అనుమానం ఎప్పుడైతే మొదలయిందే ఒక్కొక్కటిగా ఆమెకు సంబంధించిన ప్రశ్నలు మొదలయ్యాయి. వెంటనే తండ్రి వద్దకు వచ్చాడు శశాంక్.

'మీరంతా ఆమె మైండ్‌కే చికిత్స చేసారు. కాని మనసుకు చేయలేదు. మీరనుకున్నట్టు ఆమె పిచ్చిది కాదు. ఏవో జ్ఞాపకాలు ఆమెను వెంటాడుతున్నాయి' అన్నాడు శశాంక్.

తండ్రి స్పందించలేదు. నిర్వేదంగా చూసాడు. పని మనిషి మాత్రం దగ్గరకు వచ్చింది. 'చాలామంది డాక్టర్లకు చూపించారు బాబూ.. శంకర్ బాబుకు ఈమె అంటే ప్రాణం. ఇప్పటి వారానికోసారి వచ్చి ఏడుస్తూ వెళతాడు. పిలిస్తే పలకదు. కూర్చోమంటే కొద్దిసేపు కూర్చుంటుంది. మళ్ళీ ఇదే తిరగడం...' చెప్పింది.

'నిద్రపోతుందా..?' అడిగాడు శశాంక్.

'తెలియదు బాబు... రాత్రిపూట మాత్రం చీకటిపడగానే ఇంట్లోకి వచ్చి పడుకుంటుంది. పొద్దు పొడిచేవరకు లేవదు' అన్నది.

శశాంక్ ఆమె పేరును తెలుసుకున్నాడు. నందమ్మ అని చెప్పింది. రాత్రి పగలు ఇక్కడే ఉంటానని చెప్పింది. 'వసంత ఏదో సంఘటనతో మానసిక వేదనకు గురయిందమ్మా.. అది తెలుసుకుంటే చికిత్స చేయడం తేలిక. మీరనుకుంటున్నట్టు ఆమె పిచ్చిది కాదు. నేను కూడా డాక్టరునే... ఆమె ఏ విషయంగా బాధపడుతుందో తెలిస్తే నెల రోజుల్లో మామూలు మనిషిని చేస్తాను' అన్నాడు శశాంక్.

ఆమె అతడివైపు ఆసక్తిగా చూస్తూ 'వీళ్ళు నాకు బాగా తెలుసుబాబూ.. ఒకరకంగా బంధువులే! నాకు తెలిసి వసంతకు బాధపెట్టే సంఘటన ఏదీ జరగలేదు. భర్త అత్తమామ ఆడబిడ్డలు ఎవరైనా వసంత మాట వినేవారే కాని నొచ్చినోట మాటనలేదు. ఈ అమ్మ ఎంతంటే అంత. భర్త ఇంటిపట్టున లేక సంసారమంతా తనే నడిపింది. తను అత్తవారింటి అడుగు పెట్టిన్నాడు అది పూరి గుడిసె. కుప్పలు కుప్పలుగా అప్పులు. ముగ్గురు ఆడబిడ్డలు.. అప్పుడు గుండె చెదరలేదు. ఇప్పుడు ఏడంతస్తుల మేడలో హాయిగా ఉండాల్సిన సమయంలో ఇలా.." కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

సెల్ తీసి అసిస్టెంట్ వెంకట్‌కు ఫోన్ చేశాడు శశాంక్. అరగంటలో టేపు రికార్డర్ క్యాసెట్‌తో వచ్చాడు వెంకట్.

విషయమంతా విని 'పిచ్చివాళ్ళు హిప్నటైజ్ కావడమేమిటిసార్..' అని అడిగాడు ఆశ్చర్యంగా.

శశాంక్ నవ్వి 'అందరిలాగే నువ్వూ పొరబడుతున్నావు. ఆమె తన పనులు చేసుకుంటున్నప్పుడు ఫోటోలు చూస్తున్నప్పుడు స్పాంటేనియస్‌గా హిప్నటైజ్ అవుతుంది. ఆమె స్కిజోఫ్రినియా పేషెంట్. అదీ సింపుల్ స్కిజోఫ్రినియా.. సోమ్నాంబులిస్టిక్ స్థితికి సులభంగా తీసుకెళ్ళవచ్చు. ఆ తర్వాత ఏజ్ రిగ్రేషన్. సమస్య ఏమిటో ఆమె చెబుతుంది' అంటూ అసిస్టెంట్‌ను నందమ్మకు పరిచయం చేసాడు.

రెండు రోజులు కన్సల్టింగ్ పని మీద హైదరాబాద్ వెళ్ళాడు శశాంక్. ఇంటికి వస్తుంటే వెంకట్ ఫోన్ చేసాడు. ఎత్తి 'హలో వెంకట్.. ఎనీ ప్రోగ్రెస్' అడిగాడు శశాంక్.

'మార్వలెస్ సర్.. ఆమె హిప్నటైజ్ అవుతోంది. తొందరగానే సెన్సరీ ఏక్టివిటీకి వెళుతోంది. హైపర్ నేషియా కూడా పెరుగుతోంది. విచిత్రంగా పోస్ట్ హిప్నోటిక్ సజెషన్స్ పనిచేస్తున్నాయి. ఓన్లీ షి ఈజ్ డిప్రెషన్ పేషెంట్.. నాట్ మ్యాడ్' అన్నాడు ఆనందంగా.

శశాంక్ మనసు ఒక్కసారిగా ఉప్పొంగింది. ఫ్రాయిడ్ అంతః చేతనం గుర్తుకొచ్చింది. తనకు ఇస్తానన్న గిఫ్ట్ ఏమిటో తెలుసుకోవడం కొరకే ఇది చేస్తున్నానా.. ఆ కోరిక అతి క్రూరంగా నా ఇడ్‌లో దాగి ఉందా.... అనుకున్నాడు. మనసులోని సూపర్ ఇగో అదికాదని హెచ్చరించింది. ఓ కౌన్సిలింగ్ డాక్టర్‌గా ఆమెకు జీవితాన్ని ఇస్తున్నానని సర్ది చెప్పింది.

శశాంక్ ఇంటికి వెళ్ళకుండా నేరుగా వసంత ఇంటికే వచ్చాడు. ఆలోచిస్తుంటే అతడికి కూడా అది ఒక ఫజిల్‌లా అనిపిస్తోంది.

వెళ్ళేసరికి వెంకట్ ఇంట్లోనే ఉన్నాడు. వసంత తండ్రి నిర్లిప్తంగా ఉన్నాడు. నందమ్మ మాత్రం ఆతృతగా ఉంది. వసంత హిప్నోటిక్ నిద్రలో ఉంది. బాడీ కదలికలు శ్వాస చూస్తే లెదార్జిక్ స్టేజిదాటినట్టుంది.

శశాంక్‌ను చూడగానే పట్టరాని సంతోషంతో నందమ్మ 'వసంత మాట్లాడింది బాబూ.. తన పేరు చెప్పింది. శంకర్ పేరు పిల్లల పేర్లు కూడా చెప్పింది... చాలా రోజుల తర్వాత తన మాటను విన్నాను బాబు' అన్నది గుసగుసగా.

వెంకట్ సజెషన్స్ ఇస్తున్నాడు. ఆమె స్పందిస్తోంది. శశాంక్ కూడా ట్రాన్స్‌లోకి వెళుతోందని. ఆమెలో కళాత్మకత, క్రియేటివిటీ, దృఢ సంకల్పం ఇవేవీ నశించిపోలేదని అన్నీ సజీవంగా ఉన్నాయని గుర్తించాడు.

కొద్దిసేపు ట్రాన్స్‌లో ఉంచి రేపటి కోసం ఒక పోస్ట్ సజెషన్ ఇవ్వమని సైగలతో చెప్పాడు శశాంక్. వెంకట్ అలాగే చేసాడు. ట్రాన్స్‌లోంచి ఆమె లేవకముందే బయటకు వచ్చాడు శశాంక్.

పోస్ట్ సజెషన్ బాగా పనిచేసింది. మరునాడు మధ్యాహ్నం వెంకట్ ఇచ్చిన కొన్ని సజెషన్స్‌తోటే హెల్యూజినేషన్ స్థితి దాటి సోమ్నాంబులిస్టిక్ స్థితికి చేరుకుంది వసంత. హిప్నోటిజంలో ఇది అతిగాఢ స్థితి.

అంతవరకు ఆమెకు కనిపించకుండా దాక్కున్న శశాంక్ బయటకు వచ్చాడు. నందమ్మను వెంకట్‌ను బయటకు పంపి మంద్రమైన గొంతులో ఏజ్ రిగ్రేషన్ మొదలు పెట్టాడు.

కొన్ని కొన్ని సంఘటనలను బేసిక్‌గా ఆమె వయసును తగ్గిస్తూ వివిధ సందర్భాల్లో మనసులోని మాటలను ప్రవర్తనను తెలుసుకోవడమే ఏజ్ రిగ్రేషన్. మానసికంగా వయసును తగ్గించి చిన్నతనంలోకి తీసుకెళ్ళడం.

ఆమెకు పెళ్ళయిన దగ్గరినుంచి మొదలుపెట్టాలనుకుని ముందే క్వొశ్చనీర్‌ని తయారు చేసుకున్నాడు. పెళ్ళినాటి జ్ఞాపకాలను ఆమె గుర్తుచేసుకోవడానికి అరగంట టైం పట్టింది. వసంత మొహం నిండా వెలుగు. బుగ్గలపై సిగ్గు పెదవులపై చిరునవ్వు. ట్రాన్స్‌లో జ్ఞాపకశక్తి పెరిగినా ఇమాజినేషన్ పెరగదు. అది పూర్తిగా పర్సనల్. ఇమాజినేషన్ లేనిదే ట్రాన్స్‌లోకి వెళ్ళరు. వసంతకు అన్నీ కావలసినంత ఉన్నా నిర్లిప్తతే వాటన్నింటిని అదుపులో పెట్టుకుని మనసును మనిషిని గడ్డకట్టిస్తుందనుకున్నాడు. ఒక చిన్న ఫోబియా కూడా ఇంత మాయని చెయ్యగలదని అతనికి తెలుసు. 'నువ్వు అత్తారింటికి అడుగు పెట్టావు... అవునా..?' అడిగాడు శశాంక్.

'అవును' వసంత అంది.

'నీకు పెళ్ళి ఇష్టమేనా..?'

'లేదు. ఇంటర్ ఫాసయ్యాను. ఇంకా చదువుకోవాలని ఉంది. కట్నం లేదని బలవంతంగా చేసారు'

'అత్తవారింట్లో ఎలా ఉంది..?'

"భయంగా ఉంది. ఆయన చాలా మంచివారు.. మస్కట్ వెళతానంటున్నాడు. నా కిష్టం లేదు. వద్దని చెప్పా. ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళి ఎలా చేయాలి అంటున్నాడు. అవును ఎలా చేస్తాం.. కళ్ళు మూసి తెరిస్తే అయిదేళ్ళు. ఆ పైన ఏ బాధలుండవు కదా... హాయిగా ఉండొచ్చు..'

తయారుచేసుకున్న ప్రశ్నలు కొంతవరకే ఉపయోగపడతాయి. తర్వాత ప్రశ్నలు జవాబుల్లోంచే పుట్టాలి. సంక్లిష్టంగా ఉండకుండా సరళంగా ఉండాలి. ఆమె ఊహ జీవన స్రవంతిలో కరెంట్‌కు సంబంధించి ఉండాలి.

ఒక్కొక్క ఏడాది జరుపుతూ శంకర్ మస్కట్ నుండి తిరిగి వచ్చిన రోజును గుర్తుకు తెచ్చాడు శశాంక్.

మనసులోనే కాదు. భావాలన్నీ మొహంలో కూడా ప్రతిఫలిస్తున్నాయి. ఆ రోజు గుర్తుకుతేగానే వికసిస్తుందన్న వసంత మొహం వాడిపోయింది. ఆమె కంఠం వణుకుతోంది. 'వద్దు.. నువ్వు మళ్ళీ వెళ్ళొద్దు.. నాతోనే ఉండాలి... ప్లీజ్' పలవరిస్తోంది వసంత.

'శంకర్ ఏమంటున్నాడు..?' మంద్రంగా అడిగాడు శశాంక్.

'మూడు నెలలుండి మళ్ళీ వెళతానంటున్నాడు. ఒక్కసారి వెళ్ళొస్తానంటున్నాడు. ఆడబిడ్డల పెళ్ళిళ్ళు అయిపోయాయి కదా.... ఇంకేం బాధ అన్నాను. బాధ్యతలైతే తీరాయి కానీ మనం ఒట్టి చేతులతోనే ఉన్నాంకదా అంటున్నాడు..' మాటలు మంద్రంగానైనా ప్రవాహంలా తన్నుకు వస్తున్నాయి.

మూడు నెలలు ముందుకు జరిగి శంకర్ వెళ్ళే రోజును గుర్తుకు తెచ్చాడు శశాంక్. వసంత ఏడుస్తుంది. ఏడుస్తూనే 'అవును. డబ్బు అవసరమే కదా.... ఇంకొన్ని అప్పులున్నాయి. ఎలా తీర్చేది. ఐదేళ్ళు ఓపిక పడితే హాయిగా ఉండొచ్చు. పైగా ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళ పెళ్ళిళ్ళు చేయొద్దు..' అంటోంది.

సంఘటనలు జరుపుతూ వెళుతుంటే ప్రైవేట్ స్కూల్లో చేరిన విషయం చెప్పింది వసంత. శశాంక్ గుండె లయ తప్పింది. సున్నితంగా శశాంక్ పేరును గుర్తుచేసాడు.

వసంత స్పందించలేదు. స్కూలు వాతావరణం గుర్తుచేసాడు. వెంటనే స్పందించింది. సోషల్ టీచర్‌గా చేరినట్టు చెప్పి ప్రిన్సిపల్ కృష్ణమోహన్ గుర్తుచేసింది. పర్సనల్ విషయాలు, రహస్య విషయాలు అడిగితే మౌనం.

శశాంక్ ఆసక్తిగా వింటున్నాడు. అప్పటి జ్ఞాపకాలు లీలగా కదిలాయి. కృష్ణమోహన్ గురించి అడుగుతున్నప్పుడల్లా ఆమె మొహంలో సిగ్గు. శశాంక్‌ను గుర్తుచేసి గిఫ్ట్‌ను గుర్తుచేస్తే ఈసారి వెంటనే స్పందించింది. ఆమె మొహం నిండా నవ్వు.

'శంకర్ వస్తున్నాడు. మంచి పెన్ను తెమ్మన్నాను. వాడికి పెన్ను ఇవ్వాలి. బాగా చదువుకుంటున్నాడు.' చెప్పింది. శశాంక్‌లో ఎలాంటి ఉద్వేగం లేదు. ఆ సమాధానం అప్పుడు చెప్పినా.. ఐదు పదేండ్ల కింద చెప్పినా చప్పబడిపోయేవారు. ఇప్పుడు ఆమె మీద ఎనలేని గౌరవం కలుగుతుంది.

ఆ గిఫ్ట్‌ను ఎందుకు ఇవ్వలేక పోయావన్న సమాచరాన్ని రాబట్టాడు శశాంక్. అప్పుడు ఆమె మొహం పాలిపోయింది. శంకర్ అపార్థం చేసుకుంటాడని రావద్దొని చెప్పానంది. అడుగుతుంటే వసంత గురించి కొత్త విషయాలు తెలుస్తున్నాయి. ఆమె ఒంటరి జీవితానికి అలవాటు పడుతున్నట్టు తెలుస్తుంది. అతడున్న మూడు నెలలు ఆమె చాలా జాగ్రత్తగా ఉంటుందని తెలిసింది. ఆమె అందం శంకర్‌లో ఎన్నో అనుమానాలని కలిగిస్తుందని అడుగడుగునా ఆ అనుమానాల నివృత్తి కోసం ఆమె నటించాల్సి వస్తుందని తెలిసింది. ఎంత ట్రాన్స్‌లో ఉన్నా ఇష్టంలేని విషయాలు చెప్పారు. వసంత కూడా కొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటోంది.

ఐదేండ్ల ఎడబాటు అతనిలో అనురాగాన్నే కాదు, కించిత్తు అనుమానాన్ని కూడా కలిగిస్తుందని తెలిసింది. అలా అనుకుంటున్నాడని ఆమెకు తెలుసు. ఆమెకు తెలుసని అతనికి తెలుసు. ఎవరూ ఎక్కడా అనరు. కాని నీడలా అది వేధిస్తూనే ఉండేదని వసంత సమాధానాలను బట్టి అర్థం చేసుకున్నాడు శశాంక్.

వింటుంటే జాలివేస్తుంది శశాంక్‌కు. డబ్బు, హోదాను చూసి అంతా సుఖమే అనుకునే మనుషులకు అంతరాళంలో గూడుకట్టుకున్న వేదన ఎలా ఉంటుందో తనకు కొత్తకాకపోయినా ఊహించని కొత్తకథను తెలుసుకున్నట్టుగా ఉంది.

శంకర్ విజా మీద మళ్ళీ వెళ్ళే రోజును గుర్తుకు తెచ్చాడు శశాంక్.

ఇని సంఘటనల్లో ఎప్పుడూ కదిలిపోనంతగా కదిలిపోయింది వసంత. వణికిపోతోంది. 'ఆయన వెళ్ళొద్దు... నాతోనే ఉండాలి.. వద్దు. ఒంటరిగా నేనుండలేను...' అంటూ మంచంలో పడుకున్నదల్లా కదిలిపోతోంది.

'ఎందుకు వెళుతున్నాడు..?' అడిగాడు శశాంక్.

'ఇల్లు కొన్నాము. కొంత పొలం కొన్నాం. చేతుల్లో డబ్బులేదు. అయితేనేం... అప్పులేదు.. మనకిద్దరు పిల్లలున్నారు గదా.. వాళ్ళ చదువులెట్లా పెళ్ళిళ్ళు ఎట్లా అంటున్నాడు. నాకేదీ వద్దు. అతడే కావాలనిపిస్తుంది. చెప్పండి... అతడిని వద్దని చెప్పండి..' వసంత ఏడుస్తోంది.

శశాంక్‌కు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సజెషన్స్ ఇవ్వడానికి గొంతు పెగలలేదు. రిలాక్స్‌డ్ సజెషన్స్ ఇచ్చి బయటకు వచ్చాడు. వెంటనే వెంకట్ వెళ్ళి ట్రాన్స్ నుంచి బయటకు వచ్చే సజెషన్స్ నెమ్మదిగా మొదలు పెట్టాడు.

నందమ్మ ఆతృతగా ఎదురొచ్చి 'బాబూ.. ఏమంటుంది?' అని అడిగింది.

నవ్వుతూ ఆమె భుజం తట్టి 'తప్పకుండా తేరుకుంటుంది' అంటూ బయటపడ్డాడు.

మరునాటి కోసం మరో క్వశ్చనీర్ తయారు చేసుకున్నాడు. వసంతను చూస్తుంటే వ్యాకులతతో న్యూరోసిస్ రోగిగా మారి స్కిజ్రోఫినియాగా రూపాంతరం చెంది అది హిస్టీరియాగా పరిణమించిందనిపిస్తుంది. ఒక రోగం అలా పరిణామం చెందడానికి బలమైన కారణం కావాలి. అదే వేలో ఆమె రిపోర్ట్‌ను తయారు చేసాడు.

మరునాడు ఆ చీకటి గదిలో నేరుగా ఏజ్ రిగ్రేషన్ మొదలు పెట్టాడు.

పిండి గిర్నీ గుర్తుచేసింది ఈసారి శంకర్ వస్తున్నాడని తెలిసి. ఆమె మొహంలో సంతోషం లేదు. వెళుతున్నప్పుడు కదలికలేదు. ఐదేండ్లుగా చేసిన కూరగాయల బేరాన్ని కిరాణం దుకాణాన్ని అతడున్న మూడు నెలల దూరం పెట్టడానికి మాత్రం బాధ పడింది. అతడి మీదున్న మనసును అతడు ఉండడని తెలిసాక వృత్తి మీదకి తిప్పుకుందని ఆమె సమాధానాలు బట్టి తెలుస్తోంది.

ఒకదశంలో అతడున్న మూడు నెలలు ముళ్ళమీద గడిపినట్టుగా గడిపింది. చిన్నపొలాల్ని అమ్మి పెద్ద పొలం కొన్నాడు. అలా కూరగాయల వృత్తిపోయింది. చిన్న ఇల్లును అమ్మి పెద్ద ఇల్లును కొన్నాడు. అలా కిరాణం పోయింది. పెద్ద ఇల్లును అమ్మి బిల్డింగ్ కొన్నాడు. అలా గ్రైండర్ గిర్నీ వృత్తిపోయింది. శంకర్ వచ్చినప్పుడల్లా ఏదో మార్పు. అతడితో మూడు నెలలు గడపడానికి అన్ని సంబంధాలను పనులను వదిలించుకుని అతడి కోరికే వేచి ఉన్నట్టు ఐదేళ్ళు ఉగ్గ బట్టుకుని పలవరిస్తున్నట్టు నటిస్తూ అతని ఇగోను సంతృప్తి పరచడం ఆమెకు అలవాటయిపోయింది.

పిల్లల చదువులున్నాయని ఒకసారి, పెళ్ళిళ్ళకు డబ్బు అవసరం కదా అని ఒకసారి... రకరకాల కారణాలు చెప్పి అతడు పొడిగించుకుని వస్తుంటే తర్వాత తర్వాత స్పందించడం మానేసి భయపడడం మొదలుపెట్టింది. విషయాలన్నీ ఆమె నోటి వెంటే విన్నాడు శశాంక్.

ఏజ్ రిగ్రేషన్‌లో కూతుళ్ళ పెళ్ళిళ్ళ వరకు తీసుకొచ్చాడు శశాంక్.. చెప్పింది వసంత.

'నీకు బాధగా లేదా..?' అడిగాడు శశాంక్.

'లేదు..' షాక్ తగిలినట్టయ్యింది శశాంక్‌కి.

'ఏం.. ఎందుకు..?' అడిగాడు.

ఆమె అదే ట్రాన్స్‌లో ఉంది. మొహం నిండా నిర్లిప్తత. గదిలో ఒకే ఒక చిన్న లైటు. ఆ మసక వెలుతురులో కూడా ఆమె మొహంలోని నిర్లప్తత స్పష్టంగా కనిపిస్తోంది.

'కలిసి ఉండాల్సిన వయసులోనే కలిసి లేము. ఇప్పుడు కలిసుండి చేసేదేముంది నష్టమే తప్ప'

'నష్టమా.. ఏమిటిది..?' అడిగాడు శశాంక్. 'అతడుంటే పనికి వెళ్ళనివ్వడు. వ్యవసాయం చెయ్యనివ్వడు. నా పదెకరాల భూమితో వందల మంది బతుకుతున్నారు. నాలుగు కుటుంబాలైతే నా భూమి మీదనే బతుకుతున్నాయి' అన్నది.

'ఇప్పుడు వ్యవసాయం ఎలా ఉంది.?' అడిగాడు శశాంక్.

'బాగుంది. తీరొక్కపంట. బంగారం పండుతుంది. నేనే పెద్దరైతును. నాకు పెట్టుబడికి కొదువలేదు. కోమటి నా ఇంటికే వస్తున్నాడు. ఎరువులు విత్తనాలు ఇంటి ముందుకు వస్తున్నాయి. చేతినిండా దానం చేసుకుంటున్నాను. చేతికింద పది మంది పని చేస్తున్నారు' చెప్పింది.

సమస్య ఎక్కడ ముడిపడిందో తెలిసిపోయింది శశాంక్‌కి. ఆమెను కదిలించాలని అన్నాడు.

'పొలాన్ని అమ్మెయ్యి.. హాయిగా ఇంట్లో కూర్చుని బతకొచ్చు. ఎందుకు కష్టం' అన్నాడు.

మంచంలో వసంత కోపంగా కదిలింది. 'ఛీ.. పొలంలో పని చేస్తున్నప్పుడు కలిగే సుఖం ఇంట్లో కూర్చున్నప్పుడు ఎలా కలుగుతుంది. పదిమందికి అన్నం పెడుతున్నప్పుడు కలిగే తృప్తి ఒక్కరు తింటే ఎక్కడ ఉంటుంది?' అన్నది.

'లేదు... పొలం అమ్మాల్సిందే.'

'అమ్మను.. అమ్మను..' తీవ్రంగా ఉంది ఆమె కంఠం.

'లేదు... అమ్మి తీరాల్సిందే' మరింత గట్టిగా అన్నాడు శశాంక్.

'లేదు.. నా బొందిలో ప్రాణముండగా నేను అమ్మను.. నా భూమి.. నా కన్నతల్లి.. నా బంగారు పంట..'

'శంకర్ అమ్మేస్తానంటున్నాడు... ఎలా..'

ఆమె గొంతు తగ్గించింది. తీవ్రత తగ్గింది... 'కనీసం అతడినైనా నాతో ఉండమంటాను' అన్నది.

సంవత్సరం క్రిందట పొలం అమ్మిన విషయం శశాంకకు తెలుసు. సజెషన్స్ ఇస్తూ నైపుణ్యంగా ఆమెను ఒక ఏడాది కిందకి దించాడు. పొలం అమ్మిన రోజు ఆమెకు గుర్తుచేసాడు.

అంతే... నిలువెల్లా వణికిపోయింది వసంత. ఆమె నోట మాట రావడంలేదు. కాళ్ళు చేతులు వణుకుతున్నాయి. చెమట పట్టింది. గొంతు మాత్రం పెకలడం లేదు. అమితమైన ఉద్వేగానికి లోనయినట్టు గుర్తించాడు శశాంక్. ఆమెను మాట్లాడించాలని ప్రయత్నించాడు. అతడి ప్రయత్నం ఫలించలేదు. ఆమె గొంతు పెకలడం లేదు. అలాగే ఊగిపోతోంది.

తర్వాత కొద్దిరోజులు ముందుకు వచ్చాడు.

వసంత నిశ్చలంగా ఉంది. ఉలుకులేదు. పలుకు లేదు.

ఇంకా.. ఇంకా ముందుకు.

నిశ్చలం.. మౌనం.

కొద్దిసేపు అదే నిద్రలో ఉండడానికి సజెషన్స్ ఇచ్చి బయటకు వచ్చాడు శశాంక్. బయట నందమ్మతో పాటు ఆమె తండ్రి కూడా ఎదురు చూస్తున్నాడు. అతడికి ఏదో ఆశ పుట్టినట్టుంది. వచ్చి రెండు చేతులు పట్టుకుని 'బాబూ.. నా కూతురుని ఎలాగైనా రక్షించు బాబూ..' అన్నాడు అతడి మొహంలో ఇంతకు ముందున్న ప్రశాంతత లేదు. ఆందోళనగా ఉన్నాడు.

శశాంక్ ఆయనను చూసి నవ్వాడు. అతడికి ధీమా ఇస్తున్నట్టుగా

'వసంతను రక్షించడానికిప్పుడు పచ్చటి పదెకరాల పొలం కావాలి' అన్నాడు !!

✷✷✷




## జనవరి 2010

**ఈ నెల కథా సాగర** మథనంలో జనవరి నెల స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వారపత్రికలు, స్వాతి, ఆంధ్రభూమి, విపుల, చిత్ర మాసపత్రికల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమయిన 85 కథలను విశ్లేషించి వాటి లోంచి విభిన్నంగా ఉన్న కథలను పరిచయానికి ఎంచుకోవటం జరిగింది.

కథా రచయిత కథల సృజన కోసం తన అంతరంగం పై ఆధారపడినా, అందుకు ప్రేరణ సమాజంలోంచే వస్తుంది. సమకాలీన సామాజిక పరిస్థితులకు రచయితలు స్పందిస్తారు. కానీ వారి సృజనలోని లోతువల్ల, వారు సమకాలీన సమస్యలను ప్రతిబింబించినా అవి సార్వజనీనం అవుతాయి. కాలంతో సంబంధం లేకుండా సజీవంగా నిలబడతాయి. కథల ఈ లక్షణం మామూలు రచయితను అసలైన రచయితను వేరు చేసి చూపిస్తుంది.

మామూలు రచయిత స్పందన ఆయన ఉన్న కాలానికే పరిమితమవుతుంది. ఆ పరిస్థితులు మారిన తరువాత కథ అవసరం తీరిపోతుంది. అందుకే ఉద్యమాలను కథావస్తువులను చేసి రాసేవారు, ఉద్యమం సమాప్తం అవటంతోటే ప్రాధాన్యం కోల్పోతారు. అందుకే రచయిత ఇతరులతో కాక దూరదృష్టి ప్రదర్శించాలంటారు. ద్రష్టలా వ్యవహరించాలంటారు. ఇలా ద్రష్టలా వ్యవహరించేవారే అసలయిన రచయితలు.

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కథా రచయితల కథలోనూ కనిపిస్తోంది. 'వార్త' ఆదివారం అనుబంధంలో ప్రచురితమయిన ఈ రెండు కథలు రెండు దృక్కోణాలను ప్రదర్శిస్తాయి. అయితే ఈ రెండు కథలలోనూ రచయితలు 'ద్రష్ట'లుగా ఎదగలేకపోయారు. తమ సమకాలీన పరిస్థితులకు స్పందించారు తప్ప, పరిస్థితులను విశ్లేషించి, భవిష్యత్ దర్శనం చేసే ప్రయత్నాలు చేయలేదు. సమన్వయ సాధన అన్న ఆలోచనను ప్రదర్శించలేదు.

***<u>నరసింహం ఆత్మహత్య:</u>***

డా.వి. చంద్రశేఖర్ రావు రచించిన ఈ కథ తెలంగాణ సమస్యను ఒక కోణంలోంచి ప్రదర్శిస్తుంది. ఈ కథను ఆంధ్రానుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడిన కుటుంబానికి చెందిన అమ్మాయి చెపుతుంటుంది. ఆమె హైదరాబాదులోనే పెరుగుతుంది. చదువుకుంటుంది. ఆమెకు హైదరాబాదు తప్ప మరొకటి తెలియదు. ఆమె నరసింహం అనే ఎదురింటి అబ్బాయితో చనువుగా ఉంటుంది. ఇద్దరూ ప్రేమించుకుంటారు. ప్రత్యేక తెలంగాణాతో ఆమెక్కూడా నరసింహం ప్రవర్తనలో, ఆలోచనలో మార్పు తెలుస్తుంది. అతడు ఆంధ్రావారిని దూషిస్తుంటాడు. దాంతో ఆమెను ఓ రోజు నరసింహం తెలంగాణా కోసం ఆత్మహత్య చేసుకుంటే పెద్ద ఆశ్చర్యం కలగదు. కానీ అందరూ అతడిని హీరో చేస్తారు. దాంతో ఆమెకు కొత్తగా అనిపిస్తాడు నరసింహం. నరసింహం బంధించిన పావురాలను

విడిచి, తమ ఇద్దరి పేర్లు గోడమీద రాయాలని నిశ్చయించుకుంటుంది. ఇదీ కథ. ఈ కథలో రచయిత తెలంగాణా ఉద్యమం వల్ల మనుషుల నడుమ నెలకొంటున్న అడ్డుగోడలను ప్రదర్శించాలనుకున్నాడో, తెలంగాణ సమస్యను అవహేళన చేయాలనుకున్నాడో, సమర్థించాలనుకున్నాడో కూడా స్పష్టంగా తెలియదు. పాత్రల వ్యక్తిత్వ చిత్రణ కూడా అపరిపక్వంగా ఉంది. రచయితలు 'నిజం' చెప్పటానికి భయపడి, అందరినీ సంతృప్తి పరచాలని, వివాదాలకు దూరంగా ఉండాలని రాస్తే కథలకు వాటిల్లే ప్రమాదానికి ఈ కథ మంచి ఉదాహరణ. ఇది జనవరి 17 నాటి వార్తలో ప్రచురితమయింది.

***కలిసుందాం...రా***

రచయితలే కాదు పత్రికలు కూడా బాలెన్సింగ్ యాక్ట్ చేయక తప్పటంలేదన్నటు జనవరి 24 వార్త సంచికలో బెజ్జారపు రవీందర్ రాసిన ఈ కథ ప్రచురితమయింది. ఈ కథలో ఎలాంటి అస్పష్టతా లేదు. ఎలాంటి అయోమయం లేదు. రచయిత ప్రత్యేక తెలంగాణాను నిర్మొహమాటంగా, స్పష్టంగా సమర్ధిస్తాడు. ఆంధ్రావాళ్ళను ఎత్తిపొడుస్తాడు. ఇది సుబ్బారావు, యాదగిరి అనే మిత్రుల కథ. సుబ్బారావు, యాదగిరిల మధ్య తెలంగాణ అడ్డుగోడ నిలుస్తుంది. సమైక్యాంధ్రా కరదీపిక తయారుచేయాలనుకున్న సుబ్బారావు పథకాలు ఫలించవు. అన్నింట్లోనూ ఆంధ్రులదే ఆధిక్యం అనిపిస్తుంది. తెలంగాణాలో ఆంధ్రుల విగ్రహాలు కనిపిస్తాయి కానీ, ఆంధ్రాలో తెలంగాణా వారి విగ్రహాలు కబపడవు.'అంత మంచితనమే ఉంటే విషయం ఇక్కడదాకా వచ్చేది కాదు' అంటాడు యాదగిరి. ఇదీ కథ. రచయిత చెప్పదలచుకున్నది స్పష్టంగా చెప్పాడు.

***గురుత్వం***

టి.శ్రీవల్లీ రాధిక రచించిన ఈ కథ జనవరి 10, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఏ వస్తువయినా అది ఎలా కనిపిస్తుందన్నది చూసే వారి దృష్టిని బట్టి ఉంటుంది. దృష్టిని మెదడు నిర్దేశిస్తుంది. మెదడును మనసు ప్రభావితం చేస్తుంది. అందుకే మనం ఏదైనా అంశాన్ని ఎలా అర్థం చేసుకుంటామన్నది మన వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. ఈ సత్యాన్ని చక్కగా, సూటిగా, చాలా గొప్పగా చెపుతుందీ కథ. ఈ కథను చెప్పే ప్రధాన పాత్రకి పక్కింటి శర్మగారంటే చిన్నచూపు. ఆయన పూజలు నచ్చవు. ప్రొద్దున్నే అలారం మోగించటం నచ్చదు. అతడికి తన భార్య దివ్యకు కనబడే విధంగా కూడా జామచెట్టు కనబడదు. 'దాని కొమ్మలు, ఒక ఆకుపచ్చ వృత్తం, మధ్యలో ఖాళీలు చిల్లులున్న సరిగ్గా లేని జల్లెడని చూసినట్టుంటుంది' అనుకుంటాడు. అయితే ఓ రోజు శర్మగారి మాటలు వింటాడు. పనికిరావనుకున్న ఆ మాటలు ఆధారంగా ఆఫీసులో ప్రాజెక్ట్ వర్క్ బాగా చేస్తాడు. ఉపయోగపడని విషయం ఉపయోగపడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అప్పుడు అతనికి ఆ జామచెట్టు 'కళ్ళనీ.. కడుపునీ నింపేస్తుంది. పంచేంద్రియాలను జోకొట్టి నిద్రపుచ్చినట్టు కనిపిస్తుంది. ఇదీ కథ. కథ ఆసాంతం ఆసక్తికరంగా సాగుతుంది.

***కొలువు***

జిల్లెళ్ళ బాలాజీ రచించిన ఈ కథ జనవరి 8, స్వాతి వారపత్రికలో ప్రచురితమయింది. కుప్పయ్య గుళ్ళోనాసర వాద్యం వాయించేవాడు. అది అతనికి వృత్తిమాత్రమే కాదు. అదే అతని జీవితం. అతనికి అలాంటి అల్లుడే దొరుకుతాడు. ముని రాఘవుడు, కుప్పయ్యను గురువులా భావిస్తుంటాడు. మరణిస్తూ తన తలకొరివి మునిరాఘవుడే పెట్టాలని కోరుకుంటాడు కుప్పయ్య. కానీ అతని బంధువులు అందుకు అభ్యంతరం చెపుతారు. వారి ధనాశను గమనించిన మునిరాఘవుడు ఇల్లు వారికి రాసిచ్చి, గుడిలో నాసర వాద్యం వాయించే పని తనకు ఉంచుకుంటాడు. ఒక గతించిన కాలాన్నీ, అంతరించిన విలువలను కళ్ళముందు నిలుపుతుందీ కథ. కథ సినిమాటిక్‌గా ఉన్నా, ఒక సత్ప్రవర్తనను, మంచి ఆదర్శాన్నీ బోధిస్తుంది. మన సమాజం ఎలాంటి ఉత్తమ వ్యక్తుల నిస్వార్థ సేవల వల్ల అనేక ఒడిదుడుకులను తట్టుకుంటూ అనంతకాలం నుంచీ సజీవంగా నిలుస్తుందో మనసుకు హత్తుకునేలా ప్రదర్శించే ఈ కథ ఈనెల కథ.

*ఈనెల కథ*

కొలువు - జిల్లేళ్ళ బాలాజి

జనవరి 8, స్వాతి వార పత్రిక ౨౦౧౦ సంచిక నుంచి

**నాసరం వాయించే** కుప్పయ్య తనువు చాలించాడు. మూడునెలలకు ముందు ఆయనకు పక్షవాతం సోకడంతో మంచం పట్టాడు. ఎన్ని మందులు వాడినా, నానాటికీ ఆరోగ్యం దిగజారిపోయి, ఈ దినంతో ఆయనకు ఆయుష్షు తీరింది.

కుప్పయ్య కాయిలా పడినన్ని దినాలు, ఆయన్ను కంటికి రెప్పలా చూసుకుంది మునిరాఘవుడూ, ధనలక్ష్మీనూ! ఆయనకు అల్లుడైన పుణ్యానికి.. ఆయన కొనవూపిరి ఉండేంతవరకూ దగ్గరుండి ఆయన కొనవూపిరి ఉండేంతవరకూ దగ్గరుండి ఆయన గొంతులో ఇంత తులసి తీర్థం పోసి ఋణం తీర్చుకున్నాడు ముని రాఘవుడు. రేపు దానానికీ, కార్యాలకూ కావలసిన డబ్బును ఎట్టా సమకూర్చుకోవాల్నో, భార్యతో చర్చించాడు. చెవుల్లోని కమ్మలు, ముక్కుపుల్లా, మెళ్ళోని చెయినూ అడమానం పెట్టి డబ్బు తీసుకొచ్చి జరగాల్సిన పనులు జరిపించమని సలహా ఇచ్చింది అతడి భార్య ధనలక్ష్మి.

తెల్లార్నాక తీసుకుంటానని చెప్పి బంధువులకు చావు సమాచారం చెప్పేదానికి బయలుదేరినాడు.

తిండీతిప్పలూ మాని, అర్ధరాత్రిదాకా కాళ్ళకు చక్రాలు కట్టుకుని, తెలిసినోళ్ళందరికీ చావుసమాచారం చేరవేసినాడు. ఇప్పుడు, ఇంటిముందు ఎలిగించిన అగ్గిముందు నిస్సత్తువగా కూర్చునుండాడు.

రాగిమాకుల కుప్పయ్య అంటే తిరుత్తణి చుట్టుపక్కల గ్రామాల్లో తెలియనోళ్ళు లేరు. తూర్పున అటు కాతికాపురం (కార్తికేయపురం) నుండి ఇటు ఉత్తరాన ఆర్కే పేటదాక ఉండే గ్రామాల్లో, ఏ పిల్ల సమర్తకొచ్చినా - ఏ ముసలాయన కార్యాలైనా - అది పెండ్లిగెరిగైనా - పిలకాయల చెవలకుట్లయినా కుప్పయ్య నాసరం వాయించాల్సిందే! నాసరగాళ్ళలో కుప్పయ్యకుండే పేరు మరొకరికి లేదు.

కుప్పయ్య ఏనాడూ తన మేళానికింత కూలీ కావాలనిగానీ, తనకీ సౌకర్యాలు కలిగించాలనిగానీ అడిగిన పాపాన పోలేదు. ఎవురెంత ఇచ్చినా సంతోషంగా తీసుకునేవాడు. అయితే, ఎన్ని మేళాలు ఒప్పుకున్నా - తెల్లారి మూర్తాల్ని మాత్రం ఒప్పుకునేవాడు కాదు.

అందుక్కారణం ఉండాది! పూర్వీకులనుండి వంశపారమపర్యంగా ఆరుముగస్వామి (కుమారస్వామి) గుళ్ళో నాసరం వాయించే కొలువు కుప్పయ్యోళ్ళదే! రోజా తెల్లారితే గుళ్ళో కొలువు కొలవడం కుప్పయ్య ఏ దినమూ తప్పిందిలేదు. సూర్యుడికన్నా ముందే నిద్రలేసి కాలకృత్యాలు తీర్చుకుని, గెనాల మీద నడుచుకుంటూ గుడికి చేరుకునేవాడు.

గోడకు తగిలించివున్న నాసరాన్ని గుడ్డతో శుభ్రం చేసి, తయారుగా ఉండేవాడు. ఈలోగా ఒకరొకరుగా మేలగాళ్ళంతా గుడికి చేరుకునేవాళ్ళు.

పూజ చేసే బాపనయ్యోరు గుళ్ళోకి అడుగుపెట్టగానే మంగళవాయిద్యాలు మోగేవి. నాసరం, డోలు, సండోలు (సన్నడోలు), శృతి (నాసరంలా ఉంటుంది) తాళం ఈ వాయిద్యాలు మోగుతుంటే నిత్యం ఆరుముగస్వామి గుళ్ళో పూజలు జరిగేవి.

స్వామికి అభిషేకంతో మొదలయ్యే మేళం, అలంకరణ చేసేటప్పుడు ఆపి మళ్ళీ పూజపూర్తయ్యేంతదాకా వాయిద్యాలు మోగుతూనే ఉండేవి. అయ్యోరు గుళ్ళోనే అన్నం వార్చి దాన్ని స్వామికి పెట్టేవాడు. పూజ పూర్తయినాక ఆ ప్రసాదాన్ని గిన్నెతో భాగాలు చేసి వాయిద్య గాళ్ళకు పంచేవాడు. దాన్ని వాళ్ళు సాదం గిన్నెలో భద్రంగా ఇండ్లకు తీసుకుపోయేవాళ్ళు.

వాయిద్యాల్ని మాత్రం గుళ్ళోనే గోడకు తగిలించి వచ్చేవాళ్ళు. ఒక్కోసారి అయ్యోరు గుడికి రావడం ఆలస్యమైనా, అన్నం వార్చే సమయం లేకపోయినా అన్నం నైవేద్యం పెట్టకనే పూజ ముగించి బియ్యాన్ని మాత్రం కొలిచి వాయిద్యగాళ్ళకు పంచేవాడు.ఇట్లా కొన్నేళ్ళుగా సాగుతాఉండాది. ఏ దినమైనా ఏ వాయిద్యగాడైనా గుడికి రాలేకపోయినా, కుప్పయ్య మాత్రం మానేవాడు కాడు. అలా ఆయన జీవితంలో గుడికొలువు ఒక ముఖ్యభాగమైపోయింది. దానికి ఇబ్బంది కలగకుండా ఆయన ముఖ్యభాగమైపోయింది. దానికి ఇబ్బంది కలగకుండా ఆయన బయటిమేళాలు ఒప్పుకునేవాడు. తాతల కాలం నుండి వస్తున్న కొలువును తన ప్రాణం ఉండేంతవరకూ తానే కొలవాలని ఆశపడినాడు కుప్పయ్య.

అట్లాంటి కుప్పయ్యకు ఒక్కతే కూతురు. పేరు పుష్పలత. ఆయనకు కూతురంటే చానా ఇష్టం. ఒక్కతే కూతురవడం వలన ఆమెను అపురూపంగా పెంచాడు. కూతురు పెండ్లీడు కొచ్చినాక, ఆమెకు పెండ్లిచెయ్యాలనే తలుపుతో... మంచి సంబంధాలకోసరం ఎతకసాగినాడు.

అదిగో, అప్పుడు నగిరి మునిరాఘవుడి సంబంధం గురించి తెలిసింది. మునిరాఘవుడి పెద్దగా చదువుకోకపోయినా, ఏదో సుమారుగా నాసరం వాయిస్తాడని తెలుసుకున్నాడు. అది చాలనుకున్నాడు కుప్పయ్య.

కుప్పయ్యకు అల్లుడుకావడం తన పూర్వజన్మ పుణ్యంగా తలచి, ఏ కట్నానికీ ఆశపడకుండా ఆయన గారాలపట్టిని పెండ్లి చేసుకుని, కుప్పయ్య దంపతులకు సంతోషాన్ని కలిగించినాడు మునిరాఘవుడు.

అప్పటిదాకా కుప్పయ్య మేళాన్ని చూడటమేకానీ ఆయనతో మాట్లాడి ఎరగని మునిరాఘవుడు ఆయనకు అల్లుడైనాక, ఆయన తనకు నాసర వాయిద్యంలో మెళకువలు చెప్పించడం తన అదృష్టంగా భావించినాడు. క్రమంగా పెండ్లిండ్లకూ, పేరంటాండ్లకూ కుప్పయ్య తన అల్లుణ్ణే జంట నాసరగాడిగా వేసుకునేవాడు.

అలా అల్లుడు నాసర వాయిద్యంలో ఆరితేరేలా తర్ఫీదునిచ్చినాడు. ఆయన తనకు పిల్లనిచ్చిన మామమాత్రమే కాదు, గురువుకూడానని తలచి, కుప్పయ్య పాదాలకు ప్రణమిల్లినాడు మునిరాఘవుడు. కుప్పయ్య కూతురు తొలి ప్రసవసమయంలో సరైన వైద్యం అందక, మగబిడ్డను కని కన్ను మూసినప్పుడు, ఆయన సగం చచ్చిపోయినాడు. కూతురు పోతూపోతూ మనమణ్ణి - తల్లిలేని బిడ్డగా మిగిల్చిపోయినందుకు కృంగిపోయినాడు.

మునిరాఘవుడు కూడా భార్యపై ఉన్న మమకారం కొద్దీ మళ్ళీ పెండ్లిచేసుకోలేదు.కానీ కుప్పయ్యే: ''నాయినా నా బిడ్డ ఆయుష్షు తీరిపోయింది. అది ఇచ్చి పెట్టుకునింది అంతే! పోయినోళ్ళకోసరం నువ్వు నీ జీవితాన్ని మోడు చేసుకోవడం నాకు కష్టంగా ఉండాది. నువ్వు మళ్ళా పెండ్లి చేసుకో నాయినా..'' అన్నాడు మనస్ఫూర్తిగా.

''మామా! నీ కూతురి స్థానంలో ఇంకెవరినీ నేను భార్యగా ఊహించలేను. ఇంక ఏ ఆడది వచ్చినా, నాకొడుకును బాగా చూస్తుందో, లేదోనన్న భయం కూడా నాకు లేకపోలేదు'' అన్నాడు మునిరాఘవుడు.

కానీ పట్టుబట్టి కుప్పయ్య దంపతులే అల్లుణ్ణి కొడుకుగా తలచి, ఒక మంచిపిల్లను చూసి మళ్ళీ పెండ్లి చేసినారు. ముని రాఘవుడి రెండో భార్య ధనలక్ష్మి సవితిబిడ్డను తన కన్నబిడ్డలాగా చూసుకోవడంతో, కుప్పయ్య దంపతులు నిశ్చింతపడినారు. అల్లుడికి సరైన ఆడకూతుర్ని తీసుకొచ్చి ముడేసినందుకు సంతోషపడినారు.

కానీ ఇంతలోనే ఉన్నట్టుండి ఒక దినం కుప్పయ్య భార్య గుండెపోటుతో మరణించడంతో, ఆయన మరీ కోలుకోలేకపోయాడు. ఆ దెబ్బ దెబ్బ ఆయన్ను పక్షవాతం బారిన పడేలా చేసింది. ఎన్నిరకాల మందులు వాడినా ఫలితం లేకపోయింది. ఆయన పూర్తిగా మంచానికే పరిమితమై పోయినాడు. దాంతో గుడికొలువును కొలిచే పరిస్థితులు లేకపోవడంతో ఎంతో కృంగిపోయినాడు.

కుప్పయ్య పడుతున్న మానసిక వేదనను చూసి, చలించి పోయిన మునిరాఘవుడు, కాస్తంతైనా ఆయనకు మనశ్శాంతిని కలిగించాలనుకున్నాడు. తానుగా గుడికొలువును కొలవడం మొదలుపెట్టినాడు.

తెల్లారకముందే నిద్రలేచి, గుడికి పొయ్యేదానికి మళ్ళినాడు. ఒక దినంకూడా నిలవకుండా శ్రద్ధగా కొలువును కొలవసాగినాడు. గుడినుండి మునిరాఘవుడు తీసుకొచ్చిన సాదాన్ని నున్నగా కలిపి కుప్పయ్యకు తాగించేది ధనలక్ష్మి. దాంతో తానే గుడికొలువు కొలుస్తున్నంతగా తృప్తిపడినాడు కుప్పయ్య. ఇక తాను హాయిగా ప్రాణాలొదలవచ్చని నిశ్చింతపడినాడు.

నాలుగుదినాలముందు.. కుప్పయ్య మునిరాఘవుణ్ణి దగ్గిరకు రమ్మని పిలిచినాడు. మంచంపై మామపక్కన కూర్చున్నాడు మునిరాఘవుడు.

"ఇంక నాకు ఏ దిగులూ లేదు నాయినా, నిమ్మతిగా కండ్లుమూస్తాను. అల్లుడైనా, కొడుకైనా నాకు నువ్వే! నేనట్టా దాటుకున్నాక నాకు తలకొరివి పెట్టి పుణ్యం కట్టుకో తండ్రీ. ఇదే నా కడకోరిక.. తీరస్తావు కదా?! మాటియ్యి నాయినా" ఆశగా అల్లుణ్ణి అడిగినాడు మునిరాఘవుడు. అదే కుప్పయ్య చివరిసారిగా మాట్లాడిన మాటలు.

'మాపటేలకు సక్కరంగా మామకు దానం జరిగిపోతే అంతేసాలు" మనసులో అనుకున్నాడు మునిరాఘవుడు. ఆరిపోతున్న కట్టిపుల్లను ఎగదోసి, లేచి నిలబడి ఎదురింటికేసి చూసినాడు.

ఆ ఇంట్లోనుండి ఇంకా ఏవో మాటలు సన్నగా వినిపిస్తావుండాయి. "ఇంకా మంతనాలు జరగతావుందన్నమాట. ఏం తీర్మానాలు చెయ్యబోతారో, ఏమో?" దీర్ఘంగా నిట్టూర్చి ఇంట్లోపలికి నడిచినాడు. అలికిడికి తలతిప్పి చూసింది ధనలక్ష్మి. ఏడ్చి.. ఏడ్చి ఆమె ముఖమంతా ఉబ్బి కండ్లు లోతుకుపోయుండాయి. పక్కనే పదేండ్ల కొడుకు ఒట్టి నేలమీద పండుకుని నిద్రపోతూవుండాడు.

"మే్మ.. మామ తలకాడ ఇంగరొండు ఊదొత్తులు ఎలిగించు" అని పెండ్లానికి పని పురమాయించినాడు.

ఆమె ఆపని చేస్తుండగానే.. "మే్మ... ఇప్పుడే నీ వెవల్లో ఉండేదీ... ముక్కుపుల్లా, చెయినూ తీసిచ్చేయ్. తెల్లార్తే అందరిముందూ యాడ ఇప్పుకుంటావుంటావ్" అన్నాడు. ధనలక్ష్మి తనవొంట్లోని నగల్ని ఒలస్తా అంది "సానా ఖర్చుండాది... ఎక్కువే డబ్బియ్యమని ఆ సేటును అడుగుమామా, లేకపోతే ఈటిని అమ్మేసైనా డబ్బుతీసుకునిరా! రేపు కార్యాలకు మళ్ళా డబ్బుకు తడుముకోకూడదు" అని నగల్ని మొగుడిచేతికిచ్చింది. దాన్ని జోబిలో పెట్టుకుని బయటికి నడవబోయినాడు.

"మామా, సిన్నమాట. రేపొకదినం - దానమయ్యేంతదాకా నువ్వు ఏయవ్వారానికీ కోపం తెచ్చుకోమాక. దేవుడెట్టాపెడితే అట్టా జరగనీ ఏమంటావుమామా" దీనంగా మొగుణ్ణి అర్థించింది ధనలక్ష్మి. అట్టాగేనంటూ మౌనంగా తలాడించి, బయటికి నడిచినాడు మునిరాఘవుడు.

తెల్లారేకొందికి కుప్పయ బంధువులు ఒకరొకరుగా దిగబడసాగినారు. దాంతో ఏడుపులు, రోదనలు పెద్దవైనాయి. ఇంతలో పలుగూ పారా పట్టుకుని అక్కడికి తోటోడు వచ్చినాడు.

"హొరేయ్ గుంత బాగా లోతుగా తొవ్వు. ఇద్దరు మనుషులు నిలబడేంత ఇశాలంగా గుంత ఉండాల, తెల్సిందా?" అని వాడి చేతికి ఇరవై రూపాయల నోటిచ్చినాడు మునిరాఘవుడు. "అన్నా, ఇంకో పదిరూపాయిలియ్యన్నా...." నసుగుతూ అడిగినాడు వాడు.

"ముందు పనికానీయ్‌రా.. తర్వాతిస్తాను! మద్దేనానికంతా పని పూర్తయిపోవాల..... తెల్సిందా?" అని వాడిచేతికి ఇంకో ఐదురూపాయలిచ్చినాడు.

ఇంతలో పలకలు వాయించేవాళ్ళు యాణ్ణించో ఇంత ఎండు కసువు పెరక్కొచ్చి, ఒక పక్కగా మంటేసినారు. ఆ సెగలో తమతమ వాయిద్యాలకు సెగ చూపిస్తా పదను పెట్టుకోసాగినారు. ఆ శబ్దాలకి ఆ ఈదిలోని మనుషులంతా బయటికొచ్చి కుప్పయ్య ఇంటికేసి చూసినారు. చినపిలకాయలంతా పలకలు కొట్టేవాళ్ళ చుట్టూ గుమిగూడారు.

"ముని రాఘువా.. అందరికీ చావు సమాచారం చెప్పేసినావుకదా?!" అంటూ దిగబడినాడు మునిరాఘువుడి అన్న పరంధాముడు.

"ఆఁ ఆఁ.. కొండమీద చెప్పేసినా... నగిరికీ, నాన్నూరానికీ (నారాయణవనానికీ) శేషును పంపించినా.. అప్లాయిగుంట, చిత్తానూరూ (తిరుచానూరు), తిరప్తికీ రవి పొయ్యిండాడు. చిత్తూరుకు ఫోన్ చేసి మనోళ్ళందరికీ చెప్పేయమని నారాయణకు చెప్పినా.."

"రేయ్.. వొల్లేడుకు చెప్పి పంపించినావా?"

"ఆఁ ఆ ఁ. మనిషిని పంపించుండా -" అని వెదురు బొంగులు చీలుస్తున మనిషి దగ్గరకు నడిచినాడు మునిరాఘువుడు. "మూరెడు సైజులో నాలుగైదు ముక్కల్ని ఏరేగా నరుక్కో. దివిటీలకు కావాల్సివుంటుంది" అని సలహా ఇచ్చినాడు. ఆ పక్కనే పాడువు బొంగుల్ని పక్కపక్కన పేర్చిపాడెను కడతావుండారు ఇద్దరు మనుషులు.

"అన్నా..... పాడెనకాల ప్రభకట్టాల్నా" అడిగినాడొకడు. "ప్రభలేకండా పాడేందిరా" బదులిచ్చాడు పరంధాముడు.

"అయితే పూలచెండ్లు కావాలన్నా, రకానికి ఇరవైమూర్లన్నా ఉంటేనే చూసేదానికి బాగుంటుంది.మనిషి పంపించి తెప్పించన్నా" మునిరాఘువుడితో అన్నాడు.

"రేయ్.. తెచ్చేదానికి ఈడ మనుషులెవరూలేరు కానీ, పూలచెండ్లకెంత కావాల్నో చెప్పు, డబ్బిస్తాను - పొయ్యి నువ్వే తెచ్చేయ్. పొద్దెక్కిందంటే మళ్ళా ఆ పూలు కూడా దొరకవు..." అని వాడి చేతికి డబ్బిచ్చినాడు.

మిగిలిన డబ్బును ఒకసారి చూసుకుని, చేతికున్న వాచీలో టైమెంతో చూసినాడు. సేటు షాపు తెరవటానికి ఇంకా టైముండాది. ఇంటికే పొయ్యి డబ్బడిగితే బాగుణ్ణని సేటు ఇంటికి బయలుదేరినాడు మునిరాఘువుడు.

కుప్పయ్య బంధువులకన్నా ఆ చుట్టుపక్కల గ్రామస్తులే ఎక్కువగా వచ్చినారు కుప్పయ్యను కడసారి చూడటానికి. కుప్పయ్యను బయటికి తీసుకొచ్చి చెక్కబల్లమీద పండుకోబెట్టినారు.దగ్గరి బంధువులు శవాన్ని చుట్టుముట్టి బోరుమని ఏడ్చేదానికి మళ్ళినారు.

ధనలక్ష్మి శవం మీదపడి శోకాలు పెట్టసాగింది.

ఆమె కొడుకు దూరంగా బంధువుల మధ్య కూర్చుని అందరినీ వింతగా చూస్తున్నాడు.

డ్రమ్ము నిండుగా నీళ్ళు నింపినారు. కుప్పయ్య ఒంటిమీదున్న గుడ్డల్ని విప్పబోయినాడు మునిరాఘువుడు. అంతలో కుప్పయ్య తమ్ముడి కొడుకు గురవయ్య పంచెను ఎగదోసుకుని అక్కడికొచ్చినాడు.

"ఆగు రాఘువా.. ముందీ విషయం తేలనీ" అన్నాడు గంభీరంగా. చేస్తున్న పనిని ఆపి, తలపైకెత్తి చూసినాడు మునిరాఘువుడు. "మా పెదనాయనకు తలకొరివి ఎవరు పెట్టాల్నో ముందు ఆ విషయం తేల్చండి"

"తేల్చేదేముందీ మునిరాఘువుడే పెడతాడు" అన్నాడు పరంధాముడు.

"ఏం? రాగిమాకులోళ్ళందరూ సచ్చినారా.. ఎట్టా?" అని అరిచినాడు ఆ ఇంటోడొకడు.

"అయ్యో అదెంతమాట, రాగిమాకుల కుప్పయ్యకు అల్లుడైనా, కొడుకైనా మా మునిరాఘువుడే కదా.." అని ఇంకా ఏదో చెప్పబోయినాడు పరంధాముడు.

కానీ గురవయ్య అడ్డుపడి - "మునిరాఘువుడు మా పెద్దనాయినకు అల్లుడన్న విషయం ఇక్కడెవరూ కాదనడం లేదు. కానీ కొడుకంటే మాత్రం నేనొప్పుకోను. కొడుకు వరసనేనుండగా అతడెట్టా అవుతాడు?" అని నిలేసినాడు.

"నా చేత తలకొరివి పెట్టించుకోవాలన్నది మామామకడకోరిక" చివరికి ఎలాగో అన్నాడు మునిరాఘువుడు.

"ఆ ఇంటోళ్ళు ఎవరూ లేకపోతేనే కదా మునిరాఘువుడు తలకొరివి పెట్టి పెద్దాయన కడకోరిక తీర్చాల్సింది. మేమంతా ఉండాముకదా!"

"మరి మీరంతా ఇన్నాళ్ళూ ఏమయినారు? పెద్దాయన కాయిలా ఉన్నన్నాళ్ళూ ఒకరన్నా ఇటొచ్చి చూసిన పాపాన పోయినారా? ఆయన పడకలో ఉన్నన్నాళ్ళూ ఆయన్ను కంటికి రెప్పలా చూసుకుంది ఆయన అల్లుడు మునిరాఘువుడు.. వేళకింత గంజిపోసింది ధనలక్ష్మినే కదా!" కుప్పయ్య ఇంటిపక్కనుండే పెద్దమనిషి నిలదీసాడు.

"అది వాళ్ళ బాధ్యత.. మాకేం పట్టింది? అంతమాత్రాన తలకొరివి పెడతానంటే మేమొప్పుకోం ..." కరాకండిగా చెప్పాడు గురవయ్య.

"సరే గురవయ్యా, మా మునిరాఘువుడు వద్దులే! ఆయనకు మనమడు ఉన్నాడు కదా, వాడిచేత తలకొరివి పెట్టించేదేందీ.ఇంగ వాదాలు అనవసరం. మా పెద్దనాయనకు నేనే తలకొరివిపెడతాను మతే.." అని మొండిగా చెప్పాడు గురవయ్య.

"సరే.. అట్టాగే గురవయ్య మామ.

మామ కడకోరిక అట్టా చెయ్యిజారిపోతావుంటే నిస్సహాయంగా చూస్తుండిపోయాడు మునిరాఘువుడు.

"ముందు గుడికొలువును నాకు రాసిస్తేనే పెద్దనాయనకు నేను తలకొరివి పెడతాను!" మళ్ళా ఇంకో తిరకాసు పెట్టినాడు గురవయ్య.

"గుడికొలువునా?!" ఆదుర్దాగా అన్నాడు మునిరాఘువుడు. "ఇంకెట్టనుకున్నావ్? ఊరికేతలకొరివి పెడతాననుకున్నావా?" అయ్యోదేవుడా! కొలువు కోసమే అతడు తలకొరివిపెట్టేలాగున్నాడు. కొలువును ఇట్టాంటి తాగుబోతుకా అప్పగించడం? ఇది ఎంతమాత్రం మామకు సమ్మతం కాదే! తాను శ్రద్దగా దినామూ కొలువు చేసొస్తే, ఎంత సంతోషపడిపోయేవాడు.

ఇపుడు గురవయ్యకు రాసిస్తే, దాన్నతడు శ్రద్దగా కొలవగలడా?! పైగా అతడికి నాసరం వాయించడంరాదే ఎలా కొలుస్తాడు? దాన్ని ఇంకెవరికో అప్పచెపుతాడు. అంటే ఆ కొలువు తానుకాక, గురవయ్య కాక, ఇంకెవురో మూడోమనిషి కొలవబోతున్నాడన్నమాట' ఆలోచిస్తున్న కొద్దీ మునిరాఘువుడి మనసు భారమైపోయింది.

"అయినా ఇది అన్యాయం గురవయ్యా! నువ్వు కత్తిపట్టి గొరగ్గలవు కానీ.. నాసరం వాయించలేవు కదా? మరింకెట్టా కొలుస్తావు కొలువును?" అని నిలదీసి అడిగాడు పరంధాముడు.

"అది నీకనవసరం. నేనెట్టాగైనా కొలుసుకుంటాను"

"గురవయ్యా, కావాలంటే ఈ ఇల్లు నీకు రాసిస్తాను. గుడికొలువును మాత్రం అడగొద్దు. నీకాళ్ళు పట్టుకుంటాను" అని గురవయ్య కాలును పట్టుకోబోయాడు మునిరాఘువుడు. 'కొలువు బదులు ఇల్లైతేనే మంచిది. దాన్ని అమ్మితే పెద్దమొత్తంలో డబ్బును కండ్లచూడొచ్చు. కొలువెవరు చేస్తారు జీవితాంతం?' మనసులోనే కుశాలయిపోయినాడు గురవయ్య.

"సరే, అట్టాగే. కొలువు బదులు ఈ ఇల్లు నాకు చెందేటట్టు కాయితం రాసియ్యి" పట్టుగా అడిగినాడు గురవయ్య. "ఒరేయ్ గురవయ్యా, ముందు అయ్యే పని చూడండ్రా! రాసుకునేదేమి ఎప్పుడైనా రాసుకోవచ్చు. పెద్దమనుషుల ముందు మాటిచ్చాక తప్పేదంటూ ఉండదు. నీకు అన్యాయం జరిగితే ఊరుకుంటామా, ఏమి?" అల్లుడికి ధైర్నం ఇచ్చినాడు గురవయ్య మామ.

తరువాత జరగాల్సిన పనులు చకచక మొదలయినాయి. బిందెడు నీళ్ళు గురవయ్య నెత్తిన గుమ్మరించినారు. గురవయ్య చేత కుప్పయ్యకు స్నానం చేయించినారు.

తడిగుడ్డలతో నిప్పుకుండ చేతపట్టుకుని, గురవయ్య ముందు నడుస్తావుంటే నలుగురు మనుషులు పాడెను భుజానికెత్తుకుని స్మశానం కేసి బయలుదేరినారు.

"మామా, నన్ను క్షమించు. నీ కడకోరికను తీర్చలేని అసమర్థుణ్ణి" నిర్వేదంగా ఒక కాడిని భుజం మీద పెట్టుకుని అడుగులు వేస్తున్నాడు మునిరాఘవుడు. స్మశానం దగ్గిరయ్యేకొందీ దుఃఖం రెట్టింపయ్యింది మునిరాఘవుడికి. చూస్తుండగానే స్మశానంలోకి చేరుకున్నారు.

అప్పటికే తోటోడు గుంతను తవ్వి తయారుగా ఉంచినాడు. శవాన్ని గుంతపైన పెట్టి చెయాల్సిన సాంగిమంతా పూర్తిచేసి,

శవాన్ని గుంతలో పండుకోబెట్టినారు.

గుంటలో మన్నేస్తునప్పుడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయినాడు మునిరాఘవుడు. "మామా మళ్ళా ఏ జన్మలో కలుస్తావు మామా" అని ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్న మునిరాఘవుణ్ణి, ఎవరో భుజం తట్టి ఓదార్చినారు.

"అయ్యా, పెద్దాయనది వస్తువులేమైనా ఉంటే ఈ గుంటలో ఏసెయ్యండి సామీ" అని అరిచాడు తోటోడు.

ఇన్నాళ్ళూ కుప్పయ్య తలకాడుండిన, పాతబడిపోయిన నాసరాన్ని తీసుకొచ్చినారెవరో. దాన్ని గుంటలో ఏసెయ్యబోయినారు.

"ఒద్దు, ఒద్దు. దాన్ని గుంటలో ఏసెయ్యమాకండి. అది మా మామకిష్టమైన నాసరం, అది మా మామ ప్రాణం దాన్ని నేను కాపాడుకుంటాను. దాన్ని గుంటలో ఏసి పూడ్చేయకండి" అంటూ ఆ నాసరాన్ని లాక్కుని తన గుండెకు హత్తుకున్నాడు మునిరాఘవుడు.

అందరూ ఇండ్లకు మళ్ళినారు.

"మామకు తలకొరివిపెట్టి ఆయన కడకోరిక తీర్చేటందుకు నాకూ, నా కొడుక్కీ అర్హత లేకుండాపోయింది. పోనీ! ఈ ఇల్లుకూడా పోబోతుంది. పోతే పోనీ!!

కానీ తరతరాలుగా వస్తున్న గుడికొలువును కాపాడి దానికి నాకొడుకుని వారసుణ్ణి చేస్తాను. వాడికి నాసరం నేర్పిస్తాను. ఆరకంగా మామ ఆత్మకు శాంతిని కలిగిస్తాను..." అని దృఢంగా నిశ్చయించుకుని, ఆ నాసరాన్ని భద్రంగా ఇంటికి తీసుకొచ్చినాడు మునిరాఘవుడు.

***




## ఫిబ్రవరి ౨౦౧౦

**కథాసాగర మథనంలో** విశ్లేషణను ఫిబ్రవరి నెలలో ఆంధ్రభూమి, స్వాతి, నవ్య వారపత్రికలు, ఈనాడు, వార్త, సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, స్వాతి, ఆంధ్రభూమి, రచన, విపుల, చిత్ర మాసపత్రికలలో ప్రచురితమయిన 87 కథలను ఎంచుకున్నాను. వీటిలోంచి కొన్ని ప్రధాన కథలు ఇవి:-

ఈనెల కొన్ని మంచి కథలు, విభిన్న వస్తువులతో వచ్చాయి. కొన్ని మనం మరచిపోయిన పాతపద్ధతులను గుర్తుచేసే కథలు వచ్చాయి. నవ్యలో 'శివార్పణం' అనే పంతులు జోగారావు కథ, కాశీఖండంలోని కుబేర వృత్తాంతం ఆధారంగా రచించినది. ప్రస్తుతం కథకులు 'యండమూరి', 'మల్లాది'లను దాటి వెనక్కు చూడలేని స్థితిలో ఉన్నారు. కనీసం వాటితో పరిచయం ఉన్న కథకులయినా ఇలాంటి కథలు, ప్రబంధాలు, పురాణాల ఆధారంగా రచిస్తే, ఈ తరం వారికి కాస్త 'మంచి'ని పరిచయం చేసిన వారవుతారు.

ఇక్కడే ఒక సమస్యను మనం ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. ఒక రచయిత కథల విషయంలో ఏమైనా ప్రయోగాలు చేయాలనుకుంటే అనేక అడ్డంకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. బోలెడన్ని ప్రతిబంధకాలను తట్టుకోవాల్సి ఉంటుంది. 'ఇలాంటి కథలు పాఠకులు మెచ్చరు', 'ఇవి అర్థంకావు', 'ఇవి ఎవ్వరికి కావాలి?' లాంటి అనేక వాదనలను దాటుకుని సంపాదకుడి విశ్వాసాన్ని చూరగొంటే కానీ రచయిత ప్రయోగం పాఠకుడిని చేరదు. తీరు, అది పాఠకుడిని చేరినా విమర్శకుల రంగుటద్దాల దృష్టి పథంలోకి రావు అలాంటి కథలు. దాంతో ఎన్నో మంచి కథలు మరుగున పడిపోతున్నాయి.

అందుకే ఇటీవల కథ వందేళ్ళ సందర్భంగా వచ్చిన వ్యాసాలలో విమర్శను అనేకులు ప్రస్తుత రచయితలలో కొన్ని పేర్లే ప్రస్తావించారు. కొన్ని కథలనే ఉదహరించారు. ఇది వారి కళ్ళకున్న రంగుటద్దాలు, హ్రస్వదృష్టి, మంచికథ అంటే ఏమిటో వారి అభిప్రాయాలను స్పష్టం చేస్తుంది.

ఏదైనా సజీవంగా ఉండాలంటే దాని గురించి చర్చలు జరగాలి. విశ్లేషణలు జరగాలి. అసలు కథలను, కథా రచయితలను విస్మరించి ఎవరికి వారు, తమ తమ రంగులనే పట్టుకుని వ్రేళ్ళాడుతుండటంతో, విమర్శకుల దృష్టిలో గొప్పకథలు, భూకంపం సృష్టించగల కథలు, ప్రపంచాన్ని మార్చగల కథలు పాఠకుల ఆదరణ పొందలేకపోతున్నాయి. సాహిత్యానికి పాఠకుడిని దూరం చేస్తున్నాయి. అందుకే ఈనాడు తెలుగులో సృజనాత్మక సాహిత్యం వెలతెలబోతోంది. దానికి కృత్రిమ శ్వాస కల్పించే పరిస్థితి వస్తోంది.

***<u>మానవనైజం</u>***

ఫిబ్రవరి 25 ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయిన ఈ కథను రచించింది కె.రాజేశ్వరి. సాధారణంగా ఏదైనా సంఘటన జరగగానే దాని ఆధారంగా కథలు, నవలలు రావటం ఆంగ్ల సాహిత్యంలో చూస్తుంటాం. అలా సమకాలీన సంఘటనలకు స్పందించటం తెలుగులో చాలా తక్కువ. అలా స్పందించే కథలు వచ్చినా అవి అణచివేతకు, ఆవేశాలకు పెద్దపీట వేస్తాయి తప్ప ఆలోచనకు, అవగాహనకు కాదు. అలా సమకాలీన సంఘటనకు ఆలోచన, అవగాహనతో స్పందించిన కథ ఇది. వరద వచ్చి ఊరిని ముంచెత్తుతుంది.

ఆ సమయంలో ఓ తల్లి, తండ్రి, తమ పిల్లతో కట్టుబట్టలతో అందరితోపాటు ఓ భవంతిలో తలదాచుకుంటారు. అక్కడ వారితోపాటు తలదాచుకున్న ఓ పేద మహిళ, వారి పిల్లకు పాలిచ్చి ప్రాణం కాపాడుతుంది. అక్కడ ఉన్నంతకాలం ఆమె పిల్లకు పాలిస్తుంది. వారు తమ పిల్ల ప్రాణం కాపాడినందుకు కృతజ్ఞతలు తెలియబరుస్తారు. వరద తగ్గిన తరువాత ఎవరింటికి వారు వెళ్ళిపోతారు. అప్పుడు ఈ కుటుంబం ఇంటికి అనుకోకుండా ఆ పేద మహిళ వచ్చి ఏదైనా పనిమ్మని అడుగుతుంది. ఆ తల్లీ కొడుకులు 'మనింట్లోనా? ఛీ ఛీ' అంటూ ఆమెని తరిమేస్తారు. అదీకథ. కథలో ఎలాంటి సందేశం, సమస్య పరిష్కారాలు లేకపోయినా 'మానవనైజాన్ని', 'కృతజ్ఞతా రాహిత్యాన్ని' సూటిగా, చక్కగా, గుండెకు హత్తుకునేలా, ప్రతివారూ భుజాలు తడుముకునేలా గొప్పగా ప్రదర్శిస్తుందీ కథ,

<u>ప్రగతి ఫలాలు</u>

ఫిబ్రవరి 12 స్వాతి వారపత్రికలో ప్రచురితమయిన ఈ కథను రచించింది వారణాసి నాగలక్ష్మి. 'ప్రగతి అంటే పంటపొలాల్నీ, పాడి పశువుల్నీ చూపించే వారు పూర్వం. స్వేచ్ఛకి చిహ్నంగా ఎగిరే పక్షుల్నీ, ప్రశాంతతనీ సూచిస్తూ కొండలనీ సరస్సులనీ చూపించేవారు! ఇప్పుడు దుమ్ము రేపుతూ సాగిపోయే మోటార్ సైకిల్ స్వేచ్ఛని సూచిస్తోంది! ' అంటూ ఆరంభమయ్యే ఈ కథ పర్యావరణ సమస్యకి సంబంధించినది కాదు. అత్యాశ అభివృద్ధికి పర్యాయపదమై మానవత్వాన్ని పనికిరానిదిగా భావించి పక్కకు నెడుతున్న తరుణంలో మారుతున్న పరిస్థితులతో రాజీపడటాన్ని సూచిస్తుందీ కథ. మన ప్రమేయం లేకుండానే మనం ప్రగతి ప్రవాహంలో భాగమైపోతున్నాం. ఫలితంగా ఒక కుటుంబం సుఖంగా నివసించే స్థలంలో కొన్ని అంతస్తుల కాంప్లెక్స్‌లు వెలుస్తున్నాయి. కొన్ని కుటుంబాలు నివసిస్తున్నాయి. తమ ఇంటిచుట్టూ అపార్ట్‌మెంటులు వెలుస్తుంటే, వాటి నడుమ నీరు, గాలి అందక ఉక్కిరి బిక్కిరి అవుతూ కూడా, ఎంత ఒత్తిడి వచ్చినా, ఎన్ని ఆశలు చూపినా తమ స్తలాన్ని అమ్మటానికి ఇష్టపడదు ముకుంద. భర్తపోయినా పిల్లలను పెంచి పెద్దచేస్తున్న ముకుంద మనసులో, ప్రగతి పేరిట జరుగుతున్న పరిణామాలను చెలరేగే ఆలోచనలను చక్కగా ప్రదర్శించారు రచయిత్రి. మూడువైపులా అయిదంతస్తుల అపార్ట్‌మెంట్లు చుట్టుముడుతుంటే అయిష్టంగానే, ఆ స్థలం అమ్మి మరో శాటిలైట్ టౌన్ షిప్‌లో ఇల్లు కొనుక్కుంటుంది. ఇదీ కథ. చక్కగా ఆలోచలనలు రేపుతూ సాగుతుంది ఈ కథ. పర్యావరణంపై దృష్టికన్నా మానవ మనసుపై దృష్టిపెట్టిన ఈ కథ 'మట్టి మనిషి అనుబంధాన్ని తెంపేసేది పురోగమనం అవుతుందా?' అన్న ప్రశ్న లేవనెత్తుతుంది. అందరి మనస్సులలో మెదులుతున్న ఆలోచననే కథ రూపంలో ప్రదర్శిస్తుంది.

<u>ముగ్ధ సంగమం</u>

దోరవేటి రచించిన ఈ కథ 28 ఫిబ్రవరి ఆంధ్రభూమి దినపత్రికలో ప్రచురితమయింది. 'సంగయ్య' అమాయకుడు. శివభక్తుడు. అతడు అందరితోపాటు 'శివపూజ' అనుకుంటూ వేశ్యమందిరానికి వెళతాడు. అక్కడ వేశ్య అతడిని ఊరిస్తుంది కానీ 'లింగార్చన' మగ్నుడయిన సంగయ్య ఆ సంగీత సాహిత్య నృత్యకళల సుస్వరాలు భగవదర్శనకై వినియోగించే మంగళ వాద్యాలుగా భావించి, శరీరం రోమాంచితంగా కాగా, 'హరహర మహదేవ' అంటూ  పరమేశ్వరారాధన సాగిస్తాడు. ఆ వేశ్య కూడా శివభక్తురాలైపోతుంది. పన్నెండవ శతాబ్దికి చెందిన కథ ఇది. చక్కగా సాగుతుందీ కథ. కథ వస్తువుకి తగ్గ భాష, భావగాంభీర్యంతో సాగే ఇలాంటి కథలు చాలా అరుదుగా వస్తున్నాయి. ఈ కథ చదువుతుంటే  నోరి నరసింహ శాస్త్రి గారి నవల 'ధూర్జటి' లోని ఓ సంఘటన గుర్తుకువస్తుంది. ధూర్జటి వేశ్య సాంగిత్యంలో సర్వం మరచిపోతాడు. శివపూజ సమయం అవుతుంది. అప్పుడాయన ఆ వేశ్య వక్షోజంపైని చూచుకాన్ని శివలింగంగా భావించి అర్చన చేస్తాడు. దాంతో తన శరీరం ఉదాత్తమయిన భావనతో పరవశించి, శివభక్తురాలైపోతుంది ఆ వేశ్య. అంతటి ఉత్తమ, ఉదాత్త స్థాయిలో లేకపోయినా, చక్కటి ఆలోచన ప్రదర్శించినందుకు రచయిత అభినందనీయుడు. ఇప్పటివరకూ చదవకపోతే 'ధూర్జటి' నవలను ఓసారి పఠిస్తే, భవిష్యత్తులో ఇలాంటి కథలను రచయిత మరింత గొప్పగా రాణించే వీలుకలుగుతుంది.

*లవ్..ప్యార్.. మొహబ్బత్*

పి.వి.డి.యస్ ప్రకాశ్ రచించిన ఈ కథ ఫిబ్రవరి 10, నవ్య వీక్లీలో ప్రచురితమయింది. ఆధునిక సమాజంలోని ప్రేమలో డొల్లతనాన్ని చూపించాలని రచయిత ప్రయత్నించాడు. కిషోర్, హరితలు ప్రేమించి పెళ్ళిచేసుకుంటారు. కానీ పెళ్ళయిన సంవత్సరానికే వారి వివాహం కలహం అయిపోతుంది. తమ మధ్య ప్రేమలేదని, కేవలం వయసువల్ల, అవకాశం ఉండటం వల్ల కలిగిన ఆకర్షణనే ప్రేమగా భ్రమ చెందామని గ్రహిస్తారు. కలిసి ఉండలేమని విడిపోతారు. కథలో రచయిత చెప్పాలనుకున్న అంశం మంచిది. ఉపయోగకరమైనది. కానీ ఈ కథలో పురుషుడు నిజంగానే ప్రేమించినట్టు, స్త్రీ, తన సౌకర్యం కోసం, సెక్యూరిటీ కోసం, థ్రిల్ కోసం ప్రేమించినట్టు, వదిలేసినట్టు భావన కలిగిస్తాడు రచయిత. ప్రేమ అనేది ఇద్దరూ ఒకరినొకరు చేసుకునే మోసం అంటాడో తత్వవేత్త. దీన్లో ఎక్కువ మోసపోయిన వాడు ఎక్కువ బాధపడతాడు. అయితే, కథ చివరలో ఇద్దరూ విడిపోయినట్టు చూపేకన్నా 'రాజీ' పడినట్టు చూపితే - అర్థవంతమయి ఉండేది. 'కనీసం ఇప్పుడయినా ప్రేమించుకుందాం' అనుకుని ఉంటే మంచి ఆలోచనను ఇచ్చిన కథ అయ్యేది.

*స్వీటీ*

ఫిబ్రవరి 24, నవ్య వీక్లీలో ప్రచురితమయిన ఈ కథ ఈ నెల కథ. ఈ కథను రచించింది. కె.ఎం.శేఖర్. గొప్ప ఆలోచనను అత్యంత సున్నితంగా, ప్రదర్శిస్తుందీ కథ. హరిత, వేణుగోపాల్ లకు పిల్లలుండరు. వారు ఓ అనాధను దత్తత తీసుకుంటారు. ఆ పిల్లతోవారి అనుభవాలను, ఆలోచనలను మనసుకు హత్తుకునే రీతిలో ప్రదర్శిస్తుందీ కథ. ఈ కథ చదివిన తరువాత ఓ ఆలోచన వస్తుంది. పిల్లలు లేని దంపతులు, ఒకే సంతానం ఉన్నవారు, మరో అనాధను దత్తత తీసుకుని, ప్రేమ ఆప్యాయతల నడుమ పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పిస్తే, అనాధ పసిపిల్లల సంఖ్య కొంతయినా తగ్గుతుంది. మనం ఎక్కువయి పారేసే అన్నం ఓ అనాధకు పెడితే, కనీసం ఓ పసికూన కన్నీరు తుడిచి, ఆకలి తీర్చిన వారమవుతాం. ఈ కథ చదవండి. ఈ కథ చదివిన తరువాత మనసు కన్నీరు కారుస్తుంది. ఆలోచించండి. దేశంలో ఒక్క శిశువు కూడా అనురాగం ఆప్యాయతలు లేకుండా ఆకలితో అలమటించకుండా చేయాలంటే, మనం ఏం చేయాలో, ఎలా మన సాంఘిక బాధ్యతను నిర్వహించాలో ఆలోచించండి.

*ఈనెల కథ*

## స్వీటీ - కె.ఎం.శేఖర్

ఫిబ్రవరి 24, నవ్య వార పత్రిక ౨౦౧౦ సంచిక నుంచి

**ఫోన్‌లో వాళ్ళు** ఆ విషయం చెప్పగానే సంతోషంతో ఎగిరి గంతేసింది హారిక. వెంటనే వేణుగోపాల్‌కు ఫోన్ చేసి చెప్పింది. తను కూడా చాలా సంతోషించాడు. ఆ ఘడియలకోసం ఏడాది నుంచీ ఎదురుచూస్తున్నారు. అయితే ఎదురు చూస్తున్న ఘడియలు దగ్గర పడుతుంటే చిత్రంగా.... మనసు బాధతో ఊగిసలాడుతోంది హారికకు. ఇలా ఎందుకు జరుగుతోంది?

తూర్పున పున్నమి చంద్రుడు వెలుగులు చిమ్ముతున్నాడు. సూర్యుడు అస్తమించి గంటవుతోంది. నగరమంతా దీపాల వెలుతురు. బైపాస్ రోడ్‌లో వాహనాల చప్పుడు.

మేడమీద పిట్టగోడకు ఆనుకుని శూన్యంలోకి చూస్తోంది హారిక. ఆమె ముఖంలో అలజడి. విసురుగా వచ్చిన చల్లగాలికి ముఖం మీదకు చుట్టి వచ్చినా పట్టించుకోలేదు. 'తనేమన్నా తప్పు చేస్తోందా?' ఇప్పటికి గంటనుంచి కనీసం యాభై సార్లైనా అలా అనుకునుంటుంది హారిక.

తనీ నిర్ణయం తీసుకోవడం వెనక ఒక్క సంఘటన కాదు, ఒక్కమాట కాదు.. చాలా చాలానే ఉన్నాయి.

గంటనుంచి ఆమె అక్కడే కూర్చుని ఉంది. ఆలోచనల్లో మునిగిపోయి ఉంది. గతం, వర్తమానం, భవిష్యత్ కలగాపులగంగా ఆమె ఆలోచనల్లో సుడులు తిరుగుతున్నాయి.

✷✷✷

ఎన్నెన్నిమాటలన్నారనీ...!

పిల్లలుంటేనే మనుషులా.. లేకుంటే సమాజంలో దంపతులకు విలువ లేదా? అయినా ఎంతమంది అనాథ పిల్లలు.. నా అన్నవారు లేక, వేళకు తిండిలేక, కట్టుకోను బట్టలేక బాధపడుతున్నారు. వీధుల్లో జంతువులతో సమానంగా జీవిస్తున్నారు. ఈ పిల్లలను అలా చూశాక, ఇంతమంది ఎలా ఇంత సంతోషంగా ఉంటున్నారో తనకు అర్థమే కాదు.

'నీది మరీ చాదస్తంలే' అంటారు తనను తెలిసినవాళ్ళు.

అందరూ సుఖంగా ఉండాలనుకోవడం తప్పా? జీవం ఉన్న ప్రతి ప్రాణికీ గాలీ వెలుతురు ఎలా దొరుకుతాయో, అంతే సహజంగా పిల్లలందరికీ తల్లిదండ్రుల ప్రేమ దొరకాలనుకోవడం తప్పా...? మొన్నటికి మొన్న ఏమయింది.. ఇద్దరు చిన్నపిల్లలను విజయవాడ గుడిదగ్గర వదిలేసి వాళ్ళమ్మ చెన్నయ్ వెళ్ళిపోయింది. భాషరాదు... అమ్మలేదు.... ఆకలి... ఆదరించే వాళ్ళులేరు. రెండేళ్ళ చెల్లికి నాలుగేళ్ళ అన్న అన్నీ తానే అయ్యాడు. ఆ వార్త పేపర్‌లో చూడగానే ఆ రోజంతా తనకు ఎంత ఏడుపు వచ్చిందో. ఏ పనీ చేయబుద్ధికాలేదు. స్తబ్దంగా ఉండిపోయింది తను. వాళ్ళమ్మ తిరిగి వస్తే ఒకరోజు ఉపవాసం ఉంటానని దుర్గాదేవికి మొక్కుకుంది.

'ఎవరినో అమ్మ వదిలేసి పోతే నీకెందుకు బాధ?' అన్నారు పక్కింటివాళ్ళు.

ఆ పిల్లలున్నది ఏ చంద్రగ్రహంలోనో, అంగారక గ్రహంలోనో కాదు కదా.. మనకెందుకు అని ఊరికే ఉండిపోవడానికి. మనతోపాటు ఉండేవాళ్ళు.. ఆ ఇద్దరు పిల్లలను ఆ స్థితిలో చూస్తూ తమకేమీ పట్టనట్లు, ఎలా అందరూ తమ పనులు తాము చేసుకుంటూ పోతుంటారో తనకు అర్థంకాదు. ఇప్పటికీ అర్థంకాదు.

వేణుగోపాల్‌తో పెళ్ళయిన మొదటి రోజే తను చెప్పింది 'పిల్లలను కనడం వద్దు, అనాథ పిల్లలను పెంచుకుందాం' అని. ఆ రోజు ఇద్దరి మధ్యా ఆ విషయం పై చాలాసేపే చర్చసాగింది.

ఇద్దరి ఆలోచనలు, అభిప్రాయాలు కలవడంతో సరిపోయింది. లేకుంటేనా... తమ వంశం అని అతను పట్టుబట్టి ఉంటే ఏం చేయగలిగేది తను?

అనాథ పిల్లను దత్తత తీసుకోవాలని మొదటి రోజే తాము నిర్ణయించుకున్నారు.

పెళ్ళయి మూడేళ్ళు అయింది. అప్పటికే బంధువుల సూటిమాటలు, ఎగతాళి నవ్వులు..!

ఏం.. పిల్లలు లేకుంటే మనుషులుకాదా? పిల్లలను కనుక్కుని వాళ్ళకు సక్రమంగా అన్నీ అమర్చలేక బాధపడుతుంటే వీళ్ళు సాయంచేస్తారా?

ఎందుకు సమాజం పిల్లల్లేని దంపతులంటే అంత చులకనగా చూస్తుంది..?

తమకు పిల్లలు పుట్టక కాదు, తామే వద్దనుకుంటున్నారు.

ఎవరేమన్నా అనుకోనీ అనాథ పిల్లను దత్తత తీసుకోవాలనుకున్నారు తను, వేణు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నడుస్తున్న శిశువిహార్ (అనాథ పిల్లల సంరక్షణ కేంద్రం)కు వెళ్ళారు. దత్తతకోసం దరఖాస్తు చేస్తారు. అక్కడా హింసే. ఎన్నో ఆంక్షలు. ఎంతలా విసిగించారంటే ఇక జీవితంలో ఎవ్వరినీ దత్తత తీసుకోకూడదు అనేటంతగా. అయితే అక్కడ సరైన ఆలనాపాలనా లేక, ఏడిస్తే లాలించే అమ్మలేక... ఆకలేస్తే అన్నం పెట్టే మనిషిలేక... సహజంగా అందాల్సిన ప్రేమలేక.. ఆ పిల్లలు బాధపడుతుంటే.. ఎన్ని బాధలైనా భరించి దత్తత తీసుకోవాలనే అనుకున్నారు.

✷✷✷

"ఇక్కడున్నావా..? తలుపు తెరిచే ఉంది. ఇంట్లో చూసి మేడపైకి వచ్చాను.. స్వీట్ తీసుకో ముందుగా" అంటూ వచ్చాడు వేణుగోపాల్.

ఆలోచనల్లోంచి బయటపడ్డ హారిక వేణుగోపాల్ వైపు చూసింది.

పిండారబోసినట్టున్న వెన్నెల వెలుగులో నగరం తళతళలాడుతోంది. వీధి దీపం వెలుగులో వేణుగోపాల్ ముఖం కళకళలాడుతోంది.

"దిగులుగా ఉన్నావే.. తలనొప్పా?" కంగారుగా హారిక నుదుటిపైన చేతిని ఆనించి చూశాడు వేణుగోపాల్.

లేదన్నట్టు తల ఊపింది హారిక.

"ఎందుకలా ఉన్నావు?"

"ఏవేవో గుర్తొస్తున్నాయి.. ఎందుకో బాధగా ఉంది"

"పిచ్చీ.. మనం ఇంతకాలం ఎదురు చూసింది దీనికోసమే కదా. రేపు మన ఇంటికి పాప వచ్చేస్తుంది అనుకుంటేనే నాకెంతో సంతోషంగా ఉంది. ఆనందించాల్సిన సమయంలో బాధపడతావెందుకు?"

"పిల్లలను కనకుండా దత్తత తీసుకుని, మీ ఇంట్లో వాళ్ళను మా ఇంట్లో వాళ్ళను బాధపెడుతున్నామేమో అని దిగులుగా ఉంది"

"ఏం బాధపడకు. మనం చేస్తున్న పని చాలా మంచిది. తోబుట్టువుల పిల్లలనే సరిగా చూసుకోని ఈ రోజుల్లో అనాథ పిల్లలను ఎవరు పట్టించుకుంటారు. చాలామంది చేయలేని పని మనం చేస్తున్నందుకు గర్వపడదాం" అన్నాడు వేణుగోపాల్.

ఔనన్నట్టుగా తలఊపింది హారిక.

పొద్దున్నే ఇంటికి రాబోతున్న రెండేళ్ళ పాప గురించి, పాపను పెంచే విధానం గురించి, పాపకోసం ఏమేం చేయాలి అనే విషయాలను గురించి చాలాసేపు మాట్లాడుకుంటూ ఉండిపోయారు హారిక, వేణుగోపాల్.

నెల క్రితమే అనాథశరణాలయంలోని పిల్లలకోసం తీసుకొచ్చిన బట్టలతో, జిల్లా కేంద్రానికి బయలుదేరారు. అక్కడకు చేరేటప్పటికి ఉదయం తొమ్మిది గంటలయింది. దారిలో పండ్లు, బిస్కట్లు, స్వీట్లు తీసుకున్నారు.

అక్కడకు వెళ్ళగానే హారికను, వేణుగోపాల్‌ను పిల్లలందరూ చుట్టుముట్టేశారు.

స్వీటీ "అమ్మా" అంటూ వచ్చి హారికను వాటేసుకుంది.

"అమ్మతో వచ్చేస్తావా?" అడిగింది స్వీటీని హారిక. వచ్చేస్తానన్నట్టు తలఊపింది స్వీటీ.

అప్పటికి శిశువిహాకు చాలాసార్లు వచ్చి ఉండటంతో హారికకు ఆ పిల్ల బాగా మాలిమి అయింది. దంపతులిద్దరూ అక్కడే అరగంటసేపున్నారు. పిల్లలందరికీ తాము తెచ్చినవన్నీ పంచి, స్వీటీని తీసుకుని బయలుదేరారు.

హారికకు దిగులుగానే ఉంది. రెండేళ్ళ పిల్ల ఇంతకాలం ఇక్కడ ఉండి అలవాటు పడింది, ఇక తమదగ్గర ఉండగలదా అని భయంగా కూడా ఉంది.

దారిలోని హోటల్లో భోజనం పార్సిల్ తీసుకుని ఇంటికి వచ్చేటప్పటికి మధ్యాహ్నమయింది. ఇంటికి రాగానే పక్క ఇళ్ళలోని వాళ్ళందరూ స్వీటీని చూడ్డానికి వచ్చారు.

"ఇంత నల్లగా ఉందే అమ్మాయి.. తెల్లటి అమ్మాయే దొరకలేదా?"

"అమ్మాయినెందుకు తెచ్చుకున్నారు. అబ్బాయిని తెచ్చుకోచ్చు కదా.."

"ఇంత పెద్దమ్మాయి ఉంటుందా.."

పాపను చూడ్డానికి వచ్చిన వాళ్ళందరూ రకరకాలుగా మాట్లాడారు.

హారికకు చాలా కోపం వచ్చింది. అయినా మౌనంగా ఉండిపోయింది.

పాప నలుపు. సన్నగా పీక్కుపోయిన ముఖంతో చీకేసిన మామిడి టెంకలా ఉంది. ఆ పిల్ల కళ్ళలో తెలీని దిగులు. ముఖంలో లేతదనం కనిపించేది కాదు. ఏదో తెలీని పెద్దరికం. మామూలుగా తల్లి దండ్రుల దగ్గర ఉండే రెండేళ్ళ పిల్లలా లేదు స్వీటీ. అదే విషయం వేణుగోపాల్‌తో అంది హారిక.

"నీకలా అనిపిస్తోంది, అంతేలే... చిన్నపిల్ల చిన్న పిల్లలా కాక ఇంకెలా ఉంది?" అన్నాడు చాలా తేలిగ్గా వేణుగోపాల్.

హారిక వారం రోజులు ఆఫీసుకు సెలవు పెట్టింది. పాపను ఇంటి దగ్గర చూసుకునే మనిషి కోసం తెలిసిన వాళ్ళందరికీ చెప్పిపెట్టారు.

వచ్చిపోయే వాళ్ళతో పాటు, స్వీటీతో ఇల్లంతా సందడిగా ఉంది.

స్వీటీ హారిక చంక దిగడం లేదు.

తదేకంగా హారిక ముఖంలోకే చూస్తుంది.

గట్టిగా బల్లిలా కరుచుకుంటుంది.

కనీసం హారికను బాత్ రూంకు పోనివ్వదు.

కాస్త తలుపుచాటయినా చాలు "అమ్మా" అంటూ ఏడుపు.

ఎక్కడ తనను వదిలి వెళ్ళిపోతుందో అని స్వీటీకి దిగులు భయం బాధ.

హారికకు విషయం అర్ధమయింది. స్వీటీని తన హృదయాకి హత్తుకుని "ఎందుకు అమ్మలూ ఏడుస్తావ్.. అమ్మ నిన్ను వదిలిపోదు.. ఎప్పుడూ నీ దగ్గరే ఉంటుంది. నీకు పాలు తాగిస్తుంది... బువ్వ పెడుతుంది.. లాలపోస్తుంది.. పౌడర్ రాస్తుంది.. బొట్టు పెడుతుంది.. బట్టలు వేస్తుంది.. నా బంగారు కొండ.. మా వరాల మూట.. మా పండు జాంపండు.. యాపిల్ పండు.." అంటూ మాటలు చెప్పింది. అలా మాట్లాడుతున్నప్పుడు హారిక గడ్డం పట్టుకుని తన చిన్ని చేతులతో వెనక్కు నెట్టేది స్వీటీ. హారిక కళ్ళలోకి, ముఖంలోకి తదేకంగా చూసేది. ఆ కళ్ళలో ఏవో అపనమ్మకం నీడలు. 'నిజంగా ఇది నిజమేనా? ఈమె తనకు అమ్మేనా? తనను వదిలి వెళ్ళిపోతుందా? వదిలి పోకుండా ఉంటే బాగుండు.. ఎప్పటికీ ఇలా అమ్మ తనను ఎత్తుకుని ఉంటే బాగుండు..' అనే భావాలు ఆ ముఖంలో కదలాడేవి.

తాను ఇంతలా మాటలు చెబుతున్నా.. తనెప్పుడూ చూడని హావభావాలను ముఖంలో పలికించే స్వీటీని చూస్తే హారికకు దుఃఖం వచ్చేది. కళ్ళనిండా నీళ్ళు తిరిగేవి. జలజలా బుగ్గలపై నుంచి జారేవి. ఆ కన్నీటిని చూస్తే చినపిల్లకు ఏమనిపించేదో ఏమో, హారికను గట్టిగా వాటేసుకుని, మెడ వంపులో తల ఉంచి అతుక్కుపోయేది. స్వీటీ కళ్ళలో సైతం నీళ్ళు.

తమ ఇంటికి వచ్చేప్పటికి స్వీటీకి 'మా.. పా.. పా' అనే మాటలు మాత్రమే వచ్చేవి.

మా.. అంటే అమ్మ.

పా.. అంటే పాలు.

పా.. అంటే పాస్ అని స్వీటీ ఇంటికొచ్చిన రెండు గంటల్లో అర్థం చేసుకుంది హారిక.

రెండేళ్ళ పిల్లనయినా స్వీటీకి మాటలు రాకపోవడం తనకు ఆశ్చర్యంగా ఉంది.

తమ పక్కింటిలో ఉండే ఏడాదిన్నర పాప అప్పుడే ముద్దుముద్దుగా మాటలు చెపుతోంది. ఇంటి కొచ్చిన మొదటి రోజు సాయంకాలానికే స్వీటీకి నానా.. ఆంటీ..'' అనే మాటలు వచ్చాయి.

హారికకు అనాథ శరణాలయం... అక్కడి పిల్లలు గుర్తొచ్చారు.

తను ఒకరోజు సెలవు పెట్టి పూర్తిగా వాళ్ళతో గడిపింది. అంతా యాంత్రికమే. చిన్నపిల్లలు ఏడిస్తే నోటికి పాలపీక ఇచ్చేవాళ్ళు. కాస్త ఊహ వచ్చిన పిల్లలకు బొమ్మలు ఇచ్చేవాళ్ళు. వాళ్ళతో పెద్దవాళ్ళ మాటలుండవు. ఆటలుండవు.. పాటలుండవు.. ఇంకెలా వస్తాయి పిల్లలకు మాటలు.. అదంతా గుర్తుకు రాగానే హారికకు మళ్ళీ దుఃఖం వచ్చింది.

''ఏదీ... అమ్మా.. అను''

''అత్తా.. అను''

''నాన్నా...అను''

''నాకు పాలుకావాలి.. నా బొజ్జకు బువ్వ కావాలి.. నాకు నిద్దర వస్తోంది.. నాకు బొమ్మలు కావాలి.. నాకు చాక్లెట్ కావాలి'' లాంటి మాటలు తరచూ ఇళ్ళల్లో పిల్లలతో పెద్దలు ముద్దుముద్దుగా మాట్లాడుతుంటారు. పిల్లలను కాళ్ళపైన పడుకోబెట్టుకునో, లేదా ఎత్తుకునో మాటలు చెబుతుంటారు.

పెద్దలను అనుకరిస్తూ పిల్లలు మాట్లాడ్డానికి ప్రయత్నించడం.. ఆ మాటలనే మళ్ళీ చెప్పించడం.. వాటిని విని పెద్దలు ఆనందించడం.. తమ బంధుమిత్రులకు పిల్లల మాటలను చెప్పడం... ఇంటికి వాళ్ళు వచ్చినప్పుడు తమ పిల్లలచేత ఆ మాటలను చెప్పించడం.. ఎంత కోలాహలంగా ఉంటుంది.. ఇలాంటి వాతావరణంలో పెరిగే పిల్లలకు మాటలు వాటంతటవే వస్తాయి.

అసలు మాటలే లేని వాతావరణంలో.. కేవలం.. ''నోర్మూసుకో.. ఏడిస్తే బూచోనికి పట్టించేస్తా..'' లాంటి మాటలు మాత్రమే వినే చోట ఉంటే, పిల్లలు మాటలురాని మనుషులుగా మిగిలిపోరా... అనుకుని చాలా బాధపడింది హారిక. 'అలాంటి చోట పిల్లలుంటే కోల్పోతున్నది కేవలం పెద్దల ప్రేమ మాత్రమే కాదు.. సున్నితమయిన భావాలను కూడా' అనుకుంది.

స్వీటీతో వీలయినంత ఎక్కువగా మాట్లాడ్డానికి ప్రయత్నిస్తోంది హారిక. తను మాట్లాడుతూ ఆ పిల్ల చేత మాట్లాడిస్తోంది. వేణుగోపాల్ కూడా ఆఫీసు నుంచి వచ్చాక ఎక్కువసేపు పాపతో గడుపుతున్నాడు.

పాపకోసం అదనంగా లీటరు పాలు తీసుకుంటున్నారు. ఆకలయితే ఈ పిల్లకు ఎలా పాలు తాగించాలో అని హారికకు దిగులుగా ఉండేది. ఆ పిల్లపాలు తాగే విధానం చూసి దిగులు స్థానంలో బాధ మిగిలించింది. పాలను గ్లాసులో వేసి ఇవ్వగానే కూర్చుని చకచకా తాగేసింది స్వీటీ.

ఓ రోజు పొద్దున్నే ప్లేటులో ఇడ్లీలోకి చెట్నీ నెయ్యివేసి స్వీటీకి పెడదామని ఎత్తుకుంది హారిక. అయితే ఆ పిల్ల చంకలో ఉండటం లేదు. కిందకు జారుతోంది. కిందకు దించగానే తన చేతిలోని ప్లేటు తీసుకుంది స్వీటీ. కింద బాసింపట్టు వేసుకుని కూర్చుంది. పెద్దవాళ్ళలా తినడం మొదలుపెట్టింది. ఎదురుగా కూర్చుంది హారిక. నీళ్ళగ్లాసు కూడా తన పక్కనే ఉంచుకుంది స్వీటీ. శ్రద్ధగా తినడం మొదలుపెట్టింది. మధ్యలో నీళ్ళు తాగేప్పుడు స్వీటీ చేతిలోంచి గ్లాసు జారిపోయింది. కిందంతా నీళ్ళు. ప్లేటంతా నీళ్ళు.

భయం భయంగా హారిక వైపు చూసింది స్వీటీ.

"అరరే.. నీళ్ళు కింద పడ్డాయా.. పోతే పోనీలే. వేరే తెస్తానుండు" అంటూ వంటగదిలోకి వెళ్ళింది హారిక. వేరే ప్లేటులో మరో రెండు ఇడ్లీలు పెట్టుకుని చెట్నీ, నెయ్యి వేసుక్ని, గ్లాసుతో నీళ్ళు తీసుకుని హాల్లోకి వచ్చింది.

అప్పటికే స్వీటీ తలుపు దగ్గరున్న మ్యాట్ తీసుకొచ్చి, కింద ఒలికిపోయిన నీళ్ళమీద వేసింది. ప్లేటులో నీళ్ళు చేత్తో పక్కకు తోసి.. నీళ్ళతో ఉన్న ఇడ్లీని భయం భయంగా తింటోంది.

ఆ దృశ్యాన్ని చూడగానే హారిక తీగ తెగిన వీణే అయింది. చాలాసేపు ఏడ్చుకుంది. రెండేళ్ళ వయసుకే ఆ పిల్ల ఎలా ప్రవర్తిస్తోంది? అక్కడ శరణాలయంలో కింద నీళ్ళు వొలికిస్తే పిల్లలే దానిని శుభ్రం చేసేవాళ్ళేమో.. నీళ్ళు పడ్డ టిఫినే తినాల్సి వచ్చేదేమో.. అనుకోవడంతో ఒకసారిగా ఆ పిల్లను కన్న తల్లిదండ్రులపై కోపం వచ్చింది హారికకు.

'ఆ మాత్రం బిడ్డలను పెంచుకోలేని వాళ్ళు ఎందుకనాలి? ఎందుకిలా వదిలేయాలి? ఇంక వీళ్ళ భవిష్యత్ ఏం కావాలి? పురిటికందప్పటినుంచే ప్రేమాదరణలకు నోచుకోని ఇలాంటి పిల్లలు పెద్దయ్యాక ఎలా తయారవుతారు?' అని తలచుకుని బాధపడింది.

'పిల్లలను కని వదిలేసే వాళ్ళు మనుషులే కాదు. పశువులు' అనుకుంది. మళ్ళీ తనే.. 'అసలు ఏ తల్లికయినా బిడ్డను వదులుకోవాలని ఉంటుందా? పేగుతెంచుకు పుట్టిన బిడ్డనే వదులుకున్నారంటే ఆ తల్లి ఎంతటి బాధలో ఉండిఉందో కదా' అనుకుంది.

స్వీటీ కోసం రకరకాల బొమ్మలు తెచ్చాడు వేణుగోపాల్ బొమ్మలన్నింటినీ ముందేసుకుని కూర్చుంటుంది స్వీటీ పరిస్థితి.

ఇరవై జతల బట్టలు తెచ్చారు స్వీటీ కోసం. తను స్నానం చేయాలంటే కొత్తబట్టలు వేయాల్సిందే

"స్వీటీ.. నీళ్ళు పోసుకుందువురా.." అంటే..

"కొత్త.. డ్రెస్" అనేది.

"ఆఁ కొత్త డ్రెస్సే వేస్తానురా" అంటే, స్నానానికి వచ్చేది.

వారం రోజులు నిముషాల్లా అయిపోయాయి. హారికకు సెలవులు అయిపోయాయి. ఇక ఆఫీసుకు పోవాలి. పాపను చూసుకోవడానికి మనిషి కుదిరింది. పాపను ఆమెకు అప్పగించి, తను ఆఫీసుకు పోవడానికి తయారయింది హారిక.

స్వీటీ వచ్చి రెండు కాళ్ళు గట్టిగా పట్టుకుని హారిక ముఖంలోకి చూస్తూ నిలుచుంది.

"అమ్మకు బై చెప్పు.. డ్యూటీకి పోయొస్తుంది" అంది హారిక.

స్వీటీ హారిక ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది. ఆ ముఖంలో ఏవేవో భావాలు... అపనమ్మకం నీడలు... తనను వదిలి వెళ్ళిపోతుందేమో అనే భయం.. మళ్ళీ వస్తుందో రాదో అనే దిగులు...

అప్పటికీ రెండు రోజులనుంచి హారిక స్వీటీకి చెపుతూనే ఉంది, తను ఆఫీసుకు పోతానని.

"స్వీటీ.. నీకు కొత్త డ్రెస్సులు కావాలికదా" అంది హారిక.

కావాలన్నట్టు తల ఊపింది స్వీటీ.

"నీకు బోల్డన్ని బొమ్మలు కావాలా"

తల నిలువుకు ఊపింది స్వీటీ.

"నీ బొజ్జకు పాలు కావాలి... అవన్నీ కావాలంటే డబ్బు కావాలి కదా." అంది హారిక.

స్వీటీకి ఏమర్థమయిందో ఏమో.. తల ఎగరేసింది.

"డబ్బు కావాలంటే అమ్మ ఆఫీసుకు పోవాలి.. నువ్వు ఇంటి వద్దే ఆంటీ దగ్గర చక్కగా ఉండాలి.. అల్లరి చేయకూడదు.. సరేనా.."

అర్థమయిందో లేదో... కిలకిలా నవ్వింది స్వీటీ. ఇలా రెండు రోజులనుంచి స్వీటీకి చెపుతూనే ఉంది హారిక.

ఇప్పుడు ఆఫీసుకు బయలుదేరుతుంటే ఇలా కాళ్ళను గట్టిగా పట్టుకుంది.

స్వీటీని రెండు చేతులతో ఎత్తుకుని "స్వీటీ చాలా మంచి పిల్ల.. చెప్పిన మాట చక్కగా వింటుంది. నేను ఆఫీసుకు పోయి ఇప్పుడే వచ్చేస్తాను... నువ్వు ఆంటీ దగ్గర ఉండు.. లక్ష్మీ.. స్వీటీని తీసుకో" అంటూ పనామె లక్ష్మిని పిలిచింది హారిక.

లక్ష్మి వచ్చి "దా స్వీటీ" అంటూ చేతులు చాచింది.

స్వీటీలో ఇంకా ఎన్నో సందేహాలు.

ఆ పిల్ల మనసులో అప్పుడప్పుడూ అనాథశరణాలయం మెదులుతూ ఉంటుంది. అక్కడి ఆయాలు గుర్తొచ్చినప్పుడు భయంగా వచ్చి హారికను వాటేసుకునేది. తన తోటి పిల్లలు గుర్తొచ్చినప్పుడు వచ్చీరాని మాటలతో వాళ్ళను పిల్చేది.

తను ఇప్పుడు ఏడిస్తే ముందున్న చోటుకే పంపుతారేమో అనే భయం.. ఏడవకుంటే అమ్మ వెళ్ళిపోయేలా ఉందే అని దిగులు.

లక్ష్మి "నా దగ్గరకు రా.. అమ్మ డ్యూటీకి పోనీ" అంటూ స్వీటీని రెండు చేతులతో పట్టుకుంది.

అంతే, ఒక్కసారిగా ఇంటి పైకప్పు ఎగిరిపోతుందేమో అనేంత గట్టిగా ఏడుపు ఎత్తుకుంది స్వీటీ. హారికను ఉడుములాగా పట్టుకుంది.

ఆ పిల్ల ఏడుపు చూసి హారికకు ఒకవైపు బాధ, మరోవైపు సంతోషమూ.

భుజానికి వేలాడుతున్న హ్యాండ్ బ్యాగ్ తీసి దివాన్ మీద వేసి కుర్చీలో కూర్చుంది. స్వీటీని తన గుండెలకేసి హత్తుకుని "ఊకో.. ఊకో.. అమ్మ ఎక్కడికీ పోదు.. నిన్ను వదిలి అమ్మ ఉంటుందా... నువ్వు నా బంగారు కదూ.. ఏడవద్దమ్మా.. గొంతు నొప్పయితాది" అంటూ చాలా సేపు మాటలు చెప్పాక స్వీటీ ఏడుపు ఆపింది.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది. హారిక భుజం పైన తల ఉంచి పడుకుంది. పాప నిద్రపోయిందనుకుని, మంచంపైన పడుకోబెట్టి ఆఫీసుకు పోదామనుకుంది హారిక. స్వీటీని మెల్లగా కిందకు దించింది. ఆ పిల్ల మరింత గట్టిగా హారికను పట్టుకుని తిరిగి ఏడుపు మొదలు పెట్టింది.

"తల్లి ప్రేమకు నోచుకోలేదు కదా.. ఇప్పుడు తనను వదిలితే మళ్ళీ వస్తుందో రాదో అనే భయంతో ఏడుస్తోంది" అనుకోగానే హారికకు కూడా ఏడుపు వచ్చింది. ఎంత ఖర్చు చేస్తే మాత్రం తల్లి ప్రేమను ఇవ్వగలరా..?

ప్రేమ లేకుండా పెరిగే పిల్లలు పిల్లల్లానే ఉంటారా?

అనాథ శరణాలయం, పిల్లలు గుర్తొచ్చారు. అక్కడ వసతులు అంతంత మాత్రం. వాళ్ళందరినీ ఆదుకునేదెవరు..? ఎవరో ఎందుకు.. తనే ఆ పని ఎందుకు చేయకూడదు అనుకుంది హారిక.

పాపను ఒడిలో పెట్టుకుని కళ్ళు మూసుకుని కూర్చుండిపోయింది హారిక.

తల్లి రెక్కల చాటున ఒదిగిన గువ్వపిల్లలా ముడుక్కుని ఉండిపోయింది స్వీటీ.

హారిక కళ్ళముందు ఏవేవో దృశ్యాలు కదలాడుతున్నాయి.

చుట్టూ పచ్చటి పొలాలు.. వాటి మధ్యలో ఒక పెద్ద ఇల్లు.. ఇంటిచుట్టూ ఆటస్థలం... ఆటస్థలంలో ఎందరో చిన్నపిల్లలు. తన ఒడిలో ఇద్దరు పిల్లలు. వేణుగోపాల్ భుజాల మీద ఇద్దరు పిల్లలు.. అమ్మా . నాన్నా అంటూ కేరింతలు కొడుతున్నారు.. చుట్టూ ఆడుకుంటున్న పిల్లలు వద్ద నలుగురైదుగురు ఆడవాళ్ళు.. వాళ్ళ ముఖాల్లో సైతం మాతృవాత్సల్యం.. చెట్ల గుబుర్లలోంచి కోకిల కూతలు.. వాటిని వెక్కిరిస్తూ పిల్లల అనుకరణ అరుపులు..

"యస్.. ఇవన్నీ నిజం కావాలి. అందుకు ఏం చేయాలో వేణుగోపాల్‌తో రాత్రికి చర్చించాలి" అనుకుంది హారిక, తనను బల్లిలా కరుచుకునున్న స్వీటీని మరింత గట్టిగా హత్తుకుంటూ. ✷ ✷ ✷




## మార్చి 2010

మార్చి నెల కథాసాగర మథనంలో విశ్లేషణకు, ఆంధ్రభూమి, స్వాతి, నవ్య, వారపత్రిక స్వాతి, ఆంధ్రభూమి, విపుల, చిత్ర మాసపత్రికలు, ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 68 కథలను ఎంచుకుని, వాటిలో విభిన్నంగా, ఉన్న కథలను పరిచయం చేస్తున్నాను.

సమకాలీన సామాజిక సమస్యలకు రచయితలు స్పందించటంలో ఆశ్చర్యంలేదు. సమస్యలను అవగాహన చేసుకుని, లోతుగా విశ్లేషించి, వాటికి పరిష్కారాలను సూచించటమేకాదు, ఆ సమస్యలను ఎదుర్కోవటంలో సమాజానికి ఆత్మవిశ్వాసం ఇవ్వటం కూడా కథా రచయితల బాధ్యతనే గమనిస్తే, మన పురాణాలలో వచ్చే పిట్ట కథలనేకం పాఠకులు నిత్యజీవితంలో ఎదుర్కునే అనేక సమస్యల స్వరూపాన్ని విప్పి చెప్పి, వారి సంశయాలను తీర్చి మార్గదర్శనం చేసేవే. అందుకే ఏకాలంలోనో రాసిన పురాణ కథలను చదివి విశ్లేషించి, వాటిని ఈనాటి సమాజానికి అన్వయించి, స్ఫూర్తిని పొందుతున్నాం. ఇతర ఏ నాగరికతలోనూ, మతంలోనూ, ధర్మంలోనూ లేని ఈ నిరంతరం పరిస్థితులకు తగ్గట్టు అన్వయించుకోగల పురాణకథలలోని మౌలిక లక్షణం భారతీయ ధర్మం సజీవంగా ఉంచుతోంది. ఆద్యంతాలు లేని అనంత జీవనదిలా నిలుపుతోంది. అయితే, ఈ పురాణాల కథలను సమకాలీన సమాజానికి అన్వయించటంలో రచయితలకు పురాణాల పట్ల అవగాహన ఉండాలి. పురాణ పాత్రల పట్ల గౌరవం ఉండాలి. సంస్కృతి సాంప్రదాయాల పట్ల విశ్వాసం ఉండాలి. ముఖ్యంగా ఆత్మగౌరవం ఉండాలి. అవి లేకుండా, తమ సంకుచిత సిద్ధాంతాల పరిమిత పరిధిలోకి పురాణాలను, పురాణ పాత్రలను ఇమిడ్చి వాటిని దిగజార్చాలని ప్రయత్నిస్తే, అందువల్ల పురాణాలకు, ఆ పాత్రలకు వాటిల్లే నష్టం కన్నా రచయితలకే నష్టం ఎక్కువ. వారి రంగుటద్దాల సంకుచిత దృష్టి పదిమంది తెలుస్తుంది.

మార్చి నెలలో మన ప్రాచీన గాథలద్వారా సమకాలీన సమాజానికి మార్గదర్శనం చేయాలని ప్రయత్నించిన రెండు కథలు ప్రచురితమయ్యాయి. ఆ కథలను విశ్లేషిస్తే, రచయితల 'దృష్టి' వారి కథలపై చూపిన ప్రభావం తెలుస్తుంది.

<u>తలరాతల్ని మార్చుకున్న వాళ్ళు.</u>

మార్చి 7, 'సాక్షి'లో ప్రచురితమైన ఈ కథను రచించింది డా.దేవరాజు మహారాజు. ఇది బెంగాలీ జానపద కథ ఆధారంగా రచించిన కథ అంటారు రచయిత. జానపదగాథని నిత్యజీవితంలోని అనుభవాలకు, కామన్ సెన్స్ జోడించి, అతిగొప్ప సత్యాలను, అత్యంత సున్నితంగా ఆవిష్కరిస్తాయి. కాలంతో, తరంతో సంబంధం లేకుండా శాశ్వత సత్యాలను ప్రకటిస్తాయి. వాటిని పునః రచించేటప్పుడు రచయితలు చేయవలసిందల్లా, ఔచిత్యం పాటిస్తూ, ఆ కథలలోని నీతిని సమకాలీన సామాజిక పరిస్థితులకు అన్వయించే భావం వచ్చేట్టు రాయటమే. ఈ కథలో రచయిత చేసింది అదే అందుకే కొద్ది మార్పులతో ఒకే రకమైన జానపదగాథలు ప్రపంచమంతా ప్రచారంలో ఉన్నాయి. ఈ కథ అలాంటిది. తమ తెలివితో, సమయస్ఫూర్తితో బ్రహ్మదేవుడి తలరాతను సైతం మార్చుకున్న వారి కథ ఇది. 'ఒక గేదె, ఒక సంచి బియ్యం మాత్రమే ప్రాప్తమున్నవాడు', 'వేశ్యగా, బ్రతుకు వెళ్ళదీసే అమ్మాయిలు సమయస్ఫూర్తితో

తలరాత రాసిన బ్రహ్మదేవుడినే బోల్తాకొట్టిస్తారు. 'తమ కోసం తాము ఏమీ మిగల్చకోకుండా సమాజ శ్రేయస్సుకోసం జీవించే వారి' జీవితంలోని ఔన్నత్యాన్ని సున్నితంగా ఎత్తిచూపుతూ, రేపటి గురించి ఆలోచనలో నేటినే కాదు మానవత్వాన్ని మరచిపోతున్న సమాజానికి మంచి ఆదర్శాన్ని బోధిస్తుందీ కథ. కథ రచనలో రచయిత ఎలాంటి అనవసర ఆర్భాటము, సిద్ధాంతప్రతిపాదనలకు పోకుండా సూటిగా, స్పష్టంగా కథను చెప్పారు. చదవగానే 'ఆహా' అనిపిస్తుంది.

<u>విముక్తి</u>

ఓల్గా రచించిన ఈ కథ ఆదివారం ఆంధ్రజ్యోతి 7 వతారీకు సంచికలో ప్రచురితమయింది. ఇది రామాయణంలో ఊర్మిళ పాత్ర ప్రాధాన్యంగా నడిచే కథ. పధ్నాలుగేళ్ళ వనవాసం తరువాత అయోధ్యకు వచ్చిన సీతకు ఊర్మిళ కనబడదు. ఊర్మిళ కోసం వెతకుతూ వెళుతుంది. అప్పుడు ఊర్మిళ 'నా భర్త నాతో ఒక్కమాట చెప్పకుండా నా నిర్ణయంతో ప్రమేయం లేకుండా, నేననేదాన్ని ఒకదానిని ఉన్నాననే ఆలోచన లేకుండా అన్నగారే సర్వస్వమని వెళ్ళిపోయారు' అని కోపం ప్రకటిస్తుంది. సత్యాగ్రహం చేస్తుంది. అందరినీ దహించాలన్నంత కోపం ప్రకటిస్తుంది. అది సత్యాన్వేషణగా మారుతుంది. తనలో తాను విశ్లేషించుకుంటుంది. స్త్రీ తనమీద తనకు అధికారాన్ని సాధించాలని అర్థం చేసుకుంటుంది. అంతేకాదు, ఇతరులపై అధికారాన్ని కూడా వదులుకున్నప్పుడే స్త్రీ విముక్త అవుతుందని గ్రహిస్తుంది. రాముడు అశ్వమేధ యాగం చేస్తున్నప్పుడు అడవికి వచ్చి సీతను కలుస్తుంది ఊర్మిళ. రాముడి నుంచి విముక్తం కావాలని బోధిస్తుంది. చివరికి రాముడు సీతను స్వీకరించే సమయానికి ఆ అవసరంలేదు అంటుంది సీత. ఇదీ 'విముక్త' కథ.

మనదేశంలో, ఏ సిద్ధాంతానికయినా, ఏ ఆలోచనకయినా, ఎవరికయినా ప్రామాణికత రావాలంటే, పురాణాలలో వారి ఆలోచనకు అమోదం లభించాలి. అందుకే, మన సమాజంలో ప్రతికులానికి, ప్రతి సంఘానికి ఓ పురాణం ఉంటుంది. ఆ పురాణానికి రామాయణ, భారతాలతో సంబంధం కూడా ఉంటుంది. అందుకే మనం ప్రతిదానికీ పురాణాలలో 'ఇలా ఉంది' అని సమర్థించుకుంటాం. చివరికి పురాణాలను ద్వేషించి, వాటిని ఒప్పుకోని వారు కూడా తమ సిద్ధాంతాలకు ఆమోద ముద్రలభించటం కోసం కూడా పురాణాలను వాడుకోవటం గమనార్హం. అయితే, ఇలాంటి వారు పురాణాలను గౌరవ దృష్టితో చూడరు. రంధ్రాన్వేషణ, తప్పుడు విశ్లేషణల ద్వారా ప్రామాణికత సాధించాలని చూస్తారు. పురాణ కథలను వక్రీకరించి, పాత్రల వ్యక్తిత్వాలను దెబ్బతీస్తారు. తమలోని నైచ్యాన్ని, కపటాన్ని ఆ పాత్రలకు ఆపాదించి వక్రభాష్యం ఇస్తారు. నిజానికి పురాణాలను చదివి, అర్థం చేసుకున్న వారు సమాజంలో తక్కువ. దాంతో మిడి జ్ఞానంతో వక్రభాష్యం ఇచ్చేవారిది చదివేసి, ఇలాంటి వారికి గొంతు చించుకునే గుంపులుండటంతో ఆ గుంపులో చేరి అరుస్తారు. కొన్నాళ్ళకి నిజంగా పురాణాల్లో ఉందనుకుంటారు. దుర్వ్యాఖ్యానాలు చేస్తారు. అదే నిజమని అజ్ఞానంలో సాంప్రదాయాలను దూషిస్తారు. తామునుంచున్న కొమ్మనే తాము నరుక్కుంటారు.

'విముక్త' కథ చదివిన వారికి 'ఇది నిజమేనేమో' అనిపిస్తుంది. భార్య ఇష్టాలు గౌరవించకుండా, పురుషాహంకారంతో ఊర్మిళకు చెప్పకుండా వెళ్ళిపోయాడు. 'ఊర్మిళ సత్యాగ్రహం చేయటంలో తప్పులేదు' అనుకుంటారు. పురాణాలలో పురుషాహంకారాన్ని ఎత్తి చూపి రాముడిపై బాణాలు విసిరి, సాంప్రదాయాన్ని నమ్మేవారిని చులకన చేసేందుకు మరో 'కథ' దొరికిందని సంతోషించి అసలు నిజం తెలియని వారు ఇదే నిజమని నమ్మి, ఈ చదివిన కథ తప్ప ఇక చదవాల్సిందేదీ లేదని, అంతా తమకు తెలుసని విర్రవీగుతారు. ఇలాంటి ఉపనిషత్తులు 'గుడ్డివాడు గుడ్డివాడికి త్రోవ చూపించటం'గా అభివర్ణించారు.

రామాయణం ధర్మాన్ని చెపుతుంది. ఆ ధర్మానికి రాముడు ప్రతీక. రాముడి ప్రవర్తన, వ్యక్తిత్వం పురుషోత్తముడి ప్రవర్తన, వ్యక్తిత్వాన్ని నిరూపిస్తుంది. కానీ, పురాణాలను సమకాలీన సమాజానికి అన్వయించుకునేటపుడు కల్పనలు చేసుకునే వీలు రచయితలుంటుంది. అందుకే బోలెడన్ని ప్రక్షిప్తాలు, నిక్షిప్తాలు మన ప్రాచీన రచనలలో. అయితే, ఈ కల్పనలు ఔచిత్యాన్ని పాటించాలి.

ఉదాహరణకు, రాముడు అయోధ్య తిరిగి వచ్చిన తరువాత, సీత హనుమంతునికి హారం బహుమతి ఇచ్చే కథ ఉంది. రామాయణంలో హారం ఇవ్వటం వరకే ఉంది. ఆ తరువాత హనుమ హారాన్ని చితగ్గొట్టి 'రాముడి' కోసం వెతకటం కల్పన. ఈ కల్పన సమాజానికి మంచిని నేర్పుతుంది. ఉత్తమ ఆలోచననిస్తుంది. అలా ఆహారం కోసం వానరులు కొట్టుకున్నట్టో, హనుమ నుంచి ఓ వానరుడు, ఆహారాన్ని దొంగిలించి, తన ప్రేయసికి ఇస్తే, దానికోసం గొడవ జరిగినట్టు రాస్తే, అది కల్పితం అవుతుంది. అనౌచిత్యం అవుతుంది. కాబట్టి పురాణాల ఆధారంగా కల్పనలు చేసేవారు పురాణాలలో లేనిదాన్ని సృష్టించినా, దానికి బీజం పురాణాలలో ఉండితీరాలి. లేకపోతే అది అన్యాయం అవుతుంది. దౌష్ట్యం అవుతుంది.

విముక్త కథకు కేంద్రబిందువు లక్ష్మణుడు, ఊర్మిళకు చెప్పకుండా వెళ్ళాడన్నది ఆమెను మనిషిలా పట్టించుకోలేదన్నది ఆమె అభిప్రాయానికి విలువనివ్వలేదన్నది. కానీ వాల్మీకి రామాయణంలో వనవాసానికి బయలుదేరే ముందు, రాముడు లక్ష్మణుడితో 'ప్రజా పృచ్ఛస్వ్యామిత్ర్ సర్వమేవ సుహృజ్జత్ (అయోధ్య కాండ, 31 వ సర, 28 వ శ్లోకం) అంటాడు. అంటే 'లక్ష్మణా, నీ ఆప్తులు సన్నిహితుల వద్ద సెలవుతీసుకో' అని అర్థం. అంటే, వనవాసం వెళ్ళేముందు అందరికి చెప్పి, ఒప్పించి అనుమతి తీసుకున్నాడన్నమాట లక్ష్మణుడు.

ఒక రచనలో అన్ని విషయాలు అరటిపండు వొలిచి ఇచ్చినట్టు చెప్పరు. సూచ్యమానంగా చెప్తారు. బుద్ధిమంతులకది అర్థమవుతుంది. గ్రహిస్తారు.

భర్త బాధ్యతలను గుర్తించి, నిర్ణయాన్ని మన్నించి స్వచ్ఛందంగా ఊర్మిళ అడవికి రాకూడదన్న నిర్ణయం తీసుకుని ఉంటుంది. భార్యా భర్తల నడుమ అనురాగం, ఆప్యాయత, గౌరవాభిమానాలు అనుభవానికి వచ్చి, అవగాహన ఉన్నవారు దాంపత్య బంధాన్ని ఉన్నతంగా, ఉత్తమంగా చూపి సమాజానికి మంచిని బోధిస్తారు. సమాజం ముందు ఉత్తమ ఆదర్శం నిలుపుతారు. కానీ అలాంటి దూరదృష్టి, ఉత్తమ ఆలోచనలు లేనివారు తమ వికృతిని, సంకుచితత్వాన్ని పురాణ పాత్రలకు ఆపాదించి సమాజాన్ని, విశ్వాసాలను దెబ్బతీయాలని చూస్తారు. మన సాహిత్య రంగంలో నిష్పక్షపాత విమర్శలను, విశ్లేషణలను తలవకపోవటంతో ఇలాంటి రచనలు, ప్రామాణికమౌతున్నాయి. కానీ రచనకు ఆధారమైన 'ఊహనే' అనౌచిత్యమయిన తరువాత ఆ రచనకు విలువ ఉండదు. కథలో సీతను భర్తనుంచి విముక్తమవటానికి ప్రేరణనిచ్చిన ఊర్మిళ, తన భర్తతో హాయిగా ఉండటం 'ఎదుటి మనిషికి చెప్పటానికే నీతులు' అన్న నిజాన్ని నిరూపిస్తాయి. 'ఆదర్శాలు మీరు పాటించండి. నేను హాయిగా ఉంటాన'నే సంకుచిత దృక్పధానికి అద్దం పడతాయి.

<u>*బాధ్యత*</u>

ఎ.పుష్పాంజలి రచించిన ఈ కథ మార్చి నెల విపులలో ప్రచురితమయింది. బహుశా ఏ స్త్రీ వాద రచయిత్రితో జరిగిన చెడు అనుభవ ఫలితమో ఈ కథ అనిపిస్తుంది.'ఓవర్ నైట్ ఫేమస్ కావటానికి ప్రస్తుతం రచయితలకు రెండే మార్గాలు. ఒకటి స్త్రీవాదం. రెండు మాండలికాల్లో సాగే రచనలు చేయడం' అంటూ నిర్ద్వంద్వంగా ప్రకటించిన రచయిత్రికి అభినందనలు. ఈ కథలో ఓ స్త్రీవాద రచయిత్రి, ఆమె భర్తకు అణిగి మణిగి ఉండటం, తన్నులు తిని పడిఉండటం, చివరికి భర్తను వెనకేసుకొచ్చి, మరో స్త్రీపై నేరం నెట్టేయటాన్ని రచయిత్రి చక్కగా చూపారు. 'ఎదుటి మనిషికి చెప్పటానికే నీతులు' అన్నట్టు వ్యవహరిస్తూ, అమాయక ప్రజల జీవితాలలో ఆటలాడుకునే వారి ఆదర్శాలకు ఓ పండును విప్పి చూపించిన కథ ఇది.

<u>*నువ్వేకావాలి.*</u>

డాక్టర్ గాయత్రీ దేవి రచించిన ఈ కథ మార్చి నెల విపులలో ప్రచురితమయింది. పిల్లలు లేని దంపతులు ఓ అనాధను దత్తత తీసుకోవటం ఈ కథ. దంపతుల నడుమ సమస్యను ఆరోగ్యకరమైన రీతిలో, ఆదర్శవంతంగా పరిష్కరించుకోవటం చూపిన చక్కని కథ ఇది.

*<u>పేదవాడి మనసు</u>*

రెండు చింతల భానుమతి రచించిన ఈ కథ మార్చి నెల ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమైంది. ఈ కథ మంచి ఆలోచనను ప్రదర్శిస్తుంది. తన బాబాయి చనిపోయినా ఆయన మీద ద్వేషంతో అలిగి సహాయానికి వెళ్ళడు. కానీ ఓ పేదవాడు తన తల్లిదండ్రుల జీవితాన్ని చూసి నిష్కామంగా ఇతరులకు సహాయం చేయటం చూసి అతడికి బుద్ధి వస్తుంది. బాబాయి కొడుకును చదివిస్తాడు. చక్కని కథ ఇది. ఎదుటివారికి సహాయం చేయటంలోని మానవత్వానికి పెద్దపీట వేస్తుందీ కథ.

*<u>ఇచ్చుటలో ఉన్న హాయి</u>*

మార్చి 4 వతారీఖు ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయిన ఈ కథను రచించింది డా.కొఠారి వాణీచలపతిరావు. సూక్ష్మమైన సత్యాన్ని చక్కగా ప్రదర్శిస్తుందీ కథ. తనులేకపోతే ఇంట్లో వాళ్ళకి గడవదని భావిస్తూ, అందరూ తనమీద ఆధారపడేట్టు చేసి అందమైన భ్రమలో ఉన్న ఓ ఇల్లాలికి, బాంధవ్యం వదులుకోవటంలో లేదు. ఎవరి స్వేచ్ఛను వారికివ్వటంలో ఉందని గ్రహింపురావటం ఈ కథ. ఈ నిజం చూపటం కోసం రచయిత్రి సృజించిన సన్నివేశాలు, చేసిన వాదనలు చక్కగా ఉన్నాయి.

*<u>గొప్పవాడు.</u>*

మార్చినెల స్వాతి మాసపత్రికలో ప్రచురితమైన ఈ కథను రచించింది కే.ఎస్వీ. పైకి కనబడేవన్నీ నిజాలు కావు. అసలు నిజం అంతరంగంలో దాగుంటుందనే సత్యాన్ని గొప్పగా చూపిస్తుందీ కథ. ఇందులో 'గిరీష్' అనే అబ్బాయి అష్టకష్టాలు పడిపైకొస్తాడు. తండ్రి తాగుబోతయినా, నిరుపేద అయినా అన్ని అవరోధాలను దాటుకుని పైకివస్తాడు గిరీష్. అందుకు అతడిని అభినందిస్తే, తన తండ్రివల్లనే తాను ఈ స్థాయికి వచ్చానంటాడు గిరీష్. ప్రతిరాత్రి తండ్రి, తాగివచ్చి తనని పట్టుకుని 'నువ్వు నాలాగా కాదు... నువ్వు గొప్పవాడివవుతావు' అని ఏడవటం తనకు ప్రేరణగా నిలిచిందంటాడు గిరీష్. ఇదీ కథ. తండ్రి ప్రభావం కొడుకుపై ఎలా ఉంటుందో చక్కగా చూపించిన మంచి కథ ఇది. తన తల్లిదండ్రులే పిల్లవాడి ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం అని చూపిస్తుందీ కథ.

ఈ మాసం ఈనెల కథగా ఏ కథనూ ఎంచుకోలేదు. కథలు బాగా అనిపించినా గొప్పగా అనిపించలేదు.

✷✷✷




## ఏప్రిల్ 2010

ఈ ఒక నెల విరామం తరువాత మళ్ళీ కథాసాగరమథనానికి కౌముది పాఠకులకు ఆహ్వానం. ఈ నెల కథాసాగర మథనంలో ఏప్రిల్ నెలలో ప్రచురితమైన కథల విశ్లేషణ ఉంటుంది. ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన కథలు, నవ్య, స్వాతి, ఆంధ్రభూమి వారపత్రికలు, ఆంధ్రభూమి, స్వాతి, చిత్ర మాస పత్రికలలో ప్రచురితమైన మొత్తం 89 కథలను విశ్లేషించి ఈ క్రింది కథలు కౌముది పాఠకుల పరిచయం కోసం ఎంచుకున్నాను.

తెలుగులో సాహిత్యం కన్నా 'సా'యిజం' రాజ్యం చేస్తోంది. ఈ 'సా'యిజం, విమర్శకులు సాహిత్యాన్ని అర్థం చేసుకునే విధానాన్ని ప్రభావితం చేస్తోంది. దానితో సామాన్య పాఠకుడిగా చదివినప్పుడు నచ్చిన కథలు విమర్శకుడిగా చదివినప్పుడూ మెచ్చలేని పరిస్థితుల్లో ఉంటున్నారు విమర్శకులు. ఇదెలాగంటే ప్రేక్షకుడిగా చూస్తే 'బెన్‌హర్' అద్భుతంగా ఉంటుంది. విమర్శకుడిగా చూస్తే చారియట్ రేస్'లో ఎర్రకాండ కనిపిస్తుంది కాబట్టి సినిమా బాగాలేదన్నట్టుంటుంది. దీనివల్ల సామాన్య పాఠకుల ఇష్టానికీ, విమర్శకుల రంగుటద్దాల అభీష్టానికీ నడుమ అంతరం ఏర్పడుతోంది. దాంతో, విమర్శకులు పొగిడే కథలు సామాన్య పాఠకుడు మెచ్చని కథలవుతున్నాయి. ఇది రచయితలపై ప్రభావం చూపిస్తోంది. ఏ రచయిత అయినా పదిమంది పొగిడే రచనలే రాయాలనుకుంటాడు. దాంతో పొగిడే విమర్శకులు మెచ్చే కథలు రాస్తారు రచయితలు. అలాంటి కథలనే పొగుడుతారు విమర్శకులు. తాను మెచ్చే కథలు దొరకని పాఠకుడు సాహిత్యానికీ దూరమవుతాడు. అందుకే తెలుగులో సాహిత్యం కరువయి సా'యిజం' రాజ్యం చేస్తోంది. పాఠకులు సాయిజాన్ని వదిలి పాత సాహిత్యాన్ని చదవటం వైపే మొగ్గుచూపుతున్నారు. ఇది రచయితలను ఇబ్బందిలో పడేస్తోంది.

విమర్శకుల మెప్పు పొందే రచయితలకు పాఠకులు లేరు. పాఠకులు మెచ్చే రచయితలను విమర్శకులు మెచ్చరు. విమర్శకులు పదే పదే పొగడందే రచనకు ప్రచారం లభించదు. రచన సజీవంగా ఉండదు. అందుకే తెలుగు సాహిత్యంలో ఎప్పుడూ గుప్పెడు మంది కథనాల పేర్లే వినిపిస్తాయి. ఈ పరిస్థితి మారాలంటే విమర్శకులు తమ ఇజాల రంగుటద్దాలు వదలి పాఠకుల దృష్టిలో కథలను చదవాలి. అప్పుడే పాఠకుడిగా చదివి ఉత్తేజితుడయిన వ్యక్తి అదే రచనను విమర్శకుడిగా చదివి కొట్టి పారేయడు. ఒక రచనను సరిగ్గా విశ్లేషించగలుగుతాడు. కథాసాగర మథనంలో ఉత్తమ కథలుగా మెప్పు పొందే కథలు ఇతర ఏ విమర్శకుల సంకలనాలలో, విమర్శలలో కనబడక పోవటానికి కూడా విమర్శకుల సా'యిజం' దృష్టే కారణం!

*<u>అమికావాలా:</u>* కొల్లూరి సోమశంకర్ అనువదించిన ఈ కథ ఏప్రిల్ 18, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. సాధారణంగా, కథాసాగర మథనంలో అనువాద కథలను పరిచయం చేయటం జరగదు. కానీ హిందీలో డాక్టర్ అఫ్రోజ్ తాజ్ రచించిన ఈ కథను మాత్రం పరిచయం చేయకపోతే అన్యాయం చేసిన వాడనవుతాననిపించటంతో ఆ నియమోల్లంఘనం చేస్తున్నాను. ఎద కదిలించే కథ ఇది. ఇరాక్‌లో అమెరికా తరపున పోరాడటానికి స్టీల్ జేన్ చేసన్ ఇరాక్ చేరుకుంటాడు. అక్కడ ఆయనకు ఓ అనాథ పాప దొరుకుతుంది. ఆమెని అమెరికా తీసుకువెళ్ళి పెంచుకోవాలనుకుంటాడు. ఇంతలో ఆ పాపకోసం ఆమె

తల్లివెతుకుతోందని తెలుస్తుంది. అయినా పాపను ఇవ్వకూడదనుకుంటాడు. తెల్లారే పాపని అమెరికా తీసుకువెళ్ళాలని అనుకుంటాడు. ఆ రాత్రి సైనిక శిబిరంపై తీవ్రవాద దాడి జరుగుతుంది. తన పాపని వెతుకుతూ శిబిరం చేరిన ఆమెని తీవ్రవాది అనుకుని కాల్చి చంపేస్తారు. దారిలో ఆ పాపని తనతో అమెరికా తీసుకువెళతాడా సైనికుడు. ఎదకు హత్తుకు పోతుందీ కథ. చదివిన చాలా సేపటివరకూ మామూలు మనిషి కావటం కష్టం. అనువాదం ఎంత సహజంగా ఉందంటే, రచయిత చెప్పకపోతే అనువాదం అన్న ఊహ కూడా రాదు. చక్కటి కథ ఇది.

***తూరుపు వెళ్ళే రైలు:*** ఎం.ఆర్.వి సత్యనారాయణ రచించిన ఈ కథ ఏప్రిల్ 7 వ తారీకు నవ్య సంచికలో ప్రచురితమయింది. ఈ కథలో ఒ అమ్మాయిని ఓ టీచరు వేధిస్తుంటే, అతడిని రైల్లోంచి తోసేసి ప్రతీకారం తీర్చుకుంటాడు ఆమె భర్త. కథను ఆసక్తికరం చేసేందుకు, ఆ అమ్మాయి, తల్లి పేదవాళ్ళు అయి రైల్లో అడుక్కోవటం, టీటీఈ వాళ్ళ దగ్గరనుంచి డబ్బులు లాక్కోవటం, చివరికి టిటిఇని చపంటానికి అతడితో 'అస్సాం' ప్రయాణం నాటకం వేయటం, వంటి వ్యర్ధ సన్నివేశాలు సృజించారు రచయిత. ఏరకంగా చూసినా నచ్చని, మెచ్చలేని కథ ఇది. కానీ పేదవాళ్ళని అణచివేసే టీటీఈ రాక్షసుడి పని పట్టిన కథగా పలువురి పొగడ్తలు అందుకున్నా ఆశ్చర్యంలేదు.

***కాటు*** : కట్టుకోలు సుబ్బారెడ్డి రచించిన ఈ కథ ఏప్రిల్ 21 నవ్యలో ప్రచురితమయింది. ఇది మామూలు అలవాటయిన కథనే అయినా రచయిత కథను నడిపించిన తీరు బాగుంది. ముగింపు వాక్యాలు కథ విలువను పెంచుతాయి. పాముకాటుతో ఓ వ్యక్తి ఆస్పత్రికి వస్తాడు. వాళ్ళ దగ్గర డబ్బులు లేవని తెలిసినా, తెల్లారితే తెస్తామన్న నమ్మకంతో వారికి వైద్యం చేస్తుంది కరుణ. కానీ వాళ్ళు డబ్బులు కట్టకుండా పారిపోతారు. ఆ డబ్బులు కరుణ జీతంనుంచి కోస్తారు. అప్పుడు 'ప్రాణం ఉన్నప్పుడే పాము కాటు వేస్తుంది. అది ధనికుడివా, దరిద్రుడివా అని చూడదు. కానీ పేదవాడిని ఎక్కువగా కాటేస్తుంది. ' అంటూ కథను ముగిస్తాడు రచయిత.

***పారా త్రిషార్:*** ఎమ్బీయస్ ప్రసాద్ రాసిన ఈ కథ ఏప్రిల్ 28 నవ్యవార పత్రికలో ప్రచురితమయింది. ఈ కథను పరిచయం చేయటం ఎందుకంటే, కథాంశం మామూలే అయినా, అవార్డు పొందిన కామెడీ కథలకన్నా నవ్వుతెప్పిస్తుందీ కథ. కథ పూర్తయ్యేసరికి అప్రయత్నంగా, వస్తుంది. రచయిత ఉద్దేశ్యం కూడా నీతులు చెప్పటం, సిద్ధాంతాలు బోధించటం ఉద్దేశ్యం కాదు. రచయిత లక్ష్యం నవ్వించటం. అది నూటికి నూరు శాతం నెరవేరింది. ఓ జంట హానీమూన్‌కని ఊటీవెళుతుంది. భర్త ఎంత ప్రయత్నించినా భార్య ఉత్సాహం చూపదు. దానికి కారణం హోటల్ గదుల్లో రహస్య కెమేరాలుంటాయని. చివరికి 'సత్యం సుందరం' సినిమా చూసి, తన అందాన్ని శాశ్వతంగా కెమారాలో బంధించాలని అమ్మాయి ఉత్సాహపడుతుంది. రతికేళిలో విజృంభించేవేళ ఫ్యాన్ కేసి చూసి 'ఒరేయ్ ఈ సినిమా కాపీ మాకోటి పంపడం మర్చిపోకరోయ్. అడ్రస్ హోటల్ రిజిస్టర్‌లో ఉంది' అని అరుస్తుంది. నవ్వురాకమానదు. ఆర్.కె నారాయణ 'ఏన్టిడోట్' స్థాయిలో ఉందీ హాస్యకథ.

***ఆపరేషన్ 'అమ్మలు':*** శ్రీదేవీ మురళీధర్ రచించిన ఈ కథ ఏప్రిల్ 1 ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయింది. సమకాలీన సమాజంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా కథలు రాయటం అరుదు. అలాంటి అరుదయిన కథ ఇది. అయితే ఒక స్థాయి వరకూ కథను బాగా నడిపినా అత్యుత్సాహంతో చివర భాగమంతా ఉపన్యాసంగా చెప్పటంతో కథనం దెబ్బతింది. కథ విలువ తగ్గుతుంది. ఓ చిన్నపిల్లని దుర్గావతారం అని ప్రచారం చేస్తారు. టీవీ వాళ్ళు ఆ గుట్టు రట్టు చేస్తారు. దాంతో పెద్దలు అమ్మల్ని వదిలేస్తారు. ఓ పల్లెటూళ్ళో ఓ టీచరు ఆమెను చదివిస్తుంది. పిల్లల గురించి ఓ లెక్చరిస్తుంది ఇదీ కథ. ఆరంభంలో బాగున్నట్టనిపించినా చివరలో తేలిపోతుంది.

***కొండారకోట*** : హెచ్చార్కె రచించిన ఈ కథ ఏప్రిల్ 25 సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. చాలా చక్కని కథ. చక్కని కథ మాత్రమే కాదు ఒక చేదు నిజాన్ని అత్యంత తార్కికంగా, హృదయానికి, హత్తుకునేట్టు చెపుతుందీ కథ. మన చరిత్రలో

ప్రాంతీయంగా అనేక గాధలు ప్రచారంలో ఉంటాయి. ఇలాంటి మౌఖిక గాధలను మన చరిత్రకారులు విశ్వసనీయంగా పరిగణించారు. కల్లబొల్లి కబుర్లని కొట్టేస్తారు. కానీ నిజానికి, అభూత కల్పనలగా కనిపించే కథలకూ నడుమ ఎక్కడో వాస్తవం దాగి ఉంటుంది. ఆ వాస్తవాన్ని గ్రహించే మనసున్న చరిత్రకారుల అవశ్యకత ఎంతో ఉంది. అలాంటి వారు రాస్తే మనసుతో మనకందుతుంది. అదిలేదు కాబట్టి, అనేక చారిత్రిక సత్యాలు కొండల్లో కోనల్లో ప్రతిధ్వనిస్తుంటాయి కానీ చరిత్రపుస్తకాలలోకి ఎక్కవు. 'కొండార కోట'ను ముట్టడించిన తురుష్కులను ఉపాయంతో తరిమిన వ్యక్తే, రాజు అసమర్ధతను గ్రహించి శత్రువుల చేతికి పట్టించిన కథ చెపుతుందీ కథ. చివరికి 'పై పొట్టు వలిస్తే మిగిలే సారంలో వాస్తవాలు దాగివుంటాయి. ఆ సారం వల్లనే కథలు బతికుంటాయి' అని చెప్పటం అద్భుతం అనిపిస్తుంది. ఇంగ్లీషులో అయితే 'Hitting the nail on the head' అనవచ్చే వాక్యాలను. అయితే 'జనం చెప్పే కథలు నిజమైన సంఘటనలు కావు' అని తేల్చటం అంతే సమంజసం కాదనిపిస్తుంది. కానీ మామూలు మూస కథలకు భిన్నంగా, చాలా ఆసక్తికరంగా సాగుతుందీ కథ. ఇలా ప్రాంతీయంగా ప్రచారంలో ఉన్న కథలన్నీ సమీకరించి సంకలనం చేసి విశ్లేషిస్తే మన అసలు చరిత్ర ఆనవాళ్ళు మన కథల్లో వెతుక్కునే వీలు చిక్కుతుంది.

*ఆయా :* ఆకునూరి మురళీకృష్ణ రచించిన 'ఆయా' ఏప్రిల్ నెల స్వాతి మాసపత్రికలో ప్రచురితమయింది. ఇది చాలా చక్కని కథ. సమకాలీన సమాజంలో సామాన్యుడు అనుభవిస్తున్న సమస్యను చక్కగా ఎత్తి చూపిస్తుంది. ప్రతివారి హృదయాలను తడుముతుంది. జాహ్నవి కూతురు స్వీటీ డల్‌గా ఉంటుంది. కారణం, పిల్లను చూసుకునే నిర్మల రాకపోవటమే అంటుంది జాహ్నవి తల్లి. జాహ్నవి అందుకు ఒప్పుకోదు. కానీ తల్లి మాట కాదనలేక నిర్మలను రమ్మంటుంది. నిర్మలను చూడగానే తన కూతురు ఉత్సాహంగా దూకటం జాహ్నవికి బాధ కలిగిస్తుంది. 'కన్నతల్లినైన నన్ను పట్టించుకోకుండా ఆయా మీద బెంగ పెట్టుకుంది' అని ఏడుస్తుంది. దానికి ఆమె తల్లి 'కన్నతల్లినైన నిన్ను పట్టించుకోదని బాధపడుతున్నావు. కానీ కన్నతల్లివైయుండి దాన్ని నువ్వేమి పట్టించుకుంటున్నావని ఎప్పుడైనా అనుకున్నావా?' అని అడుగుతుంది. జాహ్నవికి తన తప్పు గ్రహింపుకు వస్తుంది. ఒక సున్నితమైన అంశాన్ని అంతే సున్నితంగా ప్రదర్శిస్తుందీ కథ.

*ఈ నెల కథ*

నిజానికి ఈనెల కథకు 'కొండార కోట' అన్ని విధాల అర్హతలు ఉన్నకథ. విభిన్నమైన కథాంశం. చక్కని కథనం ఉపయోగకరంగా, ఆలోచనాత్మకమయిన ముగింపులతో ఉన్నకథ ఇది. కానీ 'ఆయా' కథను ఈనెల కథగా నిర్ణయించటం వెనక ఈ కథ అందరికీ మంచి సందేశం ఇస్తుంది, మంచి ఆలోచననిస్తుంది, ఉపయోగపడుతుంది అన్న ఆలోచన ఉంది. అదీగాక, సాక్షి కథ నెట్ లో దొరుకుతుంది కాబట్టి 'కొండార కోట' 'ఆయా'లను రెంటినీ ఈనెల కథగా నిర్ణయించినా, 'ఆయా' కథను మాత్రం పూర్తిగా స్క్రిప్టు రూపంలో అందిస్తున్నాము. ఈ రెండు కథలు చదివి వీటిలో గొప్ప కథ ఏదో పాఠకులే నిర్ణయించుకోవాలి.

## ఆయా - ఆకునూరి మురళీకృష్ణ

స్వాతి మాస పత్రిక ఏప్రిల్ ౨౦౧౦ సంచిక నుంచి

"చంటిది మళ్ళీ ఆ నిర్మల గురించి బెంగపెట్టుకున్నట్టుందే మధ్యాహ్నం నుంచీ డల్‌గా ఉంది. హుషారుగా ఆడుకోవడం లేదు. ఒళ్ళు కూడా కొంచెం వెచ్చబడినట్లుగా ఉంది" లంచ్ అవర్లో ఆఫీస్ నుంచి ఇంటికి ఫోన్ చేసిన జాహ్నవితో చెప్పింది తల్లి కొంచెం ఆదుర్దా నిండిన స్వరంతో.

"నీదంతా చాదస్తం అమ్మా.. డల్ గా ఉండటం వల్ల జ్వరం రాదు, జ్వరం తగలడం వల్ల కొంచెం డల్‌గా కనిపిస్తోందేమో అంతే.. దాని అలమార్లో కాల్‌పాల్ సిరఫ్ ఉంటుంది వెయ్యి. ఫైవ్ ఎమ్మెల్ వేస్తే చాలు. సీసా మూత మీదే ఉన్న ప్లాస్టిక్ కాప్ మీద గీత వరకూ వేస్తే వచ్చాక డాక్టర్ దగ్గరకి తీసుకువెళదాం" అంది జాహ్నవి తల్లి మాటలని పట్టించుకోకుండా.

రుక్మిణమ్మ మాట్లాడలేదు.

"మందు వేసే అరగంట ముందూ అరగంట తరువాత వరకూ ఏమీ పెట్టకు. దానికి పడదు. వాంతులవుతాయి. మందు పనిచేయదు" అంది జాహ్నవి.

"సరేలే.." అని ఫోన్ పెట్టేసింది రుక్మిణమ్మ.

ఆఫీసులో పనిచేస్తోందన్న మాటేగానీ జాహ్నవి దృష్టంతా ఇంటిమీదే ఉంది. సాయంత్రం నాలుగవుతుండగా మళ్ళీ ఇంటికి ఫోన్ చేసింది.

"ఎలా ఉంది స్వీటీకి?" అని అడిగింది.

"జ్వరం తగ్గింది. కానీ మనిషి మాత్రం ఇంకా డల్‌గానే ఉంది. ఆటా అల్లరీ లేదు" అంది రుక్మిణమ్మ. పిల్లకి జ్వరం తగ్గినా ఆమెకి ఆదుర్దా తగ్గలేదని తెలుస్తోంది. జాహ్నవి మాత్రం తేలికగా ఊపిరి పీల్చుకుంది. "కొంచెం ఒంట్లో ఓపిక వస్తే అదే ఆడుకుంటుందిలే. అది అల్లరి మొదలెడితే నువ్వూ నేనూ భరించలేం. సాయంత్రం హెవీ ఫుడ్ ఏమీ పెట్టకు. పల్చగా చారూ అన్నమో మజ్జిగ అన్నమో పెట్టు" అంది.

"నాకు తెలుసుగానీ నువ్వు ఆఫీసునుంచి తొందరగా రా" అంది రుక్మిణమ్మ విసుగ్గా,

జాహ్నవి నవ్వుకుంది. గడియారం చూసుకుంటూ 'తొందరగా వెళ్ళిపోవాలి' అనుకుంది.

ఇంటిదగ్గర పిల్లకెలా ఉందో అన్న ఆలోచనవల్ల అప్పటి దాకా పని సరిగ్గా నడవలేదు. తల్లి మాటలతో కలిగిన రిలీఫ్‌తో దృష్టినంతా కేంద్రీకరించి చకచకా పనిచేయసాగింది. ఆమె ఇంటికి చేరుకునే సరికి రాత్రి ఎనిమిది గంటలు దాటిపోయింది.

**********

జాహ్నవి కాలింగ్ బెల్ మోగించగానే ఆత్రుతగా వచ్చి తలుపు తీసింది రుక్మిణమ్మ. ఆమె చెప్పులు విడిచి లోపలికి వచ్చేలోగానే అంది.

"వచ్చావా? నీ కోసమే చూస్తున్నాను. పిల్లదానికి మళ్ళీ ఒళ్ళు కాలిపోతోంది. అన్నం కూడా తినలేదు"

"ఆరుగంటలు దాటిపోయింది కదా? మళ్ళీ ఒకసారి సిరప్ వేయలేకపోయావా?" కాళ్ళు కడుక్కుని బెడ్ రూములోకి అడుగుపెడుతూ అంది జాహ్నవి.

"నువ్వొచ్చాక నిన్నడిగి వేయవచ్చని చూస్తున్నాను" అంది రుక్మిణమ్మ.

మంచం మీద అమాయకంగా పడుకుని నిద్రపోతున్న రెండేళ్ళ స్వీటీ పక్కకి చేరి ఆమె నుదిటిమీద సున్నితంగా రాస్తూ జుట్టు సవరించింది జాహ్నవి. ఒళ్ళు కొంచెం వెచ్చగా తగిలింది. ఆమె స్పర్శకి స్వీటీ కళ్ళు తెరిచి చూసింది. తల్లిని ఒకసారి చూసి మళ్ళీ కళ్ళు మూసేసుకుంది. అలమారులోంచి థర్మామీటరు తీసి టెంపరేచర్ చూసింది జాహ్నవి. నార్మల్ కన్నా కొంచెం ఎక్కువగా ఉంది. అదే చెప్పింది తల్లితో.

"జ్వరం వస్తోంది. తగ్గుతోంది. మళ్ళీ రేపు మీరిద్దరూ ఆఫీసులకి వెళ్ళిపోయిన తరువాత ఎక్కువైతే కష్టం. ఇప్పుడే డాక్టర్‌కి చూపిస్తే నయమేమో.. మోహన్‌కి ఫోన్ చేయి " అంది రుక్మిణమ్మ.

"ఆయన వచ్చేసరికి బాగా ఆలస్యమౌతుంది. మనమే ఆటోలో వెళదాంలే" అంటూ లేచి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకుని తయారైంది జాహ్నవి. ఈ లోగా వంట గదిలో అప్పటిదాకా చేస్తున్న పనిని ముగించి తను కూడా తయారైంది రుక్మిణమ్మ. స్వీటీకి స్వెట్టర్ వేసి రెడీ చేసింది.

ఆ హడావిడికి స్వీటీకి పూర్తిగా మెలుకువ వచ్చేసింది. బయటికి వెళుతున్నామన్న విషయం అర్థంకాగానే కొంచెం హుషారు కనిపించిందామెలో. వచ్చీరాని మాటలతో లేని ఓపిక తెచ్చుకుని ఇల్లంతా తిరగసాగింది. బయటికి వెళ్ళేటప్పుడు వేసుకునే చెప్పుల జతని అలమార్లోంచి తీసుకువచ్చి జాహ్నవికిచ్చి వేయమంటోంది.

"చూశావా? ఇప్పటిదాకా ఓపికలేనట్లు పడుకుంది. షికారనేసరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. దీని వేషాలని నమ్మకూడదు. కొత్తకాబట్టి నిన్ను మరింత ఖంగారు పెట్టేసింది" కూతుర్ని చూస్తూ ముద్దుగా విసుక్కుంటూ అంది జాహ్నవి.

బయటికెళ్ళి ఆటో ఎక్కేసరికి మరింత హుషారు వచ్చేసింది స్వీటీకి. తల్లి ఒడిలో కూర్చుని ఆటోలోంచి బయట వాహనాలనీ, షాపుల్లో లైట్లనీ చూస్తూ ఏవేవో కబుర్లు చెప్పసాగింది. డాక్టర్ దగ్గరకి వెళ్ళేసరికి జ్వరం వచ్చిన పిల్ల అంటే నమ్మలేనట్లుగా అయింది.

స్వీటీని పరీక్షించి వీళ్ళవంక చూసి నవ్వాడు డాక్టర్. "ఏం లేదమ్మా మామూలుజ్వరమే అయుంటుంది. మళ్ళీ రాకపోవచ్చు. ఖంగారు పడాల్సిమేం లేదు. నాలుగు రోజులు చూద్దాం" అన్నాడు. స్వీటీని అల్లరి పిల్లని చూసినట్టు చూస్తూ బుగ్గమీద చిన్నగా కొట్టాడు. స్వీటీ నవ్వింది. జాహ్నవి కూడా నవ్వుతూ లేచింది.

ఆమె ఫీజివ్వబోతుంటే ఆయన వద్దన్నాడు. తాము అనవసరంగా ఖంగారుపడి ఆయన సమయాన్ని వృధా చేశామేమోనని గిల్టీగా అనిపించిందామెకి.

"నిర్మల పరీక్షలని పదిరోజులు సెలవు పెట్టింది. అమ్మ మొన్ననే వచ్చింది. కొత్తకదా? ఖంగారుపడుతుంటే తీసుకుని వచ్చాం" అంది ఆయనతో ఉన్న చనువుతో సంజాయిషీ చెబుతున్నట్టుగా.

ఆయన నవ్వుతూ తలూపి అసిస్టెంట్‌కి తరువాత పేషెంట్‌ని పిలవమని చెప్పాడు.

********

ఇంటికి వచ్చాక కాసేపు అటూ ఇటూ తిరుగుతూ అల్లరిచేసి అన్నం తినడానికి పేచీపట్టి బలవంతంగా తినిపిస్తే కొంచెం తిని పడుకుంది స్వీటీ.

రాత్రి మెలుకువ వచ్చినప్పుడల్లా స్వీటీ వంటిమీద చేయివేసి జ్వరమేమైనా ఉందేమోనని గమనిస్తూనే ఉన్నారు జాహ్నవీ మోహన్‌లు.

మర్నాడు కూడా అలవాటు ప్రకారం ఆఫీసునుంచి లంచ్ అవర్లో ఇంటికి ఫోన్ చేసింది జాహ్నవి.

"జ్వరం రాలేదు కానీ ఇంకా అలాగే డల్‌గా ఉందంటోంది. ఖంగారేం లేదులే" అంది రుక్మిణమ్మ.

జాహ్నవి ఎందుకో ఆ రోజు స్థిమితంగా ఉండలేకపోయింది. మళ్ళీ సాయంత్రం నాలుగింటికి అయిదింటికీ ఇంటికి ఫోన్ చేసింది.

"థర్మామీటరు పెట్టి చూస్తే ఇప్పుడే కొంచె జ్వరం కనిపించింది. మందు వేశా, నిద్రపోతోంది" అని చెప్పింది. రుక్మిణమ్మ ఐదింటికి ఫోన్ చేసినప్పుడు, అన్యమనస్కంగా మరో గంటసేపు ఆఫీసులో కూర్చుని రోజూకన్నా త్వరగా బయలుదేరి ఇంటికి చేరుకుంది జాహ్నవి.

జాహ్నవి వచ్చేసరికి ఇంకా పడుకునే ఉంది స్వీటీ. "ఎలా ఉంది?" అని తల్లినడిగిందామె.

"జ్వరం తగ్గింది. ఖంగారేం లేదని డాక్టర్ నిన్ననే చెప్పాడుగా?" అంది రుక్మిణమ్మ.

జాహ్నవి చివుక్కున తలెత్తి తల్లి ముఖంలోకి చూసింది. ఆమె మాటలు దెప్పిపొడుస్తున్నట్టుగా ఉన్నాయనిపించింది. అందుకు కారణాన్ని కూడా ఆమె సులువుగానే ఊహించగలిగింది. "అయితే ఏమిటంటావు?" అన్నట్టుగా చూసింది తల్లివంక.

"బాగా అలవాటైన వాళ్ళు హఠాత్తుగా నాలుగు రోజులు కనిపించకపోతే పిల్లలు బెంగపెట్టుకుంటారు. డల్‌గా అయిపోతారు. ఇది ఆ నిర్మల మీద బెంగపెట్టుకుందేమోనని నా అనుమానం. రాత్రుళ్ళు మర్చిపోతోంది గానీ పగలు మాత్రం ఇంట్లోకీ బయటికీ తిరుగుతూ వెదుక్కుంటోంది. ఆయా అని అడుగుతోంది. నీకు పంతం కాకపోతే ఒకసారి ఆ అమ్మాయిని వచ్చి చూసి వెళ్ళమనరాదూ?" అంది రుక్మిణమ్మ.

జాహ్నవి మాట్లాడలేదు.

స్వీటీ నిర్మలని వచ్చీరాని మాటలతో 'ఆయా ఆయా ' అని పిలుస్తుంది. నిర్మల జాహ్నవి ఇంట్లో పనిచేసే లక్షమమ్మ కూతురు. పద్దెనిమిదేళ్ళు ఉంటాయి. చాలా చురుకుగా ఉంటుంది. స్వీటీ పుట్టాక మెటర్నిటీ లీవు ముగించుకుని తిరిగి డ్యూటీలో జాయినవ్వాల్సిన సమయంలో ఆరునెలల వయసున్న స్వీటీని ఆరోగ్యకారణాల దృష్టిలో క్రెచ్‌లో ఉంచడం ఇష్టంలేక చదువు మానేసి ఇంట్లో ఉంటున్న నిర్మలని స్వీటీని చూడడానికి కుదుర్చుకుంది జాహ్నవి.

రోజూ లక్షమమ్మ ఉదయాన్నే పన్లోకి వస్తే పదింటికి నిర్మల వచ్చి స్వీటీని చూసుకుంటూ ఇంట్లోనే ఉండిపోతుంది. దాదాపు రాత్రవుతుండగా జాహ్నవి ఆఫీసు నుంచి వచ్చాక ఇంటికి వెళుతుంది. హాలూ వంటిల్లూ తప్ప మిగిలిన రూములన్నీ తాళాలు వేసుకుని ఆఫీసుకి వెళ్ళిపోతుంది జాహ్నవి. దాదాపుగా ఏడాదిన్నరనుంచీ అలా అలవాటైపోయింది. ఎప్పుడైనా ఏదైనా పనివుండి నిర్మల సెలవులో వెళితే ఊరినుంచి రుక్మిణమ్మ వస్తుంది స్వీటీని చూసుకోవడానికి, ప్రస్తుతం ప్రైవేటుగా బి.ఎ.కి కడుతున్న నిర్మల పరీక్షలని సెలవు పెట్టడంతో రుక్మిణమ్మ వచ్చింది.

రుక్మిణమ్మ ఇంకా చెబుతూనే ఉంది. "వచ్చిన ప్రతిసారీ నేను గమనిస్తూనే ఉన్నానుగా? ఆ నిర్మల చూసినన్నాళ్ళూ దీనికే రోగమూ రొష్టూ ఉండవు. సుబ్బరంగా నవ్వుతూ తిరుగుతూ ఆడుకుంటుంది. నిర్మల మానేస్తే డల్ గా అయిపోతుంది. ఇది దానిమీద బెంగ కాకపోతే మరేమిటి? నువ్వొప్పుకోవుగానీ ఉమ్మడికుటుంబంలో ఇంతమంది పిల్లలని పెంచిన నాకామాత్రం పిల్లల మనస్థత్వం తెలియదా?

చిన్నప్పుడు మీ నాయనమ్మా తాతయ్యలు ఏదేనా ఊరు వెళితే మీరు కూడా అలాగే బెంగపెట్టుకునేవారు. ఒకసారి వాళ్ళు తీర్థయాత్రలకని బయలుదేరి వెళితే బెంగపెట్టుకుని నీకు ఒళ్ళెరుగని జ్వరం.. చివరికి ట్రంకాలు అందుకుని తీర్థయాత్రలు ముగించుకోకుండానే వెనక్కి తిరిగి వచ్చేశారు వాళ్ళు.."

జాహ్నవి తల్లివంక అసహనంగా చూసింది. ఆ సంగతులన్నీ ఆమెకి బాగా తెలుసు. పెద్దవాళ్ళు చెప్పుకోగా చిన్నప్పటినుంచీ చాలా సార్లు వింది.

కానీ రెండునెలలక్రితం ఆఫీసు పనిమీద అత్యవసరంగా తను నాలుగు రోజులు వేరే ఊరు వెళ్ళాల్సొస్తే స్వీటీని పగలు నిర్మలా, రాత్రి రుక్మిణమ్మా చూసుకున్నారు. అప్పుడు తన గురించి బెంగపెట్టుకోని స్వీటీ ఇప్పుడు నిర్మల గురించి బెంగపెట్టుకుందనుకోవాలంటేనే ఆమెకి ఏమిటోలాగా ఉంది. అందుకే తల్లి అలా అన్న ప్రతిసారీ ఆమె మాటల్ని తీసిపారేస్తూ ఉంటుంది.

జాహ్నవి ఆలోచనలో పడడం గమనించిన రుక్మిణమ్మ అంది. "ఇందులో అంత ఆలోచించాల్సిందేం లేదమ్మా.. పిల్లల్లో ఇలాంటివన్నీ సహజం.. రేపు ఆ అమ్మాయి ఒకసారి వచ్చి చూసి వెళితే ఇది మళ్ళీ మామూలైపోయి ఆడుకుంటుంది"

ఆమెకు ఎలా చెప్పాలో అర్థంకాలేదు జాహ్నవికి. "సరేలే..నిర్మల నొకసారి పంపించమని రేపు లక్ష్మమ్మకి చెబుతాను" అంది చివరికి.

రుక్మిణమ్మ సంతోషంగా చూసింది ఆ మాటలకి.

************

"స్వీటీ నిర్మలని గురించి బాగా అడుగుతోందట లక్షమమ్మా.. రేపొకసారి సాయంత్రం వచ్చి కనిపించి వెళ్ళమను" అని చెప్పింది జాహ్నవి మర్నాడు పనిలోకి వచ్చిన లక్ష్మమ్మతో.

"పరీక్ష సెంటరుకి దగ్గరగా ఉంటుందని అదెక్కడో సికింద్రాబాద్‌లో మా అన్నావాళ్ళింట్లో ఉందమ్మా. ప్రతిరోజూ పరిక్షేనంది. బస్సుల్లో పడి అక్కడినుంచి ఇక్కడికి రావాలంటే కష్టంకదా? పరీక్షలైనాక వస్తుందిలేమ్మా. ఐనా నాలుగు నెలల్లో దానికేదైనా కంపెనీలో ఉద్యోగం వస్తే చేరిపోతానంటోంది. మీ ఇంట్లో మానేస్తుంది. అప్పుడు కూడా నిర్మలని వదలదా మీ స్వీటమ్మ?" నవ్వుతూ అంది లక్షమమ్మ జాహ్నవి చెప్పింది విని.

జాహ్నవికి ఒళ్ళుమండిపోయింది ఆమె మాటలకి. బస్సుల్లో రావడం కష్టమా? ఆమె కోసం కారు పంపించాలా? కంపెనీలో ఉద్యోగం వస్తే మానేస్తుందట... అంటే తనని బెదిరిస్తున్నారా తల్లీ కూతుళ్ళిద్దరూ కలసి? అవసరం తమది కదా అని బెట్టు చేస్తున్న ఇలాంటి వాళ్ళ గురించా స్వీటీ బెంగపెట్టుకుంది? అనుకుంది చిరాగ్గా. మరింకేం మాట్లాడలేదు.

స్వీటీ ఆ రోజు కూడా డల్‌గానే ఉందని సాయంత్రం రుక్మిణమ్మ మరీ మరీ చెప్పడంతో లక్ష్మమ్మ దగ్గర ఫోన్ నెంబరు తీసుకుని మర్నాడు ఆఫీసునుంచి లక్షమమ్మ దగ్గర ఫోన్ నెంబరు తీసుకుని, మర్నాడు ఆఫీసునుంచి లక్ష్మమ్మ ఇచ్చిన పి.పి. ఫోను నెంబరుకి ఫోన్ చేసి నిర్మలతో మాట్లాడింది.

"స్వీటీకి కొంచెం జ్వరంగా ఉంది నిర్మలా.. నీ గురించి బాగా అడుగుతోందట... ఇవాళ పరీక్షయిపోగానే ఒకసారి రాగలవా చూసి వెళుదువుగాని?" అడగలేక అడుగుతున్నట్లుగా అడిగింది.

"అయ్యో.. జ్వరమా? వస్తాన్లెండి" అంది నిర్మల.

"ఆటోలో వచ్చేయ్ కావాలంటే. నేను డబ్బులిస్తాను" అంది.

"అయ్యో అక్కర్లేదాంటీ.. నా కలవాటే. బస్సులో వచ్చేస్తాను" అంది నిర్మల.

ఆమెనలా అర్థిస్తూ అడగడం జాహ్నవికేదో తెలియని బాధని కలుగచేసింది. మనసంతా వికలమైపోయినట్టుగా అనిపించింది. ఆ రోజు పనిచేసే మూడ్ లేక అరరోజు సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరింది.

అంత తొందరగా వచ్చేసిన జాహ్నవిని విచిత్రంగా చూసింది రుక్మిణమ్మ. "నిర్మలతో మాట్లాడావా? వస్తానందా?" అని అడిగింది ఆమెకి మంచినీళ్ళిస్తూ.

"మాట్లాడాను. వస్తానంది" అని చెప్పింది జాహ్నవి.

సాయంత్రం అవుతుండగా వచ్చింది నిర్మల. చనువుగా లోపలికి వస్తూ హుషారుగా "స్వీటీ" అని పిలుస్తూ పలకరించింది స్వీటీని. ఆ పిలుపు వినగానే గబగబా పరిగెత్తుకుంటూ వచ్చేసింది స్వీటీ. ఆమెని చూడగానే స్వీటీ కళ్ళల్లో చెప్పలేని సంతోషం!

ఆనందంతో కేరింతలు కొడుతూ పరుగు పరుగున వెళ్ళి నిర్మల చంకెక్కి ఆమెని బల్లిలా కరుచుకుపోయిన స్వీటీని చూస్తుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి జాహ్నవికి. ఆ దృశ్యాన్ని చూస్తూ అక్కడ నిలబడలేక ముఖం తిప్పుకుని పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

పక్క గదిలోకి వెళ్ళగానే ఆపుకోలేనట్లుగా కళ్ళనుంచి నీళ్ళు జలజలా రాలిపోయాయి. ఆ సమయానికి అక్కడ ఉన్న రుక్మిణమ్మ జాహ్నవిని చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమిటమ్మా ఇది?" అంది ఖంగారుగా కూతురిని దగ్గరకి తీసుకుంటూ. తల్లిని పట్టుకుని నిశ్శబ్దంగానే బావురుమంది జాహ్నవి. బయట స్వీటీ నిర్మలతో ఆడుకోవడంలో బిజీగా ఉంది.

"నువ్వు ఎంతో ప్రేమగా నీ దగ్గరుంచుకుని పెంచుతానన్నా కాదని నా కూతురు నాకళ్ళముందు ఉండాలని నాతో తెచ్చేసుకున్నాను. అనుక్షణం దానికోసమే పరితపిస్తాను. నేనేం అన్యాయం చేశానమ్మా దానికి నాకింత ద్రోహం చేసింది? కన్నతల్లినైన నన్ను పట్టించుకోకుండా ఆయా మీద బెంగపెట్టుకుంది?" అంది ఏడుస్తూ.

అంతవరకూ అవగతం కాని కూతురి మనోభావాలు ఆ మాటలతో పూర్తిగా అర్థమయ్యాయి రుక్మిణమ్మకి. ఒక్కక్షణం ఆమె వంక చూస్తూ ఉండిపోయింది.

"నీ బాధని నేను అర్థంచేసుకోగలనమ్మా.. అంటున్నానని కాదు కానీ ఒక్క విషయం అడుగుతాను చెప్పు.. కన్నతల్లివైన నిన్ను పట్టించుకోదని బాధపడుతున్నావు గానీ కన్న తల్లివైయుండి దాన్ని నువ్వేమి పట్టించుకుంటున్నావని ఎప్పుడైనా అనుకున్నావా?"

జాహ్నవి ఆశ్చర్యంగా చూసింది తల్లి మాటలకి.

"పిల్లలక్కావాల్సింది వాళ్ళకి టైముకు ఆరోగ్యకరమైన ఆహారం పెట్టడం, ఆడించడం, బయటికి షికార్లు తిప్పడం టైముకి నిద్రపుచ్చడం, వేళకి మందులేయడం మాత్రమే అనుకుంటున్నావు, అవన్నీ చేసే ఆయాని అమర్చావు. నీకు తెలియదు కానీ పైకి ఎంతో మామూలుగా కనిపించే ఈ విషయాలే పిల్లలకెంతో ఇష్టమైనవి.

ఆ పనులన్నీ చేసే వాళ్ళతో పిల్లలు తమకి తెలియకుండానే ఓ మానసికమైన అనుబంధం ఏర్పరచుకుంటారు. తమకోసం అన్నిపనులు చేస్తూ తమ వెంట తిరిగేవాళ్ళకెంతో ఆప్యాయమైన వాళ్ళలా కనిపిస్తారు. ఆ మనిషి ఆయానా అమ్మా అన్నది వాళ్ళకి తెలీదు"

జాహ్నవి తల్లిమాటలకి దెబ్బతిన్నట్టుగా చూసింది.

"అయితే తప్పంతా నాదేనంటావు?" అంది.

"నువ్వు చేసింది తప్పని నేనడంలేదు, అది తప్పో ఒప్పో నిర్ణయించుకోగల విజ్ఞత నీకుంది. కానీ తొందర పాటుతనంతో పసిపిల్ల చేసిన దాన్ని ద్రోహం అనిగానీ, లక్ష్మమ్మ నిర్మల లాంటివాళ్ళు చేసిందాన్ని అన్యాయం అని కానీ అనుకోవద్దని మాత్రమే నేను చెబుతున్నాను" అంది రుక్మిణమ్మ.

జాహ్నవి కాసేపు అలాగే ఉండిపోయి ఆ తరువాత తేరుకుని కళ్ళు తుడుచుకుంది. చాలాసేపు స్వీటీని ఆడించి ఇంటికి బయలుదేరింది నిర్మల. ఆమె బస్సులోనే వచ్చిందన్న సంగతి తెలిసినా ఆమెకి ఆటో డబ్బులిచ్చింది జాహ్నవి. నిర్మల మొదట కొద్దిగా మొహమాటపడినా తరువాత ఏమీ మాట్లాడకుండా తీసుకుంది.

తల్లిమాటలు విన్నాక నిర్మల మీద కోపంగా అనిపించలేదు జాహ్నవికి. స్వీటీలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తుంటే నిర్మల చేసిన సహాయానికి కృతజ్ఞతగా అనిపించిందామెకి. డాక్టరు డబ్బు తీసుకునే వైద్యం చేస్తాడు. అయినంత మాత్రాన జబ్బు నయమయ్యాక ఆయనకి కృతజ్ఞతలు చెప్పకుండా ఉంటామా?

నిర్మల వెళ్ళిపోయాక స్వీటీ నవ్వుతూ జాహ్నవి దగ్గరకి వచ్చింది. 'కన్నతల్లివైఉండీ నువ్వే పట్టించుకోవడం లేదని నీకెప్పుడూ అనిపించలేదా?' అన్న తల్లి ప్రశ్న గుర్తుకు వచ్చింది.

'తల్లి అన్నట్టుగా తను తప్పుచేసిందో ఒప్పుచేసిందో నిర్ణయించుకోగల విజ్ఞత తనకి ఉంది.. నిజమే.. కానీ ఆమె మాటలే గనక వినకపోయివుండి ఉంటే తనిప్పుడు స్వీటీని ఇంత మనస్ఫూర్తిగా దగ్గరకి తీసుకోలేకపోయేదన్న విషయం మాత్రం నిజం!' అనుకుంది జాహ్నవి నవ్వుతున్న స్వీటీని ముద్దుపెట్టుకుంటూ.

* * *




## మే ౨౦౧౦

మే నెలలో విడుదలయిన స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వార పత్రికల్లో కథలు మూడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ మాసపత్రికల ఆదివారం అనుబంధాలలోని కథలు, స్వాతి, ఆంధ్రభూమి, విపుల, చిత్ర మాస పత్రికలలోని కథలు కలిపి 86 కథలను విశ్లేషించి కౌముది పాఠకుల పరిచయం కోసం ఎన్నుకున్న కథలు ఇవి.

సాధారణంగా, కథా సాగరమథనం కోసం నెల పుస్తకాలన్నీ పోగుచేసుకుని, ముందేసుకుని ఒకదాని తరువాత ఒకటి చదువుతాను. పరిచయం చేయాలనిపించిన కథలను ప్రత్యేకంగా పెడతాను. అన్నీ చదివిన తరువాత ఇలా ప్రక్కన పెట్టిన పుస్తకాల కథలను పరిచయం చేస్తాను. ఏప్రిల్ నెలలో పరిచయం కోసం ఎంచుకున్న ఓ కథ పొరపాటున పక్కకు జరిగిపోయింది. ఆ కథను మే నెల కథలతో కలిపి పరిచయం చేస్తున్నాను. ఒక మంచి కథ గురించి పదిమందికీ తెలియాలి. ఒక మంచి కథను రచించిన రచయిత మెప్పు పొందకుండా మిగలకూడదు. ఇది కథాసాగర మథనం శీర్షిక లక్ష్యం. అలా ఏప్రిల్ నెలలో తప్పించుకుని మే నెలలో దొరికిపోయి పరిచయ మవుతున్న కథ 'ప్లాట్ ఫామ్ పిన్ని' ఇది 14 ఏప్రిల్ నవ్య సంచికలో ప్రచురితమయింది. కథ రాసిన రచయిత సలీమ్.

ఈ కథ ప్రధమంగా అంతరించి పోతున్న మంచితనం, మానవత్వాలకు సంబంధించినది. ఒక మనిషి, సాటి మనిషి నుంచి ఏమీ ఆశించకుండా ఉచితంగా, సహాయం చేసే సహృదయం ప్రదర్శించటం అరుదైపోతున్న తరుణంలో ఇలాంటి కథలు ఎడారిలో ఒయాసిస్సుల్లా అనిపిస్తాయి. మన నడుమ అంతరిస్తున్న విశ్వాసాన్ని జ్ఞప్తికి తెస్తాయి.

'ప్లాట్‌ఫామ్ పిన్ని' కథలో కథాయిక తులసి పిన్ని. ఈవిడకు ఫోన్ చేసి చెపితే చాలు, పరిచయం ఉన్నా, లేకున్నా, భోజనం పట్టుకుని వస్తుంది. విజయవాడలో రైలు ఆగే సమయానికి వచ్చి భోజనం ప్రేమగా వడ్డిస్తుంది. ఇంటి చుట్టుపక్కల పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిగితే, ఇళ్ళకివెళ్ళి ఫ్రీగా వంటలు చేసిపెడుతుంది. ఎవరైనా తెలిసిన వాళ్ళు విజయవాడ మీదుగా వెళుతున్నారని కబురందితే చాలు వాళ్ళకి ట్రైన్లో భోజనం అందిస్తుంది. టైముంటే దగ్గరుండి తినిపిస్తుంది. అందుకే ఆవిడని అందరూ ప్లాట్‌ఫామ్ పిన్ని అంటారు. మానవ సంబంధాలన్నీ డబ్బుతో ముడిపడి ఉన్న ఈ రోజుల్లో నిస్వార్థంగా పరాయి వాళ్ళకోసం బ్రతికే ప్లాట్‌ఫామ్ పిన్ని పాత్రను సృజించి రచయిత మనం మరచిపోతున్న మానవత్వాన్ని, మానవ సంబంధాలలోని విశ్వాసం ప్రాధాన్యాన్ని ఈ కథ ద్వారా గుర్తుచేశారు. చక్కని కథను రచించిన రచయితకు అభినందనలు.

<u>స్పాట్:</u>

గుబ్బల సత్యనారాయణ మూర్తి రచించిన ఈ కథ మే 1, ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. గంగాధరం ఓ టీచరు. పరీక్షా పత్రాలను దిద్ది మార్కులు వేయాల్సిన స్పాట్ వాల్యుయేషన్ బాధ్యతను అతి తేలికగా, చులకన భావంతో నిర్వహిస్తూంటాడు. సరిగ్గా సమాధానాలు చదవకుండానే ఇష్టం వచ్చినట్టు మార్కులు వేస్తూంటాడు. అలాంటి గంగాధరం కూతురు ఇంటర్‌లో ఫెయిలవుతుంది. రివాల్యుయేషనుకు కడతాడు. ఇంటికి వచ్చేసరికి ఆత్మహత్య చేసుకోబోయి కూతురు బ్రతికిందని

తెలుస్తుంది. దాంతో గంగాధరం తన తప్పు గ్రహిస్తాడు. ప్రవర్తన మార్చుకుంటాడు. స్పాట్ వాల్యుయేషన్‌లో మార్కులు దిద్దేవారి మూడ్‌ను బట్టి విద్యార్థుల భవిష్యత్తు నిర్ణయమౌతుందని చూపుతూ, అధ్యాపకులు ఎంత బాధ్యతతో వ్యవహరించాలో ప్రదర్శిస్తుందీ చక్కని కథ.

<u>*వస్త్రాపహరణం:*</u>

శారద రచించిన ఈ కథ మే 2 ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ప్రస్తుతం సమాజంలో తరాల నడుమ జరుగుతున్న సంఘర్షణకు అతి సున్నితంగా ప్రదర్శిస్తుందీ కథ. తన తల్లి వ్యభిచారం చేస్తూ తనని పోషిస్తున్నదని అసహ్యించుకుని ఆవిడకు దూరంగా వస్తాడో వ్యక్తి. తరువాత మహిళా సంఘాలతో కలిసి పనిచేస్తాడు. ఆడవాళ్ళ నిస్సహాయతను అర్థం చేసుకుంటాడు. సమాజంలోని బలహీనతలను పెంచుకుంటూ పబ్బం గడుపుకునే నీచులని చూసి ఆవేశపడతాడు. తన కూతురు క్రాంతికి తన అభిప్రాయాలు చెప్పలేకపోతాడు. ఇప్పుడు అతని కూతురే సెక్సీగా ఫోజులిస్తూ మోడలింగ్ చేస్తూ టీవీలో పనిచేయటం భరించలేక పోతాడు. ఆమెని వదలి వెళ్ళిపోవాలనుకుంటాడు. కానీ, దారి తప్పిన బిడ్డని తప్పుదారిలో వదిలేసి వెళ్ళిపోతున్న తనెలాంటి తండ్రి? అని ఆలోచిస్తాడు. వెనక్కు తిరిగి వెళతాడు. డబ్బుకోసం చిన్న చిన్న పిల్లలకు గుడ్డ పీలికలేసి ద్వందార్థాల పాటలను నృత్యాలను చేయించే తల్లిదండ్రులున్న కాలంలో ఇలా ఆలోచించే తండ్రి పాత్ర అపురూపంగా అనిపిస్తుంది. మంచి ఆలోచనను ప్రదర్శిస్తుందీ కథ.

<u>*యమాని మహిషపు లోహ ఘంటలు:*</u>

'జీవన్' రచించిన ఈ కథ 19 మే, నవ్య వారపత్రికలో ప్రచురితమయింది. పర్యావరణ సమస్యను ప్రతిబింబించే కథలెన్నో వచ్చాయి. ఇంకా ఎన్నో వస్తాయి. కానీ, ఈ కథ ఆ సమస్యను కొత్తకోణంలో ప్రదర్శిస్తుంది. ఒక ఆలోచనను కలిగిస్తుంది. నిజానికి ఇది కథ అనేకన్నా ఒక పెద్ద వ్యాసం అనవచ్చు. కథనిండా భావాలు, ఆలోచనలు నిండి ఉన్నాయి. మెరుపులు, మలుపులు ఏమీలేవు. కానీ కథలో రచయిత చూపిన ఆలోచన చక్కనిది. 'పూర్వం బలవంతుడైన రాజు మరో రాజును జయించాలంటే, ఆ రాజ్యాన్ని ధ్వంసం చేసేవాడు. అక్కడి ప్రజల్ని విచక్షణ రహితంగా ఊచకోత కోసేవాడు. మనిషి ప్రకృతిని జయించడమంటే కూడా ఇంతేనా?' అంటూ ముగుస్తుందీ కథ.

<u>*రాత్రిపూట, చినుకు రాలినది, సోమాలియామేక:*</u>

ఈ మూడు కథలు వేర్వేరు రచయితలు రచించినవి. 'సోమాలియా మేక' మే 23, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. రచయిత పైడి తెరేష్ బాబు. 'చినుకు రాలినది', 'రాత్రిపూట' కథలు మే 16, మే 9, సాక్షిలో ప్రచురితమయ్యాయి. పూడూరి రాజిరెడ్డి, మహమ్మద్ ఖదీర్ బాబులు ఈ కథలను రాసిన వారు.

ఈ మూడు కథలను కలిపి పరిచయం చేయటం ఎందుకంటే, ఈ మూడు కథలలో ఏక సూత్రత ఉన్నట్టనిపిస్తుంది. పైడి తెరేష్ బాబు కథ పూర్తిగా ప్రవేశాత్మకం. వ్యంగ్య విమర్శనాత్మకం. పూడూరి రాజిరెడ్డి, ఖదీర్ బాబు కథలు సంఘటనలను ప్రదర్శించే ప్రయత్నం చేస్తాయి. వీటిల్లో ఒక ప్రణాళిక ప్రకారం కథను చెప్పటం కన్నా, సంఘటనలను జరిగినవాటిని జరిగినట్టు చూపుతూ, ఆ సంఘటనల ద్వారా మానవ ప్రవృత్తిని, పాత్రల మనోభావాలను, సంఘర్షణలను ప్రదర్శించే ప్రయత్నం చేశారు కథా రచయితలు.

ఈ మూడు కథలు చదివిన తరువాత ఒకే భావం కలుగుతుంది. అది అయోమయం.

'సోమాలియా మేక'లో 'సోమాలియా మేక' పులితోలు కప్పుకున్న మేక. దాన్ని ప్రేమించే దేశంలో మేక కూడా దేశవాళీ మేక కాదు. అమెరికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, చైనా, జపాన్, జర్మనీ వంటి రాజ్యాలు దాన్లో నివసిస్తూంటాయి 'సౌందర్యం అంటే ఏమిటని' అన్వేషిస్తూంటుం ది దేశవాళీ మేక. 'సౌందర్యం ఏమిటి?' అన్న ప్రశ్నకు సమాధానాన్ని ప్రమేయాత్మకంగా చూపుతూ, సమాజంలో నెలకొని ఉన్న అనేక పరిస్థితులను వ్యంగ్యంగా ఎత్తి చూపుతూ సాగే ఈ కథ 'ఒకరినొకరం ఎప్పటికైనా మోసం చేయలేమా అనే సదాశయంతో సదా ముందుకు సాగటమే సౌందర్యం' అంటూ ముగుస్తుంది.

కథంతా ప్రతీకలతో సాగటంతో, ఓ ఆర్ట్ ఫిల్మ్‌లా మాజిక్‌లా సాగుతూ ఒక అంశం నుంచి మరో అంశానికి జంప్ చేస్తూ, ఇది అది అనిపించి, అదికాదు ఇంకేదో అనిపిస్తూ, అక్కడకూడా అర్థంకాని ఆధునిక కల్పితంలా, అర్థం వెతుక్కోవాల్సిన అర్థంలేని ఆధునిక చిత్రలేఖనంలా గజిబిజిగా అనిపిస్తుంది. భావం బోధపడుతున్నట్టే అనిపిస్తుంది. ఆలోచిస్తే బోధపడదు. ఇలాంటి ప్రయోగం చేసిన రచయితను అభినందిస్తూనే, కథను ఇంకా సరళం చేసి, కథలో పలు అంశాలను కాక ఒకే అంశాన్ని సరళంగా, ప్రతీకాత్మంగా ప్రదర్శిస్తే పదిమందికీ రచయిత భావం బోధపడేది అనిపిస్తుంది. 'సౌందర్యం' పలు రూపాల లోని వికృతభావాల్ని ప్రదర్శించాలి. రచయిత ఎన్నుకున్న శైలి సామాన్య పాఠకుడి తలపునుంచి వెళ్ళిపోతుంది. కానీ, రచయిత శైలిబాగుంది.

ఖదీర్ బాబు కథ 'రాత్రిపూట'లో ఇలాంటి సంక్లిష్టత, ప్రతీకలు లేవు. సాఫీగా, తిన్నగా సాగుతుంది. కానీ ఎంత సాఫీగా సాగుతుందంటే, ఎలాంటి ఎత్తుపల్లాలు లేని సరళ రేఖ అంతగా. కథలా అనిపించదు. రచయిత జీవితంలోని కొన్ని సంఘటనలను చూపే డైరీలా అనిపిస్తుంది. తాను ఎలా తనకు దూరమవుతున్నాడో, సంసారం ఎలా వ్యక్తిని బందీని చేస్తుందో చూపాలని రచయిత, వ్యాసంలా కాక, కొన్ని సంఘటనలను ఒక చోట గుచ్చి 'వార్త కథనం'లా చూసాడు. అందుకే కథ పూర్తిగా చదివిన తరువాత ఇది 'కథ'లా అనిపించదు. బహుశా, రచయిత కూడా పాఠకుల ఇది కథ కాదు, 'నిజజీవితం'గా భావించాలనే ఇలా రచించాడేమో!

'చినుకురాలినది' కథ కూడా నిజం జీవితంలోని సంఘటనలను ఉన్నదున్నట్టు చూపుతూ, ఆ సంఘటనలకు వ్యక్తి మనస్సులో కలిగే స్పందనలను చూపాలని ప్రయత్నిస్తుంది. ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి తన గమ్యం చేరేవరకూ జరిగిన సంఘటనలనీ కథ ప్రతిబింబిస్తుంది. ఈ సంఘటనకు కథ చెప్పే వ్యక్తి స్పందనలు, ఆలోచనలు ఒక సగటు మనిషి ఆలోచనలకు అతిదగ్గరగా ఉన్నాయి. కొన్ని ఆలోచనలు 'అద్భుతం' అనిపిస్తున్నాయి. 'మనుషులకు బేసిగ్గా కావాల్సిన అన్నింటినీ అందరికీ అందుబాటులో ఉంచింది (ప్రకృతి). పాలు అందరికీ ఒకటే. కాకపోతే ఏ గ్లాసులో, ఎక్కడ కూర్చుని తాగుతామన్నదే తేడా. ఇలా సాగుతూన్న ఈ కథ చదువుతూంటే, 'ఖదీర్ బాబు' కథ చదువుతూంటే కలిగే సందేహమే కలుగుతుంది. రచయిత కథను ఎలా ముగిస్తాడన్నది.

ఖదీర్ బాబు కథ ఒక ముగింపు అన్నది లేకుండా ఓ సంఘటన 'పోర్టింగ్ అయిపోయింది' అన్నట్టు ముగుస్తుంది. రాజిరెడ్డి తన కథకు ఓ ట్విస్టు ఇవ్వాలని, కనీసం కథను వారలా కాక కథగా ముగించాలని ప్రయత్నించాడు. కానీ అందువల్ల అంతవరకూ కథ కలిగించిన భావన అదృశ్యమైపోతుంది. కథ మామూలుగా, ఏం చేయాలో తెలియక ఏదో ముగించాలి కాబట్టి ముగించాలని ముగించినట్టనిపించింది. అయినా సరే 'చినుకు రాలినది' కథలా అనిపిస్తుంది. వార్తలా, వాస్తవ సంఘటనల సంకలనంలా అనిపించింది.

ఇక్కడే ఈ మూడు కథలలో సారూప్యత, స్పష్టమయ్యేది. ఈ మూడు కథల 'ముగింపు' అపరిక్వంగా, అనిపిస్తాయి. 'సోమాలియామేక ముగింపులో రచయిత ఓ 'కంక్లూజన్' హఠాత్తుగా ఇస్తాడు. 'రాత్రిపూట' బలవంతపు ముగింపుకు వస్తుంది. 'చినుకు రాలినది' ఏదో ఒక ముగింపు ఉండాలి కాబట్టి ముగుస్తుంది.

ఏ కథకయితే ముగింపు కుదరదో, ఆ కథను ఒక సుందరమైన మలుపు తిప్పి వదిలేయాలంటారు. అది ఈ మూడు కథలకూ వర్తిస్తుంది. ముగింపు పై శ్రద్ధ వహించి ఉంటే, ఈ మూడు కథలు మంచి కథలుగా ఎదిగేవి.

***<u>జంధ్యం :</u>***

అక్కిరాజు భట్టిప్రోలు రచించిన ఈ కథ మే 30, సాక్షిలో ప్రచురితమయింది. మన సమాజంలో 'ఆదర్శం' ఓ మతం స్థాయికి చేరుకుంది. విశాల భావాలను వ్యక్తికి నేర్పాల్సిన ఉత్తమ ఆదర్శం సంకుచితిత్వానికి దారి తీయటం మానవ స్వభావంలోని లోపాన్ని స్పష్టం చేస్తుంది. ఉత్తమాదర్శంతో పాటు విశాల భావాలను ప్రదర్శించే ఉత్తమ వ్యక్తి కథ 'జంధ్యం'. ఇందులో, ప్రధాన పాత్ర సంప్రదాయాలను పాటించని వాడయినా, పెద్దల సంతృప్తి కోసం తాత్కాలికంగా జంధ్యం వేసుకుంటాడు. తన తండ్రికి కర్మకాండలు చేయకపోయినా మామయ్య కోసం వేసుకుంటాడు అదీ కథ. ఈ కథలో రచయిత ఎంచుకున్న అంశం అత్యంత ఆవశ్యకమైనది. ఏదో ఒక ఆదర్శం

పట్టుకుని వ్రేలాడుతూ, తన దృక్కోణంలో చూడని వారంతా పనికిరాని వారు, తప్పు దృష్టి వారిని, అని చులకన చేస్తూ, ఈసడించే బదులు, ఎదుటి మనిషి బలహీనతలను, నమ్మాలో అర్థం చేసుకుని వ్యవహరించే ఔన్నత్యం ఆదర్శవాదులలో కనబడటం లేదు. 'మతం'లో ఎలాంటి సంకుచితత్వం ఉందని, మతాన్ని కాదంటున్నారో, అంతకన్నా ఎక్కువ మౌఢ్యం ఈ ఆదర్శ వాదులు ప్రదర్శిస్తున్నారు. అలాంటి సమయంలో ఇలాంటి కథల అవసరం ఎంతగానో ఉంది. అయితే, ఈ కథలో కూడా రచయిత ప్రధాన పాత్రను 'ఎలివేట్' చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రధాన అంశాన్ని దెబ్బతీశారు.

ఇప్పటికీ ప్రధాన పాత్రకు సంప్రదాయాల పట్ల గౌరవం లేదు. జంధ్యం ఆయన దృష్టిలో ఓ తాడు ముక్క మాత్రమే. అలాంటి భావనతో మామయ్య మీద ఎంత గౌరవంతో జంధ్యం ముక్కను మెడలో వేసుకున్నా ఫలితం ఉండదు. అది చిత్త శుద్ధి లేని శివపూజే అవుతుంది. అదీగాక, ఉపనయనం కానివాడు ఓ తాడు తగిలించుకుని, దాన్ని 'జంధ్యం' అంటే ఎవ్వరూ ఆమోదించరు. కనీసం కాలేదని చెప్పకుండా తాడు వేసుకున్నా జంధ్యం అని నమ్ముతారు. ఇది నిజంగా జరిగిన సంఘటన అని రచయిత అంటున్నారు కాబట్టి ఏమీ అనటానికి లేదు కానీ, ఎందుకో ఈ జంధ్యం విషయం మాత్రం అసంతృప్తిగా అనిపిస్తుంది.

అదీకాక, కథ మొత్తం శవం పక్కన చర్చలా సాగటం కూడా కథను అనౌచిత్యం అనిపించేట్టు చేస్తుంది. కథలో ఎక్కడా బిగువులేదు. ఉద్విగ్నత లేదు. కానీ ఒక మంచి ఆలోచనను ప్రదర్శిస్తుందీ కథ.

ఈ నెల ఉత్తమ కథగా పాఠకులకు పరిచయం చేసేందుకు ఏ కథనూ ఎంచుకోలేదు.

✷✷✷




## జూన్ 2010

**జూన్ నెలలో ఆంధ్రభూమి,** స్వాతి, నవ్య వారపత్రికలు, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, స్వాతి, ఆంధ్రభూమి, చిత్ర, రచన, విపుల మాసపత్రికలలో ప్రచురితమైన 103 కథలను పరిశీలించి కౌముది పాఠకుల పరిచయం కోసం ఎంచుకున్న కథలు ఇవి.

సాధారణంగా విమర్శలను సహృదయంతో స్వీకరించటం అరుదుగా జరుగుతుంది. కథను రచిస్తున్న రచయిత మనసులో భావం, ఉద్దేశ్యాలు ఒకరకంగా ఉండవచ్చు. కానీ, ఆ కథను చదువుతున్న పాఠకుడి మనసులో మరో రకమైన ఆలోచనలు కలగవచ్చు. రచయిత చెప్పదలచుకున్న అంశం స్థూలంగా పాఠకుడు గ్రహించినా, సూక్ష్మ స్థాయిలో పాఠకుడి భావనకు రచయిత ఆలోచనకు నడుమ బేధం పొడచూపవచ్చు.

ఓ కథ చదువుతున్నప్పుడు పాఠకుడికి రచయితలో ఏదో అయోమయం ఉన్న భావన కలుగుతుంది. కానీ రచయిత కావాలనే ఆ అయోమయాన్ని సృజించి ఉండవచ్చు. ఇలాంటి సందర్భాలలో రచయితను పాఠకుడు, పాఠకుడిని రచయిత అపార్ధం చేసుకునే వీలుంటుంది. విమర్శకుడు సైతం పాఠకుడిలానే రచయిత హృదయం గ్రహించటంలో పొరపాటు పడవచ్చు. ఇలాంటి సందర్భాలలో రచయిత, విమర్శకుడు ఇద్దరూ సంయమనం పాటించాల్సి ఉంటుంది. విమర్శ సహృదయంతో చేసిందా, వ్యక్తిగతాలను దృష్టిలో పెట్టుకుని దౌష్ట్యంతో చేసిందా అన్నది రచయిత గ్రహించాల్సి ఉంటుంది.

ఎందుకంటే, ప్రస్తుతం తెలుగు సాహిత్య రంగంలో సహృదయమైన విమర్శ సంపూర్ణంగా కరవుతోంది. విమర్శకుడు ఓ కిరాయి హంతకుడు (మెర్సనరీ)గా మారుతున్నాడు. పుస్తకాన్ని అందుకోకముందే, లాభం లేదనిపిస్తే, పుస్తకం చదవకుండానే, అర్థం పర్థంలేకుండా దాన్ని చీల్చి చెండాడి, ఏదో సాధించేశానని, చీమను నలిపి పసిపిల్లవాడు పొందేటటువంటి ఆనందాన్ని పొంది, కాలర్లెగరేయటం, ప్రస్తుతం మన సాహిత్య ప్రపంచంలో సర్వసాధారణం అవుతోంది. తెలుగు సాహిత్య సుధామం నిర్ధూమధామం అవుతోంది. ఇలాంటి కిరాయి హంతకకు విమర్శకుల వల్ల ఇలాంటి పరిస్థితుల్లో తన రచనపై విమర్శరాగానే, దానికి ప్రతిస్పందించి, ఆ విమర్శకులేని ప్రామాణికతను ఆపాదించి పెట్టే బదులు, రచయితలు, విమర్శకుడి హృదయాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి. సహృదయ పూర్వకమైన విమర్శను స్వీకరించాలి. దౌష్ట్యంతో కూడిన విమర్శను పట్టించుకోకూడదు.

రచయిత పని రాయటం. రచయిత రాస్తూనే పోవాలి. మెర్సనరీ విమర్శకుల విమర్శలు తాత్కాలికం. చివరికి మిగిలేవి విమర్శలు కావు, రచనలే! కానీ, ఆ విమర్శకులు ఎలాంటి అయోమయం రచయితలలో కలిగిస్తున్నారంటే, రచయిత, హృదయ స్పందనలను అనుసరించి కాక, విమర్శకుల ఆమోదం కోసం రచనలు చేసేంత దౌర్జన్యానికి గురవుతున్నాడు. ఇది మన తెలుగు కథను కాన్సర్‌లా పట్టి పీడిస్తోంది.

**ఏదీకథ**

జి.వెంకట కృష్ణ రచించిన ఈ కథ జూన్ 2, నవ్య సంచికలో ప్రచురితమయింది. ఈనాడు ఓ రచయిత హృదయంలో జరిగే సంచనలను, చెలరేగే అయోమయాలను ఈ కథ చక్కగా కాస్త హాస్యం జోడించి ప్రదర్శిస్తుంది. దేవేంద్ర అనే రచయితకు ఆల్ఇండియా రేడియో నుంచి కథ చదివేందుకు ఆహ్వానం వస్తుంది. దాంతో కథ రాయాలని కూచుంటాడు దేవేంద్ర. అయితే, ఎలాంటి కథ రాయాలన్నది దేవేంద్ర సమస్య. 'నింపాదిగా జీవిత లోతుల్లోంచి జాలువారే పాత తెలుగు కథా మాష్టర్ల ఒరవడి ఒకటి మాయమై, తాజా రోజా సమస్యల మీద హాట్ హాట్ చిప్స్ లాంటి కథల్ని ఒండుతున్న కాలమిది. ఆ కాల ప్రవాహంలో మునిగి గల్లంతవకుండా ఈదాలంటే, తన ప్రదర్శన పదిమంది చూసి మెచ్చుకునేలా ఉండాలంటే పిల్లి మొగ్గలాంటిదేదో ఒకటి కాకుండా, గాఢమైన కథొకటి రాసి చదవాలి'. అనుకుంటాడు. కానీ గాఢమైన కథ ఏమిటో అన్న దానిమీద అతడికి స్పష్టమైన అవగాహన ఉండదు. ఎందుకంటే కథ ఇప్పుడు వర్గ, వర్ణ, ప్రాంత, భాష, ఉద్యమాలుగా చీలిపోయింది. తమ ప్రాంతానికి చెందినవాడు కాడు కాబట్టి ప్రాచీన కవిని సైతం దూషించేందుకు ప్రొఫెసర్లు సైతం ఆరాటపడుతున్న కాలం ఇది. అందుకే దేవేంద్ర 'స్త్రీ వాదం స్త్రీ సమానత్వం ప్రభావం', దేని గురించి రాయాలన్న మీమాంసలో పడతాడు. అంతలో ఒకడు 'రైతుల ఆత్మహత్య'ల గురించి రాయమంటాడు. మరొకడు పోలీసుల జులుం గురించి రాయమంటాడు. అంతలో ఇలాంటివి అందరూ రాస్తున్నారు కాబట్టి శృంగార కథ రాయాలనుకుంటాడు. చివరికి 'మనసులో వందలాది ఇతివృత్తాల్ని రూపొందించుకుని దృశ్యాల్ని అల్లుకుని దేన్నీ పేపర్ మీద పెట్టకుండా' గడిపేస్తాడు.

ఇంత వరకూ కథ బాగా నడిచింది. కానీ ముగింపు దగ్గరకు వచ్చేసరికి, రచయిత, అనౌచిత్యమైన ముగింపు ఇవ్వటం కథను దెబ్బతీసింది. మనది మౌఖిక సాహిత్య సాంప్రదాయంకాబట్టి, రేడియో స్టేషన్ కెళ్ళి మంచి కథ వినిపించాలని నిశ్చయించుకుంటాడు. కానీ, రేడియోవాళ్ళు స్క్రిప్టు తప్పనిసరిగా అడుగుతారు. అదీగాక, పదినిమిషాలు అప్పటికప్పుడు, మైకు ముందు కూచుని గడగడా చెప్పేయటం అంత సులభమైన పనికాదు. ఈ విషయాన్ని వదిలేస్తే, ఈ కథ ఈనాటి రచయితల సందిగ్ధాలకు, తెలుగు కథా ప్రపంచంలోని సంఘర్షణలకు దర్పణం పడుతుంది.

**క్యాన్సర్**

జూన్ 27, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ కథను రచించింది డా.మనోహర్ కోటకొండ. మన నిత్యజీవితంలో ఒక భాగమైన వ్యాపార సంస్కృతిని విమర్శిస్తూ, కరువైపోయిన మానవత్వాన్ని, సహానుభూతిని తలుచుకునే కథ ఇది. ఇద్దరు మిత్రులు తమ ఊరు వెళుతూ, పాతకాలాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ, కొత్త వ్యాపార సంస్కృతి కాలాన్ని విమర్శిస్తూ గడుపుతారు. అప్పటి మానవత కథలు చెప్పుకుంటారు. కథ చక్కగా సాగుతుంది. కథలో రచయిత చేసిన విమర్శలన్నీ సమజసమైనవే. ఈ సమాజం ఎలా ఉండాలని రచయిత వాంఛించాడో సమాజం అలా మానవత్వం ప్రాధాన్యం కలదిగా మారటం అభిలషణీయమే. కానీ, వచ్చిన చిక్కు ఏమిటంటే, తమ రచనలలో 'పాత'కు పెద్ద పీట వేస్తారు కానీ, 'పాత'లో మంచికన్నా 'చెడు'ను వెతికి దానికి పెద్దపీట వేయటం ప్రస్తుతం మనకు అలవాటయిపోయింది. రచయితలు ఛాందసులన్న ముద్రపడకుండా ఉండటం కోసం కత్తిమీద సాము చేయాల్సివస్తుంది.

**మహామాయ**

పి.వి.సునీల్ కుమార్ రచించిన ఈ కథ విపుల మాసపత్రికలో ప్రచురితమయింది. ప్రహసనం 'మాయ' అని బోధించే వ్యక్తి. తన సామాన్లు పోతే ఏడుస్తూంటే చూసి ఇతడే 'మహామాయగాడు' అనుకోవటం కథ. ప్రాచీన సిద్ధాంతాలను సరిగ్గా అర్థం చేసుకోకుండా, హేళన చేసి కథలు రాసేసెయటానికి ఈ కథ మంచి ఉదాహరణ. ప్రాచీన 'విలువలు' కావాలి కానీ ప్రాచీన 'సిద్ధాంతాలు' మాత్రం పనికిరానివని భావించే కథకుల అభ్యుదయ మనస్తత్వానికి ఈ పై రెండు కథలు దర్పణం పడతాయి. మనధర్మంలో, జీవన విధానంలో నైతిక విలువలు పడుగులో పేకలా కలిసిపోయాయి. ఒకటి లేందే మరొకటి లేదు.

<u>*వైరసుడు*</u>

శ్రీదేవి మురళీధర్ రచించిన ఈ కథ జూన్ 10 నాటి ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయింది. ఒక కోణంలోంచి చూస్తే మామూలు కథ ఇది. భర్తను కోల్పోయిన మైథిలి పిల్లతో బ్రతుకుతూంటుంది. ఆమె మళ్ళీ పెళ్ళిచేసుకోవాలనుకుంటుంది. ఇంటర్నెట్ ద్వారా సంబంధం వస్తుంది. మంచి వాడిగా నటించిన అతడు మోసగాడు. ఆమె మిత్రుడు ఆమెను రక్షిస్తాడు. 'సినిమాటిక్'గా ఉన్న ఈ కథ ఇతర కథలకన్నా భిన్నంగా ఎదిగిన అంశం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జరిగే మోసాల స్వరూపాలను బయట పెట్టిన విధానం. ఇంటర్నెట్ లో జరుగుతున్న మోసాలను వారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కథ చక్కగా ప్రదర్శిస్తుంది. ఆద్యంతం ఆసక్తిగా చదివింపచేస్తుందీ కథ.

<u>*తుకారాం, రాజునీతి*</u>

విజయనగర సామ్రాజ్యానికి, శ్రీకృష్ణదేవరాయలకు సంబంధించి కథకులు దృష్టి సారించటంతో ఇటీవలి రెండు మూడు నెలలలో ఈ అంశం గురించి పలు కథలు వచ్చాయి. అలాంటి కథలలో రెండు విభిన్న దృక్కోణాలను ప్రదర్శిస్తాయి ఈ రెండు కథలు.

విహారి రచించిన 'తుకారాం', జూన్ 23, నవ్యలో ప్రచురితమయింది. ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమయిన రాజునీతి కథను రచించింది జి.శ్రీరంగ.

చరిత్ర కేంద్ర బిందువుగా చేసే కాల్పనిక రచనలలో కల్పన ఉండటం తప్పని సరి. గమనిస్తే, దొరికిన ఆధారంగా చరిత్రను రచించటంలో కూడా 'ఊహ' పెద్ద పాత్ర వహిస్తుంది. అయితే ఇలా చేసిన ఊహ ఔచితీవంతము, సందర్భోచితమూ, అర్ధవంతమూ అవటమే కాక సమకాలీన సమాజానికి మంచి చెప్పేది. అయితే, అది ఉత్తమ కల్పన అవుతుంది. చారిత్రాత్మక కాల్పనిక కథలు ఒక ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో అంతగా అభివృద్ధి కాలేదు. ఒకప్పుడు చరిత్రాత్మక రచనలు విరివిగా వచ్చేవి. కానీ ఆధునిక కాలంలో సంకుచిత రంగుటద్దాల ప్రభావం పెరటంతో చరిత్రను చూసే దృష్టి మారింది. కాబట్టి రచయితలు చరిత్ర జోలికి వెళ్ళక పోవటమే క్షేమకరం అయింది. లేకపోతే ఏ చరిత్రలోంచి ఎలాంటి విషపు సర్పాలను మన రంగుటద్దాల కళ్ళు చూసి విద్వేషం వెళ్ళగ్రక్కుతారో ఎవరికీ తెలియదు. అందుకే చారిత్రాత్మక రచనలు అరుదుగా చేసినా ప్రేమకథలలో, నీతిబోధలకో పరిమితమవుతున్నాయి.

'తుకారాం' చరిత్రాత్మక కథ యైనా ప్రధానంగా ప్రేమకథగానే పరిగణించవచ్చు. రాయలు ఒరిస్సా రాజు గజపతి పైకి దండయాత్రకి వెళ్ళినప్పుడు, సంధిగా కుదుర్చుకుని, రాయలకు తాను కూతురినిచ్చి పెళ్ళిచేస్తాడు ఒరిస్సా రాజు. ఆ సంఘటన నేపథ్యంగా ఒరిస్సా రాకుమారి 'తుకారాం' మనసులో చెలరేగిన భావాలను, ఈ కథ ప్రదర్శిస్తుంది. రాయలపై ద్వేషం ప్రేమగా పరిణమించటాన్ని చూపిస్తుందీ కథ. కథలో ఒక స్థాయి వరకూ రాకుమారి పాత్ర చిత్రణ ఉత్తమంగా సాగింది - కానీ, చివరలో 'తుకారాం' అన్నీ మరచి రాయలను స్వీకరించేందుకు సిద్ధమవటాన్ని సరిగ్గా ప్రదర్శించలేక పోవటంతో కథ బలహీనమైపోయింది. సినిమాటిక్ ముగింపుతో మిగిలిపోయింది. గమనిస్తే, రాయలను పెళ్ళి చేసుకున్నాక, తొలిరాత్రినాడు ఒరిస్సా రాకుమారి, రాయలపై హత్యా ప్రయత్నం చేసిందన్న కథలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఆ కథల నేపథ్యంలో చూస్తే 'తుకారాం మనస్సులో సన్నని మంచుపూల తుంపర' అంత త్వరగా కురిసినట్టు చూపటం అంత ఆమోదయోగ్యంగా అనిపించదు. ద్వేషించటాన్ని చక్కగా చూపి, ప్రేమించటానికి సరైన బలమైన కారణం చూపని కథ 'తుకారాం'. పైగా నాయిక వ్యక్తిత్వాన్ని పెద్ద చేయటానికి రాయల వ్యక్తిత్వాన్ని అక్కడ కూడా కించ పరిచినట్టు అనిపిస్తుందీ కథలో.

'రాజునీతి' కథ ఈనాటి సమాజంలోని ఓ ప్రధానమైన సమస్యను ఆనాటి సమాజంలో ఆరోపించి చూపించి, ఈనాటి సమాజానికి పాఠం నేర్పుతుంది. రాజ్యరక్షణ కోసం ప్రాణాలర్పించిన వారికి తగిన సౌకర్యాలు కల్పించినందుకు రాయలు తనకు తానే శిక్ష విధించుకోవటం కథ ప్రధానాంశం. ప్రస్తుత సమాజంలో దేశ భక్తి ప్రదర్శించి దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లు, వారి

కుటుంబాల పట్ల ప్రభుత్వమే కాదు సమాజం కూడా ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిపై విమర్శలాంటిదీ కథ. అలాంటి వారిని పట్టించుకోకపోతే, భవిష్యత్తులో ఎవరి స్వార్థం వారు చూసుకుంటారు తప్ప, దేశం గురించి ఆలోచించారన్న సున్నితమైన హెచ్చరిక కూడా ఉందీ కథలో. అయితే, తన సేవకుడి పొరపాటుకు రాజు బాధ్యత వహించటం బాగున్నా, నేరం చేసినవాడికే శిక్ష పడ్డట్టు చూపితే రాయలనీతి మరింతగా ప్రస్ఫుటమయ్యేది. నేరం చేయటానికి కారణమేదైనా చేసిన నేరానికి శిక్ష పడాల్సిందేనన్నది రాయల రాజనీతి. అందుకు ప్రధాన దోషిత్వాన్ని తాను స్వీకరించినా దోషం ప్రత్యక్షంగా చేసినవాడికే ఏదో శిక్షపడినట్టు చూపాల్సింది. అయినా సరే, రాయలపై ఇటీవల వచ్చిన కథలన్నింటిలోకీ ఈ కథ చక్కనిది. ఔచిత్యం పాటిస్తూ కల్పనలను వెలయించినదీ ఈ కథ,

ఈ నెల కూడా ఉత్తమ కథగా ఏ కథనూ ఎంచుకోలేదు.

✷✷✷



# కథాసాగర మథనం
## కస్తూరి మురళీకృష్ణ



## జూలై ౨౦౧౦

**జూలై నెలలో** స్వాతి, ఆంధ్రభూమి, నవ్య వార పత్రికలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, విపుల, స్వాతి రచన, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల ఆదివారం అనుబంధాలు, విపుల, స్వాతి, రచన, ఆంధ్రభూమి, చిత్ర పాలపిట్ట మాసపత్రికలలో ప్రచురితమైన 87 కథలను చదివి వాటినుండి కౌముది పాఠకుల పరిచయం కోసం ఎంచుకున్న కథలు ఇవి.

'కథ' అంటేనే నిజంగా జరిగిన దానికి కల్పన జోడించి ఆసక్తికరంగా చెప్పటం అని అర్థమవుతుంది. అంటే, కథకు బీజం నిజంలో ఉన్నా దానికి కల్పన జోడించటం తప్పని సరి అన్నమాట. నిజంగా చెపితే అది వార్త అవుతుంది తప్ప కథ కాదు. కానీ, తెలుగు సాహిత్యంలో అనేక కారణాల వల్ల కథ అన్న పదాన్ని సంకుచిత పరిధిలోనే వాడటం అలవాటయిపోయింది.

'కథ ఇలాగే ఉండాలి, ఇలాంటి వస్తువునే ప్రతిబింబించాలి' అని కథా రచయితల చుట్టూ ముళ్ళ కంచెలు విధించటం అలవాటయిపోయింది. చివరికి కథకులు కూడా ఆ ముళ్ళ కంచలనే పూల హారాలుగా భావించి, ఆ పరిధిలో ఒదగటమే గొప్పతనంగా భావించటం స్థిరపడింది.

అందుకే, ఈ మామూలు ముళ్ళ పరిధిని దాటి ఎవరయినా రచయిత భిన్నంగా రచనలు చేయాలని ప్రయత్నిస్తే, పాఠకుల ఆకాంక్షలను పట్టించుకోకుండా, విమర్శకులు అలాంటి ప్రయోగాలను విమర్శించటమే కాదు, అడ్డుకోవటమూ తెలుగు సాహిత్యంలో ఆనవాయితీగా వస్తోంది. అందుకే ప్రపంచ సాహిత్యంలో ఎదిగిన అనేక కథా ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో ఎండిపోయిన నీటి పాయలయ్యాయి. కథ అంటే అణచి వేతలను ప్రదర్శించాలి, నీతులు చెప్పాలి, సామాజిక స్పృహను ప్రదర్శించాలి, అభ్యుదయ భావాలను చూపాలి అన్న ఇనుప గొలుసులతో కథలను కట్టేశారు తెలుగు సాహిత్య విమర్శకులు. అందుకే తెలుగు పాఠకులు, తమ పిల్లలతో సహా తెలుగు సాహిత్యం వదలి బేట్‌మేన్లు, సూపర్ మేన్లు, స్పైడర్ మేన్లు, ఈవిల్ డెడ్‌లు, నైట్ మేర్లు, డ్రాకులాలు చదువుతూ, చూస్తూ, సామాజిక నిస్పృహను ప్రదర్శించే తెలుగు సాహిత్యం గురించి నిట్టూర్పులు విడుస్తున్నారు. పాతకాలం రచనలను చదువుతూ వాటినే సజీవంగా ఉంచుతున్నారు. పాతకాలాన్ని తలపుకు తెచ్చే కథలను మెచ్చుకుంటూ 'నోస్టాల్జియా'లోనే జీవిస్తున్నారు.

***<u>సూర్యం రాజుగారి కండువా</u>***

జూలై 9 నాటి స్వాతి వారపత్రికలో ప్రచురితమయిన ఈ కథ రచించింది వంశీ. మా దిగువ గోదావరి కథలు శీర్షికన ఆ ప్రాంతానికి చెందిన కథలను అందిస్తున్నారు. ఈ కథలోని సూర్యం రాజుగారిది విశిష్ట వ్యక్తిత్వం. ఆ కాలంలో దాదాపుగా ప్రతి ప్రాంతంలో ఇలాంటి ధర్మ ప్రభువులు ఉండేవారు. అడిగిన వారికి లేదనకుండా దానాలిచ్చి ఆస్తిని హారతి కర్పూరంలా కరగించుకున్న ప్రజల గుండెలలో చెదరని స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈ నాటికీ ఇలాంటివారి దానగుణాన్ని తలచుకునే కుటుంబాలు బోలెడన్ని ఉన్నాయి. అలా దానాలు చేస్తూ రాజుగారు చివరికి చితికి పోతారు. కూలీలు చేసుకుంటూ బ్రతుకుతున్న ఆయన సంతానం కూడా ఉన్నంతలో దానాలు

చేస్తుంటారు. ఎలాంటి నెగటివ్ ధోరణులు లేకుండా, చక్కగా, ప్రవహించే స్వచ్ఛమైన నీటిలా సాగిపోతుందీ కథ. చదివిన చాలాకాలం వరకూ గుర్తుంటుంది.

<u>మానవత్వం పరిమళించింది</u>

ఎం. వెంకటేశ్వరరావు రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమయింది. కథ రొటీన్‌గా అలవాటయిన రీతిలో సాగినా ఆసక్తికరంగా చదివిస్తుంది. చక్కని సందేశం ఇస్తుంది. ఓ డాక్టర్ దగ్గరకు సుబ్బారావు అనే రోగి వస్తాడు. రిటైరయిన ఆయన జీవితాన్ని హాయిగా ఎంజాయ్ చేస్తూంటాడు. అదే సమయంలో ఓ వ్యక్తి డాక్టర్ దగ్గరకు వస్తాడు. ఇరవై ఏళ్ళకే అతడి కొడుక్కి ఘోరమైన వ్యాధి వస్తుంది. ఇది సుబ్బారావులో పరివర్తన తెస్తుంది. ఆ అబ్బాయి చికిత్సకు సహాయం చేస్తాడు. చక్కని కథ ఇది. వేగంగా సాగుతుంది. అయితే, కథంతా అయిపోయిన తరువాత చివరికి రచయిత ఓ పదిలైన్ల వ్యాఖ్యానాన్ని జోడించకుండా ఉండే కథ ప్రభావం ఇంకా బాగా ఉండేది. రచయిత చెప్పదలచుకున్న విషయం కథ స్పష్టంగా చెప్పేసింది. మళ్ళీ ప్రత్యేకంగా పనికట్టుకుని వివరణ ఇవ్వాల్సిన అవసరంలేదు.

<u>మార్గదర్శి:</u>

స్వాతి మాసపత్రికలో ప్రచురితమయిన ఈ కథ రచయిత అనామకుడు. ఈ కథలో ప్రధాన పాత్ర చాలాకాలం తరువాత విదేశాల నుంచి భారత్ వస్తాడు. ఇక్కడంతా మారిపోవటం చూస్తాడు. అయితే, ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే అతడికి మార్గదర్శనం అవసరం. ఓ క్లిష్టమైన పరిస్థితిలో పల్లీలు పొట్లంలో కనిపించిన వ్యాఖ్య ఇచ్చిన స్ఫూర్తితో అతడు విదేశాలు వెళతాడు. ఇప్పుడు మళ్ళీ వెళ్ళిపోవాలా, ఇక్కడ ఉండిపోవాలా అన్న నిర్ణయం తీసుకోవటానికి కూడా పల్లీలు కొని పొట్లాం చూస్తాడు. అది ఖాళీగా ఉంటుంది. దాంతో, ఏం చేయాలో దిక్కుతోచని అతడికి అతని సోదరి నిజానిజాలు వివరిస్తుంది. 'ఎవరికైనా మార్గదర్శి ఎక్కడో కాగితంలో ఉండదు. వాళ్ళలోనే ఉంటుంది. నీకు ఇదిగో ఇక్కడ ఉంటుంది. అది చెప్పేది విను. నీ మార్గం నీకే తెలుస్తుంది' అంటుంది. అతడి గుండెవైపు చూపుతూ. బాహ్య ప్రేరణలు ఎంతగా పనిచేసినా అంతః ప్రేరణ లేనిదే ఎలాంటి మార్గదర్శకత్వమయినా పనికిరాదని అత్యంత సున్నితంగా చూపిస్తుందీ కథ. మనిషికి అతడి మనసే అతి అసలైన మార్గదర్శి అని అతిగొప్పగా ప్రదర్శిస్తుందీ కథ.

<u>ప్రజల మనిషి</u>

పెన్మెత్స శ్రీకాంత్ రాజు రచించిన ఈ కథ జూలై 14, నవ్య సంచికలో ప్రచురితమయింది. ఈ కథను ఓ ప్రజానాయకుడు చెపుతుంటాడు. అందరూ అతడిని ఎందుకు గౌరవించి, ఆదరిస్తూంటారంటే, అతడు తక్కువ అవినీతి పరుడు. ఆయన నియోజక వర్గానికి వరద నీరు వస్తుంటే, మీడియాని పిలిచి, తాను చేస్తున్న సహాయం ద్వారా మరింత మంచిపేరు సంపాదించాలనుకుంటాడు. కానీ, వరద నీరు పెరుగుతుంది. అతణ్ణి ప్రాణం ప్రమాదంలో పడుతుంది. అప్పుడు గురవయ్య అనే ఆయన, అతడి పక్కన ఉన్న స్త్రీని వదలి ఇతడిని రక్షిస్తాడు ఆ స్త్రీ తన భార్య అయినా, ఆమె మరణం తనకొక్కడికే నష్టమనీ, ఎమ్మెల్యే మరణం ప్రజలకు నష్టమనీ అతడీ నిర్ణయం తీసుకుంటాడు. ఇది ఎమ్మెల్యేకు కనువిప్పు కలిగిస్తుంది. కథ చాలా ఆసక్తికరంగా సాగుతుంది. నిజానికి అతిదగ్గరగా ఉంటూ కాల్పనిక ప్రపంచంలో విహరించి చక్కని సందేశాన్ని హత్తుకునేట్టు ప్రదర్శిస్తుంది. ఇదే ఈ నెల మంచి కథ.

### ఈనెల కథ

ప్రజల మనిషి - పెన్మెత్స శ్రీకాంత్ రాజు

**జూలై 14, నవ్య వార పత్రిక ౨౦౧౦ సంచిక నుంచి**

**సెల్ ఫోన్ రింగవుతోంది. నెంబరు చూసాను. అది రమణది.**

"చెప్పు రమణా.." అన్నాను ఫోను చెవికి ఆన్చి.

"సార్.. వయ్యేరు మీద రెండేళ్ళక్రితం కట్టిన డామ్... పగుళ్ళిచ్చిందట.

మన నియోజక వర్గంలోని వాడపాలెం గ్రామం ఆ డామ్‌కి దిగువన ఉండటంతో ఊళ్ళోకి నీళ్ళొస్తున్నాయి.."

"ఎప్పట్నుంచి..."

"ఓ గంట క్రితం నుండీ. మీరు ఎక్కడున్నారు? హైదరాబాద్‌లోనా?!.."

"లేదు రమణా.. వాడపాలెంకు పాతిక కిలోమీటర్ల దూరంలో ఓ స్నేహితుడి గెస్టుహౌస్‌లో ఉన్నాను. ఓ అరగంటలో అక్కడకి వస్తాను. మన వాళ్ళందర్ని తీసుకుని వాడపాలెం వెళ్ళు. అన్నీ మనమే చెయ్యాలి.." అన్నా ను 'మనమే' అన్న పదాన్ని నొక్కి పలుకుతూ.

ఒకవైపు అతనితో మాట్లాడుతూనే ఈ ఇష్యూని ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించసాగాను. ఇంకో ఆర్నెలల్లో ఎలక్షన్లు ఉన్నాయి. సో.. ప్రజలకు దగ్గరవటానికి ఇదో మంచి ఛాన్సు! వదులుకోకూడదు.

"ప్రెస్ వాళ్ళకి ఫోను చేసావా?!" అడిగాను.

"లేదు సార్.."

"వెంటనే చెయ్యి.." అని చెప్పి ఫోను కట్ చేసాను.

"ఏమయింది?!... అడిగాడు నన్ను. అతను నా క్లోజ్ ఫ్రెండ్స్‌లో ఒకడు. చెప్పేను వాడపాలెం సంగతి.

"అరే.. ఇప్పుడు నువ్వెళ్ళాలా?! నీకోసం ఈ రోజు ఈవినింగ్ బ్రహ్మాండమైన పార్టీ అరేంజ్ చేసాను. వెళ్ళిపోతే ఎలా?! " నిరుత్సాహంగా అన్నాడు మధుకర్.

"వెళ్ళాలి మధు. ఇలాంటి అవకాశాలు తరచూరావు. వచ్చినప్పుడు ఉపయోగించుకోవాలి. పార్టీ ఎప్పుడన్నా ఏర్పాటు చేసుకోవచ్చు. నా నియోజక వర్గంలో నాలుగువేల ఓటరులున్న గ్రామం వాడపాలెం. అక్కడ ఇప్పుడు కాస్త ఓవరేక్షన్ చేసామనుకో.. పిచ్చి జనం ఎలక్షన్లలో మనకే గుద్దేస్తారు ఓట్లు. ఎలక్షన్లప్పుడు నోట్ల కట్టలు పంచినా రాని గుడ్‌విల్ ఇలాంటప్పుడు అక్కడ నిలబడితే చాలు వచ్చితీరుతుంది. అంతేకాకుండా వాళ్ళ మనసుల్లో మనపైన మంచి అభిప్రాయం ఓ ముద్రలా అలా పడి ఉంటుంది.." కన్నుకొట్టి నవ్వేను.

"నీ బుర్రలో ఉన్నది మెదడుకాదు పాదరసం, అందుకే ముప్పయ్ ఏళ్ళకే ఎం.ఎల్.ఏ అయి కూర్చున్నావు.." మెచ్చుకోలుగా అన్నాడు మధుకర్.

కాసేపటి తర్వాత నేనెక్కిన కారు వాడపాలెం వైపు దూసుకుపోతుంది.

పదేళ్ళక్రితం బి.ఏ. డిగ్రీ తప్ప నా చేతిలో చిల్లిగవ్వలేదు. ఉద్యోగాల కంటే రాజకీయాలే లాభదాయక మనిపించి ఓ రాజకీయ నాయకుడికి అనుచరుడిగా మారాను. బి.ఏ.లో చరిత్ర చదివిన నేను ఆ నాయకుడి ఆకస్మిక మరణంతో పరిస్థితిని నాకు అనుకూలంగా మార్చుకుని ఉప ఎన్నికలలో టిక్కెట్ దక్కించుకుని ఎం.ఎల్.ఏ అయ్యాను.

అతి సర్వత్రా వర్జయేత్ అనేది నా సిద్ధాంతం. వంద రూపాయల్లో పది రూపాయలు కమిషన్ కొట్టు ఎవరికీ దొరకవు. యాభై కొట్టేస్తే దొరికి పోతావు. పదితో సరిపెట్టుకో.. పదికాలాలు బావుంటావు - ఇది నా వాళ్ళకి చెప్పి, నేను కూడా పాటించే నియమం. అదే నాకు శ్రీరామరక్ష!

పేదల బియ్యంలో నుండి - రోడ్డు కాంట్రాక్టుల వరకు ప్రతి దాంట్లోను నా కమిషన్ నాకుంది. నా వాళ్ళకి కాంట్రాక్టులు ఇప్పించుకున్నా.. కమిషనులు పొందినా.. ఎక్కడా నా పేరు, ప్రస్తావనా లేకుండా.. చేతికి తడంటకుండా పావులు కదపడం నా ప్రత్యేకత.

నా నియోజక వర్గంలో పథకాల అమలు తీరు బాగుందని స్వయంగా ముఖ్యమంత్రిగారే ఈ మధ్య కితాబిచ్చారు. కారణం వందమందికి చేరవలసింది కనీసం ఎనభై మందికన్నా చేరుతోంది కాబట్టి! గుడ్డికంటే మెల్ల ఎప్పుడూ బెటరేగా!

వారి అభివృద్ధికోసం కృషి చేస్తున్న నన్ను, నా నియోజక వర్గ ప్రజలు దేవుడిలా కొలుస్తారు. పాలేర్ల భుజాలపై చేతులేసి ఆప్యాయంగా పలుకరించడం, దళిత స్త్రీల ఇళ్ళల్లో గంజి అన్నం తినడం, చురగ్గా ఉన్న వ్యక్తులను గుర్తుపెట్టుకుని వాళ్ళని పేర్లతో పిలవడం.. ఆడవాళ్ళతో అతి వినయంగా అమ్మా, అమ్మా అంటూ మాట్లాడటం... ఎలక్షన్లు లేకపోయినా మూడు నెలలకోసారి నియోజక వర్గంలో పర్యటించడం.. ప్రజలకు నన్ను దగ్గరచేస్తున్న నా గిమ్మిక్స్.

కారు వాడపాలెం చేరుకుంది. ఊరి బయట రమణతో పాటు మరో పదిహేను మంది నా అనుచరులు నా కోసం ఎదురు చూస్తున్నారు. కారు దిగి నేను వాళ్ళతో కలిసి ఊర్లోకి నడిచాను.

అప్పటికే అడుగు ఎత్తున నిలిచింది ఉంది ఊర్లో. నీళ్ళల్లో నడుస్తూ నేను వస్తుంటే ఆడామగా అందరూ నాకు నమస్కారాలు పెడుతున్నారు. కొందరిళ్ళలోకి అప్పటికే కొంచెం నీరొచ్చి చేరింది. ఆ ఊరిలో ఏడెనిమిది మేడలున్నాయి. ఓ ఇరవై వరకూ డాబాలున్నాయి. మిగిలినవి పెంకుటిల్లు, పూరి గుడిసెలు.

జనం సామాన్లు మంచాల మీద, బల్లల మీదా సర్దుకుంటున్నారు.

నీటిమట్టం క్రమ క్రమంగా పెరుగుతోంది. నీరు నా మోకాలిని తాకుతోంది. ఇంతలో టాటా సుమోలో ఓ టీ.వీ ఛానల్ బృందం కెమేరాలతో మైకులతో దిగింది.

నీళ్ళల్లో నిలబడి బిందెలందుకుంటూ, చీపురు కట్టలు చేరవేస్తూ చాలా సహజంగా ఫోటోలకు ఫోజులిచ్చాను. విలేఖరులు మైకులు నా సెల్‌ఫోన్ ప్రక్కన పెట్టగా, వాళ్ళ హేండీకామ్‌లు నన్ను కవర్ చేస్తుండగా.... ముఖ్యమంత్రిగారికి ఫోన్ చేసి... వాడపాలెం దుస్థితిని దీనాతిదీనంగా వివరించి.. తక్షణ సహాయం అందించాలని, ఆహార పొట్లాలు, మంచి నీళ్ళు పంపాలని అర్థించాను.

ఈ షూటింగ్ అంతా అయ్యాక చూస్తే నీరు నా మోకాలి పైభాగాన్ని తాకుతోంది. జనంలో ఆందోళన పెరుగుతోంది. నా గుండెలు దడదడా కొట్టుకోసాగాయి. ఇంచు మించు ఊరి మధ్యలో ఉన్నాను నేను. చుట్టూ నీరు నీటిపై తేలుతున్న పడవల్లా ఇళ్ళు! ఆందోళన ముఖం మీద కనిపించకుండా జాగ్రత్త పడుతూ.. అందరికీ ధైర్యం చెప్పసాగాను. నా అనుచరులతో కలిసి చిన్నపిల్లల్ని డాబా ఇళ్ళపైకి ఎక్కించాను. సామాన్లు జాగ్రత్త పరచుకునేవారికి ఉడతసాయం చేయసాగాను.

వరద నీటిలో కెరటాల్లాంటివి వచ్చినప్పుడు తూలి పోతున్నాను. ఇక అంత నీటిలో నిలబడడం కష్టమనిపించి.. ఓ ఎత్తు అరుగుల ఇంటివైపు వెళ్ళబోతుంటే ఆ ఇంటికి ఎదురుగా ఉన్న మరో ఇంటి అరుగు మీదున్న జనం.. "ఎమ్మెల్యేగారో ఇటు రండి.." అంటూ పిలిచారు.

ఆ ఇంటివాళ్ళు నాకు కుర్చీ వేసారు.

నేను తొడుక్కున్న ప్యాంటు దాదాపుగా తడిచిపోయి కూర్చుంటే ఇబ్బందిగా ఉంది. ఆ ఊర్లో నాకు బాగా తెలిసినవాళ్ళు, చురకైన యువకులు, నా అనుచరులు అందరూ పిచ్చాపాటి మొదలు పెట్టారు.

"ఇంతనీరు ఊళ్ళోకి రావటం.. నా యనభై ఏళ్ళ జీవితంలో ఇదే మొదటిసారి.." ఓ ముసలాయన వాపోయాడు.

"మనకిక్కడ నెలరోజుల నుండి ఒక్క చినుకూ రాల్లేదు. ఈ నీరెక్కడ్నుంచి వస్తోందబ్బా.." ఓ నడివయసాయన అబ్బురపడ్డాడు.

"ఎక్కడో కురిసిన వర్షానికి పోగయిన నీరంతా వయ్యేరులో జమ అవుతుంది. ఈ నీరంతా అదే" చెప్పేను.

"వడ్డెయ్య గాదెనిండా ధ్యాన్యం కొని పోసాడంట నిన్ననే. ఆడిల్లు పల్లంలో గదా.. అంతెత్తున కట్టిన గాదెలోకి నీళ్ళెల్లిపోతున్నాయంట... ఆడు, ఆడి పెళ్ళం బిడ్డలు లబోదిబోమంటున్నారు.." చెప్పాడు గురవయ్య.

గురవయ్య రోజు కూలి. వడ్డెయ్య ఆ ఊళ్ళో కూలి జట్టుకు మేస్త్రి.

"అయ్యో! పోని ధాన్యం తీయడానికి వీలవుతుందేమో చూద్దామా?!" అన్నాను. కాని మనసులో భయంగానే ఉంది వాళ్ళెక్కడ వెళదాం పదండి అంటారోనని.

"వీలవదయ్యా.. ధ్యాన్యం రాశిలా పోసారా గాదెలో! బస్తాలయితే ఏమయినా కుదురునేమో?!... " అన్నాడు గురవయ్య.

"చొ చ్చొ చ్చో.." అన్నాను పైకి బాధ నటిస్తూ.. వెళ్ళనక్కర్లేదని మనసులో ఆనందపడుతూ...

గురవయ్యకు స్వంత ఇంటి పథకంలో ఇల్లు కట్టుకోటానికి అప్పు ఇప్పించాను. నన్ను చూడగానే, అందుకే అతని ముఖం కృతజ్ఞతతో నిండిపోతుంది. ఆ డబ్బేదో నా జేబులోంచి ఇచ్చారనుకుంటారో ఏంటో ఈ అలగాజనం! అది వాళ్ళకు రాజ్యాంగ బద్ధమైన, ప్రభుత్వపరమైన వెసులుబాటని వాళ్ళకు అర్థం కాకుండా ఉన్నంతకాలం మా బోటివాళ్ళం నడిచే దేవుళ్ళగా కొలవబడుతూనే ఉంటాం.

ఇంతలో ఏదో ధనాల్ మన్న చప్పుడు. సినిమా సెట్టింగ్ కూలిపోయినట్టు ఆ ఎత్తు అరుగుల ఇల్లు నేలమట్టమయింది.

ఆ ఇంటి అరుగు మీద అప్పటివరకూ కబుర్లు చెపుతూ నిలబడ్డ పదిమంది మనుషులు నా కళ్ళముందే ఆ శిధిలాల క్రింద చిక్కుకున్నారు.... ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. అంతా బీభత్సమయమైపోయింది.

వెన్నులోంచి వణుకు మొదలైయింది నాకు. ఏదో మంచి పేరు తెచ్చేసుకుందామని వెనుకా ముందు చూసుకోకుండా, జాగ్రత్తలేవీ తీసుకోకుండా ఇక్కడి కొచ్చి నేనెంత పెద్ద తప్పు చేసానో అర్థంకాసాగింది. అసలు నేను ముందుగా ఆ ఇంటి అరుగు మీద నిలబడొచ్చని, అటువైపు వెళ్ళాను. జనం పిలవబట్టి ఈ ఇంటివైపొచ్చాను. అటే వెళ్ళి ఉంటే, ఈ పాటికి నేను కూడా సజీవ సమాధి అయ్యేవాడిని.

అరుపులు రోదనలతో ఆ ప్రదేశమంతా గంగరగోళంగా ఉంది. కొంతమంది యువకులు ఆ శిధిలాలు తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎవరూ నన్ను పట్టించుకోవటం లేదు. ఎవరి హడావిడిలో వాళ్ళున్నారు. అయినా వాళ్ళందరికి ధైర్యం చెప్పి ముందుకు నడిపే స్థితిలో నేను లేను. ధైర్యంగా ఉన్నట్టు నటించడానిక్కూడా నాకు ధైర్యం లేదు.

అప్పటివరకూ కనపడని రమణ హఠాత్తుగా నా ప్రక్కన ప్రత్యక్షమయ్యాడు. నన్నో ప్రక్కకు తీసుకొచ్చి... "సార్... ముఖ్యమంత్రిగారికి మళ్ళీ ఫోను చేయండి.. తక్షణ సాయం అందేలా పరిస్థితిని వివరించండి".

వెంటనే సెల్ తీసి ముఖ్యమంత్రిగారికి రింగ్ చేసాను. సిగ్నల్ లేదు! కొన్ని గంటల క్రితం ఉంది! ఇప్పుడు లేదు.

"సిగ్నల్ లేదు.." చెప్పాను రమణతో. నా గొంతులోని వణుకుని దాయటానికి ప్రయత్నించలేదు.

"పరిస్థితి ఇంతదారుణంగా ఉంటుందనుకో లేదు.." అతని ముఖం నిండా ఆందోళన. ప్రాణం ఎవరికైనా తీపేగా! అందుకు రమణ అయినా, నేనైనా మినహాయింపెలా అవుతాం.

నిజమే! నేనూ ఇంత ప్రమాదాన్ని ఊహించలేదు. వయ్యేరు ఓ చిన్న జలపాతం లాంటిది. ఏదో కొంచెం నీళ్ళొస్తాయి వెళ్ళిపోతాయి అనుకున్నాను గాని ఇంత ప్రమాదాన్ని శంకించలేదు.

"మిమ్మల్ని ఏదైనా మేడపైకు చేరుస్తాను. సిగ్నల్ దొరగ్గానే ముఖ్యమంత్రిగార్ని హెలీకాప్టర్ పంపమని చెప్పండి. అందులో మనం వెళ్ళిపోవచ్చు.." అన్నాడు రమణ.

రమణ మాటలు నాకు బాగా నచ్చాయి. ఎందుకంటే ఇప్పుడు నా తక్షణ కర్తవ్యం ఇక్కడ్నుంచి ప్రాణాలతో బయటపడటం. ప్రాణాలుంటేనేగా పదవులైనా, పీఠాలైనా..

మేం అక్కడ్నుంచి కదలబోతున్న ఉత్తర క్షణంలో.. ఫెళ ఫెళ మంటూ, భూమి పగిలిపోతోందో... ఆకాశం విరిగిపోతోందో అన్నంత శబ్దం వచ్చి ఆ ప్రదేశం కంపించిపోయింది.

"సార్.. మబ్బులు మెరుపులు లేకుండా.. భయంకరమైన ఉరుములాంటి ఆ చప్పుడేంటి?!.." రమణ ఆశ్చర్యంగా అన్నాడు.

''మైగాడ్ ఆ డామ్ కాని పగిలి పోలేదు కదా?!'' ఆదుర్దాగా అన్నాను. అంతలోనే.. నా మాట పూర్తయ్యీ కాకుండానే.. నోరు తెరుచుకున్న తిమింగలంలా ఇరవై అడుగుల ఎత్తున్న కెరటం, ఎగిరిపడ్డ సముద్రంలా ఊరిని ముంచెత్తేసింది.

నన్నెవరో బంతిలా చుట్టి ఎక్కడికో విసిరేసారేమో అనిపిస్తోంది. నా శరీరం బరువు కోల్పోయి.. రంగులరాట్నంలో కూర్చున్నట్టు.. నా ప్రమేయం లేకుండానే గుండ్రంగా తిరిగిపోతోంది. కాళ్ళు చేతులు ఆధారం కోసం కొట్టుకుంటున్నాయి. కళ్ళెప్పుడో మూసేసుకున్నాను. ఊపిరి దానంతట అదే బిగిసిపోయింది. ఇంకొన్ని క్షణాలు. అంతే! నేను ఇక చనిపోబోతున్నాను.

ఎన్నికలలు కన్నాను.

రాజకీయాలలో ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనుకున్నాను. కాని చివరికి అన్నీ ఇలా నీళ్ళల్లో కలిసిపోతున్నాయి.

ఈత రాకపోయినా.. వచ్చినట్టుగా నా కాళ్ళుచేతులు కదులుతున్నాయి. నీళ్ళలో కొన్ని క్షణాల క్రితం ఫోర్స్ ఇప్పుడు లేదు.

నా చేతికి ఏదో తగులుతోంది. ఏమిటది!? ఏదైనా కాని వదలకూడదు. గట్టిగా పట్టుకున్నాను. తల కొంచెం పైకెత్తాను. నా తల నీళ్ళల్లోంచి పైకొచ్చేసింది. గుండెల నిండా ఊపిరి పీల్చుకుని చుట్టూ చూసాను. నేను ఆధారంగా పట్టుకున్నది ఓ మేడకున్న కిటికీ పైన ఆర్చీలా ఉంది ఆ ఉడెన్ సన్‌షేడ్ నా మెడ క్రింద భాగమంతా నీళ్ళలోనే ఉంది. ఆ కిటికీ సన్‌షేడ్‌ని ఒక ప్రక్క నేను పట్టుకుని వ్రేలాడుతుంటే.. మరోప్రక్క ఎవరో ఆడమనిషి నాలానే అదే సన్ షేడ్‌ని ఆధారంగా చేసుకుని ఊపిరి పీలుస్తోంది. సన్ షేడ్ ఈ చివరనున్న నాకు, ఆ చివరనున్న ఆమెకు మధ్య ఉన్న దూరం మూడడుగులే! ఆ ఆడమనిషి ముఖంలోని భయం ఆందోళన నాకు స్పష్టంగా కనిపిస్తున్నాయి! నేనున్నదీ అదే స్థితి!

ఆ మేడ నలభై సంవత్సరాల క్రితం కట్టినది. చుట్టూ పది అడుగుల ఎత్తున నీరు నిలిచింది. ఆ మేడపైన డాబా మీద మనుషులున్నట్టు అలికిడి తెలుస్తోంది. ఎవరైన ఇటుచూస్తే బావుండును. ఇద్దరు మనుషులను మోయలేక ఈ పాత కిటికీపై నిర్మాణం... కిర్రు కిర్రుమంటూ చప్పుడు చేస్తూ ఏ క్షణమైన గోడనుండి ఊడి నీళ్ళల్లో పడిపోయేలా ఉంది.

ప్రాణాలరచేతిలో పెట్టుకోవడమంటే ఏంటో తెలిసొస్తోంది. గుర్తొచ్చిన ప్రతి దేవుడికి మొక్కుకోసాగాను. ''ఎవరైనా ఇటు చూడండి.. తాడేదైనా వేసి రక్షించండి'' అనసాగాను. చిత్రంగా మాటపడిపోయినట్టు నోట్లోంచి శబ్దం రావడం లేదు.

డాబా పైనుండి ఎవరివో మాటలు వినిపించసాగాయి. వాళ్ళల్లో తన వాళ్ళ గొంతు గుర్తుపట్టిందో ఏమో ఆ ఆడమనిషి. ''ఏమయ్యో..'' అని శరీరం ఏ మాత్రం కదలకుండా గొంతు చించుకుని అరిచింది.

''ఎవరది?..'' అంటూ ఎవరో డాబా పైనుండి క్రిందకు చూస్తున్నారు.

మేము పట్టుకున్న ఉడెన్ సన్ షేడ్‌ని గోడకి పట్టి ఉంచిన మేకులు క్రిందకు జారడం తెలుస్తోంది.

''ఏమే పోశమ్మా! కంగారు పడకు. తాడెత్తాను. పట్టుకుని వద్దువుగాని..'' అంటున్నాడో మగవ్యక్తి. అతను గురవయ్య.

ఒక్క క్షణం నన్ను ఆనందం చుట్టుముట్టింది.

''గురవయ్యా!..'' స్వరపేటికను చీల్చుకుని నా గొంతునుండి వచ్చిందా కేక.

''అయ్యా.. మీరా?!..'' గురవయ్య గొంతులో ఆదుర్దా..

అయిపోయింది.. ఇంకొన్ని సెకన్లు .. అంతే.. ఆ చెక్క నిర్మాణం విరిగి నీట్లో పడిపోవటం ఖాయం. ఊపిరి బిగపట్టేసాను భయంతో...

ఇంతలో.. కటిక చీకట్లో కాంతిరేఖలా పైనుండి తాడొస్తుంది. తాడు పొట్టిగా ఉన్నట్టుంది. ఆ చివరని తన చేతికే చుట్టుకున్నాడు గురవయ్య. పైన చిన్నపిల్లలు, స్త్రీలు తప్ప గురవయ్యకు సాయంగా నిలబడగలిగే మగాళ్ళెవరూ ఉన్నట్టులేరు. గురవయ్యే తన బాహుబలాన్ని ఉపయోగించి పైకి లాగాలి నన్ను.

మా ఇద్దరిలో ఒకర్ని ముందు రక్షించి తర్వాత మరొకర్ని రక్షించేటంత సమయంలేదు. మా ఇద్దరిలో ఎవరో ఒకరే రక్షించబడతారు.

త్రాడు క్రిందకొస్తోంది. ఆ ఆడమనిషి కళ్ళల్లో బ్రతకబోతున్నానన్న ఆశ! నాకు జాలేసింది. ఆమె అత్యాశకు. నాకు తెలుసు ఆ త్రాడు వస్తున్నది నాకోసం! నన్ను బ్రతికించడానికి!

నా అంచనాలను తల్లక్రిందులు చేస్తూ.. త్రాడు ఆ ఆడమనిషి ఉన్న వైపు జారసాగింది. నా మనసంతా ఆదుర్దాతో నిండిపోయింది! త్రాడు ఆమెకు చేరువవుతుంటే కనిపించని యమపాశం నా వైపు వస్తున్నట్టనిపించ సాగింది. వెన్ను జలదరిస్తోంది భయంతో..

గురవయ్య ఇంత మూర్ఖుడా!?

కొంచెం పిచ్చికూడా ఉందేమో!? ఆ కూలిదాన్ని రక్షిస్తే అతనికేమొస్తుంది!? అదే నన్ను రక్షిస్తే అతన్ని డబ్బులో ముంచెత్తగలడు. జీవితాంతం కాలు క్రింద పెట్టకుండా గడిపేటంత సంపద నజరానాగా ఇవ్వగలడు!

అనూహ్యంగా గురవయ్య మూర్ఖుడు కాడు, బ్రతక నేర్చిన వాడేనని నిరూపిస్తూ త్రాడు నా వైపు కొచ్చింది. పట్టేసుకున్నాను. అప్రయత్నంగా కించిత్ గర్వంగా ఆ ఆడమనిషి వైపు చూసాను. ఆ కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. అదేంటో చిత్రంగా ప్రపంచంలోని ఆశ్చర్యమంతా ఆమె కళ్ళల్లోనే ఉన్నట్టనిపించింది.

అసలా ఆడమనిషి అంతలావున ఆశ్చర్యపోవటానికేముంది?! ఆ కూలి దాని ప్రాణం కంటే ఎం.ఎల్.ఏ.ని అయిన నా ప్రాణాలు విలువైనవని బుర్రన్న ఎవరైనా ఒప్పుకుంటారు. నన్ను కాక తనని రక్షిస్తాడని ఆ మనిషి అసలెలా అనుకుంది?! గురవయ్య నన్ను రక్షించాలన్న తెలివైన నిర్ణయం తీసుకుని తన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకున్నాడు. నేను క్రమ క్రమంగా పైకి లాగబడుతుంటే... ప్రమాదం నుండి దూరంగా జరపబడుతుంటే.. ఆ ఆడమనిషి ఆశ్చర్యంగా అలా చూస్తోంటే... ఏదో తెలియని గర్వం నా పెదాలపై చిరునవ్వులా ప్రాకింది.

నా బరువంతా తన చేతులతో మోస్తూ త్రాడు లాగుతున్నాడు గురవయ్య. ఒకరిద్దరు స్త్రీలు పిల్లలు గురవయ్యకు ఉడతా సాయం చేస్తున్నారు. అంత కష్టమైన పని బలవంతుడైన గురవయ్య వల్ల అయింది కాని మరొకరైతే మధ్యలో వదిలేసును! నేను పిట్టగోడ పట్టుకుని... కాలు డాబాపై మోపుతుంటే.. నా వెనుక చప్పుడైయింది. బహుశ.. ఆ కిటికీ మీది ఉడెన్ సన్ షేడ్ నీట కలిసి ఉంటుంది. ఆ ఆడమనిషితో సహా!

నాకు స్పృహ తప్పుతున్నట్టుగా ఉంది. ఏది ఏమైనా... ప్రాణాలతోనే ఉన్నాను. అది చాలు. నా కళ్ళుమూతలు పడ్డాయి.

కొన్ని గంటల తర్వాత...

గోలగోలగా వినిపిస్తున్న రోదనలకు స్పృహ వచ్చింది. మేడ దిగి రోడ్డు మీదకు వచ్చాను. ఎలా వచ్చిందో అలానే వెళ్ళిపోయింది నీరు. ఊరుని వల్లకాడుగా మార్చేసి!

ఎక్కడపడితే అక్కడ చెల్లాచెదురుగా మృతదేహాలు. గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న బంధువులు.

ఇంతలో నాకు పరిచయమున్న గొంతు.. "పోశమ్మా.. పోశమ్మా నన్ను అట్టా సూడకే పోశమ్మా.."

ఆ గొంతు గురవయ్యది.

"గురవయ్యా.." అంటూ ఆ దిశగా పరుగెత్తాను.

అతని ఒళ్ళో ఓ స్త్రీ మూర్తి విగత శరీరం! ఆ స్త్రీ మరెవరో కాదు నాతో పాటు కిటికీ సన్ షేడ్ పట్టుకుని.. మృత్యువుతో పోరాడి ఓడిపోయిన ఆ ఆడమనిషి! గురవయ్య ఆదుకోకపోతే నేనూ అదే స్థానంలో ఉండేవాడిని.

"అయ్యా.. నన్నలా సూడొద్దని సెప్పండయ్యా.. నన్నలా సూడొద్దని సెప్పండి.." భోరుమన్నాడు గురవయ్య నన్ను చూసి.

అప్రయత్నంగా ఆ స్త్రీ ముఖంవైపు చూసి నేను ఉలిక్కిపడ్డాను. త్రాడు ఆఖరి క్షణంలో నా వైపు కదిలినప్పుడు ఆమె కళ్ళల్లో కదలాడిన ఆశ్చర్యం అలానే ఉండిపోయింది చనిపోయాక కూడా మూసుకోని ఆ నయనాల్లో!

"అర్ధం సేసుకోవే పోశమ్మా. నువ్వు నా పెళ్ళానివే. నువ్వు సచ్చిపోతే దిక్కులేకుండా పోయేది నేనూ, నా పిల్లలేనే! కాని అయ్య సచ్చిపోతే వేల మందికి దిక్కుండదే! అందుకే నిన్ను బలిచ్చి ఆ బాబుని బ్రతికిచ్చేనే! ఆయన ప్రజల మనిషే. ప్రజల మనిషి! మన పానాల కంటే, ప్రజల కోసం బతికే ఆ బాబు పానాలు ఎంతో ఇలువైనియ్యే! అర్ధం సేసుకోవే.. పోశమ్మా! నన్నలా సూడకే.." పొగిలి రోదిస్తున్నాడు గురవయ్య.

ప్రళయకాల ఝుంఝూమారుతం, సెగలు పొగలు కక్కుతూ నన్ను చుట్టేస్తున్న భావన!

పోశమ్మ గురవయ్య - భార్యా?!

భార్యని బలిచ్చి నన్ను రక్షించేడా?!

నేను..నే..ను..ప్రజల మనిషినా?!

త్యాగం అంటే ఇదా!? ఇంత భరించలేనట్టుగా ఉంటుందా?!

ఆపుకోలేనంత దుఃఖం వస్తోంది. గట్టిగా ఏడవాలనుంది. మళ్ళీ ఎందుకో నవ్వొస్తోంది.

ఓ కూలీ తన అర్ధాంగిని బలి ఇచ్చి పెట్టిన భిక్ష నా ప్రాణాలు. ఓ దీనురాలు నిస్సహాయంగా నీళ్ళల్లో కలిసిపోతూ ప్రసాదించిన పునర్జన్మ ఇది!

శిలా ప్రతిమలా గురవయ్యను చూస్తుండిపోయాను. మనసంతా పిండేస్తున్నట్టు వేదన! ఇంతవేదన భరించటం కన్నా ఆ వరదలో కొట్టుకుపోయి చచ్చిపోయినా బావుండేదనిపిస్తోంది.

అయినా నేను బ్రతికున్నానా?!

లేదు.. లేదు.. చచ్చిపోయానుగా!

భార్యని నా కోసం బలిచ్చి, ఆ శవాన్ని ఒళ్ళో ఉంచుకుని 'ప్రజల మనిషి' అనే పదానికి, గురవయ్య అర్ధం వివరించినప్పుడే విని తట్టుకోలేక అక్కడికక్కడే చచ్చిపోయాను కదా

ఇక ఆ 'పాత నేను' ఎక్కడున్నాను?! లేను..

***




## ఆగస్ట్ 2010

**కథాసాగర మథనంలో విశ్లేషణకు** ఆగస్టు నెలలో, దినపత్రికలు ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, సాక్షి, ఆంధ్రప్రభల ఆదివారం అనుబంధాలు, వారపత్రికలు స్వాతి, నవ్య, ఆంధ్రభూమి మాసపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, రచన, విపుల, చిత్ర, పాలపిట్టలలో ప్రచురితమైన 96 కథలలోంచి మొత్తం 9 కథలను ఎంచుకున్నాను.

ఒక కథ బాగుందని అనిపించటం, అత్యద్భుతం అనిపించటం కథలో ఉన్న అంశాన్ని పాఠకుడి మనస్సు గ్రహించటంపై ఆధారపడి ఉంటుంది. అత్యధికుల మనస్సులను స్పందింప చేయగల కథ ప్రాచుర్యం పొందుతుంది. ఒకోసారి, తొలిసారి చదివితే నచ్చని కథ, కొంతకాలం తరువాత చదివితే ఎంతో గొప్పగా అనిపిస్తుంది. మొదటి సారి అద్భుతం అనిపించిన కథ కొన్నాళ్ళకి చప్పగా, పేలవంగా అనిపించే వీలుంది. కొన్ని కథలు ఎన్ని మార్లు చదివినా అద్భుతం అనిపిస్తాయి. కాబట్టి ఒక కథ 'బాగుంది' అని నిర్ణయించటం కత్తిమీద సాము వంటిది. కథను పలుమార్లు చదివి పలుకోణాలలో దాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. కొన్ని కథలలో గొప్ప అంశం లేకున్నా వాటిని చెప్పిన తీరు ఆ కథను పరమ రమణీయమైన కథగా నిలుపుతుంది. కొన్ని కథలలో అంశం బాగానే అనిపించినా, రచయిత, పలు అప్రస్తుత అంశాలను చొప్పించి కథను దెబ్బతీయవచ్చు. రచయిత దృష్టిలో ఆ అంశాలు తన అభిప్రాయ వ్యక్తీకరణలో భాగం. పాఠకుడికి అవి స్పీడ్ బ్రేకర్లు.

<u>*వర్తమాన చిత్రపటం*</u>

8 ఆగస్టు వార్తలో ప్రచురితమైన ఈ కథను రచించింది డా.బి.వి.ఎన్ స్వామి. భార్య మరణం తరువాత తమ ఊరు వెళ్ళి, తమ పురాతన ఇల్లున్న స్థలంలో ఆమె గుర్తుగా ఓ సమాధి కట్టాలనుకుంటాడు. కానీ ఊరి మధ్యలో సమాధి బాగుండదంటే విగ్రహం నెలకొల్పాలనుకుంటాడు. వాళ్ళిద్దరూ గతంలో అందరినీ ఎదిరించి ఊరు వదిలి వచ్చిన వారు. ఈ మామూలు కథ ద్వారా రచయిత కొన్ని సమకాలీన రాజకీయ, సామాజికాంశాలపై తన అభిప్రాయాన్ని చెప్పాలని ప్రయత్నించారు. దాంతో ఈ కథ అటు మనస్సుని కదిలించే ప్రేమ కథగా ఎదగలేక, సామాజిక అంశాలపై అవగాహన కలిగించే మంచి కథగా మిగలలేక రెంటికి చెడ్డ రేవడిగా అయింది. పక్కింటి భార్యా భర్తల నడుమ పోరాటాన్ని తెలంగాణా వాదానికి ముడిపెట్టడం, రోడ్డుపై బైఠాయించి భోజనాలు చేసే ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే నిరసనను 'నిర్మాణాత్మక శాంతియుత నిరసన' అని పొగడటం, చివర్లో హఠాత్తుగా 'అసమానత్వం ప్రాంతాల మధ్య, వ్యక్తుల మధ్య వ్యవస్థీకృతం అవటం అనుభవానికి వచ్చేసింద'ని తేల్చటం చూస్తే రచయిత కథను కథగా ఎదగనీయలేక, వ్యాసాన్ని కథగా రాయలేక పోయారన్న భావన కలుగుతుంది. కథను కథగా రాయలేని, చూడలేని తెలుగు సాహిత్య పరిస్థితికి దర్పణం పడుతుందీ కథ.

<u>*గాంధీ*</u>

ఆగస్టు 1, వార్తలో ప్రచురితమైన ఈ కథను రచించింది సలీం. మన సాహిత్యకారుల సందిగ్ధాలకు అద్దం పడుతుందీ కథ. భాషలకు భిన్నంగా తెలుగులో హింస ఉద్యమాల సమర్ధననే అభ్యుదయవాదం, అలాంటి వారే ప్రోగ్రెస్సివ్ రచయితలు అన్న అభిప్రాయం

నెలకొని ఉంది. దాంతో ఇలాంటి హింసావాదాన్ని సమర్థించే కథలు రాస్తేనే పదిమందిలో గుర్తింపు వస్తుంది. కానీ సంపూర్ణంగా హింసావాదాన్నీ మనస్సాక్షి ఉన్న రచయిత సమర్థించలేడు. ఈ దారిలో అటూ ఇటూ కాకుండా రచనలు చేయాల్సి వస్తుంది. ఈ కథలో 'గాంధీ' అనే పాత్ర మంచి పాత్ర. అన్యాయాన్ని సహించలేడు. ప్రతి విషయానికీ వేగంగా స్పందిస్తుంటాడు గాంధీ. ఏదో పనిమీద నిర్మల్ వెళతాడు. కానీ పోలీసులు నక్సలైట్ అని అతడిని చంపేస్తారు. అతడు నక్సలైట్ కాదని నిరూపించేందుకు అతడి భార్య సిద్ధమవుతూంటుంది. అయితే, ఈ కథలో రచయిత అటు పూర్తిగా పోలీసులదే తప్పు అని మామూలు హింసావాద సమర్థక రచయితలలా తీర్మానించలేక పోయాడు. అలాగని నక్సలైట్లందరూ పేదలకోసం పోరాడుతున్నవాళ్ళు అన్న సందేహం జనించే రీతిలో చివరి వాక్యం రాసి వదిలేశారు. దాంతో రచయిత ఈ కథలో ఏం చెప్పదలచుకున్నారన్నది సందేహాస్పదంగా మిగిలిపోయింది. ఇటీవలె ఓ జర్నలిస్టును పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చంపిన ఉదంతం ఈ కథకు ప్రేరణ. కానీ, రచయిత తాను చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా నిశ్చయించుకోక సమతుల్యం సాధించాలని ప్రయత్నించటంతో ఇది అటూ ఇటూ కాని వార్తలాంటి కథలా, ఎలాంటి ప్రభావాన్నీ చూపని వ్యాఖ్యలా మిగిలిపోయింది.

*చాకలి పద్దు*

ఆగస్టు 22, వార్తలో ప్రచురితమైన ఈ కథను రచించింది నండూరి శ్రీనివాస్. ఇది అచ్చమైన కథ. వాదాలు, వివాదాలు, గోడమీద పిల్లులు లేని కథ, బూరయ్య అనే చాకలాయనకి, తను దొర శాలువాపై మరక తొలగించటం సమస్య అవుతుంది. ఆ శాలువా దొరకు అతడి భార్య బహుమతిగా ఇస్తుంది. ఆ మరక తొలిగించే పద్ధతి కనుకునేందుకు పట్నానికి వస్తాడు అష్టకష్టాలు పడి మరక తొలిగిస్తాడు. తీరా అది అందించే సరికి దొర మరణిస్తాడు. శాలువాను అతడి పై కప్పటంతో కథ పూర్తవుతుంది. ఎలాంటి ద్వేషాలు, అణచివేతలు, ఆర్తనాదాలు లేకుండా మనిషి జీవితాన్ని, బాధ్యతను, చేస్తున్న పనిపై చిత్త శుద్ధి ఉంటే మనస్సులలో కలిగే మధుర భావనని చక్కగా, ఆర్ద్రంగా ప్రదర్శిస్తుందీ కథ. చదివిన చాలా సేపటి వరకూ మనసు ఏదోలా అయిపోతుంది.

*వీళ్ళింతే.*

ఆగస్టు 25, నవ్య వారపత్రికలో ప్రచురితమైన ఈ కథను రచించింది బి.వి.భద్ర గిరీష్. ఓ అనాథ శరణాలయంలో ఓ ధనవంతుడి కొడుకు పుట్టిన రోజు పార్టీ జరుపుకుంటాడు. ఎందుకంటే, అతడి బంధువులు అమెరికాలో ఓ ఆర్ఫనేజ్ లో బర్త్‌డే పార్టీ చేసుకున్నాడు కాబట్టి. అంతే తప్ప అనాథలపై ప్రేమతో కాదు. కథ అంశం బాగా అనిపిస్తుంది. కానీ కథను రచించిన తీరు బాగా అనిపించదు. అందుకే ఇది మామూలు కథలా మిగిలిపోతుంది.

*ఆఖరి సాక్షి*

గొల్లపూడి శ్రీనివాసరావు రచించిన ఈ కథ ఆగస్టు 15 ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయింది. ఇది ప్రయోగాత్మకంగా సమాజంలోని దిగజారుడు తనాన్ని, స్వార్థం పెరిగి విలువలు తరగటాన్ని సూచిస్తుంది. ఓ జానపద కథలా సాగుతుంది. ఓ చెట్టు దగ్గరకు వెళ్ళి ఎవరేది కోరుకుంటే అది అవుతుంది. అయితే వాళ్ళ కోరికలు తీరుతుంటాయి కానీ అందువల్ల సమాజానికి దెబ్బ తగులుతుంటుంది. ఇదెవరూ గమనించరు. కానీ కోరికలు తీరుతుండటంతో కోరికలు కోరేవారి క్యూ పెరిగిపోతూంటుంది. ఇంతలో ఆ చెట్టును ఎవరో కొట్టేస్తారు. వ్యంగ్యంగా, ప్రయోగాత్మకంగా ఉన్న మంచి కథ ఇది.

*చివరి క్షణం.*

ఆగస్టు 8, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ కథను రచించింది పసుపులేటి గీత. కథనంలో సంక్లిష్టతను, పదాల ఏర్పాటులో పాండితీ ప్రాభవాల ప్రదర్శన ద్వారా అర్థం అయీ కానట్టున్న అర్థంలేని పదాల ద్వారా అందీ అందని భావాలను సృష్టించాలని ప్రయత్నించే ఈ రచయిత్రి రాసిన కథలలో కాస్త అర్థమయ్యేట్టున్న కథ ఇది. కథకూడా పూర్తిగా బోధపడదు. అందరికీ అర్థం కావాలన్న ఆత్రంలో

ఆకాశంలో పవిత్రంగా ఉండే గంగానది లాంటి భాషను భువికి దింపి మురికి కాలువల్లో ప్రవహింపచేస్తూ ఏదో సాధించేశామని గర్విస్తున్న పరిస్థితుల్లో ఇలాంటి సంక్లిష్టమైన, భావాన్ని దుర్భేద్యమైన కోటలోని రహస్యపుటరల గోడలలోపల తొలిచి చేసిన మాగలిలో దాచినట్టున్న రచనల పరమార్థం కాస్త ఇబ్బంది కలిగిస్తుంది. కొన్నిమార్లు చదివిన తరువాత నాకర్థమైన కథ ఏమిటంటే, ఓ తల్లి ఉంటుంది. ఇంకొకడికి ఏదో రోగం వస్తుంది. డబ్బు తీసుకుని ఓ పసిపిల్లవాడిని గొంతు నులిమి చంపేస్తాడు. ఆ పిల్లవాడి తల్లి ఓ ఉత్తరం రాస్తుంది. ఆమె ఓ వ్యక్తిని చూపి ఇంకో వ్యక్తిని చంపమంటుంది. అతడు తనని తానే చంపుకుంటాడు. ఆమె ఉరేసుకుని చచ్చిపోతుంది. ఇది చదువుతుంటే జంధ్యాల సినిమాలో శ్రీ లక్ష్మి పాత్ర కథ రాస్తే ఇలానే ఉంటుందనిపిస్తుంది. ఎందుకంటే, ఆ కథలు విన్న సినిమాలోని పాత్రలెలా ప్రవర్తిస్తాయో ఈ కథను చదివిన నాలాంటి సామాన్య పాఠకుల పరిస్థితి అలాంటిదే అవుతుంది కాబట్టి. పాఠకుల కోసం కొన్ని వర్ణనలను ఉదహరిస్తాను. 'కడిగి బోర్లించిన సత్తుగిన్నెలా తెల్లవారింది!' 'ఆ రోజు రిమోట్ నాకేసి జాలిగా చూసింది. ఆ చూపుతో నా కళ్ళనుంచి ఎస్సెమ్మెస్‌ల అశ్వవులు కట్టలు తెంచుకున్నాయి. నా పెదాల మీద యాంకర్లు ఊరడింపవుతున్నారు.' 'ఫ్రిడ్జ్‌లో మౌంట్ తంబోరా పొగలు కక్కుతోంది. ఐస్‌ఫ్రూట్ ఎర్రగా వేగుతోంది. వాటర్ బాటిళ్ళు ఎడారుల్ని శ్వాసిస్తున్నాయి! అయితే ఇలాంటి అద్భుతమైన అర్థంకాని వర్ణనల నడుమ కథను వెతుక్కోవాలి. కానీ, తల్లి పిల్లవాడి గురించి రాసిన వర్ణనలు అర్థమై బాగా అనిపిస్తాయి. ఈ కథలో మగ ఎప్పుడు ఆడదయింది, ఆడ ఎప్పుడు మగ అయింది, ఎవరు ఎవరిని చంపారు, ఎందుకు చంపారు, అసలేమిటి ఇదంతా ఎవరైనా అర్థం చెబితే వివరిస్తే వారికో వీరతాడు వేయాలని ఉంది, ఈ లోగా ఈ కథ ఉరితాడు మడతల ముడతల భూలీభులయ్యాయి. ఉయ్యాల ఊపుల్లో వారు తమని తాము కోల్పోకుండా ఉంటే.

***<u>టెహిలీకి పెళ్ళి</u>***

మల్లిపురం జగదీష్ రాసిన ఈ కథ ఆగస్ట్ 15 వార్తలో ప్రచురితమయింది. చాలా హాయిగా, చక్కగా సాగుతుందీ కథ 'థింసా' తెగలో టెహిలి అనే అమ్మాయికి ధర్ను అనే మరో తెగ అబ్బాయికి పెళ్ళవుతుంటుంది. చక్కగా వారి సంప్రదాయాలు, పాటలు, పద్ధతులను వివరిస్తూ సాగుతుంది రచన. ఉద్విగ్నతను కల్పించటం కోసం, హింసావాదులు లొంగుబాట్లు, పోలీసులను రచయిత కథలో చొప్పించారు. చివరికి ధర్ను కనబడకపోవటం ద్వారా సస్పెన్స్ కలిగించేందుకు ఇది పనికొచ్చింది. చివరికి కథ సుఖాంతం అవుతుంది. చాలా హాయిగా సాగుతూ ఆహ్లాదాన్ని కలిగిస్తుందీ కథ. 'డప్పు మీద సిరతపడింది. తుడుము జత కలిసింది. కిన్నెర పాట, థింసా ఆటలో కొండలు హోరెత్తాయి. అడవి ఆనంద నాట్యం చేసింది' అంటూ కథ ముగుస్తుంది. మనసు ఆనంద నాట్యం చేస్తుంది.




## అక్టోబర్ 2010

**కథాసాగర మథనంలో విశ్లేషణకు** అక్టోబర్, నెలలో ఆంధ్రభూమి, స్వాతి, నవ్య వారపత్రికలు, స్వాతి, ఆంధ్రభూమి, విపుల, చిత్ర, పాలపిట్ట మాసపత్రికలు, ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 96 కథలను కౌముది పాఠకుల పరిచయానికి ఎంచుకున్నాను.

ప్రస్తుతం తెలుగు రాష్ట్రంలో సంకలనాల జోరు సాగుతోంది. ఎవరికి వారు తమ తమ రంగుటద్దాలు, దృష్టిదోషాలు, అభిప్రాయాల కనుగుణంగా, తమకు నచ్చినవారు, సన్నిహితులు, స్నేహితుల కథలతో, సంకలనాలు చేసేసి ఇవే ఆ ఏటి మంచి కథలు అంటున్నారు. పైగా 'మా డబ్బుతో మేం ఎంపిక చేశాం మా ఇష్టం వచ్చినట్టు. చదివితే చదవండి. పోతేపొండి. మీకేం నష్టం' అని వాదిస్తున్నారు.

నిజంగా, ఇది దురదృష్టకరమైన పద్ధతి. తాను డబ్బులు పెట్టి, తనకు నచ్చినవారి కథలు ఎంచుకుని సంకలనం చేస్తున్నానని 'అంతా నా ఇష్టం' అని అంటున్నవారు కూడా ముందు మాటలతో సాహిత్య సేవ గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు. నోరుంది, గుంపుంది కాబట్టి, తెలుగు సాహిత్యంలో రచయితలు తప్ప అందరూ శక్తిమంతులే అవటంతో, ఇలాంటి సంకుచిత సంకలనాలే అసలు కథకు ప్రతినిధులుగా చలామణీ అవుతున్నాయి. భావితరాలలో కథలపై పరిశోధనలు చేసేవారికి ప్రామాణికాలుగా నిలుస్తున్నాయి.

కథను ఇలా కులాల వారీగా, ప్రాంతాల వారీగా, ఇజాల వారీగా, ఎంచుకుని మెచ్చుకోవటం వల్ల ఇలాంటివి కాక అసలు కథలు రాసే రచయితలు మరుగున పడుతున్నారు. వారి కథలు పాఠకుల మెప్పు పొందినా, భావితరాల వారిని చేరలేని పరిస్థితి వస్తోంది. అందుకే, మన తెలుగు కథ అంతర్జాతీయ స్థాయికి ఏమాత్రం తీసిపోదని అంటున్నా, ఇతర భాషలలో జరిగే విస్తృత ప్రయోగాలు కానీ, వస్తు విస్తృతి కానీ, విభిన్న ప్రక్రియలు కానీ మన తెలుగు కథల్లో కనబడవు. తెలుగు సాహిత్యం కొన్ని రంగుటద్దాల అబద్ధాలకే పరిమితం అవుతోంది తప్ప మానవుడి మనస్సుకు ప్రతిబింబంగా ఎదగటం లేదు.

అందుకే ఉద్యమ కథలు, హింస, అణచివేతల కోతల కథలు, తప్పుడు ఆలోచనలు ప్రచారం చేసే కథలు, లేక పలుకుబడి ఉన్న వారు రచించే పనికి రాని కథలు కాక మంచి కథలు, అసలు కథలు రాసే టి.శ్రీవల్లి రాధిక, వారణాసి నాగలక్ష్మి, ఎనుగంటి వేణుగోపాల్, వసుంధర, ప్రఫుల చంద్ర, మంజరి, వాణిశ్రీ, కొఠారి వాణీ చలపతి, ఎస్. శ్రీదేవి, శశిశ్రీ, ఎం.బి.యస్ ప్రసాద్, పొత్తూరి విజయలక్ష్మి, కె.కె.భాగ్యశ్రీ, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు వంటి ఇంకా అనేకానేక మంచి కథకుల కథలు ఏ సంకలనాలలో కనిపించవు. ఇందుకు

కారణం వారు అసలైన కథలు రాయటమే! వారు జర్నలిస్టులో, అత్యున్నస్థాయి ఉద్యోగులో, శక్తివంతమైన స్నేహితులు లేని వారు కాకపోవటమే!

ఇలాంటి దుస్థితి ప్రపంచంలో మరే సాహిత్యంలోనూ కనబడదు. కథను కథగా చూసి, కథ ఉత్తమత్వానికి, ఔన్నత్యానికి, సాహిత్యానికి మాత్రమే పెద్దపీట వేసే రోజులు వస్తే కానీ తెలుగులో 'కథ' కథగా నిలవలేదు. అందుకే సంకలనాలలోని కథల అర్హతల గురించి ప్రశ్నించేకన్నా ముందు సంకలన కర్తలు, సంపాదకుల అర్హతలు, చిత్త శుద్ధిల గురించి ప్రశ్నించాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

<u>సద్దుల బండ</u>

బి.మురళీధర్ రచించిన ఈ కథ అక్టోబర్ 20, నవ్య సంచికలో ప్రచురితమయింది. కథాంశం మామూలే. ఆధునిక వ్యాపార నాగరికత వల్ల పచ్చని పొలాలు అపార్ట్ మెంట్‌లయిపోవటం, మానవ సంబంధాలు లుప్తమై పోవటం. కథను రచయిత హృదయానికి పట్టి కదిలించేరీతిలో అభివృద్ధిచేయలేదు. పాత్రలను అలవాటయిన పాత్రలుగా వర్ణించవచ్చు. కానీ ఈ కథలో ప్రత్యేకత ఏమిటంటే రచయిత నిజాయితీ ప్రతి అక్షరంలో కనిపిస్తుంది. రచయిత వేదన ప్రతిపదంలో తొణికిసలాడుతూంటుంది. సద్దుల బండను వ్యక్తుల మనస్సాక్షికి ప్రతీకగా చేసి, దాని చుట్టూ కథ అల్లడం బాగుంది. మార్పులకు లొంగకుండా సద్దుల బండ అలాగే ఉండటం, ఏది ఎంత మారినా మానవసంబంధాల స్వరూపంలో మౌలిక మార్పురాదని అతి సున్నితంగా చెప్పినట్టయింది. ముఖ్యంగా 'తరతరాలుగా వస్తోన్న ఒక గొప్ప వారసత్వపు సంస్కృతీ వైభవం గుర్తుగా' ఆ సుద్దుల బండ అలాగే నిలిచి ఉందన్న ముగింపు వాక్యాలు రచయిత అంతరం విప్పి చెపుతాయి. ఇది శైలి, శిల్పం, కథనం వంటి కొలతల తూగుకు నిలవకపోయినా మనస్సును తట్టే కథ.

<u>మనసున మనసై</u>

రాపాక సన్ని విజయ కృష్ణ రచించిన ఈ కథ అక్టోబర్ 24 భూమి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఇదీ మామూలు కథనే. కానీ మన అందరికీ తెలిసిన అంశాన్ని రచయిత చక్కగా ప్రదర్శించాడీ కథలో. ఆవేశాలు, ఆరోపణలు లేకుండా సున్నితంగా నిజాన్ని ప్రకటించాడు. అలకనంద, సిద్దార్ధ భార్యాభర్తలు. అన్యోన్య దాంపత్యం వారిది. కానీ వాది మధ్య అలకనంద ఉద్యోగం కలతకు కారణమౌతుంది. భార్య ఉద్యోగం చేయటం సిద్దార్ధకు ఇష్టం ఉండదు. ఆఫీసులో ఓ కొలీగు చనిపోయిన తరువాత, ఉద్యోగం లేని అతడి భార్య పడే బాధలు చూసిన సిద్దార్ధ మనస్సు మారుతుంది. ఇదీ కథ. చక్కగా, హాయిగా సాగుతుంది కథ. ఎలాంటి ఏడ్పులు, అణచివేతల ఆర్భాటాలు లేకుండా చక్కని సత్యాన్ని సులువుగా ప్రదర్శిస్తుంది.

<u>తూరుపు పొద్దు</u>

సి.యస్.రాంబాబు రచించిన ఈ కథ అక్టోబర్ 27, నవ్య వారపత్రికలో ప్రచురితమయింది. చక్కని కథ ఇది. బస్సులో ప్రయాణిస్తున్న కథకుడు ఇద్దరి నడుమ వాగ్వివాదం చూస్తాడు. కొన్నాళ్ళ తర్వాత వారిలో ఒక వ్యక్తే కనిపిస్తే మాటలు కలుపుతాడు. విషయం తెలుసుకుంటాడు. ఇద్దరు స్నేహితులు వారిలో ఒకరికి ఇంగ్లీషు పిచ్చి. ఆ పిచ్చి ఎలా అతడి జీవితాన్ని అసంతృప్తి వైపు నెట్టి నిరాశలోకి దించిందో అత్యత హృద్యంగా ప్రదర్శిస్తుందీ కథ. చదివిన చాలాసేపటి వరకూ గుర్తుంటుంది.

*రాయల ఔదార్యం:*

జి.శ్రీ దుర్గ రచించిన ఈ కథ అక్టోబరు నెల ఆంధ్రభూమి మాసపత్రికలో ప్రచురితమయింది. నిజానికి రచయిత ఈ కథలో రాయలు, అప్పాజీ కళ్ళు పీకించటం ఒక పుకారు అని నిరూపించాలనుకున్నారు. ఇది భారతీయ చరిత్రకారులంతా నమ్మే విషయం. రాయల వ్యక్తిత్వంపై బురద చల్లేందుకు విదేశీ చరిత్రకారులు చేసిన కుట్ర, కల్పించిన కథ ఇది అన్నది మన విశ్వాసం. అయితే, ఆ నిజాన్ని ప్రదర్శించేందుకు రచయిత రచించిన కథ, కథగా కన్న ఒక చర్చగా, వ్యాసంగా ఎదిగింది. దాంతో కథ బలహీనమయింది. ఇందుకు భిన్నంగా ఇదే నిజాన్ని కథగా చెప్పాలని రచయిత ప్రయత్నించి ఉంటే కథ 'ఇంపాక్ట్' గొప్పగా ఉండేది. అప్పాజీ, పెద్దన దగ్గరకు వచ్చి నిజానిజాలు వివరిస్తాడీ కథలో. దాంతో కథ సంభాషణగా, మిగిలి పోయింది. నిజాన్ని చెప్పటం ఒక ఎత్తు, నిజాన్ని ఆకర్షణీయమైన కథగా మలచి చెప్పటం మరో ఎత్తు.

*కాక్ టెయిల్:*

సతీష్ చందర్ రచించిన ఈ కథ అక్టోబర్ 10, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఈ కథలో రచయిత చావును కూడా ఆనందంగా సెలబ్రేట్ చేసుకోవటాన్ని ప్రదర్శించాలని ప్రయత్నించారు. చావు ప్రాకృతికమనీ, చావు వల్ల జీవితాలు ముందుకు సాగాలి తప్ప అది శోకించి ఆగిపోవాల్సిన సమయం కాదనీ ప్రదర్శించారు. జాకబ్ రాజు అమ్మమ్మ చనిపోతే వెళతాడు శర్మ. కానీ ఇంట్లో చావు కళ ఉండదు. అంతా పెళ్ళి కళ కనిపిస్తుంది. అందరూ జోకులు వేసుకుంటుంటారు. నవ్వుతూ తుళ్ళుతుంటారు. అక్కడే శర్మ పెళ్ళి చూపులయిపోతాయి కూడా. మనుషుల నడుమ అనురాగం ఆప్యాయతలు, శోకించటంలో కాదు, మనిషి పోయినా, నవ్వుతూ ముందుకు సాగిపోవటంలో కనబడుతుందన్న భావన కలుగుతుంది ఈ కథ చదువుతూంటే. ఎక్కడా విసుగు కలగకుండా వేగంగా చదివిస్తుంది. అయితే, ప్రతి దానికీ ఓ సమయం, సందర్భాలుంటాయి. వాటిని భంగం చేయటమే జీవించటం అనుకుంటే 'ఎవరి ఇష్టం వారిది' అనుకోవటం తప్ప మరొకటి చేయలేము.

*ఈగ*

కె.ఎ.ముని సురేష్ పెళ్ళై రచించిన ఈ కథ అక్టోబర్‌కు సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ప్రతీకాత్మకమైన కథలు రచించటం కత్తిమీద సాములాంటిది. ఎందుకంటే ప్రతీకాత్మకంగా ప్రదర్శించదలచుకున్న విషయం పాఠకుడికి స్ఫురించాలి. నప్పాలి. అలాగని 'ఇది అదే' అని ఎవరూ అనే వీలుండకూడదు. శ్లేష్మంలో చిక్కిన ఈగ తప్పించుకోలేక మరణిస్తుంది. ఇది ఈ కథకు ప్రాతిపదిక. ఓ నీగ్రో, తన యజమానికి గొడ్డు చాకిరీ చేస్తుంటాడు. యజమాని మరణించిన తరువాత అధికారం వచ్చి కొడుకు చెడ్డవాడు. ఈ నీగ్రో ప్రతిభను ప్రదర్శించడు. ఒప్పుకోడు.. అణచివేస్తుంటాడు. అలాంటప్పుడు ఓ నీగ్రో యజమానిని చంపేస్తాడు. పారిపోదాం రమ్మంటే మన నీగ్రో పోడు. దాంతో నీకు స్వేచ్ఛనిస్తున్నానని పారిపోయే నీగ్రో కథానాయకుడిని పొడిచి పారిపోతాడు. ఇదీ కథ. ఈ కథ చదువుతూంటే, రచయిత నీగ్రోల కథ రాయటంలో ఉద్దేశ్యం, అణచివేతలు ప్రదర్శించటం కన్నా ప్రత్యర్థి పత్రికపై బాణం ఎక్కు పెట్టటమే అనిపిస్తుంది. చివర్లో 'ఈనాడులో పనిచేస్తూ మరణించిన పాత్రికేయుడికి అంకితం' అనటంతో కథ దేనికి ప్రతీకనో అర్థమౌతుంది. ఇక్కడ 'ఈనాడు' జర్నలిస్టులు శ్లేష్మంలో చిక్కిన ఈగలని యజమాని వీరిని నీగ్రోల్లా, బానిసలుగా చూస్తున్నాడని, తప్పించుకున్న వారు స్వేచ్ఛపొందిన వారు, ఇంకా అక్కడే ఉన్న 'మరికొందరు మిత్రులు' శ్లేష్మంలో చిక్కిన ఈగలనీ అర్థం. ఇది మన పత్రికల యుద్ధాన్ని ప్రతీకాత్మకంగా ప్రదర్శిస్తుంది. ఇలాంటి కథల వల్ల కొందరి 'కసి' తీరుతుందేమో కానీ కథాసాహిత్యానికి ఎలాంటి లాభం ఉండదు. కనీసం నీగ్రోలపై జాలి కూడా కలగదు.

*శిఖర్గాగాన*

తాటికొండ కె.శివకుమార్ శర్మ రచించిన ఈ కథ అక్టోబర్ 31, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఇదీ ప్రతీకాత్మకమైన కథనే. అయితే, ఈ కథలో ప్రతీక అంత స్పష్టంగా బోధపడదు. ఓ పిట్టకు తల్లి పిట్ట భయాన్ని దూరంగా ఉంచటం గురించి చెప్పిన కథ ఇది. భయాన్ని దూరంగా ఉంచాలంటే తోటివాళ్ళతో సఖ్యంగా ఉండి, చేతనయినంత సహాయం చెయ్యకపోతే ఓ చెట్టులా అయిపోతావని ఆ చెట్టుకథ చెపుతుంది తల్లి. ఆ చెట్టుకథే ఈ కథ. ఓ చెట్టు పుడుతుంది. పుడుతూనే అనాథ అవుతుంది. తల్లుల అండ ఉన్న ఇతర చెట్లను చూస్తే దానికి అసూయ. దాంతో తనని తాను కాపాడుకోవాలని ఆ చెట్టు తన వేళ్ళను భూమి లోపలకు గట్టిగా జొనిపిస్తుంది. తన వ్రేళ్ళు లోపలకు బలంగా తోయడం కోసం ఇతర చెట్ల వ్రేళ్ళను పైకి తోస్తూ తాను లోపలకు దూసుకుపోతుంది. అలా, తనకెవరూ లేక పోవటంతో, తనని తాను రక్షించుకునేందుకు ఆ చెట్టు బలంగా ఒంటరిగా ఎదుగుతుంది. దాని నీడలో దాని పిల్లలే ఎదగలేకపోతాయి. ఇప్పుడా చెట్టు ఎంతగా ఎదుగుతుందంటే కాండం తప్ప ఆకులు కనబడవు. ఒంటరిగా మిగులుతుంది. ఆ చెట్టు గురించి విని దాన్ని వెతుకుతూ బయలుదేరుతుంది పిట్ట. ఆ చెట్టును చేరటంలో దాని భయం పోతుంది. అది మారిపోతుంది. దాంతో చెట్టు, పిట్ట జతకడతాయి. కథ చదువుతూంటే బాగానే అనిపిస్తుంది. కానీ ఈ చెట్టు, పిట్టలు ప్రతీకలు దేనికో స్పష్టం కాదు. విజేత ఎప్పుడూ ఒంటరే. ఎంతో కొంత స్వార్థం లేని వాడు ఏమీ సాధించలేడు. కథ ఆరంభంలో దాన్ని దోషమున్నట్టు చూపి, చివర్లో అది మంచి లక్షణం అన్న అర్థం వచ్చేట్టు చేసి కథను అయోమయం పాలు చేశారు రచయిత. కనీసం నాలాంటి సామాన్యులకు సరిగ్గా బోధపడదీ కథ.

*నూకమ్మ జ్ఞానం*

మల్లీశ్వరి రచించిన ఈ కథ అక్టోబర్ 3 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఈ కథకూడా ప్రతీకాత్మకమే. ఈ కథ కూడా అయోమయం మిగిల్చేదే. ఓ కప్ప ప్రపంచ జ్ఞానం తెలుసుకోవాలని, అది ఇతర నూకమ్మల నడిగి తెలుసుకోవాలని బయలుదేరుతుంది. అది తెలుసుకున్న జ్ఞానం గురించి తెలుసుకోవాలని వచ్చిన ఇతరులు జ్ఞానముంటే సామాజికం, రాజకీయం, వినయం, విప్లవం, మంచితనం, పనితనం అంటుంటారు గానీ అసలు జ్ఞానం అంటే ఏమిటో చెప్పరు. చివరికి నూకమ్మ అసలు జ్ఞానం అంటే 'నాను నూకమ్మని ఎలగయ్యానో తెలుసుకోవడం గేనం.. నూకమ్మలంతా ఒకటి కాదని తెలుసుకోవడమూ గేనవే...' అంటుంది. చివరికి 'ఎవల గేనం ఆల్లకే గొప్ప' అని తేల్చి చెపుతుంది. కథంతా అయిన తరువాత రచయిత్రి ఏదో చెప్పాలని తపన పడుతోంది. చెప్పింది. కానీ సరిగ్గా చెప్పలేకపోయిందనిపిస్తుంది. స్పష్టంగా అర్థమయ్యే విషయం ఏమిటంటే, నెమ్మదిగా, విప్లవం ఒక పరాజయం పొందిన భావన అన్న నిర్ణయానికి వచ్చునని, 'గేన, విప్లవం రెండూ రచయితలు చెమ్మ పదార్థాలే' అనిపించటం ఈ ఆలోచనకు బలమిస్తుంది. కానీ అది ఒప్పుకునేందుకూ సిద్ధంగా లేరనీ ఈ కథ నిరూపిస్తుంది. చివర్లో 'ఎవరి గురించి వారు తెలుసుకోవటం' అని నిర్ధారించటం. భారతీయ తత్వానికి దగ్గరగా ఉంటుంది. కానీ అది ఒప్పుకుంటే సమస్యలే ఉండవు కదా!

*చివరి మనిషి*

వాడ్రేవు చిన వీరభద్రుడు రచించిన ఈ కథ అక్టోబర్ 17. సాక్షి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. కథ, వ్యాసం, ఉపన్యాసం నిర్దిష్ట లక్షణాలున్న వేర్వేరు ప్రక్రియలు. ఒక ప్రక్రియను మరో ప్రక్రియలా ఒప్పించటం విశ్వనాథలాంటి మహామహుడికో, దస్తయేవ్ స్కీం లాంటి ప్రతిభావంతుడికో అయాక ర్యాండ్ లాంటి భావనాశీలికో మాత్రమే సాధ్యం. పేజీల కొద్దీ వ్యాసాలు సృజనాత్మక ప్రక్రియలో ఇమిడ్చి కాల్పనిక రచనలా మెప్పుపొందగలిగారు వీరు. 'చివరిమనిషి' అటు కథగా ఎదగలేక, ఇటు వ్యాసంలా కాక, కనీసం

ఉపన్యాసమూ అనుకోలేక మిగిలిపోయింది. దీన్ని కథగా ఒప్పుకోవటం కష్టం. కానీ 'కథ, ఫిక్షన్' కేటగిరీలో ప్రచురించటంతో కథాసాగర మథనంలో ప్రస్తావించాల్సి వచ్చింది. కథ ఆరంభం గొప్పగా ఉంటుంది. కోకిలకు దండం పెడతాడు. అంతరిస్తున్న భాషల ప్రస్తావన వస్తుంది. దాంతో రచయిత మరణం లేని మానవ సంబంధాల ఔన్నత్యాన్ని, ఒక భాషాతీతమైన భావంతో స్ఫురింప చేయాలని ప్రయత్నిస్తున్నారన్న ఆలోచన కలుగుతుంది. కానీ, అండమాన్‌లో అంతరిస్తున్న భాష గురించి ఓ ఉపన్యాసం, సంస్కృతం గురించి ఓ వ్యాసం, ఇలా అనేక సంబంధం ఉండీలేని విషయాల గురించి చెపుతూ సామాన్య విజ్ఞాన బోధన రచనగా మారిపోతుంది కథ. కథలో అక్కడక్కడా కొన్ని అంశాలు ఆలోచనను కలిగించినా, రచయిత అంశాన్ని కథగా కన్నా వ్యాసంగా, సిద్ధాంతాన్ని ప్రతిపాదించి దాన్ని సమర్థిస్తూ రాసి ఉంటే బాగుండేదనిపిస్తుంది. కథ విషయంలో నాలాంటి వారి అజ్ఞానం బయట పెట్టాల్సి వచ్చే అవసరమూ వచ్చేది కాదు.

*ద్రోహం, కాశీపుల్ల నర్సింగపురం పిలగాని డైరీ*

దేవులపల్లి కృష్ణమూర్తి రచించిన ద్రోహం కథ, వార్త 24 అక్టోబర్ ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. అక్టోబర్ 10, సాక్షిలో పూడూరి రాజిరెడ్డి కథ 'కాశిపుల్ల నర్సింగపురం పిలగాని డైరీ' ప్రచురితమయింది. ఈ రెండు కథలనూ కథలుగా ఆమోదించటం కాస్త కష్టం. 'కథ' అన్నది ఒక నిర్దిష్టమై అర్థం ఉన్న పదం. ఒక ప్రక్రియగా దానికి కొన్ని లక్షణాలున్నాయి. ప్రామాణికాలున్నాయి. జరిగింది జరిగినట్టుగా చెప్పటం కథకాదు. దాన్లో కాస్త కల్పన, కాస్త ఊహ, జోడించక పోతే కథను సృజనాత్మక ప్రక్రియగా భావించటం కుదరదు. కానీ కథలో ప్రయోగాల పేరిట ఇటీవలె ఉన్నది ఉన్నట్టు కల్పనలు, ఊహలు లేకుండా వ్యక్తీకరించటాన్ని కూడా కథ అని కొందరు ప్రకటించి, అలాంటి రచనలు చేసి వాటిని 'కథ'గా ఆమోదించమంటున్నారు. ఉన్నది ఉన్నట్టు రాస్తే అది వ్యాసం అవుతుంది. వార్త అవుతుంది. కాల్పనికేతర రచన అవుతుంది. కథ కాదు. నేను రైల్లో ప్రయాణం చేస్తున్నాను. ప్రయాణంలో కొన్ని అనుభవాలు కలిగాయి. వాటిని నేను ఉన్నదున్నట్టు రచిస్తే అది 'ట్రావెలాగ్' అవుతుంది. కథకాదు. అదే, ఆ రచనలో నా భావాలతో, నేను నా తోటి ప్రయాణీకుల అనుభవాలను, కాస్త కల్పన, ఊహ జోడించి, రసవత్తరంగా, కాస్త ఉత్కంఠ కలిపిస్తూ రచిస్తే అది కాల్పనిక రచనగా ఆమోదం పొందే వీలుంది. అలా కానిది, ఎంత అందంగా రాసినా, ఎన్ని వర్ణనలు చేసినా అది కాల్పనికేతర రచనగా పరిగణనకు వస్తుంది. రచనల పొలిమేరల్లో తచ్చాడుతూ కథ నిర్వచనాన్ని సాగదీసి సంకటంలో పడేస్తాయి.

దేవులపల్లి కృష్ణమూర్తి రచన 'ద్రోహం' రచయిత జీవితంలోని కొన్ని సంఘటనల సంకలనం తప్ప 'కథ' కాదు అని స్పష్టంగా తెలుస్తూంటుంది. దాంతో ఒక ఆరంభం, ముగింపులు లేక కొన్ని సంఘటనలను యధాతథంగా చెప్పే ఈ రచనను 'జీవిత చరిత్ర' రచనగా పరిగణించవచ్చు తప్ప కథగా భావించటం కష్టం. చివర్లో తెలంగాణ ఉద్యమం ప్రసక్తి వస్తుంది. కథ అయిపోతుంది. ఆ ప్రసక్తి కూడా జరిగింది చెప్పినట్టుంది తప్ప వర్ణనలు, కల్పనలు జోడించినట్టు లేదు. కాబట్టి ఈ రచనను 'జ్ఞాపకాలు'గా భావించవచ్చు. ఈ రచనలో కమ్యూనిస్టులు తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించలేదు, వారు సిద్ధాంతం వదిలి మోసాలు బాగా చేశారని రచయిత చెప్పారు. బహుశా దాని ఆధారంగా ఈ రచన పేరు 'ద్రోహం' అని పెట్టినట్టున్నారు రచయిత.

పూడూరి రాజి రెడ్డి కథ 'కాశిపుల్ల' కూడా కల్పన, నిజాల పొలిమేరల్లో తిరుగుతుంది. బాల్యంలో తన అనుభవాలను ఓ పిల్లవాడు డైరీలో రాస్తాడు. దాన్లో బతుకమ్మ పండుగ వర్ణన ఉంటుంది. వాళ్ళు ఆడే 'కాశీపుల్ల' ఆట గురించి ఉంటుంది. ఆ పిల్లవాడు రాసిన తొలి నవల ప్రసక్తి ఉంటుంది. అక్కడ కూడా చక్కని ఆలోచనలు చమక్కుమంటాయి. మంచి వాక్యాలు తళుక్కుమంటాయి. రచన అయిపోతుంది. ఇది 'కథ'కాదు అనిపిస్తుంది. రచయితకూ ఈ ఆలోచన వచ్చిందని' ఆఖరికి మా ఆవిడ కూడా, పాత్రలు

సృష్టించి రాయాలి. అలా రాయగలగడమే గొప్ప అంటుంది, తప్ప, నేను, నా గోడు అంటే తనకు నచ్చదు. మనకు తెలియని జీవితం గురించి రాయలేము. అది కృతకంగా ఉంటుంది. అని కన్విన్స్ చేసే ఓపిక నాకు లేదు' అనటం నిరూపిస్తుంది. అయితే, 'నా గోడు నేను రాసుకుంటా' అనేకన్నా 'నా గోడును కూడా పాఠకుడి గోడుగా చేస్తా'ననటంలోనే రచయిత ప్రతిభ తెలిసేది.

అయితే, రచయితలు, ఇతర జీవులకు భిన్నం. ఎందుకంటే, మామూలుగా అందరూ చూసే విషయాల్లోనే వారు చూడలేనివి చూసి చెప్పగలుగుతాడు రచయిత. 'తనకు పరిచయమున్నదే రాస్తాం, లేనిది రాయలేము' అనటం అంతగా ఆమోదయోగ్యంకాదు. తనకు పరిచయం లేనిది ఊహించి, అనుభవించినట్టుగా రచించి భ్రమింప చేయటమే కథ రచన ప్రక్రియలో రచయిత ప్రతిభా పాటవాలను ప్రస్ఫుటం చేసే అంశం. జూల్స్‌వెర్న్ నిజంగా భూమి కేంద్రానికి వెళ్ళి చూస్తేగానీ రచన చేయలేనంటే 'జర్నీ టుది సెంటర్ ఆఫ్ ఎర్త్' అన్న రచన లేదు. చంద్రమండలానికి వెళ్ళందే రచన చేయలేనంటే '2001 - స్పేస్ ఒడిస్సీ'కి కారణమయిన 'సెంటినెల్' కథ లేదు. సినిమా లేదు. యుద్ధంలో చావందే కత్తిగాటుకు చావటాన్ని వర్ణించలేనని రచయిత అంటే యుద్ధం చావుల కథలే లేవు. 'వార్ అండ్ పీస్' ఉండదు. అనుభవించిన దానికి కల్పన జోడించి, ఇలా ఉంటే బాగుంటుందని ఆశాభావం జోడించి, తన ఆశలు, నిరాశలు, ఆవేదనలు, భావాలను కలగలిపి, స్వజనాత్మకంగా రచించక పోతే ఏ రచన కూడా ఉండదు. కానీ 'అనుభవించిందే రాస్తాం' అంటే దాన్ని కథగా ఇప్పించాలని ఎంత ప్రయత్నించినా అవి కథలు కావు. అవి జ్ఞాపకాలు (మెమరీస్). లేక ఆటోబయోగ్రఫీ (స్వీయ జీవిత చరిత్ర) ఇంకా అలాంటి రచనలు అవుతాయి. రచయితలిది గమనించాలి. విప్లవం లేవదీసినా మామూలుకు భిన్నంగా ఉండాలనుకున్నా అది సృజనాత్మకం, నిర్మాణాత్మకం కావాలి. 'నేను అతనవటం తేలిక. ఇతనవడం కష్టం అన్నట్టే 'అది ఇది అవటం తేలిక. ఇది కథ అవటం కష్టం'.

✷✷✷